
రామాయణం

# రామచరిత మానస్-తులసీ రామాయణం



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంథాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తిరుమల తిరుపతి దేవస్థానం వారి వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

# TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)

## http://ebooks.tirumala.org



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# రామచరిత మానస్

[తులసీ రామాయణం]



అనువాదం :

ముంగర శంకరరాజు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# రామచరిత మానస్

## (తులసీ రామాయణం)

అనువాదం

**ముంగర శంకరరాజు**

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

**2003**

# RAMACHARITA MANAS
Prose rendering in Telugu

By
**Mungara Sankara Raju**

T.T.D. Religious Publications Series No. : 569
© All Rights Reserved

T.T.D. First Edition : 1999
T.T.D. Reprint – 2003

Copies : 2,000

Artist : P. Narayanagiri Dattu

Price Rs.40/-

Published by
**Ajaykallam,** IAS
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati – 517 507.

Printed at
Padma Enterprises, Chennai
on behalf of T.T.D.

# ముందుమాట

వాల్మీకి రామాయణం ఆదికావ్యం. అవతరించిననాటినుండి నిత్యం భారతజాతిని ఉత్తేజితుల్ని కావిస్తూవున్న ఉత్తమరచన. రామకథ ఇంచు మించు ప్రపంచభాష లన్నింటిలోనూ అనువదింపబడింది. అందువల్ల, అది నైతిక, ఆధ్యాత్మిక జీవనపథాంలో పయనించే సమస్త మానవాళికి సముచితస్ఫూర్తిని ప్రసాదించే 'విశ్వకావ్యం'గా అలరారుతున్నది.

మనదేశంలోని వివిధ ప్రాంతీయభాషలలో వెలసిన రామాయణాల్లో అగ్రగణ్యమైనది గోస్వామి తులసీదాసు(1543-1623) రచించిన "రామ చరితమానస్". వేరువేరు రామాయణాలను చక్కగా పరిశీలించి, ఆ మహాకవి కమనీయ కవితాసౌందర్యం ఉట్టిపడేలాగున, భక్తిరసభరితంగా ఈ కావ్యాన్ని సృజించాడు. ఉత్తర భారతదేశంలో ఈగ్రంథానికి ఉన్నంత ప్రశస్తి, ప్రాచుర్యం మరే గ్రంథానికీ లేదనటం అతిశయోక్తి కాదు.

విదేశీ దండయాత్రలతోనూ, కాపాలిక తాంత్రికాదుల విచిత్ర చర్యలతోనూ భయవిహ్వలమై, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతూవుండిన ఆనాటి భారతీయ సమాజానికి కొంగ్రొత్త శక్తిని, భక్తిని, వినూత్న చైతన్యాన్ని ప్రసాదించిన ప్రవిమల కావ్యం శ్రీరామచరితమానసం!

శ్రీరామచంద్రుని చరిత్ర నిర్మలమైన మానససరోవరంవంటిదనే అపూర్వభావాన్ని తులసీదాసు ఈకావ్యనామధేయంద్వారా లోకానికి వెల్లడించాడు. తదనుగుణంగానే ఇందలి ఏడుకాండలు - ఒక్కొక్కటి ఒక్కొక్క సోపానంగా పరిగణింపబడినాయి. అవతారమూర్తులైన సీతా రాముల దివ్యచర్యలను మానవాళియొక్క మానస సరస్సుల్లో ప్రతిఫలింపజేసి, మలిన భావాలను పారద్రోలి, వారిలో భక్తి విశ్వాసాలను, ధైర్య స్థైర్యాలను నెలకొల్పే ఆదర్శకావ్యంగా 'తులసీరామాయణం' లోకంలో చరితార్థమయింది!

జాతిపిత గాంధీమహాత్ముడు తనజీవితచరిత్రలో ఆ గ్రంథాన్నిగూర్చి ఇలా కొనియాడినాడు--

".... To day, I regard the *Ramayana* of Tulasi Das as the greatest book of all devotional literature"

ఇలాంటి ప్రశస్తరచనను సులభశైలి వచనంలో సరళంగా అనువదించిన ప్రముఖపండితులు శ్రీముంగర శంకరరాజుగారు మిగుల అభినందనీయులు. వీరి అనువాదంలో మూలంలోని కవితా చమత్కృతి, భక్తి సాంద్రత ప్రకృష్టంగా పొందుపరుపబడివున్నాయి.

ఈ గ్రంథాన్ని తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణగా పాఠకులకు 1999 వ సంవత్సరం ప్రథమ ముద్రణంగా ప్రచురించాము. పాఠకుల ఆదరాభిమానాలను దృష్టిలో ఉంచుకుని ఈ గ్రంథాన్ని ఇప్పుడు తిరిగి ముద్రిస్తున్నాం.

కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

# కృతజ్ఞతలు

పరమ భాగవతోత్తముడు మహాకవి అయిన గోస్వామి తులసీదాస్ 400 ఏండ్లక్రితం రచించిన 'రామచరిత మానస్'(రామాయణం)హిందీ సాహిత్య రంగంలో నాటికీ - నేటికీ సాటిలేని మహాకావ్యంగా రాజిల్లుతున్నది.

ప్రాచీనతకు, పవిత్రతకు, ప్రాభవతకు ప్రతీకగా నిలిచిన ఈ కావ్యానికి సమగ్రమైన తెలుగు వచనానువాదం చేయాలన్న తలంపు నాకు **1960** సంవత్సరంలో కలిగింది.

వెంటనే నే నీ మహాకావ్యాన్ని తెనిగించుటకు పూనుకొనుట - పూర్తి చేయుట - ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ఒక సంవత్సరకాలం క్రమంగా ప్రచురింపబడుట - హిందీలో 'సాకేత'రామాయణకృతికర్త స్వర్గీయ మైథిలీ శరణ్ గుప్తగారు నన్నభినందించుట - అనువాదం పుస్తకరూపంలో వెలువడుట - మహాకవి సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు 'పీఠికా'ముఖంగా నన్నాశీర్వదించుట - అన్నీ అత్యల్పకాలంలో అప్రయత్నంగా జరిగిపోయినవి. నా యీ కృషి ఇంత నిర్విఘ్నంగా సంపన్నంకావడానికి దైవబలమే తోడ్పడిందని విశ్వసిస్తున్నాను.

ఈ 'రామచరితమానస్' కావ్య పునర్ముద్రణ నిమిత్తం తిరిగీ ఒక పుస్తక వ్యాపార సంస్థను ఆశ్రయించుటకు నా మనస్సు అంగీకరించలేదు. ఏదైనా ఒక ధార్మిక సంస్థ ఈ పుస్తక ముద్రణకు పూనుకుంటే యెంత బాగుండును! అని అనుకుంటూ ఉంటిని. ఇంతలో-

తిరుమల తిరుపతి దేవస్థానంవారు భాగవతం, రామాయణం, భగవద్గీత మున్నగు ప్రసిద్ధ మత గ్రంథాలు వేల సంఖ్యలో ముద్రించి తక్కువ వెలకు భక్తులకు అందించడానికి సంకల్పించినారు.

తమ ఉద్దేశ్యానికి అనుగుణంగా తిరుపతి దేవస్థానంవారు ఈ రామచరిత మానస్ గ్రంథాన్ని పునర్ముద్రించి భక్తులకు అందజేస్తున్నారు. శ్లాఘనీయమైన ఇంతటి సత్కార్యం చేస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యానికి నేను హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

చిత్తూరు　　　　　　　　　　　　　　　　ఇట్లు

**25-7-80.**　　　　　　　　　　　　　　*ముంగర శంకరరాజు*

# పీఠిక

''ఆత్మారామ దుబే'' అతని తండ్రి. తల్లి హులసీదేవి. ఆ శిశువు పేరు తులసీదాసు. ''దాసు'' శబ్దము తరువాత వచ్చినది. తులసియని మగవానికి పేరు పెట్టుట చిత్రమే. ఆ శిశువు పుట్టుమనే రామనామస్మరణతో పుట్టెనట. అందుచే ''రాంబోలా'' యని పిలిచినారు. పుట్టినప్పుడే యాతని కైదేండ్ల వయసు. పైగా నోటిలో - మల్లెమొగ్గలవంటి పండ్లు; అభుక్త మూలమున జన్మము. ఆ విడ్డూరపు శిశువు - నేలపైఁ బడినదే - యొకసారి - యేడ్వఁగూడదా! ఆ పని చేయలేదు. అమ్మలక్కల కింకేమి గావలెను; కొందరు 'వీడు' దయ్యపు పిల్లవాఁడనిరి. ఆ బిడ్డను గన్నందుకు - హులసీ దేవికి - చీవాట్లు తప్పలేదు. ఆత్మారాముఁడు కొంత జ్యోతిష్కుడు. అతని యా జ్ఞానము - పిల్లవానిపై నుపేక్షను గల్గించుటకే పనికివచ్చినది. పాపము! తల్లి యా శిశువును - ''మునియా'' యను నొక దాసికిచ్చెను. అపుడా తల్లి హృదయమెట్లుండెనో! తల్లియే చెప్పవలెను. ''మునియా'' యా శిశువును పుట్టినింటికిఁ గొనిపోయినది. కొంతకాలమున కామెయుఁ జచ్చెను. తమ పుత్రుఁడు నిరాశ్రయుఁడని తండ్రికిఁ దెలిసినది. వాడు - చెవిలో వేసికొనలేదు. అప్పటి కాతడు విధురుఁడు. తల్లి బ్రతికియున్నపుడే తండ్రి పలుకరింపలేదు. ఆమెయుఁ బోయినది. ఇఁక నాతఁడీ యూసెత్తిన - ఆతఁడు మగవాడేగాడు.

తులసీదాసు వీధిని బడినాడు. దినమునకొక యిల్లు. దినమునకొక యూరు. కొన్ని దినములకు ''బాబా నరహరి దాస''ను గురువు చిక్కినాడు. అతఁడు శిశువును తనవెంట నిడుకొని త్రిప్పెను. 'తులసీదాసు' 'నరహరి దాసు'ను కృపాళుడవని పొగడినాడు. నరరూపముతోనున్న హరివనియు - నుతించెను. అతడు తులసీదాసుపై జూపించిన ప్రేమ యట్టిది! నరహరి పాటించిన నైతిక ప్రవర్తన యట్టిది! వారు కాశీనగరమును జేరిరి. 'పంచగంగా' ఘట్టమున నివాసము. లోకప్రసిద్ధుఁడైన రామానందయోగి యచ్చటనే నివసించుచుండెను. నాడు 'వారణాసి'లో 'శేషసనాతనులు' గొప్ప విద్వాంసులు. అతనికడ తులసీదాసు విద్యలు నేర్చెను.

వ్యాసి సాహిత్యము, కొంత వ్యాకరణము - అతని కధీనములైనవి. నరహరికడ సెలవుగైకొని తులసీదాసు తన గ్రామమునకు మరలి వచ్చినాడు. గ్రామమున నేమున్నది! గ్రామమున్నది; తల్లిదండ్రులు లేరు. 'నా' యనువారు లేరు; ఇల్లువాకిలి గుఱుతులుగూడ లేవు. ఇంతలో ''దీనబంధు''యను నొక బ్రాహ్మణుడు యమునాస్నానమును గావించి - మార్గమధ్యమున రాజపురమునకు వచ్చినాడు. అతఁడు తులసీదాసును జూచెను. అతని కొక బిడ్డ యుండినది. ఆమె పేరు రత్నావళి. రత్నావళి తులసీదాసు భార్య యయ్యెను. వారిర్వుర కొక్క కొడుకు బుట్టెను. వాడు బాల్యముననే మరణించినాడు; కామపిపాసలో - తులసీదాసునకు రాత్రిందివములు దెలియుట లేదు. క్షణకాల వియోగమును సహింపలేడు. ఒకసారి రత్నావళి పుట్టినింటి కేగినది. ఇతడామెను వెన్నంటెను. అభిమానశాలియైన రత్నావళి కీ ప్రవర్తన యేమో వెగటైనది. ఆమె యిట్లు చీదరించికొన్నది.

*''లాజ్ న లాగత ఆప్‌కో, దౌరే ఆయేహు సాథ్*
*ధిక్ ధిక్ ఐసీ ప్రేమ్‌కో, కహా కహాహు మై నాథ్*
*అస్థి చర్మమయ దేహ మమ, తామయి జైసీ ప్రీతి*
*తై సే జౌ శ్రీరామముహు, హోతి న తౌ భవభీతి''*

రెండవ వృత్తమున వేదాంతమున్నది. మొదటి వృత్తమున నామె వ్యక్తిత్వమున్నది. ఈ మాటలాతని మనస్సుపై పిడిబాకుల పనిజేసినవి. దాగియున్న సంస్కార మా సమయమున హఠాత్తుగా - ప్రళయాగ్నివలె లేచినది. తులసీదాసామెను వదలి యేఁగెను. ఇట్టి సన్నివేశవములు ప్రతిగృహస్థునకు కొంచెముగనో, గొప్పగనో తప్పవు. కాని ప్రతియొకడు సన్యాసి యగుచున్నాడా? ఆ చీదరింపు మాటలకుగూడ - రసికత్వపురంగు పూసికొని తృప్తిపడుచున్నాము. స్త్రీ కాలిదెబ్బటుగూడ - రసికత్వమేయని మన ప్రబంధములు పలుకనే పలికినవి. సాక్ష్యము ముక్కుతిమ్మన్నగారు. తులసీదాసునకప్పుడు సంస్కార ముద్బుద్ధమైనది; ఆ సమయమును వాడుకొన్నాఁడు; అంతే!

భార్యను వదలిన తులసీదాసు - భారతదేశమంతయు జుట్టెను. రామేశ్వరము వరకు పయనించినట్లున్నది. 'కంబర్'మహాకవి రామాయణ కాలక్షేపములు గూడ నాతడు వినియుండెనేమో! తులసీ రామాయణములో - వాల్మీకి భావము లెక్కువగా గన్పింపవు. అతనికి మూల 'మధ్యాత్మ రామాయణము'. అతని కేమి! భక్తులందరకు నంతే! మహారాష్ట్రమున నేకనాథుడు ''భావార్థ రామాయణము''ను వ్రాసెను. అత డనుసరించిన దధ్యాత్మరామాయణమునే - మలయాళమున 'యెజుత్తచ్చన్' - అధ్యాత్మ రామాయణమునే యనుసరించినాడు. తులసీదాసు శ్రీమద్భాగవతము నెక్కువగా పారాయణ మొనర్చియుండునని నా యూహ. భాగవతములోని భావములు కోకొల్లలుగా గన్పించును. బాలరాముని వర్ణనమును - భాగవతపు వాసనయే. స్కాందము మొదలగు పురాణములుగూడ నాతడు జదివి, వానిలోని కథలను తన రామచరితమున జేర్చికొన్నాడు. ఈ విషయము తానే చెప్పెను.

> *''నానా పురాణ నిగమాగమ సమ్మతం యత్*
> *రామాయణే నిగదితం క్వచిదన్యతోఽపి,*
> *స్వాంత స్సుఖాయ తులసీ రఘునాథ గాథా*
> *భాషానిబంధ మతిమంజుల మాతనోతి.''*

తులసీ రామాయణమున ''క్వచిదన్యతోఽపి''యే యెక్కువగా గన్పించుచున్నది. ''స్వాంతస్సుఖాయ'' యనుటతో రామాయణరచన మాతని కొక యుపాసనావిశేషమని వ్యక్తమగుచున్నది. కృష్ణునివలె - రఘువీరుని గూడ పరబ్రహ్మగాగాక - పరమాత్మగా చిత్రించవలెనను ప్రయత్నములు 'రామచరిత మానస్'లో కన్పించుచున్నవి. తులసీదాసు కాలమున కృష్ణోపాసనా సంప్రదాయము బహుళముగా నుండెను. వారి రచనలు ప్రజల నెక్కువగా నాకర్షించినవి. 'సూరదాస్', 'మీరా' మొదలగువారు కృష్ణోపాసకులలో రత్నములవంటివారు. అట్లే రామసంప్రదాయమునుగూడ లోకప్రియముగా నొనరింపవలెనని తులసీదాసు యత్నించెను. వారందరికంటె నాతఁడు వ్యుత్పన్నుడు - అగుటచే తన రచనమున నెన్నియో కావ్యధర్మముల గొనితెచ్చినాఁడు. ఆ

నాటికి సంస్కృతకవుల యాభిజాత్యము తగ్గలేదు. గీర్వాణమున కవిత్వమును వ్రాసినవాడే గొప్పవాడు. వారు దేశభాషాకవుల ననాదరించుచుండిరి. దాదాపు ప్రతి భాషయందును - ఈ స్థితి యుండనేయున్నది. మహారాష్ట్ర కవులెందరో సంస్కృతకవులచే నవమానింపఁబడిరి. శ్రీనాథుడు - రెడ్డిరాజులకడ విద్యాధికారియైనను - అతని గ్రంథమును వారు కృతి దీసికొనలేదు - తులసీదాసు సంస్కృతకవుల కిట్లు జవాబు చెప్పినాడు.

''కా భాషా కా సంస్కృత్, ప్రేమ చాహియే సాఁచ్
కామజో ఆవయి కామరీ, కాలై, కరై కమాచ్''

నిర్గుణోపాసనయన్న - తులసీదాసునకుఁ జాల కోపము. నిర్గుణోపాసనకు - కబీరు మహారథుఁడు. ఆ యుపాసన సమాజమున కొన్ని యనర్థముల దెచ్చి పెట్టినది. ధర్మము విచ్ఛిన్నమగు స్థితికి వచ్చెను. పుణ్యాపుణ్యముల కతీతమైన స్థితి యొకటున్నది; దాని కధికారులందరునుగారు. ఎవఁడో యొకఁడగును. కాని సామాన్యులందరా తెరవెనుక దాగికొనుటకు యత్నించినచో - సామాజికవ్యవస్థ ఛిన్నాభిన్నమగును. ఈ దోషమును తులసీదాసు చక్కఁగా గ్రహించియుండెను. అందుకే - యాతడొక నిర్గుణోపాసి కిట్లు జవాబు చెప్పినాఁడు.

''హమ్ లఖ్, హమహి హమార్ లఖ్, హమ్ హమారకే బీచ్
తులసీ అలఖై, కా లఖై, రామ్‌నామ్ జప్‌నీచ్''

''నేను, నాది యనునవి జ్ఞాపక మున్నంతవరకును దేహాభిమాన మంతరింపదు. అవి పోవువరకును నిర్గుణోపాసన యనర్థదాయకము. తులసీదాసునకు 'మీరా' యొక జాబు వ్రాసినది. ఆమె భర్తృవంశము శైవము. మీరాకు కృష్ణభక్తి అలవడెను. సంప్రదాయోన్మాదియైన భర్త యది సహింపలేదు. ఆ నాఁడు స్త్రీ భోగ్యవస్తువు. పరమ దయామయుడైన తులసికిగూడ, పాపము, ఆ యుగవాసన తప్పలేదు. 'స్త్రీ' తాడనవమున కధికారియని యాతఁడన్నప్పుడు - మనకు తులసీదాసుపై జాలివేయును; 'మీరా'

ధర్మమును నిర్ణయింపుమని తులసికి జాబు వ్రాసినది. ఆమె వ్యక్తిత్వము నాతఁడు అంతర్దృష్టితోఁ జూచెను. భర్తను వదలిపొమ్మని ప్రతి వ్రాసినాడు. కృష్ణుడు యోగీశ్వరేశ్వరుడు: అతని బాహ్యజీవితము విచిత్రమైనది. హృదయము సప్త సముద్రములకన్నను లోతైనది; మహర్షులనే యాతఁడు తికమకలు పెట్టెను. అతని బాహ్యజీవితమును మన మనుసరించినచో - మనగతి యేమగును! ప్రాచీనులకీ బాధ తెలియును. వారు కృష్ణుఁడు చెప్పినట్లు - మనము వర్తింపవలెననిరి. రాముఁడు చేసినట్లు చేయవలెనట! తులసీదాసు చిత్రకూటమును చేరెను.

అతని యుపాసనయంతయు నక్కడనే నడచినది. ఒక బ్రహ్మరాక్షసి సహాయమున నతఁడు హనుమంతుని గుర్తించెనందురు. బ్రహ్మరాక్షసి సాయమొనర్చుట వింతగనే యున్నది! హనుమంతుడు రామదర్శనమును చేయించెను. రెండు మూడుసారులు-రామ సాక్షాత్కారమైనను-తులసీదాసు గమనింపలేదు. అతని దేహాభిమానము గమనింపనివ్వలేదు. ఒకసారి ముస్లిము వజీరుగా రాముఁడు గన్పించినాఁడు. తులసీదాసునకుఁ గొంత మహమ్మదీయులపై ద్వేషముండెనేమొ! ఆ కాలమున వారిపై నేవగింపుండుటలో నాశ్చర్యములేదు. రామావతారమునకు ముందు - రాక్షసులవలనఁ గలిగిన బాధలను 'తులసీదాసు' వర్ణించినాఁడు. ఆ వర్ణనము వింతగా నున్నది. వారిపైన గల ద్వేషమును బోగొట్టుటకే రఘువీరు డా రీతి దర్శన మొసగెను. రెండవసారి రామలక్ష్మణులు - బాలకులవలెఁ గన్పించినారు. వారు ఫాలపట్టికపై చందనతిలకమును దిద్దగోరిరి; అది యూతఁడు - రాములకై తయారుచేయుచుండెను. తులసీదాసునకు - కోపము వచ్చినది. అతడు వారిని గర్జించి తన్నఁబోయెను. ఈ యవకాశమునుగూడ - తులసీదాసు పోగొట్టుకొనునేమోయని హనుమంతునకు భయమైనది. అతడు 'నర్మగర్భము'గా నొక 'దోహా' పలికెను; గురువు సమర్థుడైనచో - శిష్యుని లోపముల నాతడు గప్పిపుచ్చును. వాని దోషములను తనపై వేసికొని - భగవంతుని నిర్బంధించి వానికి దర్శన మిప్పించును. ఏకనాథుని విషయమున నిట్లే జరిగినది. ఆధ్యాత్మికమార్గమున గురువు లేనిదే తరించుట - కలలోని వార్త. గురువునకున్న గౌరవము

భగవంతునికి లేదు. కాని - గురువు సమర్థుడు గావలెను. 'ఏకనాథ భాగవతము'న గురువును గూర్చిన వర్ణనయెంతయో హృదయంగమముగా నున్నది. గురువునకు అపరోక్షానుభూతి యుండవలెను. తనకే యనుభూతి లేనివా డితరులకేమి యొసఁగును? గురువు లనేకులు. పరమార్థమును బోధించి - మాయను దొలగింపగలవాడే సద్గురువు. తక్కిన వారు గౌరవయ్యులు. వారిని మనము నమ్మికొన్నచో ''కానని వాని నూతగొని కాననివాడు చరించుభంగి'' అంతే!

ఇదియంతయు తులసీదాసు బాహ్యజీవితము. అతని యంతర్జీవిత మేమో మనకు తెలియదు. అతనిదే కాదు - ఏ సత్పురుషుని యంతర్జగత్తును గూడ - మన మూహింపలేము. భార్యను విడిచిపోయిన తులసీదాసు - ఆమెను మరచిపోవుట కెంత తపించినాడో మన మెట్లూహింపగలము? ఆ విరహవేదన యాతని హృదయము నెంత కాల్చినదో! 'అర్థమవిద్యమానమైనను సంసృతి నివారింపబడద'ని భాగవతమున వ్యాసభగవానుఁడనెను. ఆమె తలపులనుగూడ సంపూర్తిగ విస్మరించుట కాతని కెన్ని వర్షములు పట్టెనో! ఎన్నిసారులు రామ దర్శనమును బోగొట్టుకొన్నాడో! ఎన్ని యనుత్సాహముల కాతడెట్లు సమాధానములు చెప్పికొన్నాడో! ఎన్నికోట్లు జపము చేసెనో! ఎట్లు చేసెనో! ఉపాసనా కాలమున నేర్పడిన యుపాధుల నాతడెట్లు నివారించుకొనెనో! అతనికి పడిసెముపట్టిన మం దెవరిచ్చిరి? వచ్చిన జ్వరము లెట్లు పోయినవి? ఎన్ని రాత్రులు కన్నీటితో గడపినాడు? ఈ విషయముల మనమెట్లూహింపగలము? తులసీదాసే వచ్చి చెప్పవలెను. లేక -యీ జీవనము మనము బ్రతికినపుడు - మన కనుభవమునకు వచ్చును. సత్పురుషుల బాహ్యజీవితము చాల యల్పమైనది. తులసీదాసుయొక్క యంతర్జీవితము - అతని రామాయణమంత యుండుటలో సందేహమేమున్నది? తులసీదాసు జీవితమున నేవేవో మాహాత్మ్యము లున్నవి! చనిపోయినవాని నాతడు బ్రతికించెనట! కుమారిని కుమారుఁడుగా మార్చెనట! తన్ను రాజు బంధించినపుడు - రక్షణకై వానరసేనను పిలిచెనట! ఇట్టి కథలు ప్రతి సత్పురుషుని జీవితమునందును - జెప్పుచుందురు. సామాన్యులు - ఇట్టి సంఘటనలను బట్టియే - వారు

గొప్పవారని నమ్మెదరు. కాని యిదియంత - సంస్కృతమైన దృష్టికాదు. సామాన్యదృష్టి. సిద్ధశక్తులు తపస్సునకు భంగకరములని పెద్దలే చెప్పిరి. అడుగడుగునను శక్తులను ప్రదర్శించినచో - కొంతకాలమున కాతడు సామాన్యునకన్నను తక్కువవాడగును. మరి వారి విశేష మెందులో నున్నది? పరిపక్వమైన వారి హృదయధర్మములో నున్నది. వారి జీవ కారుణ్యమున నున్నది; ద్వంద్వములను వారు సహించిన మెలకువలో నున్నది. వారి యాత్మార్పణములో నున్నది. వివేకానందుఁ డొకసారి రామకృష్ణుని 'దైవికపురుషుఁడెట్లుండు'నని యడిగెను. సామాన్యునివలెనే యుండునని రామకృష్ణుఁ డిచ్చిన బదులు. అతనికి రెండు కొమ్ములు మొలువవు. రమణులు - మనవలెనే 'యిడ్లీ'లు తినెను. 'కాఫీ' త్రాగెను. మరి విశేష మెందులోనున్నది! ఎట్టియెడలఁ - యెన్ని యల్లకల్లోలములో జరుగుచుండగా - రమణులవలె - ఉదాసీనముగ - మౌనముగ నెంతమంది యుండగలరు? అరవిందమహర్షి నెవ్వఁడో యొకసారి ''మీ రన్నముతిందురా'' యని ప్రశ్నించెను. ఆయన నవ్వి ''ఆ ప్రశ్నలో నీ కేమి ప్రయోజనము నాయనా?'' అన్నాడు. అనగా ''మా జీవితములలో నీవు గమనింపవలసిన దదిగాద''ని దాని యర్థము. రామానుజుల జీవితమున నొక్క యసాధారణ సంఘటనమును జరుగలేదు. పైగా 'క్రిమికంఠు'నకు భయపడి 'మేలుకోట' జేరెను. సత్పురుషులు లోకమునకు గావించిన సేవయే యొక మహా సిద్ధశక్తి. దానిని మించిన మరేమి శక్తి గావలెను?

నేను సుమా రిరువది సంవత్సరములకు ముందు తులసీ పారాయణము నారంభించితిని. తరువాతి జీవితమున నెన్ని సంఘటనములో జరిగినవి. ఎన్ని సారులు తులసీదాసును తిట్టుకొన్నానో లెక్కలేదు. ఆ పుస్తకము ననేక పర్యాయములు చించి పారవేసినాను; ఆ రామాయణము పేరుఁ దలచి కొనుటకుగూడ నసహ్యపడిన దినములున్నవి. కాని యా మహా గ్రంథము నన్ను వెంటాడుచునేయున్నది; అది నన్ను తరింపజేయువరకును విడువదు.'భంగి' చెట్టువంటి తులసీదాసు రామనామజపముతో తులసీ వృక్షమయ్యెను. అతని రామాయణము 'భంగి'చెట్లవంటి మాదృశుల నెందరినో-తరింపజేసినది; చేయుచున్నది. ఆ రామాయణము తపశ్శక్తిచే వ్రాయబ

డినదనుదానికి - ఉదాహరణమింకేమి గావలెను? తులసీదాసు - సత్పురుషుఁడనుటకు మరియొక సాక్ష్యమెందుకు? ఈ గ్రంథ మీనాటికి తెలుగులోనికి వచ్చినది. చిరంజీవి ముంగర శంకరరాజు భక్తుడు. రెండు భాషలయందును సముచితమైన పరిచయము గలవాడు. అతడీ గ్రంథము ననువాద మొనర్చుటతో - అతని జన్మ ధన్యమైనది. ఇంతకు ముందే రామాయణమునకు మూడు నాలుగు అనువాదములున్నవి. ఒక యనువాదమునకు నేనే పీఠిక వ్రాసితిని. రామకథ నెందరు వ్రాసిననేమి! మన కంకంటి పాపరాజు చెప్పిన సమాధాన ముండనేయున్నది.

రామాయణమునకు తులసీదాసు 'రామచరితమానస'మని పేరు పెట్టెను. మానస సరస్సు-అతనిని పూర్తిగా నాకర్షించినది. రామాయణమును - మానస సరస్సుతో పోల్చి యాతడు చెప్పిన రూపకాలంకారము ప్రసిద్ధమే. శంకరరాజు తులసీదాసును శిష్టవ్యావహారికములో తెనిగించెను. అది వీరగ్రాంథికము గాదు. వదులు వదులైన వ్యావహారికమును గాదు; చెవి కింపైన భాష. మూలవిషయమును కుదించుటకుగాని - పెంచుటకుగాని - యత్నింపలేదు. ఇది యొక సుగుణమే! అక్కడ డక్కడ మచ్చునకు కొన్ని 'దోహాలు' 'చౌపాయీ'లు వాడబడినవి. తెలుగువారు - తులసీదాసు రచననుగూర్చి తెలిసికొనుట కివి యుపయోగపడును. మొదటినుండి యయోధ్యకాండము వరకును - శైలి కొంచెము సరళముగా నడచినది. పోను పోను కొంత ప్రౌఢమైనది. కథను చెప్పుటలో నక్కడక్కడ - అధునాతన పద్ధతి యవలంబింపబడినది. ఇది సముచితమే. అయోధ్యాకాండయందలి చిత్రకూటకథను - శంకరరాజు హృదయంగమముగా చిత్రించెను. ఒకటేమి? ఆపాదమాడము రచన బాగున్నది. ''ఆంధ్రపత్రికా'' పత్రికాధిపతు లీ పని నీతనిచేఁ జేయించి - తమ రసికతను వెల్లడించికొనిరి.

కడప — మహాకవి

**28-9-64** — ''పుట్టపర్తి''

## విషయ సూచిక


| | పుట |
|---|---|
| బాలకాండ | 1-89 |
| అయోధ్యాకాండ | 90-193 |
| అరణ్యకాండ | 194-222 |
| కిష్కింధాకాండ | 223-242 |
| సుందరకాండ | 243-282 |
| లంకాకాండ | 283-376 |
| ఉత్తరకాండ | 377-439 |
| లవకుశకాండ | 440-480 |

# రామచరిత మానస్

## బా ల కాం డ

## శ్రీ జానకీ వల్లభో విజయతే!

''వర్ణానా మర్థ సంఘానాం
రసానాం ఛందసామపి,

మంగళానాం చ కర్తారౌ
వందే వాణీవినాయకౌ.''

''భవానీ శంకరౌ వందే
శ్రద్ధా విశ్వాస రూపిణౌ,

యాభ్యాం వినా నపశ్యంతి
సిద్ధాః స్వాంతఃస్థ మీశ్వరమ్.''

''నానా పురాణ నిగమాగమ సమ్మతం యత్
రామాయణే నిగదితం క్వచిదన్యతోఽపి,
స్వాంతః సుఖాయ తులసీ రఘునాథగాథా,
భాషానిబంధ మతిమంజుల మాతనోతి.''

''జడ చేతన జగ జీవ జత
సకల రామమయ జాని,
బందవు సబకే పదకమల
సదా జోరి జుగపాని.''

''నీలసరోరుహశ్యాం తరున
అరునబారిజ నయన,
కరవు సో మమ ఉరమధామ
సదా ఛీరసాగర శయన.''

# సతీ శంకరుల సంవాదము

భరద్వాజుడు శమదమ దయాగుణములు కలిగిన మహాతపస్వి, గొప్ప రామభక్తుడు. ఆ మహర్షి ఆశ్రమము ప్రయాగక్షేత్రమందుండెను. గంగా యమునా సరస్వతీ నదులకు సంగమ స్థానమైన ప్రయాగ క్షేత్రమును త్రివేణి యనికూడ పిలిచెదరు.

మకరసంక్రమణ పుణ్యకాలమున మాఘ స్నానములు చేయుటకుగాను దేవతలు, దానవులు, మునులు, నరులు, కిన్నరులు మున్నగు నానాలోకవాసులు ప్రయాగ క్షేత్రమునకు వచ్చుచుందురు. ఆ వచ్చిన యాత్రికులు త్రివేణిలో మాఘస్నానములు చేసి, త్రివేణీ మాధవస్వామిని శ్రద్ధాభక్తులతో సేవించి, అచ్చటనున్న అక్షయవటవృక్షమును స్పృశించి, భరద్వాజుని ఆశ్రమములో చేరి భగవన్నామ సంకీర్తన చేయుచుందురు.

ఇట్లు ప్రతిసంవత్సరము భక్తసమాజము మాఘమంతయూ ప్రయాగలో గడపి మాసాంతమున తమ తమ నిజ నివాసములకు వెళ్ళుచుందురు.

ఒకసారి ప్రయాగకు వచ్చిన మునిజనులందరు మాఘ స్నానములు పూర్తి చేసుకొని నిజాశ్రమములకు వెళ్లిపోయిరి. తుదకు జ్ఞానసంపన్నుడగు యాజ్ఞవల్క్య మునీశ్వరుడుకూడ స్వాశ్రమమునకు బయలుదేరనుండెను. ఇంతలో భరద్వాజుడు యాజ్ఞవల్క్యునివద్దకు వచ్చి, అతని పాదములు పూజించి మునీశ్వరుని ఉచితాసనాసీనుంజేసి మృదుమధుర వాక్యముల ఇట్లు విన్నవించుకొనెను.

''ఓ మునిరాజా! రామనామముయొక్క ప్రభావము అనంతమైనదని ఋషులు, పురాణములు, ఉపనిషత్తులు ఘోషించుచున్నవి. అవినాశి, జగద్వంద్యుడైన సదాశివుడుసైతం ఆ రామనామమును సదా జపించుచుండును. ఇదియే గాక త్రిపురారి శివుడు ఇతరులకుకూడ రామమహిమను ఉపదేశించుచుండును. మహాత్మా! ఆ రాము డెవ్వరైనది నాకు చక్కగ తెలియకున్నది.

అయోధ్యానగరమున జన్మించి భార్యావియోగదుఃఖముచే రావణుని సంహరించి - జగత్ప్రసిద్ధి నొందిన దశరథరాముడేనా యీ రాముడు! లేక

మరియొక రాముడు కలడా? ఎవరి నామసంకీర్తనము శంకరుడు సదా చేయుచుండునో అవగతమగుటలేదు. సర్వజ్ఞులగు మీరు నా యీ సందేహమును నివృత్తిచేయువలసినదిగా వేడుచున్నాను'' అని భరద్వాజముని విన్నవించుకొనెను.

అంతట యాజ్ఞవల్క్యమహర్షి నిముసకాలము నిమీలితనేత్రుడై ఇంచుక యోచించి, పిమ్మట మందహాసము చేయుచు భరద్వాజుని కిట్లనెను. ''భరద్వాజా! నీవు మనోవాక్కాయకర్మలచే రామ భక్తుడవు. అయిననూ రామునిమహిమారహస్యములను నావలన వినగోరి ఇట్లు ఏమీతెలియనివానివలె నన్నడిగితివి. నీ చమత్కారమునకు మెచ్చి ఆహ్లాదకరమైన రామకథను నీకు వివరించి చెప్పుచున్నాను. వత్సా! భరద్వాజా! మోహమహిషాసురుని మర్దించుటకు మహాకాళివంటిది, భక్తచకోరములకు చల్లని చంద్రకిరణములవంటిది యగు రామచరిత్రను ఆలకించవలసినది.

ఇవ్విధముగ నీవలెనే ఒకప్పుడు పార్వతికి సందేహమేర్పడగా పరమశివుడామెకు సమాధానమిచ్చియుండెను. పార్వతీశంకరులకు ఏ కారణమున, ఎప్పుడు, ఏ విధముగ సంవాదము జరిగెనో దానిని నాశక్తికొలది నీకు సవిస్తరముగ చెప్పుచున్నాను. ఆకర్ణించవలసినది.'' అని చెప్పి యాజ్ఞవల్క్యు డిట్లు ప్రసంగించెను.

త్రేతాయుగములో ఒకప్పుడు శివుడు జగజ్జనని భవానితో అగస్త్యమహర్షి యాశ్రమమునకు వెళ్ళెను. కుంభజుడు భవానీశంకరులను భక్తితో పూజించి వారికి రామకథా వృత్తాంతమును గానముచేసి వినిపించెను. అందుకు పరమేశ్వరుడు ప్రసన్నుడై ఋషికి హరిభక్తితత్త్వమును బోధించెను. ఆశ్రమములో కొన్ని దినములు గడపిన పిమ్మట గంగాధరుడు అగస్త్యునివద్ద సెలవు తీసుకొని దక్ష కుమారితోకలసి కైలాసమునకు పోవుచుండెను.

అదే సమయమున భూభారము నివారించుటకై రఘువంశమున అవతరించిన రామచంద్రుడు దండకారణ్యములో విచారగ్రస్తుడై తిరుగుచుండుట సదాశివుడు చూడగల్గెను. ఆ సందర్భములో, రాముని రూపములో అవతరించియున్న విష్ణుమూర్తిని దర్శించుకొనుటకై ఉమాపతి మనస్సు ఉవ్విళ్ళూరెను.

ఇంతలో దశగ్రీవుడు మాయలేడిని పంపుట, రామలక్ష్మణులులేని సమయమున సీతను హరించుట, మాయలేడిని సంహరించి పర్ణశాలకు తిరిగివచ్చిన రామలక్ష్మణులు అచట సీతమ గానక దుఃఖముచే విలపించుట కైలాసపతి కన్నులతో చూచెను. అప్పుడు గంగాధరుడు తనలో తానిట్లు తర్కించుకొనెను.

''భగవంతుడు ప్రచ్ఛన్నముగ అవతారమెత్తి సంచరించుచున్నాడు. సంయోగ వియోగములులేని స్వామి మానవమాత్రునివలె విరహదుఃఖాదులు అనుభవించి తన లీలలు లోకమునకు ప్రకటించుచున్నాడు. ఈ సందర్భమున నేను స్వామిని దర్శించినయెడల అవతారరహస్యములు సర్వులకు వెల్లడి కాగలవు. ఆహా! రాముని చరిత్ర ఎంత విచిత్రమైనది! జ్ఞానులకు మాత్రమే భగవంతుని లీలా రహస్యములు బోధపడగలవు'' అని విచారించి శివుడు - ''జయ సచ్చిదా నంద జగ పావన'' యని ఉచ్చరించుచూ రామమూర్తికి దూరము నుండే నమస్కరించి ముందుకు సాగెను.

భవునితోగూడి పయనించుచున్న భవాని తన నాథుడు దారిలో కనబడిన ఒకానొక రాజపుత్రునికి నతశిరస్కుడై నమస్కరించుచుండుట చూచి ఆశ్చర్య పడెను. ఆమె మనసులో ఇట్లు తలపోయసాగెను.

''శంకరుడు జగదీశుడు. దేవ, దానవ, గరుడ, గంధర్వ, నర, కిన్నరులచే పూజింపబడుచున్న జగదారాధ్యుడు: అట్టి లోకేశ్వరుడైన మహేశుడు ఈ రాజ కుమారుని సచ్చిదానందస్వరూపుడని భావించి నమస్కరించుట చిత్రముగా నున్నది. పరబ్రహ్మస్వరూప మిట్టిదని వేదములు సైతం వర్ణించలేదే! సర్వవ్యా పకుడగు పరబ్రహ్మ మానవరూపమున అవతరించుట సంభవించునా! ఒకవేళ మహాజ్ఞాని విష్ణువు మనుజరూపము ధరించిననూ ఇట్లు అజ్ఞానివలె భార్యను వెదకుచూ పరితపించునా!'' అను పలువిధములైన సందేహములు సతి మనస్సును కలతబెట్టెను.

శివుడు సర్వాంతర్యామి కాబట్టి సతీదేవి సందేహమును పసిగట్టి ఆమెకిట్లు ప్రవచించెను -

"ఓ భవానీ! స్త్రీలు సంశయాత్ములనుట నిజము. ఇవ్విధముగ నీవు శ్రీరామునిగురించి శంకించుట పాడిగాదు. ఎవని మహిమను ఇంతకు పూర్వము అగస్త్యుడు గానము చేసెనో, ఎవనిని నిత్యము మునులు, సిద్ధులు, యోగులు స్తుతించుచుందురో, వేదాదిపురాణగ్రంథములు ఎవని నామమహిమను వేనోళ్ళ ఘోషించుచున్నవో, పరబ్రహ్మస్వరూపుడగు ఆ రాముడు తన భక్తుల హితార్థమై రఘుకులమున అవతరించెను. ఉమా! రాముడు నాకు పూజ్యుడైన ఇష్టదేవుడు సుమా!" అని బోధించెను.

అప్పటికినీ సతికి శంకానివృత్తి కాలేదు. బలీయమగు భగవన్మాయకు లోనై దాక్షాయణి ఇవ్విధముగ సందేహించుచున్నదని భవుడు గ్రహించెను. పిమ్మట అతడు చిన్నగ నవ్వి దక్షకుమారితో ఇట్లనెను -

"సతీ! స్త్రీలు సంశయాత్ములు. నీ స్త్రీస్వభావమునకు సత్యము బోధ పడకున్నది. నీవే స్వయముగా వెళ్ళి శ్రీరాముని పరీక్షించి రమ్ము. అంతవరకు నే నీ చెట్టుక్రింద కూర్చొనియుండెదను" అని చెప్పి అలికనేత్రుడు అక్కడున్న ఒక వటవృక్షముక్రిందకు వెళ్లి కూర్చొనెను. "విధి బలీయమైనది. ఈ ప్రయత్నములో సతికి ఏదో అమంగళము ప్రాప్తించనున్నది." అని చింతించుచు చంద్రమౌళి శ్రీరాముని దివ్యనామము జపించుచూ కూర్చుండెను.

ఆదిశంకరుని ఆజ్ఞానుసారము అక్కడనుండి బయలుదేరిన దాక్షాయణి రామలక్ష్మణులున్న దెసకు పోవుచు శ్రీరాముని పరీక్షించుటకు తగిన ఉపాయము ఆలోచింపసాగెను. తుదకామెయే సీత వేషముదాల్చి రామలక్ష్మణులు వచ్చుచున్న మార్గములో నిలబడెను.

ఉమ కుహనావేషముచూచి మొదట లక్ష్మణుడు సీతయనుకొని భ్రాంతి పడెను. కాని, సర్వజ్ఞుడగు శ్రీరామునకు సతి కపటవేషము తత్క్షణమే అవగతమైపోయెను. అతడు మందహాసముచేయుచూ దక్షకుమారిని సమీపించి ఆమెకు చేయెత్తి నమస్కరించి - "ఓ సతీ! కుశలమా! వృషకేతుడెక్కడ! ఈ వనాంతరమున ఇట్లు ఒంటరిగా సంచరించుటకు కారణమేమ" ని ప్రశ్నించెను.

మధురముగాను మర్మముగాను పలికిన సీతాపతి మాటలకు సతీదేవి సిగ్గు పడెను. వెంటనే ఆమె తలవంచి దాశరథికి ఒక నమస్కారము చేసి అక్కడనుండి శివునివద్దకు మరలెను.

కపట వేషమున వెళ్ళి శ్రీరాముని భ్రమింపజేయ ప్రయత్నించి సతి పెద్ద అపచారము చేసెను. పరమేశ్వరునికి ఆమె ఏమి సమాధానమీయగలదు? ఈ విచారముతో సతి మనసు కలతజెందెను. అట్లు డోలాయమానమానసయై వెళ్ళుచున్న ఉమకు తనమహిమ ప్రకటింపదలచి శ్రీరాముడు విరాట్ స్వరూపుడై ఆమె యెదుట సాక్షాత్కరించెను.

హరిహరబ్రహ్మాదులు, లక్ష్మీ,సరస్వతీ,పార్వతులు త్రింశత్కోటి దేవతలు, సకలమునీంద్రులు సేవించుచుండ జగన్మంగళాకారుడైన శ్రీరాముని దివ్యస్వరూపము సతికి గోచరించెను. ఆ పరిసరములందు ఎటు చూచిననూ ఆమె దృష్టికి ఆ దివ్యరూపమే కనబడుచుండెను. ఆ మంగళవిగ్రహము- యొక్క దివ్య తేజస్సుకు కన్నులు మిరుమిట్లుగొలిపి హృదయము కంపించి దక్ష కుమారి స్మారకముదప్పి క్రిందపడిపోయెను. ఆమెకు తెలివి వచ్చి కన్నులు తెరిచి చూచున్నప్పటికి అక్కడ ఏమియూలేక యథాపూర్వముగా నుండెను. అప్పటికి ఆమె మనస్సుకు రఘూద్వహుని మహిమ చక్కగ అవగతమయ్యెను. పిమ్మట సతీదేవి సాకేతపతిసాక్షాత్కారమును సంస్మరించుకొనుచు తిన్నగ త్రిపురారి యున్నచోటుకు వచ్చెను.

"ఏమి సతీ! కుశలమేనా? నీవు రాముని ఎట్లు పరీక్షించి వచ్చితివో నిజముచెప్పు"మని నాగభూషణుడు దక్షకుమారిని ప్రశ్నించెను.

"మహాత్మా! మీమాట లెన్నటికీ అసత్యములు కావు. మీరన్నంత నిజమయ్యెను. మీవలెనే నేనుకూడ సీతాపతికి ప్రణమిల్లి వచ్చితిని." అని సతి పతితో నిజమాడుటకు భయపడి అబద్ధమాడెను.

## ఫాలాక్షుని ప్రతిజ్ఞ

సతీపతి సర్వజ్ఞుడు. జ్ఞానదృష్టితో ఆయన జరిగినదంతయూ గ్రహించెను. భవాని చేసిన అపచారమునకు భర్గుడు వ్యథచెంది యిట్లు తలపోసెను.

''విధి బలీయమైనది. జగదభిరాముని మాయకు లోనై హైమవతి నాతో అబద్ధమాడుచున్నది. భగవదిచ్ఛను కాదనగలవారెవరు? శ్రీరాముని సన్నిధికి సీత రూపమున వెళ్ళి సతి గొప్ప తప్పుచేసెను. జగన్మాత జానకిరూపు ధరించిన సతిని ఇక నేను పత్నీభావముతో చూడడము అఘస్పర్శ యగును. కాని సతి మాత్రము పవిత్రురాలు. తెలియకచేసిన తప్పుకై ఆమెను విసర్జించుట ధర్మము కాదు. అందులకై సతి యీ శరీరము ధరించియున్నంతవరకు ఆమెతో నాకు గల శారీరకసంబంధము వదలిపెట్టుచున్నాను'' అని ప్రమథాధిపతి తనలో తాను ప్రతిజ్ఞచేసుకొనెను.

తదుపరి కాలకంఠుడు కాకుత్స్థరాముని మనస్సులో ధ్యానించి గృహోన్ముఖుడయ్యెను. ఇంతలో ఆకాశవాణి పైనుండి ''ఓ ఫాలాక్షా! నీ దృఢ భక్తి శ్లాఘనీయమైనది. నీ శపథము అనన్యమైనది'' అని సతీశంకరులకు వినబడునట్లు జయము పలికెను.

సతి శంకాకులితచిత్తయై భీతిగొని, శివుడు ఎందులకు ఏమి ప్రతిజ్ఞ చేసెనో చెప్పుమని ప్రార్థించెను. ఫాలాక్షుడు ప్రత్యుత్తరమీయక మిన్నకుండెను. సతికి సందేహము మరింత యెక్కువాయెను. ఇతఃపూర్వము తనవలన జరిగిపో-యిన అకార్యమును తలంచుకొని సతి వ్యసనకలుషితమానసయై యిట్లు పరి తపించసాగెను.

''సతులు సహజముగ అజ్ఞానులు. చాపల్యవశమున మూర్ఖురాలనై నేను చేయరానిపని చేసితిని. గంభీరశీలుడు, ఉదారహృదయుడగు నా స్వామి శంక రుడు నా దోషము నాతో చెప్పుటకు వెనుకాడుచున్నాడు. అయ్యో! ఎంత ఘోరము జరిగిపోయినది! స్వామి నా చర్యను గ్రహించి నన్ను పరిత్యజించిన-ట్లున్నది.'' అని భవాని పరిపరివిధముల పరితపించి వ్యాకులపడెను. సతీదేవి పరివేదన పసిగట్టిన పరమేశుడు ఆమెను ఊరడించుటకై ఎన్నియో చారిత్రక కథలు చెప్పుచూ కైలాసమునకు తోడ్కొని వెళ్ళెను.

కైలాసము చేరిన పిమ్మట శంభునకు తాను చేసిన పూర్వ ప్రతిజ్ఞ స్మరణకు వచ్చెను. వెంటనే కాలకంఠుడు కైలాసమందున్న వటవృక్షముక్రింద పద్మాసనాసీ నుడై అఖండమైన నిర్వికల్పసమాధిలో లీనుడైపోయెను.

ఇప్పుడు సతి పరిత్యక్త. ఏకాకిని. పతి వైముఖ్యమునకు గురియైన సతీదేవి ఆత్మఘోష వర్ణింప శక్యముగాదు. ఉమ కైలాసమున దినము ఒక యుగముగా గడుపజొచ్చెను. ఆమె పశ్చాత్తాపమునకు పరిధిలేదు. ఆమె ఆత్మవేదనకు అంతము లేకుండెను. ''అయ్యో! నే నెంత పాపము చేసితిని! స్వామి మాటలు అసత్యములని భ్రమించితిని. రామమహిమ గురించి శంకించితిని. వైదేహి వేషమును ధరించి తప్పు చేసితిని. ఇప్పుడు అందుకు తగిన ఫలము అనుభవించుచున్నాను. ఇక దయామయుడైన ఆ రాముడే నన్నీ దుఃఖాబ్ధి నుండి ఉద్ధరించవలెను. ఓ జగదభిరామా! నేను విశ్వనాథుని విడిచి శీఘ్రమే తుదముట్టించుకొనుటకు మార్గముజూపి నాకు ముక్తిని ప్రసాదింపుము'' అని చేతులుజోడించి సతీదేవి రాముని వేడుకొనెను.

ఈవిధముగ పరిపరివిధముల పరితపించుచూ ఉమ ఎనుబదిఏడు వేల సంవత్సరముల దీర్ఘకాలము గడిపెను. అప్పటికి శంభువు రామనామము జపించుచూ సమాధి నుండి లేచెను. అంతట పరమశివుడు దయార్ద్రహృదయుడై దుఃఖముచే వ్యసనగ్రస్తయగు సతిని సమీపమునకు చేరదీసి అనేక భగవత్కథలతో ఆమె కాహ్లాదముకలిగించుచూ కాలము గడుపుచుండెను.

## దక్ష యజ్ఞము

ఇది యిట్లుండ, ఒకానొకదినమున బ్రహ్మలోకములో సకల మునీంద్రులు సమస్తదేవతలు సభదీరియున్న సందర్భమున సతీదేవి తండ్రి దక్షుడు ప్రజాపతి పీఠమలంకరించెను. అన్ని విధముల దక్షుడని భావించి పరమేష్ఠి దక్షుని ప్రజాపతులకు నాయకునిగా జేసెను.

ఇంత పెద్దపదవి లభించగనే దక్షునిలో ఎక్కడలేని అహంకారము అంకురించెను. గర్వోద్ధతుడైన దక్షప్రజాపతి గొప్ప యజ్ఞముచేయ దలపెట్టి యజ్ఞ భాగములు పొందుటకు అర్హులైన సకలదేవతలకు ఆహ్వానములు పంపెను. అట్లు ఆహూతులైన దేవతలందరు సర్వాలంకారశోభితులై మహదానందముతో విమానారూఢులై దక్షయజ్ఞమునకు జనుచుండిరి.

వారివలన తన తండ్రి యజ్ఞము చేయుచున్నాడను శుభవార్త తెలుసుకొని

ఉత్సాహముతో దాక్షాయణి ఉప్పొంగిపోయెను. ఈ శుభసందర్భమున స్వగృహమునకు వెళ్ళి కొలదికాలము గడిపివచ్చిన బాగుండునని ఉమ మనసు ఉత్సహించెను. తదుపరి ఆమె శివుని సమీపించి విధేయురాలై పితృగృహమునకు వెళ్లివచ్చుటకై అనుమతించవలసినదని విశ్వనాథుని వేడుకొనెను. శివుడందుల కొకింత ఆలోచించి ప్రేమభావమున భవానితో ఇట్లు ప్రసంగించెను -

''సతీ! నీ కోరిక మంచిదే. నీవు తల్లిగారి ఇంటికి వెళ్లివచ్చుట నాకు కూడ సంతోషకరమే. కానీ దక్షుడు మనకు ఆహ్వానము పంపలేదు. మీ తండ్రి మిగిలిన కుమార్తెల నందరినీ ఆహ్వానించి నా మీదున్న వైరభావముచే నిన్ను పిలువక తిరస్కరించెను. నేను బ్రహ్మసభలో ఒకానొకప్పుడు అతనిని నిరాదరించితినని నాపై కినుకవహించి యున్నాడు. ఆడబడుచులకు అమ్మగారింటికి వెళ్ళుటకు ఆహ్వానముతో పని లేదు. అయిననూ వైరముగలవానింటికి పిలువని పేరంటమువలె నీవు పోవుట శ్రేయస్కరముగ వుండదు'' అని కైలాసపతి హితవొసంగెను.

జన్మస్థలమునకు వెళ్ళి అక్కడ తల్లిదండ్రులను, అక్కచెల్లెండ్రను, బంధు బాంధవులను దర్శించి రావలెనని అమిత కుతూహలముతో నున్న సతికి శివునిహితోక్తులు చెవికెక్కలేదు. ఇక ఎక్కువ బోధించుటవలన ప్రయోజనముండదని భార్య భావమెరిగిన గంగాధరుడు గ్రహించెను. తదుపరి ముఖ్యగణములను తోడిచ్చి త్రిపురారి దాక్షాయణిని తండ్రి గృహమునకు పంపెను.

హోమధూమములతో మునీంద్రుల మంత్రధ్వనులతో ఆహూతులైన సురాసురులాది నానాలోకవాసులతో బంధు బాంధవులతో సకల సంరంభ సంతోషములతో లోచనోత్సవము చేయుచున్న పుట్టింటికి దక్షకుమారి వచ్చి చేరెను. ఇంటికి వచ్చిన కూతురును దక్షుడు పరామర్శించలేదు. పలుకరించలేదు, కుశలప్రశ్నలు సైతం వేయలేదు. పైగా ఆమెను చూచి అతడు ఆగ్రహోదగ్రుడయ్యెను. ఆమెను చూచినవారు దూరముగ వైదొలగిపోయి గుసగుస లాడుకొనుచుండిరి. జరుగుచున్న పరాభవమును భరించుకొని భవాని అక్కడి నుండి యజ్ఞశాలకు వెళ్లి చూచెను. అక్కడ శివుని హవిర్భాగములు కూడ ఆమెకు గోచరించలేదు. ''అయ్యో! అపుడు శివుడన్న పలుకులు నిజమయ్యెనే'' యని

బోధపడి భవాని మనస్సు బాధ పడెను. జగదీశుడగు విశ్వనాథునికి తండ్రి చేసిన అవమానమును కన్నులార చూచి సతీదేవి హృదయము దుఃఖముచే దహించు కొనిపోయెను. ప్రపంచములో బంధుద్వేషముకంటె పరాభవ మేమున్నది! పరాభ వింపబడిన హైమ విహ్వల చిత్తయై అచ్చట చేరియున్న దేవతా బృందమును మునిజనమును వీక్షించి ఆక్రోశముతో ఇట్లనెను -

''ఓ మునులారా! దేవతలారా! దుర్మదాంధుడగు మా తండ్రి గర్వితుడై నా నాథుని అవమానించి నన్ను హేళన చేసెను. ఈ దౌష్ట్యమును కన్నులతో చూచి మిన్నకున్న మీరు త్వరలోనే ఇందుకు తగినఫల మనుభవింతురుగాక! త్రిపురారి సదాశివుడు లోకేశ్వరుడుకదా! ఆ విశ్వేశ్వరుని వూ తండ్రి మూర్ఖుడై నిందించెను. నా యీ శరీరము అట్టి తండ్రి వీర్యము వలన యేర్పడినది. అందుచే నే నీ తుచ్ఛశరీరమును పరిత్యజించుచున్నాను.'' అని చెప్పి సతీదేవి సర్వుల సమక్షంలో తన శరీరమును యోగాగ్నిచే దహింపజేసు కొనెను. దక్షాధ్వరశాల హాహాకారములతో నిండిపోయెను.

దాక్షాయణి దేహత్యాగము చేసుకొనినసంగతి తెలిసి ఆమె వెంట వచ్చి యున్న గణములు కోపోద్దీపితులై దక్షాధ్వరమును ధ్వంసము చేయసాగిరి. కాని, భృగుమహర్షి తన మంత్రప్రభావముచే వారిని అడ్డుకొని యజ్ఞశాలను రక్షించెను. ఈ వార్త విినిన రుద్రుడు ఆగ్రహోదగ్రుడై వీరభద్రుని పిలిచి దక్షునియాగము విఘ్నముచేసి రమ్మని చెప్పి పంపెను. వీరభద్రుడు కాలాంత కునివలె ప్రకోపించి దక్షాధ్వరమును త్రుటికాలములో చిన్నాభిన్నముచేసి ధ్వంసముచేసెను. పిమ్మట దక్షుని, దేవతలను, మునులను, యావన్మందిని యథావిధి శిక్షించి వీరభద్రుడు వారిని దిక్కులకు పరుగెత్తునట్లు తరిమివేసెను.

## పార్వతీ జననము

"సతీ మరత హరి సన బరుమాగా
జనమ జనమ శివపద అనురాగా,
తేహికారన హిమగిరి గృహ జాయీ
జనమీ పార్వతీ తను పాయీ."

''జన్మ జన్మకు నేను సదాశివుని పాదదాసినిగా జన్మించునట్లు వరము ప్రసాదింపు''మని సతి మరణకాలమున హరిని ప్రార్థించియుండెను. అందుచే ఆమె హిమవంతుని ఇంట పార్వతిగా పుట్టెను. పార్వతి ప్రభవించిననాటనుండి గిరిరాజు సర్వసంపదలతో విరాజిల్లెను. నిర్మల నదీజలములతో, ఫలపుష్ప సంభరితమైన వృక్షరాజములతో వజ్రవైడూర్యాది మణులతో, ఖగమృగాది వివిధ జంతుసముదాయములతో హిమవంతుని గృహము నిత్యకల్యాణము పచ్చ తోరణమునై భాసిల్లెను.

ఒకనాడు నారదమహర్షి హిమవంతుని జూడవచ్చెను. నగరాజు దేవర్షిని అర్ఘ్యపాద్యాదులతో పూజించి సత్కరించెను. పిమ్మట తన కుమార్తెను నారదునకు చూపి - ''ఓ బ్రహ్మమానసపుత్రా! త్రికాలజ్ఞులు జ్ఞానసంపన్నులగు మీచే నా కుమార్తెయొక్క శుభాశుభగుణములు వినగోరుచున్నా'' నని వేడుకొనెను.

అందుకు నారదుడొకించుక గూఢముగ మందహాసము చేసి, పర్వత తనయను పరీక్షగా పరికించి ఇట్లు ప్రవచించెను -

''పర్వతేశ్వరా! నీ ముద్దుబిడ్డ సుకుమారి, సుశీల, సౌభాగ్యవతి, సర్వ లక్షితయైన సౌందర్యవతి. ఈమె - ఉమా - అంబికా - భవానీ నామములచే లోక ప్రసిద్ధినొంది తల్లిదండ్రులకు కీర్తిప్రతిష్ఠలు చేకూర్చును. గిరిరాజా! కానీ నీ పుత్రిక యందు ఒకటిరెండు దోషములుగూడ కన్పట్టుచున్నవి. ఆ దోష ఫలితముంజేసి ఈమెకు జోగి, జటాధారి, దిగంబరుడు, జననీజనకులు లేనివాడు, కామరహితుడైన ఉదాసీనుడు ఈమెకు భర్తకాగలడు.''

నారదుని వచనములు విని మైనా హిమవంతులు దుఃఖాక్రాంతులైరి. వారి ముఖములు తేజోవిహీనమై వెలవెలబోయెను. కానీ పార్వతిమాత్రము భవుడు తనకు భర్తకాగలడని యూహించి ఉత్సాహితయై చెలులతో క్రీడించుచుండెను. దుఃఖపరితప్తులైన మైనా - హిమవంతులు దిగులుగొని ఇందుకేదైనా ఉపాయమున్న సెలవియ్యవలసినదిగా నారదుని అర్థించిరి.

నారదు డొకించుక యాలోచించి యిట్లు సమాధానమిచ్చెను - ''ఓ నగపతీ! బ్రహ్మవ్రాత అనుభవించక తీరదు. అయిననూ మీరు దిగులుగొన

పనిలేదు. నాకొక ఉపాయము స్ఫురించుచున్నది. దైవానుగ్రహముండినయెడల ఈ కార్యము నెరవేరగలదు. అది యేమనిన! మీ బిడ్డ పార్వతికి లభించగల పతికి ఏయే గుణములుండునని వచించితినో అవి అన్నియు శివునికి వర్తించునని నా అభిప్రాయము. మహాత్ముల నాశ్రయించిన దుర్గుణములు సుగుణములుగా మారుచుండుట మన మెరిగినదే కదా! కాబట్టి నీ కన్యను మంగళమయుడగు శివునికిచ్చి వివాహము చేసిన శుభప్రదముగ నుండును. కాని ఆ ప్రమథాధిపతి ఇందు కియ్యకొనవలెకదా! భవుని గురించి పార్వతి తపస్సు చేసిన అతడు తప్పక ప్రసన్నుడు కాగలడు. ఇదొక్కటే మార్గ''మని మహర్షి సూచించెను.

తరుపరి నారదుడు శీఘ్రమే 'కల్యాణప్రాప్తిరస్తు' అని హిమతనయను దీవించి, నగపతియెుద్ద సెలవుతీసికొని బ్రహ్మ లోకమునకు పోయెను. అనంతరము జరిగిన కథను యాజ్ఞవల్క్య మహర్షి భరద్వాజుని కిట్లు చెప్పదొడంగెను.

## పార్వతి తపస్సు

ఒకనాడు పార్వతితల్లి మైనా ఏకాంతమందున్న భర్తను సమీపించి - ''నాథా! నారదుని భవిష్యద్వాణి విన్నప్పటినుండీ నా మనస్సెందులకో భీతి గొనియున్నది. ఎట్లయిననూ చక్కని కులగోత్రములుగల వరునిజూచి వానికి నా కూతునిచ్చి వివాహము చేయుటకు ప్రయత్నింపుము. నా ముద్దుపట్టి పార్వతి నాకు ప్రాణప్రదమైనది. అట్లు చేయనియెడల జగము నిన్ను జడుడని నిందించగలదు.'' అని ప్రాధేయపడి కోరెను.

సతీమణి హృదయవ్యథను గుర్తించి హిమవంతుడు ఆమెకిట్లు బోధించెను - ''ఓ మైనా! చంద్రునిలో అగ్ని పుట్టవచ్చునుగాని, నారదుని వచనములు అసత్యములు కానేరవు. నీవు దిగులొందకుము. పార్వతిని పుట్టించిన దేవుడే ఆమెను తప్పక రక్షించును. కైలాసవాసు డన్నివిధముల కళంకరహితుడు. భక్తవశంకరుడగు శంకరుడు తపస్సువలన పార్వతికి లభ్యముకాగలడు. కనుక నామాట ఆలకించి నీవు ఎట్లయిననూ పార్వతిని త్రిపురారినిగురించి తపస్సు చేయుటకై ఒప్పించుము. సాంతమున సర్వము శుభమగును.''

భర్త ఆజ్ఞానుసారము మైనాదేవి మనస్సు దృఢపరచుకొని కూతురియొద్దకు వచ్చెను. కుమార్తె ముఖము చూడగనే మైనాకు దుఃఖము కట్టలు త్రెంచు కొనెను. నారదుని భవిష్యద్వాణి, పార్వతి భావిజీవితమును తలపోసుకొని ఆ తల్లి ఘోరున యేడ్చెను.

పార్వతి జ్ఞానసంపన్నురాలు. ఆమె తల్లికి కలిగిన అకారణ భయమును పోగొట్టదలంచి, ఆమె ఒడిలోకూర్చొని మృదుమధురోక్తుల ఇట్లు భాషించెను.

''జననీ! రాత్రి నేనొక స్వప్నము కంటిని. గౌరాంగుడగు బ్రాహ్మణశ్రేష్ఠ డొకడు నాకు స్వప్నములో సాక్షాత్కరించి ''ఓ గిరిజా! నారదునివచనము లస-త్యములు కావు. దేవర్షి సూచించిన ప్రకారము నీవు ముక్కంటిని గూర్చి తప మాచరించిన తప్పక అతడు ప్రసన్నుడు కాగలడు. తపోబలముచే సాధింపరానిది లేదు. ఇది మీ జననీజనకులకు సమ్మతమైనదే.'' అని ఆ విప్రోత్తముడు నన్నా-దేశించెను.''

ఈ వృత్తాంతము ఆలకించి తల్లి మైనా సంతోషముతో తన్మయురా లయ్యెను. ఆమె తత్క్షణమే పరుగెత్తుకొని వెళ్ళి పతికి పార్వతిఅభీష్టము ఎరిగించెను. తదుపరి గిరితనయ జననీజనకుల అనుమతీ, ఆశీర్వాదములు తీసికొని పరమేశుని గూర్చి తపస్సుచేయుటకై బయలుదేరెను.

పార్వతి ఘోరమైన తపస్సు చేసెను. శరీర క్లేశములను లెక్కచేయక హృద యము ఈశ్వరాయత్తముచేసి ధ్యాన నిమగ్నయై నిష్ఠబూనెను. ఆమె ఒక వేయి సంవత్సరములు కందమూలములు మాత్రమే భుజించెను. తదుపరి నూరు సంవత్సరములు శాకములనే ఆహారముగా స్వీకరించెను. పిమ్మట మరి కొంత కాలము గాలి, నీరుతోనే గడిపెను. అనంతరము కొంత కాలము నిర్జలోప వాసముతో నుండెను. ఎండి నేలబడిన బిల్వపత్రములనే తిని మూడు వేల సంవత్సరములుండెను. తదుపరి ఆ శుష్కపత్రములనుకూడ విసర్జించెను. అందుచే ఆనాటి నుండి ఆమెకు 'అపర్ణ'యను పేరుగలిగెను. ఇట్లు పెక్కేండ్లు ధ్యానోపవాసములచే శుష్కించి నిష్ఠాగరిష్ఠయైయున్న గిరికుమారిని సంబోధించి

ఆకాశమునుండి బ్రహ్మవాణి ఇట్లు పలికెను--

"ఓ పర్వతపుత్రీ! కఠోరమగు నీదీక్ష అనన్యసామాన్యమైనది. నీవు కోరినప్రకారం శంకరుడు నీకు భర్త కాగలడు. కాబట్టి నీవు దీక్ష విరమింపుము. మీ తండ్రి నిన్ను పిలువవచ్చును. అపుడు నీవుయెట్టి ఆటంకముచేయక గృహమునకు మరలిపొమ్ము, ఎప్పుడు మీవద్దకు సప్తఋషులు వచ్చెదరో అపుడు నా మాటలు సత్యములని నమ్ముము."

అశరీరవాణి పలుకులు విని సంతోషముతో పార్వతి శరీరము పులకరించెను. అంతట ఉమ ప్రసన్నచిత్తయయ్యెను.

" ఓ భరద్వాజా! ఇంతవరకు నీకు ఉమాకథ చెప్పి వినిపించితిని. ఇక వృషకేతుని వృత్తాంతము చెప్పుచున్నాను ఆలకించ వలసినది" అని యాజ్ఞవల్క్యుడు భరద్వాజుని కిట్లు చెప్పనారంభించెను.

★ ★ ★ ★

*"జబ్‌తే సతీ జాయి తనుత్యాగా*

*తబ్‌తే శివమను భయవు బిరాగా"*

సతీదేవి దేహత్యాగము చేసినాటినుండీ విషకంఠుని మనస్సు విరక్తిజెందెను. చిదానందస్వరూపుడగు శివుడు కామరహితుడైనప్పటికీ, భక్తవశంకరు డయినందున భక్తురాలు సతీదేవి విరహదుఃఖమువలన అతడుకూడ వియోగ దుఃఖమునకు గురియయ్యెను.

కైలాసమందున్న యెడల మాటిమాటికీ సతీస్మరణచే మనసు కలతపడు చుండునని తలంచి గంగాధరుడు అచ్చోటు వదలి నిరంతరము రాముని ధ్యానించుచూ భూసంచారము చేయసాగెను. ఇట్లు భర్గుడు దీర్ఘ విరాగియై దిగంబరుడై రాముని దివ్యనామము జపించుచూ కాననాంతముల ద్రిమ్మరుచూ పెక్కేండ్లు గడపెను.

దశరథరాముడు అనంత దయా సముద్రుడు, భక్తవత్సలుడు. అతడు

అలికనేత్రునికి తనపైగల అనన్యభక్తిని జూచి ముగ్ధుడైపోయెను. దేశద్రిమ్మరియై తిరుగాడుచున్న గంగాధరునికి ఒకనాడు ప్రత్యక్షమై ఇట్లు పలికెను--

''కాలకంఠా! నీ వ్రతనిశ్చలత అమోఘమైనది. నీవలె కఠోర వ్రతము బూని ప్రతిజ్ఞను పాటించినవారు లేరు. శివా! నీవు సతీవియోగమునకై చింతించపనిలేదు. ప్రస్తుతమామె హిమవంతుని ఇంట పార్వతిగా పుట్టియున్నది. గంగాధరా! నాపై నీకు ప్రేమయున్నచో నా మనవి మన్నించి శీఘ్రమే నీవు గిరిజను పెండ్లియాడుము.'' అని బోధించి అవధేశుడు అంతర్ధానమైపోయెను.

పరమశివుడు రామచంద్రుని హితవాక్యులు కాదనలేక పోయెను. రాముని యెడ అతనికున్న భక్తి అనుపమానమైనది. ముక్కంటి రామునాజ్ఞ శిరసావహించి పాలించుటకు నిశ్చయించెను.

## సప్తర్షులు పార్వతిని పరీక్షించుట

అంతట తనవద్దకు వచ్చిన సప్తఋషుల నవలోకించి వారితో విశ్వనాథుడిట్లనెను--

''ఓ మునివర్యులారా! మీరు గిరికన్యయొద్దకు పోయి ఆమెకు నాయందు గల ప్రేమను పరీక్షింపుడు. ఆపైన హిమవంతుని దర్శించి అతనిని పార్వతిని ఇంటికి తీసుకొనిపోవునట్లు చేయుడు.'' శివునాజ్ఞ శిరసావహించి మునులు పార్వతి తపస్సు చేయుచున్న చోటికి వచ్చిరి.

గిరికుమారి ఘోరతపస్సు చూసి తాపసులు నివ్వెరపోయిరి. తదుపరి వారు ఆమెను సమీపించి ''ఉమా! ఇంత ఉగ్రతపస్సు చేయుటకు కారణమే''మని ప్రశ్నించిరి. అందులకామె ''--మునులారా! నారదమహర్షి మాట ననుసరించి భవుని భర్తగా బడయుటకు ప్రయత్నించుచున్నా''నని సమాధానమిచ్చెను. అందుమీదట ఆమెను పరీక్షించుటకై ఋషులిట్లు పలికిరి.

''ఓ గిరిజా! వాస్తవముగ నీవు గిరిగర్భమున జనించినదానవు. లేకుండిన నారదుని మాటలు నమ్ము అమాయకులెక్కడైనా ఉందురా! ఆ కపటముని

మాటలు సత్యమని నమ్మినందున ఎవరికొంప నిలబడగలిగెను! ఎవరు బాగు పడిరి? దక్షుని కుమారులకు, చిత్రకేతుని వంశమునకు, హిరణ్యకశ్యపుని పుత్రాదులకు నారదుని ఉపదేశము పాటించినందున ఎట్టి ఇక్కట్లు సంభవించెనో తెలియదా!

అయ్యో పిచ్చితల్లీ! ఆ జడదారి మాటలు విని ఎంతొపెదదారి బట్టితి వమ్మా! శివునికి కులగోత్రములు లేవు. ఇల్లు వాకిలిలేదు. వాడొక కాపాలి కుడు, దిగంబరుడు, బైరాగి. ఆ పైశాచికుని పెండ్లాడి యేమి సుఖము నను భవింతుదా మనుకుంటివి! ఒకప్పుడు సతికి బొట్టుకట్టి పిమ్మట ఆమెను వదిలిపెట్టిన బికారినా నీవు వివాహమాడదలంచినది! శైలజా! మూర్ఖించక మా మాటలు నమ్మి, ఆ వల్లకాటివానిపై నున్న వ్యామోహము వదలి పెట్టుము. ఇదిగో, సకల గుణములకు రాశి వైకుంఠవాసియగు శ్రీపతిని చేపట్టి సుఖింపుము. నీకు శుభమగును.'' అని ప్రసంగించిరి.

సప్తర్షుల సదుపదేశము చక్కగ ఆలకించిన అంబిక చిన్నగ చిరునవ్వు నవ్వి వినయ విధేయయై వారికిట్లు విన్నవించుకొనెను-

''అయ్యలారా! నిజముగా మీ రన్నట్లు నేను పర్వతమునకు పుట్టిన దానను. ప్రాణము పోయిననూ పట్టువిడని స్వభావము మాది. మీరు వైకుం ఠునిగూర్చి ప్రసంగించితిరి. ఆతడెంతటి వాడైననేమి, అతనితో నాకేమి ప్రసక్తి? ఋషులారా! నేను నా సర్వస్వము త్రిశూలికై సమర్పించుటకు సిద్ధపడితిని. ఇది నా కృతనిశ్చయము. ఈ సందర్భములో మీరు నా యెదుట పశుపతి గుణావగుణములను గురించి ప్రసంగించుట అప్రస్తుతము. జన్మజన్మలకూ ఆ జటాధారియే నాకు భర్తగా నుండవలెను. లేదా కన్యగానైనా ఉండిపోగలను. మీ సానుభూతి కొరకు నమస్కారము. ఇక మీరు మీ గృహములకు దయచేయుడు.''

ఋషులు పార్వతి నిశ్చలభక్తిని మెచ్చుకొని ఆమె చిత్తశుద్ధిని వేనోళ్ళ కీర్తించిరి. పిమ్మట వారు జగదంబికకు జయముపలికి హిమవంతుని వద్దకు పోయిరి. పార్వతిని ఇంటికి తోడ్కొని రావలసినదిగా నగరాజు కుపదేశించి సప్తర్షులు అక్కడ నుండి శివసన్నిధానమునకు చేరుకొనిరి. పార్వతి గుణగణము

లను ఆమెకు తనయందుగల ప్రేమానురాగమును సప్తర్షులవలన సవిస్తరముగ తెలుసుకొని శంకరుడు సంతుష్టాంతరంగుడయ్యెను.

## కాముని దహనము

తారకాసురుడను రాక్షసుడు మహా బల పరాక్రమవంతుడు, వరబలోద్ధతుడు. వానికి జరామరణములు లేవు. వాడు దురహంకార ప్రేరితుడై నాకలోకముపై దాడిచేసి దేవతలను ఓడించి వారి సర్వసంపదలను హరించెను. దుర్దాంత వరప్రసాదుడై విజృంభించిన తారకుని ధాటికి నిర్జరులు నిస్సహాయులై బ్రహ్మను సమీపించి తమ దైన్యస్థితిని మొరపెట్టుకొనిరి.

నాకలోకవాసులకు కలిగిన ఇక్కట్టులకు వనజభవుండు ఒకించుక విచారించి పిమ్మట వారి కిట్లుపదేశించెను-

"ఓ స్వర్లోకవాసులారా! దుస్స్వాంతుడగు తారకుడు వరగర్వితుడు. శివుని వీర్యమునకు జనించిన వీరు డొక్కడే వాని నిర్జింపగల సమర్థుడు. తనువు చాలించిన దాక్షాయణి ప్రస్తుతము హిమవంతునికి కన్యగా అవతరించియున్నది. శూలధరుని వీర్యము భరించగల శక్తి ఒక్క పార్వతికే గలదు. ఆమె ఇప్పుడు శంకరుని పతిగా బడయగోరి తపస్సు చేయుచున్నది. కానీ అక్కడ శివుడు విరాగియై సమాధిలోనున్నాడు. కనుక మీరు కామునిబంపి కాలకంఠునిలో కామము ఉద్రేకింపజేయుడు. ఆ సమయమునకు నేను వచ్చి కైలాసవాసుని వివాహమునకు సుముఖుని జేసెద" అని చెప్పి దేవతలను పంపెను.

దేవతల ప్రార్థన మన్నించి - మదనుడు శివుని మోహవశునిగా జేయుటకు తన పరివారముతో బయలుదేరెను. విషధరునితో వైరము శుభప్రదముకాదని తెలిసియూ కాముడు దేవతల ఇష్టార్థమై ఇక్కార్యమునకు ఇయ్యకొనెను.

చెరకు విలుకాడు తన నెచ్చెలియగు మాధవుని ముందు నిడుకొని, పువ్వు బాణములు చేత ధరించి, శుకపిక శారికాది సైన్యము కలకలారావము చేయుచూ వెంటనడువ, కమ్మతెమ్మెరలు ఇరుపార్శ్వంబుల అల్లనల్లన వీచుచుండ, నిష్ఠాగరిష్ఠుండై సమాధిలోనున్న శ్రీకంఠుని సమీపించి మారుడు

మదోన్మత్తుడై ధనుష్టంకారము చేసెను.

కందర్పుని సఖుడు మాధవుడు పరమేశ్వరుడున్న పరిసర ప్రాంతమంతటా వసంతము వ్యాపింపజేసెను. గంధవహుడు ముల్లోకములను శీతల సుగంధ మంద పవనములచే ముంచెత్తివేసెను. చెట్లు చిగిరించెను. పొదలు పుష్పించెను. కోయిలలు కూతలిడెను. చిలుకలు తేనె లొలుకునట్లు పలికెను. నెమళ్ళు నాట్యమాడెను, తుమ్మెదలు ఝుంకృతి చేసెను. వసంతుని వైభవ ప్రాభవముచే లోకమునకే మైకము క్రమ్మినట్లయ్యెను. నదీ సముద్రములు, పరస్పర పరిష్వంగ సుఖాభిలాషచే పరవళ్ళుద్రొక్కెను.

అప్పుట కాముడు శివుని సమీపించి తన సమస్త సమ్మోహన శక్తులను విశ్వమున ప్రకటింపజేసెను. ఇంకేమున్నది! పంచబాణుని ప్రాభవమునకు ప్రపంచమే పరవశమైపోయెను. దేవదానవులు, నరఖేచరులు, సిద్ధులు, యోగులు, బ్రహ్మచారులు మున్నగు స్త్రీ పురుష ప్రపంచమంతయూ త్రుటికాలములో మారుని ధాటికి తాళలేక రాగానురాగ భావముతో మత్తెక్కి సొమ్మసిల్లినట్లుండెను. చరాచర ప్రాణికోటి వ్రతనియమ మాన మర్యాదలు విస్మరించి స్త్రీ పురుషసంయోగ సుఖమునకై తహతహలాడెను. ఇట్లు రెండు ఘడియల కాలము విశ్వమంతయు కందర్పుని దర్పమునకు వెర్రెత్తి విహరించెను.

తేజోవిలసితుడైన మారుని ధాటికి లోకములు కంపించిననూ గరళకంఠుడు మాత్రము కించిత్తయిననూ చలించక గాఢసమాధిలో లీనుడైయుండెను. ముక్కంటి తన ప్రభావమును ధిక్కరించి నిక్కుకొని యుండుట జూచి మన్మథుడు మరింత ఉద్రిక్తుడాయెను. తటాలున దాపునున్న ఒక తియ్యమామిడి చెట్టునెక్కి, ప్రత్యాలీఢుడైనిల్చి, చెరకు వింట అయిదు పుష్పబాణములు సంధించి, నారి ఆకర్ణాంతములాగి రతీపతి ఉమాపతిని గురిచూచి కొట్టెను. ఆ బాణాహతికి ఇంచుక హృదయము చలించినవాడై రుద్రుడు నిద్రనుండి మేల్కొనినవాడై సమాధి నుండి లేచి, హుమ్మని హుంకరించి వఘాడవకన్ను దెరచి అగ్నిదృష్టుల కాముని చురచుర చూచెను. ఒక రెప్పపాటుతో ముక్కంటి మంటలకు మరుడు భగ్గున మండి మామిడి చెట్టుతోకూడ భస్మమైపోయెను.

అనంగుడు హతుడైనందుకు కొందరు దుఃఖించిరి. కొందరు సుఖించిరి. భర్త దుర్మరణ వార్తవిని రతీదేవి పశుపతిని సమీపించి పలువిధముల రోదించి పతిభిక్ష పెట్టమని ప్రార్థించెను. రుద్రుడు రతీదేవిని జూచి దయాసముద్రుడై ఆమెతో నిట్లనెను-

''రతీ! ఇక మీదట నీ భర్త అనంగుడను పేరుతో లోకమంతయూ వ్యాపించియుండును. భగవంతుడు భూభారనివారణార్థము యదువంశములో కృష్ణుడై అవతరించినపుడు అతని కుమారుడగు ప్రద్యుమ్నుని రూపమున కాగలడు.'' అని చెప్పి ఆమెను ఓదార్చి పంపెను.

ఈ సంఘటన జరిగిన వెంటనే విష్ణువు, వనజభవుడు మున్నగు త్రింశత్కోటి దేవతలు శివసన్నిధానమునకు వచ్చిరి. పరమేష్ఠి పరమేశుని పలువిధముల స్తుతించి తుద కిట్లు చేతులు జోడించి చెప్పెను-

''ఓ మదనాంతకా! సమస్త దేవతలకు తమ వివాహము కనులతో చూడ వలెనని కోరిక కలిగియున్నది. అనంగుని ఆగ్రహించి అతని భార్యను అనుగ్రహించిన దయాస్వరూపులు మీరు. హిమవంతుని తనయ అనేక వత్సరములు తమకై తపమాచరించెను. ఆమెను అర్ధాంగిగా స్వీకరించి లోక కల్యాణమొన గూర్చవలసినదని మా ప్రార్థన.''

అందుకు శ్రీకంఠుడు సంతసించి 'తథాస్తు' అని వారికి తన సమ్మతి తెలియజేసెను. స్వర్లోకవాసులు హర్షాతిరేకమున దుందుభులు మ్రోగించి శివునిపై సుమవర్షము కురిపించిరి.

తదనంతరము పద్మభవుని పనుపున సప్తర్షులు పార్వతి యొద్దకుపోయి- ''ఓ శైలజా! కాలకంఠుని మనస్సు బహుకఠోరమైనది. అతడు కాముని సైతం దహించివేసెను. ఇక నీ ప్రతిజ్ఞ వ్యర్థమగు''నని ప్రసంగించిరి.

వారి మాటలకు గిరిజ చిన్నగ నవ్వి - ''ఋషులారా! మీ మాటలను బట్టిచూడ శివు నింతవరకు మీరు భోగియని భావించినట్లున్నది. ఇది మీ యజ్ఞానము. శంకరుడు సదా నిర్వికారుడైన యోగి, కామరహితుడు కూడా.

అతడట్టివాడని తెలిసియే నే నతనిని సేవించుచున్నాను. ఆ ఫాలాక్షుడు తప్పక నా ప్రతిజ్ఞ మన్నించగలడని నా నమ్మిక. అగ్నివలన మంచు కరిగిపోవునట్లు నిటలాక్షుని సమీపించి పాపమా మారుడు నశించెను గాబోలు.'' అనెను.

పార్వతి దృఢసంకల్పమును ఋషులు మరొక్కమారు పరీక్షించి మెచ్చుకొనిరి. వారక్కడనుండి హిమవంతుని యొద్దకు వెళ్ళిరి. జరిగిన వృత్తాంతము నగ రాజుకు విన్నవించిరి. దేవహితార్థమై అసువులుబాసిన అనంగుని త్యాగమును హిమవంతుడు శ్లాఘించెను. అటుపిమ్మట పురోహితులను రావించి వేదోక్త ప్రకారము వివాహమునకు శుభముహూర్తము నిశ్చయించజేసెను. హిమవంతు డిచ్చిన లగ్నపత్రిక గైకొని సప్తర్షులు బ్రహ్మలోకమునకు వచ్చిరి. బ్రహ్మాదిదేవ తలు పార్వతీ పరమేశ్వరుల పెండ్లిపత్రిక కన్నుల కద్దుకొని పరమానంద భరితులైరి.

## పార్వతీ పరిణయము

దేవతలు దుందుభులు మ్రోగించి దిశలు ప్రతిధ్వనింపజేసిరి. అప్సరలు ఆడిరి. గంధర్వులు పాడిరి. శుభశకునములు కన్పట్టెను. సర్వాలంకార శోభితులైన స్వర్లోకవాసులు సంతోష సంరంభములతో తమతమ వాహనములు అధిష్ఠించి ఒక్క శుభసమయమున శంభుని పెండ్లికి బయలుదేరిరి.

పెండ్లికుమారుడు శివుని సింగారము అతని సిబ్బంది వాలకము చూడ ముచ్చటగా నుండెను. కురుల కొప్పు, పులితోలు, వంటిపై బూడిదపూత, రొమ్ముపై వ్రేలాడు పుర్రెలదండ, చేత తలచిప్ప, మేనిపై పాముల బుసబుసలు, జెర్రిపోతు జందెముతో ముక్కంటి ముచ్చటగా పెండ్లి కుమారుడయ్యెను. త్రిశూలము డమరు చేతబూని మృడుడు వృషవాహనుడై బయలుదేరెను. శివునివెంట చిత్ర విచిత్ర వేషధారులై వింతవింత ఆకారములతోనున్న భూత, ప్రేత, పిశాచ, శాకినీ, ఢాకినీ, యోగి గణములు నానా మృగవాహనము లెక్కి శివుని వెంట నడచిరి. వారితో కలసి పయనించుచున్న స్వర్లోకవాసులు శంక రుని సిబ్బంది యొక్క వింత వాలకము చూచుకొని ముసిముసిగా నవ్వుకొను చుండిరి.

పెండ్లి ఇల్లు హిమవంతుని గృహము అందచందాలతో అలరారెను. వనోప వనములు, నదీ సరోవరములు, ఫలవృక్షములు, లతా వితానములు, గిరికంద రములు మున్నగు గిరి సంపదలచే నిత్యకల్యాణము పచ్చతోరణమై భాసించెను.

పెండ్లివారి గుంపు నగరము సమీపించగనే ఎదుర్కోలు సత్కారముచే వారిని ఆహ్వానించి హిమధాముడు వారిని సర్వసౌకర్యములు గలిగిన విడిది గృహము లందు దింపెను.

పెండ్లికుమారుడు రుద్రమూర్తి భైరవాకారము, అతని పరివారము యొక్క వింతవైఖరులు చూచి ఆడపడుచువారిలో కలకలము బయలుదేరెను.

''అయ్యో! ఈ దయ్యాల రాయడేనా పెండ్లికొడుకు! ఈ పాముల వాని కేనా పార్వతిని ఈయబోవుచున్నది. అతనివెంట వచ్చినవారు పెండ్లివారా లేక యమభటులా!'' అని విస్తుపోయిరి. స్త్రీలు వృద్ధులు బాలురు ఆబాలగోపా లము ఈ విచిత్ర సంబంధమును తలంచుకొని చింతాక్రాంతులైరి. పార్వతితల్లి మైనాకు కలిగిన దిగులు ఇంతంతని వర్ణింప వీలుగానిది-

''హరి హరీ! ఈ వెర్రిబాగులవాడా పెండ్లికొడుకు! నా బిడ్డ తహతహ లాడి తపస్సు చేసినది ఈ యప్పకొరకేనా! సిగ్గూ ఎగ్గూలేని ఈ బైరాగి వాని చేతిలో నాబిడ్డ నెట్లు పెట్టుదును! ఆ నారదునికి మేమేమి ద్రోహము చేసి యుంటిమి! అతడు అన్యాయముగా మా కొంపముంచెనే! నా బంగారుబిడ్డను ఈ బికారివానికి కట్టబెట్టుటకంటే బావిలో త్రోయుట మేలు.'' అని మైనా ఆక్రోశించి వలవల యేడ్చెను.

ఇట్లు దిగులుపడి దుఃఖించుచున్న మైనావద్దకు హిమవంతుడు సప్తర్షులను నారదునివెంట బెట్టుకొని వచ్చెను. నారదుడు మైనాకు పార్వతి పూర్వచరి- త్రము, ఆ జగజ్జనని మాహాత్మ్యమును, శివపార్వతులకున్న యుగయుగాలనాటి అనుబంధమును వివరించి చెప్పి ఆమెను ఓదార్చెను. జగన్మాత సతి నా కడుపున బిడ్డగా పుట్టినదని తెలుసుకొని మైనా ఉప్పొంగిపోయెను.

తదుపరి లగ్నవేళ సమీపించుచున్నదని సప్తర్షులు హెచ్చరించగా హిమవం తుడు పెండ్లివారిని మేళతాళాలతో వివాహమంటపమునకు తోడ్కొనివచ్చెను.

వివాహవేదిక మీద హోమగుండమునకు సమీపమున - ముత్తయిదువులు మంగళగీతములుపాడి హారతులెత్తుచుండ - శివుడు బ్రాహ్మణులకు నమస్కరించి బ్రహ్మచే ప్రత్యేకముగ నిర్మింపబడిన సువర్ణ సింహాసనముపై ఆసీనుడయ్యెను.

ఋషులు సంకేతము చేయగా చక్కదనాలకుప్ప పార్వతి పెండ్లికూతురై చెలులతోకూడి వేదికవద్దకువచ్చి శంకరుని చరణద్వయమునకు సాష్టాంగ మొనర్చెను.

యథావిధి వివాహ విధులన్నియూ క్రమముగా జరిపించి హిమవంతుడు పార్వతిని శంకరుని చేతులలోబెట్టి కన్యాదానము చేసెను. వేదమంత్రములు పఠింపబడుచుండ, జయ జయ ధ్వనులు దిక్కులు పిక్కటిల్ల, అంతరిక్షము నుండి సుమనాక్షతలు రాలుచుండ, ముల్లోకవాసులు ముగ్ధులై చూచుచుండ శుభంకరుడగు శంకరుడు పార్వతి గళమున మంగళసూత్రము గట్టెను. పార్వతీ పరమేశ్వరుల కళ్యాణము శుభప్రదముగ జరిగెను.

అత్తమామలు అల్లునికి నమస్కరించి ధనకనకాది అపార సంపత్తితో వారిని సత్కరించిరి. సకల లోకవాసులు వధూవరులను అక్షతలచే ఆశీర్వదించిరి. వివాహానంతరము విందు వేడుకలతో కొన్నిదినములు సంతోషముతో గడిపి శివపార్వతులు స్వగృహమునకు ప్రయాణమయిరి.

మైనా హిమవంతులు సుతా జామాతలను సకల మర్యాదలచే సాగనంపిరి. శివుడు అత్తమామల ఆశీస్సులతో సతీసమేతుడై ప్రమథగణముల వెంట నిడుకొని కైలాసము చేరుకొనెను. స్వర్లోకవాసులు భవానీ భవులకు జోహార్లు పలికి నిజనివాసములకు మరలిపోయిరి. ఆదిదంపతులగు ఉమామహేశ్వరులు జగత్తునకు జననీ జనకులై యున్నందున గోస్వామి తులసీదాసు సతీశంకరుల దాంపత్య శృంగారము వర్ణించుట అపచారమని భావించి వదలిపెట్టెను.

పురాణ దంపతులగు ఉమాశంకరుల దాంపత్యజీవనము సుఖముగ అనేక యుగములు గడిచినపిమ్మట ఆ పుణ్యదంపతులకు ఆరు ముఖముల కుమార స్వామి జన్మించెను. ఆ కార్తికేయుడు దేవతలకు విరోధియగు - తారకాసురుని

వధించి వారి చిరవాంఛితము నెరవేర్చెను.

పార్వతీ పరమేశుల వివాహకథను చదివిననూ, వినిననూ, గానము చేసిననూ చిరంజీవులయి సకల సౌఖ్యములచే వర్ధిల్లగలరు.

## శివుడు పార్వతికి రామమహిమను గురించి ఉపదేశించుట

''ఓ భరద్వాజా! శివభక్తిలేనివారు స్వప్నమందైననూ రామచంద్రుని సంతోషపెట్టజాలరు. శివకేశవులకు భేదములేదని తెలిసినవాడవు కాబట్టి ప్రారంభమున నీకు ఆ కైలాసపతి కథ క్లుప్తముగ వివరించి చెప్పితిని. ఇక రఘుపతి రమణీయగాథ వినిపించెద; సావధానుడవై ఆలకింతువుగాక!'' అని యాజ్ఞవల్క్య మహర్షి భరద్వాజమునికి రామచరిత్ర చెప్ప నారంభించెను.

''సిద్ధ తపోధన జోగి జన
సుర కిన్నర ముని బృంద,
బసహి తహాఁ సుకృతీ
సకల సేవహి శివసుఖకంద.''

దేవతలు, సిద్ధులు, యోగులు, మునులు, కిన్నరులు నిత్యము సేవించుచుండ ఆనందధాముడగు విశ్వనాథుడు కైలాసగిరిపై నివసించుచుండెను. కామారికి విముఖులైన వారు కలయందైనా కైలాసమున నివసించజాలరు. ఆ పర్వత ప్రదేశమున ఎల్లకాలములందు పచ్చగ నుండు మర్రిచెట్టొకటి కలదు. చల్లని ఆ వటవృక్ష చ్ఛాయలో విశ్వనాథుడు అప్పుడప్పుడు విశ్రమించు చుండునని వేదములు చెప్పుచున్నవి.

ఒకనాటి సమయమున చంద్రమౌళి వియద్గంగ - విదియ చంద్రుడు జటాజూటమున శోభించుచుండ, శరత్కాల చంద్రుని ధిక్కరించు ముఖ కాంతితో వ్యాఘ్రాజినముపై విశ్రమించియుండెను. ఆ రమణీయప్రదేశము హరుని హృదయమునకు ఆహ్లాదము గొల్పుచుండెను. ఇదియే మంచితరుణ

మని భావించి జగన్మాత పార్వతి చంద్రమౌళి చెంతజేరి మృదుమధుర వాక్కుల పరమేశు నిట్లు ప్రశ్నించెను-

"ఓ జగదీశా! సర్వజ్ఞుడవగు నీవు నన్ను కరుణించి, లోకోత్తర పురుషు డగు శ్రీరాముని లీలా రహస్యములను వెల్లడించి, నా అజ్ఞానమును పోగొట్ట వలసినదిగా ప్రార్థించుచున్నాను.

స్వామీ! ముందు జన్మలో నే నొకప్పుడు శ్రీరాముని దివ్య ప్రభావమును దర్శించియుంటిని. కానీ అతని చర్యలకు మహిమకుగల వ్యత్యాసము నేటికినీ గ్రహింపలేకున్నాను. వేదములయందు వర్ణించబడిన రాముడు, సాకేతరాముడు ఒకరేనా! ఒకరే యైనచో భగవంతుడు భార్యావియోగ దుఃఖముచే అట్లు ఎందుకు పరితాప మొందును?

నాథా! నిర్గుణ బ్రహ్మ సగుణరూపముతో అవతరించుటకు కారణమేమి? అట్లు అవతారమెత్తిన ప్రభువు బాల్యమును, వివాహాదులను విస్తరముగ వినగో రుచున్నాను. తదుపరి వారు వనవాసమెందుకు చేయవలసి వచ్చెను? రావణ సంహారమెట్లు జరిగెను? పట్టాభిషేకము పిమ్మట స్వామి సాకేతవాసులతో కలసి చేసిన వైకుంఠయాత్ర మున్నగు లీలలను, భక్తి జ్ఞాన వైరాగ్య సమన్వితమగు రామకథా తత్త్వ ప్రభావమును వివరముగా బోధించి నన్ననుగ్రహింప వేడుచు న్నాను." అని ప్రసన్నవదనయైన పార్వతి పరమేశుని ప్రార్థించెను.

రామకథాశ్రవణ కుతూహల యగు పార్వతి ప్రశ్న ఆలకించి హరుని హృద యము హర్షితమయ్యెను. తత్క్షణమే త్రుటికాలములోపల రాముని దివ్యచరిత్రం తయూ కామారి కన్నులకు గోచరమయ్యెను. రామకథాస్మరణచే పశుపతి శరీ రము పరమానందముచే పులకరించిపోయెను. అంతట నిమీలితనేత్రుడై రాముని కొద్దిసేపు ధ్యానించినపిమ్మట పరమేశుడు పవిత్రమగు రామకథను పార్వతి కిట్లు చెప్ప నారంభించెను.

"ఓ అపర్ణా! లోకోపకారార్థమై నీవు మంచి ప్రశ్న వేసితివి. గంగవంటి పవిత్రమగు రామకథను వినదలచిన నీవు ధన్యురాలవు. దేవీ! రామమాహాత్మ్యముగురించి నీకింకనూ సందేహము తీరనట్లున్నది. ఇచ్చట

నీకొక్క విషయము స్పష్టము చేయదలచుచున్నాను. ఇది యేమన - చక్కగ గ్రహించినతర్వాతనే ఇది సర్పము కాదు, త్రాడు - అన్న సంగతి విదిత మగును. అవ్విధముగ ఆత్మజ్ఞానము పొందినపిమ్మట శంకా సందేహము లన్నియూ వాటంతటవే వైదొలగిపోగలవు. వేదములో వర్ణించబడిన రాముడు - దశరథరాముడు ఒకరేనాయని విచికిత్సకు లోనైతివి. శ్రుతులకు, యతు లకు, ఆత్మజ్ఞానమునకు దూరులగు అజ్ఞానులు మాత్రమే యిట్లు శంకించె దరు. సత్యాసత్యములు చక్కగ తెలిసిన విజ్ఞు లివ్విధముగ వూహించజాలరు.

''భవానీ! పరమాత్ముని సగుణ నిర్గుణ రూపములకు భేదములేదు. రూప నామ క్రియారహితుడైన పరబ్రహ్మ తన భక్తుల ప్రీత్యర్థము అవతారము ధరించుచున్నాడు. అతి శీతలముచే జలము ఘనీభవించి మంచుగడ్డగా మారు చున్నట్లు సూక్ష్మమగు పరమతత్త్వము ఒక్కొండు స్థూలరూపమును పొందుచుం డును. అందుచే శుద్ధజ్ఞాన స్వరూపమగు ఆ పరమతత్త్వము మాయామోహ ద్వంద్వములకు అతీతమైనదిగా భావించవలెను. కావున, సచ్చిదానంద స్వరూ పుడగు శ్రీరాముడు మాయామోహములకు అతీతుడైన జ్ఞానస్వరూపుడేగాని వేరొండు కాదు.

కేవలము జ్ఞానస్వరూపమగు ఆ పరమాత్మ తత్త్వమే ఈ జగత్ సృష్టికి మూలకారణము. దానికి కన్నులు, చెవులు, ముక్కు, నాలుక పాదములు లేకున్ననూ అది చూడగలదు, వినగలదు, అఘ్రాణించగలదు. దాని మహిమ సూక్ష్మము, దాని వ్యాపారములు లౌకికములు.

ఆ పరమాత్మయే దశరథరాముడై అవతరించెను. సర్వాంతర్యామి, చరా చరములకు నాథుడగు ఆ శ్రీరామచంద్రుడే నాకు ఆరాధ్యుడు. అట్టి మహాత్మునిగురించి నీవు శంకించడము విచారకరము.

''పార్వతీ! మానస సరోవరమువంటి పవిత్రమగు రామకథను మొదట పక్షిరాజు గరుత్మంతుడు కాకభుశుండి వద్ద వినియుండెను. దానినే నీకు వివ రించి చెప్పుచున్నాను. సావధానచిత్తవై ఆలకించవలసినది'' అని బోధించి పరమశివుడు జగన్మాతకు రామకథాక్రమం బిట్లు వర్ణించి చెప్పెను.

''గో- భూ - దేవ - బ్రాహ్మణులకు దుర్జనుల వలన బాధ

లెక్కువైనప్పుడు, ధర్మము నశించి అధర్మము మిక్కుటమై పాపములు పెరిగి నవుడు భగవంతుడు భూభార నివారణార్థమై అవతరించుననుట విదితమే కదా? రామావతారమునకు ఇదియే ముఖ్య హేతువు. కానీ శ్రీరాముని జనన మున కనేక యితర కారణములు కూడా కలవు. అందులో ఒకటి రెండు జన్మ లను గురించి విశదీకరించెదను.

## రామావతారమునకు కారణములు

''జయ విజయులని ఇద్దరు ద్వారపాలకులు వైకుంఠమునం దుండిరి. వారు శ్రీమన్నారాయణమూర్తికి అత్యంత ప్రియ పాత్రులు. సనకసనందనాదుల శాపముచే వారిద్దరు దైత్యవంశమున హిరణ్యాక్ష హిరణ్యకశిపులై జన్మించిరి. వారిరువురు అజేయులై వేల్పులను వేధించుచుండ భగవంతుడు వరాహ నృసిం హావతారములెత్తి వారిని సంహరించెను. భగవంతుని చేతిలో పంచత్వ మబ్బి నమా మూడు జన్మలవరకూ రాక్షసులుగా పుట్టుదురని మునులు శపిం చియున్నందున వారికి ముక్తి కలుగలేదు. అందుచే తిరిగి వారు రావణ కుంభకర్ణులై జన్మించిరి. వారికొరకై హరి పునఃభూమిపై అవతరింపవలసివ చ్చెను. ఆ కల్పమున అదితి కశ్యపులు కౌసల్యాదశరథులుగా జన్మించిరి. వారి గర్భమున రాముడై అవతరించి దేవుడు లోకరక్షణ చేసెను.

''మరొక కల్పమున జలంధరుడను రాక్షసుడు దోర్బలుడై దేవతల రాజ్యము హరించెను. శైలజా! ఆ జలంధరుని నేనుకూడ ఓడించలేక యుంటిని. ఆ దైత్యుని అర్థాంగి మహా పతివ్రత యగుటచే వానికి చావు లేకుండెను. అప్పుడు గత్యంతరము లేక హరి తన మాయోపాయముచే ఆమె పాతివ్రత్యమును భంగపరచి వాని మరణమునకు తోడ్పడెను. ఈ సంగతి తెలుసుకున్న పిదట అతని భార్య భగవంతుని మానవశరీరము ధరించి భార్య వియోగ మనుభవింపుమని శపించెను. ఆమె శాపము కూడ రామావతారమునకు కారణమయ్యెను. ఆ జలంధరుడే రావణుడుగా అవతరించెను.

# నారదుని శాపము

''పార్వతీ! అదియేగాక నారదుని శాపము వలన కూడా భగవంతుడు అవతారము దాల్చవలసి వచ్చెను.''

అని శివుడు చెప్పగా విని శాంకరి ఆశ్చర్యపడెను.''విష్ణుభక్తుడగు నారదుడు పరమజ్ఞాని గదా! అతడెట్లు దేవునిశపించె''నని భవాని శంకించుట జూచి భవుడిట్లు నుడివెను.

''ఉమా! జ్ఞానులు సైతము భగవన్మాయకు లోబడి అతని ఇచ్ఛానుసారము వర్తించుచుందురు. అందుల కుదాహరణగా నారదుడెట్లు వివేకము కోల్పోయినది వివరించుచున్నాను వినుము.

హిమవత్పర్వత ప్రాంతమందు గంగానదియొడ్డున ఒక ఋష్యాశ్రమముండెను. ఒకప్పుడు నారదుడు దాని రమణీయతకు ముగ్ధుడై లోకసంచారము చాలించి, అచటనే భగవద్ధ్యానము చేయుచుండెను. సురమౌని తపస్సుకు భయపడి ఇంద్రుడు నారదునిదీక్ష భంగపరచి రావలసినదని మన్మథుని పంపెను.

అంతట కాముడు రంభాద్యప్సరసలను, వసంతాది అనుచర బృందమును వెంట నిడుకొనివచ్చి నారదుని మనసు చలింపజేయుట కెంతయో ప్రయత్నించి చూచెను. కాని నిష్ఠానిమగ్నుడగు నారదుడు అనంగుని ఆకర్షణకు లోనుగాక నిశ్చలుడై యుండెను. అంతట మనోభవుడు తన పరాజయము స్వీకరించి, నారదుని వద్ద క్షమాభిక్ష వేడుకొని దేవలోకమునకు తిరోగమించెను.

ఒకప్పుడు త్రిలోకసంచారి నారదుడు కైలాసమునకేగియుండి అచట శంకరునితో నేను కాముని పరాభవించితినని ప్రగల్భము లాడెను. శివుడది విని ''నారదా! నాతో ప్రస్తావించినట్లు ఈ విషయము నారాయణునితోమాత్రము చెప్పకుము. దీనిని గోప్యముగా నుంచుకొనుట శ్రేయస్కరము'' అని హితవొసంగెను.

హరుని హితోక్తులు నారదుని చెవి కెక్కలేదు. అతడు క్షీరసాగరమందు శయనించియున్న శ్రీమన్నారాయణుని దర్శించి అతనితో భావజుని పరాభవించితినని గర్వోక్తులాడెను. భగవంతుడు నారదుని నిగ్రహశక్తిని ప్రశంసించి అప్పటికి అతనిని పంపివేసెను. నారదుడక్కడనుండి పోయినవెంటనే నారాయణమూర్తి మాయానటిని పిలిచి నారదుని అహంకారమునకు తగిన శాస్తి జేసి రమ్మని ఆదేశించి పంపెను.

వెంటనే మాయానటి నారదుడు పోవుచున్న మార్గములో ఒక సుందరమైన నగరమును సృజించెను. సకలవైభవములచే ఆ నగరము భూలోక వైకుంఠమువలె భాసించెను. ఆ పట్టణపు రాజుపేరు శీలనిధి. శీలనిధి కుమార్తె విశ్వమోహినికి స్వయంవరము జరుగుచుండెను.

జగన్మోహనకరమైన ఆ స్వయంవరోత్సవము చూడదలచి నారదుడు రాజభవనమునకు వెళ్ళెను. శీలనిధి మునివరునికి స్వాగత సత్కారము చేసి తన కన్యకను రావించి పరిచయము చేసెను. విశ్వమోహిని రూప లావణ్యములకు మునీశ్వరుని కన్నులు మిరుమిట్లు గొలిపెను. ఆ చిన్నదాని చక్కదనము చూచిన నారదుని నిగ్రహము నీరై మోహాధీనమయ్యెను. ఎట్లయిననూ ఆ మోహనాంగిని వివాహమాడి తరించవలెనని మునివరునిమనస్సు కొటకొటలాడెను. తుదకు నారదుడు ఆ మచ్చకంటి చక్కదనమునకు చిక్కుపడి ఆమెను వివాహమాడుటకు కృతనిశ్చయు డాయెను.

నారదుడు పరిపరివిధముల ఆలోచించసాగెను. స్వయంవరమునకు ముహూర్తము సమీపించుచుండెను. జప తపములుచే కార్యము సాధించుటకు వ్యవధి లేదు. బైరాగి వేషముతో స్వయంవరమునకు వెళ్ళిన ఫలితము లభింపదు. ఆ తొందరలో నారదునికి ఏమి చేయుటకు దిక్కు తోచలేదు.

భగవంతు డొక్కడే ఇట్టి విపత్సమయములో వన్నాదుకొనగలడని యోచించి తుదకు నారదుడు నారాయణుని స్మరించెను. అతడు తంబుర మీటినదే తడవుగా నారాయణుడు మునిముందర వచ్చి నిలబడెను. నారదుడంతట కేలు గీలించి, శిరము వంచి, దీనవదనుడై స్వామిని సంబోధించి "ప్రభూ! నేను విశ్వమోహినిని మోహించితిని. ఆ చిగురు బోడిని చేపట్టి సుఖిం

పకున్న నా జప తపము లన్నియూ వ్యర్థమగును. కాబట్టి ప్రస్తుతము నే నా చిన్నదాని కన్నులకు మన్మథునివలె కన్పడవలెను. ఆమె నా రూపుకు ముగ్ధురాలై నా మెడలో వరమాల వేసి నన్ను వరించవలెను. అందుకుగాను స్వయంవర సమయములో నీ రూపు నాకు ప్రసాదించి నాకు సహాయపడవలెను'' అని విధేయుడై వేడుకొనెను.

''ఆహా! నారదమునులవారు బహుచక్కగా మాయకు లోబడియున్నారు'' అని తలంచి ముసిముసిగా నవ్వుకొనుచు ''నారదా! నీకు మేలు కలుగుగాక'' యని దీవించి హరి అంతర్ధానమైపోయెను.

ఆమీదట నారదుడు సంతోషముతో పరుగులిడుచూ స్వయంవర మంటపములోనికి ప్రవేశించి రాజకుమారుల మధ్య ఠీవిగా కూర్చొనెను. విశ్వమోహిని నన్నే వరించగలదని ధీమాతో ఉండెను. కానీ భగవంతుని లీలలు అతని కవగతము కాలేదు.

దేవుని మాయచే నారదుడు రాజన్యుల కన్నులకు మునివలెను, రాజకుమార్తె చూపులకు కోతివలెను, తనదృష్టి కతడు విష్ణువువలెను కన్పట్ట సాగెను. అజ్ఞానవశుడై అతడు తనవంటి చక్కనివానిని విశ్వమోహిని తప్పక వరించగలదని ఉప్పొంగుచుండెను.

శివుని అనుచరులిద్దరు ఆ సభకు బ్రాహ్మణవేషమున వచ్చియుండిరి. వారికి మాత్రం నారదుని లోగుట్టు తెలిసియుండెను. వారిద్దరు 'ఆహా! నారదులవారి 'హరి' రూప మెంత అందముగా నున్న'దని పరిహాసోక్తు లాడుకొనుచుండిరి.

రాజకన్య విశ్వమోహిని వరమాల చేబట్టుకొని రాజసభలోనికి వచ్చెను. ఆమె నారదునివైపు కన్నెత్తి కూడ చూడలేదు. ఆ వచ్చిన వారి మధ్య ఒక రాజకుమారుని రూపుతో వచ్చి ఒక ప్రక్కగా కూర్చొనియున్న శ్రీమన్నారాయణుని గళసీమను ఆమె తన వరమాలచే అలంకరింపజేసెను. తత్క్షణమే అందరు చూచుచుండ నారాయణుడు విశ్వమోహినిని తనవెంటబెట్టుకొని అచటనుండి వెడలిపోయెను.

బ్రాహ్మణ వేషములోనున్న శివుని సేవకు లిద్దరు నారదునివైపు జూచి పక పక నవ్వుమా 'నారదస్వామీ! నీ ముఖము కాస్త అద్దములో చూచుకొనుము' అని ఎగతాళి చేసి అక్కడ నుండి కాలికి బుద్ధిచెప్పిరి. నారదుడు తన ముఖమును జలములో చూచుకొని ఖిన్నుడయ్యెను. తనను పరిహసించి పరుగెత్తిపోయిన శివ సేవకులను తూలనాడి, వారిని రాక్షసులుగా పుట్టుదురుగాక! యని శపించెను.

తనకు జరిగిన పరాభవమునకు మునీశ్వరుడు ఉగ్రుడై మండిపడుచు పరుగెత్తిపోయి శ్రీమన్నారాయణుని సమీపించి అతని నిట్లు తూలనాడెను - "ఓ దేవుడా! నీవు పట్టి మోసగాడవు, ఈర్ష్యాపరుడవు, స్వార్థచింత గలవాడవు. సముద్రము మథించినపుడే నీ మోసము ప్రపంచమునకు తెలిసిపోయెను. పాపమాశివునికి విషమిప్పించి, లక్ష్మిని, కౌస్తుభము మున్నగు మంచిమంచి వస్తువులను కాజేసితివి, నీవంటి కుటిల, కుటిలుడు మరొక్కడు లేడు. ఈనాడు నా కన్నుల్లోగూడ కారము జల్లి విశ్వమోహినిని హరించితివి. ఇదిగో! యే రాజకుమారుని వేషముతో నన్ను వంచించితివో ఆ రూపముతో నీవు భూలోకమున పుట్టుము, నాకు విశ్వమోహిని లభించకుండునట్లు చేసినందులకు నీవు సైతం భార్యావియోగ మనుభవింతువుగాక! నాకు కోతిరూప మిచ్చి పరాభవించినందులకు తుదకా కోతులనే నీవు ఆశ్రయించెదవుగాక!" అని సురమౌని కోపముతో శపించెను.

నారదుని ఆగ్రహావేశము చూచి నారాయణుడు చిన్నగ మందహాసము చేసెను. హరిదరహాస వదనము తిలకించగనే ఇంతవరకు మౌనిని ఆవరించి యున్న మాయ తొలగిపోయెను. మాయావశుడై మూఢునివలె భగవంతుని దూషించినందుకు నారదుడు పశ్చాత్తాపముజెంది హరిపాదములపై బడి ప్రాయశ్చిత్త మిప్పింపుమని ప్రాధేయపడెను.

హరి దయార్ద్రహృదయుడై నారదుని అవలోకించి ఇట్లనెను- "మునివరా! అంతయూ నా సంకల్పానుసారమే జరిగినది. ఇందుకు నీవు చింతించపని లేదు. నీ మేలుకొరకే ఇట్లు జరుగవలెనని నేను కోరియుంటిని. నీవు సదాశివుని నూటొక్కసారు జపించుము. అదియే నీకు మనశ్శాంతి

ప్రసాదించగలదు. ఎవనికి శంకరునిదయ లభించునో వానికి నేను వశ్యుడనని విశ్వసించుము'' అని ఆశ్వాసించి నారాయణుడు రాజకుమారుని రూపము వీడి నిజరూపము బొందెను.

ఇవ్విధముగ నారాయణుడు నరుడుగా అవతరించుటకు, నా సేవకులిద్దరు రావణ కుంభకర్ణులై పుట్టుటకు నారదుని శాపము కూడ కారణమయ్యెనని శర్వుడు శర్వాణికి విశదీకరించెను.

## మనుచరిత్ర

స్వాయంభవమనువు అతని భార్య శతరూప మానవ జాతికి మూలపురుషులు. వారికి ఉత్తానపాదుడు ప్రియవ్రతుడని ఇరువురు కుమారులు. దేవహూతియను కుమార్తె ఒకతె ఉండెను. దేవహూతికి కర్దమునికి జనించినవాడే కపిలుడు. అతడు సాంఖ్యశాస్త్రమును రచించి లోక ప్రసిద్ధి నొందెను.

వృద్ధాప్యము సమీపించగానే పెద్దకుమారుని రాజ్యాభిషిక్తునిజేసి శతరూపా స్వాయంభువులు తపస్సుకై నైమిశారణ్య ప్రాంతమందున్న గోమతీ తీర్థమునకు చనిరి.

ఆ వృద్ధ దంపతులు నిద్రాహారములు మాని, రేయింబవళ్ళనక, ద్వాదశాక్షరీ మంత్రము జపించుచూ కొన్నివేల సంవత్సరములు ఘోరతపస్సు చేసిరి. భక్త పరాధీనుడగు భగవంతుడు ఆ పుణ్యదంపతుల తపస్సుకు మెచ్చి వారలయెదుట సాక్షాత్కరించెను. స్వాయంభువు, శతరూప దేవదేవుని దివ్యమంగళ స్వరూపమును తనివితీర చూచుచుండిరి. ఆ జగన్మోహనుని దివ్యరూపమును ఎంత చూచిననూ వారి తృషిత నేత్రములకు తృప్తి లేకుండెను.

బాలసూర్యప్రభాసన్నిభమగు మణిమయ మకుటము, కర్ణకుండలములు, ఉరమున వరమాల, నీలనీరద శరీరకాంతి, పీతాంబరధారియై వామభాగమున మహాలక్ష్మి, హస్తద్వయమున శంఖచక్రగదా పద్మములు శోభిల్లుచుండ, కోటి మన్మథుల ధిక్కరించు మనోజ్ఞ - మూర్తి శ్రీమన్నారాయణుని సుందరరూపమును ఆ దంపతులు తన్మయులై చూచిరి. తదుపరి వారు నేత్రముల ఆనంద బాష్పములు రాలుచుండ పులకిత శరీరులై శ్రీనివాసుని చరణ ద్వయముపై

ప్రాలి ఇట్లు ప్రార్థించిరి-

"ఓ భక్తకల్పద్రుమా! జగద్బాంధవా! కృపాసాగరా! తమ దివ్యదర్శనముచే మా తపస్సు ఫలించి జన్మ తరించెను. ఓ దీనబంధూ! మా కొక కోరిక కలదు. చెప్పుటకు నోరాడకున్నది. అయినను నిజము దాచలేకున్నాము. అది యేమన - మాకు తమవంటి కుమారుడు ఒకడు కలుగవలెనని మిక్కిలి మక్కువగా నున్నది. మా మనవి మన్నించి మా మక్కువ తీర్చవలసినది" అని వారు వేడుకొనిరి.

భగవంతుడు వారి నిండుహృదయమునకు కడుంగడు సంతసించి-

"మహాత్ములారా! అటువలనే మీ కోరిక సిద్ధించగలదు. ప్రస్తుతము మీరు ఇంద్రపురికి వెళ్ళి అక్కడ కొద్దికాలము సుఖింపుడు. కాలాంతరమున అయోధ్యలో నేనే మీ గర్భమున అవతరించెదను" అని వారిని అనుగ్రహించెను.

"భరద్వాజా! ఇవ్విధముగ భవుడు భవానికి చెప్పిన కథా వృత్తాంతము నీకెరిగించితిని. రామావతారమునకుగల మరొక కారణముగూడ విశదీకరించెద శ్రద్ధాళుడవై ఆకర్ణించవలసిన"దని యాజ్ఞవల్క్యుడు వచించెను.

## ప్రతాపభానుని కథ

"కేకయదేశాధీశుడగు సత్యకేతునకు ప్రతాపభానుడు, అరిమర్దనుడను ఇర్వురు పుత్రులుండిరి. జ్యేష్ఠుడగుప్రతాపభానునికి పట్టముగట్టి సత్యకేతుడు తపమునకై వనములకు వెళ్ళెను. గుణధాముడగు అరిమర్దనుడు అన్నకు అన్ని విధముల సహాయపడుచుండెను. రాజనీతి విశారదుడగు మంత్రి ధర్మరుచి వారికి మంత్రాంగము చేయుచుండెను. ప్రతాపభానుడు దిగ్విజయముచేసి ఏకచ్ఛత్రాధిపత్యము వహించి రాజ్యమేలెను.

ఒకదినము ప్రతాపభూపతి అశ్వారూఢుడై వేట నిమిత్తము వింధ్యాటవికి వెళ్ళెను. అట్లు వనాంతరమున వివిధ మృగములను వేటాడుచున్న నృపతి ఒక చోట పెద్దపందిని చూచి దానిని చంపుటకు ఉద్యమించెను. గుర్రపుడెక్కల ధ్వని విని ఆ వరాహము వ్రేటుతప్పించుకొని అడవినబడి పరుగుతీసెను. ఆ

పంది నెట్లయినా సాధించవలెనని రాజు దానిని వెంబడించెను. తుదకా వరాహము గొప్ప కీకారణ్యప్రాంతము ప్రవేశించి అచ్చట ఒక్క కొండగుహలో దూరి అదృశ్యమయ్యెను.

దూరాగతుడైన రాజు అప్పటికే అలసిపోయి, దాహముగొని, దారితప్పి యుండెను. మార్గముదప్పి, ఏకాకియై అడవిలో దిక్కు తెలియక ఇటూ అటూ తిరుగుచున్న ప్రతాపభానునికి అక్కడ ఒక ఋష్యాశ్రమ ముండుట గోచరించెను. 'బ్రతుకు జీవుడా! ఇక్క డెవ్వరో మహాత్ములు నివసించుచున్న ట్లున్నది!' అని సంతోషముతో రాజు ఆశ్రమములోనికి పోయెను.

ఇంతకుపూర్వము ప్రతాపభానుడు దిగ్విజయయాత్ర సాగించినపుడు అతని చేతిలో ఓడిపోయి రాజ్యము పోగొట్టుకున్న ఒకానొక రాజు కపటముని వేషముతో అక్కడ ఆశ్రమములో కాలము గడుపుచుండెను. ఆ కుహనాముని ప్రతాపభానుని గుర్తుపట్టెను. అయితే ప్రతాపునికి మాత్రం అతడు ప్రచ్ఛన్న వేషములో నున్న శత్రురాజనుసంగతి తెలియరాకుండెను.

ముని ప్రతాపభానుని అత్యాదరముతో లోనికి ఆహ్వానించి, చల్లని పానీయాదులతో సత్కరించి, తియ్యని పలుకులతో "అయ్యా! మీరెవరో మహారాజువలె కన్పట్టుచున్నారు. ఇప్పటికే చీకటిపడి రాత్రికావచ్చినది. ఈ కారడవిలో రాత్రిపూట ప్రయాణించుట అపాయకరము. పూర్తిగా అలసియున్న ట్లున్న మీరు రాత్రికి మా యాశ్రమములో విశ్రమించి ఉదయముననే మీ నిజ నివాసమునకు పయనము కావచ్చును." అని అభ్యర్థించెను.

రాజు మునిసత్కారమునకు ముగ్ధుడై "మహాత్మా! నేను ప్రతాపభాను భూమీశుని మంత్రిని. వేటకై వచ్చి దారితప్పి అలసితిని." అని రాజు తన నిజనామమును మరుగుపరచి మాట్లాడెను.

రాత్రి చాల సేపువరకు వారిద్దరిమధ్య సంభాషణ జరిగెను. మాటల సందర్భమున కపటయోగి రాజుతో - యోగదృష్టిచే సర్వము గ్రహించితి ననియూ, నీవుకేకయదేశాధీశునివైన ప్రతాపభానుడవనియు విశదీకరించెను.

సత్కారము, సంభాషణసరళి, మాటలతీరు మున్నగునవిచూచి ప్రతాపునికి

మునిపై శ్రద్ధాభక్తికలిగెను. ఇతడెవరో అసామాన్యుడైన సిద్ధపురుషుడుగా ఉండు నని రాజు విశ్వసించెను.

అంతట రాజు దొంగసాధువు యెదుట ముకుళితహస్తుడై - ''మహాత్మా! మీ రెవరో మహాపురుషులుగా నాకు తోచుచున్నది. స్వామీ! నాపై కరుణించి నేను అజేయుడనై నూరు కల్పములవరకు యావత్ప్రపంచమును యేలునట్లు నాకు వరమిచ్చి కృతార్థుని చేయవలసినది.'' అని అర్థించెను.

ప్రతాపుడు తన మాయకు లోబడెనని గ్రహించి సాధువేషధారియగు శత్రువా జిట్లనెను-

''రాజా! ఈముల్లోకములలో నాకు దుర్లభమైనదేదియూ లేదు. నీవు నా దాసుడవనినమ్మి నీకోరిక సిద్ధించునట్లు వరమిచ్చుచున్నాను. ఇది అత్యంత రహ స్యముగాబట్టి ఈ సంగతి ఇతరులకు తెలిసిన హానికరము. రాజా! ఇందులో నీవు ఇంకొక్క విషయము గుర్తుంచుకొనవలసి యున్నది. అది యేమన - ఒక్క బ్రాహ్మణశక్తితప్ప ఆ హరిహర బ్రహ్మాదులుగూడ నావరము నిష్ఫలము చేయజాలరు. కాబట్టి నీవు ఈనాటి నుండి భూసురోత్తముల కోపమునకు గురికాకుండా మెలగవలసియుండును.'' అని సెలవిచ్చెను.

భూపాలుడు మునివిధించిన తుదినియమమున కత్యంత వికలుడై ఇట్లు ప్రాధేయపడెను - ''స్వామీ! మీరనుగ్రహించి వరప్రదానము చేసినందుకు నే నత్యంత కృతజ్ఞుడను. కాని మీరు నుడివినట్లు బ్రాహ్మణులను యెంతకాలమని ప్రసన్నులను చేయగలనా యను సందేహము నన్ను కలతబెట్టుచున్నది. ఇందు కేదైనా ఉపాయమున్న తమరే సెలవిచ్చి నన్నుద్ధరించవలసినది.''

''రాజా! అందుకు మార్గాంతరము లేకపోలేదు. నే చెప్పినట్లు చేసిన యెడల భూసురులు నీయెడల సర్వదా సుముఖులై యుండగలరు. నేను మీ ఇంటనుండి వంటలు చేసెదను. నాచే వండినవంటకములు తినినయెడల బ్రాహ్మణులు మీ కవశ్యము వశ్యులగుదురు. అయితే నేను ప్రకటముగ రావ నగరునకు వచ్చియుండుటకు వలనుపడదు. ఇందుకు సైతమొక ఉపాయము ఆలోచించితిని. నేను నా తపో బలముచే మీ పురోహితుని బంధించి తెచ్చి

ఇక్కడ ఉంచెదను. నేను అతని వేషముతోవచ్చి మీ ఇంట ఒక సంవత్సర కాలముండగలను. మీరు నిత్యము బ్రాహ్మణ సంతర్పణ చేయుచుండవలసి నది.'' అని దొంగసాధువు చెప్పగా విని రాజు సంతోషించి అతనిని పలువిధ ముల ప్రస్తుతించెను. ఆపైన ముని రాజు నవలోకించి, ''రాజా! అర్ధరాత్రి కావ చ్చుచున్నది. ఇక నీవువెళ్ళి శయనించుము. రేపు ఉదయాత్పూర్వమే నిన్ను నీ గుఱ్ఱముతోసహా నాతపశ్శక్తిచే రాజనగరు చేర్పించెదను.'' అని చెప్పెను. అంతట రాజు మౌనికి ముమ్మారు సాష్టాంగపడి అతనివద్ద సెలవుపుచ్చుకొని వెళ్ళి పండు కొనెను. మేనువాల్చిన దేతడవుగా రాజుకు గాఢనిద్ర పట్టెను.

రాజుకు నిద్రపట్టగనే కాలకేతుడను రాక్షసుడు దొంగసాధువువద్దకు వచ్చెను. ఈ కాలకేతుడే పందివలె నటించి ప్రతాపభానుని ఇంతదూరము వచ్చునట్లు చేసి, పిమ్మట అదృశ్యుడై యుండినది.

ఈ కాలకేతునికి నూర్గురు పుత్రులు, పదిమంది సోదరులు ఉండిరి. వారు బలదర్పములతో కూడిన పరమ దుర్మార్గులు. ఆ దుష్టులు నిత్యము వేల్పులను వేధించుచున్నందున వారిని ప్రతాపభానుడు వధించియుండెను. ఆపైన కాలకేతుడు ప్రతాపభానునిపై పగతీర్చుకొనుటకై కపటమునితో చేతులు కలిపి కుట్రబన్నెను.

కపటముని సాకల్యముగా జరిగినందతయూ చెప్పగా విని కాలకేతు డిట్ల నెను. ''రాజా! ఆలస్యం అమృతం విషం. శత్రునాశనమునకు జాగుచేయుట మంచిది కాదు. శత్రువంశమును సులభముగా క్షయింపజేయుటకు నీవు పన్నిన పన్నాగము బాగుగనేయున్నది. అందుకింత దీర్ఘవ్యవధి కావలెనా! నేను నాల్గుదినములలో శత్రువును పట్టుపెట్టి వచ్చెదను. నీవు నిశ్చింతగా యుండుము. అంతయు నేను చూసుకొనెదను.''

అని చెప్పి కాలకేతుడు ప్రతాపభానుడు నిద్రించుచున్న చోటికి వచ్చెను. అతడు తనమాయాబలముచేనిద్రించుచున్న రాజును అతని గుఱ్ఱమును తీసు కుపోయి రాజాంతఃపురములో యెవరికి తెలియకుండునట్లు వదలిపెట్టెను. పిమ్మట రాజపురోహితుని దొంగిలించి అతనిస్థానములో కాలకేతుడే పురోహి తునివలె నటించసాగెను.

మరుదినము కపటముని సెలవిచ్చియుండిన ప్రకారము రాజు లక్షబ్రాహ్మణులకు సమారాధన చేయుటకై సర్వము సిద్ధము చేయించెను. వేళకు భూసురోత్తము లందరు భోజనమునకై పంక్తులుదీరి కూర్చుండిరి.

పురోహితుని ఆదేశప్రకారము వివిధ మాంసాదులతో వండిన వంటకము లన్నియూ వడ్డించబడెను. బ్రాహ్మణులు భుజించుటకు ప్రారంభించుచుండ, ఇంతలో కాలకేతుని పూర్వ సంకేతప్రకారము పైనుండి "ఓ భూసురులారా! ఆ పదార్థములు ముట్టుకోవలదు. మీకు వడ్డించబడిన ఫలహారాదులందు బ్రాహ్మణమాంసము కలుపబడియున్నది." అని ఆకాశవాణి వలె ధ్వనించెను.

ఈ మాటలు చెవినబడగనే తటాలున బ్రాహ్మణులు విస్తళ్ళువదలి, దిగ్గున పైకిలేచి, కోపోద్రిక్తులై రాజునుద్దేశించి-

"ఓరీ రాజాధమా! సతీ సుత బంధుసమేతముగ నీ వంశము ఒక్క సంవత్సరములోపున నిర్వంశమై రాక్షసకులమున ఉద్భవించుగాక!" అని దారుణముగ శపించిరి. ఇంతలో "రాజును శపించుట పొరబాటు, అతడు నిరపరాధి, మీరు పొరబడితిరి." అని నిజమైన ఆకాశవాణి పలికెను.

"ఇక గతించినదానికి వగచి లాభములేదు. బ్రాహ్మణశాపము బ్రహ్మకైనా అనుభవించి తీరవలసినదే." ఇక దానికి తిరుగులేదని విచారించుచూ బ్రాహ్మణులు ఎచ్చటివారచ్చటకు వెళ్ళిపోయిరి.

అనంతరము ధూర్తుడగు కపటముని ప్రతాపభానునికి సంబంధించిన విపత్తు వార్తను చిటికెలలో నలుదెసలకు తెలియజేసెను. నలువైపుల నుండీ శత్రురాజులు దండెత్తివచ్చి ప్రతాపభానుని నగరమును ఘోరముగ ముట్టడించిరి. ఆ యుద్ధములో ప్రతాపభానుని వంశమంతయూ నశించి అంతరించెను.

## రావణ వృత్తాంతము

"ఓభరద్వాజా! అట్లు బ్రాహ్మణ శాపవశంబున ప్రతాపభానుడు, అతని తమ్ముడు అరిమర్దనుడు, మంత్రి ధర్మరుచి కాలాంతరమున పులస్త్యబ్రహ్మ వంశంలో రావణ, కుంభకర్ణ, విభీషణులైపుట్టిరి. ప్రతాపభానుని పుత్రుడు, సేన

కులు, తదితర బంధువులు రాక్షసులుగా అవతరించిరి.

ఇరువది చేతులు, పది తలలుగలిగిన రావణుడు అతుల బలపరాక్రమముచే లోకభీకరుడుగా నుండెను. కొండంత శరీరముతో కుంభకర్ణుడు అరిభయంక రుడై కప్పట్టుచుండెను. వీరు పులస్త్యబ్రహ్మ వంశసంజాతులైనప్పటికీ బ్రాహ్మణ శాపము వలన తమోగుణప్రధానులై రాక్షసులుగా వర్తించిరి.

రావణ కుంభకర్ణ విభీషణులు ముగ్గురు అడవులకు పోయి వేలాది సంవత్సరములు ఘోరమైన తపస్సు చేసిరి.

బ్రహ్మాదిదేవతలు దుష్కరమైన వారి ఉగ్రతపస్సుకు ప్రసన్నులై వారిని సమీపించి వరము లడుగుమని కోరిరి. అంతట రావణుడు నర వానరులుతప్ప మరి యే ప్రాణిచేతను చావులేకుండునట్లు వరము ప్రసాదింపుమని పరమేష్ఠిని ప్రార్థించెను. సరస్వతీ ప్రేరణచే కుంభకర్ణుడు మతిదప్పి దీర్ఘనిద్ర కోరెను. విభీషణుడు పవినయమనస్కుడైతాపసమైత్రి, శ్రీపతిపై భక్తి అనుగ్రహించమని పద్మభవుని వేడెను. పార్వతీ! అప్పుడూ నేనూ, బ్రహ్మ ఆ ముగ్గురికి వారి వారి అభీష్టప్రకారము వరము లిచ్చి వచ్చితిమి.''

సముద్రముమధ్య త్రికూటపర్వతముపై అతిలోకసుందరమగు లంకాపట్టణ ముండెను. కోటిమంది కుబేరుని యక్షులు నిరంతర మాలంకను కాచుచుండిరి. వరగర్వితుడగు రావణుడు రాక్షససైన్యములతో దాడిచేసి లంకాపురిని ఆక్రమించెను. లంక శత్రు దుర్భేద్యమై యుండుట గమనించి దనుజాధికుడు దానిని తనకు రాజధానిగా చేసుకొనెను. ఆపైన రావణుడు మయుని కూతురు మండోదరిని వివాహమాడి తన తమ్ములకుకూడ పెండ్లిండ్లు చేసెను.

వరగర్వితుడు, బలదర్పితుడగు లంకేశుడు ఒకప్పుడు కుబేరునిపై దాడి వెడలి, అతని పుష్పకవిమానము లాక్కొనెను. మరొకప్పుడు అహంకారముతో వినోదార్థమై కైలాస గిరిని కదలించి తన భుజబలమును పరీక్షించుకొనెను.

ఇవ్విధముగ వరబలోద్ధతుడైన రావణుడు వీరవిహారము చేయుచూ అజేయు డయ్యెను. రావణుని రాజ్యము నిత్యము విస్తరించుకొనుచు, సుఖసంపదలతో దినదిన ప్రవర్ధమాన మగుచుండెను.

అరిభయంకరుడగు కుంభకర్ణుడు మహాబలశాలి. యుద్ధమున వాని నెదు ర్కొనగలిగిన యోధుడే లేడని చెప్పవచ్చు. కానీ త్రాగుట, తినుట, నిద్రించుట ఈ మూటియందు వానికి మమకార మెక్కువ. దశగ్రీవుని తనయుడు మేఘనాదుడు అమేయ ధైర్యసాహసములుగల ధీశాలి. విహారార్థము వానికి తరచు దేవతలపైకి దండెత్తిపోవుటయున్న సరదా. వీరుగాక కాలాంతకులైన అతికాయ, అకంపన, ధూమకేతు, వజ్రదంతుడాది దనుజవీరుల బలపరాక్రమములు వర్ణింప నలవికాదు. ఈ రాక్షసులందరు మాయోపాయులు, కామరూపులు, దయాదాక్షిణ్యము లెరుగని దుర్మదాంధులు.

## దనుజేశుని దుండగములు

వరోద్ధతి, దానికితోడు రాక్షసరాజ్యము ప్రాప్తించగనే దశకంధరుడు దురహంకారపూరితు డయ్యెను. ఒకనా డతడు నిండు పేరోలగమందు తనవారి కిట్లు ఉద్బోధించెను-

"ఓ రాక్షసవీరులారా! దేవతలు మనకు ఆగర్భ శత్రువులు. వారిని వేయివిధములు వేధించి బాధించి వధించుట మనకు విధ్యుక్తధర్మమైయున్నది. కానీ వారు మన చేతికందక కంటికి కనబడక తప్పించుక తిరుగుచున్నారు. వారిని నిర్జించుట బహుకష్టముగా నున్నది. కనుక మీరు నేటినుండీ నిర్ధయులై బ్రాహ్మణులుచేయు యజ్ఞములు, యాగాది క్రతువులు ఎక్కడికక్కడ నిర్దాక్షిణ్యముగ ధ్వంసము చేయవలసినది. దానివలన అమరులు అన్నాహారములు చిక్కక దుర్బలులై నీరసించి మనయెదుట బడెదరు. అపుడు మనము సురాధిపులను చంపుటో, సాధించుటో సుకరమగును." అని బోధించి దనుజాధిపుడు తన బలమును లోకములపై ఉసికొల్పెను. తదుపరి పంక్తికంధరుడు తన పుత్రుడగు మేఘనాదుని బిలిచి, వానిని నిర్జరులను నిర్జించిరమ్మని ఆజ్ఞాపించి పంపెను.

ఇద్విధముగ లోక విరావణుడగు రావణుడు దనుజయోధులను దివిజులపైకి బంపి తాను స్వయముగ గదబుచ్చుకొని విజిగీషుడై లోకములపై విరుచుకపడెను. అతిబలోద్ధతుడగు దశకంధరుని పదఘట్టనలకు భూమి కంపించెను. వాని ఘన గర్జనలకు దేవాంగనల గర్భస్థపిండములు జారిపడెను. వాని ధాకకు

ముల్లోకములు గడగడ లాడిపోయెను. దుర్ధర్షుడగు దశాస్యుని దౌర్జన్యమునకు వెరచి స్వర్లోకవాసులు పరుగులెత్తి మేరుపర్వత గుహలలోనికి వెళ్ళి దాక్కొనిరి.

విజయోత్సాహి దశగ్రీవుని దండయాత్ర దశదిశల నిరాటంకవముగ జరిగెను. వాని భయంకర హుంకారధ్వనికిదిక్కులు దద్దరిల్లెను. దిక్పాలురు ధృతిచెడి భయకంపితులై దిక్కుల కొక్కరు పరుగులెత్తిరి. అమరావతి, అలకా పురి మున్నగు దిక్పాలుర పట్టణములు ధ్వంసము చేయబడి నిర్మానుష్యములై పోయెను. భండనభీముడగు దశకంఠుని ఢీకొని నిర్జరులు నిర్వీర్యులైరి. యక్షులు పక్షులవలె పారిపోయిరి. కిన్నరుల పీచమడగెను. సిద్ధులు బద్ధులై బాధింపబడిరి. మునులు, బ్రాహ్మణులు నిస్తేజులై నింగికి చూడసాగిరి.

యుద్ధోన్మాది దశగ్రీవుడు విజయోత్సాహియై తన్నెదిరించు వీరునికై ముల్లో కములు గాలించెను. కానీ దుర్ధర్షుడు దశకంధరుని ధర్షించు యోధుడు ఒక్క డుకూడా లేకపోయెను. తన్నెదుర్కొను ధైర్యములేక భీరువులై పారిపోవుచున్న వేల్పుదొరలను వాడు ధిక్కరించి తూలనాడెను. అవక్రపరాక్రమోపేతుడగు రావ ణునిధాటికి దిక్చక్రమంతయు దాసోహమనెను. విశ్వములోని వివిధ ప్రాణికోటి వాని వీరత్వమునకు వశమయ్యెను. దేవ గరుడ గంధర్వ నాగాంగన లెందరినో బలాత్కరించి వారిని తన భార్యలుగా చేసుకొనెను. తండ్రి ఆజ్ఞప్రకారము మేఘనాదు డింతకుమునుపే దేవలోకముపై దాడివెడలి దేవతలను ధర్షించి దేవేం ద్రుని చెరబట్టెను. నిర్జరేశుడు నిర్జింపబడుట తెలుసుకొని పరమేష్ఠి పరుగెత్తు కొని వచ్చెను. బ్రహ్మ మేఘనాదుని కనేక వరములిచ్చి వేల్పుదొరను విడిపిం చెను. నాటినుండీ రావణపుత్రుడు మేఘనాదుడు ఇంద్రజిత్తుడను పేరుతో జగ ద్విఖ్యాతినొందెను.

భరద్వాజా! అసురేశుడు, వాని అనుచరబృందము చేసిన ఘోరకృత్యములు వర్ణింపశక్యముగాదు. పాపాత్ములు, మాయోపాయులైన దైత్యులు వీరవిహారము చేసి లోకత్రయము గగ్గోలు పరచిరి. గోదేవతా బ్రాహ్మణులు యమయాతన లకు లోనైరి. జపములు, తపములు వేదాధ్యయనములు, పూజలు సదాచార ములు మంటగలిసెను. ధర్మమునశించి అధర్మము ప్రబలెను. జారులు, జూద రులు స్వైరవిహారము చేయుచూ లోకమర్యాదలను మట్టుపెట్టసాగిరి.

# భూదేవి ఆక్రందన

దైత్యుల దౌష్ట్యములకు, వారి దుశ్చేష్టలకు ధరణీతల మంతయు తల్లడిల్లిపోయెను. 'పర్వతములు, సముద్రములు, వనములు, నదులు మున్నగువానికంటే ఒక్క పాపాత్ముడు భారముగదా! ఇంతమంది పాపాత్ములను నేనెట్లు భరింపగల'నని భూదేవి ఆక్రందించెను. లంకేశుని భయముచే భూదేవి గోవ్యముగా గోరూపమెత్తి దేవతలున్నచోటికి వెళ్ళెను. నిస్సహాయులగు నిర్జరులు ఋషులు భూదేవిని వెంటబెట్టుకొని బ్రహ్మవద్దకు వచ్చిరి. భూదేవి పరమేష్ఠికి తనబాధలు వర్ణించి చెప్పి వలవల యేడ్చెను. పద్మభవుడు వారి ఆర్తుల నాలకించి, విచార్పురమున వారికి తన అసమర్థతను తెలియజేసెను. తరువరి, 'ఆ శ్రీహరిని స్మరింపుడు, అతడొక్కడే మీ బాధలను నివారింపగల సమర్థుడు' అని సలహా ఇచ్చెను.

అపుడు అమరాదులు విష్ణువు వైకుంఠమునందున్నాడో లేక క్షీరసాగరమందున్నాడో యని తమలో తాము తర్కించుకొనసాగిరి. పార్వతీ! అపుడు నేను వారికి శ్రీమన్నారాయణుడు సర్వవ్యాపకుడనీ, భక్తిచే భజించిన పరమాత్ముడు ప్రసన్నుడు కాగలడని బోధించితిని.

అంతట బ్రహ్మ ముకులిత హస్తుడై - "హే ఆర్తత్రాణ పరాయణా! అవాఙ్మనసగోచరా! భక్త కల్పద్రుమా! రాక్షసాంతకా! సురనాయకా! సచ్చిదానందా! ఓ కృపానిధీ! జగద్బాంధవా! నీవు సృజించిన లోకములకు భయము కలిగినపుడు నీవే దానిని నివారించగలవు. ఓ జగన్నాథా! త్రింశత్కోటి దేవతలు, వసుంధర, మునులు, సిద్ధులు, భయాతురులై రక్షింపుమని నిన్ను వేడుచున్నారు. కరుణించి లోకములను కాపాడుదేవా!" యని వైకుంఠవాసుని స్తుతించెను. వారి దీనాలాపములకు దైవహృదయము ద్రవించిపోయెను. అప్పుడు వేల్పులకు వినబడునట్లు అంతరిక్షమునుండి భగవద్వాణి ఇట్లు వినవచ్చెను-

"ఓ బ్రహ్మ మహేశాది వేల్పులారా! మీరు భయపడకుడు. త్వరలోనే మీకువాటిల్లిన ఇక్కట్టులు తొలగిపోగలవు. నా వరప్రభావమున ఇప్పటికే అయో

ధ్యలో అదితి కశ్యపులు కౌసల్యా దశరథులుగా అవతరించి యున్నారు. నారదుని వచనముల ప్రకారము నేను వారి గర్భమున మానవునిగా జన్మింతును. నా సర్వాంశములతో రఘుకులమున జన్మించి భూభారమును హరించెద. మీరు మీ నిజనివాసములకు పోయి నిర్భయులై యుండుడు.''

దేవవాణి దివ్యసందేశము విని భూదేవి బ్రహ్మాది దేవతలు పరమానంద భరితులైరి. అంతట నలువ నాకవాసులనుద్దేశించి – మీరు వెంటనే భూలోకమున వానరులై పుట్టవలసినదని సూచించెను. అనంతరము సర్వులు సంతోషముతో తమతమ నివాసములకు చనిరి. దేవతలు పరమేష్ఠి సూచన కనుగుణ్యముగ భూలోకమున వానరులై పుట్టి స్వామి రాకకై నిరీక్షించుచుండిరి.

భరద్వాజా! రామావతారమునకుగల కారణములు ఇంతవరకు పేర్కొంటిని. ఇక ముందు జరగబోవు కథ చెప్పబోవుచున్నాను సావధాన మనస్కుడవై ఆకర్ణించ వలసినది- అని యాజ్ఞవల్క్యఋషి మిగత వృత్తాంతము చెప్ప నారంభించెను.

## శ్రీరామ జననము

సరయూతీరమునగల కోసలదేశమునకు అయోధ్య రాజధాని-

★ ''*అవధపురీ రఘుకుల మనిరావ్రూ*
*బేద బిదిత తెహి దశరథ నావ్రూ*
*ధర్మ ధురంధర గుననిధి గ్యానీ*
*హృదయ భగతి మతి సారంగ పానీ.''*

సకలగుణ సంపన్నుడు, ధర్మధురంధరుడు, జ్ఞానసంపన్నుడగు ఇక్ష్వాకువంశ రాజు దశరథుడు కోసలరాజ్యము నేలుచుండెను. దశరథునికి కౌసల్య, కైక, సుమిత్రయను ముగ్గురు భార్యలుండిరి. దశరథునికి బహుకాలమునుండీ సంతానప్రాప్తి లేనందున చింతాక్రాంతుడై యుండెను.

---

★ 'అయోధ్య'కు 'అవధ'యని వ్యవహారము – 'అవధేశు'డనగా అయోధ్యాధిపతి.

ఒకదినము నృపాలుడు తన కులగురువగు వసిష్ఠమహర్షిని దర్శించి తనకు సంతానప్రాప్తి కల్గుటకు మార్గోపాయము సూచింపుమని వేడుకొనెను. అందు మీదట వశిష్ఠుడు - రాజా విశ్వవిఖ్యాతులగు నల్వురు పుత్రులు నీకు పుట్ట గలరు, దుఃఖించకుమని-దశరథుని ఓదార్చి పంపెను.

ఇది జరిగిన కొద్దికాలమునకు వసిష్ఠమహర్షి ఋష్యశృంగుని రావించి, అతని ఆధ్వర్యమున పవిత్రమగు పుత్రకామేష్టి యజ్ఞము చేయించెను. ఆ హోమ గుండమునుండి అగ్నిదేవుడు ప్రత్యక్షమై రాజున కొక పాయసముంచిన పాత్ర ఇచ్చి - ''దశరథభూపాలా! వసిష్ఠుడు ఊహించిన ప్రకారము నీ కోరిక నెరవేరగలదు. నీవు పాయసమును నీ ముప్పురు భార్యలకు యథోచితముగ పంచిపెట్టుము.'' అని చెప్పి - వీతిహోత్రుడు అంతర్హితుడయ్యెను.

తదుపరి క్ష్మాపాలుడు ఒకానొక శుభముహూర్తమున శుచియై తన ముప్పురు పత్నులకు పాయాసాన్న మిచ్చెను.

రాజాపాయసమును రెండు భాగములుచేసి ఒక భాగమును పెద్దభార్య కౌసల్య కిచ్చెను. మిగిలిన భాగమును రెండుగ విభజించి ఒకభాగము కైక కిచ్చెను. శేషించిన పాయసమును మరల రెండు భాగములుచేసి ఒకదానిని కౌస ల్యకు, మరొకదానిని కైకకు ఇచ్చెను. వారా భాగములను తమ హస్తద్వయ ముతో స్పర్శించి సుమిత్ర కిచ్చిరి.

ముప్పురురాణులు పాయసము సేవించి తేజోవిలసితులై కాలక్రమమున గర్భ ములు ధరించిరి. కౌసల్య గర్భము ధరించిన క్షణమందే భగవంతు డామె గర్భమున ప్రవేశించెను. నాటినుండి లోకములన్నియూ సుఖసంపదలచే కళ కళ లాడెను.

తేజోవంతులగు ముప్పురు రాణులకు నవమాసములు నిండి ప్రసవ కాలము సమీపించెను. శ్రీరాముడు జన్మించబోవు శుభముహూర్తమునకు వారము, తిథి, యోగము, లగ్నములన్నియూ మంగళకరముగ కూడెను. ప్రభువు భువికి రానున్నాడని చరాచర జగత్తంతయూ సంతోషమును ప్రకటించెను.

నవమీ తిథి మధుమాస పునీతా,
సుకల పచ్ఛ అభిజిత హరిప్రీతా,
మధ్య దివస అతి సీతన ఘామా,
పావన కాల లోక బిస్రామా.

వసంతకాలము చైత్రమాసము, శుద్ధనవమి భగవంతునికి ప్రీతికరమైన అభిజిత్ ముహూర్తమున, సమశీతోష్ణముగ నుండి లోకమునకు విశ్రాంతినిచ్చు మధ్యాహ్నవేళ, శీతల సుగంధ మందపవనములు వీచుచుండ జగన్నాథుడు శ్రీహరి కౌసల్యగర్భమునుండి అవతరించెను.

ఆ శుభవార్తకు దేవతలు సంతోషించిరి. మునులు మోదమందిరి. కిన్నరులు ఆడిరి, గంధర్వులు పాడిరి. దేవదుందుభులు మ్రోగెను. పుష్పవృష్టి జరిగెను. వనములు పుష్పించి ఫలించెను. నదీనదములు మధుర జలపూరితములయ్యెను. పర్వతములు రత్నరాజిచే ప్రకాశించెను. హర్షోత్సాహితులగు దేవతలు దివినుండి శ్రీరాముని నానావిధముల స్తుతించి దీవించిరి.

తల్లి గర్భమునుండి భూమిపై అవతరించగనే అవాఙ్మనస గోచరుడగు దేవదేవుడు తల్లికి తన స్వస్వరూపమును ప్రదర్శించెను. కౌసల్యకు తన పూర్వ చరిత్ర స్మరణకువచ్చి దేహము గగుర్పాటు జెందెను.

శంఖచక్ర గదాధారి, ధనుర్బాణ తూణీరయుతుడు, చతుర్భుజుడు, కమలాక్షుడు, పీతాంబరుడు, మేఘశ్యాముడు, సర్వలక్షణ లక్షితుడగు దేవదేవుని దివ్య సుందర విగ్రహము చూచి విభ్రమముతో కౌసల్యఒడలు పులకరించెను. ఆమె తన రెండుచేతులు జోడించి స్వామిని అనేకవిధముల స్తుతించెను.

కౌసల్య ఒక్కమారు తన పూర్వ వృత్తాంతమును స్మరించుకొని, కనుదోయినుండి ఆనందాశ్రువులు స్రవించుచుండ, ప్రేమోత్కంఠయై "విరాట్స్వరూపుడవైన ఓ స్వామీ! నీ ఈ అలౌకికరూపము చాలించి యథాప్రకారము బాలరూపము ధరించుము. నీవు నోటితో "అమ్మా"యని పిలుచుటచే నా కతీన్త కరము, ఆనందదాయకము." అని ప్రార్థించెను. తత్క్షణమే ఆ దివ్యమూర్తి బాలమూర్తిగా మారి ఏడువసాగెను.

బిడ్డ ఏడ్పువిని రాణులు పురిటింటికి పరుగెత్తుకొని వచ్చిరి. దాసదాసీ జనము సంతోషముతో అటు ఇటు పరుగులెత్తెను. పుత్రోదయవార్త నిము సంలో నగరమంతట వ్యాపించెను. ఈ శుభవార్తకు దశరథుని హృదయము ఆనందార్ణవమై కట్టలుత్రెంచుకొనెను. పరమాత్ముడే నాగృహము పావనము చేసి నాడని తలంచుకొని రాజు పరవశుడయ్యెను. హర్షోత్సాహితుడైన రాజు నగర మంతటా శుభసూచకముగ మంగళవాద్యములు ప్రయోగించవలసినదిగా సూచించి, వెంటనే వసిష్ఠునికి వర్తమాన మంపెను.

వసిష్ఠుడువచ్చి బాలకుని దివ్యసుందరరూపము చూచి నిమేషమాత్రము నిశ్చేష్టుడైపోయెను. దశరథుడు - పుత్రోదయానంతరము చేయువలసిన - నాందీ ముఖ, జాతక సంస్కారాదులు పూర్తిచేసి, గోదాన, వస్త్రదాన, సువర్ణ దానాదులచే విప్రులను ప్రజలను సత్కరించెను.

కైకేయి ఒక సుపుత్రుని, సుమిత్ర కవల పుత్రులను కనిరి. రాజమందిరము యొక్క ఆనందోత్సాహము వర్ణనాతీతము. ధ్వజతోరణ పతాకములతో నగర మంతయు అలంకరింపబడెను. ఇంటింటా ఉత్సాహము వెల్లువలై పారెను. అయోధ్యలోని ఆబాలగోపాలము వినోద వేడ్కలలో మునిగితేలెను. సహజ సుందరులగు సాకేతస్త్రీలు బంగారు కలశములతో మంగళద్రవ్యములు తీసు కొని పురిటింటికి గుంపులు గుంపులుగా రాసాగిరి. కస్తూరి, గంధము, పన్నీరు మొదలైన పరిమళ ద్రవ్యములతో వీధులన్నీ తడిసిపోయెను. అగరుధూ పముల పొగహారలు దట్టముగ అల్లుకొని చిరుచీకట్లేర్పడెను. భవనోపరిభాగముల నుండి పైకి జల్లబడిన భర్గుండ రేణువుల యెర్రని కాంతితో సంధ్యారాగమై తోచెను. మేడలపై ఉంచబడిన బంగారుకలశములు చంద్రునివలెను, మణికాం తులు నక్షత్రములవలెను ప్రకాశించెను. నానావిధ వాద్యస్వరములు పక్షుల కలకలా రావములై భాసించెను. ఇది చూచువారికి భూమిపై అవతరించిన ప్రభువును దర్శించుటకు పట్టపగలే రజనీరాణి భువికి దిగివచ్చినదా యున్నట్లుండెను. అట్లు దిగివచ్చిన రాత్రి అక్కడ సూర్యుడుండుట చూచి సిగ్గుతో తలవంచు కొని సంధ్యారాగమై నిలిచినట్లగుపడెను. ఈకౌతుకమునుచూచే కుతూహల ముతో సూర్య డప్పటనే ఒక నెల నిలిచిపోయెను. ఈ ప్రకారం అయోధ్యా

వాసులు వేడ్కలతో, వినోదవములతో, విందులతో ఒక నెలకాలము ఒక దినముగ గడుపుకొనిరి.

''పార్వతీ! అయోధ్యానగరి అందచందములను ఆ సమయంలో చూడ నుత్స హించి నేనూ, కాకభుశుండి మానవ రూపములతో అచటికి వెళ్ళియుంటిమి. నేత్రపర్వముగ ఆ సంబరముచూచి వచ్చితిమి. ఈ రహస్యము నీకుమాత్రమే చెప్పుచున్నాను.'' అని భర్గుడనెను.

## నామకరణము

ఈ ప్రకారము ఆమోదప్రమోదములతో కొంతకాలము గడచెను. ఒక దినము మహారాజు వసిష్ఠాదులను రావించి నలుగురు బిడ్డలకు నామకరణములు చేయవలసినదని ప్రార్థించెను.

అనేక నామములుగల జగదభిరాముని యే నామముతో వ్యవహరింపవలెనో వసిష్ఠునకే తోచలేదు. కానీ వారికి తత్కాలమున ఉచితమని తోచిన పేర్లను నిర్ణ యించిరి.

''రాజా! ఆనందమూర్తి. సుఖరాశి, లోకత్రయమునకు విశ్రాంతినిచ్చు వాడు నీ పెద్దకుమారుడు, కనుక అతని పేరు రామమూర్తి. ప్రజల భారమును భరించువాడై యున్నందున కైక తనయుని పేరు భరతుడు. సర్వలక్షణ లక్షితుడగు సుమిత్ర పుత్రుడు లక్ష్మణుడు, ఈ చిన్నవాని పేరు స్మరించినంత మాత్రమున శత్రుక్షయమగును కావున సుమిత్ర చిన్నకొడుకు పేరు శత్రు ఘ్నుడు.''

అని గురువులు నలుగురికి తగురీతిన నామకరణములు చేసి - ''భూవరా! నీ పుత్రులు నల్గురు నాల్గువేదములవంటివారు. వీరు 'మునులకు, శివునికి, కాకభుశుండికి ప్రాణప్రియులు.' అని బిడ్డల గుణగణములను వసి ష్ఠుడు వక్కాణించెను. ప్రీతిపూర్వకమైన గురువచనములు విని పుత్రోత్సాహ ముతో రాజపితృహృదయము ప్రేమపూరిత మయ్యెను.

# ప్రవర్ధమానులు

చిన్నతనమునుండి లక్ష్మణుడు రాముని అనుసరించెను. భరతశత్రుఘ్నులు పరస్పరానురాగముతో సంచరించిరి. రూపగుణములందు ఆ నలుగురు ఒకరి కొకరు తీసిపోక సమానశీలురై యుండిరి. కానీ రామచంద్రుడు వారిలో మణి పూసవలె సర్వులకు ప్రీతిపాత్రుడై పెరుగుచుండెను.

అతని రూపరేఖ లావణ్యములు ఎవరిని మోహింపజేయవు!

శరీరము మేఘవర్ణము! తామరాకుపై తళతళలాడు ముత్యములాంటి కాలి గోళ్ళు వజ్ర ధ్వజాంకుశరేఖలతో నొప్పుచున్న పాదద్వయము! మనస్సులను ముగ్ధులజేయు నూపురధ్వని. ఉదరమున ముచ్చటగొలుపు త్రివలి. విశాల భుజములు, సింహ నఖపతకము, భృగుచరణ చిహ్నమును, మణిహారములు గలిగిన వక్షస్థలము, కంబుకంఠము, పాలవండ్లు, విశాల నేత్రములు, అరుణాధరము, అన్నీకలిసి కోటి మన్మథుల ధిక్కరించు శరీర సౌందర్య మతనిది. బాలరాముని రూపరేఖావైభవము వర్ణనాతీతమైనది.

ఆ మోహనమూర్తి అవాఙ్మనసగోచరుడు, ఆద్యంతములులేని సచ్చిదానందస్వరూపుడు అయిననూ భక్తవత్సలుడు గాబట్టి, జననీజనకులను నయనానందకరమగు బాలక్రీడలచే రంజింపజేయుచుండెను. కౌసల్య తన చిట్టితండ్రి ముద్దుచేష్టలకు ముగ్ధురాలు కాని క్షణములేదు.

ఒకదినము తల్లి బిడ్డకు నీళ్ళుపోసి ఉయ్యేలలో నిద్రబుచ్చెను. అనంతరము కులదేవతకు పాయసము నైవేద్యమిడి, వంటశాలకు వెళ్ళివచ్చెను. అప్పుడు ఆమెకు పూజాగృహములో నైవేద్యము ఆరగించుచున్న బాలరాముడు కనపడెను. అక్కడనుండి ఉయ్యేలవద్దకు వెళ్ళిచూడగా అక్కడ కూడా రాముడు యథాప్రకారం నిద్రించుచుండెను. నై వేద్యము ఆరగించుచున్న, ఉయ్యేలలో నిద్రించుచున్న ఇద్దరు రాములనుజూచి 'ఇదియేమి మాయ!'యని దిగ్భ్రమ జెందెను. అప్పుడు రాముడు నవ్వుచూ, తల్లికి తన విశ్వరూపమును చూపెట్టెను. ఆ విశ్వరూపములో ఆమెకు ఎన్నియో ఈశ్వర రహస్యములు గోచరించెను. అందులో ఒకటి - భగవంతుడూ అతనిఎదుట మాయచే

ఆడింపబడు జీవుడు, మాయనుండి జీవునికి ముక్తికల్గించు భక్తిని కౌసల్య కాంచగలిగెను.

కౌసల్య కేలుమోడ్చి - 'భగవాన్, ఇక నీ మాయను నాపై ప్రసరింప జేయక కరుణించు'మని వేడెను. భగవంతుడిట్లెన్నియో లీలలు ప్రదర్శించి భక్తులకు ఆనందము చేకూర్చుచుండును.

ఇదియేగాక ఆ పరబ్రహ్మ బాలభావముతో ఒకప్పుడు సౌధప్రాంగణమున దోగాడుచూ, మరొకప్పుడు దుమ్ములో ఆడుకొనుచూ ఇంకొకప్పుడు దధ్యోదనము ముఖమునకు పూసుకొని ముద్దుగొలుపుచూ, తల్లి వాత్సల్యమును వేయి విధముల వినోదింపజేసెను. రామ, భరత, లక్ష్మణ శత్రుఘ్నులు సకల జనులకు ప్రీతికరముగా దినదినప్రవర్ధమాను లగుచుండిరి. దశరథుడు యథాసమయమున వారికి కేశఖండనము పంద్రెండవయేట ఉపనయనాది సంస్కారములు చేయించి గురువుల వద్దకు చదివించుటకు బంపెను. రామాదులు అతి శీఘ్రకాలములో ఉపాధ్యాయుల వద్ద సకలవిద్యలు నభ్యసించిరి. క్షత్రియోచితమగు శస్త్రాస్త్ర ప్రయోగములందు సైతము ఆరితేరిన ప్రవీణులైరి.

నిత్యమూ ప్రాతఃకాలముననే లేచి తల్లిదండ్రులకు నమస్కరించి, వారు తమ దినచర్యలు ప్రారంభింతురు. శాస్త్రములను చదువుట, శస్త్రములను ప్రయోగించుట, పురాణేతి హాసములు వినుట, తమ్ములతో వేటకై వనములకు వెళ్ళుట మొదలైనవి వారి నిత్యకార్యములు. గుణసంపన్నులు, దిన దిన ప్రవర్ధమానులగు ఆ నల్వురు రాకుమారులు ధనుర్బాణములు ధరించి పురవీధులందు వచ్చుచూ పోవుచున్నప్పుడు వారి రూపసౌందర్యములను నేత్రపర్వముగ తిలకించి అయోధ్యావాసులు ముగ్ధులగుచుండిరి.

## విశ్వామిత్రుని వెంట రామలక్ష్మణులు వెళ్లుట

''ఓ అపర్ణా! ఆపై జరిగినకథ చెప్పుచున్నాను శ్రద్ధతో ఆలకింపుము'' అని శంకరుడు పార్వతి కిట్లుచెప్పెను.

విశ్వామిత్రమహర్షి మహాజ్ఞాని. అతడు మునులతో గూడి వనమందు తపస్సుచేయుకొనుచుండెను. విశ్వామిత్రాదులు చేయుచుండిన యజ్ఞ యాగము

లకు మారీచ సుబాహులనెడి రాక్షసులు ఆటంకము కలిగించి భగ్నము చేయు చుండిరి. ఈ రాక్షసుల దుండగముల వలన వారి క్రతుక్రియలు సాగకుండెను.

అంతట విశ్వామిత్రుడు ఒకదినము -"ఈ రాక్షసులను భగవంతుడొక్కడే సంహరించగలడు. శ్రీహరి అయోధ్యలో అవతరించియున్నాడు. అయోధ్యకువెళ్ళి, శ్రీమన్నారాయణుని కన్నులారా చూచి, రాక్షసులబారినుండి ఋషుల యజ్ఞములను రక్షింపుమని ప్రార్థించివచ్చెద-"నని యోచించి అయోధ్యకు బయలుదేరెను.

అనతికాలమునకే విశ్వామిత్రుడు అయోధ్య సమీపించి, సరయూనదిలో స్నానము చేసి రాజసభ చేరెను.

దశరథుడు మహర్షిని ఆదరముతో ఆహ్వానించి అర్ఘ్యపాద్యాదులతో పూజించి, ఉచితాసనమిచ్చి సత్కరించెను. పిమ్మట రాజు నల్వురుపుత్రులను రావించి వారిచేత మహర్షికి పాదపూజ చేయించెను. చంద్రునిజూచిన చకోరము వలె రాముని తిలకించిన విశ్వామిత్రుడు ఆనందముతో వళ్ళు మరచెను. కుశల ప్రశ్నల పిమ్మట రాజు మహర్షిరాకకుగల కారణము తెలుసుకొన కుతూహలపడుచున్నట్లు వెల్లడించెను.

అంతట విశ్వామిత్రుడు - "రాజా! రాక్షసుల ఉపద్రవములు యెక్కువై యజ్ఞములు సాగుటలేదు. నీ కుమారులను నాతో బంపుము. వారు రాక్షసులను సంహరించి నాకు సహాయపడెదరు. నా కోరిక నెరవేరును. నీకు కీర్తి కలుగును." అని రాజు నడిగెను. విశ్వామిత్రుని కోరిక తెలుసుకొని రాజు ముఖము వెలవెలబోయి నిర్విణ్ణుడాయెను. అతడు దీనుడై ఇట్లు మొరపెట్టెను.

"ఓ మునీశ్వరా! ఈ బిడ్డలు నాకు వృద్ధాప్యములో పుట్టిరి. వీరిని ప్రాణములతో సమానముగ చూచుకొనుచున్నాను. పైగా రాముని చూడనిదే ఒక క్షణముండలేను. స్వామీ వారినితప్ప మరేమైనా కోరుము. నా ప్రాణములు సైతము ధారబోయుటకు వెనుదీయను. అయ్యో! ఆ ఘోర రాక్షసులెక్కడ, ఈ పసిబాలురెక్కడ!" అని విచారించెను. రాజుకు బిడ్డలపైగల ప్రేమాను రాగములు చూచి విశ్వామిత్రుడు హర్షించెను. వసిష్ఠుడు దశరథునికి అనేకవిధముల నచ్చజెప్పి, మునివెంట రామలక్ష్మణులను పంపించుటకు అతనిని ఒప్పిం

చెను. పిమ్మట దశరథుడు రామలక్ష్మణులను రప్పించి వారిని ప్రేమతో హృద యమున కత్తుకొని దీవించి విశ్వామిత్రునికి అప్పగించెను.

రామలక్ష్మణులు తల్లిదండ్రులకు నమస్కరించి, గురువుల ఆశీర్వాదములు పొంది, మునివెంట అడవులకు వెళ్ళిరి.

ఎఱ్ఱతామరలవంటి కన్నులు, విశాలమైన వక్షము, బలీయమగు బాహు దండములు కలిగిన క్షత్రియకుమారులు క్షాత్రతేజము ఉట్టిపడుచుండ ధనుర్బా ణములు ధరించి మునివెంట అరణ్యమార్గమున జనుచుండిరి.

ఇట్లు పోవుచుండ దారిలో వారిని తాటకి అను రాక్షసి ఎదుర్కొ నెను. రాముడు ఒక్క బాణముతో తాటకిని కూల్చి దానికి స్వర్గప్రాప్తి కలుగజేసెను.

విశ్వామిత్రుని ఉత్సాహమునకు మేరలేకపోయెను. అతడు బల అతిబల అను విద్యలను వారికిచ్చెను. ఆ విద్యలవలన శరీరపోష్యము చెడక ఎన్నిదినము లైననూ ఆకలిదప్పులు కలుగవు. ఇదియేగాక ఎన్నియో అస్త్రములను వాని ప్రయోగాదులతో రామ లక్ష్మణులకు ప్రదత్తము చేసెను.

ఆ రాత్రికి వారు ఆశ్రమముచేరి కందమూలాదులు సేవించి విశ్రమించిరి.

ఉదయముననే విశ్వామిత్రుడు మునులతో యజ్ఞము చేయనారంభించెను. రామ లక్ష్మణులు విల్లంబులు ధరించి యజ్ఞవేదికకు కాపలా గాయుచుండిరి. యజ్ఞము చేయుచున్న సంగతి తెలియగానే మారీచాది రాక్షసులు దానిని ధ్వంసము చేయుటకు పరుగెత్తుకొని వచ్చిరి. రాముడు ఒక మొనలేని మొండి బాణము మారీచునిపై ప్రయోగించెను. ఆ దెబ్బకు వాడు నూరుయోజన ముల దూరమువెళ్ళి సముద్రమున కావల పడిపోయెను. పిమ్మట ఒక అగ్ని బాణముతో సుబాహుని మర్దించెను.

లక్ష్మణుడు మిగిలిన రాక్షసులను దిక్కులకొకరు పరుగెత్తిపోవునట్లు పార ద్రోలెను. దుష్టరాక్షసుల బాధ తొలగినందులకు మునులు, దేవతలు రాజ కుమారులను కీర్తించిరి. యజ్ఞములు నిర్విఘ్నముగా నెరవేరెను. అటుపిమ్మట రామలక్ష్మణులు మునులతో కలసి కొద్దిదినములు సుఖముగా గడిపిరి.

ఒకదినము విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో జనకుడు ధనుర్యజ్ఞము జేయుచున్నాడు, వెళ్ళి చూచెదమని తెలిపెను. అందుకు సమ్మతించి వారు విశ్వామిత్రునితో కలిసి మిథిలకు బయలుదేరిరి.

దారిలో వారికి ఒకప్రదేశమున ఆశ్రమమొకటి ఏవిధమైన ప్రాణిసంచారము లేక శూన్యముగ పడియుండుట కానవచ్చెను. ఒక పెద్ద రాయిమాత్రము పడి యుండెను.

విశ్వామిత్రుడు రామునకు ఆ రాయియొక్క పూర్వచరిత్ర సవిస్తరముగ తెలియజేసి (బ్రహ్మ ఒక త్రిలోకసుందరిని సృష్టించి, ఆమెను గౌతమునకిచ్చి పెండ్లిచేసెను. ఆమె పేరు అహల్య. గౌతముడు ఇంటలేనపుడు ఇంద్రుడు మారువేషమునవచ్చి అహల్యతో రమించెను. ఈ సంగతి తెలిసిన మీదట గౌతముడు అహల్యను రాయివై పడియుండుమని శపించిన వృత్తాంతము) 'రామా! ఆ శిలారూపంతో నున్న అహల్య నీ పాదధూళికై పరితపించు చున్నది. కటాక్షించి ఆమెకు ముక్తి కలిగింపు' మని చెప్పెను.

శ్రీరామచంద్రుని పాదస్పర్శకు రాయిగా పడివున్న అహల్యకు శాపవిమోచ నమై ఆమె తన పూర్వరూపము పొందెను. అహల్య శ్రీరాముని పాదములపైబడి ప్రణమిల్లి మేను పులకరింప, కన్నులనుండి ఆనందాశ్రువులురాలుచుండ, గద్గద కంఠముతో శ్రీరాము నిట్లు స్తుతించెను.

"ఓ రామచంద్రా! నీవు జ్ఞానులకుమాత్రమే తెలియబడగలవు. నన్ను కరుణించిరక్షించుము! గౌతముడు శపించుట వలన నాకు మేలే జరిగెను. అందువలన మీ దర్శన, స్పర్శన భాగ్యము నాకు కలిగెను. ఏపాదమునందు పుట్టిన గంగను పరమేశుడు తన శిరస్సున ధరించెనో, ఏ పాదములకు నిత్యము బ్రహ్మ నమస్కరించుచుండునో ఆ పాదములు నాపై యుంచి నన్ను తరింపజే సితిరి. స్వామీ! నా మనస్సనెడి తుమ్మెద సదా నీ చరణకమల పరాగము సేవించుచుండునట్లు నాకు వరము ప్రసాదింపుము."

అహల్య రాముని యనుగ్రహము పొంది సంతోషముతో భర్తవద్దకు పోయెను.

# మిథిలానగర దర్శనము

అచటనుండి వారు ముందుకు పయనించి గంగాతీరము చేరిరి. గాధి సూనుడు రామ లక్ష్మణులకు భూమిపైకి గంగ అవతరించిన గాథ తెలియ జెప్పెను. రామునితో సహా విశ్వామిత్రాదులు సుర - నదియందు స్నాన మాచరించిరి.

గంగను దాటి త్వరలో వారు జనకపురిని సమీపించిరి. జనకపురియొక్క రమణీయకతకు రామలక్ష్మణులు ముగ్ధులైరి.

తియ్యని జలముతో, రత్న సోపానములతో, తుమ్మెదల ఝంకారము లతో, పక్షుల కలకలా రావములతో నానా విధపుష్ప సంపదలతో రాజిల్లు చుండిన నదులు, తటాకములు, సరోవరములు పట్టణమునకు మరింత అందము చేకూర్చుచుండెను.

నగరమునకు నాల్గువైపుల ఫల, పుష్ప వాటికలు అమరియుండెను.

రంగురంగుల మేడలు, రత్న ఖచిత గృహములు తీర్చిదిద్దిన వీధులు, చూచువారికి కనులపండువు జేయుచుండెను. ఆ పురజనులు సహజ సుంద రులు, సకలైశ్వర్యసంపన్నులు. జనకుని నగరు, సీతాదేవి సౌధముయొక్క అంద చందాలు చూచుటకు దేవతలు సైతం మురిసిపోదురు.

కోటలు, సింహద్వారములు, గజాశ్వశాలలు, మంత్రుల సేనాధిపతుల భవంతులు కూడ రాజభవనమునకు సాటిగానుండెను.

వందిమాగధులు, నటీనటులు, సుందరులగు స్త్రీ పురుషులు గుంపు గుంపులుగా వీధులందు సంచరించుచుండిరి. నగరమునకు వెలుపల నదీతీర మున అనేక రాజన్యులు విడిదిచేసియుండిరి.

అచ్చటికి సమీపముననే అందమైన తోట ఒకటి ఉండెను. అది అన్నివిధ ముల వాసయోగ్యముగా ఉన్నదని భావించి విశ్వామిత్రుడు తన వారితో కలసి ఆ తోటలో బస చేసెను.

విశ్వామిత్రుని ఆగమనవార్త తెలియగనే జనకుడు సపరివారుడై

మహర్ఘ్యాదులున్నచోటకు వచ్చెను. రాజు ముని బృందమునకు భక్తితో ప్రణమిల్లి వారి ఆశీర్వాదములు పొందెను. ఇంతలో పూదోటలు చూచుటకు వెళ్ళియుండిన రామలక్ష్మణులు అచ్చటికి వచ్చిరి. విశ్వామిత్రుడు వారిని చేర దీసి తన ప్రక్కన కూర్చుండ బెట్టుకొనెను. సుకుమారులు, సుందరాకారులగు ఆ రాకుమారుల రూపురేఖలుజూచి, పట్టరాని సంతోషముతో విదేహరాజు కొద్దిసేపటివరకు విదేహుడయ్యెను.

అంతట జనకుడు ప్రేమాతురుడై విశ్వామిత్రునితో ''మునీశ్వరా! ఈ రాజకిశోరు లెవ్వరు? బ్రాహ్మణపుత్రులా, లేక క్షత్రియ కుమారులా! అథవా వేదములు నేతి - నేతి యని చెప్పిన ఆ పరబ్రహ్మయే వీరి రూపమున అవ తరించి వచ్చినదా! సహజముగ నా మనస్సు వైరాగ్యప్రధానమైనది. కానీ, వీరిని చూచి రాగభావము పొందుచున్నది. కావున వీరి పరిచయభాగ్యము కలుగ జేయవలసిన''దని నమ్రభావముతో పలికెను.

విశ్వామిత్రుడు మందహాసము చేయుచూ, ''రాజా! మీరన్నది యథార్థము. వీరు ప్రపంచమునందలి సర్వ ప్రాణులకు ప్రీతిపాత్రులు. రఘుకులమందు పుట్టిన దశరథపుత్రులు - రామలక్ష్మణులు - వీరు. యజ్ఞసంరక్షణార్థము రాజు వీరిని నావెంట బంపెను'' అని ముని రామలక్ష్మణుల పరిచయము జేసెను.

జీవాత్మ పరమాత్మలవలె ప్రకాశించుచున్న ఆ యన్నదమ్ముల అతిరూప సౌందర్యమును చూచుచూ, జనకుడు అమితానందము పొందెను.

అనంతరము జనకుడు విశ్వామిత్రాదులను వెంట తీసుకొని నగరము లోనికి వచ్చెను. అక్కడ వారిని సకల సౌకర్యములుగల ఒక మంచి భవనమున విడియింపజేసెను. భోజనాదులు చేసి వారచ్చట విశ్రమించిరి. అప్పటికి పగలు జాము ప్రొద్దుమాత్రము మిగిలియుండెను.

## రామలక్ష్మణులు నగరము దర్శించుట

మిథిలా పట్టణము కలయజూచి రావలెనని అనుకొనుచూ, లక్ష్మణుడు లోలోన సంబరపడుచుండెను. రాముడది గ్రహించి విశ్వామిత్రునికి తెలియ

జేసెను. గురువు అనుమతి పొంది అన్నదమ్ములిద్దరూ పట్టణముచూచి వచ్చుటకు బయలుదేరిరి.

కటి ప్రదేశము పీతాంబరములచే బంధించి, లలాటమున చందన తిలకము దిద్ది, చేత ధనుర్బాణములు ధరించి కంఠమున గజముక్తామాలలు వ్రేలాడు చుండ, నల్లని శిరోజములపై చమ్కీటోపీలు ధరించి, రాజవీథిన బడిపోవు చున్న ఆ అన్నదమ్ముల అందచందాలు చూచిన పురవాసులు ప్రేమచే పులకితులైరి.

శ్రీరాముని చక్కదనమునకు, అతని తియ్యని మాటలకు సమ్మోహితులైన ఆ యూరి బాలురు గుంపులుగుంపులుగా వారి వెంటబడి వచ్చుచుండిరి. రామలక్ష్మణులు నగరము చూచుటకు వచ్చుచున్నారని తెలిసి పురజనులు పరుగులెత్తుకొనివచ్చి, వారిని చూచి ఆనందించిరి. రామలక్ష్మణుల అందచందములను ముందుగనే వినియున్న మిథిలాపుర అంగనామణుల ఆతురత ఇకచెప్పనలవికాదు. వారు మేడలూ, మిద్దెలూ ఎక్కి గవాక్షముల నుండి దృష్టులప్పగించి ఆ రాజకుమారుల రమణీయసోయగమును అనిమేషభావముతో జూచిరి. ఆ యువకిశోరుల రూపలావణ్యముల నెంతచూసిననూ తరుణీమణులకు తృప్తి కలుగకుండెను.

స్త్రీలు గుంపులుగుంపులుగాచేరి రామలక్ష్మణుల గుణగణములను ప్రసంగించుచూ, వారి రూప లావణ్యములను గురించి గుసగుసలాడజొచ్చిరి. రామునియం దనురాగము అతిశయించుటచే చెప్పువారూ, వినువారు, ఇరు పక్షముల వారు తన్మయులై ప్రసంగించసాగిరి.

వారి సంభాషణ క్రమమిట్లుండెను:- ''చెలీ! శ్యామల వర్ణము గౌరవర్ణము కలిగిన ఈ జోడుసోదరుల సోయగమే సోయగము. తీర్చిదిద్దిన అంగసౌష్ఠవం, కమలములవంటి కన్నులు, కమనీయమగు దేహకాంతి, లలిత కోమల లావణ్యమును జూచి భ్రమించని వా రెవరుందురు. ఆహా! ఎంతటి అనిర్వచనీయమైన సౌందర్యశోభ వీరిది! సఖీ! వీరు రఘుకుల వంశ దీపకులట. తాటకిని వధించిరట. యజ్ఞమును రక్షించి మారీచసుబాహులను మట్టుబెట్టిరట. అహల్యను కరుణించిరట. ఇచట ధనుర్యజ్ఞము దర్శించ వచ్చినారట. అమ్మీ! రాముడు

మన జానకికి తగినవరుడే! జనకుడు వీరిని జూచిన ఎంత బాగుండును. అయినా అతడు ప్రతిజ్ఞచేసి పొరబాటు చేసినాడు. ఆ కఠిన శివధనుస్సెక్కడ! ఈ కోమల కిశోరు డెక్కడ! కానీ రాముడు శక్తిమంతుడని వినుచున్నాము. ఈ సంబంధమే స్థిరపడిన మిథిలకు వచ్చిపోవుచుండు రాముని అప్పుడప్పుడూ చూచుకొనగల భాగ్యము కలుగును.''

ఇట్లనేక విధముల వనితామణులు వారిలో వారు ప్రసంగించుకొనిరి. రామ లక్ష్మణులను చూచిన ఆబాలగోపాలము ఆనందముచే పరవశమగుచుండెను.

అట్లు పట్టణము చూచుచూ వారు నగరమునకు తూర్పున కట్టబడిన ధనుర్యజ్ఞశాలవద్దకు చేరిరి. ఆ రంగస్థలము యొక్క - వివిధ భాగములు ఆ యూరిబాలురు ఉత్సాహముతో రామలక్ష్మణులకు చూపించిరి. రామ లక్ష్మణులు రంగస్థలము యొక్క వివిధదశలను బాలుర నడిగి తెలుసుకొనిరి. ఇవ్విధముగ రామలక్ష్మణులతో సంపర్కముకలిగి, వారిని స్పర్శించి, వారితో సంభాషించు అవకాశము కలిగినందులకు బాలురు అమితానంద ముపొందిరి. ఇట్లు నగరభాగములను చూచుచూ చాలాసేపు గడపిరి. పిమ్మట రామలక్ష్మణులు మంచి మాటలతో బాలురవద్ద సెలవుతీసుకొని గృహోన్ముఖులైరి.

అప్పటికే ఆలస్యమయినందుకు గురువు ఏమనునో అని భయపడుచూ బసచేరిరి.

## రాముడు జానకిని చూచుట

మరుదినము కోడి కూయగనే రామలక్ష్మణులు మేల్కొనిరి. స్నాన సంధ్యలు ముగించుకొని గురుచరణములకు నమస్కరించి, పూజకు పూలను దెచ్చు నిమిత్తమై జనకుని పూదోటకు వెళ్ళిరి.

వసంతఋతువువే వలపింపజేయుచున్న ఆ వాటిక జనకుని తోటలో మేటిది. ఫలపుష్పభరితమైన వృక్షములు, వాని నాశ్రయించిన లతామండప ములు, కోకిల - కీర - కేకీ - చకోర - చాతకపక్షుల కలకల ధ్వనులతో అది కళకళలాడుచుండెను.

ఈ పుష్పవాటిక మధ్య సుందరమైన సరోవర మొకటి గలదు. నిర్మలమగు నీరు, మణిమయ సోపానములు, తుమ్మెదలు రొదచేయుచున్న తామరలు, జల పక్షుల సందడితో సరోవరము శోభిల్లుచుండెను.

పుష్పవాటిక, అందున్న సరోవరము యొక్క రమణీయత చూచి రాకుమారులు ప్రసన్న చిత్తులైరి. తోటమాలి నడిగి ఆ తోట నాల్గువైపుల కలయజూచి, వారు పత్ర పుష్పములను కోయసాగిరి.

ఇంతలో సీతాకుమారి చెలికత్తెల వెంటనిడుకొని గౌరీ పూజకై తల్లిపను పున అచటికి వచ్చెను. ఆ తోటలోని సరోవరము గట్టుననే గిరిజామందిర మున్నది. సీత సఖులతో గలసి సరోవరమున స్నానమాచరించి, గుడిలోనికివెళ్ళి గౌరీ దేవిని పూజించి, తన కనుకూలమగు వరము ప్రసాదించుమని పార్వతిని ప్రార్థించెను.

వీరిని వదలి వనముచూచుటకై ఒక సఖి వెళ్ళి యుండెను. ఆమెకు అక్కడ పూలుకోయుచున్న రామలక్ష్మణులు కనపడిరి. ఆ చెలి పరుగెత్తుచూ సీతవద్దకు వచ్చి ప్రేమాతిశయముచే వళ్ళు పులకరింప ఆమె వారితో ''చెలులారా! నేను తోటలో ఇద్దరు రాకుమారులను చూచివచ్చితిని. అబ్బ! చూచిన నయనములకు నాలుకలేదు; వారిని వర్ణించవలసిన జిహ్వకు చక్షువులు లేవు'' అని చెప్పెను.

ఆమె మాటలకు సఖులు సంబరపడిరి. బహుశః వీరు మునివెంట వచ్చిన రాకుమారులై యుందురని వూహించి వారిని గురించి నగరవాసులు చెప్పుకొనుచున్న రూపనామములను పేర్కొనిరి. ఈ ప్రసంగము జానకి చెవులకు ఇంపుగ నుండెను.

పిమ్మట ఆత్మసఖి దారిచూపుచుండ సీత ముందుకు నడచెను. మైథిలి మనస్సు మాధుర్యభావముచే నిండెను. అప్పుడామెకు నారదుని వచనములు జ్ఞప్తికి రాగా (''జానకి! పెండ్లికిమునుపు నీవు పుష్పవాటికలో రాముని చూడ గలవు'' అనిముని చెప్పియుండెను) ఆమె హృదయము పవిత్రప్రేమచే పులకితమయ్యెను. తన ఆంతర్యమును సఖులెక్కడ గ్రహించిరో యని దిగులుతో జానకి బెదిరిన లేడిపిల్లవలె దిక్కులు చూచెను.

కాలి యందియలు, కర కంకణములు ఘల్లుఘల్లున మ్రోగుచుండ సీత నడచెను. ఆ మధురరవము చెవులసోకి రాముడటువైపు మోమెత్తి చూచెను. చాతకము చంద్రుని చూచినట్లు రాముడు జానకిని చూచెను. జానకి జగన్మోహనాకారము తిలకించిన రాముని చూపులకు రెప్పపాటు లేకపోయెను. ఆమె అందమును అతడు ఆత్మలో అభినందించి నిర్మలహృదయముతో లక్ష్మణుని కిట్లనెను. ''లక్ష్మణా! అదిగో, ఆమెయే జనకపుత్రిక. ధనుర్యజ్ఞము ఈమె నిమిత్తమే జరుపబడుచున్నది. తమ్ముడూ, అందమునకే అందమిచ్చు ఈమె సౌందర్యము జూచి నా మనస్సెందుకో చలించుచున్నది. రఘువంశజులు కలలో కూడ కన్నెత్తి పరస్త్రీలను చూడరే. శుభసూచకముగ నా దక్షిణాంగము కంపించుచున్నది. ఇందుకు కారణము భగవంతునికే తెలియును'' అని చెప్పెను. ఒక వైపు లక్ష్మణునితో మాట్లాడుచున్ననూ, మరొకవైపు రాముని మనస్సు భ్రమరమువలె మైథిలి ముఖకమలముపై విహరించుచుండెను.

అక్కడ సీత నృపకిశోరు లెక్కడున్నారని చకితురాలై నల్దెసల పరికించెను. ఆమె దృష్టి శ్వేతకమల సృష్టి. (ఆమె చూచిన చోటెల్లెడల శ్వేతకమలములు వర్షించెను. సఖులు సీతకు లతాగృహము చాటునుండి రామలక్ష్మణులను చూపించిరి. అదే సమయమున జలదపటలము చీల్చుకొని ప్రకాశించు రెండు చంద్రబింబములవలె రామలక్ష్మణులు పొదరింటనుండి బయటికి వచ్చిరి.

శ్యామల - గౌరవర్ణములతో భాసించు రామలక్ష్మణుల ముఖకమలములందు చిరుచెమటలు క్రమ్మియుండెను. వంకరలు తిరిగిన ముంగురులు, వంచిన విల్లువంటి కనుబొమలు, కర్ణములందు కుండలములు, ముద్దుగొలుపు చెక్కుల సొంపు, ముక్కు సోయగము, కమలముల బోలిన కన్నులతో శోభించు ఆ యువ కిశోరుల రూపలావణ్యముల ఎదుట కోటి మన్మథులు సిగ్గుపడుదురు.

రామచంద్రుని దివ్యసౌందర్యము దర్శించిన సీత చూపులు తృప్తితో స్థిరపడిపోయెను. ఆమె రాముని రూప చిత్రమును తన నేత్రములందు దాచి కనురెప్పలు మూసుకొని కొన్ని క్షణములు అట్లే నిలబడిపోయెను.

సీతాకుమారి స్థితి గమనించిన ఒక చెలికత్తె - ''సీతా! కండ్లుమూసుకొని

గౌరిని పిమ్మట ధ్యానించవచ్చు! ఇపుడు రాముని చూడరాదా'' అని చమత్కరించెను. జానకి సిగ్గుతో కండ్లు తెరచి, ఎదుటనున్న రామ లక్ష్మణులను క్రీగంట మరొక్కమారు చూచి ముగ్ధురాలయ్యెను.

అంతట చెలులు కాలవిలంబన మాయెనని తెలుసుకొనిరి. ''రేపు ఇదే వేళకు తిరిగిరావలెను సుమా!'' యని ఒక సఖియ నర్మగర్భముగా పలుకుచుండ అక్కడ నుండి వారు కదలిరి. జానకి ఖగమృగములను అవలోకించు నెపమున మాటిమాటికీ వెనుదిరిగి రాముని చూచుచుండెను.

ఆమె మరొక్క మారు భవానీగుడిలోకి వెళ్లి దేవి నిట్లు ప్రార్థించెను.

''ఓ గిరిరాజకిశోరీ! జగన్మాతా, శివప్రియా, పరహిత కారిణీ, పతివ్రతాగ్రణీ, నీవు సర్వాంతర్యామివి. నా అభీష్టము నీకు తెలియనిది కాదు. దేవీ నా సంకల్పము సిద్ధింపజేయు''మని దేవిపాదములపై వ్రాలెను.

భూపుత్రి ప్రార్థనకు జగన్మాత కరుణించెను. భవానీవిగ్రహము మందస్మితయై చేతనున్న మాలను జారవిడిచెను.

సీత భవానీ ప్రసాదపుష్పములను భక్తితో శిరమున కద్దుకొనెను. అంతట గౌరీదేవి - ''సీతా, నారదుని వచనములు సత్యము. నీకోరిక ప్రకారము శ్రీరాముడు నీకు లభించగలడు'' అని దీవించెను.

సీత, సఖీజనులు భవానిపలుకులు విని పరమ సంతోషము పొందిరి. దేవిని బహువిధముల స్తుతించి వారు అంతఃపురమునకు చనిరి.

రాముడు సీత సౌందర్యమును స్మరించుకొనుచూ, లక్ష్మణునితో కలిసి గురువు వద్దకు వెళ్ళెను. అతడు తోటలో జరిగిన సంగతంతయూ దాచుకొనక విశ్వామిత్రునికి నివేదించెను. వారు తెచ్చిన పూలతో గురువు పూజ ముగించుకొని వచ్చి ''మీ యభీష్టము సిద్ధించుగాక'' యని దీవించెను. రామ లక్ష్మణులు సంతోషించిరి.

గురువుయొద్ద పురాణకథను వినుచూ వారు నాటి పగలు గడపిరి. సాయం సమయ మయ్యెను. గురువు ఆజ్ఞప్రకారము సంధ్యానుష్ఠానములకై లేచిరి.

అప్పటికి తూర్పున చంద్రోదయ మయ్యెను. చంద్రుడు సీత ముఖమువలె ఉన్నాడని తలంచి రాముని హృదయము ఆనందముచే స్పందించెను. అయినా ఈ చంద్రుడు సీత వదనమునకు సాటిరాడని తిరిగి అతడిట్లు సమర్థించు కొనెను.

''ఓ చంద్రుడా! నీవు విషముతో కలిసి పుట్టితివి. నిత్యకళంకివి. అర్ధ దినము అప్రకాశుడవు. నీకు వృద్ధిక్షయములు కలవు. విరహిణులను వేధించె దవు! రాహువుచే కబళింపబడుదువు. పద్మములకు పగవాడవు. ఓ చంద్రమా! నిన్ను సీతతో పోల్చడము సరికాదు'' అని తలపోసి రాముడు చంద్రుని మిషతో సీత ముఖకాంతిని స్మరించుకొనుచూ, గురువు వద్దకు చేరెను. ఆ రాత్రి గడచెను.

మరుదినము ప్రాతఃపూర్వమే రాముడు మేల్కాంచి - ''లక్ష్మణా! అరు ణోదయమాయెను. చక్రీ- చక్ర వాకములకూ, పద్మములకూ సుఖమిచ్చు సూర్యుడుదయించుచున్నాడు. చూడు'' మని తమ్మునితో పలికెను.

అంతట లక్ష్మణుడు రాముని ఎదుట ముకుళితహస్తుడై నిలబడి ఇట్లు ప్రభువుకు ప్రభాతవందన చేసెను-

''సోదరా! అవును అరుణోదయ మయ్యెను. కుముదములు ముకుళించి నక్షత్రములు కాంతిని కోల్పోయెను. అటులనే మీ ఆగమనవార్త విని ధరణీ శులు దర్పములు కోల్పోయిరి.

స్వామీ! చుక్కలవంటి ఈ రాజన్యులు ఎంత ప్రకాశించినను చీకటివంటి శివచాపమును హరింపలేరు.

రఘుపతీ! భానుడు ప్రభవించి మీ ప్రతాపమును భూపతులకు తెలియజే యుచున్నాడు. భాస్కరుడు తన తేజఃపుంజముద్వారా మీ బలపరాక్రమము ప్రక టించి ఇక శివచాపము విరిగినట్లేయని చాటుచున్నాడు'' అనుచూ తమ్ముడు అన్నను కీర్తించెను. రాముడు నవ్వుచూ పైకిలేచెను. వెంటనే వారు నిత్యకృత్య ములు నిర్వర్తించుకొనివచ్చి గురుచరణములకు నమస్కారము చేసిరి.

ఇంతలో జనకుని పురోహితుడు శతానందుడువచ్చి, ధనుర్యజ్ఞము తిలకిం

చుటకు రాజు తమరిని ఆహ్వానించెనని విశ్వామిత్రునికి విన్నవించుకొనెను.

మునులు రామలక్ష్మణులను దీవించిరి. పిమ్మట విశ్వామిత్రుడు, రామ లక్ష్మణులు, మునులు సీతాస్వయంవరము చూచుటకు బయలుదేరిరి. రామ లక్ష్మణులను చూడవచ్చిన నగరవాసులతో సభామండపము క్రిక్కిరిసిపోయెను. జనకుని సేవకులు అందరినీ యథోచిత స్థానములందు కూర్చుండబెట్టు చుండిరి.

ఇంతలో రామలక్ష్మణులు రంగస్థలము ప్రవేశించిరి. నక్షత్రముల మధ్య చంద్రునివలె వారా రంగస్థలమును రాణింపజేసిరి. రాముని జూచుటకు సభి కులు సంబరపడుచుండిరి.

ఎవడు ఏ దృష్టితో రాముని చూచెనో వానికి ఆ భావములతోనే అతడు కాన్పించెను. వీరులదృష్టికి వీరుడుగ, దుష్టుల చూపులకు భయంకరుడుగ, ఛద్మవేషధారులై వచ్చిన దైత్యులకంటికి రౌద్రమూర్తిగ, నగరవాసులకు, నారీ మణుల నేత్రముల కతడు నయనాభిరాముడుగా కన్పట్టెను. జనకభూపతికి, అతని భార్యకు బిడ్డవలెను, యోగీశ్వరులకు సచ్చిదానంద స్వరూపుడుగను గోచరించెను. ఇక జానకికి ఎట్లుగన్పడెనో! ఆమెసంగతి ఆమెకే తెలియని స్థితిలో నుండెను. ఇట్లు రాముడు నానాభావముల వారికి నానారూపములతో కనపడసాగెను.

ఆ కోసలరాజకుమారులు సభాసదుల చూపులను హరించి వారిని సమ్మోహితులజేసిరి. సహజ సుందరులగు వారి రూపలావణ్యములు ఇతరుల హృదయములను హరించుటలో వింత ఏమున్నది!

వారి ముఖములు చంద్రబింబములవలె ప్రకాశించుచుండెను. విరిసిన కలు వలవలె కన్నులుండెను. చంద్రకిరణముల ధిక్కరించు చిరునవ్వు. దొండపండు వంటి పెదవులు, ముక్కు సంపెంగ మొగ్గ. అలినీలాలకములు, వాక్కులు మధుర మంజులములు. వేయేల నఖశిఖపర్యంతము కాంతిచ్ఛటలు వెదజల్లుచున్నవారి చక్కదనమునకు కోటిమన్మథులు దీటురారు. నయనానంద కరముగ రామలక్ష్మణులు సభామంటపమున శోభించిరి.

జనకనృపాలుడు విశ్వామిత్రునికి యజ్ఞశాల చూపెట్టి, తన గృహచరిత్రం తయూ (సీత ఇల్లు అలుకుచూ శివచాపమును ఎత్తి ప్రక్కకు పెట్టిన సంఘటన) వినిపించెను. అనంతరము వారిని తోడ్కొనివెళ్ళి ఉచితాసనములపై ఆసీనుల చేసెను.

చంద్రునిజూచిన నక్షత్రములవలె రాముని రాకతో రాజుల ముఖములు వెల వెలబోయెను. వారు రాముని గురించి ఇట్లు ప్రసంగించుకొనిరి:

రాముడు తప్పక శివునివిల్లు ఎక్కు పెట్టగలడని ఒకడనెను. చాపము నెత్తకున్ననూ సీత వరమాల రాముని మెడలోపడుట తథ్యమని ఇంకొకడు నిశ్చయించెను. సోదరులారా, మన బలపరాక్రమములు కట్టిపెట్టి ఇక వచ్చినదారి పట్టుట మంచిదని ఒకరాజు చమత్కరించెను.

'శివునివిల్లు విరువకనే వీడు సీతనెట్లు వివాహమాడగలడు! మేము సీతకొరకు యమునితోనైనా తలపడెద'మని ఒకడు అహంకారముతో ప్రతి వాదన చేసెను. 'ఓ పృథ్వీపతులారా! వృథావాదులాడి ప్రయోజనములేదు. దశరథ తనయులు చండప్రచండులైన యోధులు. వారిని జయించగల సమర్థుడు ఈ సభలో లేడు. అదట్లుండ సీతారాములు కారణజన్ములు. వారిని జననీజనకులుగా భావించి ధన్యులుకండి.' అని ఒక ధర్మాత్ముడు హితబోధ చేసెను. ఇట్లు ఎవరికి తోచిన విధముగ వారు చెప్పుకొనిరి. ఇంతలో జనకమహారాజు ఆజ్ఞను పురస్కరించుకొని ‹చతురలగుచెలికత్తెలు› సీతను సభాస్థలికి దోడ్కొని వచ్చిరి. జగదంబిక జానకి స్వరూపసౌందర్యములు వర్ణింపరానివి. ఆమె చక్కదనమునకు సాటిరాగల ఉపమానములులేవు. ముల్లోకములు గాలించినను మైథిలికి దీటైన మహిళ కనబడదు.

వాణి వదరుబోతు. రతి నిరంతర వియోగిని. లక్ష్మి గరళముతో పుట్టెను. ఈ ముగ్గురు సీతకు సమానులు కారు. శృంగార సముద్రమును కామదేవుడే స్వయముగ మథించి ఒక నూతన లక్ష్మిని సృష్టించినా ఆమెను జానకితో పోల్చుటకు కవులు ముందుకురారు.

జగన్మోహిని జానకి రకరకముల జయమాల ధరించి చెలులతో గూడి రంగస్థలము చేరగనే దేవదుందుభులు మ్రోగెను. అప్సరసలు పుష్పవర్షము కురిపించి గానము చేసిరి.

సీత ఆ మహాసభను ఒకమారు అవలోకించెను. ఆమె చూపులు శ్రీరా ముని దివ్యవిగ్రహముపై బడి సిగ్గుతో వక్రీభవించెను. ప్రజలు సీతారాముల దివ్యరూపములను చూచి "ఓ దేవుడా! ఈ జనకరాజు శివచాప మెత్తవలెనను ప్రతిజ్ఞ విడనాడి సీతను రామునికిచ్చి వివాహము చేయునట్లు అతనికి సుబుద్ధిని ప్రసాదించుము" అని పురజనులు భగవంతుని వేడుకొనిరి.

అంతట జనకుడు వందిప్రముఖులను పిలిచి వారితో తన ప్రతిజ్ఞను సభి కులకు ప్రకటించవలసినదిగా కోరెను. వందిజనులు రాజు ఆజ్ఞప్రకారము సభ వారి నుద్దేశించి ఇట్లు చెప్పిరి.

"ఓ మహాజనులారా! విదేహరాజు చేసిన ప్రతిజ్ఞ చేయెత్తి చాటు తున్నాము. సావధానులై వినండి. క్షత్రియుల భుజబల మనెడి చంద్రుని - మింగటానికి రాహువు వంటిది శివధనుస్సు. దీని గట్టితనమూ, బరువూ, భారమూ సర్వులకు తెలిసినదే. బాణాసుర, రావణాసురులు మహా బలవం తులు. వారు సైతము దీనిని కదలించుటకు ప్రయత్నించి పరాభవము పొందిరి. ఈ త్రిపురారి కోదండమును నేడు ఎవరు విరచగలరో... జానకి వారిని త్రిలోక విజయ సహితముగా వరించగలదు."

జనకుని ప్రతిజ్ఞవిని భూపతులు ఉత్సాహితులైరి. తాము బలవంతులమని విర్రవీగుచుండిన వారు నడుములు బిగించి లేచిరి. ముందు ఒక్కొక్కరుగా వెళ్ళి చాపమును పైకెత్తుటకు ప్రయత్నించి విఫలులైరి. పిమ్మట పదివేలమంది రాజులు కలసికట్టుగా దానిని కదలించిరి. పట్టి చూచుకొలది దాని బరువు అధికమగుచుండెను. కామాతురుని కటాక్షులకు చలించని పతివ్రతవలె వారి ప్రయత్నములకు ఆ కార్ముకము యేమాత్రము కదలలేదు. పరాభూతులైన భూపతులందరూ సిగ్గుతో తలలు వంచుకొని సభలో కూర్చొనిరి.

పృథ్వీపతుల ప్రయత్నము లిట్లు విఫలమగుట జూచి జనకుడు చాల చింతించెను. అంతట రాజు రోషముతో ఏడుల నుద్దేశించి ఇట్లనెను:

"ఓ సభాసదులారా! నా ప్రతిజ్ఞ విని, నానా లోకముల నుండి యోధులు, వీరులు, పరాక్రమవంతులు, స్వయంవరముకు వచ్చితిరి. కానీ ఈ ధనుస్సు విరిచి నా కన్యను వరించుయోగ్యత గలవానిని బ్రహ్మ సృష్టించ

లేదు. కోదండమును కదిలించుటయే గగనమైనపుడు, ఇక దానిని విరుచు ప్రసంగమే వ్యర్థముగదా! వట్టి వీరాలాపములతో పనిలేదు. మీఆశలను వదులు కొని మీమీ యిండ్లకు దయచేయుడు. మా జానకికి వివాహప్రాప్తి లేదు కాబోలు. ఈ భూతలము నిర్వీర్యమైపోయినదని ముందుగనే తెలిసియుండిన ఇట్లాంటి ప్రతిజ్ఞచేసి పరిహాసమునకు గురికాక ఉండియుందును. ఇపుడు ప్రతిజ్ఞ వదులుకొనుట భావ్యముకాదు. ఈ లోకములో వీరులు లేరా!''

జనకుని పలుకులు లక్ష్మణుని హృదయమున ములుకులై తగిలెను. అతడు అన్నకు నమస్కరించి, రోష కషాయిత నేత్రుడై ఇట్లు ప్రతిజ్ఞచేసెను:

''ఓ సభాసదులారా! రఘుకులస్థులున్న సభలో ఇట్లు అసందర్భముగా మాట్లాడరాదు. రఘుకుల మణి రాముడున్న చోట ఇవ్విధముగ మాట్లా డుట మరీ అనుచితము. ఓ రఘూత్తమా! నీవు అనుమతించినచో ఈ భూమిని బంతివలె పైకి లేపి, పచ్చి కుండను కొట్టినట్లు దానిని బ్రద్దలు చేయగలను. మేరు పర్వతమును ముల్లంగివలె విరచి వేయగలను. మీ ప్రతాపము ఎదుట ఈ పురాతన చాప మెక్కడ? ఓ నాథా! మీరు ఆజ్ఞాపించినచో క్షణములో ఈ కోదండమును పుట్టగొడుగును త్రుంచి నట్లు విరచివేయగలను. లేదా, బ్రతికియున్నంతకాలము విల్లంబులు ముట్ట నని ప్రతిజ్ఞ చేయుచున్నాను.''

లక్ష్మణుని ప్రతిజ్ఞకు భూమి కంపించెను. దిగ్గజములు దిగులొందెను. రాజులు భయపడిరి. సీత సంతసించెను. జనకుడాశ్చర్యపడెను. ముని ప్రసన్ను డాయెను.

శ్రీరాముడు సంజ్ఞచే లక్ష్మణుని నివారించి ప్రేమతో ప్రక్కన కూర్చుండ బెట్టుకొనెను. అంతట విశ్వామిత్రుడు-

''రామా, ఇక నీవు లెమ్ము. శివచాపము విరిచి జనకుని దుఃఖము తొల గించుము'' అని మృదువుగ పలికెను.

రాముడు గురుచరణములకు నమస్కరించి మృగరాజువలె పైకి లేచెను. అప్పుడు రాముని ముఖము హర్ష, విషాదములులేని సమభావముతో దీపిం

చెను. ధీర గంభీరుడై నిలబడిన రాముడు, ఉదయాచలముపై ప్రకాశించు బాల భానుని వలె యజ్ఞమండపమున రాణించెను.

సూర్యోదయమును జూచిన నక్షత్రములు, కుముదములు, ఉలూకములు తమ తమ ఉత్సాహమును పోగొట్టుకొనునట్లు రాముడు లేవగనే రాజుల ముఖములు కాంతిహీనమయ్యెను.

సకల జగత్స్వామి శ్రీరామమూర్తి మత్తగజము మాద్కి యజ్ఞమండపమునకు నడచెను. సర్వజనులు రాముడు శివచాపమును కమలనాళమువలె త్రుంచుగాక! యని దేవత లందరిని ప్రార్థించిరి.

కానీ సీత తల్లి వాత్సల్యమయి, ఆమె వ్యాకులముతో చెలికత్తెలను బిలిచి ఇట్లు గద్దించి పలికెను:

''అమ్మలారా! ఇది యేమివింత! స్త్రీ పురుషులందరూ, నిలబడి వేడుక చూస్తున్నారు. వీరిలో రాజుకు సత్యము చెప్పువారు ఒక్కరు కానరారే! రావణుడూ, బాణుడూ, ఎత్తలేని ఈ భయంకర శివచాపమును పాపమూ బాలుని చేతులలో పెట్టుట న్యాయమా!

ఎక్కడైనా మందరాచలమును బాలమరాళము మోయగలదా! మీరైనాపోయి రాజుతో ఇది అన్యాయమని ఎందుకు చెప్పరు?''

అని చింతించుచున్న జానకి తల్లితో ఒక చెలికత్తె – ''అమ్మా! తేజోవంతులకు వయస్సుతో పనిలేదు. అగస్త్యుడు సముద్రములను పానము చేయలేదా! చిన్న మంత్రమునకు మహాదేవతలు కట్టుబడలేదా! అల్పమైన అంకుశమునకు మత్తగజము లొంగుటలేదా! కాబట్టి నీవు రాముని గురించి విచారించకుము –'' అని చెప్పి శాంతపరచెను.

ఆ సందర్భమున సీత హృదయాందోళన చెప్పనలవికాదు. ఒక్కక్షణము సంతోషముతో ఆమె దేహము పులకరించును. మరొకక్షణము భీతిచే దిగులు పడును. ఒకప్పుడు రాముని జూచును; మరొకప్పుడు భూమిని పరికించును. సంశయము, దిగులు, ఉత్సాహముతో ఆమె మనస్సు కళవళ పడెను. శివధనుస్సు భారమును తొలగించి రామునికి వశమగునట్లు కరుణించమని మన

స్సులో శివ పార్వతులను ధ్యానించెను.

''అయ్యో, మా తండ్రి యెంత కఠిన ప్రతిజ్ఞ చేసెను. ఈ మంత్రి సామంతులు అతనికి బుద్ధిచెప్పరే'' అని మథనపడెను. ''ఓ గంగాధరుని చాపమా! నీకు మ్రొక్కుచున్నాను. రామునికి లోబడుము'' అని శివధనుస్సుకు మనమున మ్రొక్కులిడెను. ఆమె హృదయము పరి పరి విధముల వ్యాకులతకు లోనయ్యెను. తుదకు ఆమె ధైర్యమవలంబించి, రామునితట్టు దీక్షగా చూచి ''త్రికరణశుద్ధిగా నా మనస్సు రఘురాముని చరణకమలములందు లగ్నమై యున్నయెడల ఆ సర్వాంతర్యామి భగవంతుడు నన్ను శ్రీరాముని చరణదాసిగా చేయును'' అని మనస్సును దృఢపరచుకొనెను.

రాముడు జానకివైపు చూచి ఆమె అభీష్టమును గ్రహించెను. వెంటనే అతడు గరుత్మంతుడు సర్పమును జూచువిధమున శివధనుస్సును వీక్షించెను. రాముడు శివచాపము ఎత్తబోవుచున్న సమయమున లక్ష్మణుడు - ఓ దిగ్గజము లారా! శేష, వరాహ, కచ్ఛపములారా! రాముడు శివధనుస్సు విరచనున్నాడు. మీరు భూమిని కంపించకుండునట్లు ధరింపుడు - అని అప్పుడా శేషావతార మూర్తి ఆజ్ఞాపించెను.

జనకుని బాధ, జానకి దుఃఖము, రాణి సంశయము, రాజుల అభిమానము తొలగించు భారము రాముని బాహువులపై నుంచి, పురజనులు ఆతురతతో చూచుచుండిరి.

అంతట శ్రీరాముడు జనులను, జానకిని ఒకమారు కలయజూచి, గురు చరణములకు మనస్సులో నమస్కరించి అతి లాఘవముగ చాపము పైకెత్తెను. దానిని చేతితో ఎత్తినపుడు అది మెరుపువలె తళుక్కున మెరిసెను. వంచి నపుడు ఆకాశమువలె వంగెను. కోదండమును ఎత్తుట, సంధించుట, వంచుట ఒక క్షణములో జరిగిపోయెను. అందరూ దృష్టులప్పగించి చూచుచుండిరేగాని ఎవరికీ ఏమాత్రమూ కనబడలేదు. త్రుటికాలములో రామచంద్రుడు దానిని రెండు తుంటలుగ విరచివేసెను. ఆ విరిగిన శబ్దము భూనభోంతరాళముల వరకూ వ్యాపించెను.

శ్రీరాముడు శివచాపమును రెండు ఖండములుగా చేసిన దృశ్యము చూచిన విశ్వామిత్రుని హృదయము ఉత్సాహముతో సముద్రమువలె ఉప్పొంగెను. చంద్రుని చూచిన చకోరమువలె లక్ష్మణుడు అన్నను చూచి ఆనందించెను. వాడిన వరిచేలకు వర్షముపడినట్లు రాజు, రాణులు హర్షించిరి. అపూర్వమైన జానకి ఆత్మానందము వర్ణింప శక్యముకాదు.

శతానందుని యాజ్ఞప్రకారము చెలికత్తెలు వెంటనడువ, జయమాల చేత బుచ్చుకొని బాల మరాళమువలె సీత రాముని వద్దకు వచ్చెను.

ప్రేమ, ప్రసన్నత, సిగ్గు ముప్పిరిగొనుచుండ జానకి కంపించుచున్న కర కమలములతో రామచంద్రుని కంఠమును జయమాలతో అలంకరించెను.

శంఖము, శహనాయి, భేరి, మృదంగ మంగళ ధ్వనులు మిన్నంటెను. దేవతలు దుందుభులు మ్రోగించి పుష్పవర్షము కురిపించిరి.

సురలు, నరులు, నాగులు, యక్షులు, కిన్నరులు, గంధర్వులు జయజయ ధ్వానములు చేయుచూ సీతారాములను దీవించిరి. సఖులు చెప్పిననూ సీత సిగ్గు సంశయముచే రాముని పాదములకు నమస్కారము చేయలేక పోయెను. మణిరత్నములుగల హస్తములతో రాముని పాదములు స్పృశించి నమస్కరించుటకు సీత వెనుకాడెను. అది గ్రహించి రాముడు చిన్నగ నవ్వుకొనెను.

సభలో కొద్దిమంది క్రూరులు, మూఢులగు రాజులుండిరి. వారు సీతను చూచి కామాతురులై ఇతర రాజులతో ఇట్లు పలికిరి:

"మిత్రులారా - త్వరపడుడు. మనము బ్రతికియుండగా సీత నెవరు కాజెయ్యగలరు? కోదండము విరవడమే గొప్పతనమా! రామలక్ష్మణులను, వారికి తోడై వచ్చిన యెడల జనకునికూడ బంధించి, సీతను తీసుకొనిపోవుదము" అని కయ్యమునకు కాలు దువ్వుచూ ప్రసంగించిరి.

అంతట సభలోనున్న కొద్దిమంది విజ్ఞులు పైకిలేచి - అయ్యా! ఇక మీ ప్రగల్భములు కట్టిపెట్టి ఇండ్లకు కదలండి. విల్లువిరచుటకు ప్రయత్నించినపుడే మీ బలపరాక్రమములేపాటివో నలుగురికి తెలిసిపోయినవి. ఇట్లాంటి బుద్ధి

మంతులు గాబట్టే ముఖానికి అప్పుడే మసి పూసుకొంటిరి. సింహము ఆహారమును కుందేలు ఆశించినట్లు సీతనుకోరుట వ్యర్థము. ఆ లక్ష్మణుని క్రోధాగ్నికి వృథాగా యెందుకు ఆహుతి కాదలంచెదరు. మదమాత్సర్యములు వదలిపెట్టి నిండు హృదయముతో ఆ సీతారాములను జూచి ఆనందించుట మంచిది- అని ప్రత్యుత్తర మిచ్చిరి.

## పరశురాముని ప్రవేశము

వాద ప్రతివాదములతో సభలో కలవరము బయలుదేరెను. లక్ష్మణుడు రాజులవైపు చురచుర జూచెను. స్త్రీ పురుషులు ఏమగునో యని దిగులు పడిరి. ఇంతలో శివచాపము ఖండింపబడిన వార్తవిని పరశురాముడు మండిపడుచూ అచ్చటికి వచ్చెను.

దృఢకాయుడు, ఆజానుబాహుడైన పరశురాముడు కాషాయాంబరములు ధరించి యుండెను. భుజమున యజ్ఞోపవీతము, కంఠమున రుద్రాక్షమాల, లలాటమున విభూతి అలంకరించబడి యుండెను. ఒకచేత విల్లంబులు, మరొక చేత పరశువు పట్టుకుని వీరా వేశముతో అరుదెంచిన ఆ భృగుకుల మార్తాండుని వాలకముచూచి సభికు లెల్లరు భయకంపితులై దిగ్గనలేచి నిలబడిరి. జనకుడు విధేయత ఉట్టిపడుచుండ అతని పాదములకు సాష్టాంగ నమస్కారముచేసి, కుమార్తె జానకిని పిలిచి నమస్కరింపజేసెను. విశ్వామిత్రుడు పరశురాముని కుశలప్రశ్నవేసి రామలక్ష్మణుల రావించి వారిచేత అతనికి పాదాభివందనము చేయించెను. పరశురాముడు ఏమియు ఎరుగని వానివలె సభ నంతయూ ఒకమారు కలయజూచి ఈ సందడికి కారణమేమని జనకుని ప్రశ్నించెను. జనకుడు సీతాస్వయంవర వృత్తాంత మంతయూ అతనికి తెలియజేసెను. అంతలో పరశురాముని దృష్టి భంగపడియున్న శివధనుస్సుపై పడెను. వెంటనే అతడు ఉద్రిక్తుడై-

''ఓయీ రాజా! కాలకంఠుని కార్ముకము ఇవ్విధముగ ఖండించిన ఆ శుంఠ ఎవ్వడు? వానిని శీఘ్రమే నాకు చూపించుము. లేకుండిన నీ రాజ్య ఖండము నంతయూ పెల్లగించి తిరుగవైచెద'' నని సింహగర్జన చేసెను. అతని అరుపుకు సభామంటపము ఘూర్ణిల్లినట్లయ్యెను.

జనకుని నోట తడిలేదు. ఏమి కీడు మూడమున్నదో యని స్త్రీపురుషు లందరూ భీతావహులైరి. వీరి యవస్థను జూచిన శ్రీరాముడు భృగునందనుని ఎదుటకు వచ్చి శాంత గంభీర వచనములతో - "మహాత్మా! ఈ శివధనుస్సును విరిచినవాడు మీసేవకుడను నేను." అని సమాధానమిచ్చెను. పరశురాముడు రామునివైపు చురచుర జూచి-

"ఓరీ, నీవు శత్రువువలె నడచుకొని పైగా సేవకుడనని చెప్పుచుంటివా! శివునివిల్లు విరిచినవాడు నాకు సహస్రబాహుడగు కార్తవీర్యునితో సమానుడైన శత్రువు. ఇచ్చోటు వీడి త్వరగా వెళ్ళిపొమ్ము, లేకుండిన ఈ రాజులతోసహా నిన్ను ఇక్కడనే తుదముట్టించెద"నని దట్టించి పలికెను.

అంతట లక్ష్మణుడు ముందుకువచ్చి - "మునీశ్వరా! మేము చిన్నతనములో ఎన్నియో, ధనుస్సులను విరగగొట్టియుంటిమి. ఇప్పుడు ఈ పురాతన చాపము విరిగిపోయినందుకు మీకింత ఆగ్రహ మెందులకు?" అని చిన్నగ అడిగెను.

లక్ష్మణుని మాటలకు పరశురాముని కండ్లు ఎర్రబడెను. క్రోధావేశముతో పరశువు ఝుళిపించుచూ - "ఓరీ మూర్ఖుడా! నీవు నన్నే ఎదిరించి మాట్లాడెదవా! నీకు నా స్వభావము, చరిత్ర తెలిసినట్లులేదు. ఈ భూమండలమున గల రాజులందరినీ హతమొనర్చిన క్షత్రియాంతకుడనని తెలియదు కాబోలు. ఇదుగో కార్తవీర్యుని వేయి చేతులను తెగగొట్టిన గండ్రగొడ్డలి యిదియే చూడుము. దీని పేరు విన్న గర్భస్థపిండములుసైతం జారి నేల బడును. బాలుడవని నిన్ను కనికరించి వూరకుంటిని" అని పరశురాముడు హుంకరించెను.

లక్ష్మణుడు అతని అదలింపులకు ఏమాత్రము చలించక ధీర గంభీరుడై యిట్లనెను: "ఓ మునివరా! వేషభాషలను బట్టి చూడ మీరు భృగు వంశీయులైన బ్రాహ్మణులుగా కన్పించుచున్నారు. మా సూర్యవంశ క్షత్రియులు బ్రాహ్మణులను ఎప్పటికీ ఎదిరించరు. వేటలుగొట్టి పిల్లల బెదిరించులాగున గొడ్డలి చూపించి మమ్ము హడలగొట్ట జూచుచున్నారు.

లక్ష్మణుని సూటి మాటలకు భృంగువంశ భాస్కరుడైన పరశురాముడు అగ్గి బుగ్గిలమై మండిపడుచూ విశ్వామిత్రుని వైపు ముఖముపెట్టి "విశ్వామిత్రా! నీవైనా ఈ పిల్లవానికి బుద్ధిచెప్పుము. నే నాగ్రహించిన మరుక్షణమే కాలునికి కవళము కాగలడు. లేకుండిన యముని వంటివానిని నన్నెదిరించ గలడా! పిట్ట చిన్నదైననూ కూత ఘనముగా నున్నది. ఇతడు తల్లివద్ద పాలు కాదు - విషము త్రాగినట్లున్నది." అని చెప్పుచున్న మాటలకు లక్ష్మణుడు అడ్డుపడి-

"ఓ యతీశ్వరా, కోపగించిన లాభమేమి? విరిగిన శివుని విల్లు తిరిగి అతుకుకొనగలదా? ఎందులకు ఆవేశపడెదరు! నిలబడినందున కాళ్ళు నొప్పిజెందును. దయచేసి ఆసీనులుకండి!" అని వ్యంగ్యముగా ఎత్తిపొడిచినట్లు ప్రసంగించెను.

ఇట్లు వారిద్దరి మధ్య వాగ్యుద్ధము తీవ్రమగుచుండుట జూచి రామచంద్రుడు లక్ష్మణుని వారించెను. పిమ్మట రాముడు ముని కభిముఖుడై-

"ఓ మునివరా! లక్ష్మణుడు బాలుడు గాబట్టి మీసంగతి తెలియక అట్లు ప్రసంగించెను. వానిని క్షమించవలసినది. దోషము చేసినది నేను. మీ ఇచ్ఛ వచ్చిన విధముగ నన్ను దండించుడు. నేను మీయాజ్ఞ శిరసావహించెదను" అని రాముడు వినయముతో విన్నవించెను.

"ఓయీ, నీవు శివచాపమును ఖండించి ఇప్పుడు నాకు నీతులు బోధించుచున్నావా! నీవు శివద్రోహివి. ఏమియూ ఎరుగనివానివలె చమత్కారముగ నటించు చున్నావు. ఇక నీ మాటలు కట్టిపెట్టి నాతో యుద్ధము చేయుము. లేదా "రామ" అను నీ పేరు మార్చుకొని మారు పేరు పెట్టుకొనుము. లేని యెడల నా కుఠార ఘాతముచే మీ అన్నదమ్ముల నిద్దరినీ పరలోక మార్గము పట్టించెద"నని పరశురాముడు ఉద్రేకించి పలికెను.

"ఓ భృగువంశోత్తమా! రామా! లక్ష్మణుని మాటలకు వామీద కినుక వహించుట న్యాయము కాదు. మీరు బ్రాహ్మణులైననూ మీవద్ద అస్త్రశస్త్రము లుండుట జూచి సోదరుడు క్షత్రియోచితముగ సంభాషించెను. మీరు శుద్ధ బ్రాహ్మణులవలె వచ్చియుండిన లక్ష్మణుడిట్లు మాట్లాడియుండడు. నన్ను

మీతో పోట్లాడమనుచున్నారు. అయ్యో నేను మీ దాసుడనే. అదియునుగాక మీరో పరశురాములు, మరి నేను వట్టి రాముడను. మీకూ నాకూ ఎక్కడి సామ్యము. మీరు బ్రాహ్మణులు గనుక క్షమింపగోరుచున్నాను'' అనెను.

''ఓయీ! నేను బ్రాహ్మణుడనని తృణీకరించి పలుకుచున్నావు. శివ ధనుస్సు విరిచినానని గర్వించితివి. ఇదిగో ఈ పరశువుతోనే లెక్కలేని క్షత్రియుల తలలు తెగనరికి సమరయజ్ఞము చేసితిని. ఈ పరశురాముని బల దర్పము ప్రపంచమునకే తెలియునే'' అని దర్పముతో పలికెను. అంతట రామ చంద్రుడు ''ఓ మహాత్మా! మీరు బ్రాహ్మణులని భావించి జయమను పలికితినికాని, మీ బలశౌర్యములకు భయపడి కాదు. యుద్ధరంగమున కాలుడే ఎదురైననూ క్షత్రియుడు వెనుకాడడు. దేనికీ భయపడని నేను నీ కెందులకు భయపడుదును!''

'దేనికీ భయపడని నేను నీ కెందులకు భయపడెద'నని రాముడన్న మాటలయొక్క గూఢార్థము పరశురామునికి తటాలున అవగతమయ్యెను. ఓహో! ఇతడు అవతార పురుషుడుగా నున్నాడు. కానీ, పరీక్షించి చూచెదనని మనస్సులో వూహించి,

''ఓ రామా! ఈ నా వైష్ణవ ధనుస్సును నీవు ఎక్కుపెట్టిన యెడల నీవు సామాన్య మానవుడవు కాదని గ్రహించెద''-నని చెప్పుచూ పరశురాముడు తన విల్లును శ్రీరామునికి ఇయ్యబోయెను. ఇంతలో ఆ చాపము దానంతటవే శ్రీరాముని చేతులలోనికి ఎగిరిపోయెను. పరశురాముని ఆశ్చర్యమునకు మేర లేకపోయెను. ఒకప్పుడు విష్ణువు ఆ ధనుస్సును పరశురాముని చేతికిచ్చి ''ఎవరు ఈ ధనుస్సును ఎక్కు పెట్టగలరో వారు నా అవతారమని తెలుసుకొనుము. అప్పుడు నీవు అరణ్యమునకువెళ్ళి తపస్సు చేసికొనుము'' అని చెప్పియుండెను. పరశురామునికి వెంటనే విష్ణువు చెప్పిన ఆ మాట గుర్తుకు వచ్చి ఓహో ఇతడు సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు యొక్క అవతారమేనని తెలుసుకొని సంతోషముతో దేహము పులకింప, చేతులు జోడించి ''ఓ రామా, నీవు శంకరుని మానస సరోవరమునందు విహరించెడి ఆ రాజహంసవు. సాక్షాత్ భగవత్స్వరూపుడవు. రాక్షసవంశము నాశనమొనర్చి భూభారమును

తొలగించుటకై అవతరించిన ఆదిదేవుడవు. హే రఘువంశోత్తమా! రామా, నా అనుచిత వాక్యములను క్షమించి దయదలచుము'' అని పరశురాముడు రాముని ప్రార్థించి అతనివద్ద సెలవు తీసుకొని, తపస్సుకై వెంటనే వనములకు వెళ్ళిపోయెను.

# శ్రీ సీతారాముల కల్యాణము

ఇవ్విధముగ పరశురాముడు నిష్క్రమించగనే రాజమండలి రాముని మహిమ గుర్తించెను. పెన్నిధి లభించిన పేదచందమున మిథిలాపతి మేను హర్షాధిక్యముచే పులకరించిపోయెను. రాజు కౌశికుని చెంతకువచ్చి కరములు ముకుళించి - ''ఓ ఋషీశ్వరా! రామలక్ష్మణులు నా ప్రతిజ్ఞ పూర్తిచేసి నన్నుద్ధరించిరి. ఇది యంతయూ మీ కృపా కటాక్షము వలననే జరిగినది. ఇక మిగిలిన కార్యము కూడా మీరు సంపన్నము చేయవలసినదిగా వేడు కొనుచున్నా''ననెను.

''రాజా! సీతాకల్యాణము శివధనుస్సుపై ఆధారపడి యుండెను. అది ఎప్పుడు విరిగెనో అప్పుడు వైదేహి వివాహము స్థిరపడిపోయెను. అయోధ్యా నగరమునకు వెంటనే వర్తమానమంపి, మీ వంశాచారప్రకారము, వేదోక్తముగ వివాహము చేయుటకు సర్వము సన్నద్ధము చేయించుము.'' అని విశ్వామిత్రుడు జనకునికి ఉపదేశించెను.

రాజు తత్క్షణమే ఒక దూత చేతికి శుభలేఖ యిచ్చి అయోధ్యకు పంపెను. పిమ్మట పురజనులను రావించి పట్టణములోని గృహములను, దేవమందిరము లను, రాజమార్గములను, విపణి వీధులను చక్కగ అలంకరించవలసినదని ఆదే శించెను. రాజాజ్ఞ ప్రకారం పురప్రముఖులు ప్రవీణులగు శిల్పులను, నేర్పరులగు కళాకారులను, ఆరితేరిన పనివాండ్రను రావించి నగరమును శృంగారించుటకు వినియోగించిరి.

వేలాది పనివాండ్రు కార్యనిమగ్నులై విదేహనగరిని వివిధ రీతుల సింగా రించిరి. అచ్చటచ్చట కాంచనముతో చేయబడిన కదళీ తరువులు నిలిపిరి, వానికి నీలమణులచే ఫల పత్రములు, పద్మరాగములచే పువ్వులను అమర్చిరి. మరొకచోట హరితమణులచే వంశ వృక్షములు నిర్మించిరి. ఇంకొక స్థలమున

లేతబంగారుచే నాగవల్లీ నికుంజము లేర్పరచిరి. కొండొకచోట మరకత మాణిక్య వజ్రవైడూర్యాది నవరత్నములను తొలిచి పద్మ పుష్పములు సృజించిరి. వానిపై గాలి పోటులకు కదలుచూ కమ్మని ధ్వని చేయుచుండులాగున రంగురంగులలో భృంగములు చిత్రించిరి. మంగళ ద్రవ్యములుగల పళ్ళెరములు పట్టుకున్న ప్రతిమలను స్తంభములకు చెక్కిరి. రాజమార్గమునందు మంచి ముత్యములచే రంగవల్లులు దీర్చిరి. ఫలపత్ర పుష్పసహితముగ శోభించు ఆమ్ర ద్రుమములను అక్కడక్కడ నిలబెట్టిరి.

తోరణములతో, ధ్వజములతో, పతాకములతో, మణిమయ దీపకాంతులతో, ప్రతి యింటిని అలంకరించిరి. జనకపురిలోని ప్రతి ఇల్లు రాజసౌధంవలె విరాజిల్లెను. సీతారాముల వివాహవేదిక కళ్యాణ మండపముల వైభవమును వర్ణించుట ఎవరికి సాధ్యము! అప్పటి మిథిలానగరి వైభవమునకు పదునాల్గు భువనములు సాటిరావు. అచ్చట దరిద్రుని ఆనందానికి ఆ దేవేంద్రుని సుఖము దీటుగాదు. మారురూపున మహాలక్ష్మియే అవతరించియున్న మిథిల వైభోగము చూచుటకు రెండు కండ్లు చాలవు - వర్ణించుటకు వేయి నాల్కలుగల శేషునికి సాధ్యముగాదు.

## పెండ్లివారి ప్రయాణము

జనకుడు పంపిన రాజదూతలు అయోధ్య చేరిరి. శ్రీరామలక్ష్మణుల శుభ వృత్తాంతము తెలుసుకొని అయోధ్యావాసులు అమితానందము పొందిరి.

దశరథుని చేతులలో శుభలేఖ ఉండెను. హృదయము పుత్రప్రేమతో నిండెను. రాజుకు కొద్దిసేపు నోట మాటరాలేదు. శరీరము పులకరించెను. కన్నుల నుండి ఆనందాశ్రువులు రాలెను. ఉత్సాహముతో దశరథుడు లేఖ చదివెను. భరతశత్రుఘ్నులకు చదివి వినిపించెను. సభికులకు తెలిపెను. వసిష్ఠుని రావించి అతనికి శుభలేఖ అందించెను.

పిమ్మట దూతలను చెంత కూర్చుండబెట్టుకుని ప్రేమాతురుడై ''సోదరులారా! బిడ్డలు క్షేమముగా యున్నారుగదా? పెద్దవాడు నల్లగను, చిన్నవాడు ఎఱ్ఱగను ఉందురు. వారు ధనుర్బాణములు ధరించియుందురు. వారివెంట కౌశి

కుడు ఉండును. వారి పోలికలు మీరు గుర్తించితిరి గదా! జనకరాజుకు వారెట్లు పరిచితులైరి. మునివెంట వెళ్ళినదాది వారి సమాచారమే తెలియ లేదు.'' అని పలువిధములగు ప్రశ్నలు వేసెను.

''రాజాధిరాజ దశరథ మహారాజా! రామలక్ష్మణులవంటి కుమార రత్న ములను కన్న మీ భాగ్యమేమని కొనియాడగలము'' అని పొగడి రాజ దూతలు రామలక్ష్మణులను గురించి విన్నదీ చూచినదీ - అనగా తాటకా మారీచాదులను వధించుట, అహల్యకు ముక్తినిచ్చుట, శివధనుస్సు త్రుంచుట, పరశురాముని పరాభవించుట మొదలగు రామలక్ష్మణులు చేసిన ఘనకార్య ములు వారు రాజుకు వివరముగ వర్ణించి చెప్పిరి. తనయుల గుణ గణములు, కీర్తి ప్రతిష్ఠలు దూతల ముఖతఃవింటున్నప్పుడు ఆ తండ్రికి కలిగిన పుత్రోత్సా హము అపూర్వమైనది. దశరథుడు మహదానందము పొంది జనకుని రాజదూ తలను బహువిధ పారితోషికములచే ముంచెత్తివేసెను.

అచ్చట నుండి రాజు అంతఃపురమునకు పోయి తన మువ్వురు రాణు లకు, రాణివాస స్త్రీలకు ఈ శుభ వర్తమానము తెలియజేసి రామలక్ష్మణుల ప్రగతి ప్రభావమును అనేక విధముల వర్ణించి చెప్పెను.

మంగళకరమగు శుభవార్త చెవులబడగానే ముగ్గురు రాణులు మహదానం దము పొందిరి. కౌసల్యాది అంతఃపురాంగనలు సంతోషముతో భూరి భూరి దానధర్మాదులుచేసి బ్రాహ్మణులను, యాచకులను సత్కరించిరి.

ఈ సంతోషవార్త సాకేతనగరమంతయూ వ్యాపించెను. ఇంటింట, వీధివీధి సంతోషము స్రవంతులై ప్రవహించెను. అంగళ్ళు అలంకరించి, గృహములు శృంగారించి, వీధులు శుభ్రపరచి, పచ్చని తోరణములు వ్రేలాడగట్టి, పన్నీరు సుగంధాది ద్రవ్యములు వెదజల్లి మంగళవాద్యములు మ్రోగించి, వేదములు పఠించి, పాటలుపాడి, పరస్పరము అభినందనలు తెలియజేసుకొని నగరప్రజలు యావన్మందీ ఆనందాబ్ధి మునిగి తేలిరి. ఆహా! ఆనాటి సాకేతనగర ఆనందాను భూతి ఏమని చెప్పగలము. శ్రీరాముడు అవతరించిన అయోధ్యకు అట్టాంటి ఆనందము అబ్బుటలో ఆశ్చర్యమేమున్నది.

వసిష్ఠుల ఆనతి గైకొని, పెండ్లి ప్రయాణమునకు సర్వము సమాయత్త

పరచమని రాజు భరతునికి ఆజ్ఞాపించెను. భరతశత్రుఘ్నుల పర్యవేక్షణక్రింద మంత్రులు, సేనాపతులు, సేవకులు ప్రయాణసన్నాహములు ప్రారంభించిరి.

చతురంగ సేనావాహినులు ఊరికి వెలుపల సమాయత్తము చేయబడెను. వాయువేగ మనోవేగమును ధిక్కరించు గుఱ్ఱములను అయిదేసి వరుసలుగా నిల బెట్టిరి. అస్త్రశస్త్రములు ధరించిన రాజకుమారులా యశ్వముల నధిష్ఠించి యుండిరి. కత్తిసాములందు గడితేరిన ఇద్దరేసి భటుల చొప్పున ఆ గుఱ్ఱముల కిరుప్రక్కల కత్తులుబట్టుకొని నిలబడిరి.

బంగారు అంబారీలు కట్టిన మదగజములను ఒక ప్రక్కగా నిలబెట్టిరి. శ్యామవర్ణములుగల సైంధవములు పూన్చిన రథములు పంక్తులుదీరెను. పల్లకీలు, బండ్లు, కావడిమోతగాండ్రు మొదలైన వాహనములు నిర్ణీత స్థలములందు చేరెను.

మంత్రులు, సామంతులు, సేనాపతులు, వందిమాగధులు, విదూషకులు, నటనటీవర్గము, రాజపరివారము, పురజనులు వారి వారికి నిర్ణయించిన వాహనముల నధిష్ఠించిరి.

వంశాచారప్రకారం వివాహమునకు పూర్వము చేయవలసిన శుభకార్యములు నిర్వర్తించి, ముత్తయిదువలు మంగళహారతులు బట్టుచుండ - సౌధోపరిభాగ ములనుండి సుమనోవర్షము కురియుచుండ మంగళవాద్యములు ధ్వనించు చుండ, దశరథరాజు భవనమునుండి వచ్చి సాలంకృత స్యందనముపై సుఖాసీను డయ్యెను. వారి సరసనే మరొక రథముపై కుల గురువు వసిష్ఠులవారు ఆసీను లైరి. ఆ వెంటనే రాణులు, రాజపుత్రులు, రాజపరివారము తమకై ప్రత్యేకించిన వాహనముల నారోహించిరి.

ఇట్లు సర్వము సమాయత్తమైన పిమ్మట శుభలగ్నమున శంఖధ్వానములు చేసి ''బరాత్'' (మగపెండ్లివారు) మిథిలా నగరానికి బయలుదేరిరి. దశరథ మహారాజు వచ్చుచున్నాడను వార్తతెలిసి, జనకుడు మార్గము చక్కబరచి వంతె నలు కట్టించి ఆహారపానీయాదులతో మజిలీ లేర్పరచి వారి ప్రయాణము సుఖకరముగ నుండునట్లు చేసెను.

పెండ్లివారు మిథిల సమీపించగనే జనకభూపతి ఫలములు, పుష్పములు, సుంగధద్రవ్యములు, భోజన పదార్థములు, వస్త్రములు, రత్నములు మున్నగు కాన్కలు తీసుకొని వారికి ఎదురేగెను. రెండు ఆనందసముద్రములు గట్లు తెంచుకొని కలియుచున్నవా! అన్నట్లు ఉభయపక్షములవారు ప్రీతిపూర్వకముగ పరస్పరము కలుసుకొనిరి. జనకుడు సముస్తరాజమర్యాదలతో వారిని తోడ్కొనివచ్చి, సర్వసౌకర్యములు కలిగిన విడిదిగృహములలో వారిని దింపెను.

వరునిపక్షమువారు వచ్చినారని తెలియగనే సీత అష్టసిద్ధులను స్మరించి, పెండ్లివారికి ఎటువంటి లోటులేకుండా సర్వసౌకర్యములు కల్పించుమని వానిని కోరెను. పెండ్లివారు ఇంద్రలోక సౌఖ్యముల అనుభవించుచూ జనకుని ఐశ్వ ర్యమును వేనోళ్ళ మెచ్చుకొనుచుండిరి.

దాహముగొన్న వాని వద్దకు తటాకమే బయలుదేరినట్లు విశ్వామిత్రుడు రామలక్ష్మణులను వెంటబెట్టుకొని దశరథుని దర్శించుటకు వారున్నచోటుకు వెళ్ళెను. కౌశికుని చూడగానే దశరథుడు దిగ్గునలేచి ఎదురువెళ్ళి ఋషికి సాష్టాంగపడి నమస్కారముచేసి అతని పాదధూళి శిరమున కద్దుకొనెను. గాధి సూనుడు రాజును కౌగలించుకొని ఆశీర్వదించెను. పిమ్మట రామలక్ష్మణులు తండ్రిపాదములకు నమస్కారము చేసిరి. పుత్రులను చూడగనే తండ్రికి పోయిన ప్రాణము తిరిగి వచ్చినట్లయ్యెను. దశరథుడు మనసారా బిడ్డలను హృదయము నకు హత్తుకొని ఆనందాశ్రువులు రాల్చెను. అనంతరము రామ లక్ష్మణులు వసిష్ఠులకు, బ్రాహ్మణులకు ప్రణమిల్లి, భరతశత్రుఘ్నులను కలుసుకొనిరి. అయోధ్యనుండి వచ్చిన బంధుబాంధవులను చూచి రామచం ద్రుడు పరమానందభరితుడై వారిని మధురవచనములచే పల్కరించి పరామర్శిం చెను. శ్రీరాముని వినయవిధేయతలు చూచి అయోధ్యావాసులు ఆనందమం దిరి. ధర్మార్థ కామమోక్షములు సాక్షాత్కరించి నిలబడియున్నట్లు తనుచుట్టూ చేరిన నల్వురు పుత్రుల మధ్య సాకేతాధీశుడగు దశరథుడు శోభించెను. పుణ్యు లగు ఆ తండ్రీ తనయుల భాగ్యము నేత్రపర్వముగ తిలకించుచున్న మిథిలాపుర వాసుల హృదయములు చల్లబడెను.

‘‘సీతారాముల కల్యాణము కన్నులారా చూడబోవుచున్న మిథిలాపుర

వాసుల అదృష్టమే అదృష్టము. దశరథ జనకులు ఎంతటి సుకృతాత్ములైన వియ్యంకులు! వారు చేసిన పుణ్యమే వారి కడుపున సీతారాముల రూపముతో అవతరించినది. జనకుడు, దశరథుడు పుణ్యపురుషులు. సీతారాములు శోభా సముద్రులు. ఎంత చక్కని సంబంధము! ఎంత ముచ్చటైన అనుబంధము వారిది. ఆహా! దశరథుని నల్గురు పుత్రులకు మిథిలయందే సంబంధమేర్పడిన ఎంత బాగుండును!'' అని మిథిలాపుర స్త్రీపురుషులు ఆశించుచూ దేవుని ప్రార్థించిరి. బ్రహ్మ స్వయముగ శ్రీ సీతారాముల వివాహమహోత్సవమునకు సుముహూర్తము నిర్ణయించెను. హేమంతఋతువు, మార్గశీర్షమాసమున గ్రహ, వార, నక్షత్ర, తిథియోగములు శుభముగ కూడినవేళ లగ్నముకట్టి, బ్రహ్మ దానిని నారదుని చేతికిచ్చి జనకునివద్దకు పంపెను. జనకుని పురోహితులు కూడ అదే వేళకు ముహూర్తము నిర్ణయించియుండిరి. మంగళ కర మగు గోధూళివేళ అన్నివిధముల బాగుండునని శతానందుడు రాజుకు తెలియ జేసెను. జనకుడు వెంటనే మగ పెండ్లివారిని యథోచిత మర్యాదలతో తోడ్కొనిరమ్మని చెప్పెను.

రాజు ఆనతిచొప్పున మంగళకలశములతో, సువాసినుల మంగళగీతాలాపము లతో, విప్రుల వేదపఠనములతో, శహనాయి, మృదంగాది మంగళవాద్యములతో పెండ్లికూతురి పక్షమువారు పెండ్లికుమారుని పిలుచుకుని వచ్చుటకు విడిది గృహమునకు చనిరి.

ఆడపెండ్లివారు దశరథమహారాజును సమీపించి ''రాజా! ముహూర్తము నకు వేళకావచ్చినది. ఇక తమరు దయచేయవలసిన''దని విన్నవించిరి. కోసల పతి కులగురువుతో సంప్రదించి, కులాచార విధులు నిర్వర్తించి, తన పరివార పరిజనముతో పెండ్లింటికి బయలుదేరెను.

శివ బ్రహ్మాది దేవతలు విమానారూఢులై శ్రీ సీతారాముల వివాహమహో త్సవము చూచుటకు అంతరిక్షమున నిలచియుండిరి. దేవతలు, విద్యాధరులు సుమనోవర్షము కురిపించి, సంతోషముతో దేహములు పులకరింప, దివినుండి ఆ వేడుకలను చూడసాగిరి.

దివ్య వైభవముతో మిథిలానగరము దేవనగరినిమించి శోభించుచుండెను. సమస్త రాజలాంఛనములతో సాకేతపతి సపరివారుడై మేళకము మధ్య నడచుచుండెను.

వారి మధ్యలో మూర్తీభవించిన అపవర్గ చతుష్టయమువోలె రామ భరత లక్ష్మణ శత్రుఘ్ను లుండిరి. రామభరతుల మేని ఛాయలు మరకతమణిదీప్తుల మెరయుచుండ; లక్ష్మణ శత్రుఘ్నుల శరీరములు స్వర్ణకాంతులు వెదజల్లు చుండెను.

శ్రీరామునిది నెమలి కంఠముతో సమానముగు కాంతిగల శరీరము. దానిపై నున్న ఉత్తరీయము మెరుపువలె భాసించుచుండెను. అతని కన్నులు నవ వికసిత నీల కమలములు. దివ్య భూషణాలంకృతుడగు శ్రీరాముడు ముత్యములు, మణి మాణిక్యాదులచే అలంకరించబడిన అందమగు అశ్వరాజమును అధిష్ఠించి యుండెను.

మేఘమును జూచిన మయూరమువలె నృత్యరీతిలో నడచుచున్న గుఱ్ఱముపై స్వారి చేయుచున్న శ్రీరాముని దివ్యమంగళ విగ్రహమును, దివినుండి తిలకించుచున్న దేవతలకు ఎంత జూచినను తృప్తి కలుగలేదు. శంకరుడు పదిహేను నేత్రములతో, బ్రహ్మ ఎనిమిది కండ్లతో, కుమారస్వామి పన్నెండు నయనములతో, ఇంద్రుడు సహస్రాక్షులతో రాముని దర్శించినను సంతృప్తి పొందలేకపోయెను.

ఇట్లు పెండ్లికి సంబంధించిన ఉభయ పక్షములవారు సంరంభ సంతోషము లతో ముందుకు జనిరి.

పెండ్లివారు వచ్చువేళకు, రూపమున రతీదేవిని లజ్జింపజేయుగల అంతఃపు రాంగనలు మంగళహారతులు సిద్ధపరచిరి. మంగళాంగులగు అంగనామణులు వివిధ వస్త్రాలంకారభూషితులై మణిమయ మంజీర కంకణములు ఘల్లుఘల్లున మ్రోగుచుండ, కోకిల కంఠమున పాటలు పాడుచూ స్వర్ణకలశములు తీసుకొని పెండ్లివారికి ఎదురేగిరి. శచీ - శారద - లక్ష్మి - సరస్వతీ - మున్నగు దేవాంగనలుసైతం మానవరూపమున వచ్చి జనకపురి స్త్రీలతో

కలిసియుండిరి. పుష్పముల ఘుమఘుమలతో, కలగానములతో, మంగళవాద్య నాదములతో భూమ్యాకాశములు ప్రతిధ్వనించుచుండ, ఆ చంద్రవదనలు ఆనందకందుడగు శ్రీరామచంద్రునికి హారతిబట్టి అర్ఘ్యమిచ్చిరి. పిమ్మట పరచిన పట్టు వస్త్రముల మీద నడుచుచూ వెళ్ళి పెండ్లికుమారుడు వివాహమంటపము చేరెను. సువాసినులు శ్రీరాముని పెండ్లిపీటల మీద కూర్చుండజేసి, హారతి బట్టి, మణిభూషణ వస్త్రాదులు దిగదుడిచి పారవేసిరి. వనివాంద్రు వాటిని స్వీకరించి శ్రీరాముని దీవించిరి.

ముని మనస్సులను సైతము భ్రమింపజేయగల వివాహమంటపము యొక్క నిర్మాణశోభ వర్ణింప శక్యము గానిది. జనకుడు దశరథుని రాజలాం ఛనములతో ఆహ్వానించి ఉచితాసనముపై కూర్చుండబెట్టెను. తరువరి వశిష్ఠ, విశ్వామిత్రవామదేవాది మహాత్ములను భక్తిశ్రద్ధలతో పూజించి రాజు స్వహస్త ములతో వారికి ఆసనము లమర్చెను. వివాహమున కేతెంచిన సాకేతవాసుల నందరినీ జనకుడు దశరథునివలెనే సత్కరించి వారిని సుఖాసీనుల జేసెను. తమతమ నిజరూపములు మరుగుపరచి బ్రాహ్మణ వేషములతో బ్రహ్మ, విష్ణువు, మహేశుడు, దిక్పాలురు, దినకరుడు మున్నగువారు వివాహమునకు వచ్చియుండిరి.

అనంతరము జనకభూపతి, దశరథమహారాజు ఇద్దరూ కలసి మెలసి లౌకిక, వైదిక శుభకార్యములు జరిపించిరి. ఆ వియ్యంకుల ప్రేమానురాగ ములు, ఆదర్శమైన వారి అన్యోన్యత చూచినవారు ముగ్ధులైరి.

వెంటనే వశిష్ఠుని అనతిప్రకారము శతానందుడు వెళ్ళి పెండ్లికూతురును తీసుకొనివచ్చుటకు సమయ మయినదని రాణితో చెప్పెను.

పురోహితుని పిలుపు వినగానే రాణియు, చెలికత్తెలు ప్రసన్నచిత్తులై వెంటనే పెద్ద ముత్తయిదువులను రావించి చేయవలసిన శుభకార్యములను ముగించి జాన కిని సర్వాలంకార శోభితగా జేసిరి.

షోడశరీతులలో చక్కగ శృంగారించబడిన సీతాకుమారిని వెంటబెట్టుకుని, అతిరూపవతులగు చెలులు గజగమనముతో కదలిరి. ఆ కాంతామణులు కు

నీయకంఠములతో గానము చేయుచుండిరి. వారి కరకంకణములు కాలియంది యలు కదలునప్పుడు ఘల్లుమనుచుండెను. శోభావతుల మధ్య పరమ శోభా వలి వయనించుచున్నదా యన్నట్లు, షోడశ శృంగారవతులగు సుందరీమణుల మధ్య మైథిలి మెల్లమెల్లన అడుగులిడుచుండెను.

రూపరాశి, పునీతయగు సీత పెండ్లిమంటపము ప్రవేశించెను. పెండ్లివారు తమలోతాము ఆమెకు ప్రణమిల్లిరి. రామచంద్రుడు జానకినిదర్శించి పూర్ణ మనోరథు డయ్యెను. దశరథుని ఆనందము వర్ణింపశక్యముగాదు. మునిజనము దీవించిరి. దేవతలు పుష్పములు జల్లిరి. విప్రవరులు శాంతి వచనములు పఠిం చిరి. మంగళవాద్యములు మ్రోగెను. వైదేహి వివాహ మంటపము చేరగనే సంరంభ సంతోషములతో మంటపమంతయూ కళ కళ లాడెను.

పిమ్మట వశిష్ఠుడు, శతానందుడు కులగురువు లిద్దరూ చేరి శుభకార్య ములు ప్రారంభించిరి.

వివాహమునకు కావలసిన మధుపర్కము మొదలగు మంగళద్రవ్యములు కనక కలశములతో దెచ్చి పరిచారకులు సిద్ధము చేసిరి. ప్రారంభమున గౌరీ గణపతులను పూజించిరి. వారు ప్రత్యక్షమై పూజలందుకొని వధూవరుల నాశీ ర్వదించిరి. సూర్యనారాయణుని సలహామేరకు దేవతారాధన మొదలగు కార్య ములు ముగింపబడెను.

పిమ్మట శ్రీరాముని సరసన జానకిని కూర్చుండబెట్టిరి. అపుడు ఆ నవ వధూవరులు పరస్పరము ప్రేమతో వీక్షించుకొనిరి. ఆ సీతారాముల తొలి చూపుల యొక్క రహస్యార్థము మన బుద్ధికి, మనస్సుకు అవగతము కానిది.

హోమసమయమున అగ్నిదేవుడు శరీరధారియై వచ్చి ఆహుతులను స్వీక రించెను. జనకుడు అతవి పట్టపురాణి సునయన స్వర్ణపాత్రలందుంచిన మంగళజలముతో అల్లుని పాదములు కడిగిరి. ఏ చరణకమలములు శివుని హృదయసరోవరమున సదా శోభించుచుండునో, ఏ పాదపద్మములను స్మరిం చిన మాత్రమున సకల కలిదోషములు హరించుకొని పోవునో, ఏ చరణస్పర్శచే అహల్య తరించెనో, ఏ పాదములందు దేవగంగ అవతరించెనో, శ్రీరాముని ఆ దివ్యచరణములను జనకుడు ప్రక్షాళనచేసి భాగ్యమందెను.

కులగురువు లిద్దరూ వధూవరులచే పాణిగ్రహణము చేయించి శాఖోచ్చారణ చేయించిరి. హిమవంతుడు పార్వతిని పరమేశుని కిచ్చినట్లు, సముద్రుడు లక్ష్మిని విష్ణువుచేతులలో ఉంచిన విధముగ జనకభూపతి వేదోక్తప్రకారము తన పుత్రిక జానకిని శ్రీరామునికిచ్చి సాలంకృత కన్యాదానము చేసెను. ఆ శుభ సమయమున జయజయధ్వానములు చేసి, మంగళధ్వనులు ప్రయోగించి, అక్షతలు, పుష్పములు జల్లి, పాటలుపాడి స్త్రీలు, పురుషులు, దేవతలు, సర్వులు తమ తమ హర్షామోదములు తెలియజేసిరి.

పిమ్మట వధూవరులవస్త్రములు ముడివైచి హోమమునకు ప్రదక్షిణము చేయించుచూ సప్తపది జరిపించిరి.

సప్తపది సందర్భమున శ్రీరాముడు తన కరకమలములతో సీత శిరస్సున సిందూర ముంచెను. తదనంతరము వశిష్ఠుని యాజ్ఞానుసారము వధూవరులు ఒకే పీఠము మీద ఆసీనులైరి. ఏక పీఠస్థులై ఉన్న కొడుకు, కోడలిని చూచి కోసలపతి హృదయము కల్పవృక్షము వలె ఫలించెను. శ్రీ సీతారాముల శుభ వివాహము సంపన్న మాయెనని సమస్త లోకములవారు తమ సంతోషమును వ్యక్తము చేసిరి.

ఆపైన వశిష్ఠుని ఆనతి గైకొని జనకుడు మాండవి, శ్రుతకీర్తి, ఊర్మిళ ముగ్గురు కన్యలను రప్పించెను. కుశకేతుని కుమార్తె రూపగుణశీలయగు మాండవిని భరతునకు, అతిరూపవతి యగు జానకి చెల్లెలు ఊర్మిలా కుమారిని లక్ష్మణునకు, సుహాసిని, సుగుణవతియైన శ్రుతకీర్తిని శత్రుఘ్నునకిచ్చి యథావిధి వేదోక్త ప్రకార వివాహములు జరిపించిరి. ఆ వధూవరులు ఎనమండుగురూ ఒండొరుల చూచుకొని తమ కనుగుణమైన జోడు కుదిరిందని సిగ్గుతో సంతోషించిరి. జాగ్రత్స్వప్న సుషుప్తి తురీయావస్థలు నాలుగు తమ అధిదేవతలతో కూడి మూర్తీభవించి యుండునట్లు ఒకే మండపమందున్న ఆ నల్వురు దంపతులు చూపరుల దృష్టికి శోభించుచుండిరి.

దశరథుడు తన నలుగురు పుత్రులను, నల్వురు కోడండ్రనుగాంచి సేవా శ్రద్ధా తపోభక్తియనెడి చతుర్విధ క్రియలతో గూడియున్న ధర్మార్థ కామ మోక్షములను పొందినంత ఆనందము అనుభవించెను.

జనక చక్రవర్తి వధూవరుల కిచ్చిన కాన్కలు, కట్నములు, లెక్కించుట సాధ్యపడదు. బంగారు, రత్నములు, పీత పీతాంబరములు, రథములు, ఏనుగులు, గుర్రములు, కామధేనువుల వంటి గోవులు, దాసదాసీలు మొదలగు అమూల్య వస్తుసంపదను అల్లుండ్రకు చదివించెను. ఇట్లు యథావిధి వివాహ విధులన్నియూ ముగియగనే జనకరాజు వివాహమునకు వచ్చిన అతిథులను, బంధువులను మగపెళ్ళివారిని, మునీశ్వరులను, దేవతలను యథోచిత భక్తిశ్రద్ధలతో సత్కరించెను. కడపట జనకుడు అతని తమ్ముడు కుశకేతుడు దశరథుని వెంతకు వచ్చి చేతులు మోడ్చి, వినయ విధేయతలతో ఇట్లు పలికిరి. ''ఓ కోసలాధీశ్వరా! మీతో సంబంధము మాకు గౌరవప్రదమైనది. మమ్ములను మీ దాసులుగా పరిగణించి ఈ నల్వురు బిడ్డలను మీ సేవకురాండ్రుగా స్వీకరించి ప్రేమతో పోషించవలసినది. కేవలము వర్తమాన మంపి ఇంతదూరము మిమ్ము రప్పించినందుకు క్షమించవలసినదని వేడుకొనుచున్నాము.'' అంతట దశరథుడు కూడా ఉచిత రీతిని వారికి సమాధానమిచ్చి సంతోషపరచెను.

ఆ వియ్యంకుల అన్యోన్యానురాగము, పరస్పర ప్రేమ, వర్ణింప శక్యము కాదు. పంచ వాద్యములు, దేవ దుందుభులు ధ్వనించుచుండ దశరథరాజు సపరివారుడై తన విడిదికి వేంచేసెను. వశిష్ఠుని యానతి ప్రకారము వధూవరులు అంతఃపురములోనికి వెళ్ళిరి.

శ్రీరామచంద్రుని రూపరేఖా విలాసములు మాటిమాటికి చూచుటకు సీత సంకోచించు చుండెను. కాని, ఆమె మనస్సు మాత్రము సిగ్గుపడుటలేదు. ఆ మీనాక్షి తృషిత నేత్రములు రాముని రూపజలములకై తహతహ లాడుచుండెను.

సర్వాలంకార శోభితుడైన రామచంద్రుని దివ్యవిగ్రహము ధగధగద్ధగాయమానమై దీప్తులు వెదజల్లుచుండెను. ఆ ముద్దరాలు తన ముంజేతి మణి కంకణములపై పడుచుండు ప్రియుని ప్రతిబింబము చూచుకొని తృప్తిచెందెను.

రాణివాసమందు, మగపెండ్లివారి విడిది గృహమందు ఆ నూతన దంపతులచేత వసంతము చల్లింపచేసి, పూబంతులాడించి స్త్రీలు సరస వినోదముల దేలియాడిరి. అంతఃపురాంగనలు సీతారాముల చక్కని జోడు మాటి

మాటికి చూచుకొని తమ ముద్దు ముచ్చట్లు తీర్చుకొనిరి.

జనకుడు పెండ్లివారిని విందుకు ఆహ్వానించెను. షడ్రసోపేతమై, పంచ భక్ష్యములతో కూడిన ఆ విందు వైభవము అపురూపమై యుండెను. పెండ్లి వారు సరసోక్తులాడుకొనుచూ, ఒండొరులపైపు ఛలోక్తులు విసరుకొనుచూ, హాస పరిహాస వినోదములతో విందారగించిరి. చందన తాంబూలాదులచే జనకుడు అందరినీ సత్కరించి విడిదికి పంపించెను. పెండ్లివారు మిథిలాపురమందు నిత్యనూతనముగ విందులు చేయుచూ, వినోదములు చూచుచూ, ఉత్సవములు జరుపుకొనుచూ దివారాత్రములు క్షణములవలె గడుపుచుండిరి.

ఒకనాటి ప్రాతఃకాలమున దశరథుడు వసిష్ఠునితో సంప్రతించి ఋషీశ్వరులను బ్రాహ్మణులను, యాచకులను ఆహ్వానించి, వారిని గోదాన, వస్త్ర దాన, సువర్ణదానాదులచే సత్కరించెను. ఆ సందర్భములో కోసలపతి కౌశికునికి ప్రత్యేకముగ తన కృతజ్ఞతను తెలియజేసి పూజించెను. వారు దశరథుని వినయము, వితరణ శీలమును వేనోళ్ళకీర్తించుచూ తమ తమ నివాసములకు చనిరి.

ఇవ్విధముగ ఆమోద ప్రమోదములతో కతిపయ దినములు గడచెను. దశరథుడు ప్రతి నిత్యమూ అయోధ్యకు ప్రయాణ మగుటకు ప్రయత్నించును. కానీ, జనకుడు అడ్డుపెట్టుటచే ఆగిపోవుచుండెను. పెండ్లివారుభయులు ప్రేమ పాశముచే బంధింపబడి ఒకరినొకరు వీడలేకుండిరి.

ఒకదినము జనకుని వద్దకు వసిష్ఠుడు, శతానందుడు వచ్చి దశరథరాజు అయోధ్య వెళ్ళుటకు అనుమతించవలసినదని కోరిరి. అందుకు అతికష్టము మీద జనకుడు సమ్మతించెను.

అవధేశుడు అయోధ్యకు ప్రయాణ మగుచున్నాడను వార్త తెలియగనే సచివులు, సామంతులు, బ్రాహ్మణులు, పురవాసులు ప్రేమవశులై జాలిపడిరి. జనకరాజు అపారమైన భోజనసామగ్రిని వేలాది వంటవాండ్రతో కూడ అయోధ్యకు పోవు మార్గమందుండెడి మజిలీలకు ముందుగనే రవాణాచేయించెను.

జనకచక్రవర్తి అల్లుండ్రకు, కూతుళ్లకు, వియ్యంకునికి, పెండ్లివారికి కుప్పలు తిప్పలుగ ఇచ్చిన అమూల్య వస్తుసంపద ఇంతింతని ఊహింపరానిది.

పెండ్లివారి ప్రయాణవార్త చెవుల బడగానే రాణులు సీతావియోగము తల చుకొని శోకతప్తులైరి. వారు జానకిని ఒడిలోనికి తీసుకొని ముద్దులాడి, ఆశీ ర్వదించి ఆమెకు అనేకములైన నీతులు బోధించిరి. ''బిడ్డా భర్తకు ప్రియ ముగా నడుచుకొనుము. అఖండమాంగల్యము పొంది వర్ధిల్లుము. అత్త మామ లను, గురుజనులను శ్రద్ధాభక్తులతో సేవించుము. భర్త అభిలాషకు అనుగుణ ముగ ప్రవర్తించుము'' అని రాణులు, సఖులు, ఇతర అంతఃపురస్త్రీలు ఒక్కొ క్కరికి హితవచనము లుపదేశించి దీవించిరి.

అప్పుడు శ్రీరాముడు తన తమ్ములతోకూడి అంతఃపురమునకు సెలవు తీసుకొనుటకై వచ్చెను. ఆ రాకుమారులను చూచుటకు స్త్రీలు, పురుషులు, బాలురు, గురువులు చేరిరి. రాణులు శ్రీరామాదులను సమీపించి ఏలాటి సంకోచము లేకుండ వారియెడల తమకున్న ప్రేమానురాగములు వ్యక్తపరచిరి. వారు రామ, భరత, లక్ష్మణ, శత్రుఘ్నులకు అభ్యంజనము చేయించి, వివిధ పక్వాన్నములతో విందుచేసిరి. శ్రీరాముడు మృదు మధుర వాక్కుల రాణులను సంబోధించి - ''తండ్రిగారు అయోధ్యకు పయనము గాదలంచి మీవద్ద సెలవు పుచ్చుకొనుటకు మమ్ము పంపిరి. తల్లులారా! మమ్ములను మీ బిడ్డ లుగా భావించి వెళ్ళుటకు అనుమతించవలసిన''దని కోరెను.

వారి మాటలు విన్న రాణివాసస్త్రీలు ప్రేమోత్కంఠలై కొద్దిసేపు మాట్లాడలేకపోయిరి. వారు తమ కుమార్తెలను ఒకసారి మనసారా కౌగలించు కొని వారి భర్తల చేతులలో బెట్టిరి. సీతతల్లి చేతులు జోడించి రామునితో ఇట్లనెను.

''నాయనా! ఈ బిడ్డను మేము, మా కుటుంబీకులు మా ప్రాణముల వలె చూచుకొని యుంటిమి. బుద్ధిమంతుడవగునీవు సీత గుణశీలములు గుర్తించి ఈమెను దాసిగా అనుగ్రహింపుము.''

ఈ మాటలు ప్రేమ, వాత్సల్యము, అనురాగము ముప్పిరిగొనుచుండ ఆమె గద్గదకంఠయై పలికెను. రామచంద్రుడు నమ్రభావముతో వారికి సమాధా

నమిచ్చి, వారి పాదములకు నమస్కరించి సెలవు తీసుకొనెను.

ఆడుబిడ్డలను సాగనంపునపుడు ఆ తల్లులకు కలిగిన ఆవేదన ఇంతింతని చెప్పరానిది! రాణులు, సఖులు, దాసదాసీజనము సీతను విడువలేక విడువలేక జాలిగొని వ్యధచెందిరి.

సీతచే పెంచబడి మచ్చికచేయుబడిన శుకపికశారికాదిఖగములు, మృగములు సైతం దీనత్వమునుబొంది వ్యాకులపడెను.

సీతను జూచినపుడు జనకుని వైరాగ్యము దిశలకు పరుగులెత్తెను. పుత్రికా వియోగముచే వికలచిత్తుడైన రాజుకు సచివులు సామంతులు ధైర్యముచెప్పి ఓదార్చిరి. తుదకు తండ్రి కండ్లనీళ్ళతో బిడ్డకు ఎన్నియో నీతులు గరపి దీవించెను. పిమ్మట మైథిలిని బంగారు పల్లకియందు శుభలగ్నమున కూర్చుండబెట్టి జనకుడు సజలనేత్రములతో ఆమెను సాగనంపెను. అక్కడ నుండి విదేహరాజు సచివ సమేతుడై సాకేతపతిని సాగనంపుటకు నడచివెళ్ళెను.

పెండ్లివారి చతురంగబలములు, వాహనములు ప్రయాణమునకు సిద్ధమై నిలచియుండెను. శుభసూచకముగ శంఖము, శహనాయి, తురహీ, భేరి, మృదంగ, తాళధ్వనులు మ్రోగెను. శుభశకునములు గన్పట్టెను. దశరథమహారాజు బ్రాహ్మణులను, నగరప్రముఖులను, యాచకులను, పరిచారకులను ఉత్సాహముతో భూరి భూరి దాన మర్యాదలచే సత్కరించి వారి నుండి వీడ్కోలు తీసుకొనెను.

దశరథుడెంత చెప్పినను ప్రేమవశుడైన జనకుడు వారిని వదిలిపెట్టి వెనుకకు మరలి రాలేకుండెను. "మహారాజా! మీరు చాలాదూరము వచ్చితిరి." అని దశరథుడు మృదువచనముల స్నేహపూర్వకముగ పలికెను. అంతట జనకుడు రథముదిగి కన్నుల అశ్రుధారలు గట్టుచుండ కరములు ముకుళించి వియ్యంకునితో "మీ రన్నివిధముల నన్ను కృతార్థుని జేసితిర"ని స్తుతించెను.

తుదిసారిగ జనకుడు వశిష్ఠ విశ్వామిత్రాది మునీశ్వరులకు వందనమిడి, వారి ఆశీర్వాదముల గ్రహించెను. జనకుడు శ్రీరాముని సాక్షాత్ భగవత్స్వరూపుడుగా భావించి అతనిని పలువిధముల ప్రస్తుతించి ప్రణామ మొనరించెను.

రాముడు తన తండ్రి, గురువులకు వలెనే మామకు నమ్రుడై నమస్కారము చేసెను.

పిమ్మట మిథిలేశుడు భరత లక్ష్మణ శత్రుఘ్నులను కలుసుకొని వారివద్ద సెలవు తీసుకొని గృహోన్ముఖుడయ్యెను. అంతట 'బరాత్' అయోధ్యకు పయనము సాగించెను. దారిలో తటస్థించు గ్రామస్థులకు వారు సంతోషముతో విందులు చేయుచూ ఒక శుభదినమున అయోధ్య చేరిరి.

పెండ్లివారి ఆగమవార్త తెలియగనే అయోధ్యవాసుల ఆనందోత్సాహములు పరవళ్ళు త్రొక్కెను. గృహములు, గృహాంగణములు, వీధులు, చతుష్పథములు వివిధ భంగుల శృంగారించిరి. పట్టణమంతయూ పన్నీట తడిపి పరిమళ ద్రవ్యములు వెదజల్లి మంటప ధ్వజ తోరణపతాకములుకట్టిరి. ఫల పుష్పము లతో కూడిన పచ్చనిచెట్లు అచ్చటచ్చట నాటిరి. శుభసూచకముగ పూర్ణకుం భములు గృహాంగణములం దుంచబడెను. రాచనగరు సమస్తయిశ్వర్యముల దివ్య దీప్తులచే వెలుగొందజేయబడెను.

పురంధ్రీమణులు మంగళ హారతులుపట్టుకొని గుంపులు గుంపులుగా కద లిరి. సందడి సంబరములతో రాచనగరు కోలాహలముగా నుండెను. కౌస ల్యాది ముగ్గురు రాణులు ఉత్సాహాతిశయముచే శరీరములు పులకరింప పరవశులైరి. పసుపు, కుంకుమ, చందనము, కస్తూరి, గోరోచనము, ఫలములు, పుష్పములు, పెరుగు, అక్షతలు, నవ ధాన్యములు, వక్కలు, ఆకులు, తులసీదళములు మున్నగు మంగళ సుగంధద్రవ్యములు బంగారు కల శములం దిడుకొని వివిధ మంగళ వాద్యములతో పెండ్లివారికి ఎదురేగిరి.

ఆ సమయమున అయోధ్యపై ఆనందవృష్టి జరిగినట్లుండెను. అంతరి క్షమంతయూ ధూపధూమములచే శ్రావణమేఘము లావరించినవా యన్నట్లు చీకట్లు క్రమ్మెను. దేవతలు దివినుండి చెట్లపూలు, కొంగలబారులవలె కప్పట్లసాగెను. అచ్చటచ్చట వ్రేలాడగట్టిన నవరత్నతోర ణములు ఇంద్రధనుస్సును స్ఫురింపజేసెను. సౌధోపరిభాగమునుండి తొంగి చూచుచున్న అంగనలు మెరుపుతీగలవలె తళుక్కున మెరయుచుండిరి. మంగళధ్వనులు మేఘ ఘర్జనలను తలపింపజేసెను. మండూక మయూర

ములవలె యాచకబృందమ్ము కోలాహలము చేయుచుండెను. పెండ్లివారు శుభముహూర్తమున నగరంలో ప్రవేశించిరి. వందిమాగధులు జోహారులు పలుకుచుండ, పురవాసులు అడుగడుగునా అమూల్యమగు కాన్కలు సమర్పించుచుండ, వేదఘోషలు జయకారములు వివిధ వాద్యధ్వనులు దశదిశల ప్రతిధ్వనించుచుండ, సువాసినులు, మంగళహారతులు బట్టుచుండ భూలోకదేవలోక వాసులు తన్మయులై చూచుచుండ పెండ్లివారు రాచనగరు చేరిరి. రాణులు తమ కుమారులను, కోడండ్రను కన్నులారా చూచి బ్రహ్మానందము పొందిరి. వారు వధూవరులకు హారతులు బట్టి మణి రత్నములచే దృష్టితీసి, అర్ఘ్యప్రదానము చేసి నగరులోనికి తీసుకొని పోయిరి. అచ్చట అత్యంత మనోజ్ఞమగు నాలుగు సింహాసనములపై ఆ దంపతులను కూర్చుండబెట్టి ధూపదీప నైవేద్యాదులతో వధూవరులను వేద సమ్మతముగ పూజించిరి. నేత్రపర్వమగు ఆ సుందర దృశ్యమును తిలకించి - పరమ తత్త్వము పొందిన యోగివలె, అమృతము లభించిన రోగి భంగి, పెన్నిధిగన్న పేద చందమున, చింతామణి చిక్కిన జన్మదరిద్రునివలె ఆ తల్లులు సమస్త మనోరథములు ఈడేరినంత మహదానందము పొందిరి.

తదనంతరము సాకేతపతి సర్వులను మణిభూషణ వసనాదులచే సత్కరించి సాగనంపెను. పిమ్మట గురు బ్రాహ్మణులతో గూడి రాజు అంతఃపురమునకు వెళ్ళెను. అచ్చట కులాచార ప్రకారము చేయవలసిన విధులన్నియూ పూర్తిచేసి సతీసుతులతో కలసి రాజు వశిష్ఠునికి, విశ్వామిత్రునికి పాదపూజ చేసి వారికి తమకృతజ్ఞత తెలియజేసెను. సర్వ సౌకర్యములు కల ఒక విడిదిగృహమందు విశ్వామిత్రుడు నివసించుటకు ఏర్పాట్లు జరిగెను. అటుపైన నగర ప్రముఖులను, విప్రవనితలను, ముత్తయిదువులను రావించి వారికి భూపతి భూరి భూరి దానధర్మాదులు చేసి సన్మానించెను.

ఇవ్విధముగ రాజు సర్వజనులను సన్మానించి, మహదానందముతో మహలులోనికి వెళ్ళి కొడుకులను కోడండ్రను దగ్గర చేరదీసి, మనసారా వారిని ముద్దిడుకొని ప్రసన్నుడాయెను. రాజు రాణివాస స్త్రీలకు పెండ్లిజరిగిన తీరు, జనకుని వైభవ మర్యాదలు మొదలగు వివాహ విషయములు సవిస్తరముగ చెప్పి

వారిని సంతోషపెట్టెను.

ఆపైన దశరథుడు పుత్రులతోగూడి స్నాన సంధ్యార్ఘ్యనుష్ఠానములు పూర్తి జేసి బంధువులు, బ్రాహ్మణులు, గురువులతో కూడి విందారగించెను. భోజనానంతరము ముత్తయిదువుల మంగళగానములతో కొద్దికాలము హాయిగ గడిపిరి. వచ్చినవారికి చందన తాంబూలాదులిచ్చి పంపిన పిమ్మట దశరథుడు రాణులను చేరబిలిచి వారితో ఇట్లనెను: ''మీ కోడండ్రు ఇంకనూ చిన్న బిడ్డలు. వారు ప్రప్రథమము పరాయి వారింటికి వచ్చిరి. వారిని మీరు కను రెప్పలవలె చూచుకొనుడు. ప్రయాణ బడలికచే అలసి యున్నవారిని సుఖముగ శయనింపజేయుడు'' అని చెప్పి భూపతి నయనాభిరాముడగు శ్రీరాముని స్మరించుకొనుచూ విశ్రామగృహమునకు వెళ్ళెను.

రాజుగారి యాజ్ఞప్రకారము రాణులు శయనగృహము చక్కగ నలంకరించిరి. రత్నఖచితమగు బంగారు చాందినీ మంచముమీద పాల నురుగువంటి తెల్లటి దుప్పట్లు పరచి శ్రేష్ఠమైన దిండ్లు వేసిరి. ఆ మణిమయ మందిరము సుగంధద్రవ్యములచే వెలుగొందెను.

రామ, భరత, లక్ష్మణ, శత్రుఘ్నులు, తమ తమ శయన మందిరములకు వెళ్ళి శయనించిరి. ముగ్గురు తల్లులు సెజ్జపై పవళించియున్న శ్రీరాముని సమీపించి అతని సుకోమల సుందరశరీరమును ముద్దిడుకొని ఇట్లనిరి: ''బిడ్డా! దారిలో తాటకిని ఎట్లు సంహరించితివి? పెద్ద రాక్షసులగు మారీచ సుబాహుల నెట్లు మర్దించగలిగితివి? కౌశికుని కటాక్షమువలన అన్ని విద్యలు అభ్యసించి యాగరక్షణ చేయగలిగితివి. నీ పదరజము సోకి మునిపత్ని తరించెగదా! వజ్రసన్నిభమగు ముక్కంటి వింటిని విందుసభలో ఖండించి విశ్వవిజయము చేపట్టితివే! సోదరులతోకూడ వివాహము చేసుకొని శుభముగ ఇంటిని చేరుకొంటివి. పుత్రా! మానవులకు సాధ్యము కాని ఇన్ని కార్యములను ఆ కౌశికుని కృపాకటాక్షము వలననే సాధించగలిగితివి నాయనా! చంద్రబింబము వంటి నీ ముద్దు ముఖము ఇన్ని దినములకు చూచుకొని మా జన్మతరించెను.''

ముద్దు ముచ్చట్లు గొలుపు తియ్యని పలుకులతో అతడు తల్లులకు సమాధానమిచ్చి సంతోషపెట్టెను. పిమ్మట శ్రీరాముడు శివుని, గురువులను బ్రాహ్మణులను స్మరించుకొని సుఖనిద్ర చెందెను. నిద్రించుచున్నప్పుడు శ్రీరాముని ముఖశ్రీ - సంధ్యా సమయమున ముకుళించియుండు - ఎర్రదామర వలె శోభించెను. ఆ ముప్వురు తల్లులు మణులవంటి తమ కొడుకులను, కోడం డ్రను హృదయమున కత్తుకొని సుఖనిద్ర చెందిరి.

మరుదినము ప్రాతఃకాలముననే వందిమాగధులు జోహారులు పల్కుచుండ రామాదులు మేల్కాంచిరి. సోదరులు నలుగురూ సరయూనది కెళ్ళి స్నాన సంధ్యాద్యనుష్ఠానములు నిర్వర్తించిరి. తండ్రివద్దకు వచ్చి, సభ నలంకరించిరి. అచట వారికి వసిష్ఠుడు చరిత్ర, ధర్మశాస్త్రమునకు చెందిన కథ లెన్నియో తెలియజేసెను. వామదేవ - వసిష్ఠాదులు గాధేయుని పూర్వగాథలు, అతని కీర్తి, ప్రతిష్ఠలను వారికి వివరించి చెప్పిరి. దశరథుడు, రామలక్ష్మణులు వసిష్ఠుని వలన కౌశికుని గొప్పతనమును గురించి విశదముగ తెలిసికొని ఆ మహాత్ముని కృపా కటాక్షములకు పాత్రులై నందుకు అమితానందము పొందిరి. వివాహ కంకణములు విసర్జింపజేసిన శుభదినమందు గొప్ప పండుగ చేయబడెను. ఇవ్విధముగ ఉత్సవోత్సాహములతో కొన్నిదినములు గడచెను. విశ్వామిత్రుడు ప్రతినిత్యము ప్రయాణమగుచుండెను. కానీ, రాజు భక్తికీ, శిష్యుల ప్రేమకు వశుడై వారిని వీడలేకపోయెను. ఒకదినము కౌశికుని ప్రయాణము స్థిరపడెను. సాకేతపతి దశరథుడు సతీసుతులతో గాధేయుని ఎదుటకు వచ్చి నత శిరస్కుడై-

''మహాత్మా! సర్వ సంపదలతో కూడిన మా యావద్రాజ్యము మీది. మే మందరము మీ సేవకులము. ఈ బిడ్డలపై మీ కృపాదృష్టి సర్వదా ప్రసరింపజేసి, అపుడపుడు దర్శనభాగ్యము కలుగుచుండునట్లు కరుణించవలసిన''దని ప్రార్థించి ముని పాదములకు సాష్టాంగ నమస్కారములు చేసెను. విశ్వామిత్రుడు ఆప్యాయముగ వారందరిపీ ఆశీర్వదించి నిజాశ్రమము నకు జనెను.

అటుపిమ్మట రాజు ఇతరులందరినీ ఇండ్లకు పోవుటకు సెలవిచ్చి తాను కుమారులతో గలసి నిజభవనమునకు చనెను. శ్రీరాముడు వివాహము చేసుకొని స్వగృహము చేరుకొని నప్పటినుండి అయోధ్య ఆనందమునకు నిలయమయ్యెను.

శ్రీ సీతారాముల దివ్య చరిత్ర కవులకు పావనకరమైన దనియూ, సకల మంగళములకు మూలమనియూ తెలుసుకొని, నా (తులసీదాసు) వాక్కులను పవిత్రము చేసుకొనుటకై కొద్దిగ వర్ణించి చెప్పితిని.

శ్రీ సీతారాముల వివాహమహోత్సవమును ఎవరు ప్రేమతో గానము చేయుదురో, ఎవరు ఆలకించెదరో వారు నిత్యోత్సవము అనుభవించగలరు.

ఇతి శ్రీమద్రామ చరిత మానసే
సకల కలి కలుష విధ్వంసనే
విమల సంతోష సంపాదనోనామ
ప్రథమః సోపానః సమాప్తః.

(బాలకాండ సమాప్తము.)

# అయోధ్యాకాండ

''వామాంకే చ విభాతి భూధరసుతా
దేవగా మస్తకే
ఫాలే బాలవిధు ర్గలే చ గరలం
యస్యోరసి వ్యాలరాట్,
సోఽయం భూతివిభూషణః సురవరః
సర్వాధిపః సర్వదా
శర్వః సర్వగతః శివః శశినిభః
శ్రీ శంకరః పాతుమామ్.''

''ప్రసన్నతాం యా న గతాభిషేకత
స్తథా నమమ్లే వన వాసదుఃఖతః
ముఖాంబుజ శ్రీ రఘునందనస్య మే.
సదాఽస్తు సా మంజుల మంగళ ప్రదా.''

శ్రీమద్గురువర్యుల పాద ధూళిచే నా మానస దర్పణమును మలిన 'రహితముగా చేసుకొని,' చతుర్విధ పురుషార్థముల నొసగు శ్రీరాముని యశోగాథను కీర్తించుచున్నాను.

(తులసీదాసు)

## పట్టాభిషేక ప్రయత్నము

వివాహానంతరము శ్రీ సీతారాములు స్వగృహమునకు వచ్చినప్పటినుండి నిత్యకల్యాణము పచ్చతోరణమై అయోధ్య ఆనందోత్సాహముల మునిగి తేలు చుండెను. కొండలపైబడిన వాననీరు సముద్రము చేరునట్లు, ఏడేడు పధ్నా లుగు లోకములందలి సకల సుఖ సంపదలు అయోధ్య నాశ్రయించినవా యన్నట్లు సిరిసంపదలతో సాకేతపురి తులతూగుచుండెను. నిత్యమూ

శ్రీరామచంద్రుని ముఖారవింద మవలోకించి ఆనందించుచున్న ఆ పురవాసుల భాగ్యమే భాగ్యము. సకలగుణధాముడైన శ్రీరాముడు ఎవుడు యువరాజపదవి పొందునాయని ఆ యూరివారు ఉవ్విళ్ళూరుచుండిరి. ఒకదినము రాజసభలో కొలువుదీరియున్న సుకృతాత్ముడగు సాకేతపురాధీశుడు అద్దములో తన ముఖము చూచుకొని కిరీటము సవరించుకొనెను. ఆ సందర్భమున "రాజా! తనయునికి పట్టముగట్టి జీవితము సఫలము చేసుకొనుము--" అని ముసలి తనము చెప్పుచున్నదా అన్నట్లు చెవులదగ్గర తెల్లబడిన వెంట్రుకలు కొన్ని రాజునకు కనబడెను.

మనసునకు ఈ విషయము తట్టగనే మహారాజు ఒక శుభసమయమున కులగురువగు వశిష్ఠుని సమీపించి-- "మహాత్మా! మీ శుభాశీస్సులే నా కడు పున రాముడై అవతరించెను. సచివులు, సేవకులు, మిత్రులు, శత్రువులు, సర్వులూ నాతో సమానముగా ఘనశ్యాముని ప్రేమించుచున్నారు. గురుపాద ములు సేవించినందుననే నాకీఅదృష్టము సంప్రాప్తించెను. స్వామీ! నేను జీవించి యుండగనే శ్రీరాముని రాజ్యాభిషిక్తుని చేసి చూడవలెనను అభిలాష ఒకటి శేషించియున్నది. అది నెరవేరిన పిమ్మట నాకు జీవించినను, మరణించినను కొరతలేదు. కరుణించి నా కోరిక సఫలీకృతం చేయవలసిన"దని నృపతి నమ్రుడై నివేదించెను.

రాజు అభిలాషకు వసిష్ఠుడు హర్షించి - "ఓ భూపతీ! నీ కడుపున లోకారాధ్యుడైన ఆ పరమాత్ముడే రాముడై అవతరించెను. రాముడు రాజ్యాభి షిక్తుడైన దినమే శుభదినము. కనుక తత్క్షణమే రాజ్యసభను సమావేశ పరచు"మని గురువు వాక్రుచ్చెను. కులగురువు ఆమోదించినందుకు రాజు ముదమందెను. తత్క్షణమే అతడు సుమంత్రుని పిలువనంపి అతనితో-

"సచివోత్తమా, శ్రీరాముని యువరాజుగా చేయుటకు గురువు సమ్మతిం చెను. ఈ శుభవార్త మన పారిషదులకు ప్రియమైనయెడల, పట్టాభిషేక మహో త్సవమునకు కావలసిన యేర్పాట్లు చేయించు"మని రాజాజ్ఞాపించెను. సచివులం దరూ శ్రీరాముని యువరాజు చేయుటకు ఏక కంఠముతో తమ హర్షామోద ములు తెలియజేసిరి.

అంతట గురువు పట్టాభిషేక మహోత్సవమునకు కావలసిన పుణ్యనదీ జలములు, ఓషధులు, సుగంధ ద్రవ్యములు, చామరము, మృగచర్మము, నవరత్నములు, నవధాన్యములు, చీని, చీనాంబరములు మున్నగు వస్తువులు సేకరించుమని చెప్పి, పట్టణ మలంకరింపజేసి ఉత్సవ కార్యక్రమములు ప్రారంభించుమని సుమంత్రునికి సూచించెను.

వసిష్ఠుని సూచన ప్రకారము పచ్చని ఫల వృక్షములతో, పందిరులతో, ధ్వజతోరణ పతాకములతో నగర మలంకరింపబడెను.

పట్టణముయొక్క బాహ్యాంతర్భాగములు శుభ్రపరచి, ఇండ్లముంగిట కలశములు ఉంచి కులదేవతలను పూజించిరి.

శ్రీరామునికి శుభము కలుగుటకై రాజు దేవతలను సత్కరించెను. యువరాజు పట్టాభిషేకవార్త చెవుల బడగనే పట్టణ పౌరులు ఉత్సాహముతో వివిధ వాయిద్యములు మ్రోగించి హర్షితులైరి.

ఆ సమయమున సీతారాములకు శుభ శకునములు కన్పట్టెను. ''నా ప్రియ సోదరుడైన భరతుడు మేనమామ గృహమునకు వెళ్ళి బహుదినములాయెను. ఈ ప్రపంచములో నాకు భరతునికంటె ప్రియమైన వస్తువేమున్నది? బహుశా భరతుని శుభదర్శనము త్వరలో కానున్నది. అందుకే నా శుభాంగములదురుచున్నవి కాబోలు'' అని శ్రీరాముడు జానకితో పలికెను.

సుధాకరుని జూచిన సముద్ర ముప్పొంగువిధమున ఈ శుభవార్త వినినప్పుడు అంతఃపురకాంతలు ఆనందముతో పరవశలైరి కౌసల్యాదిరాణులు పరిచారకులకు బహుమతులిచ్చి, శ్రీరామునికి శుభము కలుగుటకై గ్రామ దేవతలకు, నాగులకు బలు లిచ్చెదమని మ్రొక్కు లిడుకొనిరి.

కోసలపతి అభ్యర్థన పురస్కరించుకొని గురువు స్వయముగా వెళ్ళి సీతారాముల కీ శుభవార్త తెలియబరచి ''రామా! ఈకార్యము నిర్విఘ్నముగ నెరవేరుటకై నీవు నేడు సంయమశీలుడవై శుచిగా నుండవలసిన''దని చెప్పి వెళ్లెను.

తాను యువరాజు కానున్న సంగతి తెలుసుకొని శ్రీరాముడిట్లు తలపోసెను.

"మేము నలుగురన్నదమ్ములము ఒకేమారు జన్మించితిమి కదా! ఒక కంచ ములో తిని, ఒక మంచములో పవ్వళించి, ఒకేచోట ఆడుకొంటిమి. మా నల్గురికీ నామకరణములు, ఉపనయనములు, వివాహాదులు ఏక కాలముననే జరిగెను. కానీ ఇప్పుడిందుకు భిన్నముగా అనుజులను వదలిపెట్టి అగ్రజు డొక్కడే యువరాజు కావలసియున్న సంప్రదాయము నిష్కళంకమైన మా సూర్యవంశమునకు ఉచితముగాలేదు"ని భ్రాతృ ప్రేమచే అతడు బాధపడెను.

నగరమంతటా ఆబాల గోపాలము ఆనందోత్సాహములతో వివిధవాద్య ములు మ్రోగించి వేడుకలు చేయసాగెను. "ఆహా! భరతుడు త్వరగా వచ్చినట్లైన కన్నులారా ఈ యుత్సవము చూడగలుగునుగదా! రేపు ఉదయము శ్రీ సీతారాములు సువర్ణ సింహాసనముపై అధిష్ఠించి అభిషేకము చేసుకొను శుభము హూర్త మెప్పుడు వచ్చునా!" యని పట్టణ ప్రజలు తమలోతాము సంభాషిం చుకొని సంబరపడసాగిరి.

## దేవతల భయము

ఇచ్చట సాకేతవాసుల సంతోష మిట్లుండ, అచ్చట దివినున్న దేవతలకు దిగులు పట్టుకొనెను. దేవతలందరూ హుటాహుటి సరస్వతీదేవి శరణుజొచ్చి ఇట్లు మొరపెట్టుకొనిరి. "ఓ పద్మజరాణివైన వాణీ! ఎట్లయిననూ నీవు శ్రీరా ముని పట్టాభిషేకము భగ్నమగునట్లు, అతడు రాజ్యము వదలి వనముల కేగు నట్లు చేసి రావలసిన"దని ప్రార్థించిరి. అందుకు సరస్వతి - "అయ్యో కళ కళ లాడుచున్న కమల వనమునకు హిమపాతము కల్పించునట్లు నేను అయోధ్యా వాసుల ఆనందము అన్యాయముగా ధ్వంసము చేయవలెనా"యని సందేహించెను. అందుమీదట దేవతలు-

"అమ్మా, శ్రీరాముడు అవతారపురుషుడు. అతనికి సుఖ దుఃఖములు లేవు. ఇకపోగా మిగిలినవారు వారి వారి కర్మానుసారము కష్టసుఖము లనుభవింపవలసినదే. ఇది దేవతల కార్యము. నీ వలననే సాధింపబడవలసి యున్నది. అని వారు ప్రాణపణముగా మొరపెట్టుకొనిరి. 'ఆహా! జాతి దొడ్డది బుద్ధి చిన్నదిగా నున్న ఈ దివిజులెంత ఈర్ష్యాపరులు! అయిననూ, భావిఫలము నాశించి ఈ కార్యము జేయుటకు సాహసించెద'నని నిశ్చయించు

కొని సరస్వతి, శనిదేవతవలె సాకేతపురికి పయనమై చనెను. కైకవద్ద మంథర యను మందబుద్ధిగల దాసి ఒకతె యుండెను. అన్ని అరిష్టములకూ అపయ-శస్సులకూ, ఆ గూనిదాసి కారకురాలగునట్లు ఆదితల్లి మంథరమనస్సు మరింత చెడగొట్టి అయోధ్య వదలి అమరలోకమునకు వెళ్ళిపోయెను.

## మంథర!

రేపు జరుగున్న శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవము పురస్కరించుకొని సాకేతపురి అరద చందాలతో సంబరపడుట కన్నులారా జూచిన మంథరకు కడుపుమండెను. రాత్రి రాత్రికే ఈ ఉత్సవమును బుగ్గిపాలు చేయడమెట్లాయని ఆలోచించి ఆ నీచురాలు ఆవేదన పడుచూ కైకవద్దకు వచ్చెను. కైకేయి దాసిని చూచి - ''ఏమి మంథరా! ఎందుకిట్లు ఉదాసీనముగా నుంటివి!'' అని నవ్వుతూ ప్రశ్నించెను. ఆ దాసి సమాధానమియ్యక కన్నులనిండా నీళ్ళు నింపుకొని కదలక నిలబడియుండెను.

''ఓసీ వదరుబోతా! నీ నోరు పెద్దది కనుక లక్ష్మణుడేమయినా చెయ్యి చేసుకొనెనా!'' అని భరతునితల్లి మందహాసము చేయుచూ తిరిగి ప్రశ్నించెను. అప్పటికీ ఆ కుటిలకాంత నోరు మెదపక కాల నాగినివలె కోపముతో-బుసకొట్టుచుండెను. దాని వాలకము చూచి ఏమి జరిగినదో యని కైకతల్లి - ''ఏమే! రాజు మరియు రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు క్షేమమే కదా!'' యని ఆతురతతో అడిగెను. ఈ ప్రశ్నకు గూనిదాసి మంథర మరింత మండిపడి--

''అయ్యో తలవ్రాత! ఎవరిబలము చూసుకొని నేను నోరు జారుకుంటాను రాణీగారూ! ఎందుకు లక్ష్మణుడు నాపై చేయి చేసుకుంటాడు? ఇక్కడ రామచంద్రుడు మినహా మరెవ్వరికి క్షేమమున్నది! అదృష్టము కౌసల్యాదేవి సొత్తు. ఆమెకొడుకు రేపు యువరాజు కాబోవుచున్నాడు. ఆహా, ఆమె గర్వానికి హద్దూ, ఆమె ఆనందానికి అంతూ ఉన్నదా! వారి ఉత్సాహము ఒకసారి వెళ్ళిచూడరాదా! చూచుకొని నా కండ్లు చల్లబడిపోయినవి. కొడుకు పరదేశమున నున్నాడనే రవంతచింతకూడ నీకులేదాయె. నా భర్త నా చేతుల్లో ఉన్నాడను నీ ధీమాయే నీదిగాని, ఆయనగారి కపటనాటకం నీకు తెలిసి

రాదాయె. ఇక నీకు తెలిసింది తృప్తిగా తినడం, సుష్ఠుగా నిద్రించడం. ఇంతే గదా!'' అని మంథర కన్నీరు తుడుచుకొనుచూ పలికెను. దాసి నీచపు మాటలకు కైక మండిపడినదై - ''ఓసీ దాసీ! ఇటువంటి కొంపలు కూల్చు మాటలు ఇకమీదట పలికిన నీ నాలుక కోసివేసెద''-నని కోపగించెను. కాని వెంటనే గూనివారు, కుంటివారు సాధారణముగ కుటిలస్వభావులై యుందురని ఊహించి, కైక కొంచెము ఊరడింపుమాటల నిట్లనెను-

''మంథరా! నీకు ఏదో కొన్ని మంచి మాటలు చెప్పదలంచి అట్లంటిని. అంతే కానీ, నీపై నాకు స్వప్నమందైనా కోపము రాదు. నీ వన్నట్లు రేపే శ్రీరామునికి పట్టము గట్టిన అది యెంత శుభదినము. ఇదే నిజమయిన నీ వడిగినంత బహుమాన మియ్యగలను. రాముడు పెద్దబిడ్డ. భరత, లక్ష్మణులు అతనికంటే చిన్నవారు. పెద్దవానికి పట్టము గట్టుట రఘుకుల సంప్రదాయమే కదా! శ్రీరామునికి తల్లులందరూ సమానులు. నామీద అతనికి విశేషించి ప్రేమ కలదు. ప్రియపుత్రుడైన శ్రీరామునికి పట్టము గట్టబోవు సంతోష సమయమున నీవెందుకు క్లేశపడుచుంటివి. భరతునిపై ఒట్టుపెట్టుకొని నిజము చెప్పు''మని అనునయమున బలికెను.

''అమ్మా! దొరసానిగారూ! నాకున్నది ఒక నాలుక. అది నోరుజారి నిజమాడినందుకు బాగా వడ్డించితివి. ఇక మరొకరీతిగ మాట్లాడుటకు నాకు రెండు నాలుకలు లేవే! మంచి మాట చెబితే నీకు రుచించదయ్యె.

''నా తల బ్రద్దలు చేస్తానంటివి. అవును లోకములో నిజమాడితే నిష్ఠురమందురు. ఉన్నది లేనిదిగా లేనిది ఉన్నదిగా కల్పించి చెప్పువారే నీకు మంచివారు. ఆ దేవుడు నన్ను గూనిదానిగా పుట్టించినందుకు ఒకరిని ఆశ్రయించి బ్రతకవలసివచ్చె. పూర్వకర్మ. కర్మ అనుభవించక తప్పదుగదా! లేకపోయిన ఎవరు రాజు అయితే నాకేమి? నేనే మయిన రాణీపీఠ మెక్కగలనా! నా దాసీ వృత్తి నాకు తప్పదు గదా! నీకు అపచారము జరుగుచుండుట చూచి ఒకటి రెండు మాట్లాడి పెద్దతప్పు చేసితిని. తల్లీ! జరిగిన పొరపాటుకు నన్ను క్షమించుము.'' అని పరిచారిక కుహనాదుఃఖము ప్రకటించి వాపోయెను.

కుటిలబుద్ధిచే పలికిన మంథర గూఢోక్తులు పయోముఖ విషకుంభమువలె వినుటకు ఇంపుగా నుండెను.

దాసీ కాపట్యాన్ని దైవమాయచే గమనించజాలక కైక దాని విషహృదయాన్ని విశ్వసించెను. వేటకత్తె పాటకు పరవశమై వెంటబడిపచ్చు జింకపిల్లవలె భరతుని తల్లి మంథర మాటలకు మరింత మెత్తబడి దానిని ప్రాధేయపడ సాగెను. తన పాచిక పారినందుకు కుబ్జదాసి లోలోన పంతసించి-

"అమ్మగారూ! మొదటనే నీవు నన్ను కొంపలుకూల్చే దానివని నిందించితివి. ఇక నీయుందు నోరు కదల్చడానికే నాకు భయముగా నుంది. ఓ నారాణీ! సీతారాములు నీకు ప్రేమపాత్రులంటివి. నేను కాదనను. వారూ నిన్ను అట్లే చూచుచుండిరి. కానీ అది ఒకప్పటిమాట. ఆ దినములు గతించెను. సూర్యునికీ కమలములకూ ఉన్న సంబంధమువలె కాలము మారినప్పుడు మిత్రులు గూడ శత్రువులగుచుందురు. వెర్రిదానా! నీ సవతి కౌసల్య నిన్ను కూకటి వ్రేళ్ళతో కదలించి కూలద్రోయుటకు కోక బిగించినది. నా మాట నమ్మి ఇప్పుడే జాగ్రత్తపడకున్న ముప్పు ముంచుకరానున్నది సుమా?"

ఆ మాయావిని మంథర మరెన్నియో లేనిపోని మాటలు కల్పించి చెప్పి సవతి మాత్సర్యమును కైకలో ప్రకోపింపజేసెను. రాణి తనమంచి గోరిన మంథరను తూలనాడినందుకు నొచ్చుకొని నానావిధముల దాని ననునయించెను. పరిచారిక తిరిగి ఇట్లు ప్రసంగించెను.

"అయ్యో వెర్రిబాగులదానా! నోరులేని జంతువుకూడ తన మంచి చెడ్డలేవో తెలుసుకొనగలదే! అంతమాత్రమైన జ్ఞానము నీకు లేదా! పక్షము దినముల నుండి పట్టాభిషేకమునకు సన్నాహములు జరుగుచున్ననూ, ఇప్పుడు నే వచ్చిచెప్పునంతవరకూ నీకు తెలిసి చావదాయె. (రాజు కైకకు చెప్పక దాచినాడను భావము) మీ ఉప్పూ పులుసు తింటున్నందుకు నిజమాడడం నా ధర్మం. నేను అసత్యమాడితే దండించడానికి పైన దేవుడు లేడూ? రేపు కౌసల్య కొడుక్కే పట్టము గట్టినట్లైన ఆనాటి నుండీ నీకు చెడ్డరోజులు ప్రారంభమైనట్లే భావించుము. ఓ దొరసానీ! ఇదిగో గీత గీసి చెబుతున్నాను. ఈ ఇంటిలో ఇక నీకు చోటు లేదు. నీవూ నీ కొడుకూ వారికి సేవకా

వృత్తులు చేసేనంతవరకే మీకిక్కడ మనుగడ. లేకుండిన పాలల్లోపడిన ఈఁగవలె బయటికి గెంటివేయబడుదురు. కద్రువ వినతను సాధించినట్లు కౌసల్య నీపై కక్ష సాధింపకపోదు. కైక కొడుకు కారాగృహములో బడుట, సుమిత్ర పుత్రుడు రామునికి రెండవ సుమంత్రుఁడగుట ముమ్మాటికీ నిజము- 'మొగుడు నామాట జవదాటడనీ, నా ముత్తయిదువతనము గట్టి'దను ధీమాతో కండ్లు మూసుకొని యున్నావు. కాని, మహీపతి మాటలు మంచివి - చేతలు చెడ్డవి. అని నీ భోళాబుద్ధికి తెలిసిరాకున్నది.

కౌసల్య ఎంత చక్కని చమత్కారి! సమయము చూచి తనుని సాధింపు కున్నది. రాజుగారు నీపై మక్కువతో నుండుటచే వారి అండ జూచుకొని ఆమెను తృణీకరించెదవనీ, నీ సవతి స్వభావము - సహించలేక పోయినది. ఆ ద్వేషముతో అయ్యగారిని చిన్నగ లోబరుచుకొని భరతుని పరదేశమునకు పంపించి, తన కొడుక్కు పట్టము గట్టుకొనుచున్నది. సూర్యకుల సంప్రదాయ ప్రకారం పెద్ద కొడుకైన రామరాజుకు పట్టము గట్టుట అందరివలె నాకునూ ఇష్టమే. అయితే మున్ముందు రాబోవు విపత్తు నూహించుకొని నా గుండె కొట్టుకొనుచున్నది.''

''ఓరీ భగవంతుడా? మా తల్లికి అపకారము తలపెట్టిన వాడే ఆ ఫల మనుభవించునట్లు చేయుము-''

మంథరయొక్క మాయమాటలకు భీతిల్లిన కైకకు ముచ్చెమటలు పోసి శరీరము కంపించిపోయెను.

విధి వైపరీత్యము! గూని దాని కుతంత్రములు రాణి హృదయమున గాఢముగా నాటుకొనెను. ఆపద్భీతిచే, ఆశంకిత యైన కైక కంపిత స్వరమున ఇట్లనెను.

''మంథరా! నీ మాట నిజము. ఈలోగా నాకు కుడికన్ను అదరుట, రాత్రులందు పీడకలలు వచ్చుట మున్నగు దుశ్శకునములు తోచుచున్నవి. ఓ ఆత్మీయురాలా! నా స్వభావమెంత సరళమైనదీ నీకు తెలియనిది గాదు. కుడి యెడమ లేపో తెలియని ఒట్టి అమాయకురాలిని. భగవంతుడా! నే నెన్నడూ ఎవరికీ ఎలాంటి కీడు తలపెట్టి యెరుగనే. నన్నెందుకింత కష్టములకు గురి

చేసితివి? మంథరా! పగవాని వంచనపడియుండుటకంటే ప్రాణములు వదలుట మేలు. ఇదిగో, నా బొందిలో ఊపిరి ఉన్నంతవరకూ సవతికి లోబడి యుండుట మాత్రము కల్ల అని నమ్ముము.''

అవన్ని భీతిచే ఆర్తయై చలించిపోయిన రాణికి మంథర మరింత పురి యెక్కించెను.

''అమ్మా మనస్సు చిన్న చేసుకొని మథనపడుటవలన లాభములేదు. నీ మాంగళ్యము నిత్యమంగళమై వర్ధిల్లుగాక!! ఈ దుర్వార్త విన్నప్పటి నుండీ నా కంటికి మాత్రము నిదుర పట్టిన దనుకొంటివా! నేను చేతులు ముడుచుకొని మూల కూర్చొనలేదు. జ్యోతిష్కుల వద్దకు వెళ్ళి అడిగితిని. వారు గిర్రగీచి భరతునకు ఖండితముగా రాజ్యము రాగలదనిచెప్పిరి. అదిగాక నాథుడు నీవాడు. నీ చల్లని చూపులకై దోసిలొగ్గువాడు. ఇదిగో నే జెప్పినట్లు నడుచు కొనిన నీ కష్టముల నుండి గట్టెక్కగలవు...''

అంతట కైక--

''ఓ సఖీ! నీవు హితవుగోరిన ఆత్మీయురాలవు. నీవు చెప్పినట్లు నడుచు కొనుటకు నేను సిద్ధము. తుదకు పతీ పుత్రులను సైతం పరిత్యజించి బావిలో దూకుటకైననూ వెనుకాడను'' అని ఆమె కృతనిశ్చయముతో పలికెను.

ఆ గూనిదాసి - కైకను బలి పశువుగా చేసి, కపటమనెడి కత్తిని తన పాషాణ హృదయముపై సానబెట్టెను. సంభవింపనున్న చావు సంగతి గుర్తించలేక పచ్చగడ్డికై ప్రాకులాడు బలి పశువు మాడ్కి, ఆమె మంథర కుతంత్రమునకు పూర్తిగా లోబడెను.

''అమ్మా! కైకేయీ! నీకు జ్ఞాపకమున్నదో లేదో? 'రాజు నాకు రెండు వరము లిచ్చియుండెననియూ, అవసరము వచ్చినపుడు వాటిని వాడుకొనుటకు రాజు అనుమతించియుండెననియూ, ఒకప్పుడు నాతో ప్రసంగించి యుంటివికదా! ఇప్పుడు నీవు భరతునికి పట్టము గట్టుటకు, రాముని పద్నా లుగేండ్లు అరణ్యములకు బంపుటకుగాను ఆ రెండు వరములు రాజా నుండి కోరుకొనుము. ఇందువలన నీ కోరిక సిద్ధించి నీ సవతుల సంతోషము నీ

సొత్తు కాగలదు. కానీ, ఒక్క విషయము మాత్రము జ్ఞాపక ముంచుకొనుము. అదియేమన మహారాజు మాట దప్పనివాడు. అందుచే రాముని మీద ఒట్టు పెట్టుకొనినగానీ, ముందుగా నీవా వరములు అడుగరాదు. ఇదిగో జాగ్రత్త! ఈ రాత్రికే ఈపని సాధింపవలసియున్నది. లెమ్ము! వెంటనే కోపగృహమునకు వెళ్ళి మెలకువతో పని సాధించుము, త్వరపడుము.''

అని అనేకవిధముల బోధించి, ఘాతకురాలు మంథర కైకను పురికొల్పెను.

రాణి మంథరను బహువిధముల ప్రశంసించి, ఆపత్సముద్రమునుండి రక్షించిన మహోపకారియని దాసికి కృతజ్ఞతలు తెలిపి, కోప గృహమునకు చనెను.

కైకకు కలిగిన దుర్బుద్ధి ఒక క్షేత్రమాయెను. దానిలో విపత్తు బీజములు నాటబడెను. అవి దాసి వచన ధారలచే తడిసి మొలకెత్తెను. ఆ మొలక వరములనెడి రెండాకులు వేసెను. ఆ విషవృక్షము ఫలించు దుఃఖ ఫలము అవ శ్యము అనుభవింపవలసి యుండెను.

ఇక్కడ అంతఃపురములో రగులుకొనుచున్న అగ్నిసంగతి అయోధ్యావాసుల కేమి తెలుసు! ఆబాలగోపాలము ఆనందోత్సాహమున మునిగి తేలుచుండెను. రాజదర్బారు వచ్చేపోయే వారితో సందడిగా నుండెను. బాల్యస్నేహితులు జట్లు జట్లుగా వచ్చి శ్రీరామునికి తమ అభినందనలు తెలియ జేయుచుండిరి. నానా విధ మంగళ వాద్యములు మ్రోగుచుండ కోసలరాజధాని ఉత్సవోత్సాహము లతో కోలాహలముగా నుండెను.

సాయంకాల మయ్యెను. శరీరము ధరించిన స్నేహము నిష్ఠూరము వద్దకు వచ్చుచున్నదా యున్నట్లు దశరథుడు సంతోషముతో కైక గృహమునకు వచ్చెను.

## కైక వరము లడుగుట

కైక కోపగృహములో నున్నదని తెలుసుకొని రాజు నిర్ఘాంతపడెను. ఎవని బాహుబలము చూచుకొని దేవేంద్రాదులు భద్రముగ నుండిరో, ఎవని చల్లని చూపులకై సకల దేశాధీశులు తపస్సు చేయుచుందురో ఆ దశరథరాజు కామా ధీనుడై కైక కోపమునకు గడగడలాడెను. అతిభయంకర శస్త్రాఘాతములను

నరకుచేయుని మహీపతి మదుని బాధసహించలేక, భయపడుతూ భార్యను సమీపించెను.

రాబోవు వైధవ్యమును ఇప్పుడే సూచించు చున్నదాయన్నట్లు, భూషణములు విసర్జించి, మలిన వస్త్రధారియై కటికనేల బడియున్న ప్రియకాంతను సమీపించి రాజు మధురవచనముల ''ఓ ప్రాణప్రియా! నీ అలుకకు కారణమే''మని అడుగుతూ ఆమె రెండుచేతులను పట్టుకొనెను.

అప్పుడామె రాజు చేతులను విదిలించివేసి నాగుబాము వలె నరపాలుని చురచుర చూచెను.

కైక కాలసర్పము. ఆమె రెండువరములు రెండు నాలుకలు. ముఖము విష పూరితము. 'రామునిమీద ఒట్టు' అను ఆయువు పట్టుమీద పొంచి కాటు వేయ నుంకించుచున్నట్లగుపడుచుండెను. మదన పీడితుడగు మహీపతి ప్రియురాలిని బుజ్జగించి ప్రేమతో నిట్లనెను-

''ఓ సుముఖీ! నీ కోపమునకు కారణమేమి? కాలునికి కవళము కాదలంచి నీ కపచారము తలపెట్టిన ఆ ద్విముఖుడెవ్వడో తెలియ జేయుము. వాడు అమరుడైననూ నిముసములో నిర్జించి వైచెద.

ఓ ప్రియపత్నీ! నీవు కోరినట్లైన భూపతిని భిక్షుకునిగా, భిక్షుకుని భూపతిగా త్రుటికాలములో చేయగలను. ప్రియా! రామునిసాక్షిగా, నీయెడల నా కెట్టాంటి కాపట్యమూలేదు. సులోచనీ! చంద్రునికై పరితపించు చకోరమువలె సుందరమైన నీ వదనేందు బింబమునకై వలపించు నా చిత్తశుద్ధి నీకు తెలియదా! ప్రేయసీ, నా సతులు, సుతులు, సామ్రాజ్యము సర్వమూ నీ యధీనమై యున్నది. లెమ్ము! ఏది నీ దరహాస చంద్రికలను ఒక్కమారు నాపై ప్రసరింపజేసి నీ యభీష్ట మేదియో తెలియజేయుము.''

పృథ్వీపతి చేసిన ప్రమాణమునకు సంతసించినదై కైక చిరునవ్వు చిందించుచూ చిన్నగ పైకి లేచెను. వలపన్ను వేటకత్తెవలె కైక వయ్యారముగ వివిధ భూషణములతో తనను శృంగారించుకొనసాగెను.

చిన్నభార్య చిరునగవు చూచి రాజుచిత్తము స్తిమితపడెను. ప్రేమాతురుడైన రాజు ప్రియవచనముల నిట్లనెను--

''ఓ సులోచనీ! నీ యభీష్ట మీడేరునట్లు రేపే పెద్దవానికి పట్టము గట్టు చున్నాను. ఏది నీవు చక్కగ అలంకరించుకొని ఆ యుత్సవమునకై అభిషేక సంభారములు సిద్ధము చేయుము'' నృపతి నోటి నుండి వెలువడిన పలుకులు చెవిని బడగనే రాణికి హృదయము పెళ్లున పగిలినంత పని ఆయెను. కాని చోరునిభార్య ఎవ్విధముగ తన దుఃఖమును ఇతరుల ఎదుట బహిర్గతము చేయదో అట్లు కైక తన బాధను గోప్యపరచి పైకిమాత్రము చిన్నగ నవ్వెను. రాజు ఎంత చతురు డైనప్పటికీ మగువల మర్మము కనుగొన జాలడు కదా!

ఆ ధూర్తురాలు కృత్రిమ ప్రేమ ప్రకటించుచూ, ముసిముసి నవ్వుల నిట్లనెను-

''నాథా! అడుగు మడుగు మనుటయే కానీ ఇచ్చినది మాత్రము శూన్యము-

ఒకప్పుడు నాకు మీరు రెండువరములు ఇచ్చియుంటిరి. ఇప్పుడు వానిని కూడ పొందగలనో లేదో యను సందేహము కలుగుచున్నది.''

అందుకు అవధేశుడు నెమ్మదిగ, నింపాదిగ నవ్వి ఇట్లనెను-

''ఓహో! అదియా సంగతి! ఇప్పటికి నీ రహస్యము నాకు తెలిసినది. నీకు ప్రణయమం దాసక్తి యెక్కువ. రాణీ! నేను నీకు వరములిచ్చి యుండి నది నిజమే! కానీ నీ వెప్పుడు కోరితివి? నే నెప్పుడు కాదంటిని? పరాకుచే ఆ ప్రసంగమే మరచియుంటిని. ఇంత మాత్రమున నిర్హేతుకముగా నాపై దోష మెందుల కారోపించెదవు? నీవు రెంటికి బదులు నాలుగు వరములు కోరిన నే కాదనగలనా! 'ప్రాణము పోయినను మాట దప్పని మానధనులు మా రఘు కులస్థు'లన్న నీతి లోకవిదితమే గదా! సకల సుకృతములకు ఫలితమైన నా రఘురాముని మీద ప్రమాణముచేసి యుంటినే!''

ప్రమాణ పూర్వకముగ పలికిన రాజు మాటలకు రాణి ప్రసన్నురాలై, మధురముగ మందహాసము చేయుచూ తన వరములను రాజు నెదుట ఇట్లు వెల్లడించెను.

''ఓ ప్రాణ ప్రియుడా! నా మనస్సుకు నచ్చిన మొదటి వరము భరతునకు రాజ్యాభిషేకము చేయుట, నాథా! చేతులుమోడ్చి కోరుచున్న రెండవ వరమేమనగా శ్రీరాముడు తాపస వేషమున అనాసక్తుడై పదునాలుగేండ్లు వనవాసము చేయుట.''

కిరాతుడు వేటనిమిత్తమై మచ్చిక చేసి పెంచిన డేగను ముసుగుతీసి పిట్టలపైకి వదిలినట్లు కైక వరములను వెల్లడించెను. మహీపతి మనోరథ వాటికయందు విహరించు సుఖవిహంగముల గుంపుపైకి భిల్లాంగన వలె కైక తన వరములనెడి డేగలను వదిలిపెట్టెను.

పిడుగుపడిన తాటిచెట్టు వలె రాజుముఖము కళాహీనమయ్యెను. డేగను చూచిన పిట్ట చందమున అతని శరీరము కుంచించుక పోయి గడగడ కంపించెను. కోసలపతి కండ్లు మూసుకొని రెండు చేతులతో తల బట్టుకొని - అయ్యో నా మనోరథము కల్పవృక్షము వలె ఫలించబోవుచున్న సమయమున మత్తగజమట్లు కైక దానిని పెకలించి వేసెనే! ఓరి భగవంతుడా! సాకేతపురి సర్వధ్వంస మగుటకు కైక కారణమగుచున్నదా! ఆడుదానిపై నమ్మకము నన్నెంత అధోగతికి దెచ్చె! అని అవధేశుడు లోలోన ఆక్రందించెను. ఇట్లు ఆక్రోశించుచున్న రాజునుజూచి కైక క్రోధముతో ఇట్లు గద్దించి పలికెను-

''రాజా భరతుడు నీ పుత్రుడు కాదా? నీవు నన్ను సంతలో వెలకు కొనలేదే! పాపము నా మాటలు నీకు ములుకులవలె బాధాకరముగ నున్నవి కాబోలు. మరి మీబోంటి విజ్ఞులు ముందు వెనుక లాలోచించి కదా మాట ఇచ్చి యుండవలసినది? మహారాజా! మీ రఘుకులజులు మాటదప్పని మానధులని వాక్రుచ్చితిరే; మరి ఇప్పుడు ఊరకుంటిరేమి? నా ప్రశ్నకు 'అవునా - కాదు' అను రెండు మాటలలో సమాధానమిచ్చిన చాలు. ''నేను సత్య సంధుడను, కావలసిన వరము కోరుకొను''మని చెప్పితిరే! బహుశా ఈ పిచ్చిది యేదో తినుటకు బెల్లము అడుగునని యూహించితిరి కాబోలు. శిబి - దధీచి - బలి ప్రముఖులు తమ ధన మాన ప్రాణములను సైతం ధారపోసి మాటల నిలెట్టుకొని యుండిరన్న సంగతి మీకు తెలియదా! కీర్తి వలతువో, అపకీర్తి వరించెదవో ఆలోచించుకొనుము.''

కైక కటూక్తులు రాజుకు పుండుమీద కారము చల్లినట్లుండెను. దుఃఖముచే క్రుంగిపోవుచున్న ధరణీశుడు కన్నులు తెరచి చూచెను. కత్తిబట్టి నిలబడియున్న కాళివలె కైక కన్పించెను. 'అయ్యో నా ఆయువుపట్టున దెబ్బ దీసిన ఈ యాడుది తప్పక నా ప్రాణములను బలిగొని తీరును!' అని విలపించి నిట్టూర్చెను. పిమ్మట రాజు రవంత ధైర్య మవలంబించి, ఆమె మనస్సు కరగునట్లు నయ వినయోక్తుల నిట్లనెను-

''ప్రియా! ప్రేమ - భయము -విశ్వాసములను ఒక్క పెట్టున ఆవలకు నెట్టి, ఇట్టి కటువచనము లాడ ఉచితమేనా! ఆ శంకరుని సాక్షిగా శ్రీరాముడు, భరతుడు ఇరువురు నాకు రెండు నేత్రములవలె సమానులు సుమా! ఇదిగో రేపే దూతను బంపి భరత శత్రుఘ్నులను రావించి, ఒక శుభలగ్నమున భరతుని తప్పక యువరాజు చేసెదను. కైకేయీ! నిజము చెప్పుచున్నాను. రామునికి రాజ్యకాంక్ష లేదు. భరతుడన్న అతనికి ప్రాణములతో సమానము. అతని తల్లి కౌసల్య నాతో ఏమియూ చెప్పి యుండలేదు. నేనే చిన్నా, పెద్దా భావముతో రాజనీతి ననుసరించి, పట్టముగట్ట నిశ్చయించితిని. నీతో సంప్రదించక చేసినందుకు నా మనోరథము లన్నియూ మట్టిలో గలిసిపోయె. ఇకనైనను కోపము వీడి మంగళ సామాగ్రులు సిద్ధ పరచుము. భరతునకు తప్పక పట్టము గట్టెదను.''

''ప్రియా! నీవు కోరిన రెండవ వరము చాల అసమంజసముగా నున్నది. నీవు కోపము చేతనో పరిహాసమునకో లేక నిజముగనే ఆ వరము వాంఛించితివో! యేమో యెరుగలేకున్నాను. ఇప్పటికీ దాని సెగకు నా గుండె మండుచున్నది. నీకు, నాకు, లోకమునకు సైతం రాముడు సన్మిత్రుడు కదా! నిన్నటివరకూ నీచే ప్రాణాధికముగ ప్రేమించబడుచున్న రామచంద్రుడు తల్లికి ప్రతికూలముగ ప్రవర్తించి యుండునని నేను నమ్మలేకున్నాను. శాంతించిన హృదయముతో అతడు చేసిన అపరాధమేమిటో ఆలోచించి చెప్పరాదా?''

''ఓ పత్నీ! నిష్కపటముగ నే చెప్పున దేమన నీరు లేకనే చేప జీవించినను, మణిలేకనే పన్నగము బ్రతుకగలిగియుండినను నేనుమాత్రము రాముడు లేనిదే జీవించియుండజాలని మాట నిక్కము. కాబట్టి రాణీ! నేను భరతుని

పట్టము కన్నులారా తిలకించి ఆనందించుటకైనా - ఈ రెండవ వరమునకు ప్రత్యామ్నాయముగ బుద్ధిమంతురాలవైన నీవు మరొక వరము కోరుకొనుము.''

ఇట్లు అతి దీనుడై అర్థించిన భర్త పలుకులకు ఆజ్యము పడిన అగ్నివలె భార్య హృదయము భగ్గుమనెను.

''ఓ నరపతీ! నీ నానావిధ నటనోపాయములు నాపై ఫలించవు. నీవు, నీ రాముడు, అతనితల్లి ఎంతటి అమాయకులో లోకమునకే తెలుసు. నీవు పని గట్టుకొని ఘోషించ పనిలేదు. ఆ కౌసల్య నా కెంత ఉపకారము తలపెట్టెనో నే నామెకు అంత రెండింతలు చేయ దలచితిని. ఈ నిరర్థక ప్రసంగముతో వృథా కాలయాపన చేయక 'అవును - కాదు' అని ఒక్క మాటలో తెగ చెప్పివేయుము. నృపతీ! రేపు ప్రాతఃకాలమునకు రాముడు మునివేషమున వనములకే పోనియెడల నేను మరణించుట, నీ కపకీర్తి ఘటిల్లుట నిక్కమని నిర్ణయించు కొనుము.''

ఇట్లు ఖండితముగ చెప్పివైచి ఆమె ఆగ్రహముతో దిగ్గున పైకి లేచెను. ఆమె క్రోధమునకు క్రొత్తవెల్లువ వచ్చినట్లుండెను. ఆ కుటిల జలధార పాపి కొండలపై ప్రభవించి, వరతీరద్వయమును ఒరసికొనుచు తీర్థవృక్షరాజమును సమూలముగ ఛేదించి, విపదంబుధివైపు వేగవతియై ప్రవహించెను.

రాజు సాలోచనా దీన దృష్టుల కైక నొకింత పరికించి, ఓహో? ఈ మగువ రూపమున నిక్కముగ మృత్యువు నన్ను సమీపించినదని నిశ్చయించిన వాడై, ఆమె పాదద్వయము పట్టుకొని కూర్చుండబెట్టి - ''ఓ తల్లీ, నా తల నైనా తీసుకొని పుత్రభిక్ష పెట్టుము. కానీ పుత్ర వియోగాగ్నికి నన్ను ఎరజేసి వధించవద్దు. కైకా! రఘుకులమును రక్షించుము, రక్షించు''మని ప్రాధేయపడి ప్రార్థించెను.

కైక మనసు కించిత్తయిననూ చలించక కాఠిన్యము వహించెను.

ఇక ఈ కపటరోగమునకు తిరుగులేదని గ్రహించిన దశరథుడు దుఃఖాక్రాంతుడై తల కొట్టుకొనుచూ 'రామా!' 'హారామా!' యని దురపిల్లుచూ నేల గూలెను.

సాకేతపతి సకలేంద్రియములు శిథిలమయ్యెను. నీటిలోని చేప నేలబడి నట్లు, రాజుకు నోట మాట రాక నాలుక తడియారెను. ప్రాణముపై విషము చల్లు విధమున తిరిగి కైక రాజుపైకి వాగ్బాణములు విసరెను.

''మహారాజా! తుద కిట్లు చేతులు చూపించటానికేనా వరములు కోరు మని నాతో పలుమార్లు పల్కినది? నవ్వుట - బుగ్గలు పూరించుట ఏక కాలమున సాధింపబడదని తెలియదా? దాతృత్వమునకు కృపణత్వమునకు సమ న్వయ మసాధ్యముకదా! రాజధర్మమన వట్టిమాట లనుకొంటిరా? సత్య సంధులకు తమ ధన ప్రాణములు తృణ ప్రాయములు. అడుదానివలె ఆక్రం దించుట మాని ధైర్య మవలంబించి తగు సమాధాన మిమ్ము.''

ప్రియపత్ని దుస్సహ వచనాఘాతములకు తేడు ఇట్లు రోదించెను.

''రాణీ! భరతపుత్రునికి రాజ్యవాంఛ ఈషన్మాత్రములేదు. ఇంతకూ నిన్ను నిందించి లాభమేమి! నా ప్రారబ్ధము నన్నిట్లాడించుచున్నది. కైకా! ఒక్కసంగతి మాత్రము గుర్తించుకొనుము. ఏనాటికైనా నా శ్రీరాముడు రాజ్యాభిషిక్తుడు కాగలడు. అతని - పాలనలో అన్నదమ్ములూ అయోధ్య తిరిగీ కళకళ లాడుట తథ్యము. కాని, నీ కళంకము, నా పరితాపము - ఇవి రెండునూ ఆ దివాకర సుధాకరులున్నంత వరకు శాశ్వతముగ నిలిచిపోవుట నిజము. అభా గ్యురాలా! ఇక నా కండ్లముందరుండక తొలగిపొమ్ము! దేగకు ఆహారమిడుటకై ఆవును చంపితినే యని ఒక నాటికైనా నీకు పశ్చాత్తాపము కలుగకపోదు.''

కాలుచున్న కాష్ఠమువలె కైక రోష గంభీరముగ నిలబడి యుండెను. ''రేపు సూర్యుడుదయించ కుండిన, ఈ సంగతి శ్రీరామునికి తెలియకుం డిన, ఎంత బాగుండును?'' అని ఆలోచించుచూ 'రామా! హారామా!!' యని పలవరించుచూ రాజు నేలపైబడి రాత్రంతయూ వ్యసనవ్యాకులితుడై రోదించుచుండెను.

## కైకేయి - రాముడు

ఇంతలో సూర్యోదయ మాయెను. రాజద్వారము వద్ద వైతాళికులు మేల్కొలుపులు పాడిరి. వీణ - వేణు - శంఖ - శహనాయి - మున్నగు

మంగళ ధ్వనులు మ్రోగెను. సహగమనము చేయ బోవుచున్న స్త్రీకి శృంగారా లంకరణపై యెట్లు అసహ్యము కలుగునో అట్లు రాజు చెవులకా మంగళ ధ్వనులు దుస్సహముగా నుండెను.

నిత్యమూ ప్రాతఃపూర్వమే మేల్కాంచు ధరణీశుడు ఇంకనూ లేవకుండుట జూచి మంత్రులు రాజ పరిచారకులు ఆశ్చర్యపడిరి. అంతట వారు రాజు గారిని లేపి, వారి ఆదేశములు గైకొని వచ్చుటకై సుమంత్రుని రాజ మహలుకు బంపిరి.

శయన గృహమంతటా విషాదచ్ఛాయలు వ్యాపించి, చూచుటకు భయం కరముగా నుండెను. సుమంత్రుడు దిగులుగొని చిన్నగ రాజు, రాణి యున్న ప్రదేశము చేరి, వారికి జోహారు పలికెను. అతిదీనుడై, నాళమునుండి త్రుంచి వేయబడిన కమలమువలె ధరాగతుడై యున్న రాజు దయనీయస్థితిని జూచి సుమంత్రుడు భయముచే మాటలాడలేక పోయెను. అంతట కైక సచివోత్తముని వైపవలోకించి-

''మంత్రీ! మహారాజుకు రాత్రంతయూ నిద్రపట్టలేదు. రామ - రామ యని కలవరించుచూ రాత్రి గడపిరి. కారణమేమో తెలియరాకున్నది. నీవు ఈ సమాచారము శ్రీరాముని కెరిగించి, తత్క్షణమే అతనిని తోడ్కొని రమ్ము! ఆ పైన నీవు సంగతి సందర్భము తెలునుకొన గలవు'' అని చెప్పెను.

ఈ మాటలు వినుచుండిన రాజు ఏమియూ పలుకక మిన్నకుండెను. రాణిమాటలు రాజు మాటలుగా భావించి సుమంత్రుడు రాముడున్నచోటుకు హుటాహుటి కదలెను. రాజాజ్ఞ చెవుల బడగనే శ్రీరాముడు సచివోత్తముని వెంట పాదచారియై శయన గృహమునకు వచ్చెను.

కేసరిని జూచి గడగడలాడు వృద్ధగజము మాద్కి భయాతురుడై నేలబడి యున్న తండ్రినిగాంచి తనయుడు నివ్వెర పడిపోయెను. ఘడియలు లెక్క బెట్టుచూ కాచుకొని కూర్చొనియున్న మృత్యువా యన్నట్లు తండ్రికి సమీపము నసే యున్న తల్లిని జూచెను.

దుఃఖ మెటువంటిదో ఇంతవరకు కనివిని ఎరుగని దాశరథి ఇంచుక ధైర్య మవలంబించి, మధుర వచనముల మెల్లగా తల్లినిట్లు ప్రశ్నించెను.

''మాతాజీ! జనకుని ఖేదమునకు కారణ మేమి? తెలియజేసిన వారి దుఃఖ నివృత్తికై యథాశక్తి ప్రయత్నము చేసెదను.''

''రామా! తండ్రిగారి దుఃఖమునకు కారణము నీవు. నీపై వారికున్న స్నేహ వాత్సల్యములే ఇందుకు ప్రధాన హేతువులు. వారు నాకు రెండువర ములు ప్రసాదించి యుండిరి. నేనా వరములు నేడు కోరితిని! నా యభీష్టము తెలుసుకొన్న మీదట నీపైనున్న మమతకొలదీ ఇట్లు విచారగ్రస్తుడై పడి యున్నాడు. ఒకవైపు పుత్రప్రేమ, మరొకవైపు చేసిన ప్రతిజ్ఞ. ఈ రెంటిమధ్య వారి మనస్సు డోలాయమానమై ముడివీడక యున్నది. రామా! నీకిష్టమైన తండ్రి ఆజ్ఞను శిరసావహించి వారి దుఃఖము తొలగించుము.''

మూర్తీభవించిన కఠోర దేవతవలె ఠీవిగ కూర్చొని, కైక సమాచార మంతయూ తుది మొదలు శ్రీరామునికి నిర్భయముగ తెలియజేసెను. తల్లివలన సర్వము తెలుసుకొన్న మీదట కాకుత్స్థమణి కౌసల్య తనయుడు లోలోన నవ్వుకొని, మధుర మంజుల భాషణముల నిట్లు మాట్లాడెను.

''జననీ! తల్లిదండ్రుల అభీష్టానుసారము ప్రవర్తించి, వారిని సంతుష్టులను జేయగలవాడే నిజమయిన తనయుడు. అమ్మా! పితృవాక్య పరిపాలన, తల్లికి సంతోషము, ప్రియ సోదరుడైన భరతునకు రాజ్యప్రాప్తి, విశేషించి పరమ వాంఛనీయమైన మునిజన సాంగత్యము, మున్నగునవి ఏకకాలమున సాధించు టకు, బహుళ ప్రయోజనకరమైన చతుర్దశ వర్ష వనవాసము లభించుట నా యదృష్టము. ఈ శుభవార్తకు హృదయము ఆనందముచే ఉప్పొంగిపోవుచున్నది.

కానీ, ధైర్యశాలి, గుణశీలుడైన తండ్రిగారు ఈ స్వల్ప విషయమునకై ఇంతగా దిగులొందిరా! యని నాకు సందేహము కలుగుచున్నది. నావలన యేదో పెద్ద అపచారమే జరిగియుండును. అది నాతో చెప్పలేక బాధపడు చుండిరి.

తల్లీ! నామీద ఒట్టు పెట్టుకొని నిజము చెప్ప వేడుచున్నాను.''

నీటి మట్టము సమతలముగ నుండిననూ దానిపై వంకర టింకరగా సంచరించుట జలగ స్వభావము. అటులనే నిండు మనస్సుతో నిష్కపటముగ పలికిన శ్రీరాముని మాటలను కైక విశ్వసించలేక పోయెను. అయినప్పటికినీ శ్రీరాముని అభిమతము తెలుసుకొని లోలోన సంతసించి, పైకి కపట ప్రేమ కనబరచుచూ ఇట్లు శ్వాసించెను.

''తనయా! నీతోడు, భరతునితోడు, ఇంతకంటె మరొకకారణము తెలియదు. జననీ జనకులకు, బంధు బాంధవులకు ప్రేమ పాత్రుడైన ఓరామా! నీవలన యేదోషమూ జరిగియుండదు. తల్లిదండ్రుల అభీష్ట ప్రకారము నడచుకొందునని నీవు చెప్పిన మాటలు నిజముగ శ్లాఘనీయమైనవి. జననీ జనకులు చేసిన తపస్సుకు ప్రతిఫలముగ నీ వంటి సుపుత్రుడు కలిగెను. బిడ్డా! వృద్ధాప్య దశలో తండ్రికి అపకీర్తి రాకుండవుండునట్లు వారి అభిమత మెరిగి ప్రవర్తించెదవని విశ్వసించెదను.''

గంగలో కలిసిన అశుద్ధ జలము కూడ శుద్ధమగునట్లు కైక కుటిలోక్తులు రఘురాముని కర్ణములకు శ్రవణ పేయముగ నుండెను.

ఇంతలో దశరథుడు మూర్ఛనుండి కొద్దిగ తేరుకొని 'రామా! రామా!!' యని కలవరించెను. అంతట సుమంత్రుడు రాజును లేవదీసి సుఖాసీనుని జేసి, రామమూర్తి వచ్చియున్నాడని నివేదించెను.

తనకు పాదాభివందనము చేసిన తనయుని కౌగిటిలోనికి తీసుకొని తండ్రి ప్రేమ విహ్వాలుడయ్యెను. కరుణాకలితుడైన కోసలపతి కన్నుల జలధార గట్టెను. ప్రేమాధిక్యముచే నోట మాటరాని స్థితిలో దశరథుడు శ్రీరాముని హృదయమున కత్తుకొని కడుదీనుడై భగవంతు నిట్లు ప్రార్థించెను.

''ఓ మహేశా! సకల ప్రాణికోటులు నీ ఇచ్ఛాధీనమై వర్తించుచున్నవి. ఓ శివా! ఈ దీనునిపై దయదలచి నా మాట పాటించి శ్రీరాముడు వనములకు పోకుండునట్లు అతని మనస్సు మార్చి వేయవలెను. నాకీర్తిప్రతిష్ఠలు మంట గలిసిననూ, నాకు స్వర్గ ప్రాప్తి లేకపోయిననూ చింతలేదు. స్వామీ! నా రఘురాముడు నా కన్నులకు కనబడుచుండిన చాలు. అదియే నాకు పదివేలు.'' అని కోసలపతి కైలాసవాసుని కేలుమోడ్చి ప్రార్థించెను.

తండ్రి ప్రేమాధిక్యముచే మాట్లాడలేకున్నాడని భావించి, తల్లి చెప్పినదే సత్యమని విశ్వసించి శ్రీరాముడు తండ్రి కభిముఖుడై ఇట్లు ప్రసంగించెను.

''పితాజీ! మీ దయనీయస్థితి జూచి మొదట నేను భీతిల్లితిని. కానీ తల్లి గారి వలన సర్వమూ తెలుసుకొన్నమీదట నా మనస్సిప్పుడు శాంతించెను.

జనకా!... ఇంత స్వల్ప విషయమునకై మీరిట్లు శోకించుట శోభ నీయము గాదు. తండ్రీ! జననీజనకులను దైవ సమానులుగా భావించి, వారిని సర్వవిధుల సంతోషపెట్టగలిగిన పుత్రుడు చతుర్విధ పురుషార్థములు సాధించి ధన్యుడగుచున్నాడు. మీ యాజ్ఞానుసారము నేను వనములకేగి జన్మసార్థకము చేసుకొని శీఘ్రమే తిరిగివచ్చెదను. ఈ శుభ సమయమున మీ రిట్లు విచారిం చక నన్ను వనవాసము చేయుటకు దీవించి పంపుము. ఇప్పుడే తల్లిగారి వద్ద సెలవు తీసుకొని వచ్చెద!!'' అని విన్నవించి రామమూర్తి చరచర నడచుకొ నుచూ తల్లి ఇంటివైపు వెళ్ళిపోయెను.

తేలుకుట్టిన ఉత్తర క్షణముందే దాని బాధ నర నరములకూ ప్రాకునట్లు ఈ దుర్వార్త నిముసములో నగరమంతటా శతసహస్ర ముఖములతో వ్యాపిం చెను. ఉత్సవోత్సాహములతో వళ్ళు మరచియున్న అయోధ్యపై నిముసములో విషాదచ్ఛాయలు ఆవరించెను. కరుణా రస సేనా వాహిని రణభేరి మ్రోగించు కొనుచు వచ్చి పట్టణముపై విరుచుక పడినదా యన్నట్లు ఆ బాల వృద్ధులు శోకాహతులైరి. దావానలముచే దహింపబడిన కాననముకైవడి సాకేతవాసుల ముఖ ములు కాంతిహీనమై వెలవెల బోయెను. శోకార్ణవ మగ్నమైన అయోధ్యలోని స్త్రీ - పురుషులు అచ్చటచ్చట గుంపులుగూడి కైక చర్యనువాగ్బాణములుగుస గులాడ సాగిరి-

''హా! ఈ కైక కొంపకు కొరివి బెట్టెనే! ఈ మూర్ఖురాలు తన చేతు లారా తన కండ్లనే ఊడబెరికి చూడదలచినది. ప్రాణములకంటే అధికముగ ప్రేమించిన పుత్రునికి వ్యతిరేకముగ కుట్ర బన్నుటకు ఈమె చేతులెట్లాడెనో! స్త్రీ హృదయము అగాథమైనదనీ, వారి అంతర్యము అర్థము చేసుకొనుట అసాధ్యమనీ ఋజువయ్యెను. ఈ ప్రపంచములో అగ్నిచే దహింపబడని, జలధి

గర్భమున ఇముడజాలని, కాలునకు కుంటుము కాని మస్తువే లేనట్లు ఆడుది ఆగ్రహించిన సాధింపరాని కార్యము లేదుకదా!''

''భగవంతుడు ఒకటి చేయదలచి మరొకటి చేసెననీ, మొదట అమృతము చూపించి తుదకు విషమిచ్చెననీ'' కొందరు దేవుని నిందించిరి. ''మహారాజు ఆడుదానికి లోబడి, యుక్తాయుక్త విచక్షణ కోల్పోయి చేతులార ఇంతపని చేసుకొనె''నని మరికొందరు భావించిరి. ఈ కుట్రలో భరతునికి కూడ జోక్య ముండకపోదని ఒకడు శంకించెను. చంద్రుడు అగ్ని వర్షము కురిపించిననూ, అమృతము హాలాహలముగా మారిననూ భరతుడు భాతృద్రోహము తలపెట్టడని మరొకడు ముందువాని మాటను ఖండించెను.

ఇట్లు నగరవాసులు నానావిధముల శకించుచూ, పరిపరి విధముల పరితపించసాగిరి. కైకకు హితాభిలాషులైన కొద్దిమంది విప్రవృద్ధస్త్రీలు ఆమెను సమీపించి హితవు పలికిరి.

''అమ్మా రాణీ! నీ వలన లోకమునకింత క్లేశము కలుగుట వాంఛనీయము కాదు. పూర్వాపరము లాలోచించి చూచిన అవాంఛనీయమ్మైన పరిణామములు సంభవింపనున్నవి. సీత రాముని విడిచి పెట్టునా! లక్ష్మణుడు గృహములో ఉండగలడా! రాముడు లేని రాజ్యము భరతుడు చేపట్టునా? ఒకింత విచారించినయెడల నీకే బోధపడగలదు. అమ్మా! వనములకు వెళ్లుచున్న రాముని నివారింపజేయుము. ఒకవేళ రామచంద్రుడిచ్చట ఉండుటవలన ఉపద్రవోత్పాతములు కలుగునని తలచిన, అతనిని కాననమునకు బదులు గురు గృహమున నివసించునట్లు కోరుము. తల్లీ! చేతులు కాలిన మీదట ఆకులుపట్టుకొన ప్రయత్నించుట నిష్ప్రయోజనము.

ఇప్పుడే నీవు నిజముగ నిజ్ఞతతో ప్రవర్తించినట్లైన నీ కుకీర్తి రాదు. రఘువంశము నిలుచును. రాజు ప్రాణములు రక్షింపబడును. లోకమున కానందము కలుగును'' అని వృద్ధాంగనలు అనేకవిధముల బోధించి హితోక్తులు పలికిరి. కానీ వారి బోధనలు మంథర గట్టిగా దట్టించి పెట్టిన కైక చెవుల కెక్కలేక పోయెను.

పరిజన, పురజన, బంధుజనులు కైకను దూషించుచూ, తుదకు మా రామునికి అడవిదారిపట్టి పోవలసినరాత కలిగెనా! యని చింతించుచూ నిర్వ్యాపారులై నిట్టూర్చిరి.

## తల్లి వీడ్కోలు

క్రొత్తగ పట్టుబడిన మదగజము కట్లువిప్పగనే అడవికి పారిపోవ నుంకించు విధమున ఈరాజ్యబంధముల నుండి విముక్తుడనై స్వేచ్ఛగా వనవాసము చేయుటకు ఇప్పటికిగదా అవకాశము చిక్కెను. అని శ్రీరాముడు సుప్రసన్నుడై, తల్లి వద్ద సెలవు తీసుకొనుటకు సంతోషముతో వచ్చి చేరెను.

కౌసల్య రామమూర్తిని ప్రియమాడి ముద్దిడి, ఒడిలో కూర్చుండబెట్టుకొని, నేత్రముల ఆనంద బాష్పములు రాలుచుండ "బిడ్డా! మంగళప్రదమగు నీ అభిషేక మహోత్సవమెప్పుడు? నాయనా! కొద్దిగ భుజించిన పిమ్మట మీ తండ్రి గారి వద్దకు వెళ్ళుదువు స్నానమునకు లెమ్ము" అని పలికెను, కౌసల్య పుత్ర ప్రేమ సంతోషముచే కల్పవృక్షమువలె పుష్పించి ఫలించినట్లుండెను.

"అమ్మా! తండ్రిగారు నాకు కాననరాజ్యము ప్రసాదించిరి. వారి మాట ప్రకారము పదునాలుగేండ్లు విపినములందు విహరించి, తిరిగివచ్చి నీ చరణములను దర్శించుకొనెదను తల్లీ! ఎలాటి విచారము పెట్టుకొనక నన్నాశీర్వదించి ప్రస్థానము చేయుటకు అనుమతించుము" అని రాముడు ప్రశాంతముగ తల్లితో పలికెను. రాముని మాటలు కౌసల్య హృదయమునకు బాణములవలె తగిలెను. వర్షధారకు 'జవాస' పుష్పము వాడిపోవు విధమున తనయుని చల్లని మాటలకు ఆ తల్లి హృదయము దహించుకపోయెను. సింహగర్జన వినిన హరిణి చందమున ఈ దుర్వార్త విన్నప్పుడు కౌసల్య సర్వేంద్రియములు భీతిగొని గడగడ కంపించిపోయెను. తుద కామె కొద్దిగ ధైర్యము కూడగట్టుకొని-

"పుత్రా! నిన్ను రాజ్యమిచ్చుటకు ముహూర్తము నిర్ణయించి, ఈ దినము అడవులకు పొమ్మని చెప్పుటకు నీవు చేసిన అపరాధమేమి? ఈ సూర్యవంశమునకు కార్చిచ్చు పెట్టిన ఆ పుణ్యాత్ము లెవ్వరో చెప్పుము" అని పరివేదనతో పలికెను.

తల్లి ప్రశ్నకు నిరుత్తరుడై నిలబడియుండిన శ్రీరాముని ముఖము చూచి, ప్రక్కన నిలబడియున్న సుమంత్రుని పుత్రుడు అప్పుడు పట్టమహిషికి జరిగిన వృత్తాంతమంతయూ సవినయముగ తెలియపరిచెను.

వివరములు తెలుసుకొన్న పిదప కౌసల్య నోట మాట లేక నిశ్చేష్టితురా లయ్యెను. చుంచెలుకను మ్రింగిన సర్పము కైవడి దుఃఖము మ్రింగనూ క్రక్కనూ లేనిస్థితిలో ఆమె మనస్సు కొట్టుకలాడెను. ''ఆహా! విధి వైపరీత్య మెంత విచిత్రమైనది! చంద్రునిపేరు వ్రాయబోయి రాహువుపేరు వ్రాసినట్లాయెనే!'' యని నిట్టూర్చి చింతించెను.

ఒకవైపు పుత్రవాత్సల్యము, మరొకవైపు నారీధర్మము - దేని ననుసరించ వలెను విషమసమస్య ఆమె హృదయమును మథించసాగెను. కౌసల్య ధర్మజ్ఞ, వివేకవంతురాలు - కాబట్టి రామభరతు లిర్వురూ నా బిడ్డలేకదా యని భావించి నిస్తరంగ సముద్రమువలె నిముసములో నెమ్మదించినదై ఆమె నిర్మల హృదయముతో ఇట్లు ప్రవచించెను.

''నాయనా రామమూర్తీ! పితృవాక్య పరిపాలనకంటె మించిన ధర్మము మరొకటి లేదు. కాబట్టి నీవు మంచిపని చేసితివి. బిడ్డా! నీకు రాజ్యము వచ్చి నందులకు హర్షము, వనవాసము లభించినందుకు విషాదము నా కిసుమం తయూ లేవు. నీవు కనబడకుండిన నీ తమ్ముడు భరతుడు, ప్రజలు విశేషించి మీ తండ్రిగారు ఎంతటి దుఃఖదైన్యములకు లోనయ్యెదరో యని ఊహించి బాధపడుచున్నాను. కానీ, వత్సా! తల్లీ తండ్రీ ఇద్దరిచే ప్రసాదింప బడిన ఈ వనవాసము నీకు నూరు అయోధ్యలతో సమానమైనదిగా యుండు నని నా విశ్వాసము- (కానన శత అవధ సమానా.)

చివరి దశలో రాజులకు విపినవాసమే శ్రేష్ఠమైనది గదా! అయితే ఈ బాల్యదశలో నీవు వనవాస క్లేశమెట్లు భరించగలవా? యని నీ తల్లి హృదయం దిగులుతో తల్లడిల్లుచున్నది. నేనుగూడ నీ వెంట వచ్చెదనని చెప్పిన నీకు సందే హము కలుగును. అదిగాక భర్తమవదలి పుత్రునివెంట పోయినదని నన్ను లోకము నిందించును. నీవు నాకు ప్రాణములకంటె అధికుడవు. అయినమా 'అమ్మా, నేను అడవులకు వెళ్ళుచున్నా'నని నీవు అన్నప్పుడే ఈ దేహము

వదలిపెట్టలేక ఇట్లు పరితపించుచున్నాను.

కుమారా! ఆ వనదేవతలే నిన్ను తల్లిదండ్రులవలె సర్వదా రక్షించు చుందురుగాక! మాతా సుతుల-సంబంధము సర్వోత్కృష్టమైనదిగా గుర్తించి నన్ను మరచిపోవద్దు. రామా! వనవాసము క్షేమముగా గడపి, మేము జీవించి యుండగనే తిరిగివచ్చి మమ్ము కలుసుకొనుము.''

అని దీవించిన కౌసల్య, పొర్లివచ్చెడి దుఃఖమును భరించలేక కొడుకు పాద ములను బట్టుకొని యెలుగెత్తి యేడ్చెను.

అప్పట్లో ఆ మాతృ హృదయమునకు కలిగిన ఆవేదన వర్ణింపజాలనిది. రాముడు తల్లికి బహువిధముల బోధించి ఊరడించెను.

ఇంతలో జానకి భయవ్యాకులముతో అక్కడికి వచ్చి అత్తచరణములకు నమస్కరించి, నతవదనయై నేల కూర్చొనెను. కౌసల్య ఒకవైపు కోడలిని దీవించి మరొకవైపు కన్నుల నీరు నింపుకొనెను-

''నా ప్రాణనాథుడు వనములకు వెళ్ళుచున్నాడు. వారి ననుసరించి పోగల అదృష్టము నాకే కలుగనున్నదా? లేక నా ప్రాణములకు మాత్రమేనా? భగవదిచ్ఛ ఎట్లున్నదో వూహించలేకున్నాను...'' అని చింతించుచూ, నత శిరస్కయై కన్నీరు కార్చుచుండిన సీత నవలోకించి, కౌసల్య రామునితో ఇట్లనెను-

''రామా! జానకి సుకుమారి, అందాల కుప్ప. అత్తమామలకు, పురజన, పరిజన - బంధువులకు మైథిలి గారాబు బిడ్డ. నా ముద్దు కోడలిని సీతను ప్రాణముతో సమానముగ చూచుకొని, కంటికి రెప్పవలె కాపాడుచున్నాను. సూర్యరశ్మి సోకని యీ సుకుమారి నేల అడుగుబెట్టి ఎరుగదు. అమె నీతో వనములకు రాచదలచినది.

చిత్రములో కోతిబొమ్మను చూచి భీతిల్లు కోమలి, కోల భిల్ల కిరాతు లకు వాసయోగ్యమై, దుష్టరాక్షసులు, క్రూరమృగములు తిరుగాడుచుండు ఆ కీకారణ్యములందు ఎట్లు నివసించగలదు!

నిర్మల మందాకినీ వీచికల విహరించు మరాళము మట్టి గుంటలో ఎట్లు నివసించగలదు? సీత ఇక్కడుండిన నా ప్రాణములకెంతో ఆధారముగ

నుండును. పుత్రా! నేను చెప్పవలసినది ఆమెకు చెప్పితిని. ఇక నీ యభీష్ట మెట్లున్నదో తెలియజేసిన, ఆ ప్రకారమామె నడుచుకొనగలదు.''

అని వాత్సల్యపూరితముగ పల్కిన తల్లికి రామమూర్తి తగురీతి సమాధాన మిచ్చెను. రామచంద్రునికి వైదేహిని వెంట తీసుకొని వెళ్ళవలెనను కోరిక ఉండి నను, పూర్వాపరము లాలోచించి వనవాసమందలి కష్టసుఖములను గురించి జానకితో ఇట్లు ప్రసంగించెను. - ''మైథిలీ! మన ఉభయుల క్షేమ మాలోచించి చూచిన, నీవు ఇంటియందుండుటే శ్రేయస్కరము. నా ఆజ్ఞ పాలించిన కీర్తి, అత్తమామలను సేవించగలిగిన అదృష్టము నీకు కలుగును. తల్లిగారు నామీద బెంగగొని దిగులు పడినపుడు ఆమెకు మంచి పురాణకథలు చెప్పి ఊరడించగలవు గదా! మూర్ఖించి పట్టుబట్టిన తుదకు గాలవమునివలె, నహుషునివలె నీవును కష్టములపాలు కాగలవు.''

''ప్రియా, వనవాస క్లేశములను నీవు ఊహించలేకున్నావు. నారచీరలు ధరించి, ఎండ కెండి, వానకు తడిసి, ఆకలిదప్పులతో కంటకావృతమగు ఘోరారణ్యంబుల సంచరించవలసియుండును. అగాధమగు నదీనదములు తరించి, మహోన్నతమైన దుర్గమాద్రులు అధిరోహించి వృకసింహవ్యాఘ్రభల్లూకాది క్రూరమృగములకు, మానవభక్షకులగు రాక్షసమూకలకు తావలమైన గహనాంతర సీమల నీవంటి సుకుమారి సంచరించగలదా! మామిడిసాల కిసలయములు మెసవి తృప్తి జెందెడి కోయిల కుటజములందు విహరించుట కిష్టపడునా! ఓ భూపుత్రీ! నీవు ఇంటియందుండి, అత్తమామలకు సేవచేయుచుండుము.''

శరత్కాల చంద్రికలు చకోరమునకు సంతాపము కలిగించుభంగి రాముడు మెత్తగ చెప్పిన మాటలు సీత కర్ణములకు కటువుగా నుండెను. నన్ను వదలిపెట్టి వెళ్ళుటకే నాథుడు నిశ్చయించినాడని భావించి, సీత కన్నీరు మున్నీరుగా ఏడ్చెను. తుదకు ఆమె అత్తకు నమస్కారము చేసి భర్తతో ఇట్లు పలికెను:

''నాథా! సతికి పతియే సర్వస్వము. భర్త నెడబాసిన భార్యకు స్వర్గమైననూ నరకప్రాయమేగదా! జీవములేని దేహము, నీరులేని నదివలె పతిలేని పత్ని ఎన్నటికీ శోభించజాలదు. సుఖసంపదలు, ఐశ్వర్యభోగములు, విలాస వైభవములు

పురుషుడులేని స్త్రీకి బాధాకరముగ పరిణమించును. నీ సాంగత్యమున అనేక కష్టములు వచ్చిననూ ఆనందముతో భరించగలను.

నాథా! నిత్యమూ మీ చరణకమలములను సేవించి శరత్కాల చంద్ర బింబమువంటి మీ ముఖము చూచుకొనగలిగిన భాగ్యము నాకు కలుగజేయుము. నా శీలస్వభావములు మీకు తెలియనివి కావు. పద్నాలుగేండ్లు మిమ్ము విడనాడి నేను జీవించగలనా? ఏ వాసమైననూ మీ సహవాసమునకు సాటి రాగలదా? ప్రభూ నేనా సుకుమారిని మీరు కాదా? మీరు సహించగల కష్టములు నేను సహించజాలనా? ఎల్లవేళల మీకు తోడునీడగా నిలచి మీకు సేవాశుశ్రూషలు చేసి, సహాయకారిగా నుండగలను. మీ వియోగదుఃఖము సహించి నేను బ్రతుకుటమాత్రము అసంభవము.''

అని భూమిజ అనేకవిధముల విన్నవించి రోదించెను. వియోగనును శబ్దమునే సహించలేకున్న ఈమెను బలవంతముగా నిరోధించినయెడల వైదేహి తప్పక ప్రాణములను వదలిపెట్టగలదని శంకించి శ్రీరాముడు సీతతో-

''కల్యాణీ! ఇది దుఃఖించవలసిన సమయము కాదు; నాతో వనములకు వచ్చుటకు వెంటనే ప్రయాణ ప్రయత్నములు చేయుము'' అని చెప్పి, అతడు తల్లికి నమస్కరించి, ఆమె ఆశీస్సులు తీసుకొనెను.

జానకి అత్తకు పాదాభివందనము చేసి, ''మాతా! మిమ్ము సేవించి తరించవలసిన తరుణములో నేను వనగమనము చేయవలసి వచ్చినందుకు బాధపడుచున్నాను. అత్తా! నేను నిర్దోషిని. నన్ను దయతలచుము'' అని ప్రార్థించెను.

కోడలి వినయోక్తులకు అత్తహృదయము కరుణాభావముచే కదలిపోయెను. కౌసల్య సీతను పలుమార్లు హృదయమునకు హత్తుకొని ''బిడ్డా సీతా! గంగాయమునల జలధారవలె నీ మాంగళ్యము నిశ్చలమై నిలచుగాక!'' అని దీవించెను.

సీతారాములు పునః పునః మాతృపదములకు వందన మాచరించి, ఆమె హితోక్తులు శిరసావహించి తల్లివద్ద సెలవు తీసుకొనిరి. కౌసల్య కాతరదృష్టి

లతో కొడుకునూ, కోడలినీ చూచుకొనుచూ నిశ్చేష్టయై నిలబడిపోయెను.

ప్రభువు వనములకు వెళ్ళుచున్నాడను వార్త విన్నప్పుడు లక్ష్మణుని హృదయము క్షోభించిపోయెను. ఆత్రముతో పరుగెత్తుకొనివచ్చి అతడు అన్నపాదములపై వ్రాలెను. నీటి నుండి వేరుచేయబడిన చేపవలె అతి దీనుడై అగ్రజుని ఎదుట నిలబడెను. దేహగేహములను తృణప్రాయములుగా భావించి చేతులు జోడించుకొని సజలనేత్రుడై నిలబడియున్న సోదరుని అవలోకించి సకలగుణధాముడైన శ్రీరాముడిట్లు ప్రేమపూర్వకముగా పలికెను:

"సోదరా! పరవశుడవై కర్తవ్యా కర్తవ్యములను విస్మరించుట ఉచితము గాదు. భరత శత్రుఘ్నులు ఇంటలేరు. తండ్రి వృద్ధాప్యదశలో నీకై పరితపించుచున్నాడు. నేను నిన్ను వెంట తీసుకొనిపోయినట్లయిన తల్లిదండ్రులు, గురువులు, పరిజనులు, ప్రజలు తీరని వేదనకు లోనయ్యెదరు. అయోధ్యను అనాథస్థితిలో వదలివేయుట ధర్మమేనా? ఏ ధరణీశుని పాలనలో ప్రజలు బాధపడెదరో ఆ నరనాథునికి తప్పక నరకప్రాప్తి సంభవించును. కనుక నీవు గృహమందుండిన ఇన్ని అనర్థములు ఏర్పడవు కదా?". దుఃఖాతిశయముచే రుద్ధకంఠుడైన లక్ష్మణుడు అతి కష్టముమీద అగ్రజు నిట్లు ప్రార్థించెను.

"అగ్రజా! నీతి బోధకములైన మీ ఉపదేశ వాక్యములు నేను వింటిని. అయితే ధీరులు, ధర్మధురంధరులైన పురుషులే మీ రాదేశించినట్లు ధర్మశాస్త్రానుసారముగ ప్రవర్తించగలరు. నాబోటి పామరుడు అందు కనర్హుడు. మందర పర్వతమును మరాళ మెన్నటికైనా మోయగలదా?

ప్రభూ! నేను మీ దాసుడను. మీ స్నేహచ్ఛాయలందు పెరిగిన బాలుడను. నాకు తల్లీ, తండ్రీ సర్వమూ మీరే. త్రికరణశుద్ధిగ మీ చరణసేవ చేసుకొనుచున్న నన్ను వదలిపెట్టిపోవుట భావ్యము కాదు."

కరుణానిధి శ్రీరాముని మనస్సు తమ్ముని మాటలకు ద్రవించిపోయెను. సౌమిత్రిని గాఢాలింగనము చేసుకొని - "సోదరా లక్ష్మణా! ఇక ఆలస్యమెందులకు? తల్లివద్ద సెలవు తీసుకొని త్వరగా రమ్ము" అని చెప్పెను.

లక్ష్మణుడు అన్న అనుమతించినందుకు సంతుష్టాంతరంగుడై తల్లివద్దకు

వెళ్ళి, ఆమె పాదములకు నమస్కరించి సమాచారమంతయూ తెలియజేసెను.

కార్చిచ్చుమధ్య చిక్కుపడిన ఆడులేడివలె లక్ష్మణుని మాటలువిని సుమిత్ర భయకంపిత యయ్యెను. తల్లి ముఖలక్షణములను పరీక్షించి, 'అయ్యో! ఈమె వాత్సల్యము న్నెక్కడ ఆటంకపరచునో'యని లక్ష్మణుడు భయ సంకోచములతో - ''అమ్మా నాకు సెలవు దయచేయుము'' అని మరొక్కసారి కోరెను.

సుమిత్ర దశరథుని పుత్రవాత్సల్యము సీతారాముల గుణశీలములను మనస్సునకు దెచ్చుకొని, కైక ఘాతుక చర్యకు వగచి తుదకు ధైర్య మవలంబించి ఇట్లనెను:

''కుమారా! సీతారాములే నీకు తల్లిదండ్రులు. సూర్యుడెక్కడ ప్రకాశించునో అక్కడే దినమగునట్లు ఎక్కడ రాముడో అక్కడే అయోధ్య ఉన్నట్లు భావించుము. అన్నావదినెలు లేని ఈ అయోధ్యలో నీకేమి పని? సకల జనులకు ప్రాణప్రియుడు, ప్రాణములకే ప్రాణమయిన శ్రీరాముని వెంటవెళ్ళి సార్థకజన్ముడవు కమ్ము! ఏ తల్లి కొడుకు శ్రీరాముని సేవించునో ఆ తల్లి అదృష్టవంతురాలు.

నీ అదృష్టమునకే రాముడడవికి పోవుచున్నాడు. రాగద్వేషములు విసర్జించి, నగర సౌఖ్యములను మరచి బంధుమిత్రుల ప్రేమకు వశుడవుగాక, త్రికరణ శుద్ధిగ శ్రీరాముని సేవించి తరింపుము. ఇదియే నా యుపదేశము'' అని సౌశీల్య సుమిత్ర తనయుని దీవించి సాగనంపెను.

లక్ష్మణుడు సీతారాములతో కలసి రాజమందిరమునకు వెళ్ళెను. అప్పుట రాజువద్ద సకలజనులు శోక సంతప్తమానసులై సమావేశమై యుండిరి. చింతాక్రాంతులైన వేలాది పౌరులు మధువు పోగొట్టుకొన్న మక్షికములభాతి, రెక్కలు విరిగిన పక్షులవలె విలపించుచూ రాజహజారమున చేరియుండిరి.

సుమంత్రుడు రాజును లేవదీసి ఆసనముపై కూర్చుండబెట్టెను. సాకేతపతి సీతారామలక్ష్మణులను గాఢాలింగనము చేసుకొని దుఃఖాతిరేకమున మాట్లాడలేక మౌనమున మునిగియుండెను.

"పితాజీ! ఈ సంతోష సమయమున దుఃఖించక ఆశీర్వదించి మాకు సెలవు దయచేయుడు. తండ్రీ! ఇవ్విధముగ ఎక్కువ మోహాధీనుడవైన యెడల నిందాపకీర్తులు ఘటిల్లగలవు!" అని రఘురాముడు తండ్రిని ప్రార్థించెను.

పుత్రుని ప్రియ వచనములకు నృపాలుడు సంప్రీతుడై తనయుని దగ్గర చేరదీసి గద్గద స్వరమున ఇట్లనెను:-

"రామా! నీవు చరాచర జగత్తుకు స్వామివని మునీశ్వరులు చెప్పు చున్నారు. వారివారి శుభాశుభకర్మల ననుసరించి భగవంతుడు వారి కా యా ఫలమిచ్చుచున్నాడని ధర్మశాస్త్రములు ప్రవచించుచున్నవి. కానీ, అపరాధము చేసిన వాడొకడైన, దాని ఫలమనుభవించువాడు మరొకడగుట విధివిలాసము కదా!" అని నృపాలుడు తర్కించి చింతించెను. శ్రీరాముని నిలుపుకొనుటకై రాజు బహు ఉపాయములచే ప్రయత్నించి విఫలుడాయెను. తుదకు వారు వెళ్ళుట నిశ్చయమని భావించి సీతను చేరబిలిచి కౌగలించుకొనెను.

ఆమెను అయోధ్యలోగానీ, అథవా జనకపురిలోగానీ ఉండవలసినదని అనేకరీతుల బోధించి చూచెను. కానీ రామునితో లగ్నమైన ఆమెచిత్తము వన వాస క్లేశములను లక్షించకుండెను.

అంతట గురుపత్ని, మంత్రిభార్య సీత నుద్దేశించి - "వైదేహీ! నిన్ను అడవులకు వెళ్ళుమని ఎవరూ ఆజ్ఞాపించలేదే! అత్తమామలు, గురువుగారు చెప్పినట్లు నడచుకొనుమమ్మా!" అని పలికిరి. సంకోచవశమున సీత వారికి ప్రతి వచనము పలుకుట భావ్యముగాదని తలంచి, తల వంచుకొని మిన్నకుండెను.

ఇంతలో కైక తటాలున పైకి లేచి మునివేషమునకు పనికివచ్చు నార చీరలు, తులసీమాలలు, కమండలములు మున్నగు వస్తువులను పట్టుకొనివచ్చి వాటిని రాముని యెదుట నుంచి, తియ్యని మాటల నిట్లనెను:-

"రామా! రాజుకు నీవు ప్రాణ ప్రియుడవు కాబట్టి నీపై యున్న వాత్సల్యప్రేమను వారు వదులుకొనజాలరు. పుణ్యము నశించినను, యశమ్మునకు దూరమైనను, స్వర్గప్రాప్తి తప్పిపోయినను వారు నిన్ను కానలకు పొమ్మని

ఏనాటికీ చెప్పలేరు. కనుక నీవే లెస్సగా ఆలోచించి నీకు తోచినట్లు ప్రవర్తింపుము.''

తల్లి ఉపదేశ వాక్యములకు రాముడు సంతసించెను. ప్రజలు వ్యాకుల పడిరి. ఆమె మాటలు రాజుకు ములుకులవలె తగిలెను. 'అయ్యో! నే నెంత దురదృష్టవంతుడను? నా ప్రాణములింకనూ నిలచియున్నవే!' అని దురపి ల్లుచూ మహారాజు మూర్ఛిల్లెను. ఏమి చేయవలెనో, ఏమి చేయగూడదో తెలి యని స్థితిలో అక్కడున్నవారు నిశ్చేష్టితులై నిలబడియుండిరి. అంతట రామ చంద్రుడు మునివేషము ధరించి, జననీ జనకులకు, గురుబ్రాహ్మణులకు నమ స్కరించి వనములకు పయనమయ్యెను.

## వన ప్రయాణము

శ్రీరాముడు ద్వారము వద్దకు వచ్చునప్పటికి అక్కడ వసిష్ఠులుండిరి. గురు వుతో చెప్పి బ్రాహ్మణ సమాజమునకు వర్షాశన మిప్పించెను. యాచకులకు దానాదులు చేసెను. ప్రీతి వచనములు పల్కి మిత్రులను సంతోషపరచెను. దాస దాసీ పరిచారక బృందమును గురువుల కప్పగించి, వారిని మీరే తల్లిదండ్రులవలె పోషింపుడని ప్రార్థించెను. అక్కడ చేరిన జనసమూహము నవలోకించి రాజును, రాణులను చక్కగ చూచుకొనుడని విన్నవించెను. పిమ్మట గురుచరణములకు పునఃవందన మాచరించి, పార్వతీ పరమేశ్వరులను, విఘ్నేశ్వరుని స్మరించి ముందుకు నడచెను.

రఘురాముడు వనములకు పోవుచున్నాడని తెలిసి అయోధ్య ఆర్తిజెందెను. లంకలో దుశ్శకునములు కన్పట్టెను. అమరులు హర్ష విషాదములకు లోనైరి.

ఇంతలో దశరథుడు మూర్ఛనుండి తేరుకొని హా! రాముడు పోయిననూ నా ప్రాణములు మాత్రము పోలేదే అని పరితపించి సుమంత్రుని పిలిచి ఇట్లు చెప్పెను.

''సచివోత్తమా! సుకుమారులైన ముగ్గురు బిడ్డలు వనములకు వెళ్ళుచున్నారు. నీవు వారిని రథములో తీసుకొని పోయి, వివిధ ప్రదేశములు చూపించి నాల్గవదినము తిరిగి తోడ్కొనిరమ్ము. ధీమంతులు, సత్యవ్రతులైన

కుమారులిద్దరూ మరలివచ్చుటకు ఒకవేళ అంగీకరించనియెడల, అప్పుడు నీవు నాకు మారుగా - సుకుమారి మిథిలేశ కుమార్తెనైనా స్వగృహమునకు పంపించుమని చేతులు జోడించి ప్రార్థింపుము. ఆమె అడవులు చూచి భయపడినప్పుడైనా నా మాటలు జ్ఞప్తికి దెచ్చి ఇంటికి వచ్చునట్లు చేయుము. అమాత్యా! జానకి చెంతనుండిన నాకు కొంచెము ఆధారముగ నుండును. లేని యెడల నా ప్రాణములు నిలువవు. సుమంత్రా! నా రామలక్ష్మణులను తీసుకొనివచ్చి నాకు చూపించుము'' అని ఆర్తస్వరమున ఆక్రందించి రాజు తెలివిదప్పి నేల బడిపోయెను. రాజాజ్ఞచొప్పున సుమంత్రుడు రథము తీసుకొనిపోయి, ఊరి వెలుపల సీతా రామలక్ష్మణులను కలుసుకొని వారికి అవధేశుని ఆజ్ఞ తెలియజేసెను. అంతట ఆ ముగ్గురూ తుదిసారిగా అయోధ్యకు నమస్కరించి రథముపై కూర్చుండిరి.

రాముడు లేని అయోధ్య అనాథ అయ్యెను. శోక విషాదచ్ఛాయలావరించిన అయోధ్య, కారుచీకట్లు క్రమ్మిన కాళరాత్రివలె చూచుటకు భయంకరముగ నుండెను. వనములు వాడెను. సరస్సులు ఎండెను. గృహములు శూన్యము లయ్యెను. శుకపిక శారికాదులు అన్నాహారములు మానెను. కళకళలాడుచుండిన సాకేతపురి కాంతులుడిగి వెలవెలబోయెను.

కార్చిచ్చుపడిన కాననమునుండి ప్రాణభీతిచే కకావికలై పరుగులెత్తు వన్యజీవులవలె, కైక కిరాతచర్యకు కలతజెందిన అయోధ్యావాసులు ఇండ్లు, వాకిండ్లు వదలిపెట్టి ప్రేమాధీనులై రామునివెంట బడిరి. తన వెంట వచ్చుచున్న ప్రజానీకమును గృహమునకు మరలిపొమ్మని శ్రీరాముడు వారిని పలుమార్లు ప్రాధేయపడెను. వారు కొద్దిదూరము వెనుకకు నడచి మరలా పరుగెత్తుకొనివచ్చి రాజకుమారులను కలుసుకొనుచుండిరి. ఆనాటికి రామాదులు తమసా నదీతీరము చేరి అచ్చట విశ్రమించిరి. తన్ననుసరించి వచ్చుచున్న సాకేత పురవాసుల స్నేహ సద్భావములు చూచి దయాస్వరూపుడైన శ్రీరాముని హృదయము చలించిపోయెను. దాశరథి వారి కెన్నియో ధర్మోపదేశములు చేసి, నచ్చజెప్పి, గృహోన్ముఖులను చేయుటకు ప్రయత్నించెను. కానీ, మైత్రీబంధనములు త్రెంచుకొని వెనుకకు మరలలేకుండిన వారి వివశతను గ్రహించి రాముడు మరింత సందిగ్ధావస్థలో పడెను.

పగలంతా పరిశ్రమించి బడలిక చెందియున్న ప్రజలు గాఢనిద్రలో మునిగియుండిరి. వారిని వదలించుకొనుటకు ఇంతకంటే మంచి తరుణోపాయము మరొకటి లభించదని ఊహించి, శ్రీరాముడు సీతాలక్ష్మణులను రథమెక్కించుకొని అర్ధరాత్రివేళలో అచ్చోటు వీడి పారిపోయెను. సుమంత్రుడు బండిజాడ కనబడకుండునట్లు చాకచక్యముతో రథమును నడిపెను.

మరుదినము ప్రాతఃకాలము నగర ప్రజలు లేచి చూచునప్పటికి అక్కడ రాజకుమారులు లేకుండిరి. నడి సముద్రములో నావను పోగొట్టుకున్న నావికులవలె వారు రామాదులను గానక బహువిధముల పరితపించిరి. మన బాధలు చూడలేక రాముడు మనలను వదిలిపెట్టి పోయినాడని తలలు బాదుకొని చింతించిరి. గత్యంతరము లేనందున వారు దుఃఖించుచూ గృహోన్ముఖులై చనిరి. పురవాసులు రాముని పునర్దర్శనార్థమై వ్రతోపవాసములు చేయుచూ ప్రాణములను నిలబెట్టుకొనియుండిరి.

## నిషాదుడు

సుమంత్రుడు, సౌమిత్రీ, జానకీరాములు శృంగబేరపురము సమీపించి గంగను దర్శించిరి. పరమపావని, సుఖదాయిని, నిర్మల జలతరంగిణియైన గంగాభవానికి భక్తిశ్రద్ధలతో నమస్కరించి, అందులో స్నానపానములు చేసి శ్రమ దీర్చుకొని స్వస్థచిత్తులైరి.

శ్రీరాముని ఆగమనవార్త తెలుసుకొని, నిషాదపతి గుహుడు పుత్ర మిత్ర బంధువర్గమును వెంటబెట్టుకొని దశరథ రాముని దర్శనార్థమై వచ్చెను. రఘురాముడు ప్రేమతో పలుకరించి గుహుని తమసరసన కూర్చుండబెట్టుకొనెను. నిషాదరాజు నతమస్తకుడై చేతులు జోడించుకొని-

''ప్రభూ, మీ చరణ కమలములు దర్శించుకొని మేము సుఖసంపదలను పొంది ధన్యులమైతిమి. నా ధన-ధామములు, రాజ్య - ప్రజలు సకలమూ మీ యధీనము. దేవా మా గ్రామమునకు దయచేసి, మమ్ము తరింపజేయ వేడుచున్నాను.'' అని ప్రార్థించెను.

''మిత్రమా! నిషాదరాజా! తండ్రిగారి యాజ్ఞానుసారము పదునాలుగేండ్ల

విపినవాసము చేయుటకుగాను వచ్చితిని. ప్రస్తుతము నగరవాసము నాకు నిషిద్ధమై యున్నందున మీ గ్రామమునకు రాజాలకున్నందుకు క్షమించవలెను.''

అని శ్రీరాముడు చెప్పగా విని గుహుడు దుఃఖించెను. శృంగబేరపుర స్త్రీ - పురుషులు సీతారాముల రూపలావణ్యములు చూచి ముగ్ధులై 'అయ్యో! ఈ సుకుమారులను వనములకు పొమ్మని చెప్పుటకు వారి తల్లిదండ్రులకు నోరెట్లు వచ్చెను? కాని, అదికూడా ఒకందుకు మంచికే జరిగెను. అందువలన మనము వీరిని దర్శించుకొను అవకాశము కలిగెను గదా!' అని తర్కించుకొని సంతోషించిరి.

నిషాదరాజు సమీపమున నున్న ఒక శింశుపావృక్షము క్రింద వారుండుటకు చక్కని బస ఏర్పాటు చేయించెను. గ్రామస్థులు శ్రీరామునికి జోహార్లు పలికి ఇండ్లకు పోయిరి. గుహుడు మధురమగు కందమూల ఫలములను దెచ్చెంచెను. ఆకులతోను, దర్భలతోను, మెత్తని పడకలు కల్పించెను. రామాదులు సాయం సంధ్యాదులు దీర్చుకొని, కందమూలాదులు భుజించి సంతృప్తులై రాత్రికక్కడ శయనించిరి.

లక్ష్మణుడు ధనుర్బాణములు ధరించి వీరాసనాసీనుడై మేల్కొని యుండెను. నిషాద రాజు వారికి చుట్టూ తన భటులను కావలిబెట్టి స్వయముగ ఆయుధ పాణియై వచ్చి సౌమిత్రి చెంత కూర్చొనెను.

కుశశయ్యపై నిద్రించుచున్న సీతారాములను జూచి గుహుడు దుఃఖము ఆపుకొనలేకపోయెను. కన్నుల నుండి అశ్రుధార స్రవించుచుండ అతడు లక్ష్మణునితో ఇట్లు ప్రసంగించెను.

''రాకుమారా! ఇంద్ర భవనముకంటె మిన్నయగు రాజభవనములో హంస తూలికా తల్పముపై దాసదాసీజనములు సేవించుచుండ సుఖనిద్రజెందెడి శ్రీరాముడు మార్గాయాసముచే బడలికగొని కటిక నేలపై పవ్వళించి యున్నాడు. జ్ఞానసంపన్నుడైన జనక చక్రవర్తికి జన్మించి, సురపతికి మిత్రుడైన కోసలపతికి కోడలు కాగలిగి, భానుకులభూషణుని భర్తగా బడసిన భూపుత్రి నేడు నేలమీద నిద్రించుచున్నది. ఆహా! కైకేయీ, నీ కుటిల బుద్ధి ఎంతపని చేసెను!'' అని వారి దుర్దశచూచి వగచుచున్న నిషాదపతి నవలోకించి

లక్ష్మణుడిట్లు సమాధాన మిచ్చెను-

"నిషాదరాజా! ఒకరి సుఖదుఃఖములకు మరొకరు హేతువు కాజాలరు. ఎవరికర్మఫలము వారనుభవించవలసి యుండును. సుఖ దుఃఖములు, సంయోగ వియోగములు, జనన మరణములు, శత్రుమిత్రులు ఇత్యాదు లన్నియూ మిథ్య. మాయా కల్పితములు. ఈ స్వాప్నిక జగత్తులోని సుఖ దుఃఖములు నిజమని విశ్వసించి హర్షవిషాదములకు లోనగుట మంచిదికాదు.

"మిత్రమా! విషయ సుఖములకు లోబడక, నిరంతర జాగరూకులై మేల్కొనియున్న యోగులకే జ్ఞానప్రాప్తి కలుగుచున్నది. అట్టి జ్ఞానధనులు మాయాజాలము నుండి ముక్తులై భగవద్భక్తిని సంతరించుకొని తరించు చున్నారు. అవాఙ్మానసగోచరుడు, ఆద్యంతములు లేనివాడు, రూపనామ క్రియా రహితుడైన ఆ పరబ్రహ్మ భూభారము తొలగించి, భక్తులకు హితవు చేయు టకు రాముడై అవతరించి తన లీలామానుష చర్యలు ప్రకటించుచున్నాడు. కనుక మిత్రమా! దుఃఖించక శ్రీరాముని సేవించుము."

ఇట్లు వారుభయులూ శ్రీరాముని దివ్యలీలలు స్మరించుచుండ రాత్రి గతించి అరుణోదయమయ్యెను.

జగన్మంగళాకారుడగు శ్రీరాముడు కాల్యకృత్యములు తీర్చుకొన్న పిమ్మట మర్రిపాలు తెప్పించి వాటితో సోదరుడు తాను జడలు ధరించెను. ఆ దృశ్యము కన్నులారా తిలకించిన సుమంత్రునిగుండె కరిగి నీరైపోయెను. అంతట అమాత్యుడు కన్నుల నీరునింపుకొని ముకుళితహస్తుడై యువరాజు కిట్లు విన్నవించెను:

"ప్రభూ! మీకు వనములు చూపించి, గంగలో స్నానములు చేయించు కొని, నాలుగు దినములలో తిరిగి మిమ్ము ఇంటికి తీసుకొని రమ్మనిచెప్పి మహారాజుగారు నాకు రథమిచ్చి పంపిరి. ఇది వారి ఆజ్ఞ. మీకు నివేదించు కొంటిని" అని విన్నవించి బాలునివలె ఏడ్చుచూ రాముని పాదములపై బడెను. శ్రీరాముడు మంత్రిని లేవదీసి ఇట్లు పల్కెను.

"ఓ మంత్రివర్యా! మీకు తెలియని ధర్మములులేవు. శిబి, దధీచి, రంతి

దేవుడు, హరిశ్చంద్రుడు, బలిచక్రవర్తి మున్నగు రాజన్యులు అనేక కష్టముల కోర్చి ధర్మమును కాపాడిరి. అట్టి కష్టసాధ్యమైన ధర్మము నాకు సులభముగా హస్తగతమయ్యెను. దానిని నేను వదలిపెట్టిన నాకు ముల్లోకములలోనూ అపకీర్తి సంఘటింపకపోదు.

సచివోత్తమా! మీరు నాకు పితృతుల్యులు. నా తండ్రి గారికి స్నేహితులు. మీకు నేను బోధించునంతటి వాడనుగాదు. ఎవ్విధముగా నైనను తండ్రిగారు మమ్ము గురించి దుఃఖించకుండునట్లు చూచుకొనవలసిన బాధ్యత మీది.''

వీరి సంభాషణ విని గుహుడు, అతని జనులు మిక్కిలి వ్యాకులపడిరి. ఇంతలో లక్ష్మణుడు కొన్ని కటువచనములు పలుకగా శ్రీరాముడు అతనిని వారించి, తమ్ముని మాటలు తండ్రిగారితో చెప్పవద్దని ప్రాధేయపడెను. ఆ పైన సుమంత్రుడు సీత విషయమై రాజుగారు సెలవిచ్చిన అభిప్రాయము ప్రస్తావించి-

''జానకి తిరిగి వచ్చిన మహారాజుకు కొంచెము ఊరట కలుగును. ఆమె ఇష్టప్రకారము అయోధ్యలోకాని, జనకపురిలోకానీ సుఖముగ వుండవచ్చును. ఎవ్విధముగ నైనా మీరు సీతమ్మకు నచ్చజెప్పి పంపించవలసినదని రాజుగారు నాకు సెలవిచ్చిరి.'' అని సుమంత్రుడు దశరథ నందనునితో చెప్పుకొనెను.

శ్రీరాముడు సీతకు నానా విధముల నచ్చజెప్పి చూచెను. ఆమె గృహము నకు వెళ్ళిన ఈ సమయములో-అత్తమామలకు, గురువులకు, బంధువులకు సకలజనులకు సంతృప్తి కలుగునని ఉపదేశించెను. మైథిలి తన విచారము సోదా హరణముగ భర్తకు తెలియజేసి, పిమ్మట విషణ్ణాస్యుడై యున్న సుమంత్రునవ-లోకించి సవినయముగ ఇట్లు ప్రసంగించెను;

''అమాత్య పుంగవా! విధి వైపరీత్యమున ఈ స్థితిలో మీ ఎదుట నిలబడి పితృసమానులైన మీకు ప్రతి వచనములు పలుకుచున్నందుకు నన్ను క్షమింపుడు. తండ్రీ! సకల భోగభాగ్యములతో విరాజిల్లుచున్న మా తండ్రిగారి సిరిసంపదలు నేను చూచితిని. ఇంద్రుని అర్ధసింహాసన మధిష్ఠించి సత్కీర్తి నొందిన మామగారి యశోవిలాసములు నాకు సుపరిచితములు. అత్తమామల ఆదరణ, ఆప్యాయత నాకు తెలియకపోలేదు. కానీ ఇవన్నియూ నాథుని

పాదకమలములు సేవించినప్పుడు కలుగుసంతోషమునకు సాటిరావుకదా! నా ప్రాణేశుని చెంత నున్నప్పుడు యీ వనవాస క్లేశములు నన్ను బాధింపజాలవు. వీరులు, ధీరులైన ప్రాణేశ్వరుడు, మరది ధనుర్బాణములు ధరించి నన్ను రక్షిం చుచుండ శ్రమ దుఃఖాదులు నన్నేమి చేయగలవు!

''ఓ పూజ్యుడా! నన్ను గురించి దుఃఖించవద్దని, మా అత్తమామలకు ప్రణమిల్లి ప్రార్థించితినని, నా మారుగ మనవి చేయమని కోరుచున్నాను'' అని సీత వినయ విధేయత లుట్టిపడుచుండ పలికెను.

జానకి చల్లని పలుకులు విని సచివుడు మణిని పోగొట్టుకొన్న సర్పమువలె నిరాశజెంది దిగులుపడెను. నిరాశ నిస్పృహలచే ధైర్యము కోలుపోయి సుమం త్రుడు కన్నుల నీరుబెట్టెను. శ్రీరామునిఆజ్ఞ అవశ్యము అనుసరణీయమై యున్నందున అతడు చేయునది లేక; వినమ్రుడై శ్రీ సీతారామలక్ష్మణులకు నమస్కరించి, నావను జారవిడుచుకున్న నావికునివలె నిరాశతో రథము నడిపిం చుకొనుచూ గృహోన్ముఖు డయ్యెను. శ్రీరాముని వదలిపెట్టి వెళ్ళుటకు మన సొప్పని గుఱ్ఱములు కూడ మాటిమాటికి వెనుకకు తిరిగి చూచి సకిలిం చుచూ తమ ఆవేదన తెలియజేసెను.

నోరులేని జంతువులే ఇంత పరితాపము పొందుచున్నప్పుడు ఆ తల్లిదం డ్రుల హృదయము లింకెంత అలమటించుచున్నవో యని గుహుడు చింతించెను. ఇట్లు సుమంత్రుని బలవంతముగా సాగనంపి సీతారామలక్ష్మణులు గుహునితో కూడి గంగాతీరము చేరిరి.

## గంగను దాటుట

శ్రీరాముడు గంగను దాటుటకు నావికుని పిలువనంపెను. ఆ పడవవాడు చేతులు కట్టుకొని ముందుకు వచ్చి విధేయుడై ఇట్లు విన్నవించుకొనెను.

''దేవరా! మీ పాదధూళికి యేవస్తువునైననూ, మానవులనుగా మార్చి వేయుగల మూలికా ప్రభావమున్నదట! ఆ రహస్యము నాకు తెలిసినది. మీ పద రజము సోకి కఠినమైన రాయి ఒక అందమయిన ఆడుదిగా మారినది గదా!

అట్లాంటప్పుడు నా కఱ్ఱ పడవ సంగతి వేరే చెప్పవలెనా? రాతికంటె కొయ్య గట్టిది కాదుగదా! మీరు అడుగుపెట్టగనే నా నావకూడ ఒక అందమైన ఆడుదిగా రూపొందిన నా గతిఏమగును? ఇది నా జీవగఱ్ఱ. దీనితో నా పెండ్లాము బిడ్డలకింత గంజి సంపాదించుకొంటున్నాను.

స్వామీ! మీరు గంగను తప్పక దాటతలచిన, ముందు మీ పాదములు కడుగుటకు నాకు ఉత్తరువు దయచేయండి! ఇందుకు మీ రంగీకరించిన మీ దగ్గర చిల్లిగవ్వకూడా పుచ్చుకొనకనే గంగను దాటించగలను.

"ప్రభూ! మీతోడు, మా రాజుతోడు. నేను నిజము చెబుతున్నాను. మీ తమ్ముడు బాణములతో నన్నిక్కడనే మట్టుపెట్టినమా నేను మాత్రము నా చేతులతో మీ పాదములు కడుగనిదే నావలోనికి అడుగు పెట్టనీయను."

భక్తితో కూడుకున్న ఆ పడవవాని మోటుమాటలు విని దయార్ద్ర హృదయుడైన రఘురాముడు సీతా లక్ష్మణులను జూచి సాభిప్రాయముగ చిరునవ్వు నవ్వెను. ఎవని నామము ఒకమారు స్మరించిన భవసాగరము తరింపజేయునో, ఎవని పాదత్రయమునకు భూమ్యాకాశములు సరిపడలేదో, ఆ మహామహుడు గంగను దాటుటకై పల్లెవానిని అర్థించి, వాని అభీష్టమునకు సమ్మతించెను.

అంతట పడవవాడు కఱ్ఱపాత్రలో గంగాజలము తెచ్చి, హర్షోత్సాహముచే మనశ్శరీరములు పులకరింప, ప్రభువు పాదప్రక్షాళన చేయసాగెను. ఆ సందర్భమున హరిపదనఖములు చూచి గంగ హర్షించెను. దేవతలకు, మునులకు లభ్యముకాని దేవుని చరణ కమలములు కడుగుభాగ్యము ఆ పడవవానికి కలిగెను. వాడు వాని సతీసుతులతో పరమాత్ముని పాదతీర్థము పానముజేసి తరించెను. దివినుండి దేవతలు వానిపై సుమనో వర్షము కురిపించిరి.

సీతారాములను, లక్ష్మణుని, గుహుని సురక్షితముగ గంగ కావలి ఒడ్డున చేర్చి, వాడు చేతులు కట్టుకొని వారి ఎదుట నిల్చెను. అయ్యో! ఈ పడవ వాని కిచ్చుటకు చేతిలో చిల్లిగవ్వ కూడా లేదే - అని శ్రీరాముని మనస్సు చిన్నబుచ్చుకొనెను. ప్రియుని అంతర్యము గ్రహించిన సూక్ష్మగ్రాహి జానకి తటాలున తన చేతికున్న ముద్దు టుంగరము తీసి స్వామి హస్తములందుంచెను. శ్రీరాముడు దానిని పడవవాని కీయబోయెను. కానీ వాడు తన

రెండు చేతులతో శ్రీరాముని పాదములు బట్టుకొని,

"స్వామీ! ఈ దినము నేను మీ నుండి పొందిన లాభమంటూ ఒకటున్నదా? నా పాపము, నా తాపము, నా రోగము, నా దారిద్ర్యము - అన్నియూ మీ దర్శన స్పర్శనలచే నశించిపోయెను. బహుకాలము నుండి నేను పడిన శ్రమకు దేవుడు ఈ దినము నాకు చక్కని ఫలిత మిచ్చెను. ప్రభూ! మీ అనుగ్రహము కంటే నాకేమి కావలెను! మీరు సురక్షితముగ తిరిగి వచ్చినపుడు మీరేమిచ్చినా కండ్లకద్దుకొని స్వీకరించెదను." అని వాడు ప్రార్థించెను. కరుణామయుడు ఆ పడవవానికి అక్షయభక్తిని ప్రసాదించి సెలవిచ్చెను.

తదుపరి శ్రీరాముడు గంగలో స్నానముచేసి శివుని పూజించెను. జానకి గంగకు అంజలి ఘటించి "గంగాభవానీ! నేను, నాథుడు, మరది క్షేమముగా తిరిగివచ్చి నిన్ను దర్శించుకొనగల భాగ్యము అనుగ్రహించు" మని అర్థించెను.

అందుకు దేవనది హర్షించి ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను!

"ఓ వైదేహీ! నీ మహిమా ప్రభావములు లోకవిదితములు. నీవు నన్ను పెద్దజేసి ప్రార్థించుట నీ దయకు తార్కాణము. ఓ దేవీ! మీరు ముగ్గురు క్షేమముగ అయోధ్యకు తిరిగి వచ్చి సత్కీర్తి నందగలరు.

మంగళప్రదమైన గంగ పలుకులు విని సీతారాములు సంతుష్టులైరి.

ఆపైన జానకీ వల్లభుడు నిషాదరాజు సేవకు కృతజ్ఞుడై అతనిని స్వగృహమునకు మరలిపొమ్మని కోరెను. గుహుడందుకు ఖేదపడి మరికొన్ని దినములు అడవిలో వారికి సహాయముగ ఉండి సేవజేయు భాగ్యము ప్రసాదించమని అభ్యర్థించగా రాము డందు కంగీకరించెను. గుహుడు తన అనుచరులను వారి వారి గృహములకు పంపించి తాను శ్రీరాముని అనుసరించెను.

## భరద్వాజుని సందర్శనము

శ్రీరాముడు గంగకు వందన మాచరించి, విఘ్నేశ్వరుని, శివుని సంస్మరించి, అక్కడనుండి అడవిదారి పట్టెను. ఆ దినము వారు చెట్లక్రింద గడపి మరుదినము తీర్థరాజమైన ప్రయాగక్షేత్రము చేరిరి.

సకలపుణ్యములకు, సర్వమోక్షములకు, ముక్తికి, సిద్ధికి మూలమై నలుబది క్రోసుల పర్యంతము వివిధ తీర్థములచే విరాజిల్లుచున్న ఆ ప్రయాగ క్షేత్ర మాహాత్మ్యమును గురించి శ్రీరాముడు సతికి, సోదరునికి, సఖునికి వివరించి చెప్పెను. ఆ నల్వురూ తీర్థరాజుకు ప్రణమిల్లి అచ్చట ఉన్న వన తపోవనము లను, దర్శించి త్రివేణీ సంగమములో స్నానమాచరించి శివుని, క్షేత్రనాథుడైన మాధవస్వామిని సేవించిరి. ఆ పైన రామాదులు అచ్చట నున్న భరద్వాజుని ఆశ్రమమునకు వచ్చిరి.

మహర్షి శ్రీరాముని ఆలింగనము చేసుకొని మహదానంద భరితుడై శ్రీరాముని మనఃపూర్వకముగ ఆశీర్వదించెను. 'ఆ బ్రహ్మదేవుడు నేజేసిన పుణ్యములకు ఫలము నాకండ్ల ఎదుటకే తీసుకొని వచ్చెను' అని సంతసించెను.

మునీంద్రుడిచ్చిన ఆతిథ్యమును స్వీకరించి వారు సంతృప్తులై మార్గాయా సము తీర్చుకొనిరి. మహర్షి ఉల్లముప్పొంగ జగదభిరాముని సమీపించి ఇట్లు ప్రవచించెను.

''హే రఘువంశోత్తమా! రామా! నేటికి నిన్ను దర్శించుకొని నా తపస్సు, నా త్యాగము, నా క్షేత్రవాసము, నా యజ్ఞయాగము లన్నియూ ఫలించి నా ఆశలు తీరెను. ఇంతకంటే నాకేమి కావలెను! ఓ రామచంద్రా! నీ పాద పద్మములందు సదా సహజానురాగము గలవాడనై వర్తించునట్లు కరుణింపుము.''

శ్రీరాముడు మహర్షి మాటలకు కొంచెము సిగ్గుపడి, అతని భక్త హృద యము జూచి ప్రసన్నుడాయెను. పిమ్మట దశరథ నందనుడు మునీశ్వరుని మహిమా విశేషములను గురించి ప్రసంగించెను. ఇట్లు రఘురాజు మునిరాజు లిద్దరూ కొంతసేపు పరస్పర ప్రియవచనములతో గడపిరి.

ప్రయాగ క్షేత్రమందు నివసించుచుండిన తాపసులు, మునులు, సిద్ధులు, వటులు ఇత్యాదులు భరద్వాజుని ఆశ్రమమునకు వచ్చి, శ్రీరాముని దివ్య దర్శనము చూసుకొని పరితృప్తులైరి. ఆనాటి రాత్రికి రామాదులు భరద్వాజుని ఆశ్రమములో గడపిరి. ప్రాతఃకాలము త్రివేణిలో స్నానసంధ్యాదులు ముగించు

కొని, మహర్షికి ప్రణమిల్లి, శ్రీరాముడు, సీతా, లక్ష్మణ, గుహులతో గూడి ప్రయాణ మయ్యెను.

బయలుదేరుటకు ముందు శ్రీరాముడు మునితో మేము ఏ మార్గము అనుసరించవలెనో తెలియజేయుమని కోరెను. అందుకు భరద్వాజుడు మీ కన్ని మార్గములు సుగమమవులే - అని పలికి సాభిప్రాయముగ మందహాసము చేసెను. మహర్షివద్ద సెలవు తీసుకొని వారు ముందుకు సాగిరి.

## యమునా తీరము

రామాదులు ప్రయాగ నుండి యమునానది వద్దకు వచ్చిరి. ఘనశ్యాము డైన శ్రీరాముడు తనవారితో కలసి సూర్యకుమారి యమున యొక్క నల్లని నీటిలో స్నానపానములు చేసి సంప్రీతు డయ్యెను.

ఇంతలో యమునాతీర వాసులైన స్త్రీపురుషులు ఆ ముప్పురు మూర్తు లను చూచుటకు పరుగులెత్తుకొని వచ్చిరి. వారు సీతారాముల దివ్యమంగళ విగ్రహములను నేత్రపర్వముగ తిలకించి ముగ్ధులైరి.

ఆ సమయమున లఘు వయస్కుడు, తేజోవంతుడైన ఒక తపస్వి అచటికివచ్చి, శ్రీరాముని పాదములకు సాష్టాంగ నమస్కారము చేసెను. త్రికరణశుద్ధిగ సేవించుచున్న తన ఇష్టదేవుని జూచి ఆ యువమునికి కన్నులనుండి బాష్పములు రాలి ఆనందముచే దేహము పులకరించెను. శ్రీరాముడు ఆ తాపసిని హృదయమునకు హత్తుకొని ఆలింగనము చేసు కొనెను. పరమతత్త్వము, ప్రేమ పరస్పరము కలుసుకున్నట్లు వారుభయులూ ఒకరినొకరు చూచుకొని సంతుష్టాంతరంగులైపోయిరి. అతడు సీతాదేవికి, లక్ష్మణస్వామికి నిషాదపతికి సాష్టాంగ నమస్కారములు చేసి, వారి దివ్యద- ర్శనమైనందుకు పెన్నిధి చూచిన పేద చందమున అమందానంద భరితుడా యెను. ఆ బాలయోగి పేరు, ఊరు, వృత్తి వ్యాపారములు ఎవ్వరికినీ తెలియవు.

తదుపరి భక్తవత్సలుడైన సీతానాథుడు నిషాదపతిని ఇంటికి వెళ్ళుటకు సమ్మతింపజేసెను. గుహుడు వారికి నమస్కరించి సెలవు తీసుకొని గృహోన్ము

ఖడై చనెను. సీతారామలక్ష్మణులు యమునకు ముకులిత హస్తులై వందనమిడి ముందుకు సాగిరి.

## గ్రామ ప్రజల ప్రేమోత్కంఠత

దారిలో పోవుచున్నప్పుడు వీరికి అక్కడక్కడ బాటసారులు ఎదురుపడు చుండిరి. వారు ఈ ముగ్గురు మూర్తులను చూచి జాలిగొని ఇట్లు ప్రసంగించుచుండిరి! ''అయ్యలారా! చూచుటకు మీ రెవ్వరో రాజవంశీయు-లవలె కనబడుచున్నారు. ఎవ్విధమైన రక్షణలు లేక ఇట్టిస్థితిలో ఏకతమున దుర్గ మారణ్యములందు సంచరించుచుంటిరి. అయ్యో! మీ వెంట ఒక సుకుమారి కూడ నడుచుచున్నదే! క్రూరమృగములు సంచరించు ఘోరారణ్య మార్గములు మీకు సుపరిచితములు కాదు. మీరిచ్చగించినచో మేము మీకు తోడుగా కొంతదూరము రాగలము.'' అని చెప్పుచుండిరి. శ్రీరాముడు వారి ప్రేమాను రాగములకు ఆనందించి మంచి మాటలతో ఆ బాటసారులను వెనుకకు బంపుచుండెను.

ఆ పుణ్య పురుషులు పయనించుచున్న పథములు, ఆ మార్గములందలి జనపదములు, ఆ గ్రామములలో నివసించుచుండిన ప్రజలు ఎంత సుకృతము చేసి అక్కడ నివసించుచుండిరో చెప్పజాలము. శ్రీ సీతారాముల చరణ స్పర్శచే పునీతములైన ఆ పుణ్యభూముల అదృష్టమునకు దేవలోక, నాగలోకములు గూడ నోచుకొనలేదు. రఘుకుల మణి రామచంద్రుడు స్నానము చేసిన నదులకు, ఆ మహాత్ముడు విశ్రమించిన తరుచ్ఛాయలకు మానస సరోవరము, కల్పవృక్షములు సమానము కావు. మేఘములు నీడ నిచ్చుచుండ దేవతలు పుష్పములు జల్లుచుండ గిరులను, వనములను, విహంగములను, మృగములను వనతరులతా వితాన వైభవములను తిలకించుచూ ఆహ్లాదముతో ఆ ప్రభువు ముందు కడుగిడుచూ నడచుచుండెను.

విపిన మార్గమున వెళ్ళుచున్నప్పుడు, అక్కడక్కడ గ్రామములలోని స్త్రీపురుషులు వీరిని దర్శించుటకై గుంపులు గుంపులుగా పరుగెత్తుచుండిరి. సీతారాములను దర్శించి, స్పర్శించి ఆదరించుటకై ఆ గ్రామస్థులు చూపిన ఆతురత, ఆప్యాయత వర్ణన కతీతమైనవి. ఒకడు శ్రీరాముని దివ్యవిగ్రహము

చూచుచూ వళ్ళు మరచి అతనివెంటనే నడచిపోవుచుండును. మరొకడు మార్గమందు దృష్టి ప్రసరించి చూపులకందునంత వరకూ ఆ జగన్మోహనుని తిలకించుచూ నిలబడియుండును. ఇంకొకడు దారిలో చల్లని మఱ్ఱినీడలో తృణపల్లవములతో పాన్పు అమర్చి, వారు సమీపమునకు వచ్చినపుడు విశ్రమించి పోవలసినదిగా కోరును. ఒకడు చల్లని జలము పుచ్చుకొని వచ్చి వాటిని త్రాగవలసినదిగా ప్రార్థించును. పరమకృపాలుడగు శ్రీరాముడు ఆ గ్రామస్థుల తియ్యని మాటలు, నిర్మల ప్రేమను చూచి ముగ్ధుడగుచుండెను.

జానకి అలసియున్నందున వారు ఒక వటవృక్షచ్ఛాయలో కొంచెము విశ్రమించుటకు కూర్చొనిరి. సమీప గ్రామస్థులు పరుగెత్తుకొని వచ్చి శ్రీ సీతారాముల సౌందర్య శోభను నేత్రపర్వముగా చూడసాగిరి. ప్రభువు తన ముఖము నాల్గువైపుల నున్నవారికి ఏకకాలమున కనబడుచుండునట్లి శరీర సౌందర్యము అంగాంగముల సౌష్ఠవము చూపరులను భ్రమింపజేసెను. నడుముకు తూణీరము, కరకమలములందు ధనుర్బాణములు, శిరమున జటామకుటముంచి వారు నార గుడ్డలు ధరించి యుండిరి. విశాలనేత్రములతో శరత్కాల చంద్రుని బోలు వారి ముఖములందు స్వేదబిందువులు శోభించుచుండెను. పల్లె ప్రజలకు సీతారామ లక్ష్మణుల రూపలావణ్యములను తృషితనేత్రులై యెంత జూచిననూ తృప్తి లేకుండెను. గ్రామస్త్రీలు సీతను సమీపించి మొదట యేదో అడుగవలెనని కుతూహలపడుదురు. పిమ్మట బిడియపడి ఊరకుందురు. తుదకు సరళ స్వభావులైన ఆ గ్రామకాంతలు వైదేహి నిట్లు ప్రశ్నించిరి-

''రాకుమారీ! ఈ రాజకుమారుల చక్కదనము చూచుట కెంత ముచ్చటగ నున్నది. ఒకరి మేనికాంతి మరకతమువలె, మరొకరి శరీర వర్ణము సువర్ణమువలె దీపించుచున్నది. శరత్కాల చంద్రుని వంటి ముఖ వర్చస్సు, పద్మ దళముల బోలిన వారి నేత్రములు ఎంత ఆనందముగానున్నవి! ఓ సుముఖీ! కోటి మన్మథుల ధిక్కరించు అందచందములచే అలరారు ఈ నయ కిశోరులు నీ కేమగుదురు? వారి నామధేయము లెయ్యవి?''

స్నేహశీలురై అడిగిన ఆ అమాయకుల ప్రియవచనములకు సీత సిగ్గుపడి తనలో తాను చిన్నగ నవ్వుకొనెను. పిమ్మట ఆ బాలహరిణేక్షణ గ్రామవనిత

లను రామలక్ష్మణులను ఒక్కసారి లజ్జాదృష్టులతో అవలోకించి తల వంచుకొని మధుర మంజుల వచనముల నిట్లనెను: ''సఖులారా! సరళ స్వభావుడు, గౌర వర్ణము కలిగిన ఆ చిన్నతను నా మరది, పేరు లక్ష్మణమూర్తి'' అని చెప్పెను. పిమ్మట జానకి మునుసిగ్గు దోప, తన వదనబింబము చేలాంచలముచే అడ్డుచే సుకొని లజ్జానేత్రములతో రామునివైపు సంజ్ఞచేసి 'అతను నా భర్త' యని సద్ధర్మ గృహిణీ భావమున సూచించెను. మైథిలి మధురోక్తులు గ్రామవనితల కర్ణములకు కమనీయముగా నుండెను. బద్ధానురాగులైన ఆ వనితలు ''అమ్మా! శేషుని శిరముపై ఈ భూమి యున్నంతవరకూ నీ మాంగళ్యము నిత్యమంగ ళమై యుండుగాక! తల్లీ శివునికి పార్వతివలె నీవు నీ భర్తకు ప్రియురాలివై వర్ధిల్లుము. మీరు తిరిగి ఈ దారిన వచ్చినప్పుడు మమ్ము మీ దాసులుగా భావించి దర్శన మీయవలెను'' అని వినయోక్తుల పలికిరి.

లక్ష్మణుడు ఆ గ్రామస్థులను మార్గ మడిగి తెలుసుకొనెను. ఇట్లు కొంత కాలము ఆ గ్రామస్థులతో గడిపి, వారి దగ్గర సెలవు తీసుకొని సీతారామ లక్ష్మణులు అచ్చోటు వీడి అగ్రగాములైరి.

నిముసములో తమ హృదయములను వశపరచుకొనిపోయిన సీతారామ లక్ష్మణుల వియోగమునకు ప్రజల మనస్సులు చిన్నబోయెను. దేవుడు ధన మిచ్చి తిరిగి లాక్కొనెనే -అని వారు వ్యాకుల చిత్తులైరి.

పల్లె జనుల మనస్సులు మాటిమాటికీ సీతారాముల సందర్శన సుఖమునకై పరితపించిపోయెను.

ఈ సుకుమారులను, సౌజన్యపరులను అడవిదారి బట్టించిన బ్రహ్మదేవు డెంత నిర్దాక్షిణ్యుడని వగచిరి.''ఈ కోమల కిశోరులు నార గుడ్డలు కట్టుకొని, పాదచారులై వనముల దిరుగుచూ, కందమూలములు తిని, చెట్లక్రింద కటిక నేలపై శయనించుచుండ, ఆ బ్రహ్మదేవుడు చీని చీనాంబరములు, వివిధ వాహ నములు, పంచభక్ష్య పరమాన్నములు, హంసతూలికా తల్పములు, మిద్దెలు, మేడలు సృష్టించిన దెందుకు? వాని ప్రయోజనము వ్యర్థమే కదా!'' అని తర్కించి దేవుని నిందించిరి.

ఆయా గ్రామస్థులు శ్రీ సీతారాముల ఆగమనముతో ఆనందము, వారి నిర్గమనముతో వ్యాకులము చెందినవారై ఇంకనూ ఇట్లు తలపోయ సాగిరి.

"ఏడేడు పధ్నాలుగు లోకములు గాలించిననూ రాముని వంటి పురుషుని, సీతమ్మ వంటి స్త్రీని చూడగలమా! బహుశా బ్రహ్మదేవుడు ఈ సచ్చరిత్రులను జూచి ఈర్ష్యపడి కాననముల దిరుగునట్లు చేసియుండును. ఈ పుణ్య పురుషులను ముందు చూచినవారు, ఇప్పుడు చూచుచున్నవారు, ఇకపై చూచెడివారు ధన్యజీవులగుట మాత్రము ముమ్మాటికీ నిజము" అని సీతా రాముల రూప సౌందర్యములు, వారి శీల, స్వభావములు మనస్సుకు దెచ్చు కొని ముగ్ధులగుచుండిరి.

ముఖ్యముగ గ్రామ వధువుల మనోవేదన చెప్పశక్యముగానిది.

"ఈ కంకర నేలపై వారి మెత్తని పాదములెంత బాధపడెనో! మన హృదయములు తపించిన మాదిరి వారి పాదపల్లవములు సోకినప్పుడు భూదేవిగుండె కొట్టుకొని యుండును. ఇంత సుకుమారులను వనములకు పంపిన ఆ బ్రహ్మదేవుడు ఈ దారులంతా పూలతో ఎందుకు నింపలేకపో యెను?" అని మృదుల స్వభావులైన గ్రామస్త్రీల మనస్సులు మాటిమాటికి మథనపడుచుండెను.

రఘుకుల సోముడు రామచంద్రుని చూచి సమ్మోహితులైన మరొక గ్రామములోని ప్రజల మనోదశ లిట్లుండెను-

"ఆ దశరథమహారాజు ఎంత మంచివాడు! అతనిమూలముననే కదా మనకు జానకీరాములను దర్శించు భాగ్యము కలిగెను. ఆహా! వీరిని కనిన తల్లి దండ్రులు, వీరు నివసించిన నగరములు, వీరు జన్మించిన దేశము, వీరు పర్య టించిన పథములు, వీరు దర్శించిన గిరులు, కాననములు, జనపదములు ధన్య మైనవి" అని జోహారు లర్పించిరి. ఈ ప్రకారము సీతారాములకు సంబంధిం చిన గుణకథలు ఆ కాననసీమలం దుండెడి గ్రామములలో వ్యాపించి, ప్రజలు ఒకరింకొకరికి చెప్పి మురిసిపోవుచుండిరి.

అట్లు పథికులై పయనించుచుండిన సీతారామలక్ష్మణులు మార్గస్థుల కానం

దము కలుగజేయుచూ వన వైభవము తిలకించుచూ, విపిన మార్గమున పోవు చుండిరి.

మునివేషము ధరించిన శ్రీరాముడు ముందు, వెనుక లక్ష్మణుడు నడుమ చుండెను. జీవబ్రహ్మల మధ్య మాయవలె సీత వారిద్దరికి నడుమ పోవుచుం డెను. తనకు ముందు పోవుచున్న ప్రభువు పదచిహ్నములు తప్పించుకుని సీత అడుగులు వేయుచుండెను. వారికి వెనుక వచ్చుచున్న సౌమిత్రి సీతారాముల అడుగుజాడలలో తన పాదములు బడకుండునట్లు చూచుకొనుచూ కుడి ఎడ మలగా నడచుచుండెను. ఆ ముగ్గురి ప్రేమానురాగములు వాచామగోచర ములు. కాననమందలి ఖగ మృగములు కన్నులప్పగించి ఆ మూర్తిత్రయమును నిశ్చేష్టితములై చూచుచుండెను. ఎవని స్వప్నసీమలలో పథికులైన సీతారాములు సంచరించెదరో వారికి తప్పక సద్గతి కలుగును.

జానకి అలసియున్నందున ఆ దినము వారు ఒక చల్లని చెట్టుక్రింద విశ్రమించిరి. కందమూలములు భుజించి, తియ్యని జలము త్రాగి రాత్రి అచ్చటనే గడపిరి.

## వాల్మీకి ఆశ్రమము

మరుదినము ఉదయమే సంధ్యాద్యనుష్ఠానములు తీర్చుకొని ప్రయాణము సాగించిరి. వనముల, సరోవరముల, శైలశృంగముల,గిరినిర్ఝరుల రామణీయ కమును నయనానందకరముగ దర్శించుచూ వారు వాల్మీకి ఆశ్రమము సమీపిం చిరి. పర్వత ప్రాంతమున, పచ్చని వనముల మధ్య తటాకము నానావిధ పుష్ప సంభరితమై, పక్షుల కలకలారావములతో శోభాకరమై కాన్పించెను. శ్రీరాముని ఆగమనవార్త విని యా మునీశ్వరుడు ఎదురేగెను.

మహర్షికి సీతాపతి సాష్టాంగ నమస్కారము చేసెను. సీతారాముల దివ్య దర్శనముతో మహర్షి కన్నులు చల్లబడి, హృదయము ఆనందార్ద్రమై పోయెను. ప్రాణప్రియుడైన అతిథిని వాల్మీకి యథావిధి సత్కరించి, చక్కని ఆతిథ్యమిచ్చి కృతకృత్యుడయ్యెను.

**అంతట రఘునాథుడు కరకమలముల ముకుళించి –**

''మహాత్మా! మీరు త్రికాలజ్ఞులు. ప్రపంచ రహస్యములు మీకు కరతలా మలకములు'' అని చెప్పి తండ్రిగారి వరము - తన వనయాత్ర మొదలగు వృత్తాంతమంతయూ ముని కెరింగించి ఇట్లనెను:

''మునీశ్వరా, నేడు మిమ్ము దర్శించుకొని నా జన్మ తరించెను. నన్ను మీరు ఎక్కడ నివసించమని ఆజ్ఞాపించెదరో అక్కడ ఉండదలచితిని. ముని జనులకు నావలన ఎవ్విధమైన ఇబ్బంది కలుగకుండునట్లు మంచి ప్రదేశము చూపించిన నే నక్కడ పర్ణశాల నిర్మించుకొని సీతాలక్ష్మణులతో కొంతకాల ముండదలచితిని'' అని విన్నవించెను.

నిర్మలాంతఃకరణముతో చెప్పిన శ్రీరాముని ప్రీతి వచనములకు సంప్రీతుడైన మహర్షి ఇట్లు ప్రసంగించెను-

''రఘువంశమునకు పతాకప్రాయుడవైన ఓ రామా! నీవు సాక్షాత్ జగదీశుడవు. నీ మాయ సీత. భూభారము వహించిన ఆ శేషుడే లక్ష్మణస్వామి. స్వామీ! మీరు దేవకార్యార్థమై రఘువంశమున అవతరించి, రాక్షసులను సంహరించుటకై వెళ్ళుచున్నారు. రామా! వేదములు నేతినేతి (నఇతి) యని చెప్పుచున్న నీ క్రియా స్వరూపములు మనోవాచామగోచరములు, నీవు జగద్వ్యాపివై హరిహర బ్రహ్మాదులను ఆదరించువాడవు. దేవతలకే అగమ్యమైన నీ లీలా రహస్యములు తెలుసుకొనుటకు నేనెంతవాడను! ఎవనికి నీవు జ్ఞానము ప్రదానము చేయుచున్నావో వాడు నిన్ను తెలుసుకొని నీ సారూప్యము పొందుచున్నాడు. భక్త హృదయ చందనా! నీ కృపా కటాక్షము వలన భక్తులు నిన్ను తెలుసుకొనగలుగుచున్నారు. ఓ చిదానందస్వరూపా! దేవహితార్థము నరరూపమెత్తిన నీ నటన జూచి మూర్ఖులు మోహపడుచున్నారు. పండితు లానందించుచున్నారు.

రఘునాథా! నీవు ఉండుటకు తగినచోటు చూపించవమని నన్ను అడిగితివి. నీవులేని స్థల మెక్కడున్నది! నే నెక్కడ చూపెట్టగలను?'' ప్రియమైన మునీశ్వరుని మాటలాలకించి శ్రీరాముడు రవంత సిగ్గుచెంది స్మిత వదనుడయ్యెను. పునఃమహర్షి మందహాసముచేసి అమృతోపమానమగు మధుర వాక్కుల నిట్లనెను.

''రామా! ఎవడు నిన్ను ధ్యానించి, నిన్ను స్మరించి, నిన్ను దర్శించి త్రికరణశుద్ధిగా నిన్ను నమ్మి సేవించుచున్నాడో ఆ భక్తుని హృదయమందు నీవు వసింపుము.

కానీ, ప్రస్తుత సందర్భమును బట్టి, నీవు నివసించుటకు చిత్రకూట పర్వతము తగిన స్థలము. అక్కడ అత్రి ఆది మునీశ్వరులు నివసించుచున్నారు. గంగకు ఉపనదియైన మందాకినీ ప్రవహించుచున్నది. సుందరమైన ఆ పర్వతముపై నివసించి దాని గౌరవము ఇనుమడింపజేయుము'' అని పలికెను.

## చిత్రకూట నివాసము

మహర్షి ఆదేశ ప్రకారము శ్రీరాముడు సీతాలక్ష్మణసమేతుడై చిత్రకూటమును సమీపించి, అక్కడ నివసించుటకు ఏర్పాట్లు చేయుమని సౌమిత్రితో చెప్పెను. అంతట రామానుజుడు మందాకినికి ఉత్తరతీరమున మంచి ప్రదేశము నిర్ణయించెను. అచ్చట నది ధనురాకారమున వంగి యుండెను. ఇది తెలిసిన ఇంద్రాది దేవతలు కోయ, కిరాతుల రూపములతో వచ్చి, ఒకటి పెద్దది, ఒకటి చిన్నది - రెండు పర్ణశాలలు నిర్మించిరి. ఆ పర్ణ కుటీరములందు సీతారామలక్ష్మణులు రతీ - మన్మథ - వసంతులవలె శోభించిరి.

ఆ సమయమున దేవతలు, నాగులు, కిన్నరులు, దిక్పాలురు చిత్రకూటమునకు వచ్చి శ్రీరాముని దర్శించి, మా కష్టముల నివారించుటకు మీరే దిక్కని ప్రార్థించి తమ లోకములకు చనిరి.

పిమ్మట మునీశ్వరులు ఏతెంచి రఘుపతి దివ్య దర్శనము చేసుకొని దీవించిపోయిరి.

కోయ, కిరాతులకీ వార్త తెలియగనే బంగారు దొంగిలించుటకై పరుగెత్తు దొంగల కైవడి, సంబరముతో కందమూల ఫలాదులు గైకొని పర్ణశాలకు వచ్చి హర్షోత్సాహములతో శ్రీరామునికి జోహార్లు పలికిరి. ''ఓ కోసలరాజా! మీ ఆగమనమువలన మేము, మా బంధువులు, ఈ గిరి కాననములు ధన్యత నొందెను. ఈ చిత్రకూటము మీకు అన్ని విధముల తగిన ప్రదేశము. ఇచ్చట షడృతువులు తమధర్మము తప్పవు. దేవరా! మీకు సేవలుచేసి, వేట మార్గ

ములు చూపెట్టి క్రూర మృగముల నుండి రక్షణ కలిగించి, అన్ని విధముల సహాయ పడగలము'' అని పలికిరి.

తనయుని మాటలు వినిన తండ్రి ఆనందించు విధముగా ఆ దేవదేవుడు ఆటవికుల ప్రియోక్తులకు సంప్రీతు డాయెను. రామప్రభువు యథారీతి వారిని సంతోషపెట్టి పంపెను.

సీతారాములు చిత్రకూటమునకు వచ్చిన దాది అక్కడ వనములు పుష్పించి ఫలించి శోభించెను. శీతల మంద సుగంధ మారుతములు వీచెను. శుకపిక శారికా చక్రవాకాది విహంగముల కలకల ధ్వానములతో కాననము ప్రతిధ్వనించెను. క్రూరమృగములు తమ సహజ వైరము మాని కలసి మెలసి సంచరించెను. నదులు మందాకినీ మహద్భాగ్యమును కీర్తించెను. వివిధ భూధరములు చిత్రకూట పర్వత పుణ్యమును శ్లాఘించెను.

సుఖసాగరుడు, రఘుకుల సోముడైన రామ భూపాలుడు క్షీరసాగరమును, అయోధ్యను వదలిపెట్టి చిత్రకూటమున చేరెను కదా! ఆ మహాత్ముని దర్శన స్పర్శనలచే అక్కడి వనభూములు, గిరి నిర్ఝరులు, ఖగ మృగములు సుఖ సంపదలతో వర్ధిల్లెను.

సీతారాముల స్నేహానురాగచ్ఛాయలలో సౌమిత్రి సర్వమూ మరచి అనుక్షణమూ అన్న వదినెలను సేవించి ఆనందించుచుండెను. చంద్రుని జూచి సంతోషించు చకోరివలె మేఘశ్యాముని ముఖారవిందము చూచుకొని సీత ప్రతిక్షణమూ ప్రసన్నురాలగుచుండెను.

పచ్చని పర్ణశాల, పక్షుల కలకలములు, మునిపత్నుల సాంగత్యము, కంద మూల ఫలముల కమ్మదనము, పూత పయస్విని మందాకినీ నిర్మలోదకము మైథిలికి అయోధ్యను, అంతఃపుర సౌఖ్యమును, అత్తమామల ఆదరణమును, బంధుబాంధవుల ప్రేమను మరపింపజేసెను.

సీతాలక్ష్మణులకు వనవాస క్లేశములు మనస్సుకు రాకుండునట్లు శ్రీరాముడు వారితో సమయోచితముగ సంభాషించుచూ, పురాణ కథలు చెప్పుచూ వారిని ఆహ్లాద పెట్టుచుండెను. ఒక్కొక్కప్పుడు సాకేతపురిని, ప్రజలను తల్లిదండ్రు

లను, విశేషించి భరతుని స్నేహ సౌశీల్యము మనస్సుకు వచ్చినప్పుడు మాత్రము ఆ దయాధాముని కన్నులు చెమ్మగిల్లుచుండెడివి. శ్రీరాముడు చిత్రకూటమున సతీ సోదరులతో గూడి సంతోషముతో కాలము గడుపుచుండెను.

# సుమంత్రుని తిరుగు ప్రయాణము

ఇట్లు ఖగమృగములకు, మునులకు, దేవతలకు హితుడైన శ్రీరాముని వనవాస కథాక్రమము ఇంతవరకు వర్ణించి చెప్పితిని. ఇక సుమంత్రుడు అయోధ్య చేరిన వృత్తాంతము చెప్పుచున్నాను. (తులసీదాసు)

శ్రీరామాదులను సాగనంపి గృహోన్ముఖుడైన నిషాదపతి గంగాతీరమున సుమంత్రుని రథము జూచి నివ్వెరపడిపోయెను. సచివుడు "రామా! రామా!" యని కలవరించుచూ శోకార్తుడై నేలబడియుండెను. అశ్వములు అన్నపానీయములు ముట్టుకొనక కండ్లనీళ్లు బెట్టుకొని, దక్షిణమువైపు మాటిమాటికీ దీనముగా చూచుచు సకిలించుచుండెను.

గుహుడు అమాత్యునికి అనేక విధముల నచ్చజెప్పి రథములో కూర్చుండబెట్టెను. శోకసంతప్తుడైన సుమంత్రుడు రథము నడుపు స్థితిలోలేడు. గుర్రములు దిగులుగొని యుండెను. అడవి మృగములను రథమునకు గట్టినట్లు అవి ముందుకు నడవక, అడుగడుగుకు నిలబడిపోయి, వెనుదిరిగి చూచును. ఎవరైనా రామలక్ష్మణుల పేర్లు పేర్కొన్నయెడల వారివైపు కాతరదృష్టితో చూచును. అంతట నిషాదపతి నలుగురు సేవకులను రథము తోలుటకు ఒక సారథిని వారికి తోడిచ్చి, కొద్దిదూరము వారి వెంటపోయి పిమ్మట సెలవు తీసుకొని స్వగృహమునకు పోయెను.

శోకార్తుడైన సుమంత్రుడు రథములో కూర్చొని ఇట్లు చింతించెను-

"రాముడు వదలిపెట్టి పోయినపుడే నేనీ తుచ్ఛశరీరము త్యజించలేక అపకీర్తిపాలైతిని. ఏ ముఖము పెట్టుకొని నేను నగరము ప్రవేశించగలను? రాముడు లేని రథము జూచి ప్రజలేమందురు! 'రాముడెక్కడ?' అని ప్రశ్నించిన వారికి నేనేమని ప్రత్యుత్తర మీయగలను. దూడ కొరకు పరుగెత్తు గోవువలె కౌసల్యా సుమిత్రలు పరుగెత్తుకొని వచ్చి 'రామలక్ష్మణు లెక్కడ' అని అడిగె

దరు. వారికి 'రామలక్ష్మణులు అడవికి పోయిరమ్మా!' అని గుండె రాయి చేసుకొని సమాధాన మియ్యవలెను గదా! పుత్రగత ప్రాణుడైన దశరథ మహారాజునకు నిజము చెప్పినట్లయిన తత్క్షణమే అతడు ప్రాణములను తృణ ప్రాయముగ వదిలిపెట్టును.''

ఈ ప్రకారము చింతించి వికలచిత్తుడైన సుమంత్రుడు చేతులు నలువుకొని తల బాదుకొనెను. భర్తను పోగొట్టుకున్న పతివ్రత వలె మంత్రి పరితపించి పోయెను. అతని ముఖము వివర్ణమై, పెదవులు ఎండి, శరీరము శిథిలమై జననీజనకులను హత్యచేసిన హంతకుని రీతి కనబడుచుండెను.

రథము తమసా నదీతీరము చేరెను. సారథిని వెనుకకు పంపించివైచి సుమం త్రుడు అక్కడనే ఒక చెట్టుక్రింద ఆ పగలు గడపెను. ఎవరును చూడకుండు నట్లు చీకటి బడగనే నగరము ప్రవేశించి సింహద్వారమువద్ద రథము నిలిపి మంత్రి రాజమందిరమునకు వెళ్ళెను. రథమును గుర్రముల వైఖరిని జూచి ప్రజలు వ్యాకులపడిరి. రాణులు మంత్రిని జూచి పృచ్ఛించసాగిరి. దుఃఖగ్రస్తు డైన సుమంత్రునికి వారి మాటలు వినబడుటలేదు. అతనికి నోట మాటరా లేదు. ''మహారాజుగారెక్కడ'' అని ఎదురుపడినవారిని అడుగుచూ సుమం త్రుడు కక్ష్యాంతరములు అధిగమించి ముందుకు సాగిపోవుచుండెను. పరిచార కులు సచివుని కౌసల్యామందిరమునకు తోడ్కొని పోయిరి.

అప్పుట మహారాజు కళాహీనుడై నిద్రాహారములు లేక 'రామా! సీతా! లక్ష్మణా!' యని వేడి నిట్టూర్పులు విడుచుచూ స్వర్గము నుండి క్రిందికి త్రోయబడిన యయాతివలె నేలబడి విలపించుచుండెను.

## దశరథుని దేహత్యాగము

అమాత్యుడు సాకేతపతిని సమీపించి జయము పలికి నమస్కరించెను. మంత్రి మాటలు చెవులబడగనే రాజు దిగ్గునలేచి కూర్చొని ''సుమంత్రా! రాము డెక్కడ? '' అని అడిగెను. పిమ్మట సుమంత్రుని చేరదీసి కౌగలించు కొని గద్గద స్వరమున-

''సఖుడా! రాముడు కుశలమా! సీతారామలక్ష్మణులు వనములకు

పోయిరా! లేక తిరిగి వచ్చిరా?'' అని ప్రశ్నించెను. సుమంత్రుని కన్నుల అశ్రుధార స్రవించెను. మహారాజు మంత్రిని పునః పునః ఆతురస్వరమున ఇట్లు ప్రశ్నించెను:

''అమాత్యా! రామలక్ష్మణులు నాకేమి సందేశము పంపిరి? హా, రామా! రాజ్యమిచ్చెదనని చెప్పి నిన్ను కానలకు బంపితిని. తుదకునా మాట పాటించి నీవు అడవులకే పోయితివా! అయిననూ నీవు ఇంచుకంతైననూ హర్ష విషాదములకు లోను కాలేదే! మంత్రీ! నా రామలక్ష్మణు లెచ్చటున్నారు! వెంటనే నన్నచటికి తీసుకొని పొమ్ము. లేకుండిన నా ప్రాణములు నిలుచుట దుర్ఘటము.''

అని ప్రేమార్తుడై ప్రశ్నించిన రాజుకు మంత్రి ఊరట కల్గించుటకై ధైర్యోక్తులు, ధర్మ సూక్ష్మములు, కర్మ విధానము తెలియజేసి సాంత్వన వచనములు పలికెను. తదుపరి సుమంత్రుడు సీతారామలక్ష్మణులు అయోధ్యవదలి తమసానదీతీరము చేరినది, మరుదినము గంగాతీరమున గడిపినది, అక్కడ శృంగబేర పురవాసులను కలుసుకొనుట, నిషాదపతి సంసర్గము, జడలు దాల్చుట, ఆ పైన పడవలో గంగను దాటుట మొదలగు వృత్తాంతమంతయూ మహారాజుకు శ్రుతపరచెను. పిమ్మట జానకీ రామలక్ష్మణులు చెప్పి పంపిన సందేశ మిట్లు వినిపించెను.

''మా తండ్రిగారికి మా నమస్కారములు తెలియజేసి, వారి అనుగ్రహము వలన మేము వనవాసము క్షేమముగా గడుపుకొని వచ్చి వారి చరణములను దర్శించెదమ''ని మీకు చెప్పుమని శ్రీరాముడు సెలవిచ్చెను. తల్లులకు తమ ప్రణామములు తెలియజేసి వారిని ఓదార్చుచుండవలసినదిగా నన్ను కోరెను. పిమ్మట గురువులకు ప్రజలకు తన వందనము తెలియపరచి తండ్రిగారికి దుఃఖోపశమనము కలుగునట్లు ప్రయత్నించవలసినదిగా నివేదించమనెను. మహారాజా! శ్రీరాముడు భరతునితో ''రాజ్యము లభించినపుడు నీతి మార్గము తప్పవద్దనీ, తల్లులను సేవించమనీ, తండ్రిగారికి తానులేని లోటు తెలియకుండునట్లు చూడవలసినది''గా ఆదేశించెను. ''మహారాజా! లక్ష్మణ మూర్తి ఆ సందర్భములో కొన్ని కటు వచనములు పలికెను. రామమూర్తి అతనిని మందలించి ఆ మాటలు మీతో ప్రస్తావించవద్దని నన్ను అర్థించెను.

రాజా! జానకి నాకు నమస్కారముచేసి ఏమియో చెప్పదలచెను. అనురాగాతిశ యముచే ఆమె కంఠము రుద్ధమై మాట్లాడజాలక కన్నుల నీరు బెట్టుకొనెను. ఇంతలో రఘువరుని అభిప్రాయము తెలుసుకొని నావికుడు పడవ వదలెను. వారు ప్రయాణమైరి. మహారాజా! గుండె రాయి చేసుకొని వారి నిర్గమనాన్ని చూస్తూ నిలబడిపోతిని. అప్పుడు నాకు కలిగిన హృదయావేదన ఏమని చెప్పగలను. ప్రాణములతో వచ్చి వారి సందేశము మీ కెరింగింపగలిగితిని'' అని నివేదించి సుమంత్రుడు దుఃఖముచే కంట తడిబెట్టెను.

మంత్రి ప్రసంగించిన పిమ్మట నృపాలుడు దుఃఖాతిశయముచే విహ్వలుడై నేలబడెను. కుమారుల వియోగ దుఃఖము సహింపజాలని లేని ప్రాణములు ''మాంఝ'' రోగము తగిలిన మత్స్యమువలె కొట్టుకొనెను.

రాణులు రోదించిరి. అంతఃపురవాసులు ఆక్రందించిరి. అయోధ్య హాహా కారములతో నిండిపోయెను. అప్పటికి అయోధ్య స్థితి - పిట్టలతో కూడిన అడవిలో అర్ధరాత్రి వేళ పిడుగుపడినప్పుడు కలుగు అల్లకల్లోలము వలె నుండెను.

రాజు ప్రాణము కంఠగతమై ఎండిపోయిన కొలనులోని కమలమువలె అతని సర్వావయవములు శిథిలమైపోయెను. మహారాజు దురవస్థ చూచి కౌసల్య ఇక రవికులసూర్యు డస్తమించ నున్నాడని తలచెను. ఆమె ధైర్య మవలంబించి రాజు నిట్లు ఓదార్చెను.

''మహారాజా! పూర్వాపరములు ఆలోచించి మీరు ధైర్యముతో నుండ వలసిన సమయ మిది. శ్రీ రాముని వియోగము ఒక అపారమైన దుఃఖసాగ రము. అయోధ్య దానిపై ప్రయాణించుచున్న పడవ వంటిది. దానికి కర్ణధారు లైన మీరు అధైర్యపడిన దానిగతి ఏమగును! మనము, మన బంధువులు సకల జనులు దుఃఖాంబుధిపాలు కాగలరు. నాథా! ధైర్యమవలంబించుము. సీతారా ములు వనవాసానంతరము క్షేమముగా వచ్చి మీ పాదదర్శనము చేసుకొన గలరు.''

కౌసల్య ధైర్యోక్తులు - రాజుకు నేలమీద బడిన చేపపై చేరెడు చల్లని నీళ్ళు చల్లినట్లుండెను. రేడు కొద్దిగ కనులు దెరచి ''సుమంత్రా! నా కృపా

లుడు రామానుజు డెక్కడ? నా పుత్ర వధువు జానకి ఎక్కడ?'' అని పలవరించి, చిన్నగ పైకి లేచి కూర్చొనెను. శోకాహతుడై వ్యాకులపడుచున్న భూపాలునికి ఆ రాత్రి గడమట ఒక యుగమువలె నుండెను. ఆ అర్ధరాత్రి నిశీథములో అతనికి మునిశాపము జ్ఞప్తికి రాగా కౌసల్యను పిలిచెను. (ఒకప్పుడు రాజు శ్రవణ కుమారుని చంపియుండెను. ఆ మునిబాలుని తండ్రి వృద్ధుడు, తపస్వి. అతడు రాజును 'నావలెనే నీవు కూడ పుత్రశోకముతో మరణింతువు గాక!' అని శపించియుండెను.) మనః పటలముపై తటుక్కున మెరసిన ఆనాటి శాప కథ కౌసల్యకు చెప్పి, కోసలపతి మరింత క్రుంగిపోయి గుండె బాదుకొనుచు ఇట్లు ఆక్రందించెను:

''ఓ ప్రాణసఖీ! కౌసల్యా! నా రాముడు లేని జీవితము నాకెందుకు? తనయుని బాసిన తండ్రి చచ్చుటే ఉత్తమము. నా ప్రియమైన రామా! నాకన్న తండ్రీ! నిన్ను వదలి ఎన్ని దినములాయెను! ఓ ముద్దు కోడలు సీతా! నాయనా లక్ష్మణా! ఓ ఘనశ్యామా! రామా!! నా హృదయము చాతకమువలె నీకై తపించుచున్నది.'' అని కలవరించి 'రావా! రావా! రావా! హా రామా! హా రామా! హా రామా!' అని పలవరించి తుదకు అవధేశుడు తన ప్రాణములను వదలిపెట్టి అమరలోకమునకు పోయెను.

దశరథుడు సఫలజీవి. రాముని ముఖారవిందము చూచుకొనుచూ జీవించెను. అతని నామస్మరణము చేయుచు గతించెను. అతని జీవనము, మరణము రెండును సార్థకమాయెను. అతని కీర్తి దిగంత విశ్రాంత మయ్యెను.

భానుకుల భానుడు దశరథుడు అస్తమించినందుకు మహారాణులు గుండెలు బాదుకొని రోదించిరి. రాణివాస మంతయూ ఒక్క పెట్టున గొల్లుమనెను. పరిజన బంధుజనులు దుఃఖ దగ్ధ మానసులై ప్రలాపించిరి. రాజు గుణ ధైర్యములను కీర్తించిరి. కైక దుర్బుద్ధిని దూషించిరి. ఆమెవలన లోకమే దిమ్మంధమై పోయినదని విచారించిరి. ఇల్లిల్లూ రోదన ధ్వనులతో నిండి పోయెను. ఇట్లు విలాప ప్రలాపములతో ఆ రాత్రి గతించి అరుణోదయ మాయెను.

అంతట వసిష్ఠుడు రాజభవనమునకు వచ్చెను. అతడు సమయా సమయ

ములెరిగిన జ్ఞానధనుడు. గురువు వారికి అనేక ఐతిహ్యములు చెప్పి, ధైర్యో క్తులు పలికి ధర్మోపదేశములు చేసి శోక విహ్వలులైన రాణులను శాంతింప జేసెను. తదుపరి కులగురువు రాజు మృతదేహమును నూనెతో నింపిన హండీలో పెట్టించి భద్రపరచెను. పిమ్మట దూతను రావించి, ''నీవు వెంటనే భరతునివద్దకు పోయి అత్యవసరమైన పని మీద గురువుగారు మిమ్ము తత్‌క్షణమే రావలసినట్లు ఆజ్ఞాపించి''రని తెలియజేసి వారిని తోడ్కొనిరమ్ము. ఇదిగో! ''రాజు మరణవార్త రాముని వనగమనము వారి కెరిగించకూడదు'' అని ఆజ్ఞాపించి పంపెను.

# భరత శత్రుఘ్నుల పునరాగమనము

ఇక్కడ అయోధ్యలో అనర్థములు ప్రారంభమైనదాది అక్కడ భరతునకు దుశ్శకునములు తోచెను. చెడ్డ కలలు వచ్చుచుండెను. ఏదో అరిష్టము కలుగ నున్నదని శంకించి భరతుడు బ్రాహ్మణులకు అన్నదానములు చేసి, రుద్రాభిషే కములు చేయించి తల్లి దండ్రులను, అన్నదమ్ములను రక్షింపుమని పరమేశ్వరుని ప్రార్థించుచుండెను.

అయోధ్య నుండి బయలుదేరిన దూత పదునాల్గు దినములకు కేకయ రాజ్యము చేరెను. గురువు ఆజ్ఞ తెలిసిన మరుక్షణమే భరతుడు మేనమామవద్ద సెలవు తీసుకొని, గణేశుని ప్రార్థించి, తమ్మునితో గూడి అయోధ్యకు ప్రయాణమయ్యెను. అజ్ఞాత భీతిచే శంకితుడయిన భరతునికి ప్రతి పదార్థము అప్రియముగ కనబడుచుండెను. దారిలో అతనికి ఒక నిముసము ఒక యుగమువలె గడచెను! 'ఆహా! రెక్కలుండిన అయోధ్యలో ఈ క్షణమే వ్రాలియుందునే' అని అతడాత్రపడెను. ఇట్లు భరత శత్రుఘ్నులు వాయువేగ మనోవేగముల ప్రయాణించి సాకేతపురి సమీపించిరి.

నగరములో ప్రవేశించునప్పుడు భరతునకు అన్నియూ దుశ్శకునములే ఎదు రయ్యెను. కాకులు కూసెను. నక్కలు అరచెను. గాడిదలు ఓండ్రపెట్టెను. సరో వరము లెండి వనములు వాడి, పట్టణము కళాకాంతులు తప్పి శ్రీ హీనమై యుండెను. రాజధాని బావురుమని భయంకరముగ కన్నులకు కన్పట్టెను. ఖగ

మృగములు గజాశ్వములు రోగగ్రస్తమైనట్లు దీన హీనస్థితి పొందియుండెను. ప్రజలు తమ ధన ధామములు కొల్లగొట్టబడిన వారివలె శోకార్తులై తిరుగుచుండిరి. ఎదురుపడిన స్త్రీ పురుషులు భరతునికి నమస్కరించి మాట్లాడక మౌనముతో వెళ్ళిపోవుచుండిరి. కార్చిచ్చుబడిన కానము వలె పురవీధులు, బజార్లు, అంగళ్ళు, గృహములు, బీడుకొట్టబడిన ట్లగుపడెను. భరతుడు దిగులుతో శోభాహీనమైయున్న సాకేతపురి రాజవీధులు గమించి రాజభవనము చేరెను.

సూర్యకుల కమల వనమునకు చంద్రునివంటి కైక, సంబరముతో పుత్రుని కెదురేగి మంగళహారతి పట్టి, అతనిని భవనములోనికి తీసుకొని వెళ్ళెను.

హిమపాతమునకు గురియైన కమల వనము బోలె దాసదాసీలు, పరివారకులు విచార గ్రస్తులై యుండుట భరతుడు జూచెను. అడవికి నిప్పంటించి ఆనందించు కిరాతస్త్రీవలె నున్న కైక, కొడుకు విచారవదనుడై యుండుట గమనించి-

''కుమారా! మామగారింటిలో అందరూ క్షేమమేనా?'' అని అడిగెను. భరతుడు అక్కడి కుశలము లెరిగించి, ''అమ్మా ఇక్కడ తండ్రీ, తల్లులు, అన్న, వదినెలు సుఖముగా నుండిరా?'' అని తల్లిని ప్రశ్నించెను.

కేకయ రాజు కుమార్తె కైకేయి కపటదుఃఖము అభినయించుచూ, ''నాయనా! మంథర సహాయముతో నేను చేయవలసిన కార్యములన్నియూ సిద్ధము చేసితిని. కానీ దేవుడు మధ్యలో చెడగొట్టెను. మీ తండ్రిగారు స్వర్గస్థులైరి'' అని చావు కబురు చల్లగ చెప్పెను.

ఈ దారుణవార్త చెవుల బడగనే సింహనాదము వినిన ఏనుగువలె భరతుడు గడగడ కంపించిపోయి, ''హా! తండ్రీ!'' అని నేల కూలెను.

''తండ్రీ! అంత్యదశలో నీవు నాకు కనబడకనే, అన్నకు నన్ను అప్పగించకనే వెళ్ళిపోయితివా! అయ్యో నేనెంత నిర్భాగ్యుడ నైతిని'' అని భరతుడు భోరున ఏడ్చెను. ఏడ్చి యేడ్చి, పిమ్మట రవంత సంబాళించుకొని అతడు-

''అమ్మా! తండ్రి పరమపదించుటకు కారణమేమి?'' అని ఉచ్చస్వరముః పృచ్ఛించెను.

గాయమునకు విషము పూసినట్లు ఆ కుటిలకాంత తాను చేసిన దుష్కార్యము తుది మొదలు భరతునకు సంబరపడుచూ తెలియజేసెను. శ్రీరాముని వనగమన వార్త తెలియగనే భరతుడు తండ్రి మరణదుఃఖము మరచిపోయెను. "అయితే ఈ అన్ని అనర్థములకు మూలము నేనేనా!" అని ఊహించుకొని నివ్వెరపడి కటకటంబడి నిట్టూర్చి వికల చిత్తుడై యున్న కొడుకును, కైక ఇట్లు ఊరడించెను.

"భరతా! మీ తండ్రిని గురించి విచారింప పనిలేదు. వారు జీవించవలసినంత కాలము జీవించిరి. సత్కార్యములు చేసిరి. సుఖముల ననుభవించిరి. సత్కీర్తితో స్వర్గము చేరుకొనిరి. కాబట్టి బిడ్డా! బేలపడక నిశ్చింతగా నీవు సామ్రాజ్యము చేపట్టి సుఖింపుము."

ఆమె సాంత్వన వాక్యములు భరతునికి పుండుపై కారము చల్లినట్లయ్యెను.

కైకేయి మాటలకు భరతుడు దీర్ఘముగా నిట్టూర్చి ఆమె వైపు చూచి ధైర్యముతో ఇట్లనెను-

"ఓ పాపాత్మురాలా! ఈ దుష్ట తలంపు గలదానవు నేను పుట్టినప్పుడే ఎందుకు చంపలేకపోతివి? ఈ స్వచ్ఛమైన సూర్యవంశములో నీవు ఏ ముహూర్తమున కాలుబెట్టితివి? అమ్మా! మొదట మొదలు నరికి పిమ్మట కొమ్మకు నీళ్ళు పోయుచున్నావు. ఎక్కడైనా చేపలను బ్రతికించుటకు చెరువులో నీళ్ళు వెదజల్లివేయుదురా? ఆ విష వరము అడుగునపుడు నీ గుండె నూరు ముక్కలై పోలేదా? నీ నాలుక తెగి క్రింద బడకపోయెనా! హా! స్త్రీ హృదయము పాపముల పుట్టగదా! ఆ రాజు నిన్నెట్లు విశ్వసించెను! సకల జీవ జంతువులకూ శ్రీరాముడు ప్రియపాత్రుడు! కైకా! ఆ ప్రియదర్శికి అహితము తలపెట్టిన నీవెవరో నిజము చెప్పుము! నీవు ఎవరైనా నాకేమి? కళంకినీ! ఇక నాముందరుండకు! ముఖమునకు మసి బూసుకొని చాటుకుపో! వెళ్ళిపో! పో! అయ్యో నిన్నని లాభమేమి? ఆ దేవుడు నీ కడుపున నన్ను పుట్టించెను! అమ్మా! నీవు గొడ్రాలైయుండిన ఎంత బాగుండును!" అని భరతుడు క్రోధముతో, ఉద్రేకముతో పశ్చాత్తాపముతో ప్రలాపించెను. అతని ఆపాద మస్తకము కంపించిపోయెను. తల్లి కౌటిల్యము చూచి శత్రుఘ్నుని దేహము దహిం-

చుకొని పోవుచుండెను. ఇంతలో మాయలాడి మంధర క్రొత్తబట్టలు ధరించి, సరిక్రొత్త నగలు పెట్టుకొని కులుకుచూ అక్కడకు వచ్చెను. గూనిదానిని చూడగనే శత్రుఘ్నుని కోపమునకు అగ్నిలో ఆజ్యము పోసినట్లయ్యెను. ఒక్క తన్ను తన్నెను. ఆ దెబ్బకు అది అంత దూరములో నేలబడెను. బోర్లపడిన మంధరకు గూని వంకరబోయి, తల బొప్పిగట్టి, పళ్ళూడి, నోట రక్తము కారెను. "అయ్యో రాత! మంచి చేసినందు కిదా నాకు ఫలము?" అని వగ ర్చుచూ, పైకి లేవబోయిన దాసిని శత్రుఘ్నుడు జుట్టుపట్టి బరబర ఈడ్చెను. ఇంతలో భరతుడు అడ్డువచ్చి శత్రుఘ్నుని వారించి దాసిని వదలించెను.

అంతట అన్నదమ్ము లిద్దరూ వ్యసన వ్యాకుల మానసులై అచ్చోటు వదలి కౌసల్య వద్దకు పోయిరి.

కౌసల్య వస్త్రములు మాసి, ముఖము నల్లబడి, శరీరము నీరసించి, శోకార్తయై యుండెను. భరత శత్రుఘ్నులను చూడగనే ఆమె పైకి లేచి వారికి ఎదురేగబోయి శోష వచ్చి క్రిందపడెను. భరతుడు పెద్దతల్లి పాదములపై వ్రాలి ఘోరున ఏడ్చుచూ ఆక్రందించెను-

"జననీ నా తండ్రి ఎక్కడ? మా వదిన యేమాయెను? రామ లక్ష్మణు లెటు బోయిరి? అమ్మా! నేను కైక కడుపున పుట్టితిని. అన్ని అనర్థములకు నేనే కారణము. వెదురుపొదకు నిప్పువలె ఈ వంశ నాశనమునకు నేనే హేతు వైతిని. ఈ అపకీర్తి నే నెట్లు బాపుకొనగలను. తల్లీ! నా గుండెలు మండుచున్నవి!"

కౌసల్య స్వభావము సరళమైనది. భరత పుత్రుని బాధ జూచి ఆమె మాతృహృదయము ద్రవించిపోయెను. వనము నుండి తిరిగి వచ్చిన రామ లక్ష్మణులను చూచినట్లు కౌసల్య భరత శత్రుఘ్నులను గుండెలకు హత్తుకొని కంట తడిబెట్టెను. కుమారులను ఒడిలో కూర్చుండబెట్టుకొని, కన్నీరు తుడు-చుకొనుచూ శోక సంతప్తుడైన భరతుని కిట్లు ఉపశమన వాక్యములు పలికెను.

"బిడ్డా! భరతా! నిన్ను చూచుకొని నా కండ్లు చల్లబడెను. నాయనా! కర్మఫలము అనుభవించవలసినదే. అది అనివార్యమైనది, దాని నెవరు తప్పించు కొనలేరు. భరతా! ఇది నీవు దుఃఖించవలసిన సమయము గాదు." అని

ఓదార్చి ఆమె తిరిగి ఇట్లు ప్రసంగించెను-

''బిడ్డా! మీ నాయన మాట ప్రకారము రాముడు వనములకు వెళ్ళెను. రాముడు మణిభూషణ వసనాదులు విసర్జించి వల్కలములతో వనములకు పోయెను. రాముడు రాగద్వేషములు లేని ప్రఫుల్ల వదనముతో అడవులకు పోయెను. భరతా! మీ అన్నకు హర్ష విషాదములు లేవు. మైథిలి భర్తను వదలి ఎట్లుండగలదు! ఆమె కూడ అతనిని అనుసరించి పోయెను. లక్ష్మణుడు ఇంట నుండలేక పోయెను. రాముడు వద్దనినను వినలేదు. భరతా! సీతారామ లక్ష్మణులు ముగ్గురూ వనవాసము చేయుటకు పోయిరి! ఇదంతయూ నా కన్నుల యెదుటనే జరిగెను- నాయనా, మీ నాన్న ఎట్లు జీవించవలెనో, ఎట్లు మరణించవలెనో చక్కగ ఎరిగినవాడు. సమయము చూచి - చల్లగ కండ్లు మూసుకొనెను. నేను మొండి బండను. నా గుండె ఒక గుండ్రాయి. సిగ్గులేక ప్రాణములతో బ్రతికియున్నాను.''

కౌసల్య కన్నీటిగాథ భరత శత్రుఘ్నుల హృదయములను కదిలించి వేసెను. వారు ఏడ్చిరి. వారిని చూచి కౌసల్య ఏడ్చెను. తల్లీబిడ్డల దయనీయస్థితి చూచి రాణి వాసమంతయూ రోదించెను. భరతుడు కేలుమోడ్చి నిండు హృదయముతో మొరపెట్టెను-

''జననీ! నా తల్లి తలపెట్టిన కుతంత్రము నాకు తెలియదు. ఈ కుట్రలో నాకు యే మాత్రము సంబంధ ముండినను నేను జననీ జనకులను హత్యచేసిన పాపము పొందగలను. లేక ఇంతకు మునుపు నాకీ సంగతి లవలేశ మైనా తెలిసియుండిన నాకు ఘోరాతి ఘోరమైన నరకప్రాప్తి తప్పదు. ఇది నిజము. అమ్మా! త్రికరణ శుద్ధిగ నేను శ్రీరాముని సోదరుడను. అతని సేవ కుడను. సర్వజ్ఞుడైన అగ్రజుని కొక్కనికే నా స్వభావము చక్కగ తెలుసు.''

శుద్ధాంతః కరణముతో పలికిన భరతుని మాటలకు కౌసల్య హృదయము కరుణా కలితమయ్యెను. ఆమె భరతుని గుండెల కత్తుకొని ఓదార్చుచూ - ''కుమారా! రాముడు నీ ప్రాణములకు ప్రాణము. చంద్రుడు విషము స్రవింపజేసినను నీవు మాత్రము శ్రీరామునికి అపచారము తలపెట్టజాలవు. నిన్ను సందేహించినవారికి స్వప్నమందయినను సద్గతి కలుగబోదు.''

ఈ ప్రకారము రాత్రంతయూ మాతాపుత్రులు శోకించిరి; పశ్చాత్తాపపడి, పరస్పరము ధైర్యోక్తులు చెప్పుకొనిరి. అప్పటికి భళ్ళున తెల్లవారెను. ఉదయమే వామదేవుడు, వసిష్ఠుడు భరతుని వద్దకు వచ్చి అనేక విధముల బోధించి వారిని శాంత పరచిరి. భరతుడు స్వస్థచిత్తుడై గురువు చెప్పినట్లు నడచుకొనెను.

పిమ్మట మహారాజు మృతశరీరమునకు స్నానాదులు చేయించి స్మశానమునకు తీసుకొనిపోయిరి. భరతుడు సహగమనము చేయవద్దని తల్లులను ప్రార్థించెను. శ్రీరామ దర్శనాభిలాషులై యున్నందున వారును అందుల కియ్యకొనిరి. సరయూనది తీరమున దశరథునికి దహన క్రియలు జరిగెను. భరతుడు సరయువులో స్నానముజేసి తండ్రికి తిలోదకములు వదలెను. వేదోక్త ప్రకారము అతడు శతగాత్రములు, ప్రేత క్రియలు ముగించెను. భరతుడు తండ్రిపేర బ్రాహ్మణులకు భూరిభూరి దానాదులు చేసెను.

## భరతుని నిర్ణయము

ఒక శుభదినమున కులగురువు మంత్రులను, సామంతులను, మహా జనులను పిలిపించి సభ యేర్పాటు చేసెను. ఆ సభకు భరత శత్రుఘ్నులను రావించెను. ఆ సభలో వసిష్ఠుడు కైకేయికుతంత్రము మొదలు శ్రీరాముని వనగమనము వరకు జరిగిన వృత్తాంతమంతయూ సభాసదులకు తెలియజేసెను. తదుపరి మహారాజు సత్య వ్రతమును కొనియాడెను. శ్రీరాముని గుణ గణములను కీర్తించుచున్నపుడు మహాజ్ఞాని వసిష్ఠుని మనస్సు చలించి కన్నులు చెమ్మగిల్లెను. పిమ్మట గురువు భరతుని సంబోధించి ఇట్లు చెప్పెను-

"భరతా! లాభ నష్టములు, జీవన్మరణములు, కీర్త్యపకీర్తులు దైవాధీనములు. విధి బలీయమైనది కాబట్టి ఒకరిని గురించిగానీ, వారి మరణమును గురించిగానీ చింతింప పని లేదు. ఆయన పుణ్యపురుషుడు, అదృష్టవంతుడు, అతని కీర్తి లోకవ్యాప్తము.

"కుమారా! పూర్వాపరము లాలోచించి ప్రస్తుతము నీవు మీ తండ్రి మాట మన్నించుట సర్వ శ్రేయస్కరము. మహారాజు నీకు రాజ్యపదవి ప్రసాదించెను. వారి ఆజ్ఞ శిరసావహించి గద్దె నధిష్ఠించుము. మహారాజుకు ప్రాణము

కంటే మాట ప్రధానము. వారి ఆజ్ఞ పాలించుట నీ ధర్మమైయున్నది. తండ్రి ఆజ్ఞ ప్రకారము పరశురాముడు తల్లిని సంహరించెను. యయాతి కోరినట్లు అతని కుమారుడైన 'పూరు'డు తన యౌవనము తండ్రికిచ్చెను. కనుక సంకోచమును మధిష్ఠించి మీ తండ్రి అభీష్టము నెరవేర్చుట విధివిహితము. భరతా! రాజు ఏ కుమారునికి రాజ్య మిచ్చునో వాడే రాజ్యమున కర్హుడనుమాట వేద సమ్మతము. నీవు రాజ్యము చేయుచున్న సంగతి తెలుసుకొని సీతారామ లక్ష్మణులు సంతోషించెదరు. మీ తండ్రి ఆత్మ తృప్తిపడును. తల్లులు సుఖింతురు. వనము నుండి తిరిగి వచ్చినప్పుడు అన్నకు రాజ్యమిచ్చి అతనిని నీవు సేవింపవచ్చును.

అంతట మంత్రులందరూ గురువు చెప్పినట్లు నడచుకొనుమని భరతుని ప్రార్థించిరి.

ఆ సమయమున కౌసల్య ఇట్లు బోధించెను-

''భరతా! కాలము గమనించి, గురువుగారు సుడివినట్లు నడుచుకొనుము. నాయనా! తండ్రి స్వర్గములో నుండెను. అన్నయ్య అడవికి పోయెను. ఇప్పుడు తల్లులకు, ప్రజలకు, బంధువులకు నీ వొక్కడవే దిక్కూ, దీపమై యున్నావు. తండ్రి ఆజ్ఞను మన్నించి గురువులు చెప్పినట్లు రాజ్యము చేపట్టి ప్రజల దుఃఖము పోగొట్టుము.''

గురువు, మంత్రులు, తల్లి హితోక్తులు భరతుని మనస్సుకు హాయి నిచ్చెను. కానీ, అతడు కౌసల్య నిర్మల స్వభావము తన తల్లి కౌటిల్యము ఊహించుకొని మరింత వ్యాకుల పడెను. అతని కన్నులు అశ్రుపూరితము లయ్యెను. పశ్చాత్తాపము పైకొనెను. దుఃఖాక్రాంతుడై, చేతులు జోడించి గద్గద స్వరమున సభ నవలోకించి కంపిత స్వరమున భరతుడిట్లు ప్రవచించెను-

గురువుగారు సర్వ సమ్మతమైన హితోక్తులు నాకుపదేశించిరి. అమ్మగారు నన్నాజ్ఞాపించిరి. గురువులు, తల్లిదండ్రులు, ప్రభువులు మున్నగు వారి మాట పాటించవలెను. లేకుండిన ధర్మహాని కలుగునని చెప్పుదురు. ధర్మసమ్మతమైన వారి సలహాలు నేనూ శిరసావహించవలెను, అందువలన నాకు మేలు కలుగును కదా! ఇది మీ ఏకాభిప్రాయము. అయితే ఇందుకు నా మనస్సంగీకరించుట లేదు. దీనివలన నా ఖేదహృదయమునకు శాంతి లభించుట కల్ల.

మీకు ప్రత్యుత్తర మిచ్చుచున్నందుకు నన్ను మన్నించవలెను. సజ్జనులైన వారు దుఃఖితుల గుణ దోషములను లెక్కించరు.

తండ్రికి స్వర్గము అన్నకు అడవిని ప్రసాదించిన ఈ రాజ్యము నేను చేపట్ట వలెను! దానివలన నాకులాభము, మీకు ఆశయసిద్ధి కలుగునని కోరుచుండిరి. కైక కొడుకు, కుటిలస్వభావుడు, లజ్జాహీనుడు, రామునికి అహితుడు అయిన నా వంటి అధముడు రాజ్యము పాలించిన మీరు సుఖించెదమని భావించుచు న్నారు, ఆహా! ఇన్ని అనర్థములకు కారణమైన నేను నిర్విచారముగ కూర్చొని మీ మాటలు వినుచున్నాను. ఆర్యులారా! నిజము చెప్పున దేమన, ధర్మశీలు డైన నృపాలుడే రాజ్యమునకు అర్హుడు. మీరు గనుక మూర్ఖించి నన్ను గద్దెపై కూర్చుండబెట్టిన యెడల ఈ భూమి ఇప్పుడే రసాతలమునకు క్రుంగిపోవును.

మహాజనులారా! నేను చక్కగా ఆలోచించి చెబుతున్నాను. నాకు ప్రియమై-నది శ్రీరాముని పాదసేవ చేయుటే! అదియే నాకు ప్రస్తుతము శరణ్యమైనది. అప్పుటనే నాకు శుభము, శాంతి లభించగలవు. ఆ రాముడు లేని రాజ్యము నాకెందుకు? శ్రీరాముడు విరక్తుడై, వదలిపెట్టిన రాజ్యమును నేను విషయాస-క్తుడనై భోగింపవలెనా! అయ్యో! నేను పరిహాసముల పాలైతిని. నా హృదయ మెంత పాషాణమైనది! నేను కైక గర్భమున జనించితిని. ఆమె కంటే నా హృద యము కఠోరమైనది.

మా తల్లి భర్తను పరలోకమునకు పంపెను. కొడుకును అడవిదారి పట్టిం చెను. తలకు వైధవ్యము తెచ్చుకొనెను, నాకు సామ్రాజ్యము, సత్కీర్తి ఇచ్చెను. అన్ని పనులు ఆమెయే చక్కబెట్టుకొనెను. ఇపుడు మీరుకూడ పంచాయతి చేసి ఆమె చేసిన పనిని సమర్థించుచున్నారు. ఇది ఎట్లున్నదనగా ఒకరికి మొదటనే గ్రహబలము తప్పెను; పిమ్మట సన్నిపాతము వచ్చెను; దానిపై తేలు కుట్టెను; తుదకు వానికి మద్యమిచ్చిరి. చూడగ మీరు నాకు రాజ్యమిచ్చు తీరు అట్లగ-పడుచున్నది. అట్లెందుకు జరుగుచున్నది? అందుకు కారణము?

కారణమా! నేను దశరథ పుత్రుడను కాదు - నేను కైక కొడుకును. కాబట్టి మీరు నన్ను రాజ్యము యేలుకొమ్మంటిరి! అకటా! ఇది నా తల వ్రాత! ఈ కళంకము నేను భరించవలసినదే. ఓ గురువులారా! తల్లులారా!!

జనులారా!! అక్కడ శ్రీ సీతారామ లక్ష్మణులు గుట్టలబడి తిరుగుచున్నారు! ఇక్కడ నా హృదయము దహించుక పోవుచున్నది. వారిని చూడనిదే నా మనస్సుకు శాంతిలేదు. హృదయమునకు తృప్తి కలుగదు. నేను అంజలి ఘటించి ప్రమాణ పూర్వకముగ చెప్పున దేమన నేను రేపే సీతారాముల దర్శ నార్థమై కానసములకు పోవుచున్నాను. నన్ను దీవించి, వెళ్ళుటకు అనుమతించ వలసినదిగా ప్రార్థించుచున్నాను. దయా స్వరూపుడగు శ్రీరాముడు నన్ననుగ్ర- హించి తప్పక నావెంట అయోధ్యకు రాగలడు. ఇది నా కృతనిశ్చయమై యున్నందుకు క్షమింపకోరుచున్నాను.

అమృతోపమానముగు. భరతుని మాటలు విని ప్రజలు ముగ్ధులై, అతని నిశ్చలభక్తిని వేనోళ్ళ ప్రశంసించిరి. భక్తి భరతుని రూపముతో ఈ భూమిపై అవతరించినదని వారు భావించిరి. ఇంతవరకు శ్రీరాముని వియోగదుఃఖముచే పరితప్త మానసులైన ప్రజల మనస్సులకు ఒక్కసారిగ శ్రీరాముని దర్శించు కొనవలెనను ఉత్సాహము ఉద్భవించెను. గురువులు, మంత్రులు, తల్లులు భరతుని అభిప్రాయము విని సంతోషించి వారును భరతునివెంట వనములకు వెళ్ళుటకు నిశ్చయించుకొని భరతునికి ప్రణమిల్లి, వసిష్ఠుని వద్ద సెలవు తీసుకొని గృహములకు పోయిరి.

## భరతాదుల చిత్రకూట ప్రయాణము

ఆ రాత్రి నగరమంతట వన ప్రయాణమునకు సన్నాహములు జరుగు చుండెను. ప్రతి ఇంటిముందర వాహనములు నిలబడియుండెను. భరతుడు విశ్వసనీయులైన తన ఆంతరంగిక సేవకులను బిలిచి, వారికి తగు శిక్షణనిచ్చి నగర రక్షణ భారమును వారికి అప్పగించెను. పిమ్మట తల్లులు ప్రయాణించు టకు వారికి యోగ్యములైన వాహనాదులను కుదిర్చెను. సేవకులను బిలిచి, ''గురువుగారు వనమందే శ్రీరాములకు పట్టాభిషేకము చేయుదురు; అందుకు కావలసిన అభిషేక సంభారములు సిద్ధముచేసి తీసుకురం''డని ఆజ్ఞాపించెను.

మరుదినము ప్రాతఃకాలము సాకేతవాసులు చిత్రకూటమునకు ప్రయాణ మైరి. మొదట వసిష్ఠుడు, అతని భార్య అరుంధతి రథమెక్కి ముందు చనిరి. వారి వెనుక తపస్సంపన్నులగు బ్రాహ్మణ సమాజము వాహనములెక్కి బయలు

దేరెను. తదుపరి రాణులు పురజనులు బయలుదేరిరి. ఆ పైన భరతుడు నగర రక్షణ చక్కగ చూచుచుండుమని రాజోద్యోగులను హెచ్చరించి, వారివద్ద సెలవు తీసుకొని శత్రుఘ్నునితో గూడి ప్రయాణమయ్యెను.

భరతుడు పాదచారియై వచ్చుటజూచి కౌసల్య ''భరతా! నీవు నడచి వచ్చిన పరిచారక బృందమునకు ఇబ్బంది కలుగును. కనుక రథమెక్కు''మని కోరెను. తల్లి ఆదేశము పాటించి భరతశత్రుఘ్నులు రథము లెక్కి చనిరి. మొదటి దినము తమసానది గట్టున గడిపి, రెండవ దినము గోమతీ తీరము సమీపించిరి. దారిలో వారు రాత్రిపూట వూత్రవము ఫలహారము పుచ్చుకొనుచూ, భోగములు వదలిపెట్టి నియమవ్రతులై ప్రయాణము సాగించుచుండిరి. అక్కడ నుండి సరయూనదిని దాటి శృంగబేరపురము చేరిరి.

## నిషాదపతిని కలుసుకొనుట

భరతాదుల ఆగమన వార్త తెలుసుకొని గుహుడు ఇట్లు శంకించెను–

''కైక కొడుకు భరతుడు చిత్రకూటమునకు పోవుచున్నాడు. ఇతడు ఏదియో దురుద్దేశముతో ఈ ప్రయాణము తలపెట్టినట్లున్నది. రామ లక్ష్మణులను సంహరించి నిష్కంటకముగ రాజ్యమేల దలచినాడు కాబోలు. లేకుండిన ఈ చతురంగ బలములను వెంట తీసుకొని పోవుటలో ఉద్దేశ మేమై యుండును? కైక కొడుకు ఇట్లు ప్రవర్తించడని నమ్మకమేమున్నది? ఏ నాటికైనా విషవృక్షమున మధుర ఫలము ఫలించునా?!'' ఇట్లు ఆలోచించి గుహుడు తన జాతివారిని పిలిచి ''మీరు తత్క్షణమే రేవులు కట్టివేచి, పడవలను ముంచివేసి, ఎవ్విధముగనైననూ భరతుడు గంగను దాటకుండునట్లు చేయు''డని ఆజ్ఞాపించెను.

నిషాదపతికి శ్రీరామునియందున్న భక్తి అనన్య సామాన్యమైనది. అతడు తన ప్రాణములను సైతము ధారబోసి శ్రీరామునికి సహాయపడవలెనని కృత నిశ్చయుడయ్యెను. నిషాదపతి స్వయముగ విల్లంబులు చేబూని, తనబలగమును వెంట తీసుకొని భరతునితో యుద్ధము చేయుటకు ప్రయాణమయ్యెను. ఇట్లు గుహుడు యుద్ధ సన్నద్ధుడై బయలుదేరు సమయమునకు వారిలో ఒకడు తుమ్మెను. అంతట శకునము చెప్పు వృద్ధుడొకడు గుహుని సమీపించి,

''దొరా! శకున ఫలము విచారించి చూడ భరతుడు రామునితో యుద్ధము చేయుటకు పోవుచున్నట్లు లేదు. ఈ తుమ్ము మీకు శుభప్రదముగ కన్పట్టుచున్నది. మీరు ఒకమారు భరతుని కలుసుకొనుట మంచిది'' అని చెప్పెను. ఆ వృద్ధుని అభిప్రాయమునకు గుహుడు సమ్మతించెను. తన బలగమును రేవులందు గుమిగూడి యుండుమని హెచ్చరించి నిషాదరాజు ఫలములు, మత్స్యములు, పక్షులు, మృగములు మున్నగు కానుకలు తీసుకొని భరతుని దర్శించుటకై బయలుదేరెను.

మొదట వసిష్ఠుని చూచి గుహుడు తన పేరు చెప్పుకొనెను. వసిష్ఠుడు గుహుడు రాముని స్నేహితుడని తెలుసుకొని వానిని ఆశీర్వదించి భరతునికి పరిచయము చేసెను. గుహుడు భరతునకు సాష్టాంగ దండ ప్రణామము చేసి, తన కులగోత్రములు, ఊరూ, పేరు చెప్పుకొనెను. భరతుడు రథము దిగివచ్చి ఆప్యాయముగ గుహుని ఆలింగనము చేసుకొని తమ్ముడు లక్ష్మణుని జూచినంత ఆనందము పొంది కుశల ప్రశ్నలు చేసెను. భరతుడు, గుహుడు ఇరువురు ప్రేమతో పలుకరించుకొని ఒండొరులను కౌగలించుకొనిరి. గుహుని ప్రేమ భరతుని ఆత్మీయత చూచి దేవతలు హర్షించిరి. భరతుడెంత ఆదర్శవంతుడు, గుహుడెంత సుకృతాత్ముడని నాగలోకవాసులు కొనియాడిరి.

భరతుని శీలము, స్నేహము, సత్కారముల తీరు చూచి తెలుసుకొన్న మీదట నిషాదుడు తనలో తాను సిగ్గుపడెను. అతడు భరతుని చరణములకు ప్రణమిల్లి ఇట్లు విన్నవించెను-

''స్వామీ! మీ పాదదర్శనము చేసుకొని మా వంశము కోటి తరముల వరకు తరించెను. నేను వేదములకు లోకములకు దూరుడైన హీనకులస్థుడను. ఆ శ్రీరామమూర్తి నన్ను గ్రహించినది మొదలు నాకు లోకములలో కీర్తి ప్రతిష్ఠలు హెచ్చెను. ఆ శ్రీరాముని సేవింపనివాడు లోకవంచకుడుకదా!!'' భరతాదులు నిషాదపతి వినయ విధేయతలు చూచి ముగ్ధులైరి. పిమ్మట గుహుడు రాణులకు జోహారు పలికెను. అయోధ్యావాసులను కలుసుకొనెను. పిమ్మట నిషాదపతి తన వారికి సంజ్ఞ చేసి వెనుకకు పంపించెను.

గుహుడు మార్గము చూపుచుండ భరతాదులు గంగా తీరము చేరిరి. భర

తుడు గంగవద్ద రాముడు దిగియుండిన 'రామఘాట్'ను చూచి దానికి ప్రణమిల్లెను. భరతుడు, పరివారము, తల్లులు, సైనికులు గంగలో స్నానముచేసి జగత్పావని గంగకు అంజలి ఘటించి, వేడుకొనిరి. తదుపరి వారు గంగా తీరమున గుహునిచే ఏర్పాటు చేయించబడిన స్థలమందు ఆ రాత్రి బసచేసిరి.

రాత్రి భరతుడు గురువుగారికి, కౌసల్యకు సేవా శుశ్రూషలు చేసి, వారిని శయనింపజేసిన అనంతరము గుహుని వద్దకు వచ్చి - ''నిషాదరాజా! ఆ దినము శ్రీ సీతారామలక్ష్మణులు ఎచ్చట నివసించిరో తెలియజేయుము. ఆ స్థలము చూచిన నా మనస్సుకు కొంత శాంతి కలుగు'' నని కోరెను. గుహుడు భరతుని తోడ్కొని శ్రీరామాదులు నివసించిన శింశుపా వృక్షము వద్దకు వెళ్ళెను.

భరతుడు భక్తిరతుడై, ఆ స్థలమునకు నమస్కరించి, అక్కడున్న ప్రభువు పాద రేణువులు, నేల రాలియుండిన సీత జల్తారు ముక్కలు తీసుకొని కండ్ల కద్దుకొనెను. అప్పుడు అతని కండ్లు చెమ్మగిల్లెను. ప్రేమోత్కంఠుడై భరతుడు గుహునితో ఇట్లనెను-

''మిత్రమా! జానకి వియోగ దుఃఖము సహింప లేక ఈ జల్తారు ముక్కలు కళాహీనమై పడియున్నవి. జనక చక్రవర్తి పుత్రిక, దశరథమహారాజు ముద్దుకోడలు, శ్రీరాముని ప్రియపత్ని జానకి శయనించి యుండిన ఈ కుశశయ్య జూచి నా హృదయము దహించుక పోవుచున్నది. నా తమ్ముడు లక్ష్మణుడు బహు సుకుమారుడు అతడు కాననక్లేశము లెట్లు భరించెనో, రఘుకుల భూషణుడు సకల గుణధాముడైన శ్రీరాముడు నేడు నేలమీద గడ్డివావపై పవలించుచున్నాడు. విధికృత మెంత బలీయమైనది! తల్లిదండ్రులు, బంధు బాంధవులు, పరిజన బృందముచే అహర్నిశము కంటికి రెప్పవలె పోషింపబడుచుండిన రఘురాముడు నేడు గహనాంతర సీమల కందమూలములు భుజించుచూ, పాదచారియై సంచరించుచున్నాడు. అహో! మా తల్లి కైక వల్లనకదా ఇన్ని విపత్తులు సంభవించెను! మా వంశమునకు తీరని కళంక మేర్పడెను. ఆమెవలన నేను స్వామి ద్రోహినైతిని. గుహా! ఈ ఉత్పాతముల కన్నింటికీ నేనే మూలము.''

ఆ రాత్రివేళ శింశుపావృక్షము క్రింద ఘోరున ఏడ్చుచూ, విలపించిన భరతుని గుహుడు బహువిధముల ఊరడించి దేరాకు తోడ్కొని పోయెను. అక్కడ చేరియుండిన శృంగబేర పురవాసులు భరతునికి ప్రదక్షిణ నమస్కారములు చేసి, దర్శనము చేసికొని సంతృప్తులైరి. వారు కైకను దూషించుచూ, భరతుని కీర్తించుచూ, సీతా రామలక్ష్మణులను స్మరించుచూ, రాత్రంతయూ అక్కడనే యుండి, తమ ప్రేమాను రాగములను వ్యక్తపరచిరి.

ప్రాతఃకాలముననే భరతాదులు సుఖముగ గంగావతరణము చేసిరి. భరతుడు స్నాన సంధ్యానుష్ఠానములు నిర్వర్తించుకొని, గురువులకు, తల్లులకు నమస్కరించి, గుహుడు ముందు దారిచూపుచుండ ప్రయాణము సాగించెను.

భరతుడు పాదచారియై నడుచుచుండెను. అతని వెనుక సేవకుడు గుర్రములను నడిపించుకొని వచ్చుచుండెను. సేవకుడు భరతునితో - మహారాజా! గుర్రము నధిష్ఠించుడు - అని వేడుకొనెను.

''ఓయీ! శ్రీరాముడు పాదచారియై వెళ్ళియుండెను. నాకు మాత్రము గజాశ్వ వాహనము లెందుకు? నేను కాళ్ళతో గాక, తలతో నడచి వెళ్ళిన మరీ బాగుండెడిది. ఇంతకూ సేవక ధర్మము కష్టమైనదయ్యా!'' అని సమాధానమిచ్చెను. భరతుడు ''సీతారామ్ - సీతారామ్'' అని జపించుచూ అడుగులు వేయుచుండెను. అతని పాదములందు బొబ్బలు పడెను. ఇట్లు ప్రయాణించి భరతాదులు ఆనాటి అపరాహ్ణ వేళకు ప్రయాగ చేరుకొనిరి.

అచ్చట త్రివేణీ సంగమస్థలమందు అందరును స్నానము చేసిరి. భరతుడు త్రివేణికి అంజలి ఘటించి నతశిరస్కుడై-

''ఓ త్రివేణీ తీర్థరాజమా! నాకు జన్మ జన్మాంతరముల వరకు సీతారాముల చరణారవిందములయందు నిశ్చలమైన భక్తి యుండునట్లు ప్రసాదించు'' మని ప్రార్థించెను.

''ఓ భరతా! రామునియందు నీకు గల అనురాగము గాఢమైనది. నీవు రామునికి సాటిలేని ప్రియబాంధవుడవు. నీవు విచారింప పనిలేదు'' అని త్రివేణిలో నుండి మధుర ధ్వని వినబడెను.

# భరతునికి భరద్వాజుని ఆతిథ్యము

ప్రయాగవాసులు భరతుని ప్రేమాను రాగములు భక్తి వినయములు చూచి ముగ్ధులైరి. అక్కడనుండి భరతుడు భరద్వాజముని ఆశ్రమమునకు వచ్చెను.

భరద్వాజుడు ఎదురేగి భరతుని ఆలింగనము చేసుకొని ఆశీర్వదించెను. తన అదృష్టము ఈ రూపములో ఇంటికి వచ్చినదని మునీశ్వరుడు రామాను జుని చూచి ఆనందించెను. భరతుడు మునిపాదములకు సాష్టాంగ ప్రణామము చేసి, మునీశ్వరుడేమి ప్రశ్నించునో యని భయపడుచూ కూర్చుండెను. లజ్జిత వదనుడైయున్న భరతు నవలోకించి భరద్వాజు డిట్లు సంభాషించెను-

"భరతా! విషయములన్నియూ నాకు విదితమే. ఇందులో మీ తల్లి చేసిన దోషములేదు. అప్పుడామె బుద్ధిని సరస్వతి హరించియుండెను. ఇక మీదట మీ తల్లి తన తప్పును గ్రహించి పశ్చాత్తాపము చెందగలదు. భరతా! నీవు నిర్దో షివి. నీవు రాజ్యభారము వహించిననూ దోషములేదు. కానీ ప్రస్తుతము నీవు తలపెట్టిన ఉద్యమము ఉత్తమోత్తమమైనది

ఓ భరతా! నీవు శ్రీరామునికి ప్రియ సోదరుడవు. ఆ దినము జానకీ రమణుడు ప్రయాగకు వచ్చియుండినపుడు అతనికి నీపై గల స్నేహ వాత్సల్య ములు నేను చూడ గలిగితిని. శ్రీరాముని ప్రేమానురాగములకు నీవు ప్రతిరూపమని నా భావన.

ఓ రామానుజా! నీ కీర్తి చంద్రికలు దశ దిశలా వ్యాపించి, యుగయుగ ములవరకు రామభక్తి యనెడు పీయూషమును వర్షించుచుండును. రామునికి ప్రియతముడవైన భరతా! నేడు నిన్ను దర్శించుకొని మా తాపస కులము ధన్య మైనది."

మహర్షి మాటలకు అక్కడ చేరిన సాధు సమాజము హర్షించెను. వారు భరతుని యశోగాథలను వేనోళ్ళ కీర్తించిరి. వారి ప్రశంసలకు ఉక్కిరి బిక్కిరైన భరతుడు గద్గద కంఠముతో నమ్రుడై మునీశ్వరుల కిట్లనెను.

"ఓ ఋషులారా! ఈ పుణ్యస్థలమందు, సర్వజ్ఞులు, తపోధనులైన మీ ఎదుట అసత్య మాడజాలను. నేను మాతల్లి దుర్బుద్ధికి చింతించుటలేదు.

మా తండ్రి మరణమునకు విచారించుట లేదు. అథవా ఇహ లోకములను గురించి కూడ నాకు పెద్ద ఆలోచనలేదు. నా దుఃఖమునకు ఒక్కటే కారణము కలదు. అది శ్రీ సీతారామలక్ష్మణులను గురించిన బాధ. వారు నారగుడ్డలు ధరించి నానా యాతనలకు లోనై అడవులలో తిరుగాడుచున్నారు. ఈ దుఃఖాగ్ని రాత్రింబవళ్లు నా హృదయమును దహించి వేయుచున్నది. ఈ వ్యథచే కంటికి నిద్ర, కడుపుకు అన్నము దూరమై పోయినవి. నా ఈ రోగమునకు ఒక ఔషధ మున్నది. అది శ్రీ సీతారామలక్ష్మణులు పునః అయోధ్య చేరుకొనుట. అప్పుడే నా మనస్సుకు శాంతి, హృదయమున కానందము కలుగును.'' మునులు భరతుని వ్యాకులము తెలుసుకొని ''భరతా! శ్రీరాముని పాదములు దర్శించగనే నీ దుఃఖము నివృత్తి కాగల''దని ఓదార్చిరి. ఈ సంభాషణానంతరము ''ఓ భరతా! నీవు నాకు ప్రియమైన అతిథివి. నా ఆతిథ్యము స్వీకరింపు''మని భరద్వాజుడు కోరెను. భరతుడు ఋషీశ్వరుని మాటలు త్రోసివేయజాలక తన అంగీకారము తెలియజేసెను. భరతుడు గొప్ప అతిథి. కొండంత అతిథికి కొండత విందు చేయవలెనని ఊహించి భరద్వాజుడు తన తపోమహిమచే బుద్ధి సిద్ధి అణి మాద్యష్ట సిద్ధులను ఆహ్వానించి - ''ఓ సిద్ధులారా! నేను భరతునికి, అతని సేనా పరివారమునకు వైభవముగ విందు ఇయ్య దలచితిని. మీరు తత్క్షణమే అందుకు సర్వము సిద్ధము చేయవలెను'' అని ఆజ్ఞాపించెను.

సిద్ధుల ప్రభావము అమోఘము. త్రుటి కాలములో ఆ వనప్రాంతమున రమ్యమైన భవనములు, తోటలు పందిరులు, ఆరామ గృహములు వెలసెను.

వానిలో అసంఖ్యాకులైన దాస దాసీలు, పరిచారకులు కార్య నిమగ్నులై యుండుట కానబడెను. బహు విధములైన భోజన పదార్థములు, ఫలములు, పుష్పములు, సుగంధ ద్రవ్యములు, విలాస వస్తువులు మున్నగునవి సిద్ధమై పోయెను. చల్లని వాయువులు వీచెను. చతుర్విధ పురుషార్థ సాధనములు సమకూరెను. వేయేల? అక్కడ వినూత్నమైన దేవలోకమే ప్రత్యక్షమయినట్లుండెను.

భరతాది సాకేత వాసులు త్రుటిలో అక్కడ సాక్షాత్కరించిన దివ్యవైభవము జూచి, ఆశ్చర్యచకితులైరి. కానీ వారు శ్రీరాముని వియోగదుఃఖముచే వ్యథితు

లయినందున కందమూలములు మాత్రము స్వీకరించి సంతృప్తులైరి. చక్రవాక మిథునమునకు రాత్రివేళ సంయోగమే లేనట్లు ఆ సమయమున భరతుడు భోగానుభవములకు దూరముగా నుండెను.

మరుదినము మునీశ్వరుని దగ్గర సెలవు తీసుకొని, త్రివేణిలో స్నాన సంధ్యలు నిర్వర్తించుకొని భరతాదులు చిత్రకూటమువైపు ప్రయాణించిరి.

## భరతుని పరవశత

అగ్రభాగమున గురువుల రథములు వారి వెనుక రాణుల వాహనములు, పిమ్మట అయోధ్యావాసులు చనుచుండిరి. అందరికంటే వెనుక భరతుడు పాద చారియై గుహుడు మంత్రులు, పుత్రులు వెంటవచ్చుచుండ నడుచుచుండెను.

అతని పాదములకు రక్షలు, శిరస్సునకు ఛత్రములేవు. మేఘము లతనికి నీడబట్టెను. చల్లని వాయువు లతని శ్రమ దీర్చుచుండెను. భరతుడు గుహుని భుజములపై తన చేతులు వైచుకొని, సీతారాముల వనగమనమును గురించిన విశేషములు అడిగి తెలుసుకొనుచూ, నియమవ్రతుడై విపిన మార్గమున పయనించుచుండెను. సీతా రాములు నివసించియుండిన చెట్లను, ఛాయలను స్థలములను మార్గములో చూచినపుడు అతని ప్రేమానుభూతి కట్టలు తెంచు కొనుచుండెను.

భరతుడు భ్రాతృ ప్రేమకు ప్రతి స్వరూపుడు. శ్రీరామునికి కఠినముగా నుండిన కంటక మార్గము లతనికి మృదువుగా నుండెను. ఆ ప్రేమ స్వరూపుని దివ్య దర్శనముతో చరాచర జీవకోటులు భవరోగములకు దూరమయ్యెను. జగద్బాంధవునికి అనుంగు సోదరుడు భరతుడు. అతనికి మార్గము లన్నియు మంగళ ప్రదములుగా మారి యుండుటలో వింతయేమున్నది! భరతుని ప్రభు భక్తిని, అతని దివ్యాంతః కరణము జూచిన మునులు, సిద్ధులు, సాధువులు ముగ్ధులై ప్రశంసించ సాగిరి.

భరతుని ప్రభావము పరికించిన దివినున్న దేవేంద్రునికి ధిగులు పుట్టెను. అతడు దేవగురువు బృహస్పతిని పిలిచి-

"ఆచార్యా! భక్తవత్సలుడైన శ్రీరాముడు ప్రేమాధీనుడు. కాబట్టి అతడు భరతుని అనురాగమునకు వశుడై అయోధ్యకు పోయినట్లైన మన దేవకార్యము లకు విఘ్నము వాటిల్లును. కనుక వారుభయులు పరస్పరము కలుసుకొన కుండునట్లు ఏదైనా ఉపాయ మాలోచింపవలసి యుండును" అని అర్థించెను.

ఇంద్రుని ఆలోచనకు బృహస్పతి చిన్నగ నవ్వుకొని ఈ ఇంద్రునికి వేయి కండ్లున్నను ప్రయోజనము లేదని భావించి, ప్రకటముగ అతనికిట్లు ప్రవచించెను.

"ఓ సురనాథా! నీవు భ్రాంతిపడ నవసరము లేదు. శ్రీరాముడు మాయా ధీశుడు. తొందరపడి అతని భక్తులపై మాయ ప్రయోగించిన యెడల అది ప్రయోగించిన వారికే ప్రమాదము తెచ్చిపెట్టగలదు. రాముడు భక్తపరాధీనుడు. లోక మంతయూ రాముని సేవించుచున్నది. ఆ రాముడు సదా భరతుని భజించుచుండును. తన భక్తులకు కష్టములు కలిగించు వారిని రఘుపతి సహించజాలడు. ఇంద్రా! నిర్గుణుడైన ఆ పరాత్పరుడు తన భక్తుల కొరకే ఇట్లు సగుణుండై ప్రవర్తించుచున్నాడు. కాబట్టి నీవు భరతునికి అపచారము తల పెట్టక, అతనిని భజింపుము" అని గురువు బోధించెను. అంతట శచీపతి పశ్చాత్తాపపడి, భరతుని గుణగణములు తెలుసుకొని భయవిదూరుడయ్యెను.

భ్రాతృ స్నేహితుడు భరతుడు ప్రేమతపస్వి. అతడు శ్రీరాముని దర్శించుటకై వెళ్ళునప్పుడు వేయుచున్న ప్రతి అడుగు అనురాగ బద్ధమైనది, అతడు వదలుచున్న ప్రతి నిశ్వాసము ప్రేమపూరితమైనది. ఆ ప్రేమమూర్తి సోదర స్నేహము జూచి మునీశ్వరులు సిగ్గుపడుచుండిరి.

ఇట్లు ప్రయాణించి భరతాదులు యమునానదీ తీరమునకు వచ్చిరి. యమున నీల జలరాశి చూచినపుడు మేఘశ్యాముడు గుర్తుకు వచ్చి భరతుని కండ్లు చెమ్మగిల్లెను. ఆ రాత్రి వారు యమునా తీరమున గడిపి, ఉదయమున గుహుని సహాయమువలన నదిని అవలీలగ దాటి ముందుకు చనిరి.

త్రోవలో అక్కడక్కడ గ్రామప్రజలు భరతశత్రుఘ్నులను దర్శించుకొని, సాటిలేని వారి సోదర ప్రేమను కొనియాడుచుండిరి. ఆహా! ఆదర్శవంతులైన

ఈ పుణ్య పురుషులను చూడగలిగిన అదృష్టము మనబోటి గ్రామవాసులకు కలిగెను గదా!- యని జానపదీయులు ఆనందాబ్ధి నోలలాడిరి.

భరతుడు మార్గములో అక్కడక్కడ నున్న మునుల ఆశ్రమములను, పవిత్ర స్థలములను దేవ మందిరములను దర్శించుకొనుచూ, ఆటవికులను ఆదర వముతో పలుకరించి పరామర్శించుచూ ముందుకు పోవుచుండెను. భరతుడు దారిలో కనబడు బాటసారులను పలుమార్లు రామలక్ష్మణులను గురించి ప్రశ్నలు వేసెను. సీతా రామలక్ష్మణులు ఫలానా చోట క్షేమముగా ఉన్నారు, మేము వారిని చూచి వచ్చితిమి. అని వారు సమాధాన మిచ్చుచుం డిరి. అట్లు చెప్పు పాంథులను భరతుడు ప్రేమతో ఆలింగనము చేసుకొని ప్రసన్నుడగు చుండెను.

దారిలో ఒకరాత్రి గడిపి, వారు మరుదినము శ్రీరాముని స్మరించి తిరిగి ప్రయాణము సాగించిరి. ఆ దినము వారికి అన్నియూ శుభ శకునములే తోచెను. ఇక త్వరలో మనకు శ్రీరాముని దివ్యదర్శనము లభించగలదని ఉత్సా హితులైరి. ఆ సమయమున నిషాదపతి పట్టరాని సంతోషముతో అయోధ్యా వాసులకు దూరము నుండి కానవచ్చిన చిత్రకూట పర్వతమును చూపించెను. చిత్రకూటమును, మందాకినీ నదిని దర్శించి అమందానంద హృదయులైన సాకేతవాసులు భక్తితో వానికి ప్రణమిల్లిరి. అప్పుడు భరతునికి కలిగిన ఆనంద మింతింతయని చెప్పుటకు కవీశ్వరులకు కూడా శక్యముకాదు.

ఉత్సాహాతిశయముచే వారు ఆదినము రెండు క్రోసుల దూరము మాత్రము ప్రయాణించి, ఒక జలాశయము వద్ద నాటికి విశ్రమించిరి.

అక్కడ పర్ణశాలలో ఆ దినము ఉషఃకాలమున శ్రీరాముడు మేలుకొనెను. అంతట జానకి అతనిని సమీపించి-

"నాథా! రాత్రి కల గంటిని, మీ వియోగ దుఃఖముచే కృశించి పరితపిం చుచున్న భరతుడు మీ దర్శనార్థమై ఇక్కడికి వచ్చినట్లు, అతని వెంటనున్న అయోధ్యా వాసులు అతి దీనులై యుండినట్లు అత్తగార్ల ముఖ కమలికలు మారియున్నట్లు స్వప్నములో దర్శించితిని" అని దిగులుతో చెప్పెను.

సీత స్వప్న వృత్తాంతము తెలుసుకొని దుఃఖ భంజనుడగు దాశరథి మిక్కిలి దుఃఖించెను. అతడు ''సోదరా! ఈ స్వప్నము శుభ సూచకముగ లేదు. మన మేదియో దుర్వార్త వినవలసి యుండును'' అని శంకితుడై అనుజనితో పలికెను. తదుపరి వారు స్నానము చేసి శివుని పూజించి సాధు సత్కారము చేసిరి.

ఆ సమయమున ఉత్తరము వైపు ఆకాశమున ధూళి ఎగురుట, అనేక ఖగ మృగములు, భీతిల్లి ఆశ్రమము తట్టు పరుగెత్తుకొని వచ్చుట అవధనందను డవలోకించెను. ఇంతలో కిరాత జనులు శ్రీరాముని వద్దకు పరుగెత్తుకొని వచ్చి సమాచారమంతయు తెలియజేసుకొనిరి. భరతుని ఆగమన వార్త విని ఆ నీల మేఘశ్యాముని సర్వేంద్రియములు సంతోషముతో పులకరించెను. శరత్కాల సరోరూహముల వంటి అతని నేత్రములు ఆ సుఖ వార్తకు స్నేహ జల పూరితములై కన్పడెను.

భరత ప్రభువు చతురంగ సేనా సమేతుడై వచ్చుచున్నాడని భిల్లులు చెప్పగా, సోదరుడు సైన్యము వెంట తీసుకొని వచ్చుటకు కారణమేమై యుండునో అని సీతాపతి చింతించసాగెను. అది గమనించి సౌమిత్రి అగ్రజునితో ఇట్లు భాషించెను–

''ప్రభూ! సందర్భమును బట్టి సేవకుని తప్పులు క్షమార్హములగుచున్నవి. మీరు ప్రశ్నింపకున్ననూ నేను ప్రసంగించుచున్నందుకు క్షమించవలెను. స్వామీ! మీరు సరళ స్వభావులు, ప్రేమ స్వరూపులు గాబట్టి ఇతరులు గూడ అటులనే ఉందురని విశ్వసించెదరు. కానీ విషయాసక్తులగు మూర్ఖులు అధికారము లభింపగనే అహంకారముచే ఉన్మత్తులగుచున్నారు. భరత సోదరుడు కూడా వారిలో ఒకడు. సాధు స్వభావుడు, నీతి వంతుడైన భరతుడు రాజ్యము చేతికందిన మరుక్షణమే ధర్మమార్గమును విర్జించి దురాలోచనలతో ఇచ్చటికి వచ్చుచున్నాడు. లేకుండిన సేనా వాహినులను వెంట నిడుకొని వచ్చుటకు కారణమేమున్నది! వనములో ఒంటరిగా నన్ను మిమ్ము నిర్జించి నిష్కంటకముగ రాజ్యము పాలించవలెనని నిశ్చయించి యుండును. అతనిని మాత్రమే అననేల! రాజ్యము సంక్రమించినపుడు లోకులు గర్వితులగుట సహజమే కదా!

చంద్రుడు, నహుషుడు, వేనుడు, సహస్రబాహుడు, ఇంద్రుడు, త్రిశంకుడు ఇత్యాదులు రాజ్యమదముచే నీతి బాహ్యులై ప్రవర్తించలేదా? అగ్రజా! శత్రుశే షము నిర్మూలించుటకై భరతశత్రుఘ్నులు కోటి కుటిలోపాయములతో వచ్చుచున్నారు. ఈ దినము రణరంగమందు రౌద్రమూర్తి యైన వీరరాముని తేజస్సు చూచిన గాని భరతుని బుద్ధి దారికి రాదు.''

ఇట్లు సందేహించిన సౌమిత్రి వీరావేశముతో ధీరగంభీరుడై మరల ఇట్లు ప్రసంగించెను-

''అగ్రజా! నేను అనుచిత ప్రసంగము చేయుటలేదు. మనయెడల ఆ భర తుడు చేయని అపరాధమేమున్నది! స్వామీ! నేను క్షత్రియుడను. రఘు వంశ స్థుడను, రఘు వీరుని తమ్ముడను. నా చేతిలో ధనుర్బాణములున్నవి. అంత కంటే మీరు నా ప్రక్కనున్నారు.''

అని పలుకుచున్న లక్ష్మణునిలో రౌద్రము అంతకంతకు హెచ్చిపోయెను. అతడు జటలు సవరించి, నడుము బిగించి, ధనుర్బాణములు సంధించి కోపో- ద్రిక్తుడై యిట్లు పలికెను-

''రామచంద్రా! నేడు యుద్ధ భూమిలో ఆ భరత శత్రుఘ్నులను తుద ముట్టించి మీ సేవకుడని కీర్తి బొందెదను. గజయూథముపై లంఘించు మృగ రాజువలె విజృంభించి వాని సైన్యము నిశ్శేష మొనర్చెద. ఆ పరమశివుడే తోడై వచ్చిననూ భరతుని రక్షించుకొనజాలడు.''

రోషావేశముతో పలికిన లక్ష్మణుని రౌద్రోక్తులకు లోకములు, లోక పాలురు భీతిల్లిపోయిరి. లక్ష్మణుని భుజబల పరాక్రమములను ఉగ్గడించుచూ ఆకాశవాణి-

''ఓ లక్ష్మణా! నీ శౌర్య ధైర్యములు అమోఘములు. అయిననూ తొందర పడక ఉచితానుచితము లాలోచించి యే కార్యమైన చేయవలయును లేకుండిన పిమ్మట పశ్చాత్తాపడవలసియుండును'' అని పలికెను. అంతట జానకీ రాములు సౌమిత్రిని శాంతింపజేసిరి.

''సౌమిత్రీ! నీవు చెప్పిన మాటలు నీతి యుక్తమైనవే. రాజ్యగర్వము అతి

కఠినమైనది. సాధు సాంగత్యము చేయని ధరణీశులు అధికార వాసనతో మదోన్మత్తులౌట సహజము.

''అయితే లక్ష్మణా! ఈ సృష్టిలో భరతుని వంటి ఉత్తమ పురుషుడు మరొక డుండడని నమ్ముము. హరిహర బ్రహ్మాదుల పదవులు లభించిననూ భరతునిది గర్వపడు స్వభావము కాదు. గంజి చుక్కలు పడినంత మాత్రమున పాల సముద్రము పేరుకొనునా! పట్టపగలు సూర్యునికి చీకట్లు క్రమ్మిననూ భరతుని రాజ్యగర్వము సమీపించజాలదు.

''తమ్ముడూ! నీతోడు, తండ్రితోడు, భరతుని వంటి పవిత్రమైన సోదరుడు మరొక్కడులేడు. గుణ దోషములను నీరక్షీరమువలె గ్రహించుటలో మన భరతుడు హంసవలె జ్ఞాన సంపన్నుడు సుమా!'' అని భరతుని గుణ గణములను వర్ణించుచున్న ఆవేశములో శ్రీరాముడు ప్రేమపయోధిలో మునిగిపోయెను.

''ఈ జగత్తులో భరతుడే అవతరించకయుండిన ధర్మభారము వహించగల సామర్థ్య మెవరికున్నది? కవీశ్వరులకే అగమ్యమైన భరతుని గుణ గాథలు ఒక్క శ్రీరామునికే చక్కగా తెలియును!'' అని దేవతలు ఆ సమయమున తర్కించుకొని సంతృప్తిజెందిరి.

## చిత్రకూట దర్శనము

అప్పుట భరతుడు మందాకినీ పుణ్యోదకములందు స్వజనులతో గూడి స్నాన మొనరించి సంప్రీతుడయ్యెను. తదుపరి తన సేనా పరివారమును నదీ తీరమున వదలిపెట్టి గురువులు, తల్లుల వద్ద సెలవుతీసుకొని, గుహుని, శత్రుఘ్నుని వెంట నిడుకొని పాదచారియై శ్రీ సీతారామ లక్ష్మణులున్న పర్ణశాలకు పోయెను.

ఆశ్రమాభిముఖుడై పోవుచున్నప్పుడు అతని మనస్సు పరిపరి విధముల పరుగిడుచుండెను. ''నా పేరు విని సీతారామలక్ష్మణులు ఈ స్థలము వదలిపెట్టి మరెక్కడికైననూ పోయి ఉందురేమో! నా తల్లి చేసిన కుట్రకు నేను సహాయకారినని భావించి నన్నేమీ చేసిననూ నాకు చింతలేదు. నా అవగుణములు

సహించి నన్ననుగ్రహించిన అదియే పదివేలు. అతని పాదసేవ కంటే మరేమి కావలెను. ఆహా! చాతకమునకు స్వాతి చినుకులకు గల నియమము, చేపకు నీటిపై గల ప్రేమ ఎంత ప్రశంస నీయమైనవి!'' అని తర్కించుకొనుచుండెను.

తల్లిదోషములు తలుచుకున్నప్పుడు భరతుని పాదములు వెనుకకు బడును. శ్రీరాముని చరణములు మనస్సుకు వచ్చినపుడు అతని అడుగులు ముందుకు బడుచుండెను. నీటి ప్రవాహము మీద ఒకప్పుడు ముందుకు మరొకప్పుడు వెనుకకు ప్రాకుచుండు నల్లని పురుగువోలె అతడు సందిగ్ధస్థితిలో అడుగులు వేయుచుండెను.

ఇంతలో వారు ఆశ్రమమునకు మరింత సమీపమునకు వచ్చిరి. ఆ ప్రాంత వాతావరణము వారి హృదయములకు చల్లగ తగిలి మనస్సుకు హాయినిచ్చెను. ముచ్చటైన ముని గ్రామములు, చల్లని వృక్షచ్ఛాయలు, జంతువుల పరస్పర ప్రేమ, సెలయేరుల రొదలు, తుమ్మెదల ఝుంకారవములు, పక్షుల కల గానములు, మయూర మరాళముల నాట్యములు, ఫల పుష్పములతో నిండిన వృక్ష సంపద ఇత్యాదులచే కళ కళ లాడు చుండిన ఆ వనవైభవము చూచి భరతుడు సిద్ధిబొందిన తాపసివలె సుఖదుఃఖములు మరచి తన్మయుడై పోయెను!

అది శ్రీరాముని వనరాజ్యము. ఆ సురాజ్యములో ప్రాణి కోటికి బాధలు, తాపములు, దుఃఖములులేవు. ఈతి బాధలు లేక, సుభిక్షమై మనోజ్ఞముగ కన్పట్టిన ఆ రామరాజ్యమును చూచి భరతాదుల హృదయములు చల్లబడెను. స్వర్గీయ సుఖమనుభవించిరి.

అంతట నిషాదుడు అక్కడున్న పెద్ద చెట్టుపైకెక్కి, పర్ణశాలవైపు దృష్టి నిగుడించి భరతున కిట్లనెను-

''రాజా! అదిగో, అదియే ఆ వనము. ఆ వనము మధ్యలో ఒక పెద్ద వటవృక్షమున్నది. నల్లని ఆకులు, ఎర్రని పండ్లతో ఆ వృక్ష మెంత మనోహరముగ కన్పడుచున్నది! నదీ తీరమందున్న ఆ వృక్ష చ్ఛాయలోనే శ్రీరాముల పర్ణ కుటీరమున్నది. ఆ పర్ణశాల పరిసరములందు సీతా లక్ష్మణులు పెంచిన తులసీ వనమెంత బాగున్నది! జానకి ఆ వటవృక్షము క్రింద ఒక చిన్న వేదిక

నిర్మించుకొన్నది. దానిమీద కూర్చొని సీతారామలక్ష్మణులు నిత్యమూ ముని పుంగవుల వద్ద పురాణేతిహాస కథలు వినుచుందురు.''

భరతుడు ఆ వటవృక్షమునకు నత శిరస్కుడై నమస్కరించి ముందుకుసాగెను. అచ్చటచ్చట శ్రీరాముని చరణ చిహ్నములు కనబడినపుడు భరతుడు ఆదరము లభించిన పరమ దరిద్రునివలె పొంగిపోయెను. ప్రభువు పద చిహ్నములందున్న పాదరేణువులను తీసుకొని కన్నుల కద్దుకొనెను. భరతునికి భక్తి, ప్రేమ, అనురాగము అవలోకించిన చరాచర ప్రాణికోటి వెూదముతో మైమరచిపోయెను. భరతుని హృదయసముద్రమును విరహ దుఃఖముచే మథించి అందులో బుట్టిన ప్రేమామృతమును నరులకు దేవతలకు శ్రీరాముడు పంచి పెట్టుచున్నాడని మునీశ్వరులు తలంచిరి. భరతుని ప్రేమాదర్శము వీక్షించి అచ్చెరు వొందిన జడములు చేతనములయ్యెను. చేతనములు జడత్వము పొందెను.

భరతాదులు పర్ణశాలలో ప్రవేశించిరి. ఆ సుందర కుటీరము తరులతా వితానాచ్ఛాదితమై యుండుటచే లోనున్న వారు వీరిని చూడలేకుండిరి. సకల మంగళములకు, సమస్త శుభములకు అంద చందాలకు ఆకరమై నయనాభిరామ మనోహరముగ కట్టబడిన ఆ పర్ణశాలను భరతుడు ప్రప్రథమము దర్శించెను. పర మార్థము సిద్ధించిన యోగివలె భరతుని మనస్సు శాంతించి, హృదయము తృప్తిజెంది దుఃఖ దైన్యములు విస్మరించి మధురానుభూతిచే భరతుడు రాముని తో సంభాషించుచున్న లక్ష్మణమూర్తిని చూచెను. వేదికమీద మునుల మధ్య ఆసీనులై కొలువు దీరిన భక్తిసచ్చిదానందములవలె సీతారాములు ముని మండలి మధ్య శోభించుచుండిరి. అంతట భరతుడు ''పాహిమాం పాహిమాం'' అని పలుకుచూ శ్రీరాముని పాదపద్మముల మీద వ్రాలెను. లక్ష్మణుడు భరతుని గుర్తించి ''అన్నయ్యా! భరత సోదరుడు ప్రణామము చేయుచున్నా''డని రామునికి తెలియజేసెను.

## సోదరుల సమాగమము

ఈ మాటలు చెవుల బడగనే శ్రీరాముడు ప్రేమోద్విగ్నమానసుడై దిగ్గున పైకి లేచెను. ఆ ఆత్రముతో శ్రీరాముని పై నున్న ఉత్తరీయ మొకచోట, చేత

మున్న ధనుర్బాణములు మరొకచోట పడిపోయెను. శ్రీరాముడు భరతుని పైకి లేవనెత్తి, గుండెలకు చేర్చి గాఢాలింగనము చేసుకొని సుఖానుభూతి నొందెను. ప్రేమానురాగములు ముప్పిరిగొనుచుండ రామ భరతులు తన్మయులై పరస్పరము కలుసుకొన్న ఆ సుందర దృశ్యము నయనానందకరమైనది.

ఆ సోదరుల సమాగమము చూచినవారు ఆనందముచే వళ్ళు మరచి పోయిరి. కవీశ్వరుల వాక్యార్థ శక్తికి అతీతమైన ఆ సోదరుల స్నేహ వాత్సల్యానుబంధము వర్ణించుటకు హరిహర బ్రహ్మాదుల కైననూ అలవి గాదు.

రామ భరత సమాగమము సంభవించినందులకు దేవతలు దిగులుపడిరి. దేవగురువు నచ్చచెప్పిన మీదట దివిజాలకు ధైర్యము వచ్చెను.

రామలక్ష్మణులు శత్రుఘ్నుని నిషాదపతిని, గుహుని కలుసుకుని ప్రేమతో కౌగలించుకొనిరి. భరత శత్రుఘ్నులు అచ్చట ఉపస్థితులై యున్న మునిజనుల వద్ద దీవనలు పొందిన పిమ్మట వైదేహి చరణ కమలములకు నమస్కరించి ఆమె పాదధూళిని శిరస్సున చల్లుకొనిరి. జానకి తన కరకమలములతో భరత శత్రుఘ్నుల శిరస్సులు స్పృశించి మనస్సులో దీవించెను. మైథిలి ప్రసన్నురాలై యుండుట గమనించి భరతుడు నిశ్చింతుడయ్యెను.

ఆ సన్నివేశము అతి సున్నితమైనది. సంభాషణలకు అవసరములేని హార్దికమైన సమావేశ మది. ఆ వాతావరణములో ప్రసంగముల ప్రసక్తియే లేదు.

గుహుడు చేతులు జోడించి నిశ్శబ్దత నొకింత భంగపరచుచూ - ''ప్రభూ! మిమ్ము దర్శించుకొనుటకు గురువులు, తల్లులు, సచివులు, సేనానాయకులు, సాకేతవాసులు వచ్చియున్నా''రని రఘుకుల భూషణునికి విన్నవించెను.

దీనబంధువు దశరథరాముడు సౌమిత్రితో వెళ్ళి గురుచరణములకు సాష్టాంగపడి నమస్కారములు చేసెను. వసిష్ఠుడు రామలక్ష్మణులను పైకి లేవదీసి గాఢాలింగనము చేసుకొని ఆశీర్వదించెను. నిషాదపతి వసిష్ఠునికి కొంచెము దూర

ముగా నిలబడి తన పేరు చెప్పుకొని దండము పెట్టెను. మునీశ్వరుడు సాకేత రామునికి సఖుడగు గుహుని అప్యాయతతో ఆలింగనము చేసికొని ఆశీర్వదించెను. పసిష్ఠ డెక్కడ! నిషాదు డెక్కడ! ఆ యిరువురి ఆత్మలను ఏక సూత్రమునకు దెచ్చిన శ్రీరామభక్తి యొక్క మహిమను అమరులు అభినందించిరి.

దయాధాముడగు భగవానుడు అనుజ సమేతుడై ఆర్తులైయున్న అయోధ్యా వాసులను కలుసుకొని, పలుకరించి, పరామర్శించి, వారి అభీష్ట మీడేర్చెను. సాకేతవాసులు పలుమార్లు నిషాదపతి అదృష్టమును అభినందించి చేరదీసి సత్కరించిరి.

తల్లుల దయనీయస్థితికి శ్రీరాముడు మిక్కిలి చింతించెను. ప్రప్రథమమున రఘురాముడు కైకేయికి భక్తితో నమస్కరించి ఆమెను ఊరడించెను. తరువరి తల్లులందరికినీ పాదాభివందనము చేసి "అమ్మలారా! జగత్కార్యములన్నియు ఈశ్వరాధీనమైయున్నవి, కాబట్టి ఒకరిని నిందించి లాభములే"దని బోధించెను.

రామలక్ష్మణులు గురుపత్నికి పాదాభివందనము చేసి ఆమె ఆశీస్సులను పొందిరి. సుమిత్ర, కౌసల్యలు బిడ్డలను అంకము జేర్చుకొని ప్రియమార ముద్దిడుకొని మురిసిపోయిరి.

అనంతరము గురువు అనుజ్ఞతో రామలక్ష్మణులు ముఖ్యులను వెంటబెట్టుకొని పర్ణశాల లోపలికి వచ్చిరి. జానకి ఎదురొచ్చి గురువుకు, గురుపత్నికి సర్వులకు పాదాభివందనము చేసెను. మైథిలి తన అత్తగార్ల దుర్దశను చూడలేక కొన్ని క్షణములు కన్నులు మూసుకొనెను. అత్తగార్లు సుకుమారి జానకిని పర్ణశాలలో నిర్విషయాకృతయై యుండుట చూచి కంట తడిబెట్టుకొనిరి. భూపుత్రి గుండె కుదుటబరుచుకొని మువ్వురత్తలకు నతమస్తకయై నమస్కరించగా వారామె సౌభాగ్యమునకు ఆశీర్వదించిరి.

ఆ పైన కులగురువు అందరినీ కూర్చుండజేసి, సమయోచితముగ రామలక్ష్మణులకు జరిగిన సమాచారమంతయూ శ్రుతపరచెను. హృదయవిదారకమయిన తండ్రి మరణవార్త విని సీతారామ లక్ష్మణులు గుండెలు పగులునట్లు రోదించిరి. ధైర్యధురంధరుడు దశరథరాముడు తండ్రి ఆ దినమే స్వర్గమందుండెను. భావించి శోకార్తుడై విలపించెను. అనంతరము రామాదులు గంగలో స్నానాదులు

చేసి ఆ రాత్రి మంచినీళ్ళు కూడ ముట్టుకొనక ఉపవాసము చేసిరి. మరుదినము ప్రాతఃకాలమున దాశరథి వేదోక్తప్రకారము పితృకార్యములు ముగించి పరిశుద్ధుడాయెను.

## చిత్రకూట సభ

అట్లు రెండువాసరములు గతించిన పిమ్మట రఘుపతి కులగురువును సమీపించి వినయోక్తుల నిట్లు పలికెను:-

''గురువర్యా! తల్లులు, సోదరులు, సచివులు, కందమూలములు తిని ఇక్కడ కష్టముతో కాలముగడుపుచుండుట నేను చూడలేకున్నాను. అదియును గాక తండ్రి స్వర్గమందుండెను, మీ రిక్కడుంటిరి. కాబట్టి మీరు త్వరలో నగరమునకు ప్రయాణమగుట సముచితముగా నుండునని నా అభిప్రాయము. సర్వజ్ఞులైన మీకు నే నెక్కువ చెప్పుట భావ్యముగాదు.''

అని చెప్పగా అందుకు గురువు ''ఓ ధర్మధురంధరుడవైన రామచంద్రా! అయోధ్యావాసులు ఇప్పటికి నీ ముఖారవిందము చూసుకొని ఈ రెండు రోజులుగా స్వస్థచిత్తులై ఇచ్చట సుఖముగా నున్నారు'' అని వచించెను.

మొదట శ్రీరాముని మాటలు విని పురవాసుల మనస్సులు మహోదధి మధ్యలో గాలి దెబ్బలకు తల్లడిల్లు పడవవలె ఆందోళితము లయ్యెను. పిమ్మట గురువుగారిచ్చిన సమాధానము వారికి సంతృప్తి ఘటిల్లజేసెను. ఆ పైన సాకేత వాసులు చిత్రకూటములో నిత్యనూతనమైన ప్రాకృతిక దృశ్యములు తిలకించుచూ హాయిగా కాలము గడుపుచుండిరి. పుణ్య స్రవంతి మందాకినిలో ముప్పొద్దుల స్నానము చేసుకొని, శ్రీ సీతారాముని దివ్యమంగళ విగ్రహము నిత్యము దర్శించుకొని ఆనందపడుచుండిరి. వారు అప్పుడప్పుడు వనములందు, పర్వతములందు, నదీ తీరములందు విహారయాత్రలుచేయుచు అచ్చటి వన వైభవము నేత్రపర్వముగా చూచుచుండిరి. శిఖరములనుండి స్రవించు జలధారలు, ఫల పుష్ప సంభరితమైన వృక్ష సంపద, శీతల సుగంధ మందమారుతములు, రంగురంగుల పిట్టల వింత ధ్వనులు, కమలాకరములైన కాసారములు మున్నగు సుందర దృశ్యములు పట్టణ ప్రజలను బహు భంగుల ఆకర్షించెను.

రమ్యమగు వనసౌందర్యమును వారు ముగ్ధులై తృషితనేత్రముల చూడసాగిరి.

కోల భిల్ల శబర కిరాతాది ఆటవికులు, తేనె, ఫలములు, పుష్పములు, పత్రములు, కందమూలములు, ఓషధులు మున్నగు అడవి వస్తువులు కుప్ప తెప్పలుగా తెచ్చి వాటి గుణ విశేషములు వర్ణించి చెప్పుచూ సాకేతవాసులకు సమర్పించుచుండిరి. వానికి బదులుగా నగరవాసుల నుండి మూల్యము గ్రహింపక ఆ యాటవికు లిట్లు విన్నవించుచుండిరి:-

''అయ్యలారా! మీ దగ్గరనా మేము డబ్బు పుచ్చుకొనుట? అయ్యో! ఎంత అపరాధం! మీరు పుణ్యాత్ములు, మేము అధములము. మరుభూము లకు గంగధార కదలివచ్చినట్లు ఆ రామరాజు దయవలన మీరు మా వన భూములకు రాకరాక వచ్చితిరి. రామప్రభువు మా దొర! మా అన్నదాత, మా యేలినవారు. వారి మనుషులదగ్గర ధనముకై చేతులు చాపుట అపచారము గదా! దేవరా! మేము హీనులము, కొండజాతులవారము, పుట్టుదరిద్రులము. కానీ, మీ దగ్గర గిన్నెలు, గుడ్డలు దొంగలించము. మీరు మాకు మంచి అతి థులు. మేమిచ్చిన కాయగూరు తీసుకొని మాకు సంతోషము కలుగజేసిన పది వేలు. ఈ పదిరోజులు ఆ దొరగారితో కలసి తిరిగి నందున మాకీ దొడ్డ బుద్ధి కలిగెను'' అని కిరాతులు మంచి మనస్సుతో చెప్పెడి మాటలువిని నిత్యము వారు చేయు సేవాశుశ్రూషలు చూచి నగరప్రజలు ఆనందాశ్చర్యములు పొందుచుండిరి. ఈ వనవాసులకు గల అనురాగము, భక్తి, రామసేవా తత్పరత మనకులేదా! -యని విచారించిరి. ఇట్లు వనవాసులతో కలసి - మెలసి వనమందలి వింతలు విశేషములు తిలకించుచూ ఆ నాగరికుల మనశ్శరీరములు నానాటికి పుష్టమగుచుండెను.

మైథిలి ముప్పురు అత్తలకు ఏకకాలమున ముప్పురు కోడండ్రవలె సేవా శుశ్రూషలు చేయుచుండెను. సీతారామలక్ష్మణుల సరళ స్వభావము శ్రద్ధాభక్తులు సేవానిరతి స్నేహవాత్సల్యము చూచి అనుభవించిన అయోధ్యావాసులు ముగ్ధులైపోయిరి. విశేషించి కైకేయికి గలిగిన పశ్చాత్తాప మింతింతయని చెప్పరానిది. ముఖ మెత్తుకొని తిరుగలేక ఆ యభాగ్యురాలు అనుక్షణమూ పూర్వకృత పాప ఫలముకై మృత్యువు నాహ్వానించుచుండెను.

భరతుని మనస్థితి మరొక రీతిగ నుండెను. అతనికి అహర్నిశము అన్న-య్యను అయోధ్యకు తీసుకొనిపోవుటెట్లను ఒకే ధ్యాస, ఒకే చింత తప్ప, అన్యభావములేదు. ఈ ఆందోళనచే కడుపుకు అన్నము, కంటికి నిద్ర దూరమై క్రుంగిపోవుచుండెను. ఆ రాత్రి అతడిట్లు తర్కించెను.

''గురువుగారు చెప్పినట్లైన అన్నగారు అయోధ్యకు తిరిగి వచ్చుట కంగీక రించగలరు. కానీ ఆచార్యవర్యులు అగ్రజుని ఆంతర్యము తెలుసుకొని ప్రవర్తిం చెదరు. ఇకపోతే తల్లిగారి మాటను రఘుపతి కాదనజాలడు. అయితే కౌసల్య తల్లి ఆ నాడే అన్నయ్యను కాననములకు బొమ్మని ఆశీర్వదించి యుండెను. తుదకు నేనే అగ్రజుని అయోధ్యకు మరలమని అర్థించగలను. ఇంతకూ ఈ దాసుని అభ్యర్థన ఇక్కడ ఆలకించు వారెవ్వరు! హతవిధీ! ఇపుడు నాకు దారి యేది? మా తల్లి ఎంతపని చేసిపెట్టెను! చేతి కందుచుండిన పంట చేయిజారి పోయినట్లు మకుటధారణ చేయవలసిన మా రాముడు మర్రిపాలతో జడలు బిగించి కూర్చొనెను'' ఇవ్విధముగ చేరెడు నీటిలో చేప గిలగిలలాడునట్లు భర తుడు ఆశ నిరాశల మధ్య ఆలోచించుచూ ఆ రాత్రి గడపెను.

మరుదినము కులగురువు మంత్రులను, బ్రాహ్మణులను, ప్రజలను, భరత శత్రుఘ్నులను రాణులను పిలిపించి సభ చేసెను. ఆ సభలో వశిష్ఠుడు సమ యోచితముగ సభికులనుద్దేశించి ఇట్లు ఉద్బోధించెను.

''మహాజనులారా! మతిమంతుడవైన ఓ భరతా! నే జెప్పుచున్న మాటలు సావధానచిత్తులై ఆకర్ణింతురుగాక. ధర్మాత్ముడైన దాశరథి సూర్యవంశమునకు సూర్యునివంటివాడు. అతని అవతారధారణ ముల్లోకములకు మంగళప్రదమైనది. రఘురాముడు సత్యవ్రతుడు, సద్గుణ సంపన్నుడు, స్వవ శుడు. భూభారము నివారించుటకు, వేదమర్యాదలు రక్షించుటకు ఈ లోక మున అత డవతరించెను. జననీజనకుల ఆజ్ఞలు అనంతమైన జవదాటక శిరసా వహించి పాలించు ఆ ప్రభువు దృఢ సంకల్పము గుర్తించి, ఆంతర్యము గమ నించి, అభిప్రాయము తెలుసుకొని తత్ప్రకారము ప్రవర్తించుకొనుటయే మనకు శుభకరము. కనుక ఆ దేవుని అయోధ్యకు ఆహ్వానించుటకు యే విధానము అవలంబించిన ఉచితముగా నుండునో మీరే లెస్సగా ఆలోచించి తగు విధాన

మవలంబించ ప్రయత్నింతురని నా ప్రార్థన.''

గురు ప్రవచనములు విజ్ఞతా పూర్వకమై స్వామి పరమార్థముతో కూడు కొనియుండెను. సభా సదులకు యేమి సమాధాన మిచ్చుటకు తోచక శూన్య భావముతో ఇటూ అటు చూడసాగిరి.

అంతట భరతుడు పైకిలేచి వినమ్ర వాక్కుల నిట్లు ప్రవచించెను.

''మహాత్మా! మీరు తపోధనులు. మహిమా సమన్వితులు. విధివ్రాతను సైతము సరిదిద్దగల శక్తి సామర్థ్యములు గలవారు. మీరు మాబోటి వారిని ఉపాయమడుగుట మా దురదృష్టముగాక మరేమున్నది'' అని వచించి భరతుడు ఆగిపోయెను.

అంతట ఆచార్యుడు-

''భరతా! సంప్రతి నాకొక ఉపాయము తోచుచున్నది. అది యేమనిన - తమకున్న సర్వము పోగొట్టుకొనవలసిన పరిస్థితి యేర్పడినప్పుడు, విజ్ఞులైన వారు సగము వదలుకొని సగము రక్షించుకొనుటకు ప్రయత్నింతురని పండితులు చెప్పెదరు. తద్వతు, భరత శత్రుఘ్నులైన మీరిరువురు వనవాసము స్వీకరించిన సీతారామ లక్ష్మణులు అయోధ్యకు వచ్చుట కంగీకరించ వచ్చును గదా!'' అని తరణోపాయము సూచించెను.

''మహాజనులారా! మహర్షుల వారి అభిప్రాయము మాకు నిస్సంశయముగ అంగీకారమైనది. మా జన్మ సాఫల్యమునకు ఇంతకంటే మరొక సాధనమేమున్నది! మా జీవిత పర్యంతము కూడ కానన వాసము చేయుటకు సంసిద్ధులై యున్నాము. ఇక ఈ ఉపాయము కార్యోన్ముఖము గావించుట గురువుగారి మీద ఆధారపడి యున్నది.'' అని భరతుడు శపథపూర్వకముగ పలికెను.

భరతుని కృత నిశ్చయమునకు మునిరాజు ముదమందెను. సభాసదులు శ్లాఘించిరి. ఆ పైన వారందరు కలసి శ్రీరాముని వద్దకు వెళ్ళిరి. వినయ శీలుడు రాముడు సర్వులను సమాదరించి సుఖాసీనులను జేసెను.

వశిష్ఠుడు మున్నగు పెద్దలు ధర్మాధర్మములు న్యాయాన్యాయములు తెలిసిన

నీతి విశారదులు. వారు యెంత తర్కించి విచారించినను ఈ సమస్యకు సమాధానము పొందలేకుండిరి. రాముని కర్తవ్యమునకు భరతుని పరితాపము నకు సాకేత వాసుల సంతాపమునకు సమన్వయము సాధించుట కష్ట సాధ్యముగ నుండెను. తండ్రి మాట తృణీకరించి వన వాసమునకు స్వస్తి చెప్పుమని శ్రీరా మునికి చెప్పుట ధర్మ విరుద్ధము. అతనికి బదులు భరతుని అడవులకు బొమ్మనుట న్యాయ సమ్మతముగాదు. కానీ ప్రజలను భరతాదులను సంతోష పెట్టుటకు యేదో ఒక పరిష్కారము సూచించవలసి యుండెను. ధర్మ చింతన గల పెద్దలు ఎవరికి వారు ఏమియూ తోచక నిరుత్తరులగుచుండిరి. అంతట వశిష్ఠుడు సమయానుకూలముగ నిట్లు ప్రారంభించెను-

"ఓ జగదభిరామా! నీవు అందరి హృదయములలో నివసించువాడవు. అందరి అంతర్యములు ఎరిగిన సమర్థివి. సర్వ ప్రియుడవై యున్నావు. మా సంగతి వేరు - జూదగాడు ఎప్పుడూ తన లాభమే చూచుకొనుచుండునట్లు మా సూచనలు సర్వ సమ్మతముగా నుండక స్వార్థసాధకములై యుండును. కనుక నీవు ప్రస్తుతము నీ తల్లులకు, సకల ప్రజలకు విశేషించి భరత సోదరు నికి సంతృప్తికరమైన మార్గోపాయము సూచించమని మా అభ్యర్థన." అని సూచించెను.

"గురువర్యా! మీకు తెలియని ఉపాయమేమున్నది! మీ యాజ్ఞ మాకు శిరోధార్యము. మీ సమ్మతి మాకు శ్రేయోదాయకము. మీ అభీష్టప్రకారము ప్రవర్తించెదము" అని సీతాపతి చెప్పగా-

"దాశరథీ! నీవు నిజమాడితివి. కానీ భరతునిపైగల ప్రేమ నన్ను చలింప జేయుచున్నది. అతని ప్రేమకు నేను వశుడనైతిని. శివుని సాక్షిగ భరతునికి హితము చేయుటము నా ఆశయము. రామా! నీవు మొదట భరతుని ప్రార్థన ఆలకించి పిమ్మట శాస్త్ర సమ్మతము, నీతి యుక్తమైన మార్గమవలంబిం పుము." అని గురువు చెప్పెను.

భరతుని యెడల గురువునకు గల ప్రేమానురాగములకు రఘునందనుడు హర్షించి శుభవాక్కుల నిట్లు సమాధానమిచ్చెను.

"ఋషి పుంగవా! మీ సాక్షిగ, తండ్రి పాదముల సాక్షిగ భరతుని వంటి

సోదరుడు ఈ భువిలో మరొకడు లేడు. గురు ప్రేమకు పాత్రుడైన భరతుడు అభినందనీయుడు, అదృష్టవంతుడు. నా కంటే చిన్నవాడయినా భరతుని భావ మెరిగి ప్రవర్తించుటే శుభకరమని నా యభిప్రాయము.''

అంతట వశిష్ఠుడు భరతుని లక్షించి ''భరతపుత్రా! దాపరికము లేకుండా నీ అభిప్రాయము అగ్రజుని కెరిగించు''మని ఆదేశించెను. ఆచార్యుడు, అగ్ర జుడు అంత భారమును తనపైననే వేయుచున్నందుకు కొంచెము తటపటా యించి, సభ యెదుట నిలబడి సజలనేత్రుడై సవినయముగ నిట్లు పలికెను-

''ఆదరణీయులైన ఆత్మీయులారా! ఆచార్యులవారు అంతయు సెలవి చ్చిరి. ఇక నే చెప్పవలసిన దేమున్నది! రామమూర్తికి నాపై గల అనురాగము అపారమైనది. చిన్న తనమున ఆటపాటలందు సైతము అన్నయ్య నన్ను నొప్పించి యెరుగడు. బాల్యము నుండి వారిని నేను యెడబాసిన క్షణము లేదు, వారి యెదుట ప్రసంగించిన సందర్భము లేదు. నా ఆనందము చూచి ఓర్వలేక ఆ బ్రహ్మ నా తల్లి ద్వారా మా భ్రాతృప్రేమకు విఘాతము ఘటిల్ల జేసెను.

''అంత మాత్రము చేత మా తల్లిని దోషి, మూర్ఖురాలు అని నిందించి, నేను నిర్దోషిని, మతిమంతుడనని సమర్థించుకొన జూచుట సబబుకాదు. నత్త గుల్లలో ముత్యములు ఉండనట్లు కుమాత కడుపున సుపుత్రుడెట్లు ఉద్భవిం చును? నా పాప ఫలమునకు తల్లిని దూషించి లాభములేదు. నాకు ప్రాయశ్చి త్తమునకు మార్గమే లేదు. అయితే నా గురువులను నా యగ్రజుని చూచుకు న్నపుడు నా కొకింత ధైర్యోత్సాహములు కలుగుచున్నవి.

''ఈ పుణ్య స్థలమందు పూజ్యులయిన ఆచార్యులు, అగ్రజుల యెదుట, నేనిట్లు లోకరీతికై మాట్లాడుచున్నానో లేక నా హృదయము లోని యథార్థమే పలుకుచున్నానో సర్వాంతర్యాములయిన మీకు తెలియని రహస్యము గాదు.

''మహారాజు ప్రేమాధీనుడై ప్రాణత్యాగము చేసినను ప్రతిజ్ఞ మాత్రము నిలబెట్టుకొనెను. నా తల్లుల దుఃఖమునకు, ప్రజల వేదనకు, నగర వాసులపరి తాపమునకు నేనేహేతువనుట నిశ్చయము, నిర్వివాదము. సీతారామలక్ష్మణులు నారగుడ్డలు కట్టుకొని, పాదచారులై, నిరాశ్రయుల వలె గుట్టలకు వెళ్ళిరను

దారుణవార్త విన్నప్పుడు గానీ, ఆ పూజ్యుల యెడల విషాదవతి చూపెట్టిన స్నేహ సద్భావములు తెలుసుకున్నప్పుడు గానీ, లేక ఇక్కడ ఈ స్థితిలో వున్న అగ్రజాదులను కండ్లతో చూచినప్పుడు గానీ నా గుండె ముక్కలుగాలేదు. నా శరీరము నుండి ప్రాణము లెగిరిపోలేదు! అయ్యో! నాది కటిక గుండె. నేను నిర్దయుడను, నేను ఘోరమైన దోషిని.

సుహృజ్జనులు! ప్రేమ స్వరూపులైన సీతారాములను కైక శత్రువులని భావించెను. ఆమె విషహృదయము జూచి పాములు, తేళ్ళు సైతము తమ విషము వదులుకొని సిగ్గుతో తలవంచెను. ఆ తల్లికి బుట్టిన నన్ను వదలిపెట్టి ఆ భగవంతుడు మరెవ్వరికి ఘోర దుఃఖము విధించగలడు.''

భరతుని ప్రసంగ మందలి ప్రతి అక్షరము, ప్రతి పదము, ప్రతి వాక్యము వినయము, అనురాగము, పశ్చాత్తాపములతో తొణికిస లాడెను. అనుభావోద్వేగముచే భరతుని కంఠము రుద్ధమై నేత్రములు బాష్పపూరితము లయ్యెను. తుషారపాతము కలిగిన తామరల వలె భరతుని దైన్య స్థితికి సభికులు విచారగ్రస్తులైరి.

రాముడు రవికుల కైరవ చంద్రుడు గదా! చల్లని మాటల నిట్లు భరతుని తాపము శాంతింప జేసెను:

''ప్రాణ ప్రియుడవైన ఓ భరతా! సకల కర్మగతులు ఈశ్వరాధీనమై యున్నవి గాబట్టి నీవు నిష్కారణముగ ఖేదించ పనిలేదు. ఏ మాత్రమూ సాధు సాంగత్యము చేయని మూర్ఖులే మన తల్లిని దోషిగా పేర్కొనుటకు సాహసించగలరు. నిత్యనిర్మలుడవైన నిన్ను కుటిలుడని భావించువారు ఇహ పరలోకములకు దూరులగుచున్నారు. భరతా! ఆ శంకరుని సాక్షిగ ఈ భూమి నీ వలనే నిలబడి యున్నది. నీ వంటి పుణ్య శ్లోకుడు ఈ ముల్లోకములందు వెదకినా గానరాడు.

సోదరా! నీ సంకట స్థితి నాకు తెలియక పోలేదు. అయితే యేమి చేయుటకు నాకు దిక్కు తోచకున్నది. తండ్రిగారు నన్ను త్యజించి మాట నిలబెట్టుకొనిరి. ఆ పైన నాపై వ్యామోహముచే అసువులు బాసిరి.

ఒకవైపు తండ్రిగారిమాట తప్పలేను. మరొకవైపు నీమ్లాన వదనము చూడ లేకున్నాను. అదిగాక గురువుగారి ఆజ్ఞ ఉల్లంఘించజాలను. భరతా! ఇట్టిసందిగ్ధ స్థితిలో నేనున్నప్పటికీ నీ మాట ప్రకారము వర్తింతునని నీకు మాట ఇచ్చుచు న్నాను. కనుక నీవు నిర్భయముగ నీమదిలోని మాట వెల్లడించ వలసినది.''

శ్రీరాముని ఉదారభావమునకు ఇక్కడ చిత్రకూటమందలి సర్వజనులు సంతోషించిరి. కానీ అక్కడ స్వర్లోకవాసులు స్వకార్యము చెడునున్నదని శంకా తురులై ఆలోచింపసాగిరి.

శ్రీరాముడు భక్త పరాధీనుడు, అతడు భరతుని ప్రేమకు కట్టుబడి మాట ఇచ్చెను. అతడు భరతుని ఆశయ ప్రకారము అయోధ్య ప్రయాణము తలపె-ట్టిన రాక్షస సంహారము ఆదిగా గల దేవకార్యములు స్తంభించి పోవును.

ఆహా! భరతుడెంత బలవంతుడు!! పరమభక్తుడైన ఈ భరతుని యేమి చేయుటకును భయముగా నున్నది. అంబరీష దూర్వాసుల చరిత్ర పాఠములు మనకు తెలిసినవే గదా!'' అని విచారించుచున్న ఇంద్రాది దేవతలకు బృహస్పతి -''అయ్యలారా! భరతుడు తన స్వచ్ఛమైన భక్తిచే శ్రీరాముని వశము చేసుకొ నెను. ఆ భక్తాగ్రేసరుడైన భరతుని స్మరించువారికి సీతాపతి నూరు కామధేను వులతో సమానమైన ఫలమిచ్చును. భరతుడు శ్రీరాముని ఛాయగాక మరొక్క-డుగాదు. కాగల కార్యములు ఇదివరకే విధి నిర్ణయించె. కాబట్టి మీరు బెగ డొంద పనిలేదు. కడకు సర్వాంతర్యామియైన ఆ రఘుపతి సంకల్పానుసారమే సర్వకార్యములు సంపన్నము కానున్నవి'' అని దేవగురువు దివిజాలకు నచ్చజెప్పి ఊరడించెను.

ఇక్కడ భరతుడు - ''నాపై ప్రేమచే నా ప్రభువు నామాట ప్రకారము వర్తించుటకు తన ప్రతిజ్ఞను కూడ వదలి పెట్టుటకు సిద్ధపడెనుగదా!''యని ఊహించి ప్రసన్న మానసుడై అంజలి ఘటించి ఇట్లు అర్థించెను-

''ఓ దయానిధీ! సర్వాంతర్యామివి, సర్వజ్ఞుడవైన నీకు నేనేమి చెప్ప గలను, చెప్పించగలను! నా స్వామి నా కనుకూలుడుగా నుండెనని తెలుసుకొని నేటికి నా భయ సందేహములు తీరిపోయెను. మీరు ప్రణతపాలకులని వేదములు చెప్పినమాటను నిలబెట్టితిరి. మీయందున్న ఆశ్రితవాత్సల్యము

అనన్య సామాన్యమైనది. అది ఈ నాటిది గాదు. దేవా! మీ హృదయము కల్పవృక్షము వంటిది. దాని నాశ్రయించిన సజ్జనులకు, దుర్జనులకు సమాన ముగా సత్ఫల ప్రాప్తి కలుగుచున్నది. నేను మీ స్నేహచ్ఛాయఃను చేరుకొంటిని, నా చిత్తము శాంతించెను, నా శంకలు తొలగెను, నేను స్వస్థచిత్తుడనైతిని. ఈ సేవకుడు మీ ఇష్టానుసారము నడచుకొనుటకు సంసిద్ధుడై యున్నాడు.

''ప్రభూ! పట్టాభిషేకమునకు కావలసిన సంభారములు నా వెంట దెచ్చి తిని. వానిని మీరు వినియోగించ వలసినదిగా నా ప్రార్థన. అగ్రజా! మరొక విన్నపమున్నది. అది యేమన-

మీరు అయోధ్యకు మరలి, మీకు బదులు నన్ను శత్రుఘ్నుని అరణ్య వాసము చేయుటకు అనుమతించ వలసినది. లేక లక్ష్మణ శత్రుఘ్నులను అడ వులకు బంపినయెడల నేను మిమ్మనుసరించి అయోధ్యకు రాగలను. అథవా మమ్ము ముగ్గురిని వనవాసము చేయుట కనుజ్ఞ నొసంగిననూ సంతోషమే. రామా! శాస్త్రజ్ఞానము, రాజ్యధర్మము, లోకనీతికి అనభిజ్ఞుడైన నేను తెలి- సియో తెలియకయో ఇవ్విధముగా స్వార్థ భావముతో ప్రతిపాదించినందుకు, క్షమింపవలెను.

ఓ రామచంద్రా! ఇక మీరు ఆజ్ఞాపించడమే తరువాయి, తదను సారము మేము వర్తించగలము. మీ సంతోషమే మా సంతోషము, మీ విధానమే జగత్క- ల్యాణము, మీ ఆశయమే మాకు మంగళకరము. మీరు నిస్సంకోచముగ మీయభిమత మెరిగించ వలసినదిగా ప్రార్థన'' నిశ్చలభక్తితో గంభీరభావముతో గర్భితమైన భరతుని వాక్యములు విని సభాసదులు సాధువులు స్వర్లోక వాసులు సంతసించిరి. అయోధ్యావాసులు ఆందోళితులైరి. సీతాపతి సంశయముతో మిన్నకుండెను: దాశరథి యేమి సమాధాన మిచ్చునాయని వినుటకు అందరు ఆత్రముతో నుండిరి.

సరిగా ఆ వేళకు జనకుని దూతలు అచ్చటికి వచ్చిరి. వశిష్ఠుడు జనకా దుల క్షేమములను గురించి వారిని ప్రశ్నించగా ఆ దూతలు కేలు మోడ్చి ఇట్లు విన్నవించిరి-

''ఓ మునివర్యా! ఇంకెవరి క్షేమము అడుగుచున్నారు! సకల క్షేమములు

ఆ సాకేతపతితోనే అంతరించెను గదా! స్వామీ! దశరథ మహారాజు స్వర్గమునకు విజయము చేసిరనీ, సీతా రామ లక్ష్మణులు కాననసీమల కేగిరని విని మిథిలేశుడు, మిథిలావాసులు అమిత విషాదాశ్చర్యములు బొంది శోక సంతప్తమానసులైరి. ఆ పిమ్మట జనకప్రభువు సచివ సామంతులతో సమాలోచించి మతిమంతులగు నలుగురు దూతలను పిలిపించెను. వారిని అయోధ్యకు వెళ్ళి కైక పుత్రుని స్వభావము సద్భావమో లేక దుర్భావమో తెలుసుకొని రమ్మని ఆజ్ఞాపించి పంపెను. ఆ దూతలు హుటాహుటి అయోధ్యకు వెళ్లి అక్కడి సంగతి సందర్భములు తెలుసుకొని వచ్చిరి. వారు మిథిలేశునికి భరతాదులు చిత్రకూటము నందున్న శ్రీరాముని సన్నిధికి పోయినారని విన్నవించి, భరతుని శీల సద్గుణములను వేనోళ్ళ శ్లాఘించి చెప్పిరి.

ఇది తెలిసిన తత్క్షణమే చక్రవర్తి రెండు ఘడియలలో చిత్రకూట ప్రయాణమునకు సర్వసన్నాహములు పూర్తి చేయించి, సచివ, సైన్య, స్వజన, సేవక, పరివార సమేతుడై ప్రయాణము సాగించెను. మార్గమం దెచ్చటను విశ్రమించక వారు ఆ ప్రాతఃకాలమునకు ప్రయాగ చేరుకొనిరి. యమున దాటుచున్న సందర్భమున మిథిలేశుడు మమ్ము ముందుగా వెళ్ళి ఈ సమాచారము మీకు అందజేయుమని చెప్పి పంపెను'' అని విన్నవించిరి. అంతట గుహుడు ఆ దూతలకు ఆరేడుగురు భిల్లులను తోడిచ్చి జనకాదులను తోడ్కొని రమ్మని చెప్పి పంపెను. జనక చక్రవర్తి ఆగమన వార్తకు అయోధ్యావాసులు హర్షించిరి. సాకేత రాముడు సంశయస్థితిలో పడెను. ''వారికినే నేమని సమాధాన మీయ గల''నని కైక పరితపించెను. ఈ ప్రకార మా రాత్రి గతించెను.

మరుదినము ఉదయమునే సాకేతవాసులు మందాకినీ పుణ్య సలిలంబుల స్నానసంధ్యలు పూర్తిచేసుకొని, విఘ్నేశ్వరుని పూజించి శివ పార్వతులను స్మరించి, సూర్య భగవానునికి సాష్టాంగ మొనర్చి జానకీపతిని దర్శించిక్కొని ఇట్లు ప్రార్థించిరి.

''ఓ దయామయా! మా రామమూర్తి రాజు కావలెను. మా జానకి రాణి కావలెను. మా భరతుడు యువరాజుగా నుండవలెను. తిరిగి అయోధ్య ఆనందధామమై వర్ధిల్లవలెను.

రాముని రాజ్యములో సుఖముగ కన్నులు మూయుగల సదవకాశము మాకు లభించుగాక' అని స్త్రీ పురుషులు అంజలిబద్ధులై భక్తితత్పరతతో రమారమణుని ప్రార్థించిరి. అవధవాసుల అంతఃప్రేమ, వారి ఆత్మార్పణ భావము చూచి అక్కడున్న మునులు శిరములు వంచి సిగ్గిలిరి.

## జనకుని ఆగమనము

ఆ సమయమున జనక భూపాలుడు వచ్చెనని తెలిసి రఘురాముడు, తమ్ములు, గురువులు, మంత్రులు, పురజనులు ఎదురేగి వారిని సాదరముగ తోడ్కొనివచ్చిరి. శోక సంతప్తమానసులయిన అవధవాసులు, మిథిలవారు ఒండొరులు కలుసుకొని పలుకరించుకొని ఒకింత ప్రశాంతసంపాదకులైరి.

మహాప్రశాంతమయిన చిత్రకూట స్థలము తరంగ సంరంభ రహిత మయిన ఒక శాంత సాగరము. దుఃఖితులు - ఆర్తులు, వికలచిత్తులయిన మిథిలా పురవాసులు అయోధ్య ప్రజలు కల్లోలిత కరుణారస ధారలవలె చిత్రకూట సాగరము చేరుకొని కొంచెము స్వస్థచిత్తులై శాంతించిరి.

అవధేశుని అస్తమయము, రామాదుల వనగమనము మున్నగు విషయములు పరస్పరము సంప్రదించుకొని ఆ రెండు రాజ్య సమాజములవారు నానావిధముల శోకించిరి. సాధువులు, మునీశ్వరులు, భిల్లులు వారిని బహువిధముల కోదార్చిరి. జ్ఞానధనుడు వైరాగ్య సంపన్నుడైన జనకుని దైన్యస్థితి హృదయవిదారకమై యుండెను. వశిష్ఠుడు అనేక తత్త్వబోధలు చేసి ఆ రాజర్షిని ఊరడించుటకు ప్రయత్నించెను. ఆ దినము ఉభయులూ రామఘాట్‌లో స్నానము చేసి నాటి రాత్రి నిర్జలోపవాసముతో గడిపిరి. పశుపక్ష్యాదులే రామ వియోగము వలన అన్నాహారములు వదలిపెట్టినపుడు ఇక ప్రియ బాంధవుల సంగతి చెప్పవలెనా!

మరుదినము నిమిరాజు, రఘురాజుల సమాజముల వారు వ్యసనమానసులై వటవృక్షము క్రింద సమాసీనులైరి. అప్పుడు విశ్వామిత్ర, వశిష్ఠ, శతానందాది బ్రహ్మజ్ఞులు జ్ఞాన, వైరాగ్య ప్రధానమైన నీతి కథలు బోధించి ఆ రాజ్యప్రజలకు ధైర్య స్థయిర్యములు కలిగించుటకు ప్రయత్నించిరి. అప్పటికి

అపరాహ్ణము దాటెను. నిన్నటి నుండి మిథిలా వాసులు ఉపవాసములు చేయు చున్నారని శ్రీరాముడు కౌశికుని కెరిగించెను. అది గమనించిన జనక భూపతి విశ్వామిత్రునితో "మునీశ్వరా! ఇక్కడ అన్నము భుజించుట సముచిత ముగ నుండదని నా భావన కాబట్టి కందమూల ఫలాదులు స్వీకరించి సంతృ ప్తులము కాగలము" - అని తెలియజేసి భోజనము చేయుటకు లేచిరి.

రామ ప్రభువు ప్రసన్న దృష్టి ప్రసరించగనే ఆ వనప్రాంతమంతయు సకల ఫలదాయకమై కాన్పించెను. లతావృక్ష సముదాయము ఫల, పత్ర, పుష్పములచే ప్రకాశించెను. నదీతటాకములు మధురజల పూరితములై భాసించెను. శీతల సుగంధ పవనములు మందమందముగ వీచెను. భూదేవి తన బంధుడగు చక్రవర్తికి ఆనంద పారవశ్యముతో ఆతిథ్యమిచ్చుచున్నదా యన్నట్లు చిత్రకూట ప్రకృతి వివిధ సంపదలచే విరాజిల్లెను. జనకుని పుత్రిక జానకి భూపుత్రి గనుక భూదేవి సంబరపడడములో ఆశ్చర్యమేమున్నది? వశిష్ఠుడు అమృతోపమాన మగు కందమూల ఫలాదులను కావడుల కెత్తించి భిల్లులచేత జనకునికి పంపిం చెను. మైథిలేయులు మధుర ఫలాదులు ఆస్వాదించి పరితృప్తులయిరి.

నిత్యము మువ్పొద్దులా మందాకినిలో స్నానపానాదులు చేయుచూ మంగళ ప్రదమగు శ్రీరాముని దివ్య దర్శనము చేసుకొనుచూ, మధుర ఫలాదులచే పరి తృప్తులగుచూ, మునిజనుల సుందర కుటీరములను తిలకించుచూ, వన ప్రాంతములందు హాయిగ విహరించుచూ ఆ నగరవాసులు నాల్గు దినములు ఆహ్లాదముతో గడిపిరి. జానకీ రాములతో కూడిన వనవాసము వారికి కోటి స్వర్గములకంటె సుఖతరముగా నుండెను. ఇట్లు చతుర్దశ వర్షంబులు ఆ వన ప్రాంతమందే గడిపిన యెంత బాగుండునని ఆ నాగరికులు ఊహించుకొని ఉత్సాహపడుచుండిరి.

ఒక దినము - జ్యేష్ఠ శుద్ధ ఏకాదశినాడు - జనకుని రాణి సునయన రఘుకుల రాణులను దర్శించుటకు వారున్న చోటుకు వచ్చెను. కౌసల్య సునయనను అత్యంతాదరముతో ఆహ్వానించెను. సునయన ప్రీతిపూర్వకముగ వారిని పలుకరించి, పరామర్శించెను. ఆ రాణుల కలుపుగోలుతనము, వారి సహృద్భావము, సౌజన్యము, ప్రేమానురాగములు జూచిన వజ్రహృదయము

కూడ కరిగిపోవును. గడచిన దుస్సంఘటనలు వరుసగా ఒకరి కొకరు తెలియ జేసుకొని విచారవిద్ధలైన ఆ యంతఃపుర కాంతలు అప్పుడు మూర్తీభవించిన కరుణ ధనమో యన్నట్లగుపడిరి. అప్పుడు సునయన ఇట్లు తర్కించెను.

''ఆహా విధి బుద్ధి ఎంత విపరీతమైనది! పాల నురుగును భేదించుటకు వజ్రాయుధమును ప్రయోగించెను. అమృతము, హాలాహలము ఒకే చోట పుట్టించిన ఆ బ్రహ్మ సృష్టి ఎంత విపరీతమైనది?''

సుమిత్ర ఇట్లు విచారించెను:-

''జగములు సృష్టించి, సంతరించి, సంహరించెడి ఆ జగదీశుని లీలలు కడు విచిత్రములైనవి.''

అంతట కౌసల్య ఇట్లు బోధించెను:

''సుఖ దుఃఖములకు, లాభాలాభములకు మూలకారణమైన కర్మలు ఈశ్వ రాధీనమైనవి. వున శుభాశుభ ఫలములకు ఇతరులను పేర్కొనుట భావ్యముగాదు. మహారాజు జీవించెను - మరణించెను. వారి జీవన్మరణము- లతో అది మంచిది, ఇది చెడ్డది- అని మన లాభదృష్టితో మనము గణించుచు- న్నాము. ఇందులో భగవత్సంకల్ప మేమైయున్నదో మనకు తెలియదు గదా!

''ఓ సునయనా! సీతారాముల వనవాసము సుఖాంతమై యుండనోపు నని నా దృఢ అభిప్రాయము. అయితే ఈ లోగా రామమూర్తి వియోగమును భర- తపుత్రుడు భరించలేడని నాకు దిగులుగా నున్నది. ఓ దేవీ! నీతో నాదొక మనవి. నీవు సమయము చూచి జ్ఞానధనుడైన జనకరాజుతో ఒక్క విషయము ప్రస్తావించవలెను సుమా! అది ఏమన - సౌమిత్రి గృహమువద్ద యుండు నట్లును, సీతారాముల వెంట భరతుడు వనమునకు వెళ్ళునట్లును చక్రవర్తి గారి కిని బోధించవలసినదిగా వేడుకొనుచు. ఓ రాణీ! అట్లు గానియెడల భరతుడు రాముని వదలి నిలువలేడని నా మదికి భయముగా నున్నది.''

అని కౌసల్య ప్రాధేయపడెను. ఆమె మాతృ హృదయము, ఆమె నిర్మల స్వభావము తెలుసుకొని అంతఃపురాంగనలు ఆ నంద విహారులైరి. ఇట్లు వారు ఆవేదన పడుచుండ రాత్రి రెండుజాములు గతించెను. అంతట మిథిలేశ్వరి

కౌసల్యాది రాణులవద్ద సెలవు పుచ్చుకొని వారి అనుమతిపై జానకిని వెంటబె-ట్టుకొని నిజ నివాసమునకు మరలిపోయెను.

సీత స్వజనులను కలుసుకొని సంతోషించెను. తపస్విని వేషములో నున్న రాజకుమారిని జూచి బంధుబృందము పరితపించెను. శ్రీరాముని వద్ద నుండి అప్పుడే అచ్చటికి వచ్చిన జనకుడు ముద్దుబిడ్డ మైథిలిని ఆప్యాయతతో అంక మున జేర్చి శిరము మూర్కొని ఆనందమగ్నుడయ్యెను. జానకి ధరించిన నార చీరలు చూచి జనకుడు హర్షించి-

''బిడ్డా! మైథిలీ! నీ సచ్చరిత్రవలన నీవు పుట్టిన వంశము, మెట్టిన వంశము పునీత మయ్యెను. ఉజ్జ్వలమైన నీ కీర్తి గంగవలె కలకాలము నిర్మలమై నిశ్చలమై నిలుచుగాక'' అని కీర్తించి దీవించెను.

జననీ జనకులు పలుమార్లు జానకిని ముద్దాడి ముచ్చట దీర్చుకొనిరి. ఆమె వారి స్నేహ వాత్సల్యములకు సిగ్గిలెను. అప్పటికే రాత్రి ఎక్కువగుట గమనించిన సీత ఈ రాత్రికి స్వామిని వదలి తా నిక్కడ ఉండుట ఉచితముగా నుండదని భావించి, మనసులోని మాట పైకి చెప్పలేకుండెను. సీత సున్నిత హృదయము గుర్తెరిగిన తల్లి వెంటనే ఆమెను ప్రేమాదర పూర్వకముగ వీడ్కో లిచ్చి పర్ణశాలకు పంపించెను.

వైదేహిని వీడ్కొలిపిన పిమ్మట సునయన భరతుని గురించి కౌసల్య చేసిన సూచన జనకుని ఎదుట ప్రస్తావించెను. బంగారుకు తావి వంటి, చంద్రామృ తమునకు సమానమైనట్టి భరతుని లోకోత్తరచరిత్ర తలంపుకు వచ్చి విదేహుని నేత్రములు, ఆనందాశ్రుపూరితము లయ్యెను.

''ఓ సుముఖీ! ఈ ముల్లోకములందు భరతునికి భరతుడే సాటియని తెలుసుకొనుము. అతని చరిత్ర గంగానది వలె పవిత్రమైనది. అమృతము వలె రుచ్యమైనది. అపారమైన భరతుని చరిత్ర మహిమ ఒక్క శ్రీరామునికే చక్కగ తెలియుగలదు. శ్రీరాముని ప్రీతి, భరతుని ప్రతీతి (విశ్వాసము) తర్కమునకు, ఊహకు అందనివి, అవగతవముకానివి. భరతుని సమత్వము, రామ చంద్రుని సమత్వము సాటిలేనివి. ఓ రాణీ! భరతుని దృష్టిలో స్వార్థచింతన

లేదు. అతడు అగ్రజుని ఆజ్ఞ యే పరిస్థితులలోను ఉల్లంఘించజాలడు. కాబట్టి నీవు విశేషించి విచారించవలసిన పనిలేదు.'' అని సమాధాన మిచ్చెను.

మరుదినము సూర్యోదయానంతరము నిత్య కృత్యములు నిర్వర్తించిన పిమ్మట శ్రీరాముడు గురువును సమీపించి - ''మహాత్మా! నా నిమిత్తమై ఇక్కడ మన ఉభయరాజ పరివారములు విచారగ్రస్తులై కాయ కష్టములు పడుచున్నారు. ఇప్పటికే చాల దినములు గడిచిపోయెను. మీ దృష్టికి ఉచితమైన మార్గము సూచించి హితవు చేయవలసిన''దని ప్రార్థించెను.

''వత్సా! రామమూర్తీ! వారికి ప్రాణము, సుఖము, సంతోషము, సర్వమూ నీవే. నిన్ను విడచి వారు స్వగృహముల కెట్లు వెళ్ళగలరు? నిన్ను దర్శించడమందే వారికి సుఖము, నిన్ను ఎడబాయుట యందే వారికి దుఃఖము కలుగుచున్నవి. సర్వాంతర్యామివగు నీకు దెలియని దేమున్నది! నీవు ఆశ్రమమునకు వెళ్ళుము. నే నిప్పుడు వచ్చెద'' నని చెప్పి గురువు రాముని వీడ్కొలిపి తాను జనకుని వద్దకు పోయెను.

వసిష్ఠుడు జనక భూపాలునితో ''రఘురాముడు గృహమునకు వచ్చుటో లేక గహనాంతరము లందుంటయో ఏదో యొక మార్గము నిర్దేశించి, ఈ సందిగ్ధ స్థితిని నివారింపజేయుమని అర్థించెను.

జ్ఞానఘనుడగు జనకభూపతికి సైతము తరుణోపాయము గానరాక విచికిత్సకు లోనయ్యెను. రాజాజ్ఞకు విరుద్ధముగ శ్రీరాముని అయోధ్యకు మరలించుట ధర్మవిరుద్ధము. అట్లుగాక యథాప్రకారము శ్రీరాముని అడవులందే ఉండుమని చెప్పుటకు నోరాడదు. భరతాది ప్రజల ప్రేమకు, శ్రీరాముని ధర్మ నిర్వహణకు భంగకరముగాని మధ్యేమార్గ మేదియని స్ఫురించక డోలాయమానమానసుడై విదేహపతి దిక్కుతోచక అచ్చట నుండి భరతునికడకు వచ్చి-

''భరతా! ఒక వైపున తండ్రి ఆజ్ఞ, రెండవ వైపున తమ్మునిపై ప్రేమ- ఈ రెండిటిలో దేని ననుసరించవలెను, దేనిని త్యజించవలెను? - అను ధర్మసందేహమునకు లోబడి రాముడు ఏమియు చెప్పలేకున్నాడు. ఇట్టి స్థితిలో సంప్రతి నీవే యిందుకొక మార్గమును సూచింపగల సమర్థుడవు. నీ సలహా శ్రీరాముడు సంతోష పూర్వకముగ స్వీకరించ గలడు'' అని సూచించెను.

"మిథిలేశ్వరా! పూజ్యులు, పితృతుల్యులు, అనుభవజ్ఞులు, ప్రాజ్ఞులు, నాకు హితులు అయిన మీకు, వామదేవవసిష్ఠాది గురుజనులకు తెలియని ధర్మ సూక్ష్మములు నాకు తెలియునా! స్వార్థము, స్వామిధర్మము ఈ రెండు భావములమధ్య సతమత మగుచున్న నా సంఘర్షణ బుద్ధికి ఉచితానుచితములు స్ఫురింపజాలవు. సర్వజ్ఞుడు, సకల జనరంజకుడైన ఆ సీతాపతి ఒక్కడే ఇందుకు సమాధాన మియ్యగల సమర్థుడు" అని భరతుడు నమ్రభావముతో నివేదించెను.

అంతట వేరొండు మార్గము కనుగొనలేక జనక వసిష్ఠభరతాది ప్రభృతులు మార్గోపాయార్థమై పునః శ్రీరామునివద్దకే వచ్చి చేరిరి. అది చూచి దేవేంద్రాది దేవతలకు మరల గుండెదడ పుట్టెను. జనక, వశిష్ఠ, భరతాదులపై రాఘవునికి అపూర్వమైన పూజ్యభావము, భక్తివాత్సల్యములుగలవనియూ అదియునుగాక అనుజునిపై నున్న అమితానురాగమునకు వశవర్తియై రాముడు అయోధ్య కెక్కడ ప్రత్యావర్తనము చేయునోయను శంకచే భయాతురులై దేవతలు పరుగెత్తుకొని వెళ్ళి సరస్వతీదేవి పాదముల పైబడి - "అమ్మా! కార్యము చెడిపోవుచున్నది. వెంటనే నీ మాయ ప్రయోగించి కైక కొడుకు మనస్సు మార్చి వేయ వలసిన"దని ప్రాధేయపడిరి.

అందుల కా పద్మజారాణి రవంత మందహాసముచేసి, మందమతులైన అమరులను లక్షించి - "ఓ సురలారా! తిమిరము దినకరుని సమీపించ జాలనట్లు, సీతారాములకు నివాస స్థానమైన భరతుని మానసముపై నా మాయ కానీ, బ్రహ్మ రుద్రాదుల మాయలుగానీ ఇనుమంతయు ప్రసరింపజాలవు. ప్రస్తుతం మీ మీ ప్రార్థనా ప్రయత్నములు ఫలింపజాలవు." అని నిర్ణయించి చెప్పెను. ఇక చేయునది లేక దేవతలు మన కార్యముయొక్క అనుకూల ప్రతికూలములు ఆ భరతుని పైననే ఆధార పడియున్నవని విచారించుకొని, నిట్టూర్చి యిన్నకుండిరి.

అది యట్లుండ, ఇక్కడ కులగురువు రఘుకుల భూషణుని సమీపించి ఇంతకు మునుపు తనకు, జనకునకు, భరతునకు మధ్య జరిగిన సంభాషణా క్రమమంతయు శ్రుత పరచి - "ఓ రఘునందనా! నీ యభిప్రాయము ప్రకా

రము నడచుకొనుటకు మేము నిర్ణయించుకొంటిమి. నా అభిప్రాయము కూడా ఇదియే'' అని విన్నమ్రముగ శ్రీరామునితో చెప్పివైచెను.

శ్రీరాముడు తలవంచి, కేలుమోడ్చి, పెద్దల వైపవలోకించి ''మహర్షీ! పూజ్యులగు మీరు, జనక ప్రభువు ఇక్కడ ఉపస్థితులై యుండ సమాధాన మిచ్చుటకు నే నెంత వాడను? పెద్దలారా! మీ ఆదేశ ప్రకారము నేను ప్రవర్తింతునని మీ సాక్షిగ ప్రమాణముచేసి చెబుతున్నాను.'' అని దృఢస్వరమున బలికెను.

ప్రతిజ్ఞా పూర్వకమైన శ్రీరాముని నిశ్చయము అక్కడున్న వారిని సంభ్రమాశ్చర్య లగునట్లు చేసెను. వసిష్ఠుడు, జనకుడు మున్నగువారు తుది నిర్ణయము నకై భరతునిముఖము చూడసాగిరి.

తుదకిట్లు బరువు భారము తన పైననే వ్రాలెనా యని భరతుని హృదయము ఆందోళితమయ్యెను. చంచలా చంచల భావ తరంగము లాతని మానసాంబుధిని కల్లోల పరచెను. భరతుడు రఘువీరుని తమ్ముడుగదా! గుండె దిటవు చేసుకొని గురువునకు, సమాజమునకు ప్రణమిల్లి నమ్ర భాషణముల నిట్లు ప్రసంగించెను-

''ప్రభూ! నాకు తల్లీ, తండ్రీ, గురువు, దైవము, సర్వులు మీరే. పూజ్యులు సర్వజ్ఞులగు మీకు విశేషించి చెప్పవలసిన యోగ్యత నాకు లేదు. అగ్రజా! నేను మోహవశుడనై తండ్రి యాజ్ఞను తిరస్కరించి, ప్రజలను గుంపు కట్టుకొని ఇక్కడికి వచ్చితిని. బాల్య చాపల్యము వలననో లేక దుఃఖాతిరేకము చేతనో, అథవా ప్రేమాను రాగబద్ధుడనయ్యో ఇట్లు మీ యాజ్ఞ నతిక్రమించి నందుకు క్షమింప ప్రార్థింతును, క్రూరులు, కుటిలురు, నీచులు, నాస్తికులు సైతము మీ శరణుజొచ్చినవారిని అనుగ్రహించు ఆర్తత్రాణ పరాయణుడవు. అజ్ఞానమున నేజేసిన అపరాధము సైరించి నన్ను అనుగ్రహించి, ఆదరించితిరి. ఇట్లు మీ కృపకు పాత్రుడ నయినందుకు నా దోషములన్నియు భూషణములుగా మారి నాకు జగత్కీర్తి సంప్రాప్తించెను. ప్రభూ! సకల మంగళములకు మూలమగు మీ చరణ కమలపరాగముసాక్షిగా మీ యాజ్ఞానువర్తినై సంచరించెదనని చేయెత్తి చెప్పుచున్నాను. మీ పాదసేవాభాగ్యప్రసాదమునకు నన్ను వంచి-

తుని చేయకుందురుగాక!'' అని చెప్పుచున్న భరతుని శరీరము ప్రేమాతిశయముచే కంపించెను, నోరు తడబడెను. అతడు నిలువునా అన్న పాదములపై వ్రాలెను.

దయానిధి దాశరథి తమ్ముని లేవనెత్తి అంకమునజేర్చి మరంద మాధురీ యుక్తోక్తుల సోదరుని సాంత్వనపరచెను. పరస్పర ప్రేమబద్ధులయిన రామభరతుల స్నేహ సౌశీల్య సుగంధ మాఘ్రాణించి అచ్చట చేరిన జన సమాజము సమ్మోహిత మయ్యెను.

అక్కడ ఇంద్రుడు ఇంకనూ తన నైచ్యాలోచనలు విరమించలేదు. పాకశాసనుని బుద్ధి కాకినంటి కాపట్యముగలది. అతడు చిత్రకూటమందున్న రాజ సమాజముల వారిపై మరెన్నియో మాయలు మంత్రించుచుండెను. దేవ మాయకు లోబడిన ఆ ప్రజా హృదయములు భీతావహముచే వ్యసన కలుషిత మగుచుండెను. అట్లు మాయామోహితులయిన రాజ పరివారముల వారు ఒకప్పుడు రాముని వదలిపెట్టి ఇండ్లకు పోవలెననుకొనెదరు. మరొకప్పుడు వన మందే సీతారాములతోనుండ తలంచెదరు. సరిత్ సాగర సంగమ స్థలమందలి నీటి గతివలె వారి మనస్సులు క్షణ క్షణము అనుకూల, ప్రతికూల భావ తరంగములచే ఘూర్ణిల్లుచుండెను. చంచల మనస్కులైన సాకేత వాసులు వికల మనస్కులై భయభీతులగు చుండిరి. భరతుడు, జనకుడు, మునులు, మంత్రులు మినహా సకలజనులపై మఘవుని మాయ వ్యాపించెను.

జగత్పతి యగు జానకీపతి ఇది గ్రహించి ''ఆహా! నా మీదున్న మమతచే దేవేంద్రుడిట్లు మంత్రతంత్ర ప్రయోగములకు పూనుకొన్నాడు. ఇంతకూ శచీపతి స్వభావము శునకము వంటిదిగదా!'' యని భావించి స్వామి చిన్నగా నవ్వుకొనెను.

ధర్మధురంధరుడు, సకల శాస్త్రజ్ఞుడు, సత్యవ్రతుడు, ప్రేమ స్వరూపుడగు కోదండరాముడు సభికుల నవలోకించి, సోదరు నుద్దేశించి శుభ వాక్కుల నిట్లు భాషించెను.

''ఓ భరత సోదరా! నీవు సకలశాస్త్ర పారంగతుడవు, ధర్మాధర్మములను చక్కగ గుర్తించగలవాడవు, లోకనీతి, రాజనీతి కూలంకషముగ తెలిసినవాడవు,

నా అమంగు తమ్ముడవు. గురుజనులు, బంధుజనులు, ప్రియజనుల సమ క్షంలో నీ విమల గుణగణములగూర్చి ప్రసంగించుటకు జంకుచున్నాను.

"సోదరా! రఘుకుల సంప్రదాయము, పితృప్రతిజ్ఞ, గురుజనుల యభీష్టము, ప్రజల మనోభావములు, మన ఉభయుల శ్రేయోధర్మములు నీకు తెలియనివి కావు. నీకు నాపై గల ప్రేమ విశ్వాసములు అపూర్వమైనవి.

"తమ్ముడూ! ఆ సమయమున సూర్యు డస్తమించిన లోకమంధకార బంధుర మగునట్లు, తండ్రికి అకాల మరణము ప్రాప్తించినపుడు రాజ్యములో యెవ్విధమైన ఉపద్రవోత్పాతములు సంఘటిల్లకుండునట్లు జాగ్రత్త వహించి గురువులు, జనకులు, మన ధరణీ ధనధాన్యములు రక్షించి నిలబెట్టిరి. ఆ పెద్దల దయాదృష్టిలో మన మున్నంతకాలము ఇక్కడ - అక్కడ సర్వత్ర మనకు శుభమే కలుగుచుండును.

"వత్సా! శేషుడు భూమిని ధరించి యున్నట్లు మనము కూడ జననీ జనకుల ఆజ్ఞను, గురువుల ఆనతిని, స్వామి ఆదేశమును, శిరసావహించి పాలించుట ధర్మ యుక్తమైన విధినిర్వహణ.

"కాబట్టి, భరతా! నేను నీకిచ్చు సలహా యేమనిన - సకలాభీష్ట ప్రాప్తికి కారణభూతమైన, ఇహపర లోకముల కీర్తికి మార్గమైన తండ్రి ఆజ్ఞను పాటించి నీవు ఈ రవికుల రాజ్యభారము భుజస్కంధములపై వహించి, కోసలదేశము పాలించుము. దుఃఖము విడనాడి ధైర్యమువలంభించి ఈ చతుర్దశ వర్షకాలము నీవు గద్దె నధిష్ఠించి రాజధర్మము నిర్వర్తింపుము.

సోదరా! ఈ కష్ట పరంపరలు మన సర్వులకు సమానముగా వచ్చెను. నీ స్వభావము అతి కోమలమైనదని తెలిసి యుండియు కష్టకాల మందుండుటను జేసి నీతో ఇట్లు కఠోరముగ పలుకవలసి వచ్చినందుకు నొచ్చుకొను చున్నాను. కత్తి వేటును తప్పించు కొనుటకు కరము నడ్డుపెట్టునట్లు నిప్పు-ప్పుడు కష్టాఘాతములకు నేను డాలువలె ఉపయోగించుకొనుచున్నాను."

శ్రీరాముని వచనము లతిమధురములై యుండెను. అవి ప్రేమాంబుధి నుండి ఉద్భవించిన అమృతోక్తులు. సాకేతవాసుని లలితములు, సుందరములైన

సుప్రసంగములు విని సభాసదులు సంతోషముచే పులకిత గాత్రులైరి. అంతటితో భరతుని దోషములు తొలగెను. దుఃఖ మంతరించెను. హృదయము ఆనందపూరిత మయ్యెను. సరస్వతీ సాక్షాత్కారము సిద్ధించిన మూగవానివలె భరతుడు వికసిత వదనారవిందుడై అంజలి ఘటించి అన్నవిట్లు ప్రణయ మర్థించెను.

"ప్రభూ! మీ యాజ్ఞ నాకు సర్వదా శిరోధార్యము. నేటితో నా జన్మ సఫలమయ్యెను. అయితే నా దొక చిన్నమనవి అనుగ్రహించ వేడుచున్నాను. స్వామీ! నా నిత్యపూజ కాధారముగ నుండుటకై మీ చరణ చిహ్న మేదైనా ప్రసాదించిన దాని నాలంబనము చేసుకొని ఈ పదునాలుగేండ్లు గడపగలను. అదియును గాక మీ యభిషేకార్థము సకలపుణ్యతీర్థజలము వెంటదెచ్చితిమి. దాని నెట్లు ఉపయోగించుటో సెలవీయ వలసినది. అగ్రజా! నా మనస్సులో మరొక చిన్న కోరిక గలదు. మీ రాజ్ఞాపించిన యెడల ఈచిత్రకూటపర్వత ప్రాంతమును, ఇక్కడి ఋష్యాశ్రమములను, వన్య మృగములను, ఈ విపిన పథమందలి మీ పవిత్ర పదచిహ్నములను ఒక్కమారు దర్శించుకొని నేత్ర పర్వ మొనర్చు కొనెద."

## భరతాదులు చిత్రకూట ప్రాంతమును తిలకించుట

"సోదరా! తప్పక చూచిరమ్ము. అత్రిమహాముని ప్రసాద ప్రభావముచే ఈ వనస్థలి మంగళ ప్రదమై మనోహరముగా నున్నది. ఆ మహాముని ఆజ్ఞ తీసు కొని పరిసర ప్రాంతములు పరిశీలించి, ఆ ముని పుంగవుడు చెప్పినచోట నీవు తెచ్చిన తీర్థజలము భద్రపరచి రమ్ము" అని శ్రీరాముడు అనుగ్రహించెను.

రామభరతుల స్నేహ సంవాదము విని వారి అపూర్వ (భ్రాతృ) భావమును చూచిన వారు ఆనందము పట్టలేకపోయిరి. చిత్రకూట సభలో తుదకీ నిర్ణయము జరిగినందుకు భూలోక వాసులు విచారించిరి. దేవలోకస్థులు హర్షించిరి, కొందరు రాముని శ్లాఘించిరి, మరికొందరు భరతుని కీర్తించిరి. సుఖదుఃఖములు సమానముగ కలిగిన కౌసల్య తనతోడి రాణులకు నచ్చజెప్పి, ఓదార్చెను.

పిమ్మట అత్రి మహాముని భరతుని ఒక పుణ్యకూపము వొద్దకు తోడ్కొని పోయెను. భరతుడు ఋషి వెంట తీర్థజలము నెత్తికొని, ఆ కూపము వద్దచేరి, దానిలో తీర్థజలము భద్రపరచెను. అత్రి ఆ బావియొక్క పురాతన చరిత్ర వారికి తెలియజేసి ఈనాటి నుండి ఇది "భరతకూప"మని పిలువబడునని విశదము జేసెను. అనంతరము వారు పర్ణశాల చేరుకొని, ధర్మశాస్త్ర ప్రసంగములతో, ఇతిహాస కథాశ్రవణాదులతో ఆ నాటి రాత్రి హాయిగా గడపిరి.

మరుదినము ప్రాతఃకాలముననే భరత ప్రభృతులు రామ వన వైభవము తిలకించుటకై బయలుదేరిరి. రాముని అనుంగు సోదరుడైన భరతుడు పాదచారియై సంచరించుచున్నపుడు భూదేవి సిగ్గుతో పులకరించెను. కంటక శిలామయములై నిమ్నోన్నతముగ నున్న ఏపిన పథములు భరతుని పాదము లెప్పుట బడునో అచ్చట మెత్తగ మారుచుండెను. నీల మేఘము లతనికి నీడ బట్టెను. వృక్షములు ఫలములిచ్చెను. వన్యజీవులు వయ్యారముగ విహరించి రామసోదరుని రంజింపజేసెను. పైనుండి పుష్పవర్షము కురిసి నేలపై పూలబాటలు యేర్పడెను. "రామా" యని ఆవులించిన వానికి సకలార్థములు సిద్ధించుచున్నపుడు రామునికి ప్రియసోదరుడైన భరతునికి మార్గములు సుగమములు కావడంలో వింతలేదు. అత్రి వెంటనుండి అడవిలోని విశేషములను గురించి, అక్కడి పుణ్య క్షేత్రములను గురించి భరతునికి తెలియజేయుచుండెను. భరతుడు ఒక చోట స్నానముజేయును, మరొక చోట భక్తితో ప్రణమిల్లును, ఇంకొకచోట తన్మయుడై సీతారాములను ధ్యానించును, కొండొకచోట ప్రసన్న భావముతో శివకేశవులను కీర్తించును. ఇట్లు ఆ వన ప్రాంత మంతయూ సంచరించుచూ భరతాదులు ఆనందముగా అయిదు దినములు గడపిరి.

ఆరవదినము ఉదయవేళ నిత్యకృత్యములు తీర్చుకొనిన పిమ్మట సకల జనులు వట వృక్షముక్రింద సమావేశమయిరి. ఆ రోజు భరతాదులు ప్రయాణ మగుటకు శుభ దినమని మనస్సుకు తట్టెను. కానీ పురుషోత్తముడా మాట పైకి చెప్పలేక మిన్న కుండెను. అన్న అంతర్యము అర్థము చేసుకొనిన భరతుడు పైకి లేచి శిరమున కేలు గీలించి భక్తి తత్పరుడై ఇట్లు ప్రసంగించెను–

''ప్రభూ రామచంద్రా! మీరు నన్నాదరించితిరి, నా యభీష్టములు తీర్చి తిరి, నాకై సమస్త కష్టములు సహించితిరి. కోసలేశా! ఇక మీరు అనుజ్ఞ ఇచ్చిన నేను నగరమునకు వెళ్ళి తిరిగి మీరు వచ్చునంతవరకూ అయోధ్యా వాసులకు సేవాశుశ్రూషలు చేయుచుండెద.

''ఓ దీనబంధూ! ఈ పదునాలుగేండ్లు ప్రజలను పాలించిన అనంతరము మీచరణసరోజములను దర్శించుటకు నాకు తగిన మార్గము నిర్దేశించవలసినది. భక్తవత్సలురు, దీనజన బంధులైన మీ కృపా దృష్టివలన అక్కడ నగరవాసము, ఇక్కడ వనవాసము శుభప్రదముగ నుండగలదను ధైర్య విశ్వాసములతో నా కష్ట ములను తృణ ప్రాయముగ భావించి సైరించగలను. మీరిచ్చిన చనువువల్లనో లేక దుఃఖాతిరేకముచేతనో నావలన జరిగిన దోషములు సైరించి, నన్ను బోధించి పంపవలసినదిగా ప్రార్థించుచున్నాను.''

నీరక్షీరములవలె గుణదోషములను విశదీకరించి, శుభ ప్రసంగము చేసిన భరతుని సంభాషణ సర్వజనులను రంజింపజేసెను. సోదరుని శుద్ధాంతః కరణకు సంప్రీతుడైన సీతాపతి సమయోచితముగ ఇట్లు సమాధాన మిచ్చెను–

''తమ్ముడూ! గురువులు మరియు మిథిలేశ్వరుని యొక్క కృపాదృష్టి మనపై పూర్ణముగా నున్నందున మన కెవ్విధమైన కష్టములు ప్రాప్తించబోవు. అక్కడ అయోధ్యలో, ఇక్కడ వనములో ఉభయుల క్షేమములు వారే చూచు చుండెదరు. నీకు గాని నాకుగాని స్వార్థము, పరమార్థము, పురుషార్థములు సిద్ధింప జేసుకొనుటకు తండ్రి యాజ్ఞను శిరసావహించడ మొక్కటే యేకైక మార్గము.

''జననీ జనకులమాట శిరసావహించి నడచుకొనువాడు యే పరిస్థితులం దునూ తప్పుడు త్రోవ బట్టజాలడు. భరతా! దేశము, కోశము, సంబంధీ కులు, సామ్రాజ్యము, ఇత్యాదులన్నింటికంటే గురు పాదధూళి గొప్పదని భావించుము. వత్సా! గురుజనుల, తల్లుల, మంత్రుల సమ్మతి సలహా ప్రకా రము పదునాలుగేండ్లు కోసలరాజ్యము పరిపాలించుము.''

# పాదుకా ప్రదానము

ఈ ప్రకారము రామచంద్రుడు భరతునికి రాజనీతి, లోకనీతి, ధర్మ మాత్మ్యములు బోధించి దీవించెను. అప్పటికినీ అనుజుని అంతర్యము మరెందుకో ఆరాట పడుచున్నదని గ్రహించ గలిగిన శ్రీరాముడు దయాంతరంగుడై తన పాదుకలను భరతునికి ప్రసాదించెను. ప్రభువుపై భక్తి నిలుపుకొనుటకు ఆలంబనముగ భరతుడు వానిని సద్భక్తితో స్వీకరించెను.

అవి ప్రభువు ధరించు పాదరక్షలు, జనుల రక్షించు రక్షకములు, స్నేహ సంవర్ధకములు, ధర్మమునకు స్నేహమునకు రెండు నేత్రములు, సుకృతములు సాధించుటకు రెండు హస్తములు. అవి ''ర'' కార ''మ'' కారములకు ప్రతీకములు. భరతుడు ఆ పాదుకలను భక్తి శ్రద్ధలతో తీసుకొని శిరమున దాల్చి, నత శిరస్కుడై ప్రస్థానము చేయుటకు సెలవియ్యమని ప్రార్థించెను.

అగ్రజుడు అనుజుని బాహువులలోనికి తీసుకొని గాఢాలింగన మొనర్చెను. ఆ క్షణమందు రఘురాముని మనశ్శరీరములు రాగానురాగ రంజితములై పులకరించెను. ధైర్యధురంధరుడగు దాశరథి ప్రేమ విహ్వలుడై భరతుని యెడబాటుకు కన్నుల నీరు బెట్టెను. పరస్పర ప్రేమపాశ బద్ధులైన ఆ యన్నదమ్ముల వియోగదశ నవలోకించిన జనకుడు, గురువులు, మునులు, సాధువులు మొదలుకొని సకల ప్రజల హృదయములు చలించి కరుణా కలితమయ్యెను. కరుణ భరితమైన ఆ దృశ్య స్థితి యెవ్వరికిని వర్ణింప శక్యము గానిది.

తదుపరి శ్రీరాముడు శత్రుఘ్నుని ఆలింగనము చేసుకొని వీడ్కోలిచ్చెను. భరత శత్రుఘ్నులు సౌమిత్రిని హృదయమున కత్తుకొని అతనివద్ద సెలవు తీసుకొనిరి. జానకిచరణ కమలములపై వ్రాలి ఆమె ఆశీస్సులు అందుకొని వారు బయలుదేరిరి.

మిథిల - అయోధ్య ఉభయ రాజ్యములకు చెందిన ప్రజాసందోహము సీతారామలక్ష్మణులను యెడబాసి పోలేక, గుండె దిటవు చేసుకొని ప్రయాణ సన్నాహములు పూర్తి చేసెను. సుగుణాకరుడైన రాముడు జనకచక్రవర్తికిని జనకుని సహధర్మిణికిని పాదాభివందనముచేసి, కృతజ్ఞతలు తెలియబరచి వారిని

సాదరపూర్వకముగ సాగనంపెను. పిమ్మట విశ్వామిత్ర, వామదేవ, జాబాలి, వసిష్ఠాదిగురువులను, సచివులను, భూసురులను, బాంధవులను, పురవాసులను యథావిధి సత్కరించి ఆదరపూర్వకముగా సాగనంపెను.

రామమూర్తి తల్లికైకేయి పాదములకు ప్రణమిల్లి, శీతల వచనసేచనచే ఆమె పరితాపమును శాంతింపజేసి పల్లకిలో కూర్చుండబెట్టెను. రామలక్ష్మణులు ముగ్గురు తల్లులను ప్రేమపూర్వకముగా కలుసుకొని, వారిని పల్యంకికలందు సుఖాసీనులను జేసి, వారి దీవనలంది సెలవు పుచ్చుకొనిరి. వినయశీలయైన విదేహ పుత్రి ముప్పురత్తలను, తల్లిని, ప్రియసఖీజనంబును, తండ్రిని కలుసుకొని, వారిచ్చిన బోధనలు గ్రహించి దీవనలు స్వీకరించి, నమస్కరించి, నాథునితో వెనుకకు మరలెను.

రథ, గజ, తురగ, పదాతి చతురంగ సేనలు ముందునడువ, జనకచక్రవర్తి, భరతాది ప్రభృతులు చిత్రకూటమును వీడి అయోధ్యకు ప్రయాణము ప్రారంభించిరి. సీతారామ లక్ష్మణులు తుదిసారిగ గురువు వసిష్ఠుడు, గురుపత్ని అరుంధతియొక్క పాదధూళిని శిరమున దాల్చి పర్ణశాలకు మరలి వచ్చిరి.

అటుపిమ్మట దశరథరాముడు ప్రియమిత్రుడైన నిషాదపతిని నానావిధముల సత్కరించి, బహుభంగుల బోధించి అతనిని గృహోన్ముఖుని జేయుటకు సమ్మతింప జేసెను. ఇన్ని దినములుగా సకల సేవలు జేయుచున్న కోల కిరాతాదులకు కృతజ్ఞతలు తెలియజేసి సాగనంపెను.

ఇట్లు సుహృజ్జనులను సాగనంపిన పిమ్మట సీతారామలక్ష్మణులు పర్ణశాల ముంగిటనున్న వటవృక్షచ్ఛాయలో ఉపవిష్టులై భరతాది బంధువులు, ప్రియజనులు, సచివులు, ఇత్యాదుల గుణగణములు, ప్రేమవాత్సల్యములు, వారసేవ, సౌజన్యము ఒక్కమారు మనస్సుకు దెచ్చుకొని వ్యాకులపడిరి. ప్రియజనులవల్ల రామాదులకు కలిగిన ప్రేమోత్కంఠత, వారి స్నేహసౌహార్దము చూచి చిత్రకూట పరిసరమందలి చరాచరము లన్నియూ చలించి ద్రవించిపోయెను.

అనంతరము ప్రశాంతమైన ఆ ప్రకృతి ప్రాంగణమందున్న పర్ణశాలలో సీతారామలక్ష్మణులు భక్తి, జ్ఞాన, వైరాగ్యముల వలె శోభించు చుండిరి. ఇంతవరకు

దిగులుపడి దిక్కులు చూచుచున్న దేవతలు సృష్ట చిత్తులై సంతోషముతో స్వస్థలములకు ప్రస్థానము చేసిరి.

గృహోన్ముఖులైన భరతాదులు సీతారామ లక్ష్మణులను యెడబాసి వచ్చిన దుఃఖభారముచే మౌన ముద్రాంకితులై ఉపవాసములుజేయుచూ, యమున, గంగ, సరయూ, గోమతీ నదులను దాటి ప్రయాణించి నాల్గవ దినము సుర క్షితముగ అయోధ్య చేరుకొనిరి. జనక చక్రవర్తి నాల్గుదినములు కోసల రాజ ధానిలో వుండి, రాజ్య నిర్వహణకు, రాజపరివారమునకు సంబంధించిన అనేక విషయములు భరతునికి, గురువులకు, సచివులకు బోధించి, స్వజనులతో గూడి మిథిలా పురమునకు ప్రయాణమైపోయెను.

తదుపరి భరతుడు సచివులను సేవకులను కర్మచారులను రావించి వారిని నియమవర్తనులై కర్తవ్య విధులను చక్కగా నిర్వహించవలసినదిగా ఆదేశించి పంపెను. సకలజనులను రప్పించి సభకూర్చి వారిని సుఖముగా జీవించుచూ సుజనవర్తనులై సంచరించుచూ సత్కీర్తి సాధించుమని అర్థించెను. తల్లుల సేవా శుశ్రూషల యెడల తగు జాగ్రత్త వహించి చూచుకొనుమని అందుకు శత్రు ఘ్నుని నియోగించెను. పిమ్మట ఒక సుముహూర్తమున రామపాదుకలను సమస్త రాజలాంఛనములతో సింహాసనముపై ప్రతిష్ఠించి, తదాది నియమ సంయమశీలుడనై జీవించెదనని సర్వుల యెదుట బాసచేసి, భరతుడు గురుజ-నులవద్ద, తల్లులవద్ద సెలవు తీసుకొని నందిగ్రామమున వచ్చి చేరెను.

అచ్చట భరతుడు వల్కలాజినములు ధరించి,జడలు దాల్చి, వ్రతోపవాస ములు చేయుచూ ఒక పర్ణశాలలో నివసించెను. సకలైశ్వర్య సంపన్నమగు సాకేతపురిలో భరతుడు భోగభాగ్యాదులను విసర్జించి చంపక వనములో చంచ రీకమువలె సంయమశీలుడై యుండెను. ''ఓ పార్వతీ! లక్ష్మీపతిపై మనస్సు లగ్నమైన వానికి భరతునకు వలె లక్ష్మి సంపదలపై మోహాపేక్షలు అంతరించుట సహజము. ఆహా! రామభరతుల సంబంధము ఘన చాతకముల వంటి అన-న్యానుబంధముగదా!''

భరతుడు పరమ భక్తుడు - నిత్యమూ శ్రీరాముని పాదుకలు పూజించి, రామనామము జపించి, రాచకార్యములు శ్రీపాదముద్రతో నిర్వహించుచు.

అతడు తమ్మి - నగరములో నుండియూ నిస్సంగుడై సాధువువలె సంయమ జీవితము గడపెను. భరతుడు సాధకుడు - శమదమ నియమోపాసనలచే దీక్షా రతుడై యున్నందున అతని శరీరము కృశించి తేజస్సు అతిశయించెను. అతని ధర్మభావము రానురాను దృఢపడి, మనస్సు నిర్మలమై, దివ్యతేజఃపుంజముతో దీప్తిజెందెను.

సంతత సాధనారతుడైన భరతుని హృదయము నిర్మలమైనది, ఆచరణలు పవిత్రమైనవి, వ్యాపారములు ధర్మసమ్మతమైనవి. ఆ లోకోత్తరపురుషుని జీవితము ధన్యమైనది. శ్రీరాముని సంపూర్ణ ప్రేమను జగములో యుగ యుగముల వరకూ వ్యక్తము చేసిన భరతుని ఆదర్శ గుణములు ఆదిశేషుడు, గణేశుడు, వాగీశ్వరి ఆదిగాగల వారు సైతము వర్ణింప నలవిగాని మహిమా సమన్వితమైనవి.

భరతుని పవిత్ర చరిత్ర ప్రేమతో పఠించినవాడు ప్రాపంచిక భోగములందు విరక్తి కలిగి రామభక్తి తత్పరుడై ధన్యుడగుచున్నాడు.

ఇతి శ్రీ మద్రామచరిత మానసే
సకల కలికలుష విధ్వంసనే
విమల విజ్ఞాన వైరాగ్య సంపాదనో నామ
ద్వితీయః సోపానః సమాప్తః.

(అయోధ్యాకాండ సమాప్తము.)

# అరణ్యకాండ

## శ్రీ జానకీ వల్లభో విజయతే

*సాంద్రానంద పయోద సౌభగతనుం పీతాంబరం సుందరం*
*పాణౌ బాణ శరాసనం కటిలసత్తూణీర భారం వరమ్,*
*రాజీవాయత లోచనం ధృత జటాజూటేన సంశోభితమ్*
*సీతాలక్ష్మణ సంయుతం పథిగతం రామాభిరామం భజే.*

''ఓ గిరిజా! గూఢాతిగూఢ మహిమా సమన్వితుడగు దశరథాత్మజుని సేవించి విజ్ఞులైన పండితులు వైరాగ్యసంపన్నులగుచున్నారు. హరివిముఖులు, మూఢులైన పామరులు రామభద్రుని చరిత్ర మాహాత్మ్య మెరిగియూ మోహ వశులై భవ బంధములనుండి ముక్తిగనలేక మ్రగ్గుచున్నారు.

''ఇంతవరకు భరతాది అయోధ్యా వాసులకు ప్రభువు శ్రీరామునిపై గల అనన్య ప్రేమానురాగములను గురించి వర్ణించి చెప్పితిని. ఇక సుర నర మును లకు అత్యంత ప్రీతికరముగ భాసించిన రఘురాముని వనవాస చర్యలను వివరించెదను; శ్రద్ధాళువై ఆకర్ణించవలసినది'' అని పరమశివుడు పార్వతికి బోధించిన విధము గోస్వామి తులసీదాసు వర్ణించుచున్నాడు.

## కాకాసురుని పరాభవము

అట్లు రామాదులు సుఖవాసమైన వనవాసము చేయుచున్న సమయమున జానకీవల్లభు డొకసందర్భమున సురభిళ సుమనోమాల నొకదానిని గూర్చి దానిని తన కరకమలములతో వైదేహికంఠసీమ నలంకరింపజేసి ప్రసన్ను డాయెను.

ఆహ్లాదకరమైన ఆ శుభసమయమున చిన్న సంఘటన ఒకటి సంభవించెను. చిన్నచీమ సముద్రపులోతు కనుగొనదలచినట్లు ఇంద్రపుత్రుడైన జయంతునికి రవికుల రాముని బలపరాక్రమము లేపాటివో పరీక్షించి చూడవలెను దుర్బుద్ధి

పుట్టెను. వెంటనే అతడొక కాకిరూపు ధరించి వచ్చి సీత పాదములను తన ముక్కుతో రక్తము చిందునట్లు బలముగ పొడిచి పారిపోయెను.

అంతట సహజ కృపాస్వభావుడగు సాకేతపతి జయంతుని ధూర్తప్రవర్తన కేంచుక కోపోద్రిక్తుడై ఒక గడ్డిపోచను అభిమంత్రించి దానిని వానిపై వదలిపెట్టెను. అది ఒక భయంకర బ్రహ్మాస్త్రమై వెంటబడగా జయంతుడు భీతిగొని నిజరూపముతో పరుగెత్తుకొనిపోయి తండ్రి శరణువేడెను. శచీపతి సుతుని నీచ ప్రవర్తనను గ్రహించుకొని వాని నచ్చోటనుండి వెడలగొట్టెను.

పూర్వ మొకప్పుడు సుదర్శనచక్రము వెంటబడగా భయార్తుడై పరుగెత్తిన దుర్వాసునివలె జయంతుడు భయ, శోక వ్యాకులుడై బ్రహ్మలోకమునకు, కైలాసమునకు, ప్రాణ రక్షణార్థమై పరుగులుతీసెను. కానీ, రామద్రోహియగు సురపతి సుతుని కెవ్వరునూ అభయ మివ్వక నిరాకరించిరి. "ఓ గరుత్మంతా! దాశరథికి ద్రోహము తలపెట్టిన శరునికి తల్లి మృత్యువుగా, తండ్రి యము డుగా, అమృతము హాలాహలముగా, మిత్రుడు శత్రువుడుగా, గంగ వైతరణిగా మారుచున్నారని కాకభుశుండి ఖగరాజుతో పేర్కొని యుండెను.

ఇట్లు భయాతురుడై దిక్కులేక దిశలకు పరుగెత్తుచున్న జయంతుని జూచి నారదమహర్షి -

"ఓ జయంతా! రవికులమణి రామచంద్రు డొక్కడే నిన్నీ బ్రహ్మాస్త్రము నుండి రక్షించగల సమర్థుడు.తత్క్షణమే వెళ్ళి అతని పాదాశ్రయము పొందు" మని హితవొసంగెను.

తుదకు గత్యంతరములేక నారదుని సలహా మేరకు మఘవుని పుత్రుడు శర ణాగతవత్సలుడగు శ్రీరాముని చెంతకు వచ్చి పాదములపై బడి రక్షించుమని శర ణువేడెను. దయానిధి దాశరథి ఆ దురాత్ముని వధించక దయతలచి వానిని ఏకాక్షునిగా జేసి వదలిపెట్టెను. సుగుణాభిరాముడైన శ్రీరాముని కరుణాభావ మున కిదొక చిన్న ఉదాహరణ.

## రామలక్ష్మణులు ఋష్యాశ్రమములను దర్శించుట

పంచవటి ప్రదేశము పలువురికి పరిచయమై యున్నందున ప్రజలచ్చటికి నిత్యమూ గుంపులు గట్టుకొని వచ్చుచుందురని భావించి, శ్రీరాముడు ఒక

దినము మునిజనుల వద్ద సెలవుతీసుకుని, సతీసోదర సమేతముగ చిత్ర కూటము వదలి దక్షిణదిశగా దండకారణ్యము వైపు ప్రయాణించి అత్రి మహా ముని ఆశ్రమము చేరుకొనెను.

అత్రి రామాదుల ఆగమనమునకు అమందానంద హృదయుడై వారికి ఎదు రేగెను. సీతారామ లక్ష్మణులు మహర్షికి భక్తి తత్పరతతో సాష్టాంగ మొనర్చిరి. ముని సోదరులిద్దరినీ ముదమార కౌగలించుకొని ఆదరముతో ఆశ్రమమునకు దోడ్కొనివచ్చి సుఖాసీనులను జేసెను.

అట్లు సుఖాసీనుడై కూర్చొనియున్న సీతాపతి దివ్యసుందర విగ్రహము కన్నులారా తిలకించి మునీశ్వరుడు పులకిత గాత్రుడై ఆనందబాష్పములు రాలు చుండ కరములు మోడ్చి-

"ఓ భక్తవత్సలా! ఓ కృపానిధీ! ఓ రమారమణా! సంసార సాగరము తరించుటకు మందరపర్వతము వంటివాడవైన ఓ సాధుజన పోషకా! నీ కిదే నమస్కరించుచున్నాను. ఓ కోదండపాణీ! అప్రమేయమైన నీ బాహుదండ ప్రభావమును బ్రహ్మ మహేశాదులు నిత్యము కీర్తించుచున్నారు. మునిజనా నందకరమైన నీ దివ్యమంగళ స్వరూపము ఒక్కమారు దర్శించినచో లోకుల తాపత్రయములు త్రుటిలో నశించిపోవుచున్నవి. జగత్స్వరూపుడవు, భక్తకల్ప ద్రుముడవగు ఓ సీతాపతీ! నీ దివ్య చరణార విందముల సదా నా చిత్తము లగ్నమై యుండునట్లు నన్ననుగ్రహించి అఖండభక్తిని ప్రసాదింప వేడుచున్నాను" అని మునీంద్రుడు తన్మయుడై స్తోత్రము చేసెను.

అత్రి సహధర్మిణి అనసూయ వినయ నయ గుణశీలయగు వైదేహిని జూచి ముగ్ధురాలై ఆమెను ఆప్యాయముగ అంచుకు తీసుకుని ఆశీర్వదించి ఆనందించెను. తదుపరి మునిపత్ని నిత్యనూతనములు, నిత్యనిర్మలములైన సుందర వస్త్రాభరణాదులచే జానకిని అలంకరింపజేసెను. అనంతర మామె సీత కెన్నియో పాతివ్రత్య గుణములను గురించీ, నారీ ధర్మములను గురించీ ఉప దేశించి-

"బిడ్డా! సతికి పతికంటె మించిన దైవ మింకొకరు లేరు. నాథు డెటువంటివాడైనను అతనిని దైవసమానునిగ సేవించుటయే స్త్రీకి పరమధ ర్మము. జానకీ! నీవు నిజముగ స్త్రీలోకమునకు మార్గదర్శినివి. నిన్ను జూచి

నా చిత్తము ప్రసన్నమాయె''నని వినుతించి పలికెను.

ఆ పైన శ్రీరాముడు ఋషి పుంగవుని పాదపద్మములకు ప్రణమిల్లి ''మహాత్మా! దానుని సెలవు తీసుకొనుటకు అనుమతించవలసిన''దని అర్థించెను. అత్రి ఆనందోల్లాసముచే కంపితగాత్రుడై -

''ఓ కరుణానిధీ! బ్రహ్మాది దేవతలు, సనకాది మునీంద్రులు నీ కటాక్ష వీక్షణలకై తపించి పోవుచుందురు. అంతటి వాడవైన నీవు ఇంతటి నమ్రభావముతో ప్రసంగించుట నా భాగ్యము. స్వామీ! మనస్సుకు, జ్ఞానమునకు, ఇంద్రియములకు గోచరుడవుగాని నిన్ను నా కన్నులతో చూడడమే నా జప తపః సాధనములకు సత్ఫలితము. ఓ జగత్స్వామీ! నే జెప్పవలసిన దేమున్నది. నీవు నిరభ్యంతరముగ మములకు శుభగమనము చేయవచ్చును.'' అని పలించి అత్రి నిర్నిమేషుడై దేవదేవుని దివ్య సౌందర్యమును తన్మయుడై చూచుచుండి పోయెను.

జప తపః పూజా విధానములచే భక్తిని సంతరింపజేసుకుని తద్భక్తి ప్రభావముచే సాధకులు శ్రీవారి కృపాకటాక్షములకు పాత్రులగుచుండుట సహజమే. కానీ, పాపభూయిష్ఠమైన ఈ కలికాల మందు జప తపో ధర్మ వ్రతములాచరించుట కష్టసాధ్యమని గ్రహించి ఎవరు విశుద్ధ భక్తి మార్గమున శ్రీరాముని సేవించెదరో వారు నిజముగ సూక్ష్మజులైన మతిమంతులని తులసీదాసు చెప్పుచున్నాడు.

అనంతరము సుర, నర, ముని సంసేవితుడైన స్వామి అత్రి దంపతులకు పాదాభివందనము చేసి సీతా సౌమిత్రీ సమేతుడై అరణ్య మార్గమునను సరించి ముందుకు పయనించెను. ముందు దాశరథి, వెనుక సౌమిత్రి, వారిద్దరి నడుమ జానకి జీవ బ్రహ్మలకు మధ్య మాయవలె నడుచుచుండెను. ఆ ఘోరారణ్యమందలి గుట్టలు, కోనలు, వాగులు, శిలలు జగత్పతి సీతాపతి మార్గమున కవరోధముగ నుండక ప్రక్కలకు తొలగి పోవుచుండెను. ప్రభువు ఏ ఏ పథముల ప్రయాణించుచుండెనో ఆయా ప్రదేశములందు మేఘములు ఛత్రముల వలె నీడ నిచ్చుచుండెను-

*''జహం జహం జాహిఁ దేవ రఘురాయా,*

*తహం తహం మేఘకర హిం నభఛాయా.''*

ఇవ్విధమున రామలక్ష్మణులు వనాంతరమున పోవుచున్నపుడు ఘోర భయంకరుడగు విరాధుడను రాక్షసుడు వారిని ఎదుర్కొనగా రఘువీరుడు వానిని హతమొనర్చి సద్గతి కలుగజేసెను. తదనంతరము ఆ ముగ్గురును శరభంగ మహాముని ఆశ్రమము చేరుకొనిరి.

మోహనమూర్తి శ్రీరాముని ముఖకమలము దర్శించి శరభంగుని నేత్ర భ్రమరములు మోహాధీనమై మూర్ఛిల్లెను. ఆ మునిపుంగవుడు అంజలి ఘటించి ఆనందపారవశ్యమున-

"మహేశుని మానస సరోవరమున హంసవలె సంచరించుచుండెడి ఓ సాకేత రామా! బ్రహ్మ లోకమునకు ప్రయాణమై యున్న నేను నిన్ను దర్శించకనే పోరాదని తలంచి నీకై ప్రతీక్షించు చుంటిని. నిస్సహాయుడను, సాధనా రహితుడను, దీనుడనైన నన్ను కరుణించి కటాక్షించ వచ్చిన ఓ భక్తవత్సలా! నీకు కృతజ్ఞతలు తెలుపుకొను నంతటి వాడనుకాను. జగన్నాథా! నిన్ను దర్శించుకొన గలిగిన నా పాప తాపములు నశించి మనశ్శరీరములు శాంతించెను. దేవా! ఇక నా ఈ నశ్వరశరీరమును త్యజించి నీలో నైక్యమై పోవుటకనుగ్రహింపుము."

అని వేడుకొని శరభంగుడు చితిని పేర్చుకొని దానిపై నిలబడి-

"ఓ ప్రభూ! నా జప తపో యజ్ఞములన్నియూ నీకే సమర్పించుకొనుచున్నాను. నీలమేఘశ్యాముడవైన ఓ రామా! నీవు సీతా సౌమిత్రీ సమేతముగ నిరంతరము నా హృదయ సీమలో సగుణరూపముతో వసింతువు గాక."

*"సీతా అనుజ సమేత ప్రభు నీలజలదత నుశ్యామ్,*
*మమ హియ బసహు నిరంతర సగుణరూప శ్రీరామ్!"*

అని ప్రార్థించి యోగాగ్నిచే తన శరీరమును దహింపజేసుకొనెను. భక్తి వరమును ప్రసాదింపుమని కోరియున్నందున శరభంగుడు స్వామిలో ఐక్యమొందక వైకుంఠము చేరుకొనెను. అచ్చట చేరియుండిన ఋషులు శరభంగుని భక్తి భావమును అనేక విధముల ప్రస్తుతించిరి.

పిమ్మట రఘురాముడు మునులతోగూడి అచ్చటినుండి ముందుకు సాగెను. అట్లు పోవుచున్నప్పుడు దారిలో అక్కడక్కడ రాసులు రాసులుగా పడి

యున్న అస్థి సమూహమును మునులు శ్రీరామునికి చూపించినారై-

"ఓ రఘూత్తమా! ఇవి నిశాచరులు నిర్దయులై జరిపిన హత్యాకాండవలన ఏర్పడిన తాపసుల అస్థిపంజరములు" అని విన్నవించుకొనిరి. ఆ దారుణ దృశ్యమును గాంచి రోషోశ్చర్యుడైన రఘువీరుడు-

"ఓ మునీంద్రులారా! ఈ భూమిపై రాక్షసులను నిశ్శేషమొనరించెద, మీరు భయపడకుడు" అని చేయెత్తి ప్రతిజ్ఞ చేసెను. ఆర్తజన పరాయణుడు అయోధ్యారాముడు అచ్చటచ్చట త్రోవలోనున్న మునిపల్లెలను దర్శించుచు, తాపసాశ్రమముల నివసించుచూ భయభ్రాంతులైన మునులకు ధైర్యస్థైర్య ములు కలిగించుచూ తీర్థయాత్ర సాగించెను.

దశరథరాముడు దండకారణ్య మార్గమున తన ఆశ్రమము దిశగా వచ్చు చున్నాడని తెలుసుకొని సుతీక్ష్ణుడు సంతోషముతో దేహగేహములనే మరచి పోయెను. అగస్త్యునికి శిష్యుడు, శ్రీరామునికి అనన్యభక్తుడైన అతడు రామాగమన శుభవార్తకు ఆనందోత్సాహితుడై-

"నా స్వామి వచ్చుచున్నాడు, నా ప్రభువు నన్ను కరుణించెను, నా యాశ్ర మము పావనమయ్యెను, నేను ధన్యుడనయితిని. నా భక్తవత్సలుడు, నా కమలలోచనుడు, నా మేఘశ్యాముడు సీతాలక్ష్మణ సమేతుడై నా యెదుట ప్రత్యక్షమగును. ఆహా! నే నెంత భాగ్యవంతుడను! నా యదృష్టమే యదృష్టము గదా!" అని పలుకుచూ సుతీక్ష్ణుడు భక్తిపారవశ్యుడై రాముని దివ్యనామము స్మరించుచూ ఆడెను, పాడెను, గంతులేసెను.

ఇవ్విధముగ ఉత్సాహాతిశయముచే తన్మయుడై వనవీధులందు నృత్యము చేయుచున్న సుతీక్ష్ణుడు రామాదులు తనను సమీపించిన సంగతే తెలియక భజన చేయుచుండెను. కోసలపతి మునివర్యుని పరిపూర్ణ భక్తికి హృదయ మందే తన స్వరూపమును సాక్షాత్కరింజేసెను. ఆ దివ్యస్వరూపమును తన లోనే గాంచి ముని మూర్ఛాగతుడై నేల బడిపోయెను.

అట్లు పడియున్న మునివర్యుడు కొలది సేపటికి కన్నులు తెరచి చూడగా అతని ఎదుటనే స్వామి సీతాలక్ష్మణ సమేతుడై నిలువబడియుండెను. ఆనందా శ్చర్య నిమగ్నుడై సుతీక్ష్ణుడు సాష్టాంగపడి యిష్టదేవుని పాదపద్మములు బాష్ప జలముచే ప్రక్షాళనముచేసి అంజలి బద్ధుడై భక్తిపారవశ్యమున ఇట్లు ప్రణుతించెను-

''శ్యామ తామరస దామ శరీరం
జటామకుట పరిధనముని చీరం,
పాణిచాప శరకటి తూణీరం
నౌమి నిరంతర శ్రీ రఘువీరం.

మోహ విపిన ఘన దహన కృశానుః
సంత సరోరుహ కానన భానుః,
నిశిచర కరి వరూథ మృగరాజః
త్రాతు సదా నో భవ ఖగ భాజః.

యదపి విరజ వ్యాపక అవినాశీ
సబకే హృదయ నిరంతరవాసీ
తదపి అనుజసియ సహిత ఖరారీ
బసహు మనస మమకానన చారీ.

జేజాన హింతే జానహు స్వామీ
సగున అగున ఉర అంతర జామీ
జో కోసలపతి రాజివ నయనా
కరో సోరాము హృదయ మమ అయనా.

ఇట్లనేకవిధముల స్తుతించిన పిమ్మట మునివరుడు ''ఓ జగత్పతీ! ఓ కోసలపతీ! ఓ కృపానిధీ! ఈదాసుని కరుణించి నిష్కామభక్తిని ప్రసాదింపుము'' అని వేడుకొనెను. జానకీరాముడు సుతీక్ష్ణుని ఆప్యాయతతో గుండెల కద్దుకొని ప్రసన్నుడై ''యతీ! అఖండభక్తిని పొంది ఆనందింపుచుండుము'' అని ఆశ్వాసించెను. సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణుని కుటీరమందు ఒకింత కాలము విశ్రాంతినొంది పిమ్మట అగస్త్యుని ఆశ్రమమునకు పయన మయిరి.

ఆ సమయమున సుతీక్ష్ణుడు కరములు జోడించి - ''ప్రభూ! నేనునూ గురువులను దర్శించుకొని బహుకాలమయ్యెను. గురు దర్శనార్థమై మిమ్ముననుసరించి మహర్షి ఆశ్రమమువరకు వచ్చుటకు అనుమతియ్యవలసినది'' అని ప్రార్థింప

అందుకు సీతాపతి సంతోషించెను. ఆ నలువురు సత్కథా కాలక్షేపములతో మన పథము అధిగమించి అగస్త్యాశ్రమమును సమీపించిరి.

సుతీక్ష్ణుడు ముందు చని గురువర్యునికి సీతారామలక్ష్మణుల ఆగమనవార్త ఎరిగించెను. శ్రుతిమధురమైన యీ శుభవార్త విన్నంతనే అగస్త్యుడు దిగ్గున పైకి లేచి హుటాహుటి ఆశ్రమము వెలుపలికి వచ్చెను. సతీ సోదర సహితుముగ సాకే- తపతి సాధుపుంగవునికి సాష్టాంగపడెను. అగస్త్యుడు అమందానంద హృదయాం తరంగుడై ఆ ముగ్గురిని కౌగిట జేర్చి కుశలప్రశ్నలతో లోనికి దోడ్కొని వచ్చి సుఖాసీనులజేసి, సత్కరించెను. అచ్చట జేరిన మునిబృందము లోచనో- త్సవముగ ప్రభువు సొగసు దర్శనము చేసుకొనెను. తదుపరి మునిజన పరివృతుం డైన శ్రీరాముడు వినయ దృక్కుల అగస్త్యుని అవలోకించి-

''మునీంద్రా! నేను కాంతారవాసము చేయుటకు సంకల్పించిన కారణరహ- స్యము మీకు విదితమైయున్నందున ప్రత్యేకించి పేర్కొనదలచలేదు. మహాత్మా! నేను ప్రస్తుతము తాపస ద్వేషులైన రాక్షసవధ ఎట్లు చేయవలసి యుండునో సెలవీయ వేడుచున్నా''నని వినయోక్తుల విజ్ఞప్తి చేసెను.

అందుల కగస్త్యుడు మందహాసముచేసి ''ఓ దాశరథి! మీ భజన ప్రభా- వమున నే నొక్కించుక ప్రతిభాసంపన్నుడనైతిని. అంతమాత్రమున మీరు నన్నింత గొప్పజేసి యడుగుటకు నేను యోగ్యుడనుకాదు.

''ఓ పరాత్పరా! సకల లోకములతో, లోకస్థులతో నిండిన యీ అఖి లాండ బ్రహ్మాండమంతయూ మీ మాయాధీనమైయున్నది. ఆ మాయకు అధీశ్వరులైన మీరు మానవమాత్రులవలె నన్నడుగుచున్నారు. ఓ రామచంద్రా! సీతాలక్ష్మణ సమేతముగా నా హృదయసీమలో సాకారుడవై వసింపుము. అదియే నా ఆకాంక్ష.

''కోసలేశా! ప్రస్తుతము మీరుండుటకు గోదావరీ నదీ తీర్థమగు పంచ వటి పవిత్రమైన స్థలము. అచ్చటనే దండకారణ్య మున్నది. శాపగ్రస్తమగు దండ కారణ్యము మీ స్పర్శచే తరించవలసియున్నది'' అని అగస్త్యుడు సూచించెను. (దండకుడను రాజు ఇక్ష్వాకుని కనిష్ఠ పుత్రుడు. అతడు గురు శుక్రాచార్యుని జ్యేష్ఠ పుత్రిక 'అరజా'ను ఒకప్పుడు కామాంధుడై బలాత్కరించెను. అది తెలి సిన శుక్రాచార్యుడు దండకుని యావద్రాజ్యము నిర్మానుష్యమై ఊసరక్షేత్ర

మగుగాక - యని శపించియుండెను. అట్లు ధ్వంసమైన దండకుని రాజ్యప్రదేశము శ్రీరాముని రాకతో పునః సస్యశ్యామలమై శోభించెను. అందుచే ఆ వనమునకు దండకారణ్యమని పేరువచ్చెను.)

## పంచవటి

అగస్త్యుని ఆశ్రమమునుండి రామాదులు పంచవటికి పయనించిరి. దారిలో దాశరథి తన తండ్రికి స్నేహితుడగు గృధ్రరాజము జటాయువును దర్శించి అతనితో మైత్రి నెరపెను. క్రమముగా వారు దండకారణ్యము గుండా పంచవటికి విచ్చేసి అచ్చట నొక పర్ణశాల నిర్మించుకొని సుఖవాస మొనర్చిరి. పరమపావనమూర్తి రఘుపతి పాదస్పర్శచే శాపగ్రస్తమై దండకవనము ఫల పుష్పసంభరితమైన తరు లతావితాన మండితమై సకల జనానందకరముగ వర్ధిల్లెను.

లోకాభిరాముడగు శ్రీరాముని రాకతో అచ్చటి మునిజనులు నిర్భయులై సుఖజీవనము గడుపసాగిరి. పంచవటి పరిసర ప్రాంతమందలి వాపీకూప తటాకములు నిర్మల జలపూరితంబులై శోభించెను. తరు లతాది వృక్షసంపద ఫల పుష్ప సంభరితమై కళ కళలాడెను. పశుపక్ష్యాదులు కలసి మెలసి అన్యోన్య ప్రీతి భావముతో సంచరించెను. సకల సంపదలచే సమృద్ధమై విలసిల్లిన ఆ రమణీయ ప్రదేశమందు సీతారామ లక్ష్మణులు సుఖముగ ఒక సంవత్సరము గడపిరి.

ఒకనాడు సౌమిత్రి సోదరుని సమీపించి సవినయ మనస్కుడై ఇట్లు ప్రశ్నించెను:

"చరాచర జగంబులకు అధినాయకుడవు, సర్వజ్ఞుడవు అయిన ఓ దేవా! జ్ఞానము, వైరాగ్యము, మాయయొక్క స్వరూప సామ్యములను, జీవునికి, దేవునికి గల భేదాభేదములను విశదీకరించి బోధించ వేడుచున్నాను."

లోకోపకారార్థమై లక్ష్మణస్వామి జిజ్ఞాసతో ప్రశ్నించినందుకు శ్రీరాముడు సంతుష్టస్వాంతుడై తమ్మున కిట్లు సముచిత రీతిని సమాధాన మిచ్చెను-

"సోదరా! లక్ష్మణా! 'నీవు - నేను' అను అహంకార మమకారభావముచే పండితులు మాయ యందురు. చరాచర ప్రాణికోటి యంతయూ ఈ మాయకు వశవర్తియై సంచరించుచున్నది. మాయ విద్య - అవిద్య అను రెండు విధములుగ పరిగణించ బడుచున్నది. ఈ రెండింటిలో దుష్టమైన

అవిద్యకు లోబడి జీవులు సంసారకూపమున జిక్కుకొని దుఃఖభాజను లగుచున్నారు. విద్యారూపియగు మాయ అస్వతంత్రమైన పరమాత్మని సంక ల్పానుసారము త్రిగుణాత్మకమైన జగత్ సృష్టికి తోడ్పడుచున్నది. నా, నీ -అను మమకారమునకు చోటివ్వక సర్వం బ్రహ్మమయమను భావతత్త్వమే జ్ఞాన మన బడుచున్నది. లక్ష్మణా! సత్వ రజస్తమో గుణములను తృణ ప్రాయముగ త్యజించిన వాడే వైరాగ్య సంపన్నుడు.

''ఎంతవరకు జీవుడు తనకు, పరమాత్మకు గల సంబంధము గుర్తింప జాలడో అంతవరకు జీవుడు మాయ యనబడును. ఎప్పుడైతే తాను పర మాత్మని ప్రతిబింబమే యని గ్రహించి మాయా విముక్తుడగుచున్నాడో అప్పుడే జీవుడు పరమాత్మయని పిలువబడుచున్నాడు. అదియే ఆత్మజ్ఞానము.

''తమ్ముడూ! ఈశ్వరునియందత్యంత ప్రేమ కలిగియుండుటయే భక్తి. భక్తులకు సుఖదాయకమైన ఆ భక్తిచేతనే నేను త్వరలో ప్రసన్నుడగుచున్నాను. భక్తి పరాధీనమైనది గాక సర్వ స్వతంత్రమైనది. భగవత్ప్రాప్తికి అత్యంత సులభ మార్గమైన భక్తిభావము విరక్తివలన జనించుచున్నది. విప్రులను సేవించుటవలన, వేదోక్త ప్రకారము స్వధర్మములను అనుష్ఠించుటచేతను విషయముల పై విరక్తి కలిగి భక్తికి బాట యేర్పడుచున్నది. శ్రవణం, కీర్తనం, స్మరణం, పాద సేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, సమర్పణం- అను నవ విధ ముల నన్ను సేవించు వానికి భక్తి దృఢపడి మోక్షప్రాప్తి కలుగుచున్నది.''

ఆ భక్తి జ్ఞాన వైరాగ్య సంబంధమైన స్వాలచర్య చేసిన అనంతరము తిరిగి శ్రీరాముడు సోదరు నవలోకించి-

''అనుజా! తల్లీ, తండ్రీ, గురువు, దైవము, సర్వము నన్నుగానే భావించి శరీరము పులకింప కన్నుల నుండి ఆనందాశ్రువులు రాలుచుండ కంఠము గద్గ దికమై, యెవడు నన్ను నిష్కామ మనస్కుడై త్రికరణ శుద్ధిగా భజించునో వాని హృదయ కమలమందు నేను నిరంతరవాసము చేయుదును. అట్టి భక్తాగ్రణికి నేను వశ్యుడనని విశ్వసింపుము.''

అని చెప్పగా సుమిత్రపుత్రుడు సంతృప్తి చెంది - స్వామీ! మీ ఉపదేశ ప్రభావమున నా భక్తిభావము మునుపటి కంటే మరింత దృఢపడి నేను శంకా రహితుడనైతి - నని విన్నవించెను. అగ్రజుడు ఆనందముతో అనుజుని ఆలిం

గమము చేసుకొని ఆశీర్వదించెను. ఇట్లు సత్సంభాషణలతో, సద్గోష్ఠులతో, సాధుజన సంసర్గమున సీతారామలక్ష్మణులు పంచవటిలో విశ్రాంతిగా కాలము గడుపుచుండిరి.

# శూర్పణఖ

శూర్పణఖ రావణుని చెల్లెలు. ఆదుష్టురాలి స్వభావము నాగుబాము వంటిది. అది ఒక దినమున పంచవటిలో నున్న రామలక్ష్మణుల రూపలావణ్యములను జూచి ముగ్ధురాలై వారిని మోహించెను. ''ఓ గరుత్మంతా! సుందరులు, సమాన వయస్కులైన సుతులను, సోదరులను, తండ్రులను చూచినప్పుడు కూడ స్త్రీల మనస్సులు ఒక్కొక్కప్పుడు చలించుచుండును. సూర్యుని జూచి సూర్యకాంతమణి ద్రవించునట్లు మగవారిని గాంచినపుడు మగువల మనస్సులు మోహాధీనమగుచుండును'' అని కాకభుశుండి ఖగరాజుతో చెప్పియుండెను.

అంతట ఆ రాక్షసాంగన ముచ్చటైన మోహినీరూపు ధరించి మందగమనమున సీతాపతి చెంత కరుదెంచి మందస్మితయై మధురస్వరమున - ''ఓ రూపవంతుడా! నీవంటి మగవాడు నావంటి మగువ ఈ ముల్లోకములందు కానరారు. నాకు ఈడైన జోడు కుదరక ఇంతకాలము అవివాహితనై యుంటిని. నేడు నిన్ను చూచి నిజముగ నామనస్సు మరులుకొన్నది'' అని ఆ వయ్యారి వక్కాణించెను.

అందుకు ప్రత్యుత్తరమా యన్నట్లు దాశరథి సాభిప్రాయమున ఒక్కసారి జానకిని శిలకించి పిమ్మట శూర్పణఖతో-

''ఓ కుమారీ! నా సోదరు డతడు. అద్వితీయుడైయున్నాడు. అతని వద్దకు బొమ్మ''ని సూచించెను. ఆ మోహిని అంతట లక్ష్మణమూర్తిని సమీపించెను. సౌమిత్రి అగ్రజుని వైపొకమారు పరికించి చూచి, దానిని శత్రు సోదరిగా గుర్తించినవాడై-

''ఓ సుందరీ! నేను స్వామికి సేవకుడను. సేవకుని భార్యవై సేవకావృత్తి నేలవరించెదవు? నేను నీకు తగిన వాడనుగాదు. అన్నయ్య అన్నివిధముల

సమర్థుడు. అతను యేమి చేసినా అది శ్లాఘనీయమై యుండును. కాంతా! ఒకరికి దాసుడైన నే నెక్కడ? వరరూపవతియగు నిన్ను వరించుటెక్కడ? శూర్పణఖా! ఆకాశమునుండి పాలు పితకదలంచుట వ్యర్థముగదా!''

అని పలుకగా ఆ బేల పునః జానకీ రమణునివైపు మరలెను. అది గమనించిన రాముడు ఆ మాయావిని తిరిగి తమ్మునివైపు మరలించెను. అంతట సౌమిత్రి ఆ రక్కసి నవలోకించి-

''రూపసీ! సిగ్గు యెగ్గులులేని శఠుడే నిన్ను వరించుటకు సాహసింప గలడు. ఇచ్చట నుండి శీఘ్రమే తొలగిపొమ్ము'' అని కటుస్వరమున కసరుకొనెను.

లక్ష్మణుని కటూక్తుల కా కాముకి క్రుద్ధురాలై కొరకొరలాడుచూ భయంకర భీషణ రూపముతో సీతారాముల కడకు రివ్వున తిరిగెను. క్రూరగ్రహము భాతి వికృతాకారముతో వచ్చుచున్న రక్కసిని గాంచి సీత భయకంపితమయ్యెను. అంతట రాముడు సంజ్ఞచేయగా లక్ష్మణుడు తటాలున శూర్పణఖపై లంఘించి దాని ముక్కు చెవులు ఖండించి వికృతాంగినిగా జేసి వదలిపెట్టెను.

## ఖరదూషణుల వధ

అద్రినుండి ప్రసవించు అరుణ వర్ణమువలె ముఖము నుండి రక్తము కారుచున్న శూర్పణఖ రోదించుచూ జనస్థానమందున్న సోదరులు ఖరదూషణుల వద్దకు వెళ్ళి - ''ఒరే తమ్ములూ! ఇంక మీరూ, మీబల దర్పము లెందుకురా! మంటబెట్టనా?'' అని ఆక్రోశించి తనకు జరిగిన పరాభవమును గురించి వారికి చెప్పుకొని విలవిల వాపోయెను.

చెల్లెలి దుఃస్థితి గాంచి క్రోధ దుర్నిరీక్ష్యులైన ఖరదూషణ త్రిశిరులు పద్నాలుగు వేలమంది భటులతో యుద్ధసన్నద్ధులై అంగవిహీనయగు ఆక్కను ముందిడుకొని రెక్కలున్న నల్లని కొండలవలె హుటాహుటి కదలిరి. అనేక అస్త్రశస్త్రములు ధరించి వివిధాయుధ పాణులైన ఆ పిశితాశనులు ప్రగల్భములాడుచూ కాలాంతకుల పగిది పంచవటి దిశగా పయనించిరి.

రక్కసి మూకలరాక గమనించిన రఘురాముడు తమ్మునితో - ''లక్ష్మణా! నిశాచరులు మనపై దాడి వెడలి వచ్చుచున్నట్లున్నది. నీవు శర చాపములు ధరించి జానకిని వెంటబెట్టుకొని కొంత తడవు కొండ గుహలో నుండుము.'' అని చెప్పి పంపెను.

పిమ్మట రఘువీరుడు మందహాసము చేయుచూ వామకర భూషితంబైన తన కోదండము నెక్కుబెట్టెను. అట్లు కోదండము నెక్కుబెట్టి జటాజూటము సవరించుకొన్నప్పుడు స్వామి హస్తద్వయము నీలమణి పర్వతముపై కోటాను కోట్ల తటిల్లతలతో తలపట్లు పట్టుచున్న సర్పములవలె శోభించెను. గజ యూథంబు నవలోకించు మృగరాజువలె రఘూత్తముడా సమయమున రాక్షస సైన్యముపై దృష్టి నిగుడించెను.

ఇంతలో ఆ రక్కసులు ''పట్టుకొనుడు, బంధింపుడు, వధించుడు'' అని పెడబొబ్బలిడుచూ వచ్చి రవికుల రవిని చక్రబంధముచేసి చుట్టుముట్టిరి. అట్లు మోహరించి ముందుకు దూకదలచిన రాక్షసయోధులు సముదగ్ర తేజః పుంజమై కన్పించిన శ్రీరాముని దివ్యసుందర విగ్రహము నొకమారు వీక్షించి నిశ్చేష్టితులై నిలబడిపోయిరి. అప్పుడు ఖరదూషణ త్రిశిర సోదరులు తమ మంత్రిని చేరబిలిచి - ''సచివా! ఇంతకుపూర్వమెన్నియో మార్లు సురాసుర నర మునివరు లెంతమందినో కనియుంటిమి, కడతేర్చియుంటిమి. కాని యింతటి చక్కని శుభాకారుని ఇతఃపూర్వము చూచి యెరుగము. మన సోద రికి వికృతాకారము కలిగించియున్ననూ వీనిని వధించుటకు చేతులాడక యున్నది. కాబట్టి నీవు వానివద్దకు పోయి గుహలో దాగియున్న సుందరిని మాకప్పగించిన మేము నిన్ను ప్రాణముతో విడిచిపుచ్చెదమని చెప్పి, అందుకు వాడిచ్చు సమాధాన మేమైయుండునో కనుగొని రమ్ము'' అని చెప్పి రాముని కడకు పంపిరి.

ఆ దూత రఘురాముని చెంతకుపోయి ఖర దూషణుల అభిమతము తెలి యచేయుగా అందుకు ధీరగంభీరుడైన శ్రీరాముడు చిరునవ్వు నవ్వి ఇట్లు సమా ధానమిచ్చెను.

''ఓయీ! మేము క్షత్రియులము, మీబోటి మృగములను వేటాడుటకే

ఈ కాంతారమున సంచరించుచుంటిమి. ఆ యముడే యెదురువచ్చినా వెను దీయని వీరులము మేము. వల్లకై వచ్చి ముంత దాచినట్లు యుద్ధమునకై వచ్చిన మీకు యుక్తి ప్రసంగములతో పనియేమి? ఇదిగో! దుష్టరాక్షసులను శిక్షించి మునిజనమును రక్షించుటకై వచ్చిన మానవులము మేము, మాతో తలపడు టకు తాహత్తు లేకున్నయెడల ప్రగల్భములు కట్టిపెట్టి వచ్చినదారిబట్టి వెనుకకు మరలుడు.''

అని చెప్పగా దూత వెళ్ళి రఘువీరుని మాటలు ఖరదూషణులకు తెలియజేసెను. అంతట క్రోధోద్దీపితులైన వారు 'ఓ నిశాచరులారా! మీరు ఈ క్షణమే ఆ నరాధముని ముట్టడించి బంధింపు'డని భటుల కాజ్ఞాపించిరి.

ఆ క్షణమే నక్తంచరులు పరశు పట్టిసపరిఘశూల ముద్గర తోమర ఖడ్గాది కముల బూని, పొలికేకలు బెట్టుచూ అసహాయుడైన కోసలపతిపై విరుచుక పడిరి. ఇట్లు బిట్టార్చుచూ పైబడి వచ్చుచున్న రాక్షసులకు యెదురునిలచి రఘువీరుడు భూనభోంతరాళములు దద్దరిల్లునట్లు జ్యానిర్ఘోషమొనర్చి దుర్వా-రంబులైన శతసహస్ర నారాచములను వారిపై ప్రయోగించెను. కాకుత్స్థమణి ఖరతర బాణాఘాతములకు ఖరువి సైన్యము కకావికలై పరుగెత్తసాగెను.

బలము కోల్పోయి భయభీతులై పరుగెత్తుచున్న భటులకు పౌరుషముబోసి ఖరదూషణులు పునః యుద్ధోన్ముఖులను జేసిరి. సంగరోత్సుకులై రక్కసవీరులు మోహరించి ఒక్కుమ్మడి శ్రీరాము నెదుర్కొనిరి. రాఘవుడు రోషోద్రిక్తుడై ఆ దానవ మూకలపై శర పరంపరలు వర్షింపజేసెను. అప్రతిహతమైన రాముని శరా ఘాతములకు అసంఖ్యాకులగు రాక్షసులు నిహతులై శరీరములు ఖండింపబడి పర్వతములవలె నేలగూలిరి. నిముసములో రణాంగణ మంతయు రాక్షసుల రుధిరధారలచే రక్తార్ద్రమై బీభత్సముగొల్పెను. నిశాచరులు మాయావులు వర ప్రసాదులై యున్నందున పరులవలన వారికి చావు లేకుండెను. వారిలో వారి వలననే వారికి మృత్యువు సంఘటిల్ల గలదు. అందుచే నేలగూలిన పిశితాశనులు పునర్జీవితులై పునఃయుద్ధ సన్నద్ధులగుచుండిరి.

నిస్సహాయుడగు రఘుపతి మాయోపాయులగు ఖరదూషణ త్రిశిరాది పద్నాలుగువేలమంది రాక్షసులతో తలపడుటచూచి మునులు దేవతలు అధైర్య

పడి దిగులొందసాగిరి. అమరుల ఆతురత గమనించిన రామభద్రుడు 'శఠం ప్రతిశాఠ్యం' అను యుక్తి ననుసరించి మాయావులైన రక్కసులపై మంత్రించి మాయనే ప్రయోగించెను. దాని ప్రభావముచే రాక్షసులు ఒకరింకొకరికి రాముని రూపముతో కనబడసాగిరి. చూచుచుండగనే ఖరదూషణ త్రిశిరాది పద్నాలుగువేలమంది రాక్షసులు భ్రమకు లోనై ఒకరి నొకరు పొడుచుకొని హతశేషులైపోయిరి.

దుర్దాంత వీరులగు ఖరదూషణాది చతుర్దశ సహస్ర రాక్షసయోధులు క్షణ ములో నిర్జింప బడినందుకు మునులు, సురలు, నరులు, గుండెలమీద చేయి వేసుకొని 'ఆహా! ఇప్పటికి గదా మనము నిర్భయులమైతిమి!' అని సంతోష ముతో శ్రీరామునిపై పుష్పములు చల్లి భేరులు మ్రోగించి, స్తోత్రములుచేసి ఆనందమున మునిగి తేలిరి.

## శూర్పణఖ రావణునితో మొరపెట్టుకొనుట

వీరాధి వీరులు ఖరదూషణులు ఆహవమున హతులగుట శూర్పణఖ కన్నులతోచూచి విభ్రాంతపడి భీతిల్లెను. ఆ రక్కసి లంకకు పరుగెత్తికొనిపోయి విలపించుచూ రావణునిట్లు పరుషోక్తులాడెను.

''ఒరే అన్నయ్యా! నీ వైభవము మండిపోనూ! నీ కెందుకురా రాజ్యము? రాత్రింబవళ్ళు త్రాగి తందనాలాడుచున్నావే! రాజ్య మేగతి పట్టెనో తెలియ దాయె! ఇదిగో శత్రువు నీనెత్తికెక్కి వచ్చె, జనస్థానము నిర్మూలమైపోయె. దేశ కోశములవైపు కన్నెత్తి చూడవైతివి! ఆహా! తంత్రము లేని రాజ్యము, ధర్మము లేని ధనము, వివేకము లేని విద్య నిష్ప్రయోజనములను పెద్దల వాక్కులు నిరర్థ- కమైనవికావు. ఒరే సోదరా! ఇప్పటికైనా కండ్లుతెరచి, పగవాడు, పాము, జాడ్యము, నిప్పు -అవి ఎంత స్వల్పమైనవి అయిననూ తాత్సారము చేయక జాగ్రత్తపడవలెను. అయ్యో! నా దౌర్భాగ్యము కాకుండిన ఏ సంగతీ నీవు పట్టించుకొననపుడు నా దుస్థితిని గురించి నీకు చెప్పి లాభమేమి?''

అని నిండు సభలో వగర్చుచూ కన్నీరు మున్నీరుగా యేడ్చుచున్న సోదరిని అవలోకించి సురారి - ''అయ్యో అక్కా! నీ ముక్కు చెవులు ఛేదించబడిన

వేమి? నీకీ దుస్థితి కలిగించిన ఆ ముష్కరుడెవ్వడో చెప్పుము.'' అని శూర్ప ణఖను ప్రశ్నించెను.

''రావణా! ఇప్పటికైనా అడిగితివి కదా! ఇదిగో వినుము. రామలక్ష్మణు లని కోసలాధీశుని కొడుకు లిద్దరు దండకారణ్యమునకు వచ్చియున్నారు. అన-మానధీరులు అతిరూపవంతులు, అద్వితీయధనుర్విద్యా నిపుణులైన ఆ రాజ పుత్రులు ఈ భూమండలముపై రాక్షసజాతిని నిర్మూలించెదమని ప్రతిజ్ఞ చేసినా రట. వారి అండదండలు చూచుకొని సంన్యాసులందరు చంకలు తట్టుకొని నిర్భయులై తిరుగుచున్నారు.

దశకంధరా! వారి వెంట ఒక చిన్నది కూడ కలదు. ఆ సుందరి అంద చందము లేమని చెప్పగలను! ఆ సుదతి సౌందర్యమునకు రతీదేవి నూరుకోట్ల జన్మలెత్తినా సాటికాజాలదు. ఒరే అన్నా! రాముని తమ్ముడు లక్ష్మణుడు నేను నీ చెల్లెలని తెలుసుకొని, నా ముక్కు చెవులు తెగకోసి నన్ను పరిహసించి పంపెను. అక్కడ నుండి నేను నెత్తిమొత్తుకొనుచూ జనస్థానమందున్న సోదరు-లతోవెళ్ళి చెప్పుకుంటిని. ఏమి చెప్పుదునురా, రావణా! ఖరుని, దూషణుని, త్రిశిరుని, పద్నాలుగువేలమంది రాక్షసవీరులను ఆ రాముడొక్కడే ఒక్కక్షణ ములో ఊచకోత కోసి చంపివేసెను.''

అతి బలాధికులగు ఖర దూషణులు దుర్మరణము చెందిరని శూర్పణఖ వలన విని లంకాపతి నివ్వెరపడి నిముసము సాటునిశ్చేష్టితుడై పోయెను. పిమ్మట దశాననుడు చెల్లెలికి ధైర్యమిచ్చి సభ చాలించి విచార గంభీరుడై అంతః పురమునకు పోయెను.

ఆ రాత్రి రావణునికి నిద్రపట్టలేదు. అతడిట్లు ఆలోచింపసాగెను.

''సురాసుర నర నాగ యక్షులలో నా సహచరులకు సాటిరాగల వీరులు లేరు. నాతో సమాన బలవంతులగు ఖరదూషణ త్రిశిరులను నిర్జించగల శక్తి ఆ భగవంతునికి తప్ప అన్యులకులేదు. ఆ రాముడు అవశ్యముగా దేవుడే అయివుండవలెను. ఈ భూభార నివారణార్థమై నరరూపమెత్తివచ్చిన ఆ దేవ దేవునితో నేను వైరము కల్పించుకొనెదను. ఈ తామస శరీరముతో నే నెవ్విధ ముగనూ తపస్సు చేయజాలను, కాబట్టి భగవంతుని చేతులలో ప్రాణములు

వదలిపెట్టిన పరమపదము లభించగలదు. అట్లుగాక వారు సాధారణ రాజపుత్రులే అయి యుండిన నిముసములో వారిని నిర్జించి వారి భార్యను హరించుకొని రాగలను.''

అని నిశ్చయించుకొని లంకాపతి వెంటనే విమానమెక్కి మారీచుడు నివసించుచుండిన సముద్రతీరమునకు పోయెను.

అక్కడ పంచవటిలో లక్ష్మణుడు లేని సమయమున శ్రీరాముడు సీతతో,

''ఓ సుగుణవతీ సీతా! నేను ప్రస్తుతము మానవ మాత్రునివలె నటించి రాక్షస సంహారము చేయవలసియున్నది. అంతవరకు నీవు అగ్నిలో దాగియుండుము.'' అని బోధించెను. అంతట వైదేహి భర్త పాదములకు ప్రణమిల్లి తన ఛాయారూపమును అక్కడ వదలిపెట్టి అగ్నిలోకి పోయి దాగుకొనెను. ఈ రహస్యము లక్ష్మణునికి కూడా తెలియదని శంకరుడు పార్వతికి చెప్పెను.

## మారీచుడు

ఇక్కడ రావణుడు మారీచుని ఆశ్రమమునకు వచ్చి అతనికి తలవంచి నమస్కరించెను.

పాము, పిల్లి, అంకుశము, కోదండము, నీచుడు తలవంచిన తప్పక ముప్పు వాటిల్లును- అని మనస్సులో ఊహించి మారీచుడు రావణుని యథావిధి సమాదరించినవాడై ''ఇట్లు అకాలమున ఒంటరిగా వచ్చుటకు కారణమే''మని రాక్షసేశ్వరుని ప్రశ్నించెను.

అంతట సురారి మారీచునికి శూర్పణఖకు జరిగిన పరాభవము, ఖరదూషణాదుల మరణ వృత్తాంతమంతయూ విశదపరచి - ''ఓయీ! మాయోపాయ చాతుర్యధురీణుడవైన నీవు కపట మృగమువలె నటించిన యెడల నేనా సుందరిని హరించి తెచ్చెద''నని సూచించెను.

''దశకంఠా! నీవు ఆత్మక్షేమము ఆశించుచున్న యెడల చరాచర జగములకు నాయకుడగు రామునితో వైరము తలపెట్టకుము. రావణా! రాముడనిన యేమనుకొంటివి? అతడు తాటకిని వధించెను. సుబాహుని మర్దించెను.

న్ను నిర్వీర్యుని చేసి వదలెను. శివధనము ఖండించెను. ఖరదూషణాదులను నిర్జించెను. రాక్షసేంద్రా! అమేయ బలసంపన్నుడగు రాఘవుడు ప్రతికింపదలచిన ప్రతికించగలడు. చంపగోరిన చంపగలడు. ఓ లంకేశ్వరా! వంశ క్షేమ మాశించి - నామాట పాటించి - నరరూప మెత్తివచ్చిన నారాయణునితో కయ్యమునకు కాలుదువ్వక ఇంటికి పొమ్ము'' అని మారీచుడు బహుభంగుల హితవు పలికెను.

మారీచుని హితోక్తులకు రావణుడు మండిపడి - ''ఓరీ నీవు నాకు గురువువలె ఉపదేశించుచుంటివా! ఈ ముల్లోకములలో నాతో సమానుడగు వీరుడెవ్వడో పేర్కొనగలవా?'' - అని గర్జించెను.

## మాయలేడి

రావణుని ఆగ్రహావేశము చూచి మారీచుడు - ''వీనిని ఎదిరించిన నన్నిక్కడనే మట్టుపెట్టగలడు. వీని చేతిలో దుర్మరణముచెందుటకంటే శ్రీరాముని చేతిలో మరణించుట మోక్షదాయకము కదా!'' అని యోచించి మనసులో రాముని స్మరించుకొనుచూ మారు మాట్లాడక మారీచుడు రావణుని అనుసరించి పంచవటికి ప్రయాణమయ్యెను.

''ఆహా ఈ దిన మెంత సుదినము! నేను శ్రీరాముని దివ్యస్వరూపమును నేత్రోత్సవముగ దర్శించుకొని తరింపగలను. ధనుర్బాణములు సంధించి నన్ను వెంటాడు స్వామిని మాటిమాటికి వెనుదిరిగి చూడగల భాగ్యము నేడు నాకు సంప్రాప్తించనున్నది. సుఖ సాగరుడగు రఘువీరుడు బాణాహతిచే నాకు సద్గతి కలిగించును.'' అని తలపోయుచూ మారీచుడు మహదానంద పరవశుడై రావణునితో కూడి పంచవటి చేరెను.

అంతట మారీచుడు క్షణములో మాయమృగమై పర్ణశాల ముగింట చెంగు చెంగున గంతులేయ సాగెను. చిత్రవిచిత్ర వర్ణములలో నవరత్న భాసితమైన ఆ బంగారు లేడి శరీరమును జూచి ముగ్ధురాలయిన జానకి శ్రీరామునితో - ''నాథా! ఈ కురంగము మేని ఛాయ ఎంత మనోహరముగా నున్నది! దానిని వధించి, అందమైన దాని చర్మము తేకోరుచున్నాను.'' అని పలికెను.

ఆ జంతువుయొక్క సంగతి సందర్భములు చక్కగ తెలిసిన రఘునందనుడు దేవ కార్యార్థమై దానిని వధించుటకు మనసులో నిర్ణయించుకొని తమ్ముని లక్షించి - "భాయీ లక్ష్మణా! మాయోపాయులగు రాక్షసులు సంచరించు చుండు స్థలమిది. నే నిప్పుడే ఆ బంగారు హరిణమును బంధించి తెచ్చెద. అంతవరకు నీవు జాగరూకుడవై జానకిని కాపాడుచుండుము." అని హెచ్చరించి రాముడు ధనర్బాణములు ధరించి బయలుదేరెను. వేదములకే తెలియబడని, శివునికే అర్థముగాని అప్రమేయ మహిమా సమన్వితుడైన ఆ దేవదేవుడు మాయా మృగము వెంటబడిపోయెను.

ఆ జింక ఒకప్పుడు సమీపమునకు వచ్చి, మరొకప్పుడు దూరమునకు పరుగెత్తి, ఒక నిముసములో కనబడి, మరొక క్షణములో మాయమయి చిత్ర విచిత్ర గతుల సంచరించుచూ సీతాపతిని బహుదూరము తీసుకొనిపోయెను. ఇట్లు దానిని వెన్నంటి పరుగెత్తి తుదకు విసుగెత్తిన రామచంద్రుడు ఒక శర-రము ప్రయోగించి జింకను నేలగూల్చెను. ఆ మాయలేడి నేల గూలునపుడు, 'హా లక్ష్మణా'! యని కేకపెట్టి ప్రాణప్రయాణము సాగించెను. మారీచునికి మోక్షప్రాప్తి కలిగించిన సాకేతపతిని సకల మునిజనము శ్లాఘించి దీవించెను.

'హా లక్ష్మణా!' యను మారీచుని ఆర్తస్వరము ఆలకించిన భూపుత్రి అక్కడ సౌమిత్రితో "మరదీ! మీ యన్నగారేదో ఆపద్గ్రస్తులై అరచినట్లున్నది. నీవు తత్క్షణమే వెళ్ళి సహాయపడుము." అని భయవ్యాకులితయై పలికెను. ఆమె మాటలకు లక్ష్మణుడు చిన్నగ నవ్వి-

"మాతా! భ్రుకుటి విలాసమాత్రమున సకల భువనములను త్రుటిలో సృజించి లయింపజేయ సమర్థుడైన స్వామిని స్వప్నమందైనను సంకటములు సమీపింప జాలవు. నీవు దిగులొందక నిర్భయముగా నుండుము." అని యెన్నియో విధముల బోధించెను. కాని భయభీతయగు జానకి త్వరపడి మర్మవచనములాడి లక్ష్మణస్వామి హృదయమును నొప్పించెను. అదియేగాక హరిప్రేరణ వలన కూడ అతడా సమయమున డోలాయమానమానసు డయ్యెను. అంత రామానుజుడు వనదేవతలను, దిగ్దేవతలను, జానకిని రక్షించుచుండుమని ప్రార్థించి రాముడున్న వెనకు పోయెను.

# సీతాపహరణము

వైదేహి ఒంటరిగా నున్నది. ఇదే తరుణమని రావణుడు కపటసంన్యాసి వేషమున కూడు దొంగిలించుటకు వచ్చు కుక్కవలె ఆశ్రమమును సమీపించెను. ఆ దొంగ సాధువు జానకిని సమీపించి, నానావిధ ప్రసంగములతో ఆమె భయపడునట్లు చేసి తన ప్రేమను ప్రకటించుకొనెను. ఆ కుహనా బ్రాహ్మణుని నీచ ప్రసంగము లాలకించిన సీత ఇంచుక కినుక వహించి - ''సాధూ! నీ సంభాషణ క్రమము దుష్టముగా నున్న''దని అతనిని మందలించెను.

అంతట లంకేశ్వరుడు కుపితుడై నిజస్వరూపమును ప్రదర్శించి సీతకు తన నామ, ధామములను తెలియజేసెను. ఆ ధూర్తుని కపటప్రవర్తనకు వలించిపోయిన జానకి తత్క్షణమే ధైర్యమవలంబించి - ''ఓరీ దుష్టుడా! ఆగుము! అదిగో ప్రభువు వచ్చుచున్నాడు. ఓరీ దనుజాధమా! పోగాలము దాపురించి శశము సింహము నాశించు విధమున నీవు నన్ను కోరుచుంటివి.'' అని రోష గంభీర స్వరమున గర్జించి పలికెను.

దనుజేశ్వరుని దర్పము జూచి ఇంచుకేనియు దిగులొందని సీతను గాంచి రావణుడు ఆమె తప్పక జగజ్జననియే అయియుండునని నిశ్చయించి మనస్సునందామెకు నమస్కరించుకొనెను. పిమ్మట ఆ మదాంధుడు భూపుత్రిని రథముపై నిడుకొని గగనపథము బట్టెను.

గగన మార్గమున రావణునిచే గొంపోబడుచున్న వైదేహి భయ విహ్వలయై - ''హా నాథా! జగదేకవీరా! రఘురామా! నన్ను విస్మరించితిరా! నే జేసిన అపరాధమేమి? అన్నా లక్ష్మణా! నిష్కారణముగ నిన్ను దూషించినందుకు ఫల మనుభవించుచున్నాను. అయ్యో! నా స్వామికి నా దుఃస్థితి తెలియజేయు పుణ్యాత్ము లెవ్వరూలేరా?'' అని ఆక్రందించెను.

అట్లు నానా విధములవిలపించుచూ వాయుపథమున బడిపోవుచున్న వైదేహి రోదనధ్వని విని జటాయువు ఆమె సీతయని గుర్తించగలిగెను. వెంటనే ఆ వృద్ధ జటాయువు ''సీతాపుత్రీ! ఇదిగోనమ్మా నేను వచ్చి నిన్నిపుడే రక్షించెదను, భయపడకుము.'' అని అరచుచూ ఒక్క గంతేసి పర్వతముపై బడు పిడుగువలె దనుజాధిపుడైన దశకంఠునిపై దూకెను.

"ఒరే రావణా! దుర్ధర్షుడగు దాశరథి క్రోధాగ్ని జ్వాలలకు నీవూ, నీ వంశము భస్మమైపోగలరు. నా మాటవిని సీతను వదలిపెట్టి ప్రాణములతో క్షేమముగా నింటికిపొమ్ము." అని గృధ్రరాజు లంకేశుని మొదట హెచ్చరించెను. అయిననూ దుర్మదాంధుడగు దనుజాధిపుడు విహంగాధిపుని హితోక్తులు పాటింపక నిర్లక్ష్యముతో ముందుకు పోబోయెను. అది గమనించిన జటాయువుక్రుద్ధుడై దశాననుని కిరీటము నేలబడునట్లు తన్ని, నఖాగ్రములచే వాని శిరోజము లూడబెరికి, వాని దేహమును ముక్కుతో ఛిన్నాభిన్నము చేసి మూర్ఛాగతుని జేసెను. పిమ్మట జానకిని తీసుకుపోయి ఒక చెట్టుక్రింద దించి పునఃవచ్చి పౌలస్త్యునిపై దూకెను.

వ్రణాకింతుడైన రావణుడు మూర్ఛ నుండి తేరుకొని కోపోద్దీపితుడై పైకి లేచి, కరాళకృపాణాఘాతమున వృద్ధ జటాయువు పక్షద్వయము ఖండించి వానిని ధరాశాయిగా జేసెను. 'రామ! రామ' యని పలుకుచూ పక్షిరాజు నేల కూలి నెత్తుట దోగాడెను. పిమ్మట రావణుడు తిరిగి సీతను రథములో కూర్చుండబెట్టుకొని వాయువేగ మనోవేగమున ప్రయాణము సాగించెను.

వేటగాని చేతబడిన పిట్టవలె విలపించుచు అంతరిక్షమున బోవుచున్న రావణుని పత్ని ఋష్యమూక పర్వత శిఖరాగ్రమందున్న సుగ్రీవాదులను గాంచెను. వెంటనే ఆమె నిజాభరణములను చీర కొంగున మూటగట్టి 'హరి హరీ!' యని పలుకుచూ ఆ కపి పుంగవుల మధ్య బడునట్లు వదలిపెట్టెను. రావణుడు లంకజేరి అచ్చట భూమిజను అశోకవాటికలో భద్రముగ ఉంచెను. మాయా మృగమును వేటాడుటకై బయలుదేరినప్పుడు తుదిసారిగ దర్శించిన కోదండపాణి శ్రీరాముని దివ్యస్వరూపము మనస్సు నందిడుకొని వైదేహి విరహవ్యాకులితయై అశోకవృక్షము క్రింద వసించుచు దినములు గడుపుచుండెను.

## రాముని విలాపము

మాయా మృగమును మర్దించి ఆశ్రమాభిముఖుడై వచ్చుచున్న సీతాపతి దారిలో తన కెదురువచ్చుచున్న లక్ష్మణుని గాంచి నిర్విణ్ణుడై-

"సోదరా! నా మాట నిరాకరించి నిరంతరము నిశాచరులు సంచరించు ఈ కాంతారమున వైదేహిని ఒంటరిగా విడిచి వచ్చితివా? సౌమిత్రీ! ఇక సీత ఆశ్రమమున ఉండదేమో యని నా మనస్సు సంశయించుచున్నది." అని దీన స్వరమున పలికెను. అందుకు అనుజుడు అంజలి ఘటించి- పూజ్యా! నేను నిర్దోషిని - అని అగ్రజునితో వచించెను.

పిమ్మట సోదరు లిద్దరూ శంకార్తులై బిరబిర నిజాశ్రమమువైపు ప్రయాణించిరి. రామలక్ష్మణులు గోదావరీ తీరమందున్న పర్ణశాల సమీపించి అచట సీత లేక శూన్యముగా పడియున్న ఆశ్రమమును జూచి నిర్విణ్ణులైపోయిరి. సీతను గానలేక శ్రీరాముడు దీనహీనుడగు ప్రాకృత మానవునివలె పరిపరివిధముల పరితపించసాగెను.

వైదేహివియోగ విహ్వలుడైన శ్రీరాముడు ప్రియురాలికై వనమంతయూ గాలించెను. చెట్లను శోధించెను. పుట్టలను వెదకెను. గుట్టలను తిరిగెను. పిట్టలను పలుకరించెను. విహ్వలుడైన సాకేతపతి అతిదీనుడై ఆర్తస్వరంబున "నా జానకీ! నా సీత! నా రూప గుణశీల! నా ఆత్మీయ! యెచ్చటికి బోయెను? యెందున్నది? యెవరు చూచితిరి?" అని ఎదురుపడిన ప్రతి వస్తువును ప్రతి ప్రాణిని ప్రశ్నించెను-

*"హే ఖగ మృగ మధుకర శ్రేనీ!*
*తుమ్హ దేఖీ సీతా మృగనయనీ!*
*ఖంజన శుక కపోత మృగ మీనా!*
*మధుపనికర కోకిలా ప్రబీనా!*
*కుందకలీ దాడిమ దామినీ!*
*కమల సరద ససి అహి భామినీ!*
*బరున పాస మనోజ ధనుహంసా*
*గజ కేహరి నిజ సునత ప్రసంసా!"*

ఇట్లు కామార్తునివలె జానకీప్రియుడు విరహాతురుడై జడచేతనముల

భేదము పాటింపక తరువులను, లతలను, విహంగములను, మృగములను, ఫల పుష్పాదులను లక్షించి సీత సంగతి చెప్పుమని ప్రాధేయపడెను. పిమ్మట ఎలుగెత్తి "ఓ జానకీ నాపై నీకు కోపమా! ఎందు దాగియుంటివి! నిన్ను జూడక నీ రాముడు ఉండలేడు!" అని దుర్భహ దుఃఖభాగుడై ప్రార్థించెను. శోకసంతప్త మానసుడై దురపిల్లుచుండిన రఘూత్తముని ఓదార్చుటకు లక్ష్మణుడు శతసహస్ర విధముల ప్రయత్నించి విఫలుడైపోయెను.

## జటాయువు దహన సంస్కారము

అట్లు పూర్ణకాముడగు శ్రీరాముడు పత్నీ వియోగమున సామాన్య మానవునివలె వివిధరీతుల విలపించుచూ సీతను గానక దండకారణ్యమును తిరుగుచున్నప్పుడు ఒకచోట రామనామము స్మరించుచూ క్షతగాత్రుడై పడియున్న జటాయువును దర్శించెను. ఆ స్థితిలో వృద్ధజటాయువు పడియుండుట గాంచి దయానిధి తన సీతావియోగ దుఃఖమును క్షణములో మరచిపోయెను.

దీనమలిన రక్తసిక్తాంగుడై పక్షములు లేక ప్రాణావశేషములతో పడియున్న పతగేంద్రుని పైకి లేవనెత్తి అంకమున జేర్చి దాశరథి దయార్ద్ర స్వరమున "ఓ పక్షిరాజా! నన్ను వదలి ఒంటరిగా యెక్కడి కేగియుంటివి! యెందుకీ కీడు మూడె?" అని రుద్ధకంఠుడై పలికి కంట నీరు బెట్టుకొనెను.

సీతాపతి శీతల కరస్పర్శచే విగతశ్రముడైన ఖగేంద్రుడు హీనస్వరముతో "దేవా! దశాననుని దౌష్ట్యము వలన నాకీ దుర్గతి ప్రాప్తించెను. ఆ దనుజాధముడే సీతమ్మను అపహరించుకొని దక్షిణదిశగా పారిపోయెను. స్వామీ! యేమి చెప్పుదును? కురరీ పక్షివలె జనకపుత్రిక యెలుగెత్తి యేడ్చుచుండెను. నాథా! మీ దర్శనార్థమై ప్రాణముల నిలబెట్టుకొని ఇంతవరకూ బ్రతికియున్నాను." అని చెప్పగా సాకేతనాథుడు శోకసంతప్తుడై - "పూజ్యుడా! ప్రాణత్యాగము చేయక బ్రతికి యుండుమని" జటాయువును ప్రార్థించెను. అందుకు పక్షీంద్రుడు మందస్మితుడై "దేవా! సకల జీవులకు సద్గతి ప్రసాదించు పరమాత్మ స్వరూపుడవగు నిన్నుగాంచి నీ నామము స్మరించి నేను ధన్యుడనైతిని, ఇక నాకీజీవన మెందుకు?" అని పలికెను.

''తండ్రీ పరోపకార పరాయణునికి లోకములో లభ్యముగాని దేమున్నది? పూర్ణకాముడవగు నీవు ఈ నశ్వరశరీరము త్యజించి నా లోకము చేరుకొని సుఖింపుము. తాతా! కానీ ఒక్కమాట. స్వర్గమందున్న మా తండ్రిగారికి సీతా వియోగవార్త విన్నవించవలదు. నేనే నిజముగ రాముడయిన యెడల త్వరలోనే దశకంఠుడు తన సతీసుత సోదర సమేతముగా స్వర్గమునకు వచ్చి స్వయముగా ఈ వార్త నా తండ్రికి తెలియజేయగలడు.'' అని రఘువీరుడు విన్నవించెను.

తదనంతరము జటాయువు ప్రాణములు వదలిపెట్టి హరిసారూప్యమును బొందెను. పీత వసనధారి, చతుర్భుజుడు, దివ్యాలంకార శోభితుడగు వైకుంఠుని రూపు ధరించిన జటాయువు - శ్రీరాముని అనేక ప్రకారముల స్తుతించి వైకుంఠము చేరుకొనెను. రఘుపతి యథోచిత రీతి భక్తి శ్రద్ధలతో గృధ్రరాజుకు దహనోత్తర క్రియలు జరిపెను. ''పార్వతీ! మాంసాహారి, అధమ జాతీయుడు, పక్షిమాత్రీయుడగు జటాయువు నిర్హేతుక - కృపాకటాక్ష వీక్షణుడగు దశరథ రాముని ధ్యానించి మునీంద్రుల కలభ్యమైన సద్గతి బొందెను'' అని శంకరుడు సతికి తెలియజేసెను.

## కబంధుడు

రామలక్ష్మణులు సీతాన్వేషణ చేయుచూ దుర్గమారణ్య మార్గమున బడిపోవుచుండిరి. దారిలో కాకుత్స్థమణి కబంధుని సంహరించి వానికి శాప విమోచనము కలిగించెను. ఈ కబంధుడు పూర్వజన్మలో నొక గంధర్వుడు. ఒకమారు వాడు ఇంద్రసభలో గానము చేయగా దుర్వాసమునికి తృప్తి కలుగలేదు. అందుపై గంధర్వుడు దుర్వాసుడు సంగీతజ్ఞుడు కాడని ఆక్షేపించి పరిహసించెను. దానికి మహర్షి క్రుద్ధుడై వానిని రాక్షసుడుగా జన్మించుమని శపించెను. వాడు ముని శాపముచే రాక్షసుడై పుట్టి భయోత్పాతములు కలిగించుచుండ ఇంద్రుడు వజ్రాయుధముతో వాని శిరస్సు నరికెను. అట్లు తెగిన వాని తల కడుపులోనికిపోయెను. కానీ వాడు చావలేదు. అందుకే వానికి కబంధుడని పేరు కలిగెను. కబంధుడు వేడుకొనగా ఇంద్రుడు వానికి ఆహారసంగ్రహణార్థమై చేతులు పొడవుగా ఉండునట్లు అనుగ్రహించెను. కబంధుడు ఆనాటి నుండి యోజనాయుతమైన తన బాహువులకు అందుచుండెడి జీవ జంతువులను

భక్షించి తృప్తుడగుచుండెను. సీతాన్వేషణార్థమై తిరుగుచున్న రామలక్ష్మణులు వాని హస్తములలో తగులుకొనగా సీతాపతి వాని బాహువులు తెగటార్చి సంహరించెను.

## శబరి

అక్కడ నుండి రామలక్ష్మణులు శబరి యాశ్రమము చేరిరి. భిల్లాంగన శబరి పూర్వము మతంగ మహాముని ఆశ్రమములో నుండి అతనికి సపర్యలు చేయుచుండెను. "శబరీ నీవు ఇచ్చటనే యుండుము, కొంత కాలమునకు శ్రీరాముడు వచ్చి నీకు దర్శన మీయగలడు" అని చెప్పి మతంగుడు పరమధామమునకు చేరుకొనెను. పదివేల సంవత్సరముల నుండి శబరి శ్రీరాముని రాకకై నిరీక్షించు చుండెను.

సరసిజలోచనులు, విశాల బాహులు, జటా, మకుటధారులు, ఉరమున వనమాల ధరించిన వారు, శ్యామల, గౌర వర్ణ శరీరులైన రామలక్ష్మణులను జూచి శబరి వారి పాదములపై బడి ప్రణమిల్లెను.

*"సరసిజ లోచన బాహు విశాలా*
*జటా మకుట సిర ఉర వనమాలా,*
*శ్యామ గౌర సుందర దోఉ భాయీ*
*శబరీ పరీ చరణ లపటాయీ."*

మహదానంద భరితయైన శబరి రామలక్ష్మణుల పాదపద్మములను భక్తిశ్రద్ధలతో పూజించి సుఖాసీనుల జేసి మధురములగు కందమూల ఫలములను వారి యెదుట ఉంచెను. దాశరథి పలుమార్లు ఆ పండ్ల మాధుర్యమును మెచ్చుకొనుచూ వానిని భుజించి సంప్రీతుడయ్యెను. అనంతరము భక్తవత్సలుడగు రాముడు శబరి నిర్మల భక్తికి ముగ్ధుడై ఆమెకు భక్తి మార్గము యొక్క సర్వోత్కృష్టతను బోధించి సంతోషపెట్టెను.

శబరి మతంగ మహాముని యొక్క భవిష్యద్వాణి- అనగా సీతాపహరణము రావణుని మరణము, పునః రామపట్టాభిషేకము - మొదలు వృత్తాంత

మంతయు స్వామికి తెలియబరచి, 'దేవా! మీరు పంపా సరోవరమునకు పోయి, అక్కడున్న ఋషి బృందమునకు మీ దర్శన భాగ్యము కలుగజేసి, సుగ్రీవునితో సఖ్యము జేయుడు, సర్వము సానుకూలమగును' అని విన్నవించు కొనెను. తదుపరి శబరి పునరఘూత్తముని పాదపద్మములకు నమస్కరించి ఆ దివ్య సుందర విగ్రహమును కన్నులతో చూచుకొనుచూ యోగాగ్నిచే తన శరీరమును దహింపజేసుకొని జన్మరాహిత్యము పొంది దివ్యధామమును చేరుకొనెను.

## రామలక్ష్మణులు పంపా సరోవరము చేరుట

మతంగ మహర్షి ఆశ్రమమును వీడి రాజసింహులైన రామలక్ష్మణులు వన సింహముల వలె కానన మార్గమున ముందుకు పయనించిరి. గహన గంభీర మగు విపిన వైభవము చూచి జానకీ రమణుని మనస్సు భావ పూరితమగు చుండెను. ఆ యడవి దారులందు అక్కడక్కడ గుంపులుగూడి, జతలు గట్టి అటు ఇటు స్వేచ్ఛగా సంచరించుచున్న జీవ జంతువులనుగాంచి రామచంద్రుని మనస్సు చిన్నబోయెను. అతడు లక్ష్మణుని లక్షించి - "సోదరా! ఆ జంట పక్షుల వింత సోయగము ఒక్కసారి చూడుము. ఈ జోడు మృగములు యెంత ముచ్చటగా తిరుగుచున్నవో గమనించుము. దాంపత్య సుఖముతో హాయిగా విహరించుచున్న ఈ వన్య జీవులు భార్యను పోగొట్టుకొని - యేకాకి నైన నన్ను జూచి పరిహసించు చున్నవి." అని దీన స్వరమున బలికి దాశరథి మరల ఇట్లు ప్రవచించెను.

"తమ్ముడూ! అదిగో ఆ స్త్రీమృగము తన పెనిమిటితో ఆయువ బంగారు మృగమును వెదుకుచున్నాడు. మనము భయపడవలసిన పనిలేదని నన్ను జూపించి చెప్పుచున్నది. ఇటు చూడుము, ఈ మగ యేనుగు ఆడుదానిని అనుక్షణము వెంటవిడుకొని యుండవలెనని నాకుపదేశించుచున్నట్లు తన ఆడ యేనుగును వెంట బెట్టుకొని పోవుచున్నది. సౌమిత్రీ! విజయునకు శాస్త్రమును, స్త్రీని, రాజును, ప్రతిక్షణము సేవించుచుండవలెను. లేకుండిన వారు వశ్యులు గారనుమాట లోక సిద్ధముగదా!"

''లక్ష్మణా! పక్షుల కలకలా రావములతో, నానా విధ జంతు సముదాయములతో, తరులతో, గుల్మములతో, వివిధ వర్ణ పుష్పసౌరభములతో, మందసుగంధ శీతల పవనములతో, సరోవరములతో, గిరులతో, దరులతో, ఝరులతో, వాగువంకలతో, సకల ప్రకృతి సంపదలతో విలసిల్లుచున్న ఈ వసంత వనశ్రీ యెంత హృద్యముగానున్నది! ఆహా! మన్మథుడు తన సమస్త శక్తి యుక్తులతో ఈ కానన సీమలో విజృంభించి విరహా వ్యాకులుడగు నన్ను ఓడించుటకై విశ్వప్రయత్నములు చేయుచున్నాడు. సోదరా! వీను జూచి వాడు నామీద దండెత్తుటకు వెనుకాడుచున్నట్లున్నది. లక్ష్మణా! భావజుని ప్రభావమునకు లొంగని వాడే ఈ లోకమున మాన్యుడగుచుండును. మనోజుని బలమంతయు మగువ యందిమిడియుండును. కామ, క్రోధ, లోభములను నిర్జించిన వాడు గదా యోగ్యుడు.'' అని అగ్రజుడు అనుజునికి బోధించెను. ''గిరిజా! త్రిగుణాతీతుడు, సర్వాంతర్యామి, చరాచర జగన్నాథుడు శ్రీరాముడు. అతడు కామార్తునివలె సామాన్యలోకమునకు వియోగ దుఃఖమును వెల్లడించెను.'' అని త్రిపురారి పేర్కొనెను.

అనంతరము రామ లక్ష్మణులు నయనానంద కరమైన పంపాసరోవర తీరమునకు విచ్చేసిరి. చంపక, వకుళ, కదంబ, పాటల, పనస, పలాశ, రసాలాది నానావిధ తరులతా పరివృతంబై, చక్రవాక జల కుక్కుట బక భ్రమర కలహంసాది విహంగ కూజితమై, వివిధ వర్ణ పుష్ప సౌరభ సమన్వితమైన యీ కాసారము మనో మోహకమై యలరారు చుండెను. మనోజ్ఞమై యొప్పుచున్న ఆ పంపా సరోవరమున జలకమాడి తదీయ తీరస్థ వృక్షచ్ఛాయలో శ్రీరాముడు అనుజ సమేతుడై విశ్రమించెను.

ఆ సమయమున నారదుడు - నా శాపము స్వీకరించి విరహా వ్యాకులుడై తిరుగుచున్న స్వామిని దర్శించుకొని వచ్చెద - అని తలంచి రాముని కడకు వచ్చెను. యథాప్రకారము కుశలానంతరము నారదముని కేలుగీలించి ''దయానిధివైన ఓ దాశరథీ! పౌర్ణమీ చంద్రునివలె నీ భక్తి నాహృదయమున సదా ప్రకాశించుచుండుగాక.'' యని వేడుకొని 'ఓ జగన్నాథా! ఆ దినము నేను మాయా ప్రేరణచే విశ్వమోహినిని మోహించినపుడు నన్నేలభంగపరచితిరి?'' అని బ్రహ్మ మానస పుత్రుడు భక్తివినయముల ప్రశ్నించెను.

"ఓ నారదా! తల్లి చిన్న బిడ్డలను కాపాడుచుండు విధమున నేను నా భక్తులను సదా రక్షించుకొనుచుందును. మునిరాజా! జ్ఞానులైనవారు స్వబలముపైనను, భక్తులు నా బలముపైనను ఆధారపడియుందురు. కామక్రోధాదులు ఇరువురిని సమానముగ బాధించుచుండును. కాబట్టి జ్ఞానులు సైతము భక్తిమార్గము అవలంబించి నన్ను భజించుచుందురు. మునివర్యా! అన్నిటికంటే మోహినీ రూపియగు స్త్రీమాయ కడు దుర్వారమైనది. హృదయ కాననమును నానావిధవిషయ వాసనలచే పరిమళింపజేయగల వసంతమువంటిది స్త్రీ. (మోహబిపినకహు నారి బసంతా) పాపములకు, దుఃఖములకు, అవగుణములకు, సకల దోషములకు మూలమైన స్త్రీ మాయ నుండి రక్షించుటకై నాడు నీ వివాహమును నేను భంగపరచితిని."

అని శ్రీరాముడు చెప్పగా మహర్షి విగతసంశయుడై భక్తపరాధీనుడగు భగవానుని వేనోళ్ళ ప్రస్తుతించి "స్వామీ! సాధుపురుషుల లక్షణము లెట్లుండునో కరుణించి వివరింపు"మని కోరగా దాశరథి దయాంతరంగుడై నారదున కిట్లు సమాధాన మిచ్చెను-

"నారదా! ఏ సత్పురుషులకు సర్వదా నేను వశుడైయుందునో వారి గుణ స్వభావములను గురించి వివరించెద సావధానుడవై ఆలకించుము.

"కామ క్రోధాదులు నిర్జించినవాడు, పాప రహితుడు, అకాముడు, అకించనుడు, శుచివంతుడు, సత్యవ్రతుడు, నిత్యసంతోషి, జ్ఞానసంపన్నుడు, మితభోగి, పండితుడు, యోగి, కర్తవ్యతాతత్పరుడు, నిరభిమాని, భక్తుడు, ధీమంతుడు, గుణవంతుడు, ఆత్మస్తుతి అభిలషించనివాడు, సంయమశీలుడు, నీతిమంతుడు, భూతప్రియుడు, గురు బ్రాహ్మణుల సేవించువాడు, శ్రద్ధ, క్షమ, దయ, మైత్రి, త్యాగము, విరక్తి, వేదజ్ఞానముగలవాడు, నా లీలను గానము చేయువాడు, పరహిత రతుడు మున్నగు వారు సాధుపురుషులు. నారదా! సత్పురుషుల గుణ స్వభావములను వివరించి చెప్పుటకు శారదకు, శేషునికి సైతము సాధ్యపడదు." అని శ్రీవారు విస్పష్టముచేయ అందులకు నారదుడు ముదమంది "స్వామీ! నీ భక్తుల గుణగణములను నీ ముఖతః వినగలిగి ధన్యుడ

నైతి'' అని పలికి మహర్షి శ్రీపతి పాదపద్మములకు ప్రణమిల్లి బ్రహ్మలోకము నకు ప్రస్థాన మొనరించెను.

రావణారి శ్రీరఘురాముని దివ్యచరిత్రమును ఆలకించినవారు, ఆలాపించిన వారు జప తపాదిసాధనా రహితులైనను విశ్చలమగు రామభక్తిని పొంది సుఖించు చున్నారు.

ఇతి శ్రీమద్రామచరిత మానసే
సకల కలి కలుష విధ్వంసనే
విమల వైరాగ్య సంపాదనో నామ
తృతీయః సోపానః సమాప్తః.

(అరణ్యకాండ సమాప్తము.)

# కిష్కింధా కాండ

కుందేందీవర సుందరా వతి బలౌ విజ్ఞాన ధామావుభౌ,
శోభాఢ్యౌ వరధన్వినౌ శ్రుతినుతౌ గోవిప్రబృంద ప్రియౌ,
మాయామానుష రూపిణౌ రఘువరౌ సద్ధర్మ వర్మౌ హితౌ,
సీతాన్వేషణ తత్పరౌ పథిగతౌ భక్తిప్రదౌ తౌ హి నః॥

ఏ పుణ్యభూమియందు నివసించినను, యే స్థలముయొక్క నామము స్మరించినను, యొచ్చట అసువులు బాసినను, సకలజీవులకు మోక్షము లభించుచున్నదో అట్టిపవిత్ర కాశీనగర నివాసులైన పార్వతీపరమేశ్వరులకు నమస్కరించుచున్నాను. (తులసీదాసు.)

## సుగ్రీవునితో మైత్రి

ముందు చెప్పిన ప్రకారము శ్రీరాముడు సీతాన్వేషణ చేయుచూ అనుజ సమేతుడై ఋష్యమూక పర్వతమును సమీపించెను. మంత్రులతో మిత్రులతో హితులతోగూడి ఋష్యమూక పర్వతముపై నివసించుచుండిన సుగ్రీవుడు అతులబల సంపన్నులగు రామలక్ష్మణులు తమ దెసకు వచ్చుచుండుట చూచి శంకార్తుడై హనుమంతుని అవలోకించి ఇట్లనెను-

"ఆంజనేయా! ఆ వచ్చుచున్న వీరులెవరో గమనించితివా! నీవు వెంటనే బ్రహ్మచారి రూపమున వెళ్ళి వారి ఊరు, పేరు, ఆగమనోద్దేశ్యము మొదలగునవి తెలుసుకొనిరమ్ము. ఒకవేళ వారు వాలిచే పంపబడిన ధూర్తులైయుండిన యెడల నాకు సంజ్ఞచే తెలియజేయుము. తత్క్షణమే మేము ఈ స్థలము వీడి, వేరొండు సురక్షిత ప్రదేశమునకు చేరుకుందుము" అని చెప్పి పంపెను.

అంతట వాయుపుత్రుడు విప్రోత్తమునిరూపు ధరించి, రామలక్ష్మణులను సమీపించి, నమస్కరించి- "ఓ రాజపుత్రులారా! మీ నామ, ధామము లెవ్వి? ఏకతమున మీరీ వనాంతరముల భ్రమ్మరుచుంటిరి? మీరు బ్రహ్మ మహేశ్వ

రులా! లేక నర నారాయణులా! అథవా భూభార నివారణార్థమై అవతరించిన జగన్నాయకులా?'' అని ప్రశ్నించెను.

''విప్రోత్తమా! కోసలేశుని కుమారులగు రామలక్ష్మణులము మేము. పితృ వాక్య పరిపాలనాసక్తులమై ఈ వనప్రాంతముల సంచరించుచుంటిమి. మాతో నున్న ఒక స్త్రీ రత్నమును అసురులు అపహరించగా ఆమెను వెదుకుచూ తిరుగుచున్నాము. విప్రుడా! ఇక నీ పూర్వోత్తరములు కూడ తెలియజేసిన సంతసింతుము'' అని సాకేతరాముడు సమాధాన మిచ్చెను.

కర్ణపేయమైన శ్రీరాముని అమృతోక్తులు వీనులకు సోకగనే కపివీరుడు తన స్వామిని గుర్తించగలిగెను. వాయుసూనుడు పరమానంద హృదయుడై స్వస్వ రూపముతో చేతులు జోడించి స్వామిపాదముల పైబడి-

''తవ మాయా బస ఫిరవు భులానా,
తా తే మైఁ నహిఁ ప్రభు పహిచానా.''

''స్వామీ! సేవకుని దోషము సైరింపవలెను. మందమతినగు నేను మోహ వశుడనై మిమ్ము గుర్తించజాలక మూఢునివలె ప్రశ్నించినందుకు నన్ను క్షమిం పుము. ప్రభూ! మీరునూ నన్నిట్లు మానవమాత్రునివలె పృచ్ఛించుట భావ్యమా?'' అని కపివీరుడు పలువిధముల పశ్చాత్తాపము ప్రకటించుచూ ప్రార్థించెను.

దయానిధి దాశరథి ఆంజనేయుని ఆప్యాయముగ పైకి లేవనెత్తి, గాఢాలిం గనము చేసుకొని, కనుల ప్రేమాశ్రువులు స్రవించుచుండ ప్రియమార ఇట్లు పలికెను-

''హనుమంతా! నీవు నాకు సౌమిత్రికంటే శతగుణముల ప్రియపాత్రుడవు. హనుమాన్! నేను సమదర్శినని లోకములు చెప్పుచుండును. అయిననూ, అనన్యభావముతో నన్నొక్కనినే నమ్ముకొనియున్న భక్తులు మాత్రం నా కత్యంత ప్రీతిపాత్రులై యుందురు. కనుక నీ విందులకై ఇంచుకంతయు చింతిల్ల వలదు'' అని సుగుణాభిరాముడగు శ్రీరాముడు పచించెను.

తదుపరి ప్రభువు ప్రియవచనములకు అంజనీపుత్రు డత్యంత ప్రసన్న చిత్తుడై కేలు మోడ్చి-

"దేవా! వానరరాజు సుగ్రీవుడు ఇచ్చటికి సమీపమందున్న ఋష్య మూకాద్రిపై సచివ సమేతముగా నివసించుచున్నాడు. ఆ సత్పురుషుడు సదా మీ స్నేహాభిలాషి, మీ ప్రేమకు పాత్రుడు. ప్రస్తుతము సుగ్రీవుడు అసహాయుడై యున్నాడు. దైన్యస్థితిలోనున్న వానరేశ్వరునికి అభయ ప్రదానముచేసి, అతనితో మైత్రి నెరపిన, సీతాన్వేషణ కార్యమున మీ కన్ని విధముల సహాయపడగలడు." అని విన్నవించి, హనుమంతుడు రామలక్ష్మణులను తనభుజములపై యెక్కించుకొని ఒక్క యెగురున పర్వతముపైకి చేరెను.

సుగ్రీవాదులు రఘువీరులను అత్యంతాదరముతో సత్కరించి గౌరవించిరి. రామలక్ష్మణులను దర్శించి వారితో స్నేహము చేయగలిగినందుకు సుగ్రీవుడు తన జీవితము ధన్యమైనదని సంతసించెను. ఆంజనేయుడు, సుగ్రీవుని వృత్తాంతమంతయును శ్రీరామునికి తెలిపి వారుభయులకు శుభకరమైన, స్థిరమైన స్నేహము సంఘటింప జేసెను. రామ సుగ్రీవులు అగ్నిసాక్షిగ మైత్రి నెరపిరి.

అనంతరము సౌమిత్రి చెప్పగా సీతాపహరణ వృత్తాంతమంతయు ఆలకించి సుగ్రీవుడు దుఃఖితుడై మిథిలేశనందిని తప్పక లభించగలదని రామలక్ష్మణులను ఆశ్వాసించెను. ఆనాడు ఆకాశమార్గమున రావణునిచే గొంపోబడుచున్నపుడు జానకి 'హారామా!' యని ఆర్తధ్వనిచేయుచూ వెళ్ళిన సంగతి వారికి శ్రుతపరచి ఆమె వదలిపెట్టి వెళ్ళిన వస్త్రాభూషణములు తెచ్చి వారికి చూపించెను. ఓ రఘువీరులారా! భూపుత్రిని తప్పక సాధించగలము, మీరు అధైర్య పడవలసిన పనిలేదు. అని సుగ్రీవుడు ధైర్యోక్తులు పలికెను. లక్ష్మణుడు వదినె కాలి యందియలు మాత్రము గుర్తించి వ్యథిత చిత్తుడాయెను.

## వాలి సుగ్రీవుల వృత్తాంతము

తదుపరి రఘూత్తముడు సుగ్రీవు నవలోకించి "వానరనాథా! మీ పుట్టు పూర్వోత్తరము లెయ్యవి! ప్రస్తుతము మీ రీ గిరిపై నివసించుటకు కారణ

మేమి! తెలుసుకొన గోరెద'' నని పలింప - సుగ్రీవుడు స్వామికి తన పూర్వ చరిత్ర ఇట్లు విన్నవించెను.

''ఓ రఘువంశోత్తమా! రామా! ఒకప్పుడు బ్రహ్మ తన కంటిలోని పుసి దీసి గోటితో దానిని భూమి మీదకు చల్లెను. ఆ పుసిలో నుండి బలవంతు డగు వానరు డొకడు ఉద్భవించెను. పరమేష్ఠి వానికి ఋక్షరాజను పేరిడి వానిని వనంలో స్వేచ్ఛగా విహరించుచూ రాక్షస సంహారము చేయుచుండుమని ఆదే శించెను. అట్లు వనచారియై సంచరించుచున్న ఋక్షరాజు ఒకనాడొక కొల నులో దూకి వెలుపలికి వచ్చునప్పటికి చక్కని స్త్రీగా మారిపోయెను.

''ఆ సుందరి సౌందర్యముచూచి ఇంద్రుడు మోహవశుడయ్యెను. అటు లనే ఆ ఇంతి అందచందములకు భ్రమించి సూర్యుడు మోహించెను. రఘూ త్తమా! ఆ స్త్రీకి ఇంద్రుని అంశమున వాలియు, సూర్యునివలన నేను ఉద్భ వించితిమి. మమ్ము కనిన పిమ్మట ఆమె యథాపూర్వము ఋక్షరాజుగా మారి పోయెను. తదుపరి మేము సోదరు లిరువురము తండ్రి సహాయమున బ్రహ్మ లోకము వెళ్ళితిమి. పద్మజుడు మమ్మవలోకించి - ''మీరు కిష్కింధానగరము నకుపోయి రాజ్యసుఖము లనుభవింపుడు, కాలాంతరమున శ్రీహరి రామావతా రమున అచ్చటికి వచ్చి మీకు శుభము చేకూరజేయును-'' అని యానతిచ్చి పంపెను.

''రఘుపతీ! అనంతరము మేము ఉభయులము కిష్కింధలో ప్రేమతో కలసి మెలసి సుఖజీవనము గుడుపుచుంటిమి. ఒకనాడు మయుని కొడుకు మాయావి యుద్ధోన్మాదుడై మా పైకివచ్చి అర్ధరాత్రివేళ నగరబహిర్ద్వారమును తట్టెను. శత్రుదర్ప మేమాత్రము సహించజాలని మాఅన్న వాలి ఆగ్రహోద గ్రుడై వాని పైకి ఉరికెను. మేరు ధీర గంభీరుడగు వాలి వైఖరి చూడగానే మాయావికి గుండె దడబుట్టెను. వాలి వెన్నంటి తరుముగా మాయవి భీరువు వలె పరుగెత్తుకొనిపోయి ఒక కొండగుహలో దూరి దాక్కొనెను. అంతట వాలి నన్ను చూచి ''సోదరా! నేను ఈ పొగరుబోతుమాయావిని వెన్నంటి గుహలోనికి పోయెదను. నీవు ఈ గుహాద్వారము వద్ద పదిహేను దినములవరకు నాకై వేచియుండుము. అప్పటికి నేను తిరిగి రాజాలని యెడల

రాక్షసుడు నన్ను సంహరించెనని భావించుము -'' అని చెప్పి అగ్రజుడు గుహాంతర్భాగములోనికి చొచ్చుకొని పోయెను.

ఆనాటినుండి నే నా గుహాద్వారమువద్ద ఒక్క మాసము రోజుల వరకు కాచుకొని యుంటిని. వాలి తిరిగి రాలేదు. సరికదా గుహలో నుండి రక్తధార బయటికి రాసాగెను. అదిజూచి నేను అగ్రజు డా దైత్యుని చేతిలో మడిసి యుండునని నిశ్చయించుకొంటిని. ఇక ఆలస్యముచేసిన ఆ మాయావి వెలు వలికివచ్చి నన్నుకూడ మట్టుపెట్టగలడని వూహించి, వెంటనే గుహద్వారమును ఒక పెద్ద రాతిఖండతో కప్పివైచి, నేను నగరము వచ్చి చేరుకొంటిని. పంపా పురవాసులు వాలి దుర్మరణము పాలైనందుకు దుఃఖించి నన్ను రాజ్యాభిషిక్తుని జేసిరి.

''అనంతరము కొద్ది దినములకు మా అన్న వాలియే ఆ మాయావిని మృత్యులోకమునకు బంపి కిష్కింధకు వచ్చెను. రామచంద్రా! నిష్కారణముగా వాలి నా పూర్వచర్యను గర్హించి నన్ను శంకించెను. అతడు గద్దెనుండి నన్ను క్రిందకు నెట్టి, భార్యతో సహా నా సర్వస్వమును హరించి, నాతో శత్రుత్వము వూనెను. అతి బలశాలియగు వాలి నెదుర్కొను శక్తిలేక, భార్యను, ఇల్లు, వాకిలి వదలిపెట్టి, ఈ గిరిశిఖరముపై ప్రవాస జీవనము గడుపుచున్నాను. ముని శాపమున వాలి ఈ కొండపైకి రాజాలకున్నందుకు నేను ప్రాణములతో బ్రతికియున్నాను.'' అని సుగ్రీవుడు దుఃఖస్వరమున తన దీనగాథను శ్రీరామున కెరిగించి పరితపించెను.

అతని దీనస్థితికి దాశరథి హృదయము చలించిపోయెను. కృపాళువు శ్రీరామ మూర్తి కరుణార్ద్ర హృదయుడై కోదండము చేబూని, ''సఖా సుగ్రీవా! దుఃఖా ర్తుడగు మిత్రుని చూచి దుఃఖించని వాని ముఖము చూడరాదు. తాను గొప్ప విపత్తులో నుండినమా, దానిని గణించక స్నేహితునికి రవంత బాధ యేర్పడి నమా, సహాయోద్యుక్తుడు కావలెను. అట్లు కానివాడు సన్మిత్రుడు కాజాలడని సత్పురుషులు వచించిరి. సుగ్రీవా! ఇదిగో! వాలి బ్రహ్మాదులను ఆశ్రయించినమా విడువక ఒక్క శరాఘాతముచే వానిని నెగటార్చి వైచెద. నీవు దిగులొందక ధైర్య మవలంబింపుము'' అని దృఢస్వరమున రాఘవుడు ప్రతిజ్ఞచేసెను.

రాముని ప్రతిజ్ఞా వచనములు సుగ్రీవునికి నూతనోత్సాహము కల్పించెను. అతడు పరమానందభరితుడై వాలి బలపరాక్రమమును పేర్కొని రాముని కిట్లు చెప్పెను-

"రఘువీరా! ఈ చిన్న గుట్టను చూచితిరా! ఇది దుందుభి రాక్షసుని అస్థిపంజరము. అమేయబలసంపన్నుడగు దుందుభిని వాలి నిర్జించి యుండెను. అక్కడ కనబడుచున్న యేడు తాళవృక్షములను చూడుడు. ఒక దినము వాలి వనమునకు వెళ్ళి ఏడు తాళఫలములు తెచ్చి ఇంటి యందుంచెను. వాలి వానిని భుజించవలెనని వచ్చి చూచునప్పటికి వానిపై ఒక సర్పము పండుకొని యుండెను. వాలి క్రుద్ధుడై దానిని శపించెను. అంతట ఆ సర్పము శరీరము నుండి ఏడు తాళవృక్షములు మొలచెను. ఈ శాపవృత్తాంతమును సర్పము తండ్రియగు తక్షకునికి తెలిసెను. తక్షకుడు కుపితుడై - ఎవడు ఈ తాటిచెట్లను ఒక్క బాణముతో తెగగొట్టగలడో వాని చేతిలో వాలి నిహతుడగుగాక - యని శపించెను.

ఇట్లు సుగ్రీవుడు చెప్పగా విని రాఘవుడు దుందుభి కాయమును నూరు యోజనముల దూరము పోవునట్లు కాలి బొటనవ్రేలితో ఎగజిమ్మెను. పిమ్మట ఒక్క బాణముతో ఏడు తాటిచెట్లను తెగగొట్టెను. దాశరథి బలపరాక్రమము చూచి సుగ్రీవుడు నివ్వెరపడిపోయెను. ఇతడు సాక్షాత్తు మానవ స్వరూపమెత్తిన భగవంతుడే యని సూర్యపుత్రుడు విశ్వసించెను. సుగ్రీవుడు శ్రీరాముని చరణ ద్వయముపై వ్రాలి-

"ఓ ప్రభూ! వాలి మూలమున నేను నేడు మీ స్వరూపము కనుగొని ధన్యుడనైతిని. జగన్నాథా! నేటికి మీ కృపాకటాక్ష వీక్షణములు నాపై ప్రసరించ, నా సంసార మమకారములు నశించిపోయెను. ఈ జీవన భోగములు మిథ్య యని గ్రహించి నా చిత్తము నిశ్చలమయ్యెను. రక్షకా! మీ రనుగ్రహించిన యెడల నేటినుండి రాజ్యముతోసహా సర్వస్వము పరిత్యజించి మిమ్ము సేవించుకొనుచుండెద" అని విరక్తభావముతో రాముని వేడుకొనెను.

పురుషోత్తముడు కపిశ్రేష్ఠుని వాత్సల్యదృష్టుల చూచి ఇంచుక చిరునవ్వు ముఖమున దోప - "కపీశ్వరా! నా ప్రతిన యే నాటికి నిరర్థకము కాజాలదు.

నీకు రాజ్యము అవశ్యము ప్రాప్తించనున్నది. సకలరాజ్యసుఖములు అనుభవించిన పిమ్మట నా లోకము చేరుకొని జన్మరాహిత్యము పొందగలవు.'' అని ప్రవచించెను. జ్ఞానాజ్ఞానములు, రాగ విరాగములు దైవప్రేరితములు.. నటుకుడు కోతి నాడించునట్లు జగన్నాటక సూత్రధారి జీవులను తన ఇచ్చవచ్చినట్లు ఆడించు చుండును.

## వాలి వధ

అనంతరము రఘూద్వహుడు సుగ్రీవుని యుద్ధసన్నద్ధుని జేసి వాలిపైకి పంపెను. సుగ్రీవుడు కిష్కింధాపురిని సమీపించి యుద్ధమునకు వాలి నాహ్వానించుటకై రణగర్జన చేసెను. వాలి సుగ్రీవుని యుద్ధ సన్నద్ధత జూచి కోపోద్రిక్తుడై వానిని మర్దించుటకు పయనమయ్యెను. యుద్ధోత్సాహముతో సంబరపడుచున్న వాలిని సమీపించి తార ఇట్లు బోధించెను. ''నాథా! సుగ్రీవుడు ఈ పర్యాయము పోరాటమునకు స్వబలముపై ఆధారపడి రాలేదు. అతనికి అండగా అమేయబల సంపన్నులగు కోసలకుమారులు వచ్చియున్నారు. దశరథ పుత్రులగు రామలక్ష్మణులు సాధారణ మానవమాత్రులు కారు. వారితో వైరము మీకు శుభప్రదము కాదు.'' అని తార వాలిపాదములు పట్టుకొనెను.

ఇంద్రతనయుడు వాలి - సంశయ భీతాత్మయైయున్న భార్య నవలోకించి - ''తారా! శ్రీరాముడు సమదర్శియని వినియుంటివి. అతడు మా ఇరువురను సమానముగా చూచును. అట్లుగాక, విప్కారణముగా శ్రీరాముడు నన్ను సంహరించిన నాకు సద్గతియే లభించగలదు. నీవు దిగులొందకుము.'' అని పలికెను. తార మాటలను లక్షించక వాలి దురభిమానియై తమ్మునితో తలపడుటకు బయలుదేరెను.

అతి బలవిక్రమోపేతులగు వాలి సుగ్రీవు లిద్దరు బాహాబాహి యుద్ధమునకు తలపడిరి. వాలి ప్రచండ ముష్టి ఘాతములకు ఓర్వలేక సుగ్రీవుడు పిమ్మట సిల్లి, తేరుకొని శ్రీరాముని యొద్దకు పరుగెత్తుకొనివచ్చి - ''రఘునాథా! వాలి నా సోదరుడు కాదు. వాడు నా పాలిటి యముడు -'' అని వాపోయెను.

సుగ్రీవుని దైన్యస్థితికి దాశరథి హృదయము ద్రవించెను. దశరథనందనుడు

తన శీతల కరస్పర్శచే సుగ్రీవుని ఒంటి నొప్పులు పోవునట్లు అతని శరీరము నిమిరెను. "సఖా సుగ్రీవా! మీ రిరువురు సమాన రూప వయస్కులై యున్నం దున నిన్ను గుర్తించనేరక నేనేమియు చేయజాలకపోతిని. ఇదిగో నీవు నాకు గుర్తుండునట్లు ఈ మాల మెడలో ధరించి ఈ మారు యుద్ధమునకు పొమ్ము" అని చెప్పి సుగ్రీవుని యుద్ధోన్ముఖుని జేసి, రాఘవుడు ఒక చెట్టు చాటున నిలిచి చూచుచుండెను.

ధైర్యధురంధరులు అద్వితీయ బలవిక్రమోపేతులగు సోదరు లిద్దరు పునః ముష్టియుద్ధమునకు తలపడిరి. తనసమస్త శక్తిని ఉపయోగించి సూర్యతన యుడు ఇంద్రతనయుని ఢీకొని పోరాడెను. వాలి యెదుట సుగ్రీవుడు క్షణక్ష-ణమునకు నిస్తేజుడగుచుండెను. తుదకు బలముడిగి సుగ్రీవుడు నిలువలేని స్థితిలో నుండుట గమనించి రఘువీరుడు తీవ్రనారాచ మొక దానిని ధనుస్సుకు సంధించి వాలి వక్షః స్థలమునకు గురిపెట్టి కొట్టెను. హృదయమును దూసుకొనిపోయిన రాముని బాణాఘాతమునకు వాలి గిరగిర తిరిగి నేలపై కూలెను. ధరాగతుడైన వాలి కొద్దిసేపటికి తెప్పరిల్లుకొని కన్నులు విప్పి చూచు న్నప్పటికి అతని దృష్టికి - శ్యామలాంగుడు - జటాధారి - శరచాప హస్తుడు - తామరస నేత్రుడగు శ్రీరాముని దివ్యసుందరవిగ్రహము ధగధగద్ధగాయమా-నమై కాన్పించెను. అతడు పలుమార్లు ఆ దివ్యతేజమును దర్శించి, లోలోన హర్షించి, పైకి ఇట్లు కఠినముగ పలికెను -

> *"ధర్మ హేతు అవతరేహు గోసాయీ!*
> *మారేహు మోహి వ్యాధకీ నాయీఁ!*
> *మై బైరీ సుగ్రీవ పియారా!*
> *అవగున కవన నాథ! మొహిమారా!"*

"ఓ! గోసాయీ! ధర్మ సంస్థాపనార్థము భూమిపై అవతరించిన నీవు వ్యాధునివలె వంచనతో నన్ను వధించితివా! సుగ్రీవుడు నీకు మిత్రుడు, నేను నీకు శత్రువునా! స్వామీ! నిరపరాధిని నిష్కారణముగ నన్నేల సంహ రించితివి?"

ఆ మాటలకు శ్రీరాముడు వాలిని అవలోకించి "వాలీ! కూతురు, కోడలు, చెల్లెలు, తమ్ముని భార్య -ఈ నలుగురూ సమానులు కదా! వారిని దుశ్చింతతో చూచిన పాపాత్ముని సంహరించుట ధర్మసమ్మతము. నీవు నీతి బాహ్యుడవై సోదరుని ధర్మపత్నిని హరించితివి. అదియునుగాక, నేను సుగ్రీవుని రక్షింప వచ్చితినని నీకు తెలిసియూ, భార్య హితోక్తులు కూడ పాటింపక దురభిమానముతో యుద్ధమునకు సిద్ధపడితివి. వాలీ! దీని ఫలము అవశ్యము నీకు భోక్తవ్యమై యున్నది" అని దయార్ద్ర స్వరముతో పలికెను.

రఘుపతి ప్రసంగము వాలికి వివేకోదయము కలిగించెను. ఇంద్రపుత్రుడు తన పూర్వ కృతచర్యకు పశ్చాత్తాపము చెందెను. శ్రీరాముడు సాక్షాత్ జగదీశ్వరుడని గ్రహించి వాలి భగవంతుని పాద పద్మములపై బడి అతనిని ప్రస్తుతించెను.

కరుణాపయోనిధి కాకుత్స్థమణి అంతట తన కరకములు వాలి శిరస్సుపై వుంచి - "వాలీ! నీవు అజరామరుడవై యుండునట్లు ఆశీర్వదించెద, శరీరము నిలబెట్టుకొనుము" అని చెప్పెను.

"ఓ జగన్నాయకా! యోగీశ్వరులకు లభించక, వేదార్థములకు అందక, అవాఙ్మానసగోచరుడవై వర్తించు నీవు అంత్యకాలమున నా ఎదుట స్వయముగ వచ్చి సాక్షాత్కరించితివి. ఈ తుచ్ఛశరీరము ఇక నాకెందుకు! నీ సన్నిధిలో ఇహయాత్ర చాలించు మహద్భాగ్యము తిరిగి నాకు లభించునా! ఆశ్రిత వత్సలా! ఇదిగో, ఇతడు నా పుత్రుడు అంగదుడు. నావలె బలవంతుడు, వివేకసంపన్నుడగు ఈ కుమారుని నీ చేతులలో బెట్టుచున్నాను. వీని కభయమిచ్చి, వాకు జన్మ జన్మాంతముల వరకు నీ చరణభక్తి కలిగియుండునట్లు అనుగ్రహించుము" అని ప్రార్థించి వాలి కుమారుని శ్రీరాముని చేతులకప్పగించి విశ్రాంతిగా కండ్లు మూసుకొనెను.

తన మెడలోవున్న మాల జారి పడిపోయినపుడు యేనుగు యెవ్విధముగ లక్ష్య పెట్టదో అవ్విధముగ వాలి తన ప్రాణములను తృణప్రాయముగ విసర్జించెను.

బలశాలి వాలి పరమపదించినందుకు కిష్కింధావాసులు దుఃఖాంబుధిలో మునింగి శోక వ్యాకులితులైరి. భర్త మరణమునకు దురంత సంతాపము

నొందిన తారకు రాముడు జ్ఞానోపదేశము చేసి శాంతింపజేసెను. తదుపరి శ్రీరాముని ఆజ్ఞానుసారము సుగ్రీవుడు విగతజీవుడైన అన్నకు యథావిధి ఉత్తర క్రియలు జరిపెను. అనంతరము లక్ష్మణుడు సచివులను సామంతులను పురోహితులను పౌరులను రావించి వారి సమక్షములో సుగ్రీవుని రాజ్యాభిషిక్తుని జేసి, అంగదుని యువరాజా చేసెను.

ఓ అపర్ణా! అవ్విధముగ అపార కరుణా సముద్రుడగు దాశరథి దయకు పాత్రుడైనందున, ప్రవాసగతుడు ఆశ్రయ విహీనుడు నిరంతర విచారమగ్నుడగు సుగ్రీవుడు సులభముగ కపిరాజ్యము పొంది సుఖింప గలిగెను. రాజ్య ప్రదానము చేసిన పిమ్మట ధర్మమూర్తి యగు రామమూర్తి సుగ్రీవుని చేరబిలిచి, అతనికి అనేక రాజ్యధర్మము లుపదేశించి, అంగదుని సమ్మతి వలహో ప్రకారము రాజ్యము చేయుచుండుమని బోధించి ఇట్లనెను –

''కపీశ్వరా! వనవాస దీక్షలో పదునాలుగేండ్లు గడువవలసి యున్నందున సంప్రతి మీ నగరమునకు వచ్చి మీ ఆతిథ్యము స్వీకరించజాలను. వర్షాకాలము సమీపించుచున్నది. కాబట్టి నిక్కడనే ప్రవర్షణ పర్వతముపై వర్ణ కుటీరము నిర్మించుకొనియుండెద. నీవు నా కార్యము మనమునందుంచుకొని సమయము వచ్చినప్పుడు సహాయపడవలెను.'' అని చెప్పి సుగ్రీవాదులను పంపాపురమునకు వీడ్కొలిపెను.

## వర్షఋతువు

ప్రభువు వర్షాకాలమున ప్రవర్షణగిరిపై విజయము చేయుచున్నాడని తెలుసుకొని దేవత లచటసుందరమగు గుహ నొకదానిని కల్పించియుండిరి. అదియే గాక దివిజులు చిత్ర విచిత్రమగు ఖగమృగ రూపములు ధరించి తమ తమ రూప రేఖావిలాసములతో కలకలధ్వానములతో సంచరించుచూ కాసు సీమను కడు మనోజ్ఞ మొనర్చిరి. దేవదేవుని దివ్యసన్నిధానమున అప్పటి ప్రకృతిశోభ సకలగుణశోభలచే సంపద్విలసితమై భాసించెను.

శ్రీరామచంద్రుడు గిరిశిఖరాగ్రమున గుహాప్రాంగణమందు స్ఫటికశిలా ఫలకముపై అనుజానితో ఆసీనుడై గిరిప్రాంతమును చూచుచుండెను. వర్షాకాల

మందు ఉరుములతో మెరుపులతో మేఘములతో స్రవించెడి వర్షధారలతో వివిధ కాంతులీనుచున్న ప్రకృతి రామణీయకమును దర్శించి దశరథ నందనుడు సుమిత్రా తనయునితో ఇట్లు ప్రసంగించెను:

"సోదరా లక్ష్మణా! గోసాయిని దర్శించిన గేస్తువలె సంతోషముతో మేఘములను జూచి మయూరము లెట్లు నృత్యము చేయుచున్నవో చూడుము. లక్ష్మణా! ఈ మేఘగర్జనలకు ప్రియా వియోగముచే విచలితమైయున్న నా హృదయము భీతిల్లు చున్నది. ఆహా! అటుచూడుము! దుష్టుని క్షణిక ప్రేమ వలె చంచలాచ్ఛటచ్ఛట లెట్లు తళుక్కు తళుక్కున మెరయుచున్నవి! విద్యాధికులు వినమ్రులై వర్తించు భంగి వారిదములు క్రిందికి వంగి వర్షించుచున్నవి. దుర్జనుల దూషణలు సజ్జనులు సహించు చందమున గిరిశిఖరములు వర్షధారల తడియుచుండుట చూచితివా! అల్పాదాయమునకే అహంకరించు అల్పుని మాడ్కి క్షుద్రనదులు ఉప్పొంగి పరుగులెత్తుచున్నవి. మాయను గూడిన జీవునివలె నేలబడిన చినుకులు మలినమగుచున్నవి. దేవుని జేరిన జీవునివలె సరిత్సమూహము సముద్రములో కలిసి శాంతించుచున్నది.

"సౌమిత్రీ! డాంబికుల నిరర్థక ప్రసంగముల మధ్య సద్గ్రంథములు మరుగుపడి పోవునట్లుగా పచ్చగడ్డి పైకొనుటచే కాలిబాటలు కనబడకపోవుచున్నవి. స్వేచ్ఛాధిక్యతచే స్త్రీలు చెడిపోవులాగునజలాధిక్యతచే చేలగట్లు తెగిపోయినవి. కలికాలమున చక్రవాకములు సంచారము మానుకున్నవి. సుసాంగత్యముచే జ్ఞానము కుసాంగత్యముచే అజ్ఞానము కలుగునట్లు మేఘ సంపర్కముచే సూర్యుడు ఒకప్పుడు కనబడును. మరొకపుడు మాయమగును.

"లక్ష్మణా! వర్షాకాలము గతించి శరదృతువు వచ్చెను. శరదాగమనముతో ప్రకృతిలో కలిగిన మార్పు గమనించితివా! వానాకాలమునకు ముసలితనము వచ్చినదా యున్నట్లు భూమిపై తెల్లటి గడ్డిపూలు కనబడుచున్నవి. సంతోషికి ఆశ సన్నగిల్లు విధమున అగస్త్య నక్షత్రోదయము కాగానే నదీ తటాకములందలి జలము ఇంకిపోవుచున్నది. మద మోహములులేని సజ్జనుని హృదయమువలె నదీ జలము నిర్మలముగా నున్నది. జ్ఞానికి క్రమక్రమముగా మమకారము క్షీణించు లాగున వాపీ కూపతటాకములందలినీరు తగ్గుచున్నది. పూర్వ దిశయందున్న

గయు గవాక్షులను రోహిత పర్వతమునకు శుభకార్యములు వచ్చులాగున ఖంజ నపక్షులు (కాటుక పిట్టలు) కనబడుచున్నవి. మతిమంతుడగు మహీపాలుని పాలనవలె దుమ్ము, ధూళిలేక భూమి శోభించుచున్నది. ఆకాశము నిర్మేఘమై హరిభక్తుని హృదయమువలె స్వచ్ఛముగా నున్నది.

"సౌమిత్రీ! వర్షాకాలమున స్తంభించిపోయిన కార్యములు పునఃశరదాగమనముతో ప్రారంభమగును. భూపతులు, భిక్షకులు, బేహారులు, బైరాగులు మున్నగువారు పునః తమతమ పనులందు నిమగ్నమగుచున్నారు. నిరాకారుడగు పరబ్రహ్మ సాకారుడై భాసించుభంగి కమలములతో కాసారములు శోభించుచున్నవి. వానకాలమున వృద్ధిచెందిన క్షుద్రజీవులు శరత్కాలమున నశించునట్లు సద్గురువు నాశ్రయించుటచే సకలవిధములైన సంశయములు నివారణమగును.

## సుగ్రీవుని పశ్చాత్తాపము

ఇట్లు మనోజ్ఞమైన ప్రకృతి సౌందర్యము దర్శించి దాని రామణీయకతకు ముగ్ధుడగు రామచంద్రుడు శరదాగమనముతో సీతాన్వేషణ కార్యము జ్ఞప్తికి వచ్చి విచారవదనుడై ఇట్లు పలికెను -

"లక్ష్మణా! ఇన్ని దినములు గడచిననూ సీత సంగతి తెలియకపోయెను. జానకి జీవించియుండిన చాలు, కాలాంతకుడైనను వానిని నిముసములో నిర్జించి భూపుత్రిని తేగలను. ఇన్ని దినములైననూ కపిరాజు సుగ్రీవుడు, మన వైపు కన్నెత్తి చూడలేదే! ఆహా! ధరణీ ధన ధామ దారా సహితముగ లభించిన రాజ్యవైభవము అనుభవించుచున్న సుగ్రీవుడు కూడ ఈ సంగతి విస్మరించెను. సోదరా! వాలిని చంపిన బాణముతో ఈ కృతఘ్నుని కూడా వధించి వయిచెదను." అని అవధేశుడు ఆగ్రహావేశముతో పలికెను.

అగ్రజాని ఆత్మక్షోభకు అనుజుడు రోషోద్దీపితుడై తత్క్షణమే శరచాపములు చేతికి తీసుకొనెను. లక్ష్మణుడు కోపోద్దీపితుడగుట గమనించి శ్రీరాముడు అతనిని వారించుచూ "సౌమిత్రీ! ఉద్రేకపడకుము, సుగ్రీవుడు మనకు మిత్రుడు. అతని కెలాంటి హానికలిగించక, మాటలతో బెదరించి ఇచటికి తోడ్కొని రమ్ము." అని చెప్పి సుమిత్ర పుత్రుని సుగ్రీవుని యొద్దకు పంపెను.

అనుక్షణము స్వామి హితమే ఆలోచించుచుండు ఆంజనేయునికి సుగ్రీవుని పరాకుబుద్ధి మనస్కరించలేదు. అతడు ఖిన్నుడై కపిరాజును సమీపించి - ''వానరేశ్వరా! రామకార్యమిట్లు ఉపేక్షించి కూర్చుండుట భావ్యముకాదు. స్వకార్యము సాధించుకొని స్వామికార్యము విస్మరించుట క్షంతవ్యము కాదు గదా! ఇప్పటికైనామించినది లేదు, వెంటనే సీతాన్వేషణకై ప్రయత్నింపుము'' అని బోధించెను.

హనుమంతుని హితబోధ మర్కటేశ్వరుని మేలు కొలుపెను. 'అయ్యో! నేనెంత అవివేకిని? విషయభోగములందు మునిగితేలుతూ విధ్యుక్తధర్మమును విస్మరించితినే!' యని సుగ్రీవుడు పశ్చాత్తాపము చెందెను. తత్క్షణమే అతడు దేశ దేశములందు, దిశాభాగములందు వున్న వానరయోధులను పదునురోజుల లోపున సమావేశపరచవలసినదని ఆంజనేయాదులకు ఆదేశించెను.

సుగ్రీవాజ్ఞ తలదాల్చి వానర దూతలు దశదిశలకు పరుగుతీసిరి. వాయుపుత్రుడు విద్యుత్వేగముతో పయనించి ముందున్న దుర్ధర్షుని సమూహమును, కదళీవనమందున్న గజుని, వ్యాహార పర్వతమందున్న బలవీర కుమారుని, ధుంధుమార పర్వతమందున్న శ్రీఖండ వానరులను, అంజన పర్వతమందున్న కుముదుని సేనావాహినిని, నీలగిరి వాసుడగు నీలుని, బదరికాశ్రమమువ గంధమాదన పర్వతప్రాంతమందున్న వానర వీరులను, అర్బువాద్రిపై నున్న సుషేణుని, సుమేరు పర్వత వాసియగు కేసరిని, అలకాపురిని రక్షించు బలపురుని, రుద్రగిరిని రక్షించు రుద్రగిరి కైలాసవాసులను, మైనాకహిమవత్పర్వత ప్రాంతవాసులను, వింధ్యవాసి వసంతుని, ఇంద్రకేలి పర్వతమందున్న కపి బలమును, కార్ష్య పర్వతమందున్న మైందుని బలమును, ధవళగిరి యందున్న దుర్గంధునీ, ఉదయాద్రి వాసులను, కుంద, కుముదులను వీరులను, సుగ్రీవాజ్ఞ తెలియజేసి పంపానగరమునకు రప్పించెను.

ఇదిట్లుండ, రామానుజుడు కిష్కింధాపురిని సమీపించి నగరము దద్దరిల్లునట్లు కోదండము ధ్వనింపజేసి పట్టణము భస్మముచేసివైచెదనని రూక్షస్వరమున గర్జించెను. రౌద్రాకారముతో వచ్చియున్న లక్ష్మణుని జూచి కిష్కింధవాసులు గడగడలాడిరి. ఈ వార్తకు సుగ్రీవుడు భీతిల్లి కంపించిపోయెను.

ఆతని సమువున వాలిపుత్రుడు అంగదుడు సౌమిత్రిని సమీపించి లక్ష్మణుని శాంతింపజేయుటకు ప్రయత్నించెను. సుగ్రీవుడు హనుమంతుని పిలిచి ''హనుమా! రామానుజుడు రుష్టుడైయున్నాడు. నీవు తారను అంగదుని వెంట తీసుకొనిపోయి లక్ష్మణుని ప్రసన్నునిగజేసి తోడ్కొనిరమ్ము'' అని చెప్పి పంపెను.

తారను, అంగదుని, హనుమంతుని చూడగనే సుమిత్ర కుమారుని కోపము శాంతించి చల్లబడెను. వారు గౌరవ పురస్సరముగా లక్ష్మణుని రాజ నగరుకు తోడ్కొనివచ్చిరి. వానరపతి సుగ్రీవుడు సకలవిధ మర్యాదలచే సత్క-రించి సౌమిత్రిని సుప్రసన్నునిగా చేసెను. తదనంతరము హనుమదంగద సుగ్రీవాది వానరవీరులు లక్ష్మణునితో శ్రీరాముడున్నచోటుకు పయనమై వచ్చిరి.

సుగ్రీవుడు రఘూద్వహుని చరణద్వయముపై సాష్టాంగముగ వ్రాలి - ''నాథా! సురలు మునివరులెందరో విషయ వాంఛలకు వశీభూతులగు చుందురు ఇక నాబోటి వాని సంగతి చెప్పవలెనా! ఎవడు కానీ, మీ కృపాకటాక్ష వీక్షణ లేనిదే మాయామోహ జాలమునుండి ముక్తుడగుట దుర్లభము. ఈ దీనుని తప్పు సైరించవలసినది.'' అని ప్రార్థించెను. సాకేతనాథుడు స్మితవదనుడై సోదరునివలె సుగ్రీవుని చేరదీసి, విలంబనముచేయక జానకి సమాచారము తెలుసుకొనుటకు తగిన ప్రయత్నము చేయుమని ఆదేశించెను.

## సుగ్రీవాజ్ఞ

ఓ గిరిజా! సుగ్రీవుని సంకేత ప్రకారము క్షణములో అక్కడ చేరిన కపి సమూహమును లెక్కింపవమెవరికి సాధ్యము! వానరులు ఒక్కొక్కరే వచ్చి శ్రీప-తికి సాష్టాంగపడి ప్రణమిల్లిరి. వారు స్వామిని దర్శించుకొని, వేటికిగదా మనము సనాథులమైతిమని సంతసించిరి. విరాట్ స్వరూపుడగు శ్రీరాముడు అక్కడ చేరిన ప్రతి కపివరుని పలుకరించి సత్కరించెను. వానరపతి సుగ్రీవుడు తనవారి నిట్లు పేర్కొనెను -

"ఓ వానర యోధులారా! మీరు మీమీ బలగములతో నేల నాలుగు చెరగులా వ్యాపించి, దిశాంచలములవరకు పయనించి జానకిని అన్వేషింపుడు. మీకు మాసమురోజుల గడువిచ్చుచున్నాను. వైదేహి వృత్తాంతము అరయక, వ్యవధిదాటి వచ్చినయెడల అట్టి వానిని నేను శిక్షించవలసియుండును. ఇది రామకార్యము. ఈ మహాకార్యము దీక్షతో సాధించి నా కుపకారము చేయవలెను." అని అసంఖ్యాకులగు వానరవీరులను ఆదేశించెను.

తదుపరి కపీశ్వరుడు తన పార్శ్వభాగమందున్న అంగదహనుమదాదుల నవలోకించి - "విజ్ఞులు వీరులగు అంగద హనుమంత నీల జాంబవంతులారా! మీరు త్రికరణశుద్ధిగా స్వామికార్య నిమగ్నులై దక్షిణ దిశకు వెళ్ళి సీతాదేవిని కనుగొని స్వామికార్యము సాధించ వలసినదిగా కోరుచున్నాను." అని పలికెను.

అంతట వానరవీరులు సుగ్రీవాజ్ఞ శిరసావహించి, శ్రీరామునికి నమస్కరించి, స్వామికి జయము పలుకుచూ ప్రయాణము సాగించిరి. రఘూత్తము డప్పుడు ఆంజనేయుని ఏకాంతమున చేరబిలిచి, ఆతని చేతికి తన కరముద్రిక నిచ్చి 'హనుమంతా! సీతను వూరడించి, ఆమెకు నా దుఃఖమును, నా బలమును తెలియజేసి, సుఖముగ తిరిగి రమ్ము' అని దీవించి పంపెను. దాశరథి సర్వజ్ఞుడైననూ, రాజనీతి, లోకమర్యాదను పాటించి దూతద్వారా కార్యము నెరపెను.

## అన్వేషణ

రాజాజ్ఞను బొదలదాల్చి, చిత్తము రామకార్యమందు లగ్నముచేసి వేలాది కపులు సీతాన్వేషణార్థమై దిశలకు పరుగులు దీసిరి. అంగద హనుమదాదులు దక్షిణాభిముఖులై - అడవులు కొండలు గుహలు చెరువులు గుంటలు మున్నగు ప్రదేశములు గాలించుచూ ముందుకు సాగిపోవుచుండిరి. వారు మార్గమందెచ్చటైనా రాక్షసపురుగు కనబడిన చాలు! దాని పీచ మడచుచూ అక్కడక్కడ మునుల నడిగి దారితెన్నులు తెలుసుకొనుచూ, శ్రీరామునకు జయమని కేకలిడుచూ, పోవుచుండిరి.

# స్వయంప్రభ

ఇట్లు వైదేహిని వెదకుచూ పురోగమించుచున్న వానరులు ఒక దినము మార్గమధ్యలో నీరు లభించక దాహపీడితులైరి. అంతట అంజనీపుత్రుడు సమీపమందున్న పర్వతాగ్రముపై కెగసి అక్కడనుండి నీటికై నలువైపుల కలయ జూసెను. ఆ పర్వత ప్రాంతమున ఒక పెద్ద బిలముండుట అతని కంట బడెను. ఆ బిలములోనికి కొన్ని పక్షులు జీవజంతువులు పోవుచూ వచ్చుచుం-డుట కన్పించెను. ఆ బిలములో తప్పక నీరు లభించగలదని నిశ్చయించుకొని అనిల పుత్రుడు తనవారిని వెంటతీసుకొని బిలమునొద్దకు పోయెను. వానరు లా బిలములోనికి ప్రవేశించిరి.

దానిలోపల కమలాకరములైన చక్కని కొలనులు, కొలనులమధ్య కట్టబడిన ఒక అందమైన మందిరము, ఆ మందిరములో ఒక స్త్రీ ధ్యాన మగ్నయై కూర్చొని యుండెను. వానరులామెను సమీపించి, ఆమెకు నమస్కరించి తాము వచ్చిన సంగతి విన్నవించుకొనిరి. ఆ తాపసి వానరుల యెడ ప్రసన్నయై వారిని ఫలజలములతో సత్కరించి ఇట్లు ప్రసంగించెను -

"కపులారా! నా పేరు స్వయంప్రభ. నేను దివ్యుడగు గంధర్వుని కుమార్తెను. విశ్వకర్మ కూతురు హేమయను అపురూపవతి స్త్రీ పూర్వ మొకప్పుడు మహేశ్వరుని మెప్పించి సుందరమైన ఈ స్థలము సంపాదించి యుండెను. హేమ నాకు ఆత్మీయురాలు. ఆమె బ్రహ్మలోకమునకు వెళ్లుచూ నన్ను జూచి " - స్వయంప్రభా! నీవు ఈ స్థలమందే ఉండి తపస్సు చేసుకొనుచుండుము. త్రేతాయుగమున రామావతారము జరుగును.ఒకప్పుడు సీతను వెదుకుచూ వానరులిచ్చటికి వచ్చెదరు. వారి వలన రాముడున్నచోటు తెలుసుకొని, అచ్చటికి వెళ్లి శ్రీపతిని దర్శించుకొని ముక్తిబొందుము - అని చెప్పి యుండెను. కాబట్టి హితులారా! నే నిప్పుడే రామదర్శనార్థమై వెళ్ళెదను. మీరు తప్పక భూపుత్రిని చూడగలరు. మీరు కన్నులు మూసుకొనిన ఈ బిలమునుండి క్షణములో బయట పడగలరు" అని చెప్పెను.

వానరులు తద్విధముగా కన్నులు మూసుకొని తెరచునప్పటికి వారు సముద్రతీరమును చేరియుండిరి. స్వయంప్రభ తత్‌క్షణమేగి శ్రీరాముని వద్దకుచేరి,

ప్రభువు పాదములపై బడి ప్రస్తుతించెను. రాముడామెను కరుణించి ఆమెకు ''నిత్యానపాయినీ'' భక్తిని ప్రసాదించెను. తదుపరి స్వయంప్రభ స్వామి యాజ్ఞగైకొని బదరికాశ్రమమునకు పోయెను.

## సంపాతి

అచట సముద్రతీరమున చేరిన వానరు లప్పటికీ సీత జాడ తెలియక పోయినందుకు చింతాగ్రస్తులైరి. అంగదుడు మరింత నిరాశచెంది కంటతడి పెట్టుకొని ఇట్లు విలపించెను -

''వానరేశ్వరు డిచ్చిన వ్యవధి దాటిపోవుచున్నది. ఈనాటికీ సీత సమాచార మిసుమంతయు తెలియరాదాయె. ఆనాడే మా పినతండ్రి నన్ను వధించి యుండవలసినది. కానీ, ప్రభువు నా కభయమిచ్చి యున్నందున ఆ పని చేయ లేకపోయెను. ఈమారు నన్ను సుగ్రీవుడు వధించుట నిశ్చయము. ఇక నాకు దిక్కేది!''

అంగదుని దీనాలాపములు విని మిగత వానరులందరూ దిగులుగొని శోక సంతప్తులైరి. ''వైదేహి వార్త తెలియనిదే కిష్కింధకు మరలిపోవుట క్షేమకరము గాదు. ఇచ్చటనే ప్రాణములు కోల్పోవుట మంచిది'' అని భావించి వానర యోధులు సముద్రతీరమున దర్భాసనములు వేసుకొని ప్రాయోపవిష్టులైరి.

అంతట జాంబవంతుడు అతిదీనులై యున్న అంగదాదులను సంబోధించి - ''కపులారా! నిరాశచెందకుడు. శ్రీరాముని మహిమా విశేషములు తెలియ నేరక మీరిట్లు దిగులు పడుచున్నారు. మనము చేబట్టిన రామకార్యము నిర్విఘ్నముగ నెరవేరగలదు.'' అని ధైర్యోక్తులు పలికి వారిని ఉత్సాహితులను చేయుటకు ప్రయత్నించుచుండెను.

వారున్న చోటికి సమీపమందు పర్వత గుహలో యుండిన పక్షిరాజు సంపాతి వీరి మాటలనవ్వడి విని బయటకు వచ్చెను. ''ఆహా! ఎంత మంచి సుదినము. విధి నాకు నేడు గొప్ప భోజనము సమకూర్చెను ఈ వానరు లందరినీ భక్షించి నాక్షుద్బాధ తీర్చుకొనెదను'' అనివారిని చూచి బొబ్బలిడెను. భయంకరాకారుడగు సంపాతిని చూచి కపులు ప్రాణభీతిచే గడగడలాడిరి.

అంగదుడు సంపాతిని చూచి బహుశా ఇతడు జటాయువు సోదరుడై యుండవచ్చునని వూహించెను. పిమ్మట అంగదుడు కంఠమెత్తి ఉచ్చైస్వరముతో - ''ఓ కపిశ్రేష్ఠులారా! మనము వీనికే ఇట్లు భయపడిన ఇక రావణునెట్లు యెదిరించగలము! రామకార్యార్థమై జటాయువువలె ప్రాణమర్పించుటకైనా సిద్ధముగా నుండవలెను'' అని యెలుగెత్తి బోధించెను.

జటాయువు పేరు వినబడగనే సంపాతి తటాలున నిలబడిపోయెను. అతడు మంచి మాటలతో ''అయ్యో! మిమ్ములను నేను చంపను. మీరు నన్ను చూచి భయపడవలదు!'' అని చెప్పి వారి కభయమిచ్చెను. తదుపరి సంపాతి వానరులను సమీపించి ''మర్కటములారా! జటాయువు ఎప్పుడు, ఎందులకు, ఎట్లు మరణించెనో తెలుపవలసిన''దని వారిని దయార్ద్రస్వరమున అర్థించెను. అంతట కపులు సంపాతికి రామ వనవాసము, సీతాపహరణము, జటాయువు ప్రాణత్యాగము, సీతాన్వేషణము మొదలగు వృత్తాంతమంతయూ విశదీకరించి చెప్పిరి.

సంపాతి శ్రీరాముని కీర్తించి, సోదరుని మరణవార్తకు మిక్కిలి దుఃఖించెను. ''మిత్రులారా! అనుజునికి తిలోదకములు వదలవలెను. నన్ను సముద్రతీరము-నకు చేర్పించుడు'' అని వానరులను కోరెను.

సంపాతి సాగరతీరమున తమ్ముడు జటాయువుకు తర్పణాదులు ముగించి ఇట్లు ప్రసంగించెను - ''కపులారా! నేనూ జటాయువు యేకో దరులము. ఒక దినమున సోదరు లిద్దరము సూర్యుని వద్దకు పోవలెనని పందెము వేసుకొని పై కెగసితిమి. దినకరుని తేజస్సుకు తాళలేక తమ్ముడు క్రిందికి దిగి వచ్చెను. నేను మాత్రము పట్టు విడవక దురభిమానముతో పై కెగురుచుంటిని. ఇంతలో నా రెక్కలు కాలిపోగా నేను భూమిపై వచ్చి పడిపోతిని. అక్కడ చంద్రుడను మునివర్యుడు నా దుస్థితికి జాలిపడి నన్ను చేరదీసి సేవజేసెను. యతీశ్వరుడు నాకు జ్ఞానోపదేశము చేసి నా అహంకారము పోగొట్టెను. తదుపరి ఆ మహాత్ముడు నన్నవలోకించి - త్రేతాయుగమున పరబ్రహ్మ నరరూపమెత్తునని, అతని పత్నీమణి సీతను దశగ్రీవుడు హరించుననియూ, ఆమెను వెదకుచూ ప్రభుసేవకులు వత్తుర-

నియూ, వారికి సీత వున్నచోటు తెలియజేసిన నీకు రెక్కలు వచ్చుననియూ బోధించి యుండెను.''

అని తన పూర్వ స్మృతిని వానరుల కిట్లు చెప్పెను -

*''గిరి త్రికూట ఊపర బస లంకా*
*తహఁ రహ రావన సహజ అసంకా,*
*తహఁ అశోక ఉపవన జహఁ రహాయీ,*
*సీతా బైఠి సోచరత అహాయీ.''*

''సముద్రములో త్రికూట పర్వతముపై లంకా పట్టణమున్నది. నిర్భయ శీలుడగు రావణ డచట నివసించుచున్నాడు. ఆ నగరమందలి అశోక వాటికలో జానకి దుఃఖాక్రాంతయై దినములు గడుపుచున్నది.

''వానరులారా! పక్షులమగు మాకు సునిశితమైన దూరదృష్టి యున్నందున నేనిప్పుడు సీతను చూడగలుగుచున్నాను. ఈ వృద్ధాప్యదశలో నేను మీకింత కంటే యెక్కువ సహాయము చేయజాలకున్నాను. తమ్ములారా! మీరు అధైర్య పడకుడు. బుద్ధిశాలి యగు రామసేవకుడు నూరుయోజనములు గల ఈ సముద్రమును అవలీలగా దాటి కార్యము సాధించగలడు. ఇదిగో, పరమా-త్ముని కృపచే పునః నాకు పక్షములు వచ్చినవి చూడుడు'' అని చెప్పి సంపాతి వానరులవద్ద సెలవు తీసుకొని, సంతోషముతో పైకెగసి పోయెను.

అట్లు సంపాతి వారికి బోధించిపోయిన పిమ్మట వానరులు తమ బలాబలములు పరీక్షించుకొని, సముద్రము దాటగల శక్తి ఎవరికున్నదా! అని శంకించసాగిరి. జాంబవంతుడిట్లు విచారించసాగెను -

''అనుచరులారా! నాకు వృద్ధాప్యము వచ్చినది. మునుపుండిన శక్తి సామర్థ్యము లిప్పుడు లేవు. పూర్వము వామనమూర్తి త్రివిక్రముడై రెండు పాద ములతో లోకము లాక్రమించినపుడు నేను ఆ విరాట్స్వరూపుని రెండు గడి యల్లో పలుమార్లు ప్రదక్షిణము చేసి యుంటిని. ప్రస్తుత మా శక్తి లోపించి నది'' అని తన అసమర్థతకు వగచెను.

అంతట యువరాజు అంగదుడు - ''నేను పారావారము దాటగలను. కానీ, తిరిగి రాగలనో లేదో యను సందేహము నన్ను పీడించుచున్నది'' అని తన సామర్థ్యమును శంకించెను. అందులకు అంగదుని నివారించుచూ జాంబ వంతుడిట్లు ప్రసంగించెను -

''అంగదా! నీవు యువరాజువు, మాకు నాయకుడవు. నీవీ ప్రయత్నమునకు పూనుకొనుట వుచితము కాదు.'' అని చెప్పి వృద్ధజాంబవంతుడు వాయుపుత్రుని అవలోకించి ఇట్లు భాషించెను. ''ఆంజనేయా! నీవు నీ తండ్రివంటి బలవంతుడవు, వివేక సంపన్నుడవు. ఈ ప్రపంచములో నీవలన సాధింపబడజాలని కార్యమేమున్నది! హనుమా! రామ కార్యార్థమై జన్మించిన నీ విటు ఊరకున్నావేమి?''

జాంబవంతుని పలుకులు బలవీరుని మేలుకొలుపునట్లు జేసెను. ఉద్రేకముచే మర్కటవీరుని ముఖము జేవురించెను. ఉత్సాహాతిశయముచే శరీరము పొంగెను. పవనపుత్రుడు పర్వతమువలె మేనుపెంచి సింహనాదముచేసెను. హనుమంతు డంతట ధీర గంభీర స్వరమున ''ఓ జాంబవంత, అంగదాదులారా! నే నీక్షణమే స్వామికార్యార్థమై లవణోదధి లంఘించిపోయి, లంకను పంకలో గలిపి, దశకంఠుని దునుమాడి, సీతాదేవిని తీసుకరాగలను. ఓ జాంబవంతా! వృద్ధుడవు, అనుభవజ్ఞుడైన నీవు - ఈ సందర్భములో నేనెట్లు వ్యవహరించవలసి యుండునో సెలవిమ్ము'' అని పలికెను.

అమిత బలవిక్రమోపేతుడగు అంజనీపుత్రుని దృఢ సంకల్పమునకు వానర సమూహము ఆనందపూరిత మయ్యెను. అంతట జాంబవంతుడు బలవీరుని పేర్కొని- ''ఓ ఆంజనేయా! నీ నిశ్చయమునకు జోహారు. నీవు లంకకువెళ్ళి భూపుత్రియున్న ప్రదేశము కనుగొని ఆమె యోగక్షేమములు మాత్రము తెలుసుకొనిరమ్ము ఆ పైనరామప్రభువు నామకార్థము వానరమూకను వెంటబెట్టుకొని లంకకు వెళ్లును. రావణుని సంహరించును, సీతాదేవిని చేకొనును, శ్రీవారి యశస్సును నారదుడు ముల్లోకములలో గానము చేయును, బ్రహ్మాది దేవతలు విని హర్షింతురు.'' అని జాంబవంతుడు హనుమంతునికి బోధించి దీవించెను.

శ్రీ గోస్వామి తులసీదాసు ఈ రామచరిత మానసమును గానముచేసెను. రామచరిత్ర వినిన వారు, చెప్పినవారు, చదివినవారు శంకరుని కటాక్షముపొంది సకల మనోరథములు సిద్ధింపజేసుకొనగలరు.

ఇతి శ్రీమద్రామచరిత మానసే

సకల కలి కలుష విధ్వంసనే

విశుద్ధ సంతోష సంపాదనో నామ

చతుర్థః సోపానః సమాప్తః.

(కిష్కింధాకాండ సమాప్తము.)

# సుందరకాండ

"శాంతం శాశ్వత మప్రమేయ మనఘం
నిర్వాణ శాంతిప్రదం
బ్రహ్మ శంభు ఫణీంద్ర సేవ్య మనిశం
వేదాంతవేద్యం విభుమ్,
రామాఖ్యం జగదీశ్వరం సురగురుం
మాయా మనుష్యం హరిం
వందేఽహం కరుణాకరం రఘువరం
భూపాల చూడామణిమ్."

★★★

"అతులిత బలధామం స్వర్ణ శైలాభ దేహం
దనుజవన కృశానుం జ్ఞానినా మగ్రగణ్యమ్,
సకలగుణ నిధానం వానరాణా మధీశం
రఘుపతి వరదూతం వాతజాతం నమామి."

## సముద్రోల్లంఘనము

ఋక్షరాజు జాంబవంతుని పలుకులకు హర్షోత్సాహితుడైన హనుమంతుడు - "ఓ వానరులారా! నేను రామ కార్యార్థినై సీతాదేవిని కనుగొని వచ్చెదను. అంతవరకు మీరు కందమూలాదులు భుజించి ప్రాణములు నిలబెట్టుకొని నా రాక కెదురు చూచుచుండవలసినది." అని చెప్పెను.

తదుపరి మహా బలవంతుడగు హనుమంతుడు నత శిరస్కుడై సర్వులకు నమస్కరించి, తండ్రి వాయుదేవుని స్మరించి, సమీపమందున్న సుందరమను పర్వతాగ్రముపైకి ఒక్క దూకున లంఘించెను. (హనుమంతుడు లంకకు సుందర గిరి నుండి ప్రయాణించినందున ఈ భాగమునకు సుందరకాండ యని పేరు వచ్చెను.)

అట్లు నగాగ్రము చేరిన అంజనీపుత్రుడు ఆత్మలో రఘురాముని స్మరించి, ఆకాశమువంక దృష్టి సారించి, శ్వాస బిగించి, శరీరము పెంచి, చేతులు ముందుకు చాచి, పాదములపై బలమూని, సింహనాదము చేయుచూ పర్వత శిఖరమునుండి కుప్పించి పైకెగసెను. అతని పద ఘట్టనలకు సుందర భూధరము పాతాళమునకు క్రుంగిపోయినట్లాయెను. అప్రతిహతముగ రివ్వున ముందుకు దూసుకొనిపోవు రాముని బాణమువలె అనిల తనయుడు గగన తలమున గమించుచుండెను.

అట్లు ఆకాశగామియై పోవుచున్న ఆంజనేయునకు ఒకింత విశ్రాంతి కలుగజేసిన బాగుండునని సముద్రుడు భావించెను. అంతట మహోదధి తనలో దాగియున్న మైనాకుని పిలిచి - ''ఓ గిరివరా! రామకార్యార్థియై మారుతి సముద్రోల్లంఘనము చేయుచున్నాడు. ఒకప్పుడు ఆతని తండ్రి వాయుదేవుని సహాయముచే సంరక్షింపబడి నీవు ఇచ్చట వచ్చి చేరుకొంటివి. కనుక ఇప్పుడు అతని పుత్రునికి అలసట దీరుటకై ఒకింత ఆశ్రయమిమ్ము.'' అని కోరెను. సముద్రుని ఆనతి ప్రకారము మైనాకుడు పైకి లేచి - తనపై ఇంచుక విశ్రమించి తదుపరి ప్రయాణింపవలసినదని- ఆంజనేయుని కోరెను. హనుమంతు డా పర్వత శిఖరమును తన చేతితో స్పృశించి, దానికి వందన మిడి, - ''ఓ మైనాకమా! రామ కార్యార్థినై పోవుచున్న నేను మధ్యలో విశ్ర మించుట వాంఛనీయముగాదు. నీ సౌజన్యమునకు కృతజ్ఞుడను. ఇక నీవు ఈ ప్రకారమే నిర్భయముగ నిలిచియుండుము -'' అని చెప్పి ముందుకు సాగిపో యెను.

పవనసుతుడట్లు గగన పథమున పయనించుచున్నపుడు - దివినున్న దేవతలు మారుతి బుద్ధిబలము, కార్యదీక్ష , అతని జవసత్వంబులు పరీక్షింప గోరి సురసయను నాగమాతను పంపిరి. ఆమె భయంకర రాక్షసరూపమున హనుమంతుని దారికి అడ్డువచ్చి, ''ఓరీ వానరా! నేడు నిర్జరులు నిన్ను నాకు ఆహారముగా నిర్ణయించిరి. నీవు గమనము చాలించి వచ్చి, వెంటనే నాకాహార మగుము.'' అని గర్జించి పలికెను.

అందుకు వానరవీరుడు వినమ్రస్వరమున - ''అమ్మా! నీ వెవరో నాకు

తెలియదు. నేనెవరో నీకు తెలియజేయు అవకాశము లేదు. నేను రామకార్యము పూర్తిచేసుకుని వచ్చి నీకు ఆహారమయ్యెదను. నా మాటలు విశ్వసించి ప్రస్తుతము నన్ను వదలి పెట్టుము.'' అని ప్రార్థించెను.

సురస అతని మాటలు లక్షింపక మారుతిని మ్రింగుటకై ఒక యోజనము పొడవున తన నోరు తెరచెను. కపివరుడు దాని కరాళాస్యము చూచి వెంటనే తన శరీరము రెండు యోజనములంత పెద్దచేసెను. అంతట సురస తన వదన గహ్వరమును పదునారు యోజనములకు విస్తరించెను. ఆంజనేయుడు తన శరీరమును ముప్పదిరెండు యోజనములకు విస్తరించెను. రాక్షసి తన వదన గహ్వరము విస్తరింప జేయుకొలది హరిసత్తముడు తన శరీరయష్టిని పెంచుచూ పోయెను. తుదకామె తన నోటిని నూరు యోజనములకు పెంచెను. ఆంజనేయుడు తటాలున తన దేహమును అంగుష్ఠ మాత్రమునకు కుదించి ఆమె ముఖమునుండి గర్భములోనికి పోయి అవలీలగా వెలుపలికి వచ్చివేసెను. సురస తన నిజరూపములో సాక్షాత్కరించి - ''వీరాగ్రణీ! నీ బుద్ధి సూక్ష్మతను మెచ్చుకొంటిని. నిన్ను పరీక్షింపగోరి నిర్జరులు నన్ను పంపిరి. ధైర్యస్థైర్య సమయస్ఫూర్తిగలిగిన నీవు తప్పక రామకార్యము సాధింపగల సమర్థుడవు, నీకు జయము కలుగుగాక!'' అని దీవించి పోయెను.

సముద్రములో రాహువుతల్లి సింహికయను రాక్షసి నివసించుచుండెను. ఆకాశమున ఎగురుచుండు జీవజంతువుల నీడ సముద్రజలముపై బడును. సింహిక ఆ నీడను స్పృశించగనే జీవులు ఆకర్షింపబడి దానికాహారమగుచుండును. ఛాయాగ్రాహిణియగు ఆ రాక్షసి పవనాత్మజుని ఛాయనుబట్టి అతనిని క్రిందికి లాగెను. మహావీరుడంత ఉద్రిక్తుడై ఒక్క ముష్టి ఘాతముచే సింహికను హతమార్చి నిరాటంకముగ ముందుకు సాగెను.

అవక్ర పరాక్రమోపేతుడగు అంజనీపుత్రుడట్లు శతయోజన విస్తీర్ణమగు పారావారమును అవలీలగ అధిగమించి లంకాతీరము చేరుకొనెను.

# హనుమంతుడు లంకను దర్శించెను

సుందరమగు లంకాద్వీపతీరము చేరిన హనుమంతుడు సమీపమందున్న చిన్న గుట్టపైకెక్కి, ఒక్కమారు ద్వీపసౌందర్యమును చూచి ముగ్ధుడయ్యెను -

*"తహాఁ జాయి దేఖీ వనశోభా*
*గుంజత చంచరీక మధులోభా,*
*నానాతరు ఫలఫూల సుహాయే*
*ఖగ మృగ బృంద దేఖి మన భాయే."*

ఫల పుష్ప సంభరితమైన వివిధ వృక్షసంపదతో, చంచరీక ఝుంకార ధ్వనితో శోభించుచున్న కాసారములతో, ఖగ మృగముల కలకలా రావములతో, సస్యశ్యామలమగు వనోపవనములతో, రమణీయమై ఒప్పుచున్న లంకా తీర ప్రదేశమును పవనాత్మజుడు పరిశీలించెను.

ఓ గిరిజా! ఆంజనేయుడట్లు తీర ప్రకృతిని పరిశీలించిన పిమ్మట లంకాపురి బింకమునుకూడా అవలోకించెను. ఆ నగరి వైభవము వర్ణనాతీతమైనది. త్రికూట పర్వతముపై నున్న లంకకు నాల్గువైపుల అగడ్తవలె నీలజలరాశి చుట్టుముట్టియుండెను. రత్నములు చెక్కబడిన బంగారు ప్రాకారములతో, సంపద్విలసితమైన విపణివీధులతో, తీర్చిదిద్దినట్లున్న చతుష్పథములతో , విశాలమగు రాజపథములతో, సురమ్యవన వాటికలతో, వాపీ కూప తటాక జలములతో లోకరావణుని లంక నయనానందకరముగ ఇంద్రపురివలె రాణించుచుండెను. మునుల మనస్సుల మోహింపజేయుగల అతిలోక సుందరములగు దేవగరుడ గంధర్వ నాగాంగనలు అత్రతత్ర విహరించుచుండిరి.

రథ గజ తురగ పదాతులతోకూడిన లంకేశుని చతురంగ వాహినీ వైభవము వర్ణింప శక్యము గాకుండెను. వీరులు, భయంకరులు, కామరూపులగు రాక్షసయోధుల బలదర్పములు ఊహించుటకు సాధ్యముగాదు. పర్వతాకారులగు మల్లయోధులు భుజము లప్పళించి సింహనాదములు చేయుచూ ఒకరి నొకరు ఢీకొని అక్కడక్కడ కుస్తీలు పట్టుచుండిరి. ఆ పిశితాశనులు మానవు

లను గోవులను మహిషములను గార్దభములను చంపి చీల్చి తినుచుండిరి. అనుక్షణము లక్షలాది రక్షోవీరులు లంకాపురిని రక్షించుటలో నిమగ్నమై యుండిరి. ఈ నిశాచరులు శ్రీరాముని బాణములనెడు తీర్థజలంబుల గ్రుంకు లిడి సద్గతి బొందనున్నారని హనుమంతుడు అనుకొనెను.

## లంకా ప్రవేశము

పగటిపూట లంకలోనికి పోవుట యుక్తముగాదని భావించి ఆంజనేయుడు సూర్యు డస్తమించువరకు అచ్చటనే యుండెను. పిమ్మట చంద్రోదయానంత రము మహావీరుడు మశకమంత ప్రమాణమున సూక్ష్మరూపుడై లంకలో ప్రవేశించెను.

అట్లు పుర బహిఃద్వారములో ప్రవేశించుచున్న హనుమంతునకు లంకిణి యెదురువచ్చి - "ఓరీ ధూర్తుడా! ఎవరు నీవు! నేను ఈ లంకను కాపాడు చున్న లంకిణిని. నన్ను ధిక్కరించి లంకలో దొంగవలె పోవజూచుచున్న నీ వెవడవు?! నీ బలమెంత?" అని గర్జించెను. ఆ మహావీరుడు మారుమాటా డక ఒక్క పిడికిటి గ్రుద్దుచే ఆ రాక్షసిని ధరాశాయినిగా చేసెను.

నేలబడి నెత్తురు గ్రక్కుచున్న రక్కసి కొద్దిసేపటికి తేరుకొని చేతులు జోడించి ఇట్లనెను - "అయ్యో! రావణాసురునికి పూర్వము వరములిచ్చిన సందర్భములో బ్రహ్మ నాతో, "లంకిణీ! వైదేహిని వెదకుటకు వచ్చిన వానరుని చేతిలో నీ వెప్పుడు దెబ్బలు తినెదవో అప్పుడు రావణునకు అంత్య కాలము సమీపించినట్లుగా తెలుసుకొను"మని - చెప్పియుండెను. కపిసత్తమా! రామదూతను కన్నులారా జూచుభాగ్యము నేటికి కల్గెను. మహాత్ముల సంసర్గము క్షణికమైననూ చాలు. స్వర్గాది సౌఖ్యములకంటే సత్సాంగత్య ఫలము గొప్పదనిగదా ఆర్యులు వచించిరి. వానరోత్తమా! నీ దర్శన స్పర్శనములవలన నా జన్మ తరించెను. ఇక నీవు సాకేతవాసుని సంస్మరించి లంకలో ప్రవేశిం పుము. నీకు సర్వకార్యములు సిద్ధించును." - అని లంకిణి దీవించెను.

తదనంతరము మారుతి శ్రీరాముని ధ్యానించి మరింత సూక్ష్మాకృతితో లంకా నగరములోనికి దూరెను. వాయుపుత్రుడు లంకలోని ఇల్లిల్లూ వెదకెను.

వీధి వీధీ తిరిగెను. సందు గొందులు గాలించెను. అక్కడక్కడున్న లక్షలాది అమరాంగనలను పరిశీలించెను. రాక్షసవీరులను పరీక్షించెను. అట్లుపోయి పోయి తుదకు లంకేశుని అంతఃపురములోనికి చేరెను. రావణుని శయన మందిరములోనికి దూరెను. అచ్చట అసంఖ్యాకులగు రావణుని సుందరీ మణులు మధుపాన మత్తులై నిద్రించుచుండిరి. ఎక్కడ చూచిననూ ఎంత వెద కిననూ హనుమంతునకు జానకి మాత్రము కానరాలేదు.

ఇంతలో హనుమంతునకు సమీపములో ఒక దివ్యభవనము, దాని కెదుట ఒక హరిమందిరముండుట తటస్థపడెను.

ఆ మందిర ద్వారములు శంఖ చక్రాంకితములై దాని ముందు భాగమున తులసీ వనము పెంచబడియుండెను. "ఆహా! అసురపురిలో హరిమందిరమా! ఇది యేమి వింత!" - అని ఆంజనేయు డాశ్చర్యపడెను. ఇంతలో హనుమం తుని చూపులు 'రామరామ!' యని ప్రాతస్మరణ చేయుచూ అప్పుడే నిద్ర నుండి లేచుచున్న విభీషణునిపై బడెను.

ఓహో! ఇతడెవ్వడో సత్పురుషుడుగా కన్పట్టుచున్నాడు. ఈ సజ్జనునితో సాంగత్యము చేసిన నా కార్యము ఫలోన్ముఖమగుటకు కొంచెము దారి దొరక గలదు. అని యోచించి పవనాత్మజుడు తత్క్షణమే బ్రాహ్మణవేషము ధరించి విభీషణుని యెదుటికి వెళ్ళి నమస్కరించెను. విభీషణుడు అతనికి ప్రతి నమస్కారముచేసి, ఆదరపురస్సరముగ ఆసనము చూపించి - "అయ్యా! తమ రెవరో హరిదాసులవలె నున్నారు. రాకకు కారణమే"మని ప్రశ్నించెను.

ఆంజనేయుడు విభీషణుని సౌజన్యమును గుర్తించెను. అతడు తన పేరు, వచ్చిన కార్యోద్దేశ్యము, శ్రీరాముని సమాచారము విభీషణునికి విశదీకరించెను. ఆ ఇరువురు పిమ్మట రామనామము స్మరించుకొని, సాకేతవాసుని గుణగణ ములు ప్రసంగించుకొని పులకిత శరీరులైరి. తరువాత విభీషణుడు హనుమంతు నితో "వాయుపుత్రా! నే నీ నిశాచరులలో దంతముల నడుమ నాలుకవలె నివ సించుచున్నాను. తామస వంశములోపుట్టి, సత్ప్రవర్తనకూ సాధనకూ దూరుడ నైన నాకు రామభక్తి యెట్లు ప్రాప్తించును! ఆ కరుణామూర్తి నన్ను కటాక్షిం

మునా? భగవత్కృపచే నీవంటి సజ్జనుని సాంగత్యము లభించినందున ధన్యుడ నైతిని." అని పలికెను.

"విభీషణా! రాముడు భక్తపరాధీనుడు. నీవేమో తామస వంశజుడనని చెప్పు కొంటివి. మరి నా సంగతేమి! నేనొక కోతిని. ప్రొద్దునలేచి నా ముఖము చూచి-నవారికి ఆ దినము మంచినీళ్ళు కూడ పుట్టవుకదా! సఖా, జాతుధానా! దాశరథి దయానిధి. అతని ప్రేమ అనంతమైనది. నావంటి నీచజాతి వానిని స్వామి కటాక్షించి కొండంత ప్రేమ జూపెను." అని కోదండరాముని గుణ కీర్తన చేయుచున్న అంజనీపుత్రుని కన్నుల నుండి ఆనంద బాష్పములు స్రవించెను.

సుగుణాభిరాముడగు శ్రీరాముని గుణ విశేషములు హనుమంతుడు చెప్పగా విని విభీషణుని మనస్సు శాంతించి హృదయమను సంతోషభరిత మయ్యెను. ఆపైన అతడు వానర మూర్తికి జానకి లంకకు యెట్లు కొని రాబడినది, యెక్కడున్నది, యెట్లున్నది - మొదలగు వృత్తాంతమంతయూ శ్రుతపరచెను.

అంజనేయుడు సీత సమాచారము తెలుసుకొని హర్షోత్సాహియై విభీషణుని సౌజన్యమునకు కృతజ్ఞత తెలిపి "సోదరా! జానకిని చూడనంతవరకు నా మనస్సుకు శాంతి యుండదు. ఇక నాకు సెలవీయవలసినది!" అని చెప్పి మారుతి పునః సూక్ష్మరూపమును ధరించి వైదేహి యుండు అశోకవన వాటికవైపు పోయెను.

## మారుతి జానకిని దర్శించెను

ప్రాతఃకాలము ప్రాగ్దిశాభాగమున బాలసూర్యు డుదయించు చుండెను. అప్పుడు అతిమనోజ్ఞమై ఫల పుష్ప తరులతా సమృద్ధమై శోభించుచున్న అశోక వనములో ప్రవేశించు పవనపుత్రుడు పావని భూపుత్రిని దర్శించెను.

"దేఖి మనహి మహుం కీన్హ ప్రణామా
బై ఠేహి బీతి జాత నిసి జామా,
కృస తను సీస జటా ఏకబేనీ
జపతి హృదయ రఘుపతి గునశ్రేనీ."

విరహవ్యాకులయై, నిద్రాహారములు లేక, జడలుగట్టిన శిరోజములతో, కృశించిన శరీరముతో, నతవదనయై, రఘుపతిని స్మరించుచున్న సీతాదేవిని దర్శించి ఆంజనేయుని హృదయము ఆరాటపడెను. అతడు ఆ మహాతల్లికి మనస్సులో ప్రణమిల్లెను. అతడు వ్యసన గ్రస్తుడై, ఇక ఆ తల్లిని సమీపించి ఆమెను పల్కరించుట యెట్లా యని తర్కించుకొనెను. పిమ్మట అంజనీపుత్రుడు చిన్నగ ఆ చెట్టుపైకి యెక్కిపోయి దాని ఆకుల చాటున సూక్ష్మరూపియై నిలబడియుండెను.

## రావణుడు సీతను బెదరించుట

సరిగా ఆ సమయమునకు లంకేశుడు సర్వాలంకారశోభితుడై, అనేక సుందరీమణు లతనిని సేవించుచుండ, మదిరాపాన మత్తుడై సీతయున్న చోటుకు వచ్చెను. దశగ్రీవుడు సీతను పలువిధముల ప్రణయ మర్థించెను. ఆమెను తనయెడల ప్రసన్నురాలిగా చేసుకొనుటకు చతుర్విధోపాయముల ప్రయత్నించి "ఓ సుముఖీ! సునయనీ! ఒక్కమారు నీవు నన్ను కన్నెత్తిచూచిన చాలు. మండోదర్యాది రాణులనందరినీ నీ పరిచర్యలకై నియమింతును." అని బాస చేసి పలికెను.

మైథిలి దశకంఠుని దుష్టప్రసంగమునకు వ్యసనగ్రస్తయై పరపురుషునితో ప్రత్యక్షముగా భాషించుట పాడిగానందున ఒక గడ్డిపోచ అడ్డుపెట్టుకొని, శ్రీరాముని స్మరించి, నతవదనయై ఇట్లు పలికెను -

"ఓరీ! దశముఖుడా! ఎన్నటికైనా ఖద్యోతప్రకాశమునకు కమలము వికసించునా! దుర్మదాంధా! నీకు రఘువీరుని ఖరశరశక్తి తెలియరాకున్నది. సిగ్గులేని శిఖండివై నాథుడులేని సమయమున నన్ను దొంగిలించి తెచ్చితివి. నీ యైశ్వర్య సంపదలకు లోభించి, నీ బీరంబులకు జడిసి, నీపట్ల సుముఖభావము వహించుట కలలోని మాట. ఓరీ దుష్టరావణా! నా స్వామి నిన్ను శిక్షించి, నన్ను రక్షించుట నిక్కము."

సీత పలికిన పలుకులకు అసురనాథుడు అగ్రహోదగ్రుడై పండ్లు పటపట కొరికి, కరవాలము ఝళిపించి - "జానకీ! పొగరుచే నన్ను పరుషోక్తులాడి

తృణీకరించుచున్నావు. నామాట వినినియెడల ఈ ఖడ్గముతో నీతల ఖండించి వైచెద.'' అని గర్జించెను.

''రావణా! నీ... ఫలా సన్నిభమగు నా నాథుని బాహుదండమో - లేక నీ క్రూర కరవాలమో, ఏదో ఒకటిమాత్రము నా గళసీమ నలంకరించగలదు, అన్యథా జరుగదని నమ్ముము.'' అని భూమిజ దృఢ స్వరమున వానికి సమాధాన మిచ్చెను.

మైథిలి తిరస్కారభావమును బహుబాహుడు భరించలేకపోయెను. క్రోధోగ్రుడై కరవాలము పైకెత్తి సీతను తెగటార్చుటకు ముందు కురికెను. ఇంతలో మయతనయ మండోదరి సీత కడ్డుపడి రావణుని మందలించెను.

అంతట రక్షోవీరుడు దుష్టుడై రాక్షసాంగనలను పిలిచి - ''మీరు మైథిలి మనస్సు మార్చుటకు తగు చర్యలు తీసుకొనుడు! నెలలోపల ఆమె దారికి రాకున్నయెడల, సీతతోసహా మిమ్ముకూడ తెగటార్చి వైచెద -'' అని హుంకరించి చర చర వెళ్ళిపోయెను.

రావణుడు పోయిన పిమ్మట రాక్షసాంగనలు భయంకర రూపములు దాల్చి భూపుత్రిని భయపెట్టి బెదరించి నానా విధముల హింసించసాగిరి. ఆ రాక్షస స్త్రీలలో త్రిజట జ్ఞానవంతురాలు. రామచరణములం దనురాగమున్న భక్తురాలు. ఆమె మైథిలిని ముప్పుతిప్పలుబెట్టుచున్న రక్కసులను గుంపు జేర్చి వారి కిట్లు చెప్పెను -

''ఓ సఖులారా! రాత్రి నేనొక కలగంటిని. మీరు నా స్వప్న వృత్తాంతమును సావధానమనస్కులై ఆకర్ణించవలసినది. ఒక వానరుడు మన లంకకు వచ్చెను. వాడు రాక్షసులను హతమార్చి లంకకు నిప్పుబెట్టెను. మనరాజు రావణుడు తలలు చేతులు ఖండింపబడి దిగంబరుడై గాడిద నెక్కి దక్షిణ దిశగా పోవుచుండెను. విభీషణుడు లంకా రాజ్యమునకు నాథుడయ్యెను. లంకంతటా రాముని కీర్తి ప్రతిష్ఠలు ప్రాకిపోయెను. తదుపరి శ్రీరాముడు సీతాదేవిని పిలిపించుకొనెను. చెలులారా! నా కల కొద్ది దినములలోనే నిజము కానున్నది. మీరు నామాట పాటించి సీతకు తగు చర్యలు చేసి ఆమెను మంచి చేసికొనుడు.''

త్రిజట మాటలు రైత్యాంగనలు విశ్వసించిరి. వారు దిగులువడి దిక్కుల కొక్కరుగా పరుగెత్తిపోయిరి.

శోకసంతప్తురాలు సీత - అయ్యో! ఈ దనుజాధముడు నన్ను నెల దినములకు పిమ్మట సంహరించునేమోయని విచారించి దుఃఖించెను. పిమ్మట ఆమె త్రిజటను చేరబిలిచి వ్యసనకలుషితస్వరమున ఇట్లు పలికెను -

''అమ్మా! త్రిజటా! నీ ఋణము నేను తీర్చుకొనజాలను. ఆపత్కాలములో నన్ననుసరించిన ఆత్మీయురాలవు నీ వొక్కతెవే. తల్లీ ఒకవైపున రావణుని దుర్భాషలు, మరొక ప్రక్కన రామచంద్రుని వియోగ వ్యథ సహించలేకున్నాను. ఈ బాధలనుండి విముక్తి బొందుటకు దేహత్యాగమునకంటే తగిన మార్గము మరొక్కటి లేదు. త్రిజటా! సమిధలు కొన్ని తీసికొని రమ్ము. వాటితో చితిపేర్చుకొని దానిపై కూర్చుందును. ఈ దీనురాలిపై దయతలచి నీవు చితికి నిప్పంటించి సహాయపడుము. ఇదియే నీవు నాకు చేయవలసిన మహోపకారము'' అని సీత ప్రాధేయపడెను.

నిరాశోపహతయగు మైథిలిని త్రిజట ఊరడించెను. రఘువీరుని ప్రాభవ ప్రతాపములు సీతకు వర్ణించి చెప్పి ధైర్యోక్తులాడెను. త్రిజట సీతను ఆశ్వాసించి - అమ్మా! ఈ నిశిరాత్రివేళ నిప్పు యెక్కడ లభించగలదు! - అని చెప్పి ఆమె తన యింటికి పోయెను.

## వాయుపుత్రుని దౌత్యము

అశోకవనములో ఆనాటి రాత్రి జానకి ఏకాంతమున బహువిధముల శోకించెను. వ్యసనవ్యగ్రయగు వైదేహి వ్యాకులపడెను. 'అయ్యో! ఈ రాత్రివేళ నాకు నిప్పు దొరకు మార్గమే లేదా!' యని ఆరాటపడెను. గగనపథములో మిగమిగ మెరయుచున్న చుక్కలను చూచి, అంగారక గ్రహమైనా పిడుగుపడి నన్ను దహించకూడదా - యని యాశించెను. శీతాంశుడు స్త్రీలపై నిప్పులు కురిపించునట! మరి నన్ను తన జ్వాలలచే తపింపచేయకున్నాడేమని వాపోయెను. అశోకవృక్షమా! అనల సమానమగు నీ నవకిసలయాగ్నిచే నా శోకమును నివారించి సార్థకనాముడవు కమ్ము. - అని చేతులు జోడించి ప్రార్థించెను.

వృక్షాగ్రమున ఆకులచాటున దాగియున్న ఆంజనేయుడు దుఃఖ దగ్ధమానయగు సీత దైన్యస్థితిని జూచి జాలిపడెను. పిమ్మట అతడు శ్రీరాము డిచ్చియుండిన అంగుళీయకమును జానకి ముందర పడునట్లు చిన్నగ జారవిడచెను.

."- ఆహా! అశోక వృక్షము నాపై కరుణించి అగ్ని కణము పడవైచెను" - అని భావించి భూమిజ దానిని చేతిలోనికి తీసుకొని చూచెను. అది నిప్పుకణము గాదు. రామనామాంకితమైన అంగుళీయకము. మైథిలి ముద్దు టుంగరమును గుర్తించి హర్షాశ్చర్యములకు లోనయ్యెను - "ఇది ఏమి వింత నేను కలగనుచున్నానా! నా మనసు భ్రాంతి గొన్నదా! లేక ఇది రాక్షస మాయా! రామ నామాంకిత కరముద్రిక మాయా జనితమగుట అసంభ వము! మరి ఇది ఇక్కడి కెట్లు వచ్చెను? ఎవరు తెచ్చిరి! ఇంతకూ నా స్వామి నన్నను(గహించె. నా ప్రభువు అజేయుడు." - అని జనకాత్మజ హర్షవిషాద మగ్నయై ఆలోచింపసాగెను.

చెట్టుపై దాగియున్న హనుమంతుడు అప్పుడు వైదేహికి వినబడునట్లు మృదుమధుర స్వరమున రామకథావృత్తాంతమును గానముచేసెను. శ్రవణానంద కరమైన రామసంకీర్తన ఆలకించి సీత హృదయపరితాపము క్షణములో శాంతిం చెను. ఆమె విస్మయముతో దిక్కులుచూచి - "సోదరా! నీ వెవ్వరో నాకు కనబడవేందుకు?" అని ప్రశ్నించెను.

అంతట వాయుపుత్రుడు భూపుత్రి యెదుట ప్రత్యక్షమై, ఆమెకు ప్రద క్షిణపూర్వకముగా ప్రణమిల్లి వయవినయోక్తుల ఇట్లు విన్నవించెను -

"జననీ జానకీ! నేను వాయుపుత్రుడగు వానరుడను. నా పేరు హనుమం తుడు. నేను దశరథరాముని సేవకుడను. ప్రభువు పనుపున మీ వద్దకు వచ్చిన దూతను. నేనే యీ కరముద్రిక మీ ముందు పడవైచినది. స్వామి గుర్తుగా దీనిని నా చేతికిచ్చి పంపెను. అమ్మా! ఇందుకు రాముడే ప్రమాణము."

అని పలుకగా సీత వానర దూతను సందేహించెను. ఆమె ఆంజనేయుని చూడక ముఖము అటువైపు త్రిప్పుకొని శంకిత స్వరమున - "అయ్యా! నర - వానరులకు స్నేహమెట్లు సంభవించెను?" అని ప్రశ్నించెను.

అందుపై ఆంజనేయుడు సీతకు - రామలక్ష్మణులు ఋష్యమూక పర్వతమునకు వచ్చుట, సుగ్రీవునితో మైత్రి నెరపుట, వాలి వధ, సుగ్రీవుని కిష్కింధాపురికి రాజుగా చేయుట, సుగ్రీవుని ఆజ్ఞననుసరించి వానరయోధులు సీతను వెదకుచూ నలుదెసలకు పయనించుట, హనుమంతుడు సముద్రము దాటి వచ్చుట - మొదలగు పూర్వవృత్తాంతమంతయూ శ్రుతపరచి సందేహ నివృత్తి చేసెను. స్వామి భక్తుని దర్శించి, ప్రభువు యోగక్షేమములను తెలుసుకొని జానకి పట్టరాని సంతోషముతో పొంగిపోయెను. ఆమె కన్నుల ఆనందాశ్రువులు స్రవించెను. హర్షోత్కంఠిత జానకి కంపిత స్వరమున కపివరునితో ఇట్లనెను -

''హనుమంతా! విరహాంబుధిలో మునిగి ప్రాణాపాయ స్థితిలోనున్న నన్ను ఉద్ధరించుటకు వచ్చిన పుణ్యశ్లోకుడవు నీవు. కపిసత్తమా! రఘుకులనాథుడు రామచంద్రుడు క్షేమమా? మరది లక్ష్మణమూర్తి కుశలమే కదా! వారు నా యెడబాటు సహించి ధైర్యముగా నుండిరా? హనుమంతా! అతికోమలస్వభావుడగు రఘూద్వహుడు నా యెడల ఎందుకింత కాఠిన్యము వహించెను? ఎప్పుడైనా వారు నన్ను స్మరింతురా? నన్ను గురించి నీతో ఏమని చెప్పిరి? ఆ కోమల శ్యామలాంగుని కన్నులతో జూచు భాగ్యము ఎప్పుడు కలుగనున్నదో!'' అని జనకజ పలువిధముల ప్రశ్నించి - ''హా నాథా! నన్ను మరచిపోయితిరా!'' - అని రోదించి కన్నీరుమున్నీరుగా ఏడ్చెను.

విరహ విదగ్ధ వైదేహి ఆక్రందనకు అంజనీపుత్రుని హృదయము చలించి పోయెను. అత డామెతో ధైర్యోక్తులు పలుకుచూ - అమ్మా! అధైర్యపడకుము. రఘుకుల దీపకులైన రామలక్ష్మణులు కుశలురు. నిరంతరమూ నిన్ను గురించిన చింతయే వారిని వేధించుచున్నది. జననీ! సాకేతపతి నీకై పంపిన సందేశము వినిపించుచున్నాను'' అని పలికి రామదూత రుద్ధకంఠుడై వైదేహికి దాశరథి సందేశమును వినిపించసాగెను.

''జానకీ! నిన్ను ఎడబాసినది మొదలు కంటికి నిదుర పట్టదు. అన్నాహారములు రుచించుటలేదు. మనస్సుకు శాంతి లేదు. సీతా! నీ వియోగములో నాకు సమస్త ప్రకృతి ప్రతికూలమయ్యెను. చిగురుటాకులు నిప్పుల

వలె, శరద్రాత్రి కాళరాత్రివలె, హిమకరుడు దినకరునివలె, కమలములు కంటకములవలె, వర్షధార వేడి తైలమువలె, మలయమనము సర్పముల వూత్కారమువలె, నిరంతరము నన్ను బాధించుచున్నవి. ప్రియా! ఈ విరహావ్యధ ఎవరికి చెప్పగలను! ఏమని చెప్పగలను! ఆలకించువారెవరు! ఈ దుస్సహదుఃఖమెవరికి అర్థము కాగలదు! మైథిలీ! మన ప్రేమగాథ మనకు మాత్రమే తెలియగలదు. వైదేహీ! నా మనస్సు అనుక్షణమూ నీయందే లగ్నమైయున్నది.''

పతి సందేశమును మైమరచి వినుచున్న మైథిలి శరీరము సాత్త్వికభావముచే కంపించిపోయెను.

''మాతా! భూపుత్రీ! నీవున్నచోటు తెలుసుకొనుటకై దశరథాత్మజుడు తహతహపడుచున్నాడు. నీ వార్త తెలియగనే స్వామి వానర సేనాసమేతుడై సాగరము దాటివచ్చి నిన్ను రక్షించితీరును. నీవు దిగులొందవలదు. రామబాణాగ్నికి లంకారావణ సహితముగా రాక్షసవంశము భస్మమగుట ముమ్మాటికి నిజము. అమ్మా! స్వామి యాజ్ఞ లేనందుకు విచారించుచున్నాను. లేకుండిన నేనే నిన్ను తీసుకొనిపోయి స్వామి సన్నిధిని చేర్చగలను. జననీ! ధైర్యమువలంబించుము. ముజ్జగము లొక్కటైనమూ రఘువీరుడు రావణుని నిర్జించి నిన్ను పరిగ్రహించగలడు.'' అని ధైర్యోక్తులాడి కపిశ్రేష్ఠుడు మైథిలి మనస్సునకు స్వస్థత చేకూర్చెను.

హనుమంతుని ఆకృతి జూచి మిథిలేశనందిని - ప్రబల భయంకరాకారులగు రాక్షసయోధులను ఈ వానర జీవు లేమి చేయగలవని - శంకించెను. ఆమె అనుమానమును రామదూత గ్రహించెను. వెంటనే మహావీరుడు మేరు మందర పర్వతముల వంటి తన శరీరమును సీతకు ప్రకటించి ఇట్లనెను -

''తల్లీ! కొమ్మలపై సంచరించు కోతులము మేము. మాకు బుద్ధి బలము లెక్కడినుండి వచ్చును? ప్రభువు సంకల్పించిన సాధ్యముగానిదేది? స్వామి కటాక్షించిన సర్పముగూడా గరుడుని ఎదిరించగలదు -'' అని విన్నవించెను.

మారుతి స్వరూప సంభాషణాదులు తిలకించిన సీత అతడు అసమాన భక్తి ప్రతాపములుగల మహావీరుడని గ్రహించి సంతోషించెను. ''పుత్రా! ఆంజనేయా! నీవు బలవంతుడవు, శీలవంతుడవై జరామరణములులేక

సుఖించుము. రామప్రభువు సదా నిన్ను ప్రేమించుచుండుగాక' అని ఆనంద గాత్రియై అవనిజ ఆంజనేయుని ఆశీర్వదించెను.

మహావీరుడు హర్షపరవశుడై మహాపుత్రి పాదద్వయమునకు ప్రణమిల్లి - "మాతా! భూజాతా! మీ యాశీర్వాదము అమోఘము. నేటికి నా జన్మ ధన్యమైనది. అమ్మా! ఒక్క విషయమై మిమ్ము అడుగవలెనని నా నోరు ఉవ్విళ్ళూరుచున్నది. అదియేమన - సకల ఫలసంపదలచే సమృద్ధమై యున్న ఈ వనము చూచినప్పటినుండి నాకు ఆకలిమంట లెక్కువగుచున్నవి. మీరు అనుమతించిన తనివితీరా భుజించి క్షుద్బాధ తీర్చుకొందును." అని అర్థించెను.

"హనుమా! బలవంతులగు రక్షోవీరులు అహర్నిశమూ ఈ తోటను రక్షించుచుందురు. నేనేమి చేయగలను?" అని ఆమె తన అశక్తత వెల్లడించి విచారించెను.

"మాతాజీ! ఈ జాతుధానుల బలదర్పములకు నేను భయపడుటలేదు. కేవలము మీ అనుమతిని అర్థించితిని. మీరు సెలవిచ్చిన చాలు; మిగత పని నేనే చూచుకొనెదను." అని కపివీరుడు కోరగా జానకి "తథాస్తు" అని సమ్మతించెను.

## మహావీరుడు బంధితుడగుట

వానరవీరుడు వైదేహికి వందనమిడి, ఫల సమృద్ధమై కళకళలాడుచున్న వనముపై బడెను. నానాద్రుమలతావితానశోభితంబగు ప్రమదావనముపై ప్లవంగవీరుడు ఇచ్ఛవచ్చినట్లు విహరించెను. పండ్లు భుజించెను. పూలు వాసన చూసెను. ఆకులు దూసిపోసెను. చెట్లు పెకలించెను. లతావితానములను తునాతునకలుగా చేసెను. కాసారములను కల్లోల పరచెను. కేళీ గృహములను పగులగొట్టెను. విజృంభించిన మర్కట స్వభావమునకు వన వైభవము విధ్వంసమాయెను. కల్లోలముచూచి పరుగెత్తుకొనివచ్చిన కావలివారలను కోతిరాయుడు బెదరించి, భయపెట్టి, పడలగొట్టి, హతమార్చి నానా బీభత్సము చేసి వైచెను.

హత శేషులైన వనపాలకులు పరుగెత్తుకొని పోయి లంకేశునితో ఇట్లు మొర
పెట్టుకొనిరి--

"ఓ అసురేశా! ఒక వానరయోధుడు వచ్చి వనములో బడెను. ఆ కోతి
రాయుని ఆగడము ఏమని చెప్పెదము! అతడు పండ్లు తిని, ఆకులు గోసి,
చెట్లు పెకలించి, తీగలు చిందరవందరచేసి వాటికను నాకాడు చేసెను. ఆ
గండుదేరిన గండుకోతి ఎదిరించిన కావలివారలను నిముసములో కడతేర్చి
వైచెను. వానిదుండగము లేమని చెప్పగలము! రాజా! అశోకవనము శోకవన
మయ్యెను!"

అసురేశుడా వార్తకు ఆగ్రహాష్టుడై వెంటనే వేలమంది వీర భటులను పిలిచి
వారితో - ఆ పొగరుబోతు కోతిని తత్క్షణమే బంధించి ఇప్పటికి తీసుకొని
రమ్మని - ఆజ్ఞాపించి పంపెను. అనపాయశూరుడగు అంజనీపుత్రుడు ఆ
రాక్షస మూకను నిమిషములో నిశ్శేషమొనర్చి యమలోకమునకు పంపెను.

ఈ దుర్వార్త చెవుల బడగనే అసురేశుడు ఆగ్రహించి తన తనయుడగు
అక్షకుమారుని పంపెను. అక్షయ బల సమోపేతుడగు అక్షకుమారుడు అనేక
వేలమంది భటులను వెంటబెట్టుకొని వచ్చి హనుమంతుని తాకెను. తత్క్షణమే
ఋక్షవీరుడు ఒక వృక్షము పెకలించి దానితో క్షణములో అక్షయ కుమారుని
క్షత విహతుని జేసెను. మిగిలిన యోధులలో కొందరిని నిర్జించి, కొందరిని
నేలరాచి, మరికొందరిని చూర్ణముచేసి ఘనగర్జన చేసెను.

అక్షకుమారుడు సేనతోసహా క్షయమైనందుకు దశగ్రీవుడు విచారించి
వ్యసనరోష కషాయితనేత్రుడై యింద్రజిత్తును పిలిచి "వత్సా! దివ్యాస్త్రకోవిదు
డవు, వీర్య స్థైర్య సంపన్నుడవగు నీవు వెళ్ళి ఆ వానరాధముని బంధించి తీసు
కొని రమ్ము" అని ఆజ్ఞాపించి పంపెను. మేఘనాదుడు తండ్రికి నమస్కరించి
రథ మారోహించి రణోత్సాహియై బయలుదేరెను.

అతుల బలపరాక్రమ సంపన్నుడగు మేఘనాదుడు అనుజుని మృతికి ఆగ్ర
హమునొంది బొబ్బలిడుచూ హనుమంతుని దాకెను. వీరాంజనేయుడు రోషో
ద్దీపితుడై విజృంభించి ఒక పెద్ద వృక్షము పెరికి పండ్లు పట పట కొరుకుచూ
దానితో సైన్యమును మోది ఇంద్రజిత్తు కనక రథమును నుగ్గు నూచముగా

జేసెను. ఆపైన విరథుడైన మేఘనాదుడు వానర వీరునితో తలపట్లు పట్టెను. అసుర - వానరయోధు లిద్దరు ఏనుగులవలె భయంకరముగ పోరాడిరి. మర్కటవీరుని ముష్టిఘాతమునకు ఇంద్రజిత్తు క్షణకాలము మూర్ఛిల్లి తిరిగి తెప్పరిల్లుకొని లేచెను. నానావిధ మాయోపాయములచే వానరుని వధించుటకు ప్రయత్నించి విఫలుడైన మేఘనాదుడు తుదకు బ్రహ్మాస్త్రమును ఆంజనేయునిపై ప్రయోగించెను. మహావీరుడు బ్రహ్మాస్త్రమునకు లొంగిపోయి మూర్ఛాగతుడయ్యెను. రావణతనయుడు వానిని నాగపాశములతో బంధించి దశకంఠుని సభకు తీసుకొనిపోయెను.

"ఓ భవానీ! ఎవని నామస్మరణచే సుర నరమునులు భవబంధములనుండి ముక్తులగుచున్నారో ఆ శ్రీరామునకు భక్తుడగు హనుమంతుడు రాచకార్యము లక్షించి నాగపాశవములకు బద్ధుడయ్యెను." అని భర్గుడు పార్వతికి విశదీకరించెను.

## లంకాదహనము

వానరుడు బంధింపబడెను వార్త లంకలో వ్యాపించెను. ఆ విచిత్ర వ్యక్తిని చూచుటకు వచ్చిన ప్రేక్షకులతో దశాననుని దర్బారుహాలు కిటకిటలాడెను. వైభవోపేతమగు రావణుని రాజమహలు, దాని పెంపు సొంపులుచూచి కపి వరుడు నిర్ఘాంతపడిపోయెను. దేవతలు దిక్పాలురు పౌలస్త్యవంశోద్దీపకుడగు రావణుని ప్రతాపమునకు భృత్యానుభృత్యులై వర్తించుచుండిరి. సర్పముల మధ్య గరుత్మంతునివలె కపిగ్రామణి దనుజేశుని దర్బారులో నిర్భయుడై నిలబడియుండెను.

మంత్రి సామంత దండనాథులు పరివేష్టించియుండ, సకల మణిమయ భూషణ భూషితుడై, వీర్య స్థైర్య తేజో విలసితుడగు లోకరావణుడు సభకు కొనితేబడియున్న కోతిని చూచి మొదట ఫక్కున నవ్వెను. వెనువెంటనే పుత్రునిమరణవార్త మనస్సుకు వచ్చి క్రుద్ధుడై కపిని జూచి యిట్లు గర్జించెను.

"ఓరి వానరుడా! నీవెవరు? నిన్నెవరు పంపగా యిక్కడికి వచ్చితివి? ఎవరి బలము చూసుకొని మా వనమును నాశము చేసితివి? నిష్కారణముగా

రాక్షసుల నేల వధించితివి? మా కీర్తి ప్రతాపములు నీవు వినియుండలేదా? కుంతా! ఇంత నిర్భయుడవై యుండుటకు నీకు ప్రాణభయములేదా? వానరా! నిజము చెప్పుము. నీ ఆగడములకు కారణమేమి?''

రావణాసురుని ప్రశ్న పరంపరలకు కపి పుంగవుడు నిర్భయముగా ఇట్లు సమాధాన మిచ్చెను -

''లంకేశా! ఎవనికి ఆజ్ఞానువర్తులై, బ్రహ్మ విష్ణు మహేశ్వరులు లోకములు సృజించి, పోషించి, లయింపజేయుచున్నారో, ఎవని బలాధారముతో ఆదిశే-షుడు ఈ బ్రహ్మాండ భారమును భరించియున్నాడో, ఎవడు నానావతారము లెత్తిఆ యా కాలములందుదేవజాతిని రక్షించెనో, ఎవడు కాలకంఠుని కార్ము కము ఖండించగలిగెనో, త్రిలోకవీరుడు వాలిని, ఖరదూషణ, త్రిశిరాదులను ఎవడు నిమిషములో నిర్జించెనో,ఎవని సతీమణిని నీవు చోరునివలె దొంగిలించి తెచ్చితివో, ఆ జగద్వంద్యుడగు రఘూత్తముని దూతను నేను. నా పేరు ఆంజనేయుడు. రావణా! నీవు పేర్కొన్నట్లు నీ కీర్తి ప్రతాపములుకూడా నాకు తెలియకపోలేదు. సహస్రబాహునితో వాలితో యుద్ధముచేసి - నీవు గడించిన కీర్తి సంగతి ఎవరికి తెలియదు?

''రాక్షసేశ్వరా! ఆకలికి కొన్ని పండ్లు తింటిని. స్వభావ వశమున కొన్ని చెట్లు విరగగొట్టితిని. ప్రాణరక్షణార్థమై కొద్దిమంది నీ భటులను మర్దించి యుంటిని. ప్రభూ! ప్రాణముపై ఎవనికి ప్రీతియుండదు! నన్ను కొట్టవచ్చిన వారిని నేనూ కొట్టితిని. ఇంతమాత్రానికే నీ పుత్రుడు నన్ను బంధించి తెచ్చెను. స్వామి కార్యార్థమై వచ్చిన నాకు - బంధింపబడినందుకు సిగ్గెం దుకు!'' అని హనుమంతుడు రావణునితో తన పేరు, తన బలము, స్వామి గొప్పతనమును గురించిన వాక్యములు నర్మగర్భముగా పలికెను. తదుపరి కపి గ్రామణి నిర్మలహృదయముతో ఇట్లు హితోక్తులాడెను -

''హేలంకేశా రావణా! నేను రాముని దూతనగు హనుమంతుడను. నీ క్షేమముకోరి చేతులు జోడించి ప్రార్థించుచున్నాను. నీ దురహంకారము వదలి పెట్టి నామాట వినుము. ఓ పౌలస్త్య వంశోద్భవా! నీ కులమెంత పవిత్రమైనదో ఒక్కమారు సింహావలోకనముచేసి చూడుము. అభిమానముతో వివేకము

కోల్పోయి అట్టి పవిత్ర వంశమునకు వినాశము సంఘటింపజేయుచున్నావు. ఇక్ష్వాకుకుల దీపకుడగు రఘువీరుని వీర్యశౌర్యము లేపాటివో నీకు తెలియునా! సురాసురులాది చరాచరములను భక్షించు కాలయముడే కోదండ రామునకు గడగడలాడి పోవును. అట్టి మహావీరుడగు శ్రీరామునితో వైరము పాటించి రాక్షసవంశమును క్షయింపజూచుచున్నావు. రావణా! రామునికి జానకిని సమర్పించుకొని కలకాలము సుఖింపుము. దశగ్రీవా! రఘుపతి ప్రణతపాలుడు, శరణాగత వత్సలుడు, దయార్ద్ర హృదయుడు. సీతను సమర్పించుకొని, దాశరథి దయకు పాత్రుడవై, బంధు బాంధవ సతీసుత సమేతముగా లంకారాజ్యము నేలుకొని ఇహపరములు సాధించుకొనుము. నీ మూలమున విఖ్యాతమగు పులస్త్యుని ఋషికులమునకు కళంకము రానీయకు. ఎన్ని భూషణము లున్ననూ శరీరము వస్త్రములేనిదే రాణించనట్లు, శ్రీహరినామము జపించని వాక్కు శోభించదు. ఓ దశకంఠా! నేను ప్రమాణము చేసి చెప్పుచున్నాను వినుము. వేలాది బ్రహ్మ మహేశ్వరులు ఒక్కటై విశ్వప్రయత్నము చేసిననూ సాకేతవీరుని శత్రువును రక్షించజాలరు. నామాట నిజము.''

ఇవ్విధముగ విజ్ఞుడు వివేకవంతుడగు హనుమంతుడు దనుజాధిపునికి యుక్తాయుక్త మార్గము లెరిగించి పలువిధముల హితబోధ జేసెను. అందుకు సురారి గర్వోద్ధతుడై ఫక్కున నవ్వి - ''ఓహో! ఈ దినము మనకు మంచి గురువు లభించెను. కోతీ! చావు సమీపించి కన్నుగానక తైతక్కలాడుచున్నావా!'' అని హేళన చేసి మాట్లాడెను.

''రావణా! నెమ్మదిమీద నీమాటలే నీకు వర్తించగలవు.'' అని వాయుసూనుడు వాక్రుచ్చెను.

రావణు డా మాటకు కుపితుడై హనుమంతుని మరమరచూచి భటులతో - రాక్షసులారా! వీనిని గొనిపోయి వెంటనే వధించుడు - అని ఆజ్ఞాపించెను. నిశాచర వీరులు తత్క్షణమే రామదూతను కట్లతో బంధించి సంహరించుటకు ఉద్యుక్తులైరి.

ఇంతలో సచివ సమేతుడై అప్పుడే సభకు వచ్చిన విభీషణుడు అగ్రజానికి నమస్కరించి వినమ్రుడై ''రాజా! దూతను సంహరించుట రాజధర్మమునకు

విరుద్ధము. ఈ రాజ దూతకు మరొక విధముగ శాస్తిజేసి పంపించవలసినది." అని సూచించెను. విభీషణుని సూచనకు సభాసదులు కూడా తమ హర్షామోదములు తెల్పిరి.

దశాననుడందుకు ఆమోదించి, చిన్నగ నవ్వి - "వానరములకు తమ వాలముపై ప్రీతిమెండు. ఈ తుంటరి తోకకు నూనె గుడ్డలు చుట్టి నిప్పు పెట్టవలసినది. అప్పుడు ఈ తోకలేని కోతి వెళ్ళి తన ప్రభువును వెంటనే వెంటబెట్టుకొని తిరిగి వచ్చును. పిమ్మట వీని ప్రతాపము, వీని స్వామి పౌరుషము - ఏపాటివో మనము చూడగలము." అని పలికెను.

నిశాచరులంత వానరుని తీసుకొనిపోయి అతని వాలమునకు గుడ్డలు చుట్ట నారంభించిరి. ఆంజనేయుడు వినోదార్థమై అంతకంతకూ తన తోకను పెంచుతూ పోయెను. లంకలో నిలువయున్న గుడ్డలు, కూడబెట్టిన నూనె తోకకే సరిపోయెను. ఈ వింతను చూచుటకు పౌరులు గుంపులు గుంపులుగా చేరిరి. పిమ్మట వారు చప్పట్లు కొట్టుచూ, కేకలు వేయుచూ, నవ్వుచూ వానరయోధుని లంకలోని ముఖ్యవీధులగుండా ఊరేగించి తుదకు వాలమునకు అగ్గిపెట్టిరి.

వాలమునకు నిప్పు పెట్టినదే తడవుగా ఆంజనేయుడు తన విశాల కాయమును ఒక్కమారుగా కుంచింపజేసెను. అతని బంధములన్నియూ వదులాడి విడిపోయెను. ఒక్కక్షణములో హనుమంతుడు రాక్షస భటులనుండి జారుకొని కుప్పించి యెగసి ఒక బంగారు మేడపై చేరెను. భగవదిచ్ఛ! ఇంతలో ప్రచండమైన గాలి వీచెను. ఇంకేమున్నది? మండుచున్న తోక, దానికి గాలితోడు! అంజనీ పుత్రుడు కిలకారము చేసి అక్కడినుండి మరొక మేడమీదికి దూకెను. ఆ మహాకాయుడట్లు అతి లాఘవముతో ఒక గృహము నుండి మరొక గృహము మీదికి ఎగురుచూ దూకుచూ పోయెను. జనులు గుర్తెరిగించి చూచుచుండగనే నగరమంతటా నిమిషములో అగ్నిజ్వాలలు వ్యాపించి పోయెను. మేడలు, మిద్దెలు, బురుజులు, అంతపురములు ఫెళ ఫెళ ధ్వనిచేయుచూ, భస్మమైపోయెను. స్త్రీలు, పురుషులు, బాలురు, భయోద్రిక్తులై కేకలు పెట్టుచూ దిక్కులకు పరుగులెత్తిరి. జ్వాలల చిటపటలలో,

ప్రాణుల హాహాకారములతో నేల గూలుచున్న భవనముల ధన ధన శబ్దములతో లంక అల్లకల్లోలమై తగులబడెను.

పతివ్రతామణి సీతామతల్లి ప్రార్థించి యున్నందున అగ్నిహోత్రుడు ఆంజ నేయునికి శీతలుడై యుండెను. వాలము భగ భగ మండుచున్ననూ వాయు పుత్రునకు దాని బాధ తెలియలేదు.

విభీషణుని మందిరముతప్ప మహానగరమంతయూ భస్మపటలమయ్యెను. ఆంజనేయు డట్లు విజృంభించి లంకనంతయూ తగులబెట్టిన పిమ్మట సముద్రములోనికి దూకి వాలము చల్లార్చుకొని శాంతించెను.

## హనుమంతుడు సీతను వీడ్కొనుట

తదుపరి ఆంజనేయుడు తన శరీరము చిన్నదిగా చేసుకొని పునః అశోక వనమందున్న సీతాదేవివద్దకు వచ్చెను. అతడు జానకికి సాష్టాంగ మొనర్చి ''మాతాజీ! మీ యానతి ప్రకారము శ్రీరామ లక్ష్మణులకు వృత్తాంత మంతయు నివేదించగలను. ప్రభువు ఇచ్చిన విధముగ మీరుకూడా యేదైనా నిదర్శన మిచ్చి పంపవలసినదిగా కోరుచున్నాను.''

జానకి తన శిరమందున్న చూడామణి తీసి హనుమంతున కిచ్చెను. అతడు దానిని కన్నుల కద్దుకొనెను.

''ఆంజనేయా! శ్రీవారికి, లక్ష్మణమూర్తికి నా నమస్కారములు తెల్పుము. శ్రీవారు పూర్ణకాములు. కానీ ఆర్తజన పాలకుడను బిరుదు నిలుపుకొనుమని చెప్పుము. వాయుపుత్రా! దశకంఠుడాడిన దుర్భాషలు, వాడు చేయుచున్న దౌష్ట్యము చూచితివిగదా! వారు అమేయశక్తి సంపన్నులు. ఒకప్పుడు దండక వనములో ఇంద్రుని పుత్రుడు జయంతుని పైకి స్వామి గడ్డి పోచ మంత్రించి వైచిన విషయము వారికి జ్ఞప్తికి చేయుము. మారుతీ! రామ ప్రేషితుడవై వచ్చిన నిన్ను చూచుకొని ఈ రెండు దినములు ధైర్యముగా నుంటిని. ఇప్పుడు నీవుకూడా పోవుచున్నావు. ఇక నే నీ దుష్టులమధ్య దివా రాత్రము లెట్లు గడుపవలెను! వాయునా! కపిసత్తమా! వారు మాసము దినము లలోవచ్చి నన్ను ముక్తురాలిని జేయని యెడల నేను జీవించియుండుట

అసంభవమని తుది మాటగా చెప్పుము. వత్సా! నీకు శుభముగుగాక! పోయి రమ్ము." అని జానకి రుద్ధకంఠయై వానర వీరునికి వీడ్కోలిచ్చెను.

అంజనీపుత్రుడు భూపుత్రిని ఊరడించి, ధైర్యోక్తులు పలికి, ఆమె చరణ ద్వయమునకు ప్రణమిల్లి తిరుగుప్రయాణము సాగించెను.

## హనుమంతుని పునరాగమనము

వాయుసుతుడట్లు వైదేహిని వీడ్కొని, దనుజాంగనల గర్భస్థపిండములు అదరిపడునట్లు తుదిసారిగా సింహనాదము చేసి, కార్తీకశుద్ధ శిఖరమునాడు ఒక్క యెగురున సముద్రము దాటి యావలి ఒడ్డుకు వచ్చి చేరుకొనెను. అంతవరకు ఆతని రాకకై నిరీక్షించుచున్న వానరయోధులు హనుమంతుని జూచి హర్షోత్సాహితులైరి. జాంబవంత అంగదాది ప్రముఖులు ఆంజనేయుని చుట్టుముట్టి కిలకారధ్వనులతో అతనికి జేజేలు పలికి ఉప్పొంగిపోయిరి. "ఇక మనము నిర్భయముగా పంపాపురమునకు ప్రత్యావర్తనము చేయవచ్చును. హనుమంతుడు మనకు మరణదండన తప్పించి ప్రాణదానము చేసెను. రామ కార్యము నిర్విఘ్నముగ సాధింపబడినందుకు మనము ధన్యులము." అని చెప్పుకొని వారు ఆనందభరితులైరి.

తదుపరి వానరులు సంతోషముతో గంతులు వేయుచూ గృహోన్ముఖులైరి. దారిలో వారికి వాయుసూనుడు తాను సముద్రము దాటుట, లంకిణిని వధించుట, ధరణిజను దర్శించుట, లంకను కాల్చుట - మొదలగు వృత్తాంతమంతయు తెలియజెప్పెను. తిరుగు ప్రయాణమందు దారిలో వారు సుగ్రీవుని మధువనము సమీపించిరి. ఉత్సాహితులై వళ్ళు మరచి గంతులు వేయుచూ వచ్చుచున్న వానరులకు ఫలపుష్ప సంభరితమైన వనము చూడగనే వెర్రెత్తినట్లయ్యెను. వారు వనములో జొరబడి, కావలి వారిని వాలుగు తన్ని, చెట్లెక్కి, పండ్లు పెరికి, తృప్తిగా తిని, హాయిగా నిద్రించిరి.

వనపాలకులు వెంటనే పరుగెత్తుకొని పోయి సుగ్రీవుని కీ సంగతి మొరపెట్టుకొనిరి. "సీత సమాచారములు తెలుసుకొని తిరిగి వచ్చునప్పుడు మీరు మధు వనములో ప్రవేశించి ఫలములు భక్షించవచ్చును." అని సుగ్రీవుడు

అంగద హనుమంతాదులతో చెప్పి యుండెను. - "ఓహో! మనవారు కార్యము సాధించుకొని తిరిగివచ్చుచున్నట్లున్నది." అని ఊహించుకొని సుగ్రీవుడు సంతోషించెను.

ఇంతలో సీతాన్వేషణార్థమై వెళ్ళి యుండిన వానర బృందము సుగ్రీవుని వద్దకు వచ్చి తమ రాజుకు జయము పలికిరి. సూర్యపుత్రుడు వారిని యథా విధి సమాదరించి, వారి యోగ క్షేమాదులు తెలుసుకొని, 'కార్యమెంతవరకు సాధించితి'రని ప్రశ్నించెను. "రాజా! మీ కృపచే మేము కుశలము. స్వామి కార్యము సాధించుకొని వచ్చితిమి. హనుమంతుడు ఒక్కడే యీ కార్యము సాధించి మాకు ప్రాణదానము చేసెను." అని వారు తమ విజయవార్త వేయి కంఠములతో వెల్లడించిరి. తత్క్షణమే సుగ్రీవుడు అంగద హనుమంత జాంబవంతాదులను వెంటబెట్టుకొని, ఈ శుభ సమాచారము తెలియజేయుటకై దశ రథ నందనులున్న చోటికి పయనమయ్యెను.

## మారుతి శ్రీరామునకు సీత వృత్తాంతము తెలియజేయుట

రామలక్ష్మణులు స్ఫటిక శిలావేదికపై ఆసీనులై యుండ సుగ్రీవాదులు వచ్చి శ్రీవారి చరణములకు నమస్కరించిరి. అవధేశుడు వారిని యథావిధి ఆదరించి ప్రియ వచనముల పల్కరించెను. అంతట సుగ్రీవునిచే అనుజ్ఞాతుడై వృద్ధజాం-బవంతుడు ఇట్లు ప్రసంగించెను; - "ప్రభూ! మీ కృపాకటాక్షవీక్షణము లెవనిపై ప్రసరించునో వాడు నిత్య కుశలుడై సదా యశోవిజయములచే విరాజిల్లుచుండును. మీదయా దృష్టిచే మా ప్రయత్నములు ఫలించి, కార్య ములు సిద్ధించి మా జన్మలు తరించెను." అని స్తుతించి, జాంబవంతుడు శ్రీరామునకు అంజనీపుత్రుడు సాధించిన కార్యవృత్తాంత మంతయూ నివేదిం-చెను. ఈ సుఖద సమాచారము చెవులబడగనే సీతాపతి అమందానందప్రాద యారవిందుడై ఆంజనేయుని ఆప్యాయముగ ఆలింగనము చేసుకొని "హనుమంతా! జానకి క్షేమమా? ఆమె ప్రాణములతో బ్రతికియున్నదా! ఎక్కడున్నది? ఎట్లున్నది? జలనిధి నెట్లు దాటితివి?" అని వ్యగ్రాని సంతో షముతో ప్రశ్నవర్షము కురిపించెను.

"నాథా! సీత క్షేమము, జలనిధి దాటితిని, లంకలో ప్రవేశించితిని, జానకిని దర్శించితిని, సౌభాగ్యవతితో సంభాషించి వచ్చితిని. ఆమె అహర్ని-శము మీ నామస్మరణ చేయుచూ ప్రాణావశిష్టయై యున్నది.

ప్రభూ! జలనిధిమధ్య త్రికూట పర్వతముమీద నున్న లంకాపురిలో అశోకవనమందు వైదేహి ఉన్నది. నేను మరలివచ్చునప్పుడు మైథిలి నా చేతికి ఈ చూడామణిని ఆనవాలుగా ఇచ్చి పంపెను." అని చెప్పి ఆంజనేయుడు చూడామణిని శ్రీరామని చేతికిచ్చెను. ఆతురతతో రాముడా చూడామణిని హృదయమున కద్దుకొని పునఃపీతను పొందినంతసుఖ మనుభవించి సజలనేత్రు డయ్యెను.

"మారుతీ! మైథిలి మరేమి చెప్పి పంపెనో త్వరగా చెప్పుము. ఆమె సందేశము వినుటకై నా హృదయము వేగిరపడుచున్నది." అని జానకీ వల్లభుడు వానర శ్రేష్ఠుని అర్థించెను. అంతట హనుమంతుడు నతమస్తకుడై "రఘుపతీ! సీతాదేవి సాశ్రుకంఠయై తమ కిట్లు నివేదింపవలసినదిగా నన్ను కోరెను -

"ఓ హనుమంతా! సౌమిత్రి సమేతుడగు శ్రీరాముల చరణములకు నా నమస్కారములు తెలియజేయుము. త్రికరణ శుద్ధిగా నేను రఘూద్వహునే నమ్మి యున్నాను. విభుడు నన్ను విస్మరించి యుండుటకు నే జేసిన అపరాధమేమి? వారిని యెడబాసి నేను దేహత్యాగము చేయలేక పోయితిని. ఇదియే నే జేసిన దోషమై యుండవచ్చును. హనుమా! నా ప్రయత్నలోపమువలనగాక, నా నేత్రములు జేసిన దోషముచే ప్రాణావశిష్టనై యున్నాను. ప్రాణేశ్వరుని వియోగాగ్నిచే నా దేహము దహింపబడెను. ఉచ్ఛ్వాస నిశ్వాసములు దానికి గాలివలె తోడ్పడెను. కానీ సంతత ధారాపాతమై స్రవించు అశ్రుజలముచే ఈ దేహము దహింపబడకున్నది. మారుతీ! కోసలేశుని చూడవలెను కోరికచే కన్ను లిట్టి పనికి పూనకున్నవి. నేను అశక్తనై ఏమియూ చేయలేకున్నాను. హనుమంతా! నేను ఒక్కదినము' ఒక్క యుగమువలె గడుపుచున్నానని, నన్ను దొంగిలించి తెచ్చిన ముష్కరుని మర్దించి జయశ్రీతోడ నన్ను శీఘ్రమే చేపట్టవలసినదని శ్రీరామునితో చెప్పుము." - అని దేవిగారు సీతో పలుకవలసినదిగా చెప్పిరి.

స్వామీ! జానకి ప్రార్థనా నమస్కారములు స్వీకరింపుము''- అని నివేదించి ఆంజనేయుడు రఘుచంద్రుని చరణములపై సాష్టాంగపడెను.

''హనుమా! నీవంటి మహోపకారి ఈ ముజ్జగములందలి దేవ మానవులలో ఉండబోడు. నీకు నే నెంతయో ఋణపడితిని. నీ సేవకు ప్రతి కృతి చేయజాలను., సౌమ్యా! నీకు ఋణగ్రస్తుడనైతిగదా యని విచారించు చున్నాను.'' అని పలికి రామమూర్తి పావరమూర్తిని అక్కునజేర్చి కన్నీరు బెట్టుకొనెను.

సాకేతనాథుని ముఖకమలము అశ్రుపూరితమై యుండుటజూచి పవమాన సుతుడు పులకిత శరీరుడై పునః పురుషోత్తముని పాదపద్మములపై పడిపోయెను. శ్రీపతి మర్కటోత్తముని మస్తకముపై తన అభయహస్త ముంచి అతనిని లేవనెత్తుటకు ప్రయత్నించెను. కానీ వారి ప్రయత్నము వ్యర్థమయ్యెను.

''ఓ భరద్వాజా! ప్రభు పాదములపై పవనతనయుని శిరము, అతని శిరముపై అవధేశుని హస్తకమలము! ఆహా, కపీశ్వరుడెంత అదృష్టవంతుడు! ఆ మంగళకర దృశ్యము చూచి పార్వతీ పరమేశ్వరుల హృదయములు పులకరించి పోయెను. భరద్వాజా! తదుపరి గంగాధరుడు గిరితనయకు తెలియజెప్పిన మిగత కథ చెప్పుచున్నాను. సావధానుడవై ఆకర్ణించవలసినది.'' అని యాజ్ఞ వల్క్యుడిట్లు చెప్పనారంభించెను.

ఆనందపరవశుడైన అవధేశుడట్లు ఆంజనేయుని అంచున కూర్చుండబెట్టు కొని - ''కపీశ్వరా! శతయోజన విస్తీర్ణమగు సాగరము నెట్లు తరించితివి? దుర్గమము, పరదుష్ప్రాప్యమగు లంకయందెట్లు ప్రవేశించగలిగితివి? లోకరావణుని లంకలోని విశేషములేవి? ఆ లంక నెవ్విధముగ దహించి రాగలిగితివి? శత్రువులమధ్య మైథిలి తన ప్రవాస జీవన మెట్లు గడుపుచున్నది? మొదలగు నీ యాత్రా విశేషములు వివరించి చెప్పుము'' - అని పృచ్ఛించెను.

మారుతి శ్రీరామదౌత్యము స్వీకరించి పంపాపురమునుండి ప్రస్థానము చేసినదాది పునరాగమనమువరకు జరిగిన వృత్తాంతమంతయూ స్వామికి సవిస్త రముగ నివేదించి, నమ్రుడై, ఇంచుకంతయూ అభిమానము ప్రకటించక ఇట్లు వచించెను -

"రామప్రభూ! సర్వజ్ఞుడవగు నీకుతెలియనిదీ, నేను తెలియజేయవలసినదీ ఏ మున్నది! మీ కృపాకటాక్షమువల్లనే సర్వము సానుకూలమయ్యెను. ఇందులో నా ప్రయత్న ప్రయోజకత్వములు పరిగణించదగినవి కావు. స్వామీ! మీ రిచ్చిన కరముద్రికా ప్రభావముతో సముద్రము దాటగల్గితిని. ఆ అంగుళీయకమును జూచి సీత హృదయము శాంతించెను. వైదేహి విరహాగ్నిచే లంక దహింప బడెను. జనకజ ప్రసాదించిన చూడామణి మాహాత్మ్యముచే పునసాగరము లంఘించి, క్షేమముగ మీ సన్నిధి చేరుకొంటిని. జగదీశ్వరా! నేను నిమిత్తమాత్రుడను! మీ సంకల్పశక్తికి నే నొక సాధనము మాత్రమే. స్వామీ! నన్ను కరుణించి, నిత్యానపాయిని, నిత్య సుఖదాయిని యగు మీ భక్తిని ప్రసాదించి న న్ననుగ్రహించవలసినదిగా వేడుచున్నాను" అని ఆంజనేయుడు అర్థించెను.

మహావీరుని వినయోక్తులాలకించి, అతని భక్తిభావమును మెచ్చుకొని సాకేతవాసుడు "తథాస్తు" అని దీవించెను. అవధేశుని ఔదార్యము, మహావీరుని మహాభాగ్యమునకు కపి కులము జేజేలు పలికెను.

## రామదండు కదలెను

తదుపరి రఘుపతి వానరపతి సుగ్రీవుని బిలువనంపి, "కపిరాజా! సమయ మాసన్నమైనది. ఇక ఆలస్య మెందులకు? దుర్మదాంధుడగు దశగ్రీవునితో యుద్ధము చేయుటకై అభియానము సాగించెదము. సఖా సుగ్రీవా! సమర సన్నాహమునకు ఆజ్ఞ యిచ్చి వానరవాహినిని ప్రయాణింపజేయుము." అని ఆదేశించెను. కపినాథుడు శ్రీవారి శ్రీముఖమును పొంది తక్షణమే కార్యోన్ముఖుడయ్యెను.

వానరపతి సుగ్రీవుడు శుభముహూర్తమున రణభేరి మ్రోగింపజేసి వానర సైన్యమును ప్రస్థానము చేయించెను. ఆ సమయమున శుభనిమిత్తములు తోచెను. సూర్యచంద్రులు సంతసించిరి. దేవ గరుడ గంధర్వ నర నాగుల దుఃఖములు తొలగిపోయెను. జానకికి వామాంగ మదరెను. కోటానుకోట్ల వానర భల్లూక యూథములు జయజయ ధ్వానములు చేయుచూ భూమ్యాకాశమార్గముల ప్రయాణము సాగించెను. ఆ యోధుల సమరోత్సాహము, వారి గమనోద్ధతి, వారి బల ప్రతాపములు, వారి ధైర్య స్థైర్యములు ఎవరికి

గణించ సాధ్యమగును! వారి గర్జనలకు దిక్కులు పిక్కటిల్లెను. వారి పద ఘట్ట నలకు భూమి కంపించెను. పర్వతములు కదలెను. సముద్రములు క్షోభించెను.

ఆ మర్కట భల్లూక వీరులు కోటానుకోట్లు. వారు విభిన్నవర్ణములు గల నానాకారులు. ఆహవోత్సాహితులగు వారు ఎగురుచూ, దుముకుచూ, వృక్ష ములు పెకలించుచూ, గుట్టలు కూలద్రోయుచు, నదులు దాటుచూ ద్రుత గతిని ప్రయాణము సాగించిరి.

ఇవ్విధముగా సుగ్రీవుని దండు రామలక్ష్మణ సమేతముగా దక్షిణాభిముఖమై ప్రయాణించి సముద్రతీరమును చేరుకొనెను.

## లంకలో

అక్కడ లంకలో నిశ్శంకతో నిర్భయులై జీవితము గడుపుచుండిన నిశాచరుల హృదయములు హనుమంతుడు వచ్చి పోయినప్పటినుండి ఆందోళితమయ్యెను. అక్కడక్కడ నిత్యము పిశితాశనులు గుంపులు గుంపులు జేరి గుసగుసలాడజొచ్చిరి. "ఈ వానరుడెంత? వాని బలమెంత? వాడు సాగ రము దాటెను. లంకను కాల్చెను. అసురవీరులను హతమార్చెను. అమాంత ముగ పారిపోయెను. వీడే యింతటి బలవంతుడే! ఇక వీని నాయకుడెంతటి వీరాధివీరుడో! అజేయమైన లంకారాజ్యమున కేదో ముప్పు రానున్నది!" అని పలువిధముల ఆలోచించుకొని రాక్షసులు భయభ్రాంతులగుచుండిరి. ఈ భీతావహము చిన్నగ లంకేశుని అంతఃపురమునకు కూడా వ్యాపించెను. ధనుజాధినాథుని ధర్మపత్ని మండోదరి భీతిల్లినదై ఒక దినము భర్తను సమీ పించి ప్రార్థనా పూర్వకముగ పతి కిట్లు బోధింపసాగెను.

"నాథా! రామదూత చేసిన కార్యములు చూసితిరి గదా! వాని ఘోర కృత్యములు విన్నందున రాక్షసస్త్రీల గర్భపిండములు విచ్ఛిన్నములయ్యెను. వాడు అసామాన్యుడు. వాని శక్తి అమోఘమైనది. ప్రాణేశ్వరా! శ్రీరాముని మీరు మానవ మాత్రునిగా భావించుట పొరబాటు. లోకములను సృష్టించి పోషించి లయింపజేయగల ఆ శ్రీమన్నారాయణుడే రాముడై అవతరించియు న్నాడు. ఆదిలక్ష్మి సీతగా ప్రభవించియున్నది. వారితో వైరము మనకు క్షేమక రముగాదు. వైదేహిని లంకలో బంధించి యుండుట రాజ్యమునకు శుభము

గాదు. కమలవనమునకు హేమంత రాత్రివలె జానకిని తెచ్చి లంకలో నుంచు కొని యున్న ఉపద్రవములను కొనితెచ్చుకొంటివి. ఆమె మూలమున దనుజవంశము సర్వనాశనము గానున్నది. దనుజేశ్వరా! ఇప్పటికైననూ నామాట పాటించి, వంశమును కాపాడుకొని, తక్షణమే సీతను రాముని కర్పించి అతనితో సంధిచేసుకొనుము.''

అని మండోదరి పలువిధముల బోధించెను. భీతచిత్తయై పలికిన భార్య పలుకు లాలకించి రావణుడు ఫక్కున నవ్వి ''మండోదరీ! మగువలు సహజ భీరువులు. ఎవని బలదర్పములు చూచి దేవతలు, దిక్పాలురు, దిగులుకొని దిక్కులకు పరుగెత్తుదురో అట్టివాని భార్యవై యుండి నీవు స్త్రీ స్వభావము చేత ఇట్లు భీతిల్లుట సిగ్గుచేటుగదా! కాంతామణీ! నర, వానరులు మన ద్వారముకడకు వచ్చిన దనుజులు వారిని తృప్తిగా భుజించి కూర్చుందురు. నీవు నిష్కారణ భయమునకు లోనై అశుభములు పలుకవద్దు.'' అని పలికి దశకంఠుడు మండోదరిని దగ్గరకు చేరదీసి, ఆమె తలను తడిమి, ప్రేమతో ముద్దాడి, లాలించెను. తదుపరి దశాననుడు దురభిమానియై అంతఃపురము వీడి దర్బారుకు వెళ్ళెను.

''ఆహా! విధికృత మెట్లున్నదో! కాల మాసన్నమయిన వారికి దీపనిర్వాణ గంధము, మిత్రుల హితోక్తులు, అరుంధతీ నక్షత్రము - తెలియరావని పెద్దలు వచింతురు. నా భర్త కేమి కీడు మూడనున్నదో!'' అని మండోదరి చింతించుచుండెను.

## విభీషణుని హితబోధ

రాజహజారమున రావణుడు కొలువుదీరెను. మంత్రులు, సామంతులు, దండనాథులు, సేనా నాయకులు, పండితులు, మున్నగు రక్షోవీరులచే నిండి యున్న సభ నొకమారు కలయజూచి దనుజేశుడిట్లు ప్రసంగించెను -

''జగములను గజగజ లాడించగల రక్షోవీరులారా! ఇంతకు మునుపొక మారు ఒక వానరుడు మన లంకకు వచ్చి, పట్టణమును ధ్వంసముచేసి, ప్రజలను వధించి, పారిపోయిన సంగతి మీకు తెలిసినదే. ఆ కోతిరాయని నాయకు

డగు రాముడు లంకపై దాడి చేయుటకు దండుతో వచ్చి సముద్ర తీరమున విడిదిచేసి యున్నాడట. ప్రస్తుత మీ యంశమునుగూర్చి చర్చించవలసియున్నది. ఈ నర వానరులకు భయపడి మనము వారితో సంధి చేసుకొని అపయశస్సుకు శిరములు వంచుటో, లేక ఆహవమున వారిని కీటకములవలె కాలరాచి జయశ్రీని వరించుటో మీరు నిర్ణయించవలసి యున్నది. మీమీ యభిమతములు తెలియజేసిన తదనుసారము నేను కర్తవ్య మాలోచించగలను.'' అని పలికెను.

అంతట మదోన్మత్తులు, అహంకారపూరితులగు దనుజయోధులు క్రోధవ్యగ్ర మానసులై పైకిలేచి - ''సురారీ! నర వానరులకు తలవంచి సంధి కియ్యకొనుట మనజాతికే తీరనిమచ్చ కాగలదు. అట్లాంటి ప్రయత్నములు రాక్షస స్వభావమునకే నిరుద్ధములైనవి'' - అని హెచ్చరించిరి.

అతి భయంకర స్వరూపుడగు కుంభకర్ణుడు సభామధ్యమున నిలబడి - ''నిర్జరారీ! నీకు భయమెందులకు? న్నెదిరించగల వీరుడు ఈ ముల్లోకములందు లేడు'' - అని చెప్పి చక్కగా శయన మందిరమునకు వెళ్ళిపోయెను. - ''ఓ లంకేశా! మీ రనుమతించిన మరుక్షణములో యీ మనుజ - మర్కటములను ఒక్క దెబ్బతో మట్టు పెట్టగలను'' - అని అతికాయుడు అరచెను. ''తండ్రీ! నా పేరు ప్రతాపములకు త్రిమూర్తులు, త్రింశత్కోటి దేవతాగణము గడగడలాడి పోవుట మీకు తెలియనిదిగాదు కదా!'' - అని మేఘనాదుడు గర్జించెను. - ''పెద్ద నాయనా! అవక్ర పరాక్రమవంతులగు మేము మీకు అండదండలుగా ఉండగా నర వానరులను గురించి యింత తర్జనభర్జన లెందుకు!'' - అని కుంభ నికుంభులు భుజములు తట్టుకొనిరి. - అసురేశా! నన్ను భండనమున నెదుర్కొనగల గండుమగడు ఈ భూమండలములో లేడు - అని అకంపనుడు హుంకరించెను. ''అయ్యో! ఈ నర వానరులు నాకొక పూట కూటికి సరిపోజాలరే!'' యని మహోదరుడు నిరసన భావముతో పలికెను.

''సురాంతకా! మీరు ఆజ్ఞాపించిన క్షణములో వారిని క్షుణ్ణముగా చేయగల క్షాత్రవంతుల''మని దుర్ముఖ, మకరాక్షులు ప్రగల్భము లాడిరి.

రాక్షసయోధు లివ్విధముగ రక్షోనాథుని రణోత్సాహితుని జేయుటకై వీరా

లాపములు పలికిరి. ఆ సమయమున విభీషణుడు సభా మండపమున ప్రవేశించి ఆహవోత్సాహితులై ఆర్భాటములు చేయుచున్న అసురవీరులను వారించి, రావణుని కభిముఖుడై ఇట్లు ప్రవచించెను -

''అగ్రజా! ధర్మమే అన్నిటికీ మూలము. ధర్మ వ్యతిక్రమము చేసిన వానికి యెన్నటికీ జయము సిద్ధించదు. పరమసాధ్వి పతివ్రతా శిరోమణియగు పరస్త్రీని మీరు లంకలో బంధించి ఉంచితిరి. సుఖము, శుభము, సత్కీర్తి ఆశించువాడు చవితినాటిచంద్రుని చూడనొల్లనివిధముగ పరస్త్రీ ముఖము చూడదలచడు. పరదారాగమనము అభిలషించుట పాపము. నరకమునకు మూలములైన కామ క్రోధాదులకు లోబడి వర్తించుట అజ్ఞానము కదా!

''అన్నయ్యా రావణా! శ్రీరాముడు సామాన్య మానవుడు కాడు. అజుడు -అనంతుడు, ఆద్యంతములులేని వాడగు ఆ పరమాత్ముడే లోకరక్షణార్థమై నరరూపమున భూమిపై అవతరించెను. రఘుపతి లోకారాధ్యుడు. భక్తులను పాలించుటకు, దుష్టులను శిక్షించుటకు అవతరించెను. అవతార మూర్తి అవధేశుడు. నీకు తెలియజేయుటకై పులస్త్య ఋషి తన శిష్యునిద్వారా నాకీ రహస్యము చెప్పి పంపెను. కాబట్టి యుక్తాయుక్త విచక్షణలేక తొందరపడి శ్రీరామునితో వైరము తలపెట్టి వంశనాశనమునకు ప్రయత్నించ వలదు.

''సోదరా! యథార్థ మాలోచించిన, మనకు కోసలేశునితో యుద్ధ మెందులకు? అతడు చేసిన అపరాధమేమి? చీటికీ మాటికీ ధర్మాతిక్రమణంబునకు సాహసించు దనుజాల దుర్బోధనలకు చెవి యొగ్గి, నీవు సీతను హరించి తెచ్చుట యెక్కడి న్యాయము! మరలా ఈవాడు వారి దుష్టప్రలాపములకు పరవశుడవై యుద్ధమునకు ఆయత్తపడుచుంటివి. పండితుడవు, ప్రాజ్ఞుడవు అగు నీవు యిప్పటికైనా చేసిన తప్పు సవరించుకొనుట ధర్మసమ్మతము కాగలదు.

''అన్నయ్యా! భ్రాతృ ప్రీతితో బంధు క్షేమమాశించి ప్రార్థించుచున్నాను. నా మనవి మన్నించి సీతను శ్రీరామున కప్పగించి అతనితో మైత్రి అభిలషించుట శ్రేయోదాయకము. రాముడు ప్రణతార్తిహరుడు. భక్తవత్సలుడు, దయార్ద్రహృదయుడు. ఆ పురుషోత్తముడు మీ దోషములను సైరించి మిమ్ము

ఉద్ధరించగలడు. నా మాటలు విశ్వసించి సర్వులకు హితమగు పథమున సంచరింపుము.''

విభీషణుని హిత వచనములకు వృద్ధ మంత్రియగు మాల్యవంతుడు సమర్థించి మాట్లాడెను. ''లంకేశా! విభీషణుడు వివేక సంపన్నుడు. హితాహితములు గుర్తించి దూరదృష్టితో మీ తమ్ముడు బోధించిన మార్గము అనుసరించుట అన్ని విధముల శ్రేయస్కరము-'' అని మాల్యవంతుడు పలికెను.

రావణుడు జన్మతః యుద్ధోపాసి. స్వభావతః తామసప్రధానుడు. ఇదిగాక, జాత్యహంకార పూరితులగు జాతుధానుల పిరాలాపములచే అతడావేశపూరితుడై యుండెను. అందుచే విభీషణ మాల్యవంతులు పలికిన పలుకులు వాని చెవులకు ములుకులవలె నుండెను. రావణుడంత రోషకషాయిత నేత్రుడై - ''మీరు ద్రోహులు. నా ఉప్పు తిని నన్నే తప్పులు బట్టుచున్నారు. మీరు మూర్ఖులు. శత్రువుని శ్లాఘించుచున్న యీ అంతఃశత్రువులను ఇక్కడ నుండి గెంటి వేయుడు.'' అని ఆక్రోశించెను.

మాల్యవంతుడు తత్‌క్షణమే సభనుండి నిష్క్రమించెను. విభీషణుడు కరములు ముకుళించి నమ్రస్వరమున నిశాచరనాథు నిట్లు ప్రార్థించెను - ''అగ్రజా! మలిన భూయిష్ఠమైన నీ మనస్సున కిప్పుడు నా మాటలు రుచించకున్నవి. ప్రతివాని హృదయమందు కుమతి, సుమతి - యను వారుందురని విజ్ఞులు వక్కాణింతురు. సుమతి యున్నపుడు సుఖసంపదలచే మనిషి రాణించును. కుమతికి వాసమైన వాడు కష్టపరంపరలచే దుర్గతి చెందును. ఇప్పుడు మీ మనో రాజ్యముపై కుమతి ప్రభావము బాగుగ వ్యాపించియున్నది. అందుకే నన్ను అంతశ్శత్రువుగా పేర్కొనుచుంటివి.

''రాక్షసేశ్వరా! నాకు అగ్రజుడవు, కులమునకు పెద్దవు. రాజ్యమునకు అధిపతివైన నీవే తొందరపడి ప్రవర్తించిన దేశవంశములు సర్వనాశనముగాక మానవు. రాక్షస వంశమునకు కాళరాత్రివలె సీతను దెచ్చి సీమలో ఉంచుకొంటివి. ఆమెపై మక్కువ కలిగియుండుటచే నీ మతి చెడుటకు కారణమైనది. అన్నయ్యా! అన్యభావముతోగాక కేవలము రాజ్యక్షేమము, రాక్షస కళ్యాణ

మాశించి భ్రాతృ భావముతో చెప్పుచున్నాను. విజ్ఞుడవై వైదేహిని గౌరవ పురస్సరముగ శ్రీరాముని కర్పించి యశఃకాముడవై సుఖింపుము. ఇదియే నా తుది ప్రార్థన.''

సింహాసనాసీనుడై యున్న దశగ్రీవునికి తమ్ముని హితోక్తులు దుస్సహముగా నుండెను. సురారి రౌద్రమూర్తియై రుసరుసలాడుచూ దిగ్గున పైకి లేచి -

''ఓరీ మూర్ఖా! ఇన్ని దినములు నా కూడు తిని, నా వలన బ్రతికి బట్ట కట్టనేర్చిన నీవు, ఈనాడు యెదురు తిరిగి నాకే యెగ్గు తల పెట్టు చుంటివి. పాముకు పాలుబోసి పెంచినట్లు నీకు విద్యాబుద్ధులు గరపి, పెంచి పెద్ద జేసినందుకు ఈనాడు నీవు శత్రువుకు ఉపకారము చేయుటకు సిద్ధ పడితివి. ఓరీ దుర్మతీ! ఇక నీకిక్కడ నిలువ నీడలేదు. వెంటనే వెళ్ళి నీ నీతులు ఆ సన్న్యాసులకే బోధించుకొనుము.'' అని దూషించి దశాననుడు తమ్ముని తన్నెను. విభీషణుడు ప్రతి పర్యాయము అన్న పాదములు పట్టుకొనెను.

అంతట విభీషణుడు తన మంత్రులతో గూడి తటాలున పైకి ఆకాశమున కెగిరి - ''అన్నయ్యా! పితృతుల్యుడవైన నీపాద ప్రహారములకు నేను నొచ్చు కొనలేదు. నీవు, నీ సభాసదులు కాలవశముచే ఇట్లు మతిభ్రష్టులై యున్నారు. ఇక నేను సత్యసంకల్పుడగు ఆ సీతానాథుని వద్దకే వెళ్ళుచున్నాను. ఇందులో నా దోష మిసుమంతయూ లేదు. సెలవు.. '' అని పలికి విభీషణుడు తన వారితో ఉత్తరాభిముఖుడై చనెను.

గిరిజా! విభీషణుని నిష్క్రమణతోనే రావణుని వైభవము శ్రీహీనమయ్యెను. అని గంగాధరుడు పలికెను.

## విభీషణ శరణాగతి

*దేఖిహఉఁజాయి చరన జలజాతా*
*అరున మృదుల సేవక సుఖదాతా,*
*జే పద పరసి తరీ రిషి నారీ*
*దండక కానన పావన కారీ.*

జే పద జనక సుతా ఉరలాయే
కపట కురంగ సంగధర ధాయే,
హర ఉర సర సరోజ పద జేయీ,
అహోభాగ్య మైఁ దేఖిహాఁ తేయీ!

ఏ మహనీయమూర్తి చరణారుణ కమలములను సేవించి భక్తులు ప్రసన్నులగుచుందురో, ఎవని పాదస్పర్శచే ఋషిపత్ని తరించెనో, ఎవని పదార్పణచే దండక వనము పావనమయ్యెనో, ఎవని చరణ కమలములను భర్గుడు, భరతుడు, భూపుత్రి సదా తమ హృదయములందు ధరించి ధ్యానించుచుందురో ఆ భగవానుని పాదద్వయమును నేడు నా నేత్రద్వయముచే దర్శించి తరించెదను. అని యూహించుకొనుచూ రామచరణారవిందదర్శనోత్సాహియగు విభీషణుడు గగనమార్గమున సముద్రము దాటివచ్చి వానరసేనను సమీపించెను. కపి సేనయొక్క కావలివారు విభీషణాదులను లోనికి రానీయక అడ్డగించి, అతని సంగతి తమ రాజుకు తెలియజేసిరి. సుగ్రీవుడు తత్క్షణమే దశరథాత్మజుని సమీపించి "రఘువరా! లంకేశుని సోదరుడగు విభీషణుడు తన మంత్రులతో గూడి మీ దర్శనార్థమై వచ్చియున్నాడు." అని నివేదించి సూర్యపుత్రుడు పునః ఇట్లు ప్రసంగించెను -

"దేవా! దానవులు కామరూపులు. వారి మాయమర్మములు తెలుసుకొనుట దుర్లభము. బహుశా నాకు అంగదునికి మధ్య మిత్రభేదము కల్పించు ఉద్దేశ్యముతో విభీషణుడు వచ్చినట్లున్నది. కాబట్టి మాయోపాయులను తత్క్షణమే బంధించుటకు సెలవీయవలసినది."

సుగ్రీవుని యూహకు శ్రీరాముడించుక మందస్మితుడై "కపీశ్వరా! నిజమాడితివి. శాస్త్రోక్తముగా పలికిన నీయభిప్రాయము యుక్తమైనదే. కానీ, నేను శరణాగతుని రక్షించెదనని ప్రతిజ్ఞచేసియుండుట ప్రసిద్ధమే గదా!" అని సమాధాన మిచ్చెను.

శ్రీరాముడు శరణాగతవత్సలుడు. అతవి సదభిప్రాయము తెలుసుకొని

ఆంజనేయుడు ఆనందించెను. తిరిగి రఘూద్వహుడు రవి తనయునివంక తిరిగి –

"సఖా సుగ్రీవా! శత్రువైననూ శరణన్నవానిని రక్షించుట ధర్మసమ్మతము. శరణార్థికి అభయదాన మివ్వనివాడు పాపాత్ముడు. అట్టివాని ముఖము చూడరాదని పెద్దలు చెప్పుచున్నారు. నన్నాశ్రయించినవా డెంతటి దురాత్ముడైననూ వానికి అభయ మిచ్చుట నా ప్రతిజ్ఞ. కలుష చిత్తులు, ధూర్తులు నా సముఖమునకే రాజాలరు. ఒకవేళ విభీషణుడు రావణ ప్రేషితుడై మనలో మిత్రభేదము కల్పించుటకే వచ్చియున్ననూ చింతింప పని లేదు. ఎందులకన, లోకములో నున్న రాక్షసులందరినీ సౌమిత్రి ఒక క్షణములో నిర్జించగలడు. సుగ్రీవా! రావణానుజుడు మైత్రి నభిలషించి వచ్చిననూ లేక మిత్రభేదము ఆశించి వచ్చిననూ సందేహించక నీవు నిర్భయుడవై అతనిని శీఘ్రమే తోడ్కొనిరమ్ము."

అని శ్రీవారు ఆశ్వాసించిన మీదట సుగ్రీవాదులు సందేహ నివృత్తులైరి. అట్లు అవధనందనునిచే అనుజ్ఞాతులై అంగద హనుమదాదులు విభీషణుని అతని మంత్రులను గౌరవ పురస్సరముగ తోడ్కొని శ్రీరాముని సన్నిధికి వచ్చిరి.

ఆ ఆజానుబాహుడు, సింహస్కంధములు గలవాడు, కమలారుణ లోచనుడు, అగు కాకుత్స్థ విభుని దివ్యసుందర విగ్రహమును దూరమునుండియే చూచి విభీషణుడు ఆనందాతిశయముచే పులకిత శరీరుడయ్యెను. అతడు శిరమున కేలు గీలించి నమ్రస్వరమున – "ఓ ధర్మజ్ఞా! రామభూపాలా!

*"నాథ! దశానన కర మైఁ భ్రాతా*
*నిశిచరవంశ జనమ సురత్రాతా."*

నేను రావణానుజుడను. నాపేరు విభీషణుడు, తామసగుణ ప్రధానమైన దనుజ వంశమున పుట్టినవాడను. మీరు శరణాగత రక్షకులని విని, లంకను లంకేశుని విడనాడి, పుత్రమిత్ర కళత్రాదులను త్యజించి, మీ యాశ్రయము గోరి వచ్చినాడను. మీరు తప్ప నాకు మరొక దిక్కులేదు. ఓ ప్రణతార్తిహరా!

రక్షించు! రక్షించు!'' అని అర్థించుచూ అమరవరుడు అవధనందనుని పాద పద్మములపై వ్రాలెను.

దయానిధి దాశరథి అత్యంత ప్రసన్న భావముతో విభీషణుని పైకి లేవ నెత్తి, హృదయమునకు హత్తుకొనెను. సాకేతపతి స్పర్శచే విభీషణుని దనుజత్వము తత్క్షణమే తొలగిపోయెను. రావణానుజుడు రఘుపతిచే అభయ ప్రదానము పడసినవాడై నిర్భయుడయ్యెను.

''విభీషణా! నీకూ, నీ పరివారమునకు కుశలమా! దివారాత్రములు దుర్జనుల సాంగత్యమునందుండియూ నీవు ధర్మమార్గమును రక్షించితివి. భగవంతుడెవ్వరికినీ దుష్టసాంగత్యము కలిగించకుండుగాక!'' అని స్వామి పచించెను.

''కోసలేశా! నేడు మిమ్ము దర్శించి, మీ చరణములు స్పృశించి, మీ కృపకు పాత్రుడనై సర్వసౌఖ్యములు పొందగలిగితిని. జగన్నాథా! మాది రాక్షస వంశము. మా స్వభావము చెడ్డది. మా కర్మలు దుష్టమైనవి. కానీ నేడు శ్రీవారి కృపాదృష్టివలన నా యజ్ఞానము, నా పూర్వకృత పాపములు పటాపంచలై పోయెను. నా భయ శోకములు తొలగి హృదయము శాంతించెను. దేవా! భవదీయుని శ్రద్ధాంజలి స్వీకరింపుము.''

అనిన విభీషణుని పలుకులకు పరమ సంతుష్టుడై శ్రీరాముడిట్లు ప్రవచించెను.

''సోదరా విభీషణా! నా స్వభావము కాకభుశుండికి, పార్వతీ పరమేశ్వరులకు చక్కగా తెలియును. సమస్త ప్రపంచమునకు ద్రోహము తలపెట్టిన దుష్టుడైననూ నన్నాశ్రయించినయెడల నేను వానిని సాధూత్తమునిగా జేయుచున్నాను. సగుణోపాసకులు, సన్మార్గ ప్రవర్తకులు, భూసురోత్తములను సేవించువారు నా ప్రేమను పొందగలుగుచున్నారు. లంకేశా! సకలగుణ భూషితుడవైన నీవు నాకత్యంత ప్రియపాత్రుడవు.''

అమరశ్రేష్ఠుడు అవధేశుని అవ్యాజానురాగమునకు అత్యంత పులకితగాత్రుడై ''సౌమ్యా శ్రీరామచంద్రా! నేటితో నా వాసనలన్నియూ వశించి నాచిత్తము

నిర్మలమయ్యెను. శివునకు మీయందుగల భక్తివంటి విశుద్ధభక్తిని నా కనుగ్ర-హింప వేడెదను -'' అని ప్రార్థించెను. దాశరథి అందులకు 'ఏవమస్తు' అని ఆశీర్వదించెను.

తదుపరి సాకేతధాముడు సముద్రజలమును తెప్పించి సర్వుల సమక్షమున విభీషణుని లంకారాజ్యమున కభిషేకము చేసెను. ఆ శుభసమయమున దివ్యులు దుందుభులు మ్రోగించి సుమనో వర్షము వర్షించిరి.

పది తలలు కోసి తపస్సు చేసిన రావణుడు ఏ శక్తి సంపదలను సాధించు కొనియుండెనో, దానిని విభీషణుడు కేవలము భక్తితో పొందగలిగెను.

మరుదినము రాఘవుడు సుగ్రీవ విభీషణాది నాయకులను సేనాపతులను రావించి వారితో - ''ఓ కపీశా! ఓ లంకేశా! ఓ వానరయోధులారా! ఇక మనము యే మాత్రము విలంబనము చేయక కార్యసాఫల్యమునకై వెంటనే ప్రయత్నించవలెను. ప్రస్తుతము మనమీ అగాధ జలరాశిని దాటవలసి యున్నది. అతి భయంకరములగు మకర మత్స్య కచ్ఛపములకు ఆలవాలమైన ఈ సాగర-మును తరించుటకు మార్గోపాయము ఆలోచించవలసి యున్నది.'' అని సమాలోచించెను.

అందులకు విభీషణుడు - ''దేవా! మీ బాణాగ్ని శిఖలచే సముద్రమును త్రుటిలో శోషింపజేయవచ్చును. కానీ ఇందులకు మరొక సూక్ష్మోపాయము కూడా అవలంబనీయమైనదే. అది యేమన - మీ పూర్వీకులగు సగర వంశ-జులచే ఈ సముద్ర మేర్పడియున్నది. మీరు సాగరమును ప్రార్థించిన యెడల అతడే మనకు మార్గోపాయము సూచించగలడు.'' - అని వచించెను. ''అవును, విభీషణా! నీవు నిజము పల్కితివి. దైవ కృపచే సాగరుడు మనకు తనంతట తాను దారి యిచ్చినయెడల, బలప్రయోగముతో ప్రయోజన మేమి?'' అని శ్రీరాముడనెను.

''అగ్రజా! బాణ ప్రయోగమున సాగరమును శోషింపజేయుటచే ఉత్తమము. దేవునిమీద భారమువేసి ఊరకుండుట అకర్మణ్యుల లక్షణము.'' అని లక్ష్మ-ణుడు తన అభిమతము వ్యక్తము చేసెను. దాశరథి తమ్ముని సమాధానపరచి

కదలి తీరమునకు వెళ్ళెను. అక్కడ దాశరథి దర్భాసనముపై కూర్చొని సరిత్ప్రతిని ధ్యానించసాగెను.

## రావణుని చారులు

శుక సారణులను ఇరువురు రాక్షసులు ప్రచ్ఛన్న వేషముతో వానరసైన్యములో తిరుగుచుండగా విభీషణునిచే గుర్తింపబడి బంధితులైరి. వారు రావణ ప్రేషితులై రాముని సేనా రహస్యములు తెలుసుకొనుటకు వానర రూపములతో వచ్చి యుండిరి. సుగ్రీవుడు ఆ మాయావుల అంగములు ఛేదింపుడని వానరులను ఆదేశించెను. అంతట శుకసారణులు కుయ్యోమొఱ్ఱోయని కేకలిడుచూ - వానరులారా! రాముని తోడు! మా ముక్కు చెవులు ఖండింపక మమ్ము వదలిపెట్టవలసినది - అని ప్రార్థించిరి. లక్ష్మణుడు వారిపై జాలిగొని దూతలను హింసించుట ధర్మముగాదు - అని చెప్పి శుకసారణులను విడిపించెను. పిమ్మట లక్ష్మణుడు వారి చేతి కొక లేఖ వ్రాసియిచ్చి - "ఓరీ! దీనిని తీసుకొనిపోయి మీ రాజుకివ్వుడు. అదియేగాక, నామాటగా రావణాసురునితో శ్రీరామునికి సీతను సమర్పించుకొని సుఖింపుమని బోధింపుడు." అని చెప్పి పంపెను. వారు సౌమిత్రికి శతాధిక నమస్కారములు చేసి శ్రీరాముని గుణగానము చేయుచూ లంకకు పోయిరి.

తిరిగి వచ్చిన దూతలను చూచి సురారి - "ఓరీ, శుక సారణులారా! క్షేమముగా వచ్చితిరిగదా! పుట్టినగడ్డ వదలి పెట్టి, పగవాని పంచజేరిన విభీషణుడు ఎట్లున్నాడు? వానర సైన్య రహస్యములను సేకరించితిరా? రామలక్ష్మణులను యెట్లు దర్శించగల్గితిరి? నా బల దర్పములనుగురించి వారికి వర్ణించి చెప్పగల్గితిరి కదా!" అని ఆతురతతో ప్రశ్నించెను.

శుక సారణులు నత మస్తకులై రావణునికి అభివాదములు చేసి "అసురేశ్వరా! మేము కుశలము. విభీషణుడు కుశలము. ప్రభూ! శ్రీరాముడు మీ తమ్ముని లంకకు రాజుగా చేసియున్నాడు. మేము మీ దూతలమని తెలుసుకొని వానరు లనేక విధముల హింసించిరి. తుదకు మేము రామునిమీద ఒట్లు పెట్టుకున్నందున వారు మా ముక్కు చెవులు ఖండించక వదలి పెట్టిరి. బ్రతుకు జీవుడా యని ప్రాణములతో మీ పాదములవద్దకు చేరుకొంటిమి.

"రాజా! అపారమైన ఆ వానర సేనావాహిని గురించి యేమని చెప్ప గలము! వారి సంఖ్య గణించుటకు, వారి బలము నూహించుటకు సాధ్యము గావిది. వానరులు మహాకాయులు, బలవిక్రమోపేతులు. ఆ మర్కటయోధుల ముందర లంకను కాల్చి, అకంపనాది వీరులను హతమార్చి, సముద్రము దాటి పోయిన హనుమంతుడు ఒక పిల్లకోతి వలె కనబడెను. ఒక్కొక్క కపివీరుడు అనేకవేల యేనుగుల బలము కలిగినవాడై యున్నాడు. పదునెనిమిది పద్మముల వానర భల్లూక సైన్యము మహాసముద్రమంత భూమి నాక్రమించి యున్నది. ద్వివిద, మైంద, నీల, నల, అంగద, దధిముఖ, కేసరి, కుముద, గద, జాంబవంత - మొదలగు మహాబలులు వారి సేనాధిపతులు, వీరందరు సుగ్రీవునితో సమానులగు శూరాగ్రేసరులు. మర్కటయోధులు ముల్లోకములను జయింప సమర్థులు. వారికి అతుల బలసంపన్నులగు రామలక్ష్మణ విభీషణాదులు తోడై యున్నారు.

"దశకంఠా! రఘుకుల మణి రాముని తేజోబలము గురించి శతసహస్ర శేషులు వర్ణింపలేరు. అతడొక్కడే శిలీముఖముతో సాగరమును శోషింప జేయదలపెట్టెను. కాని, మీ తమ్ముని సమ్మతిపై తుదకు సముద్రమును ప్రార్థించుట కియ్యకొనెను. రాజా! క్రోధాతురులై యున్న వానరులు గర్జన తర్జనలు జేయుచూ లంకపై బడుటకు చేతులు నలుపుకొనుచున్నారు. కానీ ఆహవోత్సాహితులైయున్న మర్కట యోధుల కింకనూ శ్రీరాముని ఆజ్ఞ లభింపలేదు." అని శుకసారణులు శ్రీరాముని సేనా విశేషములు సకలము తెలియ జేసి, లక్ష్మణుడిచ్చియుండిన సంధిపత్రమును రావణాసురునికి అందజేసిరి. ఆ లేఖలు రావణుని మంత్రి ఇట్లు చదివెను -

"ఓయీ దశాననా! రఘువీరునితో వైరము తలపెట్టి యుద్ధమునకే సన్నద్ధుడవైనయెడల నిన్ను త్రిమూర్తులు కూడ రక్షింపజాలరు. రావణా! నిష్కారణముగ నీయంతట నీవు - ఉద్రేకమునకు లోనై బంధు బాంధవ సమేతముగా రామ బాణాగ్నికి ఆహుతి కాదలంచుట వివేకలక్షణముకాదు. యథాశీఘ్రమే నీవుసూ నీ తమ్మునివలె ఇనకులతిలకుడైన శ్రీరాముని ఆశ్రయించి సుఖింపుము."

మంత్రి లేఖాంశము చదువగా విని నిశాచరపతి నవ్వుచూ "ఓహో! చేటలు గొట్టి పిల్లలనుబెదిరించినట్లు ఈ సన్యాసి రాయుళ్లు ప్రగల్భముతో నన్ను బెదిరించ చూచుచున్నారు." అని నిర్లక్ష్యుడై పలికెను.

శుకుడు కైమోడ్చి రావణునితో వినయపూర్వకముగ "దనుజేశ్వరా! ఈ పత్రమందలి ప్రతి అక్షరము సత్యము. వాటిని ప్రగల్భముతో భావించి త్రోసి వేయకుడు. మేము అక్కడి సంగతి సందర్భములు ప్రత్యక్షముగ చూచి వచ్చి తిమి. అభిమానముతో ఆగ్రహముతో వాస్తవము గుర్తించక వేగిరపడిన, వెనుకటికి వ్యథ జెందవలసి యుండును. కోసల కుమారుడెంత వీరుడో అంత కోమల స్వభావుడు. నీవు సీతను సమర్పించినయెడల రఘుపతి నీ అపరాధము క్షమించి నీతో సఖ్యము చేయగలడు." అని బోధించెను.

దూత మాటలకు ఆగ్రహావిష్టుడై అసురేశుడు - ఓరీ శుంఠా! నీవు కూడా నాకు నీతులు బోధించుటకు సాహసించితివా? - అని కాలితో తన్నెను. శుకుడు దశగ్రీవుని పాదములకు నమస్కరించి, వెంటనే అచ్చోటు వదలి శ్రీరాముని యొద్దకు చనెను. సాకేతధాముడు శుకునివలన సమాచారము అంతయు తెలుసుకొని వానికి సద్గతి ప్రసాదించెను.

పార్వతీ! ఈ శుకుడు పూర్వము ఒక మహర్షి. ఇతడు ఒకానొక సందర్భ మున అగస్త్యుని నిరాదరించుటచే శాపగ్రస్తుడై రాక్షసుడుగా పుట్టెను. ప్రస్తుతము దాశరథి దయవలన శాపవిముక్తుడై స్వాశ్రమము చేరుకొనెను.

## సముద్రుడు స్వామి సన్నిధికి వచ్చుట

సాగర తీరమున దర్భాసనాసీనుడై యున్న సాకేతపతి మూడహోరాత్రములు పరిత్వరితిని ప్రార్థించెను. స్వామి ప్రణయమే మాత్రము లక్షింపక యథాప్రకా రము సముద్రము ఉత్తాలతరంగాభీలమై తన దర్పము ప్రకటించుచుండెను. జల నిధి జడ స్వభావమునకు రాముడు విగ్రహము కోల్పోయి ఉగ్రుడై - "సోదరా లక్ష్మణా! ధనుర్బాణములచే ఈ సముద్రమును త్రుటిలో శుష్కింప జేసెదము. మూర్ఖులను ప్రార్థించుట, కుటిల హృదయులను ప్రేమించుట, కామాతురునికి హరిభక్తి నుపదేశించుట వ్యర్థము. శఠం ప్రతి శాఠ్యం-

అన్నట్లు ఈ దుష్టునిపట్ల దండనీతి అవలంబించుటే తగిన మార్గము.''

అని కాకుత్స్థమణి కోపోద్దీపితుడై, తన వామ కరభూషితంబగు కోదండము నెక్కుపెట్టి దిగంతములు ప్రతిధ్వనించునట్లు ధనుష్టంకారము చేసి శరము సంధించెను.

ఆగ్రహావిష్టుడగు అవధేశుడు శర సంధానము చేయుట చూచి సౌమిత్రి భీతిల్లి సర్వలోక ప్రళయము కానున్నదని భావించెను.

కోసలేశుడు కుపితుడై కోదండము నెక్కు పెట్టగనే సాగరము సంక్షోభము చెంది, అందున్న మత్స్య కచ్ఛప మకరాది జలచరములు భయముతో గడగడ లాడెను. సముద్రుని హృదయము ఉష్ణోగ్రత చెంది కలవరపడెను. సాగరపతి అంతట భయ విహ్వలుడై బంగారు పళ్ళెరములందు నవరత్నములు కానుకలుగ తీసుకొని బ్రాహ్మణ రూపమున రఘుపతి యొద్దకు వచ్చెను.

సాగరుడట్లు సాకేతవాసుని సమీపించి, అతని చరణ ద్వయముపై సాగిల బడి యిట్లు ప్రార్థించెను.

''ఓ యినవంశోత్తమా, రామా! నేను జడజీవిని. మీ మాయాజనితము లైన పంచభూతము లన్నియూ నిసర్గతః జడములే కదా! కాబట్టి నే జేసిన తప్పుకు మీరునన్ను శిక్షింపదలచుట న్యాయసంగతమే. అదియే గాక -

*''ఢోల గఁవార శూద్ర పశు నారీ,*
*యే సకల తాడనాకే అధికారీ.''*

మద్దెల, మూర్ఖుడు, శూద్రుడు, స్త్రీ, పశువు మొదలగునవి దండనార్హము లని విజ్ఞులే వచించియున్నారు. కాబట్టి, దేవా! నా దోషము సైరించి - నన్ను కరుణించవలసినది.

ప్రభూ! మీరు సేనా సమేతముగ సాగరము దాటిపోవలెనని కోరితిరి. అందుకు మీ రాశించిన విధముగ నేను మార్గమిచ్చిన యెడల మీ పురుషార్థము భాసించదుగదా! మీ శక్తి ఔదార్యములు లోకములకు వెల్లడి యగుచుండునట్లు నే నిందుల కొక ఉపాయము సూచించుచున్నాను. అవధరించవలసినది. మీ సేనలో నల నీలురని యిరువురు యోధాగ్రేసరులు

న్నారు. వారు తమ బాల్యమందు తుంటరులై మునీశ్వరుల సాలగ్రామములు తీసికొని పోయి, నీటిలో పారవేయుచుండిరి. మునులు వీరి దుండగమునకు విసిగి "ఓరీ తుంటరులారా! మీచే పారవేయబడిన ప్రతి వస్తువు నీటిలో తేలియాడుచుండుగాక!" అని శపించియుండిరి. వారికి కలిగిన ఆ శాపము ఇప్పుడు మీ కనుకూలించగలదు. వారిచే సేతు బంధము చేయించినయెడల నేను మీకు సులభముగా కట్టబడి యుండగలను. తద్వారా మీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడించగలవు. ఇప్పుడు మీరు ఎక్కుపెట్టిన బాణమును నా ఉత్తరతీరమందు నివసించుచున్న కిరాతులపై ప్రయోగించవలసినది" అని అంబుధి అర్థించెను.

సముద్రుని మాట మన్నించి రఘూద్వహుడు సాగరమునకు ఉత్తర తీరమందు నివసించుచుండిన కిరాత జాతిపై బాణమును ప్రయోగించెను. ఆ ప్రదేశమంతట జనశూన్యమై నిరంతరము ఫలపుష్ప సస్య సంపదతో విరాజిల్లెను. కోసలేశుని అపార కృపా కటాక్ష వీక్షణలకు ప్రసన్నుడై సరిత్పతి శ్రీ రామునకు రావణుని గృహచరిత్రయంతయూ విన్నవించి వీడ్కోలు తీసుకొనెను.

*"సకల సుమంగల దాయక*
*రఘునాయక గునగాన,*
*సాదర సునహిఁ తే తరహిఁ*
*భవసింధు బినా జలజాన."*

సకల మంగళములకు మూలమగు ఈ రామచరిత్ర గోసాయి తులసీదాసుచే రచించబడెను. దీనిని పఠించువారు ప్రాపంచికమైన బాధలనుండి ముక్తులై రామసాయుజ్యమును పొంది సుఖించగలరు.

ఇతి శ్రీమద్రామచరిత మానసే
సకల కలి కలుష విధ్వంసనే
విశుద్ధ జ్ఞాన సంపాదనో నామ
పంచమః సోపానః సమాప్తః.

(సుందరకాండ సమాప్తము.)

# లంకా కాండ

''రామం కామారి సేవ్యం భవభయ హరణం
కాలమత్తేభ సింహం
యోగీంద్రం జ్ఞానగమ్యం గుణనిధి మజితం
నిర్గుణం నిర్వికారమ్,
మాయాతీతం సురేశం ఖలవధనిరతం
బ్రహ్మ బృందైక దేవం
వందే కందావదాతం సరసిజనయనం
దేవ మూర్వీశరూపమ్.''

''శంఖేంద్వాభమతీవ సుందర తనుం
శార్దూల చర్మాంబరం
కాలవ్యాళ కరాళభూషణధరం
గంగా శశాంక ప్రియమ్,
కాశీశం కలికల్మషౌఘశమనం
కల్యాణ కల్పద్రుమం
నౌమీడ్యం గిరిజాపతిం గుణనిధిం
కందర్పహం శంకరమ్.''

౧. మనసా! యుగములు నిమిషములుగా, కల్పములు సంవత్సరములుగా, కాలము కోదండముగా, ఘడియలూ దినములూ బాణములుగా కలిగిన రఘువీరుడగు శ్రీరాముని సదా సేవింపుము. (తులసీదాసు)

★ ★ ★ ★

# సాగర తరణము

సముద్రుని సమ్మతి ప్రకారము సాకేతనాథుడు తత్క్షణమే ప్లవంగ ప్రముఖులను రావించి వారిని సేతురచనకు సన్నాహము చేయవలసినదిగా ఆదేశించెను. "ఓ సాకేతపతీ! భవసాగరము తరించుటకు మీ నామమే ఒక సేతువు. మాకు ఈ సముద్ర మొక లెక్కలోనిదా?" అని పలికి జాంబవంతుడు అప్పటికప్పుడే నలనీలురను పిలిచి వారికి రామాజ్ఞ తెలియజేసెను. అంతట వానర యూథములు రామాజ్ఞ బొదలదాల్చి వారధి నిర్మాణమునకు పూనుకొనెను. వనచరుల గుంపులు తోకలు ఝూడించి గంతులు వైచుచూ దిక్కులకు వ్యాపించి కొల్లలు కొల్లలుగా చెట్లు గుట్టలు రాళ్ళు పర్వతములు పెకలించుకొని వచ్చి కుప్పలు బోసెను.

వానిని అతి లాఘవముతో అందుకొని నలుడు నీలుడు సాగరము మీద సేతు నిర్మాణము సాగించిరి. నూలుపట్టి గీతలు వేయువారు, మన్ను తెచ్చువారు, పర్వతము లందించువారు, చదును చేయువారు తమ తమ పనులు చకచక చేయుచుండిరి. పది యోజనముల వెడల్పు నూరు యోజనముల పొడవుగలిగిన సేతువును వానరులు అయిదు దినములలో పూర్తిచేసిరి. ఆ వారధి ఉత్తరతీరమునుండి దక్షిణపుటొడ్డున సువేలాద్రి వరకు సముద్రముమీద సుందరముగా నిర్మింపబడెను. అందమగు ప్రదేశమందు అతి రమణీయముగ సేతువుకట్టబడిన సౌందర్యమును చూచి శ్రీరాముడు ముగ్ధుడయ్యెను. అప్పుడు సాకేతనాథు డొక శివలింగము తెప్పించి దానిని మునిజనముల సమక్షమున అక్కడ ప్రతిష్ఠించి పూజించెను. దశకంఠుడు శివుని భక్తుడు. వానితో వైరము పూనుటకు ముందు పరమేశ్వరుని ప్రసన్నునిగా చేసుకొనుట భావ్యమై యుండునని రాముడు తలంచియుండును. రామలింగేశ్వరునికి భక్తిప్రపత్తులతో పూజలొనరించిన పిమ్మట సీతాపతి అచట చేరిన ప్రజలకిట్లు బోధించెను-

"శివ సమాన ప్రియ మోహిన దూజా
శివ ద్రోహీ మమ భగత కహోవా
సో నర సపనేహుఁ మోహిన పావా
శంకర బిముఖ భగతి చహమోరీ
సో నారకీ మూఢమతి థోరీ"

నాకు శివునికంటే ప్రియమైన అన్యుడు లేడు. శంకరునికి, ద్రోహము తల పెట్టిన నా భక్తునికి స్వప్నమందైననూ నా కటాక్షము లభించదు. శివ ద్రోహి యగు వైష్ణవుడు, విష్ణుద్రోహియగు శైవుడు ఘోరనరకమును బొందుచున్నారు. ఈ రామలింగేశ్వరుని గంగాజలముతో అభిషేకించువారు సాయుజ్యముక్తిని పొందగలరు. ఈ సేతువు నొకసారి దర్శించుకొనువారు పుణ్యాత్ములై ముక్తిని బడయగలరు.

ఇట్లు సదాశివుని స్మరించిన అనంతరము అవధేశుడు సేతువుపై నడచి వెళ్ళుటకు వానర సేనకు అనుజ్ఞ ఇచ్చెను. అంతట కోటానుకోట్ల వానర, భల్లూకములు రామునికి జయము పలికి సింహనాదములు చేయుచూ, సేతు-వుపై నడచిరి. ఆ మహా సమూహమునకు వారధి సరిపడక ఇరుకయ్యెను. కొందరు కట్టమీదను, మరికొందరు నీటిమీద తేలిన జంతువుల మీదను అడుగు లిడుచూ, ఇంకనూ మిగిలినవారు గగన మార్గమున కెగసి సాగరము దాటిరి. జగత్పతి జానకీనాథుడు అనుజసమేతుడై సేతువుపైకి వచ్చినప్పుడు సముద్రమందున్న మత్స్యములు కచ్ఛపములు తిమింగిలములు, సర్పములు, నక్రములు మున్నగు జలచరములు నీటిపైకి వచ్చి స్వామిని దర్శించుకొనెను. కోసలకుమారు లిరువురు ప్రసన్నవదనులై జలచర బృందమును తిలకించుచూ నడచిరి. రామలక్ష్మణ సుగ్రీవ విభీషణాదులట్లు సేనా సమేతముగ జలనిధి దాటి వచ్చి లంకాతీరమున స్కంధావార మేర్పరచుకొని విడిది చేసిరి. స్వామి ఆగమనము పురస్కరించుకొని ఆ తీర ప్రదేశమంతయూ ఋతుకాలము పాటించక జల ఫలపుష్పసమృద్ధమై యుండెను. ఆకలిదప్పులు లేకుండునట్లు ఆ వన సంపదను స్వేచ్ఛగా అనుభవించి ఆనందించవలసినదని ప్రభువు వానర సైన్య మును ఆదేశించెను.

# రావణుని మంత్రాలోచన

లంకాతీరమందట్లు విడిదిచేసిన వానరసేన ఆ ప్రాంతమంతయు విస్తరించి స్వేచ్ఛగా విహరించసాగెను. వారు అచ్చట పుష్కలముగా లభించు ఫలములను పువ్వు పత్రములను తృప్తిగా భుజించి చెట్లను రాళ్ళను పెకలించి లంకలోనికి రువ్వుచుండిరి. అక్కడక్కడ చేతికి దొరికిన రాక్షసులను పట్టుకొని వారి ముక్కు చెవులు కొరికి, వారిచేత రామునికి జయము పలికించిన పిమ్మట విడిచిపెట్టుచుండిరి. రణోత్సాహితులగు రాముని సైనికులు నిత్యము నిశాచరులను నానా విధముల బాధించుచుండిరి.

ప్లవంగ వీరులచే బాధింపబడిన పిశితాశనులు రాజ దర్బారుకు వెళ్ళి రావణునితో రామదండు చేయుదుండగములను గురించి మొర పెట్టుకొనిరి. దశకంఠుడీ సమాచారము వినగనే గద్దెనుండి ధిగ్గున లేచి "ఏమీ! రాముని సేన లంకను సమీపించెనా? అతి భయంకరమగు పారావారము బంధింపబడెనా! రాఘవుడు సేనా సమేతముగా సముద్రము దాటి నగరమును సమీపించెనా!" అని తన చారులను పది ముఖములతో ప్రశ్నించెను. రావణుడు ఏక కాలమున పది ముఖములతో భాషించునపుడు వానికి మృత్యువు ఆసన్నమగునని శాపము గలదు. ఆ విషయము వెంటనే మనస్సుకు తట్టగా రాక్షసపతి మనఃస్థైర్యము, పోగొట్టుకొని చింతాక్రాంతుడై సభ చాలించి అంతఃపురమునకు పోయెను.

రక్షఃపురి వెలుపల రామదండు చేరియున్న సంగతి, రావణుని మనోవ్యాకులత గ్రహించిన మండోదరి, నాథుని సాదర పూర్వకముగ లోనికి తీసుకొని పోయి మృదుమధురోక్తుల మరొకమారు వానికిట్లు ప్రబోధించెను.

"ప్రాణేశ్వరా! ప్రశాంతచిత్తుడవై నా పలుకు లాలింపుము. మనము బుద్ధిచే బలముచే ఎవరిని ఓడించగలుగుదుమో వారితో వైరము తలపెట్టుట లాభకరము. మీరు రఘూద్వహుని బలపరాక్రమములను ఊహించలేక పొరబడుచున్నారు. కోసల కుమారుడనిన ఎవరనుకొంటిరి! మధు కైటభులను మర్దించిన దెవరు? హిరణ్యాక్ష హిరణ్యకశ్యపులను హతమొనర్చినదెవరు? బలిచక్రవర్తి, కార్తవీర్యార్జునుడు మున్నగు బలాఢ్యులను అణగద్రొక్కిన దెవరు? ఈ రాఘవుడే గదా! కాల గుణ కర్మక్రియలను తన గుప్పిటిలో నుంచుకొని లీలా

మానుషరూపుడై ప్రవర్తించుచున్న శ్రీపతితో శత్రుత్వము మనకు శ్రేయస్కరము గాదు.''

''నాథా! ఈ వార్ధక్యములో ఇంకనూ నీకు యుద్ధముపై ప్రీతి తగ్గలేదా! జగములలో వీరాధివీరుడనిపించుకొంటివి. పదునాలుగులోకములందూ ఎదురులేని వీరుడవై స్వేచ్ఛగా విహరించితివి. లోకములను జయించితివి. లోకపాలురను చెరబట్టితివి. ఇంద్రాది దిక్పాలురచే జోహార్లు పలికించుకొంటివి. ఇది చాలదా, ఇంకనూ విజిగీష ఎందులకు? సామాన్యముగా లోకమందలి రాజన్యులు సుతులకు సామ్రాజ్యము లప్పగించి వనములకు పోయి తపమాచరించుకొనెదరు. అసురేశ్వరా! ప్రణతార్తిహరుడు, సృష్టిస్థితి సంహారకర్త, పరబ్రహ్మ స్వరూపుడగు దేవదేవుడు కోసల కుమారుని రూపుతో నిన్ను కటాక్షించుటకై స్వయముగ వేంచేసియున్నాడు. నీ వా మహామహునితో చెలిమిచేసి చిరకాల సౌఖ్యము పొందుమని నా ప్రార్థన. నామాట మన్నించి కుమారునికి పట్టము గట్టుము. శ్రీరామునికి సీత నర్పించుము. తదుపరి ఇరువురము వనములకుపోయి ఆ రఘుపతిని ధ్యానించుకొనుచూ సుఖముగ శేషజీవనము వెళ్ళబుచ్చెదము'' అని మండోదరి కన్నులనీరుబెట్టి ప్రాణేశుని పలువిధముల బ్రతిమాలుకొనెను.

ధర్మపత్ని హితోక్తులు దశకంఠునికి చెవిటికి శంఖూదినట్లయ్యెను. అతని మనస్సు ఆవంతయూ మారలేదు. పైగా లేనిపోనివి ఊహించుకొని విస్ఫూర్జణ భయమునకు లోనగుచుంటివని ఆమెను ఊరడించి విశ్రాంతుడై ఆనాటి రాత్రి గడిపెను.

మరుదినము రావణుడు రాజ్యసభకు మంత్రి సామంత దండనాథులను రావించి సభ దీరెను. వారితో యుద్ధప్రయత్నములను గురించి మంత్రాలోచన చేయసాగెను. యథాప్రకారము మంత్రి ప్రముఖులు రాజు నెదుట తమ తమ బలదర్పములు పేర్కొని - నర వానర భల్లూకములు మేము భక్షించుటకు సంతృప్తిందికి చాలవని - ఢీకములు పలికి కూర్చుండిరి. అంతట ప్రహస్తుడు పైకిలేచి, నతమస్తకుడై హస్తములు ముకుళించి, పౌలస్త్య ప్రముఖుని కిట్లు విన్నవించుకొనెను.

"అమరేశ్వరా! ఈ నిశాచరులు వాస్తవిక స్థితిని గమనించక మీ ముఖప్రీతికై ఇట్లు ప్రగల్భములు పలుకుచున్నారు. ఈ మూఢుల మాటలు విశ్వసించిన ముందుకు ముప్పు తప్పదు. వాదొక్కి మనవి ఏమన - ఒక కోతి రాయడు మనకోటలు దాటివచ్చినపుడు, నగరమంతటా స్వేచ్ఛగ సంచరించినపుడు, నిశాచరులను నిర్జించినపుడు దనుజపురిని దహించినపుడు ఈ వీరవరు లెక్కడుండిరి? వీరి వీరాలాపము లేమయ్యెను? అప్పుడు వీరికి ఆకలి పుట్ట లేదా? ఆ వానరుని పంటి క్రిందవేసి భక్షించలేదే? వీరి వాచాలత్వమున కింత కంటే మరేమి నిదర్శనము కావలెను?

రాజా! ఇపుడు రఘువీరుడుసాగరము దాటివచ్చి లక్షల సైన్యముతో లంక వద్ద యుద్ధమునకు సన్నద్ధుడైయున్నాడు. మరి ఈ దనుజవీరులు సమరాంగణ మున రాఘవుని సమక్షమునకు వెళ్లి నిలబడగలరా! యని నాకు సందేహముగా నున్నది. ఈ వాచాలురేనా వానర యోధులను పంటి క్రిందవేసినప్పు గింజలవలె నమలగల సమర్థులు?

ప్రభూ! వీరి మంత్రాంగమువలన మునుముందుకు ముప్పు రాక తప్పదు. ప్రస్తుతము నా మాటలు మీకు కర్ణకఠోరముగ నుండినను ఉత్త- రోత్తర శుభ పరిణామము కల్గించుట తథ్యము. రాజనీతి ననుసరించి మొదట శ్రీరాముని వద్దకు రాయబార మొకటి పంపించుటకు ప్రయత్నిం- చుము. అది సానుకూలమైన తదుపరి సీతను సమర్పించుకొని సంధిచేసు కొనవచ్చును. ఒకవేళ ఇందుకు అవధేశుడు సమ్మతించిన వివాదమే లేకపో- వును. అట్లుగాదేని శూరులవలె శత్రువుల నెదుర్కొని సమరాంగణమందే సమస్యను పరిష్కరించుకొనెదము."

మృత్యువు ఆసన్నమైనవానికి ఔషధము పనిచేయదు. ప్రహస్తుని ప్రబోధనలు రాక్షసరాజుకు కర్ణకఠోరముగా నుండెను. రక్షోనాథుడు ప్రహస్తుని పలుకులకు రూక్షుడై పండ్లు పటపట గొరికి "ఓరీ అధముడా! నీకీ దుర్బుద్ధి ఎవరు నూరిపోసిరి? కాననమున కార్చిచ్చువలె నీవు నా వంశమున చెడబుట్టితివి. గ్రుడ్లువచ్చి పిల్లను యెదిరించులాగున నాకే బుద్ధులుగరపుచుంటివా! ఎవరి ప్రేరణచే నీవిట్లు నాకు వ్యతిరేకమైన వ్యాపారమునకు పూనుకొంటివో

ఊహించలేకున్నాను'' అని రక్షోవిభుడు పుత్రుడగు ప్రహస్తుని గద్దించి గర్జించెను.

ప్రహస్తుడు తండ్రిమౌఢ్యమునకు లోలోన పరితపించి బదులాడక మౌన ముద్రాంకితుడై కొలువు వీడి గృహమునకు పోయెను. నాటికి సభ చాలింప బడెను.

## రావణుని గర్వభంగము

లంకాపురిలో ఎత్తైన ప్రదేశమందు ఒక పెద్ద భవనమున్నది. చిత్ర విచిత్ర-ముగా కట్టబడిన ఆ కేళికాగృహము రావణుని విలాస మందిరము. నాటి రేయి నరాంతకు డా సుందర భవనమునకు పోయెను. సకల సంపద్విలసితమైన ఆ ఆరామగృహమందు వాడు విలాస క్రీడలలో మునిగి తేలెను. ఆ ముష్కరుని మనోరంజన వర్ణింపరానిది. ఒక ప్రక్క అప్సరసలు ఆడుచుండిరి. మరొకప్రక్క గంధర్వాంగనలు గానము చేయుచుండిరి. ఇంకొక భాగమందు వీణాతాళ మృదంగాది వాద్యధ్వనులు మధురముగ ధ్వనించుచుండెను. కస్తూరీ గంధ సుగంధముల ఘుమఘుమలతో, ధగధగద్దగాయమానమై వెలుగుచున్న దీపకాంతు లతో, రమణీమణుల హావభావ విలాసక్రీడలతో, అపర భోగపురిని తలపించు చున్న ఆరామ గృహమందు అసురేశుడు ఆటపాటల తేలియాడు చుండెను. ఇంద్రుడు అందరికంటే భోగపరాయణుడు. కానీ వానికి మేఘనాదుని భీతిచే స్వేచ్ఛగా ఆనందమనుభవించుటకు అవకాశము లేకుండెను. రఘువీరుడు కోటవాకిటియందు దండు విడిసిననూ రావణుడు మాత్రము నిర్భయుడై వళ్ళు మరచి వినోదము లనుభవించుచుండెను.

ఇచట సువేలాద్రి శిఖరముమీద శ్రీరాముడు మిత్ర బృంద పరివేష్టితుడై కృష్ణాజినముపై విశ్రమించియుండెను. శ్రీవారి శిరోభాగమున సుగ్రీవుడు, పాద-ములచెంత అంగద హనుమంతులు కూర్చొనియుండిరి. అల్లంతదూరమున సౌమిత్రి విల్లంబులు ధరించి వీరాసన మలంకరించియుండ విభీషణుడు స్వామితో మంత్రాలోచన చేయుచుండెను.

అప్పటికి సంధ్యాసమయమై తూర్పుదిక్కున చంద్రోదయమగుచుండెను. సాకేతనాథుడా సమయమున సుధాంశుని జూచి సుప్రసన్నుడై అనుచరులతో ఇట్లు ప్రసంగించెను.

''మిత్రులారా! పూర్వాద్రిపై ఉదయించు చంద్రబింబమును చూచితిరా! చీకటియను ఏనుగుల మందపై బడుటకు కొండగుహలోనుండి వెలుపలికి వచ్చు సింహమువలె శశాంకుడు శోభించుచున్నాడు. సింహము గజ కుంభస్థల మును గొట్టగా అందుండి రాలిన ముత్యములో యన్నట్లు ఆకాశమున నక్షత్ర మాలికలు ప్రకాశించుచున్నవి. ఆహా! రజనీరాణి ఆ ముత్యాలహారము నెంత ముచ్చటగా ధరించియున్నది! మిత్రులారా! చంద్రునిలోనున్న ఆ మచ్చను గురించి మీ యభిప్రాయ మేమైయుండునో తెలుసుకొనగోరుచున్నాను. చంద్రుడు గరళముతో పుట్టెను. ఆ విషము హృదయమునందంటుకొన్నందున హిమకరునికి మచ్చ యేర్పడియుండును. అందులకే యితని విషకిరణములు విరహిణులను బాధించుచుండునని నా యభిప్రాయము.'' అని వైదేహి వల్ల-భుడు విరహస్వాంతుడై వాక్రుచ్చెను.

అందుమీద అక్కడ చేరినవారు చంద్రుని మచ్చను గురించి తలకొక అభి ప్రాయము చెప్పిరి. భూమినీడ చంద్రునిపై బడుటచే మచ్చ యేర్పడినదని ఒకరు పలికిరి. రాహువు మ్రింగునపుడు రేరాజుకు గాయ మేర్పడియుండునని ఒకరు ఊహించిరి. బ్రహ్మ రతీదేవిని సృష్టించుటకుగాను సుధాంశునిలో కొంతభాగము తీసుకొన్నందున అక్కడ వెలితి యేర్పడి యుండునని ఒకరు సూచించిరి. ఇట్లు పలువురు పలువిధములుగ పలుకగా, తుదకు ఆంజనే-యుడు ''ప్రభూ! శశాంకుడు సదా మీ స్వరూపమును హృదయమున ధ్యానించుచున్నందున అక్కడ మీ దేహచ్ఛాయ యేర్పడియున్నది - '' అని సమాధానమిచ్చెను.

ఇట్లు చల్లని వెన్నెలలో సువేలాద్రిమీద విశ్రమించియున్న రామమూర్తి తన హితులతో మిత్రులతో, అనుచరులతోకూడి రజనీకాంతుని రామణీయకమును జూచి ఆనందించు చుండెను. ఆ సుఖ సమయమున ఆతని దృష్టి దక్షిణదిశ వైపు మరలెను. అంతట స్వామి విభీషణుని పలుకరించి ''సోదరా విభీషణా!

అటు లంకతట్టు చూడుము. ఆవైపు నల్లని మేఘములేర్పడి మెరుపులు మెర-యుచున్నట్లు అగుపడుచున్నది. పిడుగులు పడుచున్నట్లు ధ్వనికూడా కలుగు చున్నది. వర్షము రానున్నదా? లేక వడగండ్లు పడుచున్నవా? ఆ దృశ్య మేమై యుండునో?'' అని ప్రశ్నించెను.

''రఘువరా! మీరూహించినట్లు అది మేఘములూకాదు, అవి మెరుపులూ కావు. రావణాసురుని విలాసమందిరముయొక్క వైభవచ్ఛటలు ఆవిధముగ కన బడుచున్నవి. జానకీవల్లభా! లంకలో గిరిశిఖరముమీద నిర్మింపబడిన బంగారు భవనములో దశగ్రీవు డిప్పుడు విలాసోత్సవములు వేడుకలతో జరుపుకొనుచు-న్నాడు. ఆ సందర్భములో ఆకాశమున కెత్తబడిన ఛత్ర, కేతనములు మేఘము లుగా, వివిధ వాద్యధ్వనులు మేఘగర్జనలుగా తోచుచున్నవి. మండోదరి ధరిం-చిన కర్ణతాటంకముల కదలికలు మధ్యమధ్య జిగేలుమని మెరుపులవలె మెరయు చున్నవి. రఘుపతీ! రావణుని వైభవ ప్రభలు వర్ణింపనలవిగానివి.'' అని రావ ణానుజుడు రామునికి విశదీకరించి చెప్పెను.

దనుజేశుని దర్పము, వాని భోగాడంబరములు చూచి దాశరథి మండి పడెను. తత్క్షణమే దశరథ నందనుడు తూణీరమునుండి ఒక బాణము తీసు-కొని దానిని గురిపెట్టి దశాననుని విలాసమందిరముపైకి వదలిపెట్టెను ఆ శిలీముఖము నిమేషమాత్రమున నిశాచరులపైబడి వారి ఛత్రచామరములను, మండోదరి కర్ణభూషణములను, రావణుని కిరీటమును, సకల విధములైన విలాసోపకరణములను త్రుంచి, నుగ్గునూచచేసి, తిరిగి వచ్చి అవధేశుని అంబుల పొది చేరుకొనెను.

కన్నుమూసి తెరచునంతలో జరిగిపోయిన ఈ విచిత్ర సంఘటనకు జాతు ధానులు విస్తుపోయిరి. కనకాభరణాంబరాదులు ఖండింపబడినవే కాని వారి శరీ రములపై ఒక చిన్న గిచ్చుకూడ పడకయుండుట మరింత ఆశ్చర్యకరముగా నుండెను. ఛత్ర చామరములు విరిగి క్రిందబడుటచే ఏదో అశుభము కలుగ నున్నదని అసురులు భయభ్రాంతులై గుసగుసలు ప్రారంభించిరి.

అట్లు భయోత్పాతముచే భీతిల్లిన తనవారిని జూచి దశాననుడు - ''ఓరీ పిరికిపందలారా! ఛత్రము క్రిందబడుటకే ఇంతగా దిగులొందితిరా! పూర్వము

నేను హోమము చేయునపుడు నా తలలనే ఖండించి క్రింద పడవేసి యుంటినే, అప్పుడు నాకెట్టి అమంగళము ప్రాప్తించలేదు. మీ కీ పిరికిమందు ఎవరు పోసిరి? ఎందులకిట్లు తహతహ లాడెదరు? ఇదిగో నేటినుండి నిర్భయులై యుండుడు. నేనున్నాను'' అని. నిశాచరనాథుడు ధైర్యోక్తులు పలికి నాటికి వారిని ఇండ్లకు పంపించెను.

తన కర్ణభూషణములు తెగి నేలబడినందుకు మయతనయ మండోదరి మిక్కిలి విచారించెను. భయశంకితయై ఆమె కన్నుల నీరు బెట్టుకొని నాథునితో - ''ఓ ప్రాణేశ్వరా! ఆ శ్రీరాముని శక్తిప్రభావమువల్లనే ఇంతపని జరిగి పోయెను. నీ వింకను సాకేతవాసుని సామాన్య మానవునిగా భావించి పొరబడు చున్నావు. ఆతడు సాక్షాత్ విరాట్స్వరూపుడు. ఈ యఖిలాండకోటి బ్రహ్మాండము ఆతని ఆకారమేగాక మరొండుగాదు. ఇప్పటికైననూ మూర్ఖము వదలి పెట్టి స్వామితో సఖ్యము చేయుటకు సుముఖత్వము చూపెట్టుము'' అని బోధించెను.

''మండోదరీ! స్త్రీలు సహజ భీరువులు. మీకున్న దోసములలో పిరికితనము ప్రధానమైనది. నాయందున్న ప్రేమాతిశయముచే నీవిట్లు భీతిగొని పలుకుచుంటివి. కాని భయపడుటకు కారణము లేదు.'' అని రావణుడు మండోదరి భయము పోగొట్టుటకు ప్రయత్నించెను. కాలవశుడైయున్న నా భర్తకు ఇక నీతులు బోధించుట నిరర్థకమని భావించి మండోదరి నిరాశతో నిట్టూర్చి మిన్నకుండెను. భార్య బోధనలను పెడచెవినిబెట్టి యెప్పటికప్పుడు దశకంఠుడు ఆమెను తృణీకరించుచుండెను.

## రావణుడు రాముని సేనా వివరములు అడిగి తెలుసుకొనుట

మరుదినము లంకేశుడు లంకలో ఎత్తైన ఒక భవనమందు కొలువుదీరి అనుచరబృందముతో మంతనములు చేయుచుండెను. ఆ సౌధోపరిభాగము నుండి చూచిన, అప్పటికి శ్రీరాముని స్కంధావారము స్పష్టముగ కనబడుచుండెను. వానర సేనా రహస్యములు తెలుసుకొని వచ్చిన సారణుడు రావ-

ణునికి శత్రుసేనా విభాగవములను చూపించి, వారి బలా బలముల గురించి ఇట్లు వివరించి చెప్పెను - "అసురేశా! అదిగో, అక్కడ ఏడు తాటిమానుల పొడవుగలిగి నల్లగ కనబడుచున్న యోధులే నలనీలురను వారు. ఆ యున్నదమ్ము లిరువురు విశ్వకర్మ కుమారులు. పదునెనిమిది పద్మముల వానరవాహిని వారి కనుసన్నలలో మెలగుచుండును. అఖండ గోదావరి యుదకమును పానముజేసి తామ్రగిరి కందరమున నివసించు ఆ వీరులు యుద్ధమున యముని సైతము లక్ష్యపెట్టని శూరాగ్రేసరులు. వారి ఘన గర్జనలకు లంక గడగడలాడి పోగలదు.

అల్లదిగో! ఆ ప్రక్కన పదునొకండు తాళ వృక్షముల ప్రమాణమున మేఘ ములను తాకుచున్న రక్తవర్ణాంగుడే అంగదుడు. అవధపతికి అత్యంత ప్రియు డగు ఈ వాలి పుత్రుడు కిష్కింధకు యువరాజుగా చేయబడియున్నాడు. అహ ర్నిశము ఇతని ననుసరించి అయిదు పద్మముల వానరవీరులు నడచుచుందురు. ఉదయాద్రిని అవలీలగా చంకను బెట్టుకొని పోగల యీ వీరునితోక దెబ్బకు భూమి దద్దరిల్లగలదు.

ధవళగిరి శిఖరమువలె తెల్లని దేహచ్ఛాయతో దీర్ఘరోమములు గలిగి అక్కడ నిలబడియున్నవాడే వానరరాజు సుగ్రీవుడు. గోమతీ సలిలము గ్రోలుచుండు సుగ్రీవుడు మహాచతురుడు. చపల స్వభావుడు. బాలుడుగా నున్నప్పుడే భాస్క- రుని మ్రింగ ప్రయత్నించిన మహావీరుడతను. రాజా! సుగ్రీవుడు వ్యూహరచ- నయందు ఆరితేరినవాడు. సుగ్రీవునికి అల్లంత దూరమున గుట్టపై సంచరించు చున్న వానిని కుముదుడందురు. చండ ప్రచండుడగు ఆ కుముదుడు అయి దునూరు కోట్ల వానరులకు అధిపతి.

లంకాధిపా! అటు చూడుము. అవైపు నల్లని మేఘములవలె గుములు గుములుగా కప్పుట్టుచున్నవారు కాశీపుర వాసులగు భల్లూకభటులు ద్వంద్వ యుద్ధ ప్రవీణులు. అతి భయంకరవీరులగు వీరికి నాయకుడు ధూమ్రకేతుడు. ఈధూమ్రకేతుడు తన ఏడుపద్మముల భల్లూక సైన్యమును మన లంక కెదురుగ మోహరింపజేసి యున్నాడు. ఈతని సోదరుడే జాంబవంతుడు. వజ్రసన్నిభశరీరుడగు జాంబవంతుని మార్కొను మల్లవీరుడు ముల్లోకములందు

లేదని చెప్పవచ్చును. నర్మదాతీర నివాసియగు ఈ భల్లూకవీరుడు భూమిని పద్మమువలె పైకెత్తగల సమర్థుడు.

అసురనాథా! ఈవలివైపు చూడుము. అక్కడ పర్వతమువలె పచ్చగ కదలుచున్న ప్లవంగ సమూహమున కధిపతి మహావీరుడు మారుతి. అతని అనుచరులు సుమేరుపర్వత సానువులందు నివసించుచుందురు. ఇంద్రునికి ప్రియుడు, సుగ్రీవునికి మిత్రుడు, సాకేతరామునికి అంతరంగిక సేవకుడగు వాయుపుత్రుడు కొండలను బంతులవలె ఎగురవేయగల సత్వబలసంపన్నుడు. బాల్యమునందే పైకెగిరి సూర్యుని మ్రింగబోయిన ఈ వీరునికి దేవతలు వజ్రదేహము ప్రసాదించిరి. రాజా! ఆంజనేయుడు జరామరణములులేని అజన్మ బ్రహ్మచారి.

నాథా! అటు లంకకు ఉత్తర భాగమున అటూ ఇటూ కదలుచున్న సేనా భాగమందలి వారు పారియాత్ర పర్వతవాసులు. వారి దళనాయకులు జగదీశ్వరులు. ఆ దళపతులు రామార్థము ప్రాణము లర్పించుటకైనా సిద్ధముగా నున్నారు. ప్రభూ! ఆ గవయ గవాక్షులను చూచితిరిగదా! తుంగభద్రా నదీ జలము ద్రావుచుండు ఈ వీరులలో ఒక్కొక్కనికి డెబ్బదివేల ఏనుగుల బల మున్నదని వినికిడి.

వీరుగాక గంధమాదనుడు, పింగళాక్షుడు దంభుడు, మైందుడు, సుషేణుడు మున్నగు యోధాగ్రేసరులు తేజః స్ఫూర్తియందు అగ్నిహోత్రునితో సమానులు. వారి గర్జన భర్జనలకు దిక్కులు పిక్కటిల్లిపోవును. ఒకొకడు కోటి వీరుల కధిపతిగా నుండును. తదన్యులగు కపిముఖులు, ధవళాస్యులు, పింగళ వదనులు, గైరిక వర్ణ శరీరులు, తీక్షణ దంష్ట్రులు మొదలగు వారి యూథములు లెక్కకు మించినవి. ఈ కపి సముదాయము సదా కయ్యమునకు కాలుదువ్వుచూ కాలునితో పోరుటకునైనా సిద్ధముగా నుండును.

దనుజాగ్రణీ! ఇక ఆదివ్య పురుషునిగూడ ఒకమారు తిలకించుము. అతసీ పుష్ప శరీరుడై వామకరమున కోదండము శోభించుచుండ స్మితవదనుడై కూర్చున్నవాడే సీతాపతి శ్రీరామచంద్రమూర్తి. ఆ యసదృశ తేజోవిలసితుడగు ఆ జటాధారి ధర్మపత్నినే నీవు హరించి తెచ్చినది. ఆ సౌమ్యమూర్తికి నుంత దూరమున వీరాసనమందు శోభించుచూ నున్నవ దేహచ్ఛాయతో విరాజిల్లుచున్న

వీర్యవంతుడే లక్ష్మణమూర్తి. అసురనాథా! అతడు ఆహవమున అలిగిన రెండవ రాము డనిపించును.

దశాననా! అచ్చటనే, శ్రీరామునికి వామభాగమందున్న వ్యక్తిని గుర్తించితివా! భవదీయ సోదరుడగు విభీషణు డతడే. నీ తమ్ముని ముఖమున అభిషేక తిలకమింకనూ శోభించుచున్నది చూడుము. నీ తమ్ముడు తాపసులకు లంక గుట్టు మట్టులన్నియు తెలియజేసియున్నాడు ప్రభూ!

రాక్షసేశ్వరా! రామలక్ష్మణులకు మధ్యనున్న మహాయోధుడే వానరపతి సుగ్రీవుడు. అవధేశుడు వాలిని వధించి వానరరాజ్యమునకు సుగ్రీవుని రాజుగా చేసెను. సుగ్రీవునిసేనాబల మూహించుటకు శక్యముగానిది. పదిలక్షలకో ట్లొక అర్బుదము, వేయి అర్బుదము లొక బిందువు, వేయి బిందువులైన ఒక మహాపద్మమగును. అట్టి పదునెనిమిది మహా పద్మముల సేనాశక్తి వెంట నిడుకొని సాకేతపతికి సహాయార్థమై నీతో సంగరము చేయుటకు సుగ్రీవుడు సిద్ధముగా నున్నాడు.''

ఇవ్విధముగ సారణుడు వానరయోధులను గురించి, వారి యూథములను గురించి, సేనా రహస్యములను గురించి వారి బలపరాక్రమములను గురించి రావణునికి వర్ణించి చెప్పెను. శాత్రవుల శక్తి సామర్థ్యములను తెలుసుకొనుటలో అసురనాథుడా దినమంతయూ గడపెను.

## అంగదుని దౌత్యము

మరుదినము ఉదయమున శ్రీరాముడు తన మంత్రులగు సుగ్రీవ జాంబవంత విభీషణులతో సంప్రదించి వారి సమ్మతి ప్రకారము యువరాజా అంగదుని లంకకు రాయబారమంపుటకు నిశ్చయించెను. ''అంగదా! నీవు బుద్ధిమంతుడవు, బలవంతుడవు, నయుడవు, హితాహితము లెరుగగల సమర్థుడవు. కాబట్టి ఈ కార్యభారము నీ భుజస్కంధములపై ఉంచుచున్నాను. నీవు లంకలోనికిపోయి మనకార్యము సానుకూలమగునట్లు, రావణునికి హితము కలుగునట్లు ఉభయపక్షములకు లాభకరమైన మార్గమున దౌత్యకార్యము నిర్వహించి రావలసినది'' అని రాఘవుడు అంగదుని కాదేశమిచ్చెను.

వాలితనయుడంత ప్రదక్షిణ పూర్వకముగ ప్రభువుకు నమస్కరించి, వారి ఆజ్ఞను శిరమున దాల్చి అక్కడనుండి ఒక్క ఎగురున రావణుని రాజప్రాసాదము చెంత వచ్చి వ్రాలెను. భవన ప్రాంగణమందు అంగదుడు రావణుని కుమారునికి ఎదురయ్యెను. అప్పుడు వారిద్దరి మధ్య ఇట్లు సంభాషణ జరిగెను.

''ఓరీ! వానరా! నీ వెవడవు?''

''రాక్షసా! నేను రాముని దూతను.''

''అతని భార్యనేగదా మా తండ్రి హరించినది?''

''అవును, ఆ రాముడే మీ మేనత్త ముక్కు చెవులు ఖండించినది.''

ఈ మాటకు ఉగ్రుడై రావణపుత్రుడు అంగదుని కాలితో తన్నుటకు ఉద్యమించెను. అంగదుడంతట అవలీలగా వాని కాళ్ళు పట్టుకొని పైకెత్తి గిర గిర త్రిప్పి ఎక్కడనో పడునట్లు విసరివేసెను. ఈ దృశ్యము చూచి రాక్షసులు దిగ్భ్రమజెందిరి. ఆ ప్రాసాద ప్రాంతమందుండిన రాక్షసభటులు - లంకను కాల్చిపోయిన వానరుడు తిరిగి వచ్చినాడని ఊహించి భయాక్రాంతులై కుయ్యో మొఱ్ఱో! యని కేకలిడుచూ అక్కడినుండి పలాయనము చిత్తగించిరి. అటుపైన వానరరాజుకు లోనికి బోవుటకు మార్గము నిరాటంక మయ్యెను.

అంగదుడు మృగరాజువలె నిర్భయముగా నిశాచరపతి కొలువులోనికి పోయి, తన ఆగమనవార్త రావణునికి దెలియజేసెను. తత్క్షణమే సురారి సేవకులు ఎదురువచ్చి కపిపుంగవుని ఆదర పూర్వకముగా తోడ్కొని దనుజాధిపుని చెంతకు పోయిరి. పదితలలు, ఇరువది చేతులతో కాటుక కొండవలె గద్దె నధిష్ఠించియున్న రావణబ్రహ్మ భీకరాకారమును అంగదుడు చూచెను. అతడు సభలో ప్రవేశించినపుడు సభికులు ప్లవంగనాథునికి ప్రత్యుత్థానముచేసి గౌరవించిరి.

అసురేశుడు అంగదుని అవలోకించి ధీర గంభీర స్వరమున - ''వానరా! నీ వెవరు? నీ పేరేమిటి? నీ రాకకు కారణమేమి? ఎచ్చటి నుండి వచ్చు చుంటివి.'' అని ప్రశ్నించెను.

కపిశ్రేష్ఠుడు సభా మర్యాదను పాటించి తన ఆసనము నుండి పైకిలేచి, దశ గ్రీవునికి గౌరవాభివందనముచేసి ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను.

"ఓ రాక్షసేశ్వరా! నేను రాముని దూతను. నా పేరు అంగదుడు. నేను కపికుల శ్రేష్ఠుడగు వాలి పుత్రుడను. రాజా! మా తండ్రికి మీకు గల స్నేహము పురస్కరించుకొని సద్భావ దృష్టితో మీకు కొన్ని శుభ వాక్యములు చెప్పుటకై వచ్చితిని." అని అంగదుడు ప్రారంభమున తన పరిచయములు పలికి పిమ్మట ఇట్లు ప్రసంగించెను.

"రావణా! నీ తాత పులస్త్యబ్రహ్మ. నీవు సత్కుల సంజాతుడవు. పరమేష్ఠికి పరమేశ్వరునికి ప్రీతి పాత్రుడవై అనేక వరములను సంపాదించితివి. ఇంద్రాది దిక్పాలురను జయించి లోకముల కీర్తి నార్జించితివి. నీవు సంకల్పించి సాధించని కార్యము లేదు. ఆశించిఅనుభవించని అధికారమూ లేదు. అపూర్వమైన ఇంతటి జగద్విఖ్యాతి నొందిన అసురేశా! జగన్నాథుడగు శ్రీరాముని ధర్మపత్ని జగదంబను దొంగిలించి తెచ్చుట నీకు తగిన కార్యమేనా? నిశాచర నాథా! అహంకారమును ఉద్రేకమును విడనాడి నుంత ఆలోచించి చూడుము. నా మాటలను పాటించి తదనుసారము జానకిని సగౌరవముగ స్వామికి సమర్పించుకొని, సబాంధవముగా సుఖింపుమని హిత వొసంగుచున్నాను."

అని అంగదుడు చెప్పగా, రావణుడంతట -

"వానరా! ఏమీ నీవు వాలిపుత్రుడనివా! అట్లయిన మీ తండ్రి క్షేమముగ నున్నాడా? అంగదా! నీవు వాలి కుమారుడని వినుటకు నాకు విచారముగా నున్నది. నీవు మీ తండ్రి వీరత్వమునకు అపఖ్యాతి కలిగించుచున్నావు. లోక వీరుడగు వాలికి వారసుడవైయుండి, సిగ్గులేక ఒక సన్న్యాసికి దూత్యము చేయుటకు సిద్ధపడి వచ్చితివా! ఇంతకూ నీవు శతమూర్ఖునివలె గప్పట్లుచున్నావు. లేకుండిన నేను దేవశత్రువు నను సంగతికూడ నీకు తెలియకున్నదే!"

అంగదు డందుల కొకింత మందహాసము చేసి -

"పౌలస్త్యా! ప్రస్తుతము మా తండ్రి ఈ లోకమున లేడు. బహుశా మరి కొన్ని దినములలో నీవే స్వయముగా వెళ్ళి అతని క్షేమసమాచారములు

తెలుసుకొనగలవని అనుకొనుచున్నాను. ఇకపోతే, నీవు నన్ను మూర్ఖుడని పేర్కొంటివి. ఇరువది కన్నులు, ఇరువది చెవులుండియూ మంచి చెడ్డలు గ్రహించజాలని శతమూర్ఖుడవు నీవా? నేనా? బ్రహ్మరుద్రాదులు ఏ మహాత్ముని సతతము సేవించుచుందురో ఆ స్వామి కార్యార్థమై నీ క్షేమ మాసించి ఇక్కడకు వచ్చిన నాకు సిగ్గులేదని పలుకుటకు నీ నోరెట్లాడెను? ఇంకనూ నీ నాలుక బ్రద్దలు గాకున్నదేమని విచారించుచున్నాను.''

ఈ మాటకు రావణుడు ఉగ్రుడై - ''ఓరి కులహీనుడా! నోటికి వచ్చి నట్లు ప్రేలకుము. జాగ్రత్త! ఈరావణుడు నీ పరుషోక్తులు సహించునంతటి దుర్బలుడుకాడు. రాజనీతి పాటించి నిన్ను దూతవని క్షమించుచున్నాను.'' అని హెచ్చరించెను.

రావణుడు ఇంకనూ ఇట్లు పలికెను -

''అంగదా! నీవు నన్నేమి ఊహించి ఇట్లు తృణీకరించి పలుకుచుంటివి? రాహువు చంద్రుని కాంతిని హరించు విధముగా నేను దిక్పాలుర గర్వమడంచిన సంగతి నీకు తెలియదా! నా హస్తకములపైన కైలాస పర్వతము ఒకప్పుడు ఆకాశములో హంసవలె పైకి లేచిన విషయము నీవు వినియుండ లేదా! జగము లను గజ గజ లాడించిన ఈ మనుజనాథుడు ఇపుడు మీ నరవానరులకు భయపడి దోసిలొగ్గవలెనని తలంచుచుంటివి. ఓయీ! వనచరా! నిజము చెప్పుము. వాస్తవముగా నన్నెదుర్కొనగల యోధుడు మీలో ఎవరున్నారు? రాముడు భార్యా వియోగి. అతని తమ్ముడు - అన్న అవస్థకు ఎన్నడో దిగులుగొని దీనుడై యున్నాడు. ఇకపోతే నీకును సుగ్రీవునకునుగల జ్ఞాతి వైరము జగద్విదితము. నా సోదరుడు విభీషణుడంటివా? వాడొక పిరికిపంద. ఇక మిగిలిన వారిలో నలనీలురు కేవలము శిల్పప్రవీణులు. జాంబవంతుడు జరాభారముచే బలముడిగినవాడు. కావి, నన్నెదుర్కొన గల వీరుడు మీలో ఒక్కడే మిగిలియున్నాడు. వాడు మా లంకకు నిప్పుబెట్టిన మర్కట యోధుడగు అంజనేయ నామధారి.''

అని చెప్పుచుండిన నిశాచరనాథుని మాటల కడ్డుపడి కపిపుంగవుడు ఫక్కున నవ్వి ఇట్లనెను -

''రాజా! ఆ వానరుని గురించి నీవేమో గొప్పలు చెప్పుచున్నావు. వాడు మా సేనలో కనిష్ఠబలుడుమాత్రమే. శీఘ్రగామి యని వానిని సుగ్రీవుడు లంకకు పంపియుండెను. కానీ, శ్రీహరి ఆజ్ఞలేనిదే వాడు లంకను దహించి యున్నందున భయపడి ఎక్కడనో దాగుకొనియున్నాడు. నేటివరకు వాడు మా కంటబడలేదు. ఆ పిల్లకోతిని గురించి నీ వింతగా పొగడుచుండుట వింతగా నున్నది. నీ బలప్రతాపము లేపాటివో దీనివలనే చక్కగ తెలియుచున్నవి. మా కటకములో నిన్నెదుర్కొనగల వీరుడు లేడని వాక్రుచ్చితివి. కొంతవరకు నీవు చెప్పినదికూడ వాస్తవమే. ఏమన, క్షత్రియకుల సంజాతుడగు శ్రీరాముడు నీబోటి బ్రాహ్మణవంశీయునిపై చేయి చేసుకొనుటకు వెనుకాడుచుండుట నిక్కము. అయిననూ పరస్త్రీని హరించిన నీబోటి పాతకిని వధించుటకు వెనుకాడదగదు.

ఓ దశగ్రీవా! రావణుడు నీతిమంతుడు, బలవంతుడు, వివేకవంతుడని విని ఇంతదూరము శ్రమప... నిన్ను జూడ వచ్చితిని. ఇంతకూ నీ వెవ్వరో ఇప్పటికీ నాకు బోధపడకున్నది. ఒకప్పుడు బలిచక్రవర్తిని జయించబోయి పరాభవమొందిన రావణుడు, మరొక సమయమున కార్తవీర్యార్జునుని కారాగృహ-మున బంధింపబడిన రావణుడు, ఒకమారు మా తండ్రి చేతుల సందున చిక్కుకొని నలిగి నీలిగి బయటపడిన రావణుడు - వీరిలో నీ వెవ్వరో నాకు తెలియరాక తికమకపడుచున్నాను.'' అని అంగదుడు ఆశ్చర్యము ప్రకటించెను. వానర దూత వ్యంగ్యోక్తులు సురవైరికి ములుకులవలె తగిలెను. రావణుడు రోషకషాయితనేత్రుడై రొప్పుచూ దూత కిట్లు ప్రతివచనములు పలికెను -

''అంగదా! వాచాలత్వము కట్టిపెట్టుము. గతములో నే జేసిన ఘనకార్యములు, నా వైభవ ప్రాభవాదులు తెలియక నీ విట్లు పారబడుచున్నావు. లోకభీకరుడగు ఈ రావణుడెవరైనదీ నీకు తెలియనే తెలియదా! కైలాసము కదలించిన భుజబలుడు, శిరఃపుష్పములచే శివుని ఆరాధించిన ఉగ్రతపస్వి, దిక్పాలురను దిక్కులపాలు జేసిన ధీరు డెవ్వరైనదీ నీ కింకనూ తెలియకున్నదా! ఎవని వజ్రసన్నిభ వక్షస్థల కాఠిన్యమును చవి చూచి దిగ్గజములు వెరగొందెనో, ఎవని ఘనగర్జనల కీ బ్రహ్మాండము గడ గడ లాడియుండెనో, ఎవడు దిక్పాలుర చేత తన యింటి పనులు చేయించుకొనుచుండునో, ఎవరికి ఇంద్రజిత్తువి

వంటి కుమారులు గలరో, కుంభకర్ణుని వంటి మహావీరులు సోదరులుగాను-న్నారో ఆ రణధీరుడు, శూరుడు, ధైర్యధురంధరుడగు రావణుడు నేనే యని ఇప్పటికైనా గుర్తింపుము.

మూర్ఖుడా! నీ యజమానిని గురించి ఏవేవో గొప్పలు చెప్పుచుంటివి. సేతువుగట్టి సముద్రము దాటుటకూడ ఒక ఘనకార్యమా! గువ్వలు గూడ కడలిదాటుచుండుట మన మెరుగమా! ఇంటనుండి గెంటివేయబడినవాడు, భార్యను పోగొట్టుకొన్నవాడు, దిక్కులేక చెట్టుకు పుట్టకు దిరుగాడుచున్నవాడు, అసమర్థుడై, కోతులగుంపు వెంటబెట్టుకొని కేకలు వేయుచున్న బైరాగి వానికి భయపడి ఈ లోక రావణుడు త్రాహి యనవలెనా! సీతను సమర్పించుకొన వలెనా! ఆ నిరాశ్రయునికి నేను పాదాశ్రయుడు కావలెనా! ఓరీ పశువా! బుద్ధి హీనుడవై ఈ మాటలు చెప్పుటకేనా నీవు పనిగట్టుకొని నా వద్దకు వచ్చి వది?'', అని దనుజపతి అంగదుని దట్టించి పలికెను.

''రావణా! నీ ధైర్యస్థైర్యములు, బల పరాక్రమములు జగత్తునకు తెలియ-నివికావు. అహంకారముతో ఆత్మస్తుతి చేసుకొని అజ్ఞానమున బడుచున్నావు. నీ ఇరువది చేతులను, పదితలలను వరములను, సోదరులను, సుతులను, మాటి మాటికి పేర్కొని ఏల ప్రేలెదవు. ఇవి యేవియు కోసలపతి ఖరతర బాణశిఖలను ఎదుర్కొనలేవు. వానరులను పురుగుల క్రింద పరిగణించి పరిహ-సించుట నీ హ్రస్వదృష్టికి తార్కాణము. నిన్ను అర్థించుటకు లేదా నీతో సఖ్యము చేయుటకై బ్రతిమాలుమని రాఘవుడు నన్ను ప్రయత్నించి పంపలేదు. రామాజ్ఞను లోకమర్యాదను గౌరవించి యూరకున్నాను గానీ, నీ బల దర్పము-లకు భయపడిగాదు. లేకుండిన ఈ పాటికే నిన్ను సంహరించి లంకతోసహా జానకిని తీసుకొని నా స్వామికి సమర్పించుకొని యుందును.''

అని గర్జించి కపిరాజు క్రుద్ధుడై భూమిని గ్రుద్దెను. ఆ మర్కటవీరుని ముష్టి ప్రహారమునకు భూమి దద్దరిల్లి కంపించి పోయెను. సభికులు భయకం-పితులైరి. ఆ కుదుపునకు రాక్షసరాజు ఆసనమునుండి దొర్లిక్రింద బడెను. అప్పుడతని మణికిరీటములు పదీ నేల దొర్లెను. వానిలో నాల్గింటిని తీసుకొని అంగదుడు వాటిని శ్రీరాముని చెంత పడునట్లు ఎగజిమ్మెను. ఆ వజ్ర కిరీట

ములు సూర్యకాంతికి తళతళ మెరయుచూ వెళ్ళి ఉల్కాపాతమువలె శ్రీహరి చరణముల వద్ద పడెను.

భూకంపమునకు ధరాగతుడైన దనుజనాథుడు తటాలున పైకిలేచి రోషోద్దీపితుడై పండ్లు పటపటగీటి – "రాక్షసవీరులారా! ఈ దూతను త్రాళ్ళతో కట్టి బంధింపుడు. వానరులపై బడుడు. రామలక్ష్మణులను భక్షింపుడు. ఇది నా యాజ్ఞ!" అని వెర్రెత్తిన వానివలె కేకలిడుచూ నరవానరులను దుర్భాషలాడ జొచ్చెను.

అసురేశుని అవినీతికి అంగదుడు ఆగ్రహోదగ్రుడై భుజ మువ్వళించి "ఓరీ నిశాచరా! అంత్యకాలము సమీపించినందులకే నీ విట్లు నీతి న్యాయములను నిర్జించి, నీచోక్తులాడి, నైచ్యమునకు ఒడిగట్టుచున్నావు. ధర్మబద్ధుడనై యున్నందున నీకిప్పుడే తగు పాఠము చెప్పలేనందుకు నా కెంతయు చింతగా నున్నది. ఇదిగో! కేకలు కట్టిపెట్టి, నా యీ కాలు కదలించినచో చాలు, మీరు శ్రీరాముని జయించినట్లే!" అని ప్రతిజ్ఞా పూర్వకముగా పలికి, అంగదుడు తన ఎడమ పాదమును భూమిపై మోపెను. రాక్షసు లా ప్రకటనకు భయభీతులైరి.

తదుపరి భీమబలులైన పలువురు జాతుధానులు ముందుకు వచ్చి ప్లవంగ వీరుని పాదము కదలించుటకు బహువిధముల ప్రయత్నించి చూచిరి. సత్పురుషుని సన్మార్గమునుండి తప్పింపజాలనట్లు రాక్షసులెంత బల ప్రదర్శనము చేసినను అంగదుడి కాలు కదపలేక భంగపడిరి.

*"తృణకులిశ, కులిశ తృణ కరయీ*
*గరువ సుమేరు రేణు సమతాయీ"*

అన్నట్లు, దైవ బలమున్నవాని నెవరేమి చేయగలరు!

దశగ్రీవుడీ పరాభవమును భరించలేకపోయెను. రోషావేశుడై రావణుడు తానే ముందుకు వచ్చి – అంగదుని కాళ్ళుపట్టి పైకెత్తి క్రిందవేసి చితుక గొట్టవలెనని సంకల్పించెను.

అంగదుడది చూచి "రావణా! నీవు నా తండ్రికి సమకాలికుడవు. కాబట్టి నీవు నాకు పితృసమానుడవు. నీవు నా పాదములు పట్టుకొనుటకై ఉద్యమించుట భావ్యముగాదు. జగదారాధకుడగు ఆ శ్రీపతి చరణములు స్పర్శించునపుడే నీకు ముక్తి లభించునని విశ్వసింపుము" అని తుదిసారిగా బోధించెను. ఇవ్విధముగ అంగదుడు శత్రువుల దర్పమడంచి, ధీరగంభీరుడై రావణుని కొలువుకూటమునుండి మరలి దశరథాత్మజుని చెంతకు పోయెను.

అంగదుడు వచ్చిపోయిన పిమ్మట, లంకేశుడు లజ్జావమానములు భరించలేక క్రుంగిపోయెను. అప్పు డతనిముఖము పగటి చంద్రుని పగిది కళాకాంతులుడిగి వెలవెలబోయెను. పరాభవాగ్ని భరించలేక లంకేశుడా క్షణమందు వికలచిత్తుడై తలలు బాదుకొనుచూ విలపించెను. దుస్సహమగు ఆత్మక్షోభకు అసురేశుని హృదయము కలవరపడెను. దయామయుడైన దాశరథికి ద్రోహము తలపెట్టిన దుష్టునికి మనశ్శాంతి యెట్లు లభించగలదు?

# మండోదరి హితబోధ

అట్లు వ్యసన వ్యగ్రస్వాంతుడై ఇంటికి వచ్చిన సురారి మనస్సు మార్చుటకై మండోదరి ఇట్లు బోధించెను.

"నాథా! రాను రాను సాకేతవాసునియెడల శత్రుభావము ద్విగుణీకృతమగుచున్నందుకు నాకు విచారముగా నున్నది. సాక్షాత్ జగదారాధకుడగు కాకుత్స్థతిలకుని మాయా మహిమ గ్రహించనేరక అతనితో పగ సాధించుటకు ప్రయత్నించుట మంచిదికాదు. నారాయణ స్వరూపుడగు రాముని నరుడని విశ్వసించుట నిశాచరజాతి నశించుటకు హేతువగుచున్నది.

రాఘవుని బాణ ప్రభావము చవిచూచిన మారీచుని మాటలనైనా మన్నించక పోవడం మరీ విచారకరము. జనకునిసభలో మీ యందరి సమక్షమున శివచాపము ఖండించిన దీతడే కదా! కాకాసురుని కన్ను ఊడబెరికి అతని గర్వమడంచినది ఈ కోసలవీరుడే గదా! మీ చెల్లెలి ముక్కు చెవులు కోసినది, ఖరదూషణ త్రిశిరులను కడతేర్చినది ఈ రాఘవుడే కదా! వాలిని ఒక్కకోలతో గూలనేసి, విరాధుని వధించి, కబంధుని నిర్జించినది ఈ దశరథ రాముడన్న

సంగతి మరచితిరా! అవలీలగా అంబుధిదాటి, సాగరోత్తర తీరమందు సేనా సమేతముగా విడ్డేసి కూర్చొనియున్నది ఈ అవధేశుడుగాక మరెవ్వరనుకొం-టిరి? అతని తమ్ముడు ఒకప్పుడు గీచిన గీటు కూడా నీవు దాటజాలక పోయిన విషయము విస్మరించితివా! అతని సేవకుడొకడు నీ నగరమునకు వచ్చి నిర్భయుడై నిప్పుబెట్టిపోయిన దృశ్యము ఇప్పటికీ కంటికి గట్టిన-ట్లగుపడుచున్నదే! నేడు మీ సభకు వచ్చి, మీ బల దర్పములను భంగపరచి పోయిన అంగదుడు సైతము ఆ స్వామి సేవకుడేగదా! అట్టి అమేయబలసంప-న్నుడగు అవతారపురుషుని సామాన్య మానవుడని భ్రమించి మృత్యువు నాహ్వానించుకొనుచున్నావు. ఆ జగదీశుని శక్తి స్వరూపమును గుర్తించక తృణీ-కరించుట అన్ని అనర్థములకు హేతువగుచున్నది. నాథా! రాజ్యగర్వముచే కన్ను గానక నే బట్టిన కుందేటికి మూడే కాళ్ళని మూర్ఖించి, మనసు మార్చుకొనని యెడల దనుజకులము సర్వధ్వంసము కాకమానదు.'' అని ఆమె శతవిధముల బోధించి చూచెను. కానీ, ఆమె ఆత్మఘోష అసురేశునియెడల అరణ్య రోదన మయ్యెను.

## మైథిలిని మోసపుచ్చుట

''వినాశకాలే విపరీత బుద్ధిః'' అట్టివాని దృష్టి ఎప్పుడూ వక్రమార్గము బట్టి పోవుచుండును. రావణుడు విద్యుజ్జిహ్వుడను రాక్షసుని రప్పించి - ''ఓరీ మాయావీ! రామునితలను అతని ధనుర్బాణములను కృత్రిమముగా కల్పించి తీసుకొనిరమ్ము, వానిని జూచి జానకి తన భర్త మరణించెనని విశ్వసించవలెను'' అని ఆజ్ఞాపించెను. విద్యుజ్జిహ్వుడు స్వల్ప వ్యవధిలోనే ఒక శిరము, ధనుర్బాణములు సృష్టించుకొనివచ్చి సురవైరి కిచ్చెను. అవి అచ్చుగుద్ది-నట్లు శ్రీరాముని తలను, ధనుర్బాణములను పోలియుండెను.

దశగ్రీవుడు వానిని తన వెంట తీసుకొని అశోకవాటిక యందున్న సీతను సమీపించి - ''సీతా! ఇంకనూ రామునిపై ఆశ పెట్టుకొని ఏల దుఃఖించె-దవు! యుద్ధములో వరవానరులు నిశ్శేషమయిరి. అవధేశుడు ఆహవమున అసువులు బాసెను. సౌమిత్రిమాత్రము ప్రాణావశిష్టుడై తప్పించుకొని పారిపో-యెను. నీకు నా మాటలపై నమ్మకములేని యెడల ఇదిగో! నిజవల్లభుని శిర

శ్వర చాపములనైనా గుర్తించి నిజము గ్రహించుము'' అని పలికి, వైదేహికి నరాంతకుడు శరచాపములు, శిరమును చూపించెను. సీత శ్రీరాముని శిరము జూచి, రావణుని మాటలు నిజమని నమ్మి ఒక్కపెట్టున ఆక్రందించి - ''ఓ వీరపుత్రుడా! నీవు మరణించితివా!'' యని కేకబెట్టి నేలబడి మూర్ఛిల్లెను.

ఇంతలో రామదండు రక్షోనగరమును ముట్టడించి చేసిన రణగొణ ధ్వని రావణుని చెవులబడెను. నరాంతకుడంతట అశోకవనము వదలిపెట్టి హుటా హుటిని రాజసభకు పోయెను. అప్పుడు విభీషణపత్ని సరమ సీతవద్దకువచ్చి ఆమె దైన్య స్థితికి జాలిగొని ఇట్లు ఊరడించెను -

''అమ్మా జానకీ! ఈ రావణుడు లోకవంచకుడు. వాని మాయమాటలు సత్యమని భ్రమపడి నీవు చింతించకుము. కుటవ్యూహముచే దశాననుడు నిన్ను భయపెట్టి లోబరచుకొనుట కిట్లు కుట్రపన్నెను. దేవీ! రామలక్ష్మణులు క్షేమము. వారు సేనా సమేతముగా వచ్చి లంకకు ఉత్తర తీరమున విడిది చేసి యున్నారు. రాముని బలమిప్పుడే లంకను ముట్టడించి జయధ్వానములు చేయుచున్నది. ఆ సంగతి తెలియగనే అసురేశ్వరుడు నిన్ను విడిచి ఆత్రముతో పరుగెత్తిపోయెను. అమ్మా! కోసలకుమారుల రాకకు లంక తల్లడిల్లుచున్నది. త్వరలోనే రామునికి జయము, నీకు శుభము కలుగుట తథ్యము.''

మైత్రీ పూర్వకముగ పలికిన సరమ మాటలు అమృత ప్రాయములై సీత మనోవేదనను శాంతింపజేసెను. సరమ సదయహృదయ. ఆమె స్నేహ సౌశీల్య మునకుముగ్ధురాలై వైదేహి వేయి విధముల కృతజ్ఞత తెలుపుకొనెను.

## లంక ముట్టడి

అప్పుట సాకేతపతి అంగదునివలన లంక సమాచార మంతయు సాంతముగ తెలుసుకొని యువరాజుతో - ''అంగదా! లోక విద్రావణుడగు రావణుని బల ప్రభావము జగద్విదితముగదా! అట్టివాని కిరీటములను నీవు నా వద్ద కెట్లు పంపగలిగితివి?'' అని ప్రశ్నించెను. అందుకు వాలి సుతుడు వినమ్రుడై ఇట్లు విన్నవించుకొనెను - ''సర్వజ్ఞా! ఇందులో మీకు గ్రాహ్యముగాని రహస్యమే-మున్నది? నిశాచరుని ఆ నాల్గు మకుటములు సామదానభేద దండోపాయము

లవంబడు నాలుగు రాజధర్మములకు ప్రతీకములు. వాస్తవమున కవి కిరీటములు గావు. ఆ ధర్మచతుష్టయము నీతిబాహ్యుడగు నిశాచరుని విడనాడి మీ కోటి ధర్మప్రభువును ఆశ్రయించెను.''

అవధనందనుడా ప్రత్యుత్తరమునకు సంతుష్టుడై అంగదుని సమయస్ఫూర్తిని, ఆతని వాగ్వైచిత్రిని ప్రశంసించి అభినందించెను.

పిమ్మట అంగదుడు - రావణుని మనోవైఖరి, వాని మూలబలరహస్యము, వారి యుద్ధవ్యూహరచనా విధానము, రక్షఃపురి రహస్యమార్గములు మున్నగు శత్రువులకు సంబంధించి తాను గ్రహించిన విషయములన్నీ శ్రీరామునకు వివరముగా తెలియజేసుకొనెను. రాఘవుడు సుగ్రీవ, జాంబవంత, నీల, నల, హనుమంత, విభీషణాది ప్రముఖులతో సమర సన్నాహములను గురించి సాకల్యముగ చర్చించి, లంకను నలువైపులనుండి ముట్టడించుటకు సుగ్రీవు నాదేశించెను. అవధేశుని అనుమతి లభించిన మరుక్షణమే సుగ్రీవ జాంబవద్విభీషణులు ముప్పురూ కార్యనిమగ్నులై తమ సేనను నాల్గు విభాగములుగా విభజించిరి.

దుర్గమము, దుర్భేద్యమగు లంకకోటలను నాలుగు దిశలనుండీ ఒక్కుమ్మడి ముట్టడించి భేదించుటకుగాను యూథములు, యూథపతులు నిర్ణయింపబడిరి. లంకాపుర పూర్వద్వారమును రక్షించుచున్న అతికాయుని ఢీకొనుటకు నీలుడును, దక్షిణద్వారమును గాపాడుచున్న మహోదరుని పైబడుటకు అంగదుడును, మేఘనాదునిచే రక్షితమైయున్న పశ్చిమ ద్వారమును భేదించుటకు మహావీరుడును, ఉత్తరద్వారమును రక్షించుచున్న రావణుని సేనను స్వయముగా రఘువీరుడే ఎదుర్కొనునట్లున్నూ నిర్ణయింపబడెను. ఇట్లు సమరమునకు సర్వాయత్తమైన సాకేతనాథుని వానర భల్లూకసేన సమధికోత్సాహముతో. -

*''జయతి రామ జయ లఛిమన*

*జయ కపీస సుగ్రీవ''*

యని జయ నినాదములు చేసి లంక కోటలవైపుగా ముందుకు నడిచెను. ఉద్దండమైన రామదండు చేతికందిన చెట్లుగుట్టలు రాళ్ళు కుప్పలు పెకలించి పైకెగురవేయుచు శత్రుభయంకరముగ సింహనాదము చేయుచూ, ముందుకురికి నిర్ణీత వ్యూహ ప్రకారము లంకాపురి దుర్గమును నలువైపులనుండి ముసురు కొనెను. ఉక్కు పిండములలాంటి లక్షోపలక్షల మర్కట వీరులు "జయరామ జయసుగ్రీవ" యనునినాదము చేయుచూ కోట బురుజులపై కెగబ్రాకిరి.

## మాల్యవంతుని హితబోధ

కోటలపై కెగబ్రాకిన వానరసేన గర్జనభర్జనలకు లంక దద్దరిల్లి కలగుండు చెందినట్లయ్యెను. ఈ వార్తకు రక్షోనాథు డుగ్రుడై నుండిపడి జాతుధానుల నవలోకించి – "ఓసురాంతక వీరులారా! కోతిమూకలు క్రొవ్వుచే కన్నుగానక మన కోట బురుజులపై కెగబ్రాకుచున్నవట! వంటయింటికి కుందేలు వచ్చి నట్లు ఈ వానర మూకలు కాలునిచే ప్రేరితులై మన కాహార మగుటకు లంక లోనికి ప్రవేశింప ప్రయత్నించుచున్నవి. మీరు తత్క్షణమే నలుదెసలకు క్రమ్ము కొని వానర భల్లూకములను నిశ్శేషముగా భుజించి సంతృప్తులు కావలసినది." అని గర్వితుడై నిర్లక్ష్యముతో పలికెను – "ఓ గిరిజా! ఆకాశము క్రిందబడు-నేమోయని తీతువుపిట్ట ఒకప్పుడు తనకాళ్ళను అడ్డుపెట్టెనట. అవ్విధముగ రావణు డజ్ఞానముతో రాఘవుని బల సంపన్నతను తూష్ణీభావముతో నిరసించెను." అని చంద్రమౌళి ఉమతో పలికెను.

తదుపరి రావణ ప్రేషితమైన రక్షోవాహిని రణ సన్నాహముతో ముందుకు నడిచెను. పరశు పట్టిస పరిఘ శూలముద్గర ఖడ్గాది క్రూరాయుధములు పై కెగురవేయుచూ, భేరీభాంకారాది భయదధ్వానముల దిశల ప్రతిధ్వనింప జేయుచూ, పిశితాశనులు కాలాంతకుల పగిది ప్లవంగ సేన నెదుర్కొనుటకు సర్వసన్నద్ధమై చనిరి. మేరు పర్వత శిఖరములపై ఆవరించు మేఘరాశివలె రావణసేన కోట కొమ్ములపై కెక్కి "రావణకీ జయ్" అని శత్రువులకు ప్రతి నినాదములు చేసి దిక్కులు పిక్కటిల్లజేసిరి.

ఇట్లు రామ రావణ సేనలు ఒండొరుల నెదుర్కొని పోరాటమునకు తల పడెను. రాక్షసులు దుర్గముల పైనుండి వానరులు కోట క్రింది భాగమునుండి,

యుద్ధము చేయసాగిరి. మర్కటయోధులు తమ పర్వతములతో ముష్కరులను మర్దించుట కుపక్రమించిరి. మహా మారణాస్త్రములు ప్రయోగించి రక్కసులు రామదండు నెదుర్కొనుచుండిరి. ఇట్లు ఉభయపక్షముల మధ్య ఘోర సంగ్రామము జరిగెను. పిశితాశనులు ప్రాకారములనుండి త్రోయుచున్న గుండ్లను, బండలను క్రిందబడకమునుపే కపివీరులు వాని నొడిసి పట్టుకొని తిరిగి రాక్షసులపైననే ప్రయోగించుచుండిరి. భయదభీకరులగు నిశాటుల ప్రచండోత్తేజమును లెక్కించక కోటానుకోట్ల వానర వీరులు ప్రాణములకు తెగించి ప్రాకారముల పై కెగబ్రాకిరి. ఇట్లు చీమలపుట్టలు పగిలినట్లు అసంఖ్యాక వానరసేన కోట కొమ్మలపై కెక్కి – ''జయత్యతిబలో రామః'' అని సింహనాదములు జేసి రాక్షసులపై విరుచుకపడెను. కొందరు రాక్షసులను కోటల నుండి క్రిందకు పడద్రోసి మరి కొందరిని ముష్టి ఘాతములతో మర్దించి, మరి కొందరిని కాళ్లు పట్టి గిరగిర త్రిప్పి నేలకేసి కొట్టి ఇంకొందరిని చేతులతో కాళ్ళతోనూ మగ్గునూచము జేసి శత్రువధ చేయసాగిరి. అంతకంతకూ రెట్టించిన సంఖ్యాబలముతో ఉక్కుపిండములవలె ఉద్దండులై తండము తండముగా మీదికివచ్చుచున్న శాఖాచరుల తీవ్రధాటికి నిలువలేక నిశాచరులు వెన్నిచ్చి పారిపోయిరి. వానరులు నిజయోద్దీపితులై వైరి దళములను వెన్నంటి తరిమి, వైరి భయోత్పాతముగా వానర లోకప్రమోదముగా విజయధ్వానములు చేసిరి.

కపివీరుల విజయారావమునకు లంక ప్రతిధ్వనించెను. ఉప్పెనవలె మరుగులు గ్రక్కుచూ మీదికివచ్చి పడుతున్న వానర వాహిని యుద్ధతి నెదురించలేక నిశాచరులు భయాక్రాంతులై పరుగెత్తసాగిరి. దశకంఠుడది చూచి ఉగ్రుడై పండ్లు పటపట గీటి పారిపోవుచున్న సైన్యమును నిలువరింపజేసి ''ఓరీ పిరికి పందలారా! నిరంతరము భోగపరాయణులై యున్నందున పౌరుషాభిమానములు చచ్చి నిర్వీర్యులై యున్నారు. ఇదిగో, సిగ్గులేక వైరికి వెన్నిచ్చి పారిపోవు వారిని నా వజ్రాయుధమునకు బలి పెట్టెద –'' నని హుంకరించి భయపెట్టెను. నిర్దయుడగు నిశాచరనాథుని చేతిలో దుర్మరణము చెందుటకంటే యుద్ధములో వీర స్వర్గమలంకరించుట శ్రేయస్కరమని భావించి పిశితాశనులు వెనుదిరిగి పునః మహాయుద్ధోన్ముఖులైరి. రాత్రించర వీరులు రెట్టించిన రోషముతో ప్రళయకాల సముద్రమువలె పెల్లుబికి వైరి బలములను తాకిరి. ఆవేశపూరితులగు అసుర

వీరులు చిచ్చరపిడుగులవలె రాఘవ సేనపై విరుచుకుపడిరి. క్రోధోద్దీపితులై పునః ప్రకోపించిన నరాంతకులను మార్కొనలేక కపిసైన్యము కలగుండుబెంది కకావికలయ్యెను.

హనుమంతు డపుడు పశ్చిమద్వార రంగమున మేఘనాదునితో పోరాడుచుండెను. ఎంత సేపటికినీ ప్రవేశద్వార మతని యధీనముకాకుండెను. మహావీరు దందులకు కినిసి రోషభీషణ స్వరూపుడై సింహగర్జనచేసి నగర ప్రాకారముపైకి కుప్పించి ఎగిరెను. ప్రాకార శిఖరోపరిభాగమున నిలబడి హనుమత్కుజుడు పర్వత ఖండము నొకదానిని పైకెత్తి దానితో మేఘనాదుని హయరథసారథులను నుగ్గు నూచ మగునట్లు చేసెను. అక్కడినుండి కుప్పించి మేఘనాదుని పైకి దూకెను. ఒక్క తీవ్రప్రహరణము దేవాంతకుని రొమ్ముపై ప్రయోగించి రక్తము గ్రక్కుచూ నేల కొరగునట్లు చేసెను. మేఘనాదుడటు మూర్ఛాగతుడగుట చూచి మర్కటోత్తముడు రోదోంతరాళములు ప్రతిధ్వనించునటుల జయగర్జన చేసెను.

పవనతనయుడు పశ్చిమద్వారము భేదించెనని తెలుసుకొని అంగదుడు ఉత్సాహియై అంగలలో వచ్చి ఆంజనేయుని కలుసుకొనెను. బలవిక్రమోపేతులగు ఆ యోధాగ్రగణ్యు లిరువురు ఒక్కటై విజృంభించి, ప్రాకారములను పడద్రొన్ని, దుర్గద్వారములను పగులగొట్టి బురుజులను కూలద్రోసి, శాత్రవసమూహములను పరిపతనమగునట్లు స్వైరవిహారం చేసిరి. వారిచే హతులైన దనుజుల తలలు కుప్పలు కుప్పలుగా వచ్చి రావణుని చెంత బడుచుండెను. ఇట్లు వైరి దళములను కకావికలగునట్లు పారద్రోలి, నాటికి దినాంతమగుటచే ఆ వీరు లిద్దరు తమ స్వామివద్దకు వచ్చి చేరుకొనిరి. దాశరథి ప్రసన్నదృష్టి ప్రసరించగనే వారికి శరీరశ్రమ శాంతించి చిత్తమునకు స్వస్థత కలిగెను.

రాక్షసులకు రాత్రులందు బలమెక్కువ. రాత్రించరుల శక్తి సామర్థ్యములకు అది అనుకూల సమయము. ప్రదోషకాలము ప్రవేశించగనే పౌలస్త్యుని సేన బలము పుంజుకొని పునః ప్లవంగవీరులపై వచ్చిపడెను. నిమేష కాలములో మరలా మహా సంగ్రామము ప్రారంభమై శరత్కాల మేఘముల చందమున ఒండొరులు విక్రమించి తార్కొనిరి. ఉభయులకు బాహాబాహి ముష్టాముష్టి

హోరాహోరి యుద్ధమారంభమాయెను. అతికాయ అకంపనాది అసుర వీరులు ఆరితేరిన మాయా యుద్ధప్రవీణులు. వారు దశదిశల అంధకారము మరింత దట్టముగా వ్యాపింపజేసి వానరులపై రక్తశిలావృష్టి వర్షింపజేయదొడంగిరి. రక్కసులు ప్రళయకాల మేఘ గర్జనలంబోలె పెడబొబ్బలిడుచూ చీకటిమాటున వానర భల్లూక యూథములపైబడుచు చేతికందిన శత్రువులను చీల్చుచూ చెండాడుచూ, భక్షించుచూ పిశాచముల పగిది నానాబీభత్సము చేసిరి. ఆ గాఢాంధకారమందు వానరులు స్వపరపక్షము లెయ్యవో గుర్తించనేరక, తమ యూథపతుల సంకేత సందేశములను అందుకొనజాలక తికమకపడి దిగులు పడిపోయిరి.

రాఘవుడు ఆపదమున తనవారికి కలుగుచున్న ఆపత్తును అప్రమత్తుడై గమనించెను. తత్క్షణమే దాశరథి విల్లెక్కుపెట్టి వైరి దళములపైకి ఆగ్నేయాస్త్రము ప్రయోగించెను. కాకుత్స్థమణి కోదండమునుండి వెలువడిన శిలీముఖాగ్ని జ్వాలల దీప్తికి అంధకారము పటాపంచలయ్యెను. జ్ఞానోదయముచే అజ్ఞానము నశించు భంగి అసురులచే కల్పించబడిన అంధకారము వైదొలగి రంగస్థలము ప్రకాశవంతమై భాసించెను. ఈ యవకాశమున వానరవీరులు పరాక్రమించి ముష్కరులను ముట్టడించి మారణహోమము చేయసాగిరి. రోషోద్దీపితులై రొప్పుచూ కాలాంతకులవలె కదనరంగమున విజృంభించిన కపిసేన ధాటికి తాళజాలక రక్కసిమూకలు ప్రాణార్తులై లంకలోనికి పరుగులు దీసిరి. ఈ ప్రకారము ఆనాటికి రణాంగణమున రక్కసుల నుక్కడంచి రాముని సేన దిశలు ఘూర్ణిల్లునట్లు జయధ్వానములు చేసికొనుచూ స్కంధావారము చేరుకొనెను.

## తొలినాటి యుద్ధము

ప్రప్రథమముననే పరాజయము సిద్ధించినందుకు పంక్తిముఖుడు బహుళముగా దుఃఖించెను. ఆ రాత్రి దశముఖుడు తన సచివ సేనాపతులందరిని సమావేశపరచి, వారితో "ఓయోధాగ్రగణ్యులారా! నిన్నటిపోరులో మనకు లభించిన పరాజయ, పరాభవములకు మనలో ప్రతి ఒక్కడు బాధపడుచుండెను. వెంటనే ఇందుకు ప్రతిచర్య తీసుకొని గత గౌరవముము కాపాడుకొనుటకు దీక్షాబద్ధులము కావలెను. సమరాంగణమున శత్రువిశ్లేషమొనర్చి

జయలక్ష్మిని చేపట్టుటకుగాను భావి కార్యక్రమమును యోచింపుడు''- అని పలికెను.

మాల్యవంతుడు రావణునకు మంత్రి, మాతా మహుడు, మరియు వయోవృద్ధుడు. అప్పుడా సాత్త్వికుడు సభలో నిలబడి సురారి నిట్లు సంబోధించెను-

''రావణా! ప్రస్తుతము రామునితో వైరము మనకు ఎవ్విధముగానైనను వాంఛనీయముగాదు. నీవు వరగర్వితుడవై విజిత కోట్లోయి శాత్రవుల శక్తి సామర్థ్యములను సైతము గణించక ఉపేక్షించుచున్నావు. అదిగాక శ్రీరాముని సామాన్యమానవునిగా ఊహించుకొనుటయందే నీవు అజ్ఞానము నాశ్రయించితివి. దశాననా! జగదంబ జానకిని హరించి లంకకు తెచ్చిన నాటినుండియే మనకన్నియు దుర్నిమిత్తములే తోచుచుండుట ఈ సందర్భమున విస్మరింపజాలము. సాకేతవీరుడు సాక్షాత్ విష్ణ్వంశ సంభూతుడు. హిరణ్యాక్ష హిరణ్యకశిపు మధుకైటభాది సురాంతకులను సంహరించి దేవజాతికి నిరపాయ సుఖము ప్రసాదించినది ఈ రాఘవోత్తముడే యన్న సత్యము విస్మరింపకుము. బ్రహ్మమహేశాది దేవతలకు ఆరాధ్యస్వామి, ఆ ఆదినారాయణమూర్తి కాలస్వరూపుడై అవతరించి దుష్టశిక్షణకు పూనుకున్నాడు. లంకేశ్వరా! హితాహితములను గుర్తించి పెద్దల బోధనలు పెడచెవిని బెట్టవలదు. జాతి శ్రేయస్సు, లోకక్షేమ మాశించి, జానకిని శ్రీరామునికి సమర్పించుకొని సుఖించుట సంప్రతి మనకు శ్రేయోదాయకమైన మార్గము.''

మాల్యవంతుని మాటలకు దనుజనాథుడు క్రోధ వివశుడై మండిపడెను. అతడత్యంతోగ్రమానసుడై పండ్లు పట పట గీటి - ''ఓరీ జరాగ్రస్తుడా! శత్రువును శ్లాఘించు నీ బోటి శుంఠ కిక్కడ స్థానములేదు. వయోవృద్ధుడవని నిన్ను క్షమించి విడిచిపుచ్చుచున్నాను. లేకుండిన ఈ పాటికి నీవు యమలోకయాత్ర చేసియుందువు.'' అని ధిక్కరించి తూలనాడెను. స్వోత్కర్షప్రియుడు, స్వబల గర్వితుడగు ఈ శతమూర్ఖునితో సంభాషించుట భావ్యముగాదని తలంచి మాల్యవంతుడు సురారి సభవదలి పెట్టి స్వగృహమునకు పోయెను.

మాల్యవంతుడు నిర్గమించగనే రావణుడుద్విగ్నమానసుడై చిరచిరలాడ జొచ్చెను. చిత్తశాంతిని కోల్పోయి చీకాకుతో సభలో అటూఇటూ తిరుగు చున్న తండ్రిని సమీపించి మేఘనాదు డిట్లు ధైర్యము పలికెను.

''నాయనా! దేవతలను దిక్కులకు తరిమి వారి నాయకుని జుట్టు పట్టు కొని మీ యింటికి దెచ్చిన ఈ వీరపుత్రుడు ఇంద్రజిత్తు ఉండగా, నీవు అధైర్యపడుట భావ్యముగాదు. ఓ తండ్రీ! మాటలతోగాక చేతలతో సమ-రాంగణమున నాశక్తి సామర్థ్యములను ప్రదర్శించి నీ మన్ననల నందుకొనగల వాడను.'' రావణుడు పుత్రుని వీరోచిత ప్రతిజ్ఞకు సంతోషించెను. ఉత్సాహి-తుడై కుమారుని అక్కునజేర్చి, అతని పౌరుష ప్రతాపములను అభినందించి తన హర్షము ప్రకటించెను. రావణుడా రాత్రంతయు తనయునితో, దూతలు-లతో సంప్రదించుచూ గడిపెను.

## మేఘనాదుని యుద్ధము

వానర భల్లూక సైన్యము తిరిగి దైత్యపురిపై విజృంభించెను. ఆ కలకల ముతో భళ్లున తెల్లవారెను. ఇంద్రజిత్తు కంక రథమారోహించి శస్త్రాస్త్ర సేనా సమేతుడై కాలాంతకుని పగిది కదనభూమికి కదలెను. ఆ దేవాంతకుని వెంట దనుజయోధు లనేకులు హయరథ గజాశ్వాది వివిధ వాహనారూఢులై, తోమర ముద్గర పరశు పరిఘ పట్టిస శూలాద్యాయుధపాణులై, భేరీభాంకార నినాదముల భూనభోంతరాళములను ప్రతిధ్వనింపజేయుచూ, ఉగ్రోదగ్ర స్వరూపులై ముందుకురికి వైరిబలమును ఢీకొనిరి. రెండు మహా సముద్రములు సంఘర్షించునట్లు ఇరుదళములకు ఘోర సంగ్రామము జరిగెను. వానర భల్లూకవాహిని ఉద్రేకోద్వేగముతో పెల్లుబికి జాతుధాన సమూహమును ముంచె-త్తెను. కపివీరులు పర్వతములను, శిలలను, వృక్షములను రక్కసులపై రువ్వసా-గిరి. నిశాచరులు ఖడ్గ శూలాద్యాయుధములతో వానరుల నెదుర్కొని భయం-కరముగ పోరాడిరి. మాయాయుద్ధ ప్రవీణుడు, లోకభీకరుడగు రావణ తన-యుడు రోషావేశుడై ముందుకురికి ''-ఓరీ కోసల కుమారులారా! ఓరీ వన వీర అంగద హనుమంత సుగ్రీవ విభీషణాది వైరి వీరులారా! మీరెక్కడ దాగి యుంటిరి?'' అని వీరాలాపములు చేయుచూ ధనుష్టంకారము చేసి శాత్రవ

సమూహముపై బాణములను కురిపించెను. వాని శరపరంపరలు పిడుగులవలె వచ్చి వానర సేనపై వర్షింపసాగెను. వానరులు ఎటువైపు చూచినను, ఎక్కడికేగినను మేఘనాదుని బాణములు రెక్కలున్న సర్పముల వలె పుంఖాను పుంఖములుగా వచ్చి మీద బడుచుండెను. ఆ అపూర్వ శరవృష్టికి సమరాంగణమంతయు కప్పబడిపోయెను. నరాంతకుని ఖరతర నారాచ ప్రయోగధాటికి కపికులము తికమకజెంది గగ్గోలుపడెను. మేఘనాదుని బాణ ప్రవాహములకు వెరగొంది దిక్కులు చూచుచున్న తనవారల దురవస్థ గ్రహించిన ఆంజనేయుడు ఆగ్రహోదగ్రుడై ఒక మహాపర్వతమును పెకలించుకొని వచ్చి దానిని మేఘనాదునిపై విసరికొట్టి సింహనాదము గావించెను. ఇంతలో ఇంద్రజిత్తు చటుక్కున రథము నుండి పైకెగసి రెప్పపాటులో పర్వతమును తప్పించుకొనెను. కానీ ఆ పర్వత పాతమునకు వాని రథ హయ సారథులు నుగ్గునూచయిపోయిరి. వాయుపుత్రుని బలవీర పరాక్రమములు ఇంద్రజిత్తుకు ఇంతకు పూర్వమే తెలుసును. అందుచే అతడు మారుతి మార్గమును యుక్తియుక్తముగ తప్పించుకొనిపోయి రఘురాముని దాకెను. సాకేతవాసుడు అవలీలగా నరాంతకుడు ప్రయోగించిన సాయకములను తుత్తునియలుగా జేసి, ప్రతి బాణములతో వాని శరీరమును తీవ్రముగా గాట నేసెను. రఘువీరునితో ముఖాముఖి యుద్ధముజేయుట నిర్ధకమని భావించి ఇంద్రజిత్తు పైకెగసి మేఘములను చాటు చేసుకొని మాయాయుద్ధమునకు పూనుకొనెను.

నిమిషములో గగనపథమంతయు మేఘాచ్ఛన్నమై కటిక చీకటులు క్రమ్ముకొనెను. ఆ గాఢాంధకారములో పై నుండి కపిసేనపై రక్తమాంసములు మాత్రము వర్షింపసాగెను. మరొక ప్రక్క భూతప్రేత పిశాచములు స్వేచ్ఛగా విహరించి వింతవింత శబ్దములతో వైరి గుండెలకు దడ బుట్టించెను. కటిక చీకటిలో పైనుండి రుధిరధారలు, పిడుగుల వర్షము, పిశాచముల భయంకరారావములు గాంచి, వానరులు ప్రళయమేదో రానున్నదని భయాక్రాంతులై భీతిల్లజొచ్చిరి. రఘువీరుడంతట రోషావేశములో ఒక్క మహాస్త్రము ప్రయోగించి మేఘనాదుని మాయాప్రభావమును పటాపంచలు చేసెను. ఆ ముష్కరుడా దెబ్బతో మేఘముల చాటునుండి బయటపడి ప్రత్యక్ష యుద్ధమునకు పూనుకొనెను.

రావణి జిత్తులకు కోపోద్రిక్తుడైయున్న రామానుజుడు హనుమంతాది వీరులను వెంటనిడుకొని ముందుకు వచ్చి యా దుష్కరుని దాకెను. అసమాన ధనుర్విద్యాపారీణులు, అతిబలవిక్రమోపేతులగు లక్ష్మణ ఇంద్రజిత్తులకు ముఖాముఖి యుద్ధము ముమ్మరముగా ప్రారంభమాయెను. ఇంతలో దశగ్రీవుడు తనయునికి తోడుగా ఉద్దండులగు అనేక యోధానుయోధులను యుద్ధ భూమికి ఉరికించెను.

రామకీజయ్ - రావణకీ జయ్ - యని సింహనాదములు చేయుచు వనచరులు, రాత్రించరులు, ఉగ్రులై ఒండొరుల ఢీకొని భీకరముగా పోరాడసాగిరి. నిశాటులు నానావిధమారణాస్త్ర ప్రయోగములతో మర్కటులను మర్దించిరి. వానరులు పర్వత పాషాణములతో నరభక్షకులను ప్రహరించిరి. వానర రాక్షసులకు జరిగిన ఆ అపూర్వ యుద్ధగతిని దేవగరుడ గంధర్వాది దివిజులు విమానారూఢులై తిలకించుచుండిరి.

దుష్కరముగు ఆ దొమ్మియుద్ధము వర్ణింప శక్యము గానిది. రక్తము మడుగులు కట్టి రణాంగణమంతయూ రక్తార్ణవమయ్యెను. ధూళిచే కప్పబడిన రుధిరభూమి నివురుగప్పిన నిప్పువలె కన్పించసాగెను. క్షత విక్షతములై రుధిర ధారలు స్రవించుచున్న యోధుల శరీరములు పుష్పిత పలాశవృక్షముల చందమున శోభించుచుండెను.

పౌరుష ప్రతాపబల వీర్యములందు సరిసమానులగు రామానుజ రావణాత్మజులు పరస్పర విజయకాంక్షులై ప్రాణపణముగా పోరాడిరి. ధూర్తుడగు ఆ దుష్కరుని మాయోపాయములను లక్ష్మణుడు నిమిషములో అట గట్టించెను. అట్లు మేఘనాదుడుకూడ సౌమిత్రి శరచాప కౌశలమును వమ్ము జేసెను. సౌమిత్రి అంతకంతకు శత్రు దుర్నిరీక్ష్య తేజోవిరాజితుడై నిశిత సాయకములు ప్రయోగించి రాక్షసయోధుని రథహయ సారథులను ధ్వంసముచేసి వానిని విరథునిగా జేసెను. మేఘనాదుడంత రోషోద్దీపితుడై మండిపడి, అంగదాది వానర వీరులను శరవిద్ధాంగుల జేసెను. అతుల బల విక్రమోపేతులగు ఆ ఇరువురు ఒకరింకొకరికి తీసిపోక పరాక్రమించి పోరాడిరి. ఆ పంకుల సమరమునకు సంగరక్షోణి అంతయు మాంస శోణిత మండితమై మహా భయంకరముగా నుండెను.

తన యుక్తి ప్రయత్నములన్నియూ వైరియెడల విఫలమగుచుండుటకు క్రుద్ధుడై మేఘనాదుడు తుదకు వీరఘాతినీశక్తిని చేతికి తీసుకొనెను. బ్రహ్మ దత్తమగు ఆ మహాస్త్రమును అభిమంత్రించి సౌమిత్రికి సూటిగా తగులునట్లు ప్రయోగించెను. ఘాతుకమగు ఆ శక్తి సూటిగా వచ్చి వక్షమున దాకుటచే లక్ష్మణమూర్తి తత్‌క్షణమే మూర్ఛిల్లి నేలకొరిగెను. ధరాశాయియై పడియున్న లక్ష్మణుని ఎత్తుకొని పోవుటకై దనుజులు ప్రయత్నించిరి. అయితే, వారెంత ప్రయత్నించినను శేషావతారుని శరీరమును ఇంచుకంతయూ కదిలించలేక విఫల మనోరథులై వెనుకకు మరలిపోయిరి. ఇంతలో సంధ్యా సమయమగుటచే ఉభయపక్షములవారు పోరు విరమించి తమ తమ స్కంధావారములకు నిష్క్రమించిరి.

–"ఓ భవానీ! శ్రీరాముడు చరాచరజగత్తుకు స్వామి. ఆతని దివ్యలీలలు గ్రహించుట బహు దుస్తరము. స్వామి సోదరుడు సంగరభూమిలో మూర్ఛా గతుడై పడియుండెను!" అని ఈ సందర్భమున నాగభూషణుడు నగతనయతో పలికెను.

మూర్ఛితుడై పడియున్న లక్ష్మణమూర్తిని ఆంజనేయుడు యుద్ధభూమి నుండి తెచ్చి అవధేశుని యెదుట బెట్టెను.

## హనుమంతుడు సంజీవికై పయనించుట

శక్తి ప్రయోగమువలన తెలివిని గోలుపోయి, నెత్తుట దోగుచూ నేలబడి యున్న సోదరునిగురించి సాకేతనాథుడు – "హా లక్ష్మణా! శత్రు నిహతుడవై ధరాతలమున కొరిగితివా! అనుజా! నీవు లేకున్న ఇక నాకీ లోకము ఎందు లకు?" అని ఆర్త స్వరమున దుఃఖదీనుడై హృదయ విదారకముగా విలపించ సాగెను. జాంబవంతుడంత దాశరథిని సమీపించి – "ప్రభూ! ఈ స్వల్పము-నకై మీరిట్లు దిగులుగొని, ధైర్యము విడనాడుట కిది సమయముగాదు. లంకలో సుషేణుడను ప్రసిద్ధ వ్రణ వైద్యుడున్నాడు. తత్‌క్షణమే వానిని రప్పిం-చుటకు యత్నించవలసినది." అని సలహా యిచ్చెను.

వాయుపుత్రుడు స్వామి సమ్మతి తెలుసుకొని తత్‌క్షణమే సూక్ష్మరూపియై

లంకలోనికి పోయెను. అతడు నిమిషములో సుషేణుని వాని గృహముతో సహా తీసుకొని వచ్చి రాముని సన్నిధి నుంచెను. సుషేణుడు నతశిరస్కుడై నర పతియెదుట నిలచి - "సౌమ్యా! హిమవత్పర్వత ప్రాంతమున ద్రోణగిరికి సమీపమందున్న సంజీవి మూలికను దెచ్చినయెడల సోదరుడు సజీవుడగు"నని సూచించెను.

అంతట సీతాపతి ఆంజనేయునివంక తిరిగి - "లక్ష్యవ్రతా! ఆంజ నేయా!! శీఘ్రగామివై చని సంజీవిని సాధించుకొనివచ్చి సోదరుని సంరక్షిం- పుము-" అని యాదేశించెను. హనుమంతు డా క్షణమందే స్వామి చరణము లకు నమస్కరించి, ప్రభుకార్యోత్సాహితుడై పైకెగసెను. వాయుపుత్రుడట్లు వియన్మార్గము చేరుకొని వాయువేగ మనోవేగముతో ఉత్తరాభిముఖుడై పయనించెను.

## కాలనేమి గాథ

హనుమంతుని గమనవృత్తాంతము చారులవలన తెలుసుకొని రావణుడు ఈర్ష్యపడెను. వాడంతట దురుద్దేశపీడితుడై కాలనేమి యను రక్కసునివద్దకు వెళ్ళి పవనాత్మజుని ప్రయత్నము యెవ్విధముగానైనా భగ్నముచేయవలసినదని వానిని కోరెను. కాలనేమి రావణుని కుత్సితబుద్ధి కొకింత చింతించి ఇట్లనెను -

*"అహంకార మమతా మదత్యాగూ*
*మహామోహనిసి సోవత జాగూ,*
*కాలబ్యాల కర భచ్ఛక జోయీ*
*సపనేహు నమరకి జీతియ సోయీ?"*

"రాక్షసరాజా! రామకార్యార్థియై పోవుచున్న హనుమంతుని ప్రయత్నము నకు విఘాతము కలిగించుట అసాధ్యము. నీ వింకను మోహాంధకారముడ మునిగి యున్నావు. రావణా! కాలసర్పమును సైతము భక్షింపగల ఆ విశ్వంభ- రుని నీవు కలలో కూడా జయించలేవు. మమతాహంకారములను వర్జించి

ఇప్పటికైనా జాగరూకుడవై కండ్లు తెరచుకొనుము.''

ఎవరెంత బోధించినను మూర్ఖుని మనసు మార్చింపలేరు. లంకేశ్వరుడు కాలనేమి హితబోధనుగూడా ధిక్కరించెను. 'దుష్టునికి ఆగ్రహము కలిగించి వాని చేతిలో నేనెందుకు దుర్మరణము చెందవలెను!' అని యూహించుకొని కాలనేమి తుదకు దశాననుని ఇచ్ఛానువర్తియై, అక్కడినుండి బయలుదేరెను.

కాలనేమి మాయావి. వాడు మారుతి గమించుమార్గమందొకచోట అందమైన జలాశయము మొకటి కల్పించెను. ఆ సరోవర తీరమున చక్కని ఆశ్రమ మొకటి సృష్టించుకొని, దానిలో వాడు కుహనాముని వేషముతో ధ్యానమగ్నుడై కూర్చుండెను.

మార్గశ్రాంతుడై యున్న మారుతికి ఆశ్రమము చూడగనే అందొకింత విశ్ర- మింప బుద్ధి పొడమెను. హనువంతుడు కుహనామునిని సమీపించి - ''స్వామీ! దాహమగుచున్నది. కొంచెము జలమిప్పింపుడు'' - అని నమస్కార పూర్వకముగా అర్థించెను. దొంగసాధువు రామనామస్మరణ చేయుచూ నిమీలిత నేత్రుడై - ''ఓయీ! నీవు అంజనీ పుత్రుడవు కదా! సౌమిత్రిని జీవింపజేయుటకై సంజీవపర్వతమునకు వెళ్ళుచుంటివి. మీ రామునకు తప్పక జయము సిద్ధించును. జ్ఞానదృష్టితో నేనంతయూ గమనించగలిగితిని. మంచిది ఇదిగో, అక్కడ కనబడుచున్న కొలనుకుపోయి దాహము తీర్చుకొని శుచివై తిరిగిరమ్ము. నేను నీకు జ్ఞాన ముపదేశించెదను-'' అని పలికెను.

కాలనేమి చెప్పిన ప్రకారము ఆంజనేయుడు సరోవరము చెంతకు వెళ్లెను. అతడు కొలనులో కాలు బెట్టగనే ఒక ఆడు మొసలి అతనికాలు గట్టిగ పట్టుకొని లోని కీడ్చెను. ఆ సంఘటనకు మహావీరుడు మండిపడి ఒక్క ముష్టిఘాతముచే మకరికి మృత్యులోకము చూపించెను. ఆంజనేయుని చేతిలో అసువులు బాసిన ఆ జలచరమంతట ఒక దివ్యాంగనగా మారి మారుతికి ప్రణమిల్లి యిట్లు పలికెను -

''ఓ కపిసత్తమా! నేటికి మీ దర్శన భాగ్యముచే నాకు శాపవిమోచనము కల్గెను. మహాత్మా! పూర్వజన్మలో నేను, కాలనేమి గంధర్వులము. మే మొక ప్పుడు ఇంద్రుని సభలో గానము చేయుచూ దుర్వాసుని పరిహసించితిమి. ఆ

మహర్షి మా తుంటరితనమునకు కుపితుడై మమ్ము రాక్షసులై పుట్టుదని శపిం-
చెను. పిమ్మట మా ప్రార్థనలకు కొంచెము శాంతించి - "ఓరీ! మీరు దను-
జులై లంకలో జన్మించెదరు. త్రేతాయుగమున రామరావణులకు యుద్ధము
జరుగును. అప్పుడు సంజీవిపర్వతమును దెచ్చుటకై పోవుచుండు ఆంజనేయుని
వలన మీకు శాపవిమోచనము కలుగును-" అని సెలవిచ్చి యుండెను. ఆంజ
నేయా! ఆశ్రమములో ఋషి వేషముతో నున్నవాడే కాలనేమి జాగ్రత్త!" అని
తన పూర్వ వృత్తాంతమంతయూ తెలియజేసి గంధర్వాంగన ఆకాశమార్గమును
బట్టి తన లోకమునకు పోయెను.

హనుమంతుడపటి నుండి ఆశ్రమములో నున్న కుహనామునిని సమీపించి
- "ఓ మునీశ్వరా! ఇదిగో ముందు నా గురుదక్షిణ స్వీకరించి పిమ్మట నాకు
జ్ఞానోపదేశము చేయవలసినది -" అని పలికి, ఆ ధూర్తుని తన వాలమునకు
చుట్టి, నేలకేసి కొట్టి, ఒక్క దెబ్బకు హతమార్చెను. కాలనేమి రాముని స్మరిం-
చుచూ అతని చేతిలో ప్రాణములు వదిలెను.

## ఆంజనేయుడు సంజీవిని తీసుకొని అయోధ్య మార్గమున వచ్చుట

అనిలపుత్రు డట్లు నిరపాయుడై అచటినుండి హుటాహుటి హిమాద్రి చేరు
కొనెను. అక్కడ ద్రోణాద్రి చెంత సుషేణుడు చెప్పిన ఓషధులను వెతుకసాగెను.
ఎంత శోధించిననూ ఆ మూలిక లతని కంటబడలేదు. ఓషధులను ప్రత్య
క్షము కావలసినదిగా పవనసుతుడు ప్రార్థించినప్పటికీ ఫలితము లేకపోయెను.
వాటి జడస్వభావమునకు మహావీరుడు మండిపడి, సంజీవిపర్వతమునే సమూ-
లముగా పెకిలించి మూపున నిడుకొని బిట్టార్చి వియన్మార్గము పట్టెను.

అట్లు సంజీవిపర్వతముతో తిరిగి వచ్చుచున్న కపిసత్తముడు మార్గములో
అయోధ్యను సమీపించెను. ఆ రాత్రివేళ పై నుండి అయోధ్యను దర్శించి
నపుడు పవనసుతుడు పులకిత శరీరుడయ్యెను. అప్పుడు భరతుడు గగన
పథమున కదలిపోవుచున్న పర్వతాచ్ఛాయను కనుగొనెను.

ఓహో! ఈ నిశివేళ యెవ్వడో నిశాచరుడు పయనించుచున్నాడు. అని

భావించి భరతుడు వెంటనే ఒక బాణము గురిపెట్టి అటువైపు వదలిపెట్టెను. ఆ బాణానికి హనుమంతుడు 'హే రామా!' యని ఆక్రదించి నేల కూలెను.

రామస్మరణతో నేలబడిన రామదూతను గుర్తించి భరతుడు బాధపడెను. ఆంజనేయుని లేపుటకు పలువిధముల ప్రయత్నించి అతడు విఫల మనో-రథుడై విలపించెను.- "అన్నను అడవులకు బట్టించితిని, నేడతనికి సహాయ భూతుడగు సేవకుని సంహరించితిని. నేనెంత పాపాత్ముడను-" అని తలపోసి కైక తనయుడు దుఃఖాక్రాంతుడై గుండెలు బాదుకొని రోదించెను. తుదకు అతడు ధైర్య మవలంబించి - త్రికరణ శుద్ధిగా నేను శ్రీరాముని సేవించుచుండిన యెడల మారుతి శీఘ్రమే మూర్ఛనుండి తేరుకొనుగాక - అని ప్రతిజ్ఞ చేసెను. ఆ క్షణమే ఆంజనేయుడు రామస్మరణ చేయుచూ పైకి లేచి కూర్చుండెను.

భరతుడు పులకితగాత్రుడై కన్నుల ఆనంద బాష్పములు రాలుచుండ పవ నాత్మజుని కౌగిలించుకొని "-ఆంజనేయా! అన్న క్షేమమా! వదినెకు కుశ లమా!! తమ్ముడు సుఖముగా నున్నాడా!!!" అని ఆత్రముతో అడిగెను.

హనుమంతుడు భరతునకు, శత్రుఘ్నునకు ముప్పురు రాణులకు, వసిష్ఠు-నకు, మంత్రి ప్రముఖులకు జరిగిన సమాచారమంతయు సంక్షిప్తముగ తెలియ జేసెను. కౌసల్య కైక సుమిత్రలు, సీతారామలక్ష్మణులు విపద్గ్రస్తులై యున్నారని విని శోకార్తులై కన్నీరుమున్నీరుగా ఏడ్చిరి. శత్రుఘ్ను డాగ్రహము చెంది శర చాపములు చేబూని సోదరులకు సహాయమొనర్చుటకై సంసిద్ధుడాయెను. భర తుడు ప్రారబ్ధ కర్మగతిని గురించి విచారించెను. ఇట్లు విచారమగ్నులై దుఃఖిం-చుచున్న భరతాదులకు రామదూత ధైర్యోక్తులు పలికి, సీతారామ లక్ష్మణులు శీఘ్రకాలములోనే విజయశ్రీతో అయోధ్యకు రాగలరని ఆశ్వాసించెను.

తదుపరి భరతుడు వానర వీరునితో -"ఆంజనేయా! ఇది విలంబనకు సమయముకాదు. నీవు ప్రాతఃపూర్వమే అక్కడకు చేరుకొననియెడల ప్రయత్న మంతయు వ్యర్థమగును. నీవు పర్వత సమేతముగా నా బాణముపై కూర్చుండుము. నిముసములో లంక చేర్చెదను" అని చెప్పెను. - ఓహో! నాకంటే యితని బాణమంత వేగముగా పోగలదా - యని తనలో అనుకొని

మారుతి మందస్మితుడయ్యెను. తదుపరి వానరమూర్తి భరతాదులకు నమస్క రించి, వారివద్ద సెలవు తీసుకొని, వింగి కెగసి, రామబాణమువలె ద్రుతగతిని ప్రయాణము సాగించెను.

## రాముడు లక్ష్మణునికై విలపించుట

అక్కడ లంకలో, మూర్ఛాగతుడైయున్న సౌమిత్రి చెంత కూర్చొని రామా దులు రాత్రంతయు జాగరణ చేయుచుండిరి. శోకార్ణవమున మునిగి దుఃఖిం- చుచున్న వారి దైన్యస్థితి హృదయ విదారకముగా నుండెను.

''కపులారా! అర్ధరాత్రము గతించెను. ఇంకనూ ఆంజనేయుడు రాలేదు. మహావీరుడు మార్గముదప్పెనో! లేక మరేదైనా ప్రమాదము నెదుర్కొనెనో, తెలి యరాకున్నది.'' అని పలికి శ్రీరాముడు పొంగివచ్చెడి దుఃఖము నాపుకొనలేక భోరున యేడ్చెను. అవధేశుడు అనుజుని శరీరముపై బడి హృదయ విదారక ముగా ఇట్లు విలపించసాగెను -

*''తమ్ముడా లక్ష్మణమూర్తీ!*

*''సకహు న దుఖిత దేఖి మోహి కావ్రా*
*బంధు సదా తవ మృదుల సుభావ్రా,*
*మమ హిత లాగి తజవు పితుమాతా*
*స హితు బిపిన హిమ ఆతప బాతా,*
*జైహవు అవధ కవన ముఁహుఁ లాయీ*
*నారి హేతు ప్రియ భాయిగఁ వాయీ,*
*బరు అపజస స హతేఉ జగమాహీఁ*
*నారిహాని బిశేష ఛతి నాహీఁ.''*

''సోదరా! నీ మనస్సెంత మార్దవమైనది! నీ హృదయ మెంత సౌహార్ద మైనది! నానిమిత్తమై తల్లి దండ్రులను విడనాడితివి. నీడవలె నిరంతరము

న్ననుసరించి కానన సంచారివై నానాబాధలు నాతో పంచుకొంటివి. నాకు రవంత కష్టము కలుగుటకూడ చూడజాలని నీ బంధువ్వభావమెంత లోకోత్తరమైనది! అనుజా! నేజేసిన అపరాధమేమి? నాతో ఎందుకు మాట్లాడకున్నావు? దుస్సహమైన ఈ మౌనము చాలించి ప్రియమార అన్నాయని ఒక్కమారు పిలువుము. కటా! ఈ దుఃఖము నుండి నన్నోదార్చువారెవరు? సుతులు సతులు మిత్రులు వచ్చుచుందురు పోవుచుందురు. కానీ సోదరులు లభించుట దుష్కరముకదా! సోదర వియోగము కలుగునని తెలిసియుండిన ఈ వనములకే వచ్చియుండక, పితృ వచనములను సైతము తిరస్కరించియుందునే! లక్ష్మణా! రాముడు సతికొరకై సోదరుని పోగొట్టుకొనెను. అను లోకాపవాదము నెట్లు భరించగలను? సోదరుడు లేక నేనే ముఖముతో ఇంటికి పోగలను? తల్లులకేమని సమాధాన మివ్వగలను? అమ్మకు నీవు ప్రథమ పుత్రుడవు. ఆమె నిన్ను నా కప్పగించి యుండెను. రామా! సౌమిత్రి! యెక్కడ? - అని ప్రశ్నించు సుమిత్రతల్లికి నేనేమని చెప్పగలను! సోదరా! అన్నివిధముల నిస్సహాయుడైన నీ యన్న ఇక జీవించుట దుస్సహము!''

ఇట్లు ఆపన్నశరణ్యుడగు అవధేశుడు దుఃఖార్తుడై విలపించెను. రాముని హృదయావేదనకు వానరుల గుండెలు కరగిపోయినట్లయ్యెను. ఓ అపర్ణా! రామచంద్రుడు లీలా మానుషమూర్తి తనకు భక్తులయెడగల అపార అనురాగమును ఆతడివ్విధముగ వ్యక్తపరచెను. అటు రాత్రి గతించు కొలది ఇటు రామాదులు మరింత ఆరాటపడసాగిరి. ఇంతలో ఆంజనేయుడు సంజీవిపర్వతమును తీసుకొని రెండవ సూర్యునివలె తేజరిల్లుచూ వారి యెదుట ప్రత్యక్షమాయెను. కరుణ రసముతోవీరరసము వచ్చి కలియునట్లు హనుమంతుని ఆగమనముతో రామాదులకు దైన్యము తగ్గి ధైర్య మేర్పడెను. రఘునాథు డానంద భరితుడై ఆంజనేయుని ఆలింగనముచేసి ఆనందాశ్రువులు రాల్చెను.

తదుపరి సుషేణుడు వెంటనే విశల్య సంధాన సౌవర్ణ సంజీవికరణులనెడు నాల్గు ఓషధులను తీసుకొని లక్ష్మణునికి తాకించెను. తత్క్షణమే సౌమిత్రి నిద్రనుండి మేల్కొన్న వానివలె మూర్ఛవీడి పైకిలేచి కూర్చుండెను. రామలక్ష్మణులు పట్టరాని సంతోషముతో పరస్పరము కౌగలించుకొని ఆనందాశ్రువులు రాల్చిరి. సంజీవిపర్వతము గాలిసోకగనే యుద్ధమందు విగత ప్రాణులై

పడియుండిన వానరులందరు మరల సజీవులైరి. తదుపరి మహావీరుడు సంజీవి కొండను యథాస్థానమున చేర్చి వచ్చి, సుషేణుని స్వగృహమున వదలిపెట్టెను.

ఇవ్విధముగ సంజీవి ప్రభావమున సౌమిత్రి స్వస్థుడాయెను. విగతజీవులై యుండిన వానరులందరు పునర్జీవితులైరి. కపిసైన్యము క్రొత్తబలము పుంజుకొని పునస్సంఘటిత మయ్యెను. సుగ్రీవాధిష్ఠితమైన వానరసేన నూతనోత్సాహముతో విజృంభించి శిలారుముములతో తిరిగిలంకపై దండెత్తెను. రాక్షసేశ్వరుడంత రాటు దేరిన రాత్రించర వీరులను వారి నెదుర్కొనుటకు ముందు కురికించెను. ఆనాటినుండీ రామరావణ సేనకు అనేక దినములు హోరాహోరి పోరాటము జరిగెను. మహోగ్రహోదగ్రులై విజృంభించిన వానర సేనల ధాటికి నిశాచరులు నిలువజాలక నీల్గుచుండిరి. ధూమ్రాక్షుడు, అతికాయుడు, మకరాక్షుడు, కుంభనికుంభులు మొదలగు వీరాధివీరులు తమ తమ బలములతో ఒక్కొ-క్కరే వీర స్వర్గ మలంకరించిరి వానర దళములు వీర విహారముచేసి విజయ పరంపరల చూరగొనిరి.

## రావణుడు కుంభకర్ణుని మేల్కొలుపుట

యోధాగ్రేసరులగు రక్షోవీరులొక్కొక్కరేనిహతులగుచుండిరి. దినదినము నకు స్వబలము క్షీణించి శత్రువులు పైకొనుచుండుటజూచి దనుజేశ్వరునికి దిగులుపుట్టెను. ఈ యాపత్సమయమున అసమానబలసంపన్నుడగు కుంభకర్ణుని సహాయ మపేక్షించుటకై రావణుడు నిశ్చయించెను. అప్పుడు నిద్రావశుడైపడి యున్న తమ్ముని మేల్కొల్పుటకు దశాననుడు భటుల నియోగించెను.

తన్నిమిత్తమై నియోగింపబడిన వేలాది భృత్యులు సకల సాధన సంపన్నులై కుంభకర్ణుని శయనమందిరమునకు చనిరి. యోజనాయుత విస్తీర్ణంబగు విశాల శయన గృహాంతర్భాగమున ఆ మహాకాయుడు పర్వతమువలె పడి గురకలు బెట్టుచూ నిద్రించుచుండెను. పెనుగాలివలె నాసికా గహ్వరములనుండి వచ్చు చున్న ఉచ్ఛ్వాసనిశ్వాసముల వేగమునకు రాక్షసభటులు నిలువలేకుండిరి. అతి కష్టముతో తుదకువా రా భీమబలుని సమీపించిరి. దీర్ఘనిద్రావశుడైయున్న ఆ మహాబలుని మధ్యకాలములో నిద్రలేపుట దుస్తరము. రాక్షసభటులు కుంభ కర్ణుని పర్వత శరీరమును గుదములతో కొట్టి, గదలతో మోది, కాళ్ళతో

త్రొక్కి, శరీరముపై కెక్కి గంతులు వైచిరి. వాని చెవుల దగ్గర ఢంకాలు మ్రోగించి శంఖారావములు చేసి ఏనుగులను నడిపించిరి. వారి ప్రయత్నములన్నియు వ్యర్థమయ్యెను. తుదకు వారు ఒక మేకను తెచ్చి వాని ముక్కులోనికి తోలిరి. అప్పుడా రాక్షసుడొక తుమ్ము తుమ్మి, కాళ్ళు చేతులు ఝూడించి, ఆవులించుచూ నోరు తెరుచుకొని కాలునివలె కండ్లు తెరచి లేచి కూర్చొనెను. భటులు కుంభకర్ణుని కరాళవదనగహ్వరము విచ్చుకొనుట జూచి వెరగంది పారి పోయిరి.

అంతట దశాననుడు ముందుకు వచ్చి అంతకుమునుపే సిద్ధముగా ఉంచిన మాంసరాసులు, మద్యఘటములు, నెత్తుటి బానలు తమ్మునినోటబోయించెను. మద్యమాంసములచే పరితృప్తుడై త్రేంపుచూ కుంభకర్ణుడు దశాననుని వైపు దృష్టి మరల్చి - "అన్నయ్యా అసురేశా! నన్నీ అకాలమున నిద్రనుండి లేపుటకు కారణమేమి? నీ పెందుల కట్లు విచారగ్రస్తుడవై కృశించుచున్నావు?" అని ప్రశ్నించెను.

దశగ్రీవుడు తమ్మునికి జరిగిన వృత్తాంతమంతయుచూ శ్రుతపరచి - "సోదరా! రణధీరా! యేమని చెప్పను? నరవానరులు విజృంభించి నిశాచర నగరమును నానా బీభత్సము చేయుచున్నారు. దుర్ముఖ - దేవశత్రు - అతికాయ - అకంపన - మహోదరాది మన వీరవరులను వానరులు పొట్టబెట్టుకొనిరి. మహాకాయుడా! నీ వీర్య ధైర్యంబులు ప్రదర్శించి దానవ వంశమును రక్షించుటకు సమయ మాసన్నమైనది." అని ప్రబోధించెను.

సోదరుని వచనములకు ఇనుమంత విచారము ప్రకటించి కుంభకర్ణు డిట్లు బదులు పలికెను -

"అన్నయ్యా! జగజ్జనని జానకిని హరించి నారాయణుని నరునిగా, మహావీరుని మర్కటమాత్రునిగా భావించుచున్న నీ మందబుద్ధిని నే నేమని ప్రశంసించగలను? ఇంతకూ కారణజన్ములైన సీతారామ లక్ష్మణులతో కలహించి కొంపకు కొరివి బెట్టుకొంటివి. అగ్రజా! జరిగినదేదో ఇప్పటికే జరిగిపోయినది. ఇక గడచిన దానికి వగచి లాభము లేదు. కానీ-ఒక్క విషయమై నా మనస్సెందుకో మరింత బాధపడుచున్నది. అది యేమన - లంకేశ్వరా! ఇంత

కాలము బ్రతికినను నీవు శత్రువుల నెట్లు సాధింపవలెనో మిత్రులతో మైత్రి నెట్లు నెరపవలెనో ఇంకనూ తెలుసుకొనలేనందుకు విచారించుచున్నాను. లేకున్న ఆనాడే, రామలక్ష్మణులు అడవులలో నిస్సహాయులై తిరుగుచున్నపుడే వారి నేల సంహరించక ఉపేక్షించితివి? స్నేహితుడగు వాలి సహాయము నీ వానాడే అపేక్షించి యుండిన శత్రువుకు సహాయము తగ్గి యుండును కదా! అదియునుగాక, శూర్పణఖ వచ్చి నీతో మొరపెట్టుకున్నానాడైనా శత్రు నిశ్శేషమునకై నీవు ప్రయత్నించి యుండిన కార్యమెంత సులభముగా సాధింపబడియుండునో విచారించితివా! అదట్లుండ, రక్షోపురిరక్షణార్థమై నీవేమి శ్రద్ధ తీసుకొంటివి! లంక కుత్తరభాగమున సముద్రతీరమందొక దుర్గము కట్టియుండిన యెడల యెంత కట్టుదిట్టముగా నుండెడిది! పగవాడు పారావారముపై బాటలు వేయుకొని నిర్భయముగా వచ్చియుండుటకు వీలు చిక్కియుండునా!

దనుజాధిపా! పరువు మర్యాదలు విడనాడి పౌరుష హీనుడవై పరస్త్రీని హరించుటయందు నీవు చూపెట్టిన నేర్పు శాత్రవు నెదిరించుటలో ప్రదర్శించజాలక పొరబడితివి. రావణా! ఇక గతజలసేతు బంధనమునకై విచారించుటవలన ప్రయోజనము శూన్యము. దైవ నిర్ణయము తప్పింపరానిది. భూభార నివారణార్థమై భగవంతుడు భూలోకములో అవతరించుచున్నాడు-అని నారదు డానాడే నాతో చెప్పియుండెను. నిద్రాగతప్రాణుడగు నేను ఈ సంగతి నీతో చెప్పుటకే మరచితివి.''

ఇట్లనేక విధముల ప్రసంగించి కుంభకర్ణుడు అన్నయ్య చేతగానితనమునకు నొచ్చుకొనెను. పిమ్మట నతడు తన ఆలోచన లన్నింటినీ కట్టిపెట్టి, తత్కాలమున తనవలన జరుగవలసిన కర్తవ్యము మనస్సుకు రాగా, తటాలున పైకిలేచి అగ్రజునివైపు మరలి ఇట్లు ప్రతిజ్ఞా పూర్వకముగా పలికెను -

''లంకేశ్వరా! ఇదిగో నీ యాజ్ఞ. బొదలదాల్చి ఇప్పుడే నేను సర్వసన్నద్ధుడనై యుద్ధరంగమునకు పోవుచున్నాను. రామునితో యుద్ధము కాబట్టి జయాపజయములు రెండునూ నాకు గౌరవభాజనములే. అన్నయ్యా! శాత్రవ సంహారమునకై వెళ్ళుచుంటిని. నన్నొకమారు కౌగలించుకొని వీడ్కోలు చెప్పు.'' అని పలికి కుంభకర్ణుడు తుదిసారిగా రావణుని కౌగలించుకొని అక్కడనుండి సెలవు తీసుకొనెను.

# కుంభకర్ణుని యుద్ధము

తదనంతర మా భీమబలుడు బండ్లతో మాంసము, కుండలతో మద్యము తెప్పించి తనివితీర సేవించెను. ఆ మహాకాయుడు శాత్రవ భయంకరమైన తన శరీరమును పెద్దజేసి, రోషోదగ్రుడై కన్నులెఱ్ఱజేసి, నాలుక చాచి నాట్యము చేయుచూ కాలాంతకుడై కదనరంగమునకు కదలెను. అసంఖ్యాకరాక్షస సైన్యము సర్వసన్నద్ధమై వాని ననుసరించెను.

కుంభకర్ణుడు యుద్ధమునకు వచ్చుచున్నాడని విభీషణునికి తెలిసెను. అత డన్నకు ఎదురేగి పాదములపై బడి నమస్కారముచేసి - "అన్నా కుంభకర్ణా! అసురేశుడు అహంకృతుడై నన్ను తిరస్కరించి కాలదన్నెను. నేను సాకేతధాముని శరణుజొచ్చి సుఖముగా నున్నాను." అని తెలియజేసుకొనెను. కుంభకర్ణుడు తమ్ముని పైకి లేవనెత్తి ప్రేమతో - "విభీషణా! చింతించకుము, అగ్రజుడు కాలవశుడై హితాహితములు గుర్తించనేరక గర్వోద్ధతుడై యున్నాడు. నీవు విజ్ఞ-తతో రాఘవునికి ఆశ్రయించుట రాక్షసజాతికి మేలయ్యెను. విభీషణా! నిర్వి-చారుడవై శ్రీరాముని సేవించుము. నేను మాత్రము సమరాంగణమున సాకేత నాథుని సంధించెదను." అని పలికి తమ్ముని పంపించి వేసెను.

విభీషణుడు వెళ్ళగానే కుంభకర్ణుడు భూమి దద్దరిల్లునటుల ఒక తన్ను తన్ని రణగర్జన చేసెను. రఘుపతి విభీషణునివలన కుంభకర్ణుని చరిత్ర, వాని బలవీర్య ధైర్యపరాక్రమములాదిగా సవివరముగా తెలుసుకొనెను. పిమ్మట రఘూద్వహుడు కాకలుతీరిన కపివీరులతో సైన్యము సమాయత్తముచేసి దానవుని యెదుర్కొనుటకు నియోగించెను.

లోకభీకరుడగు రక్షోవీరుడు ఘనగర్జన చేయుచూ గదాహస్తుడై వైరి దళము నెదుర్కొనెను. వనచరులు శైలశృంగ తరు సమూహములను వానిపై వర్షింప జేసిరి. అవి వానికి మదగజముమీద నూవుగింజలు చల్లినట్లుండెను. కుంభ కర్ణుడు క్రోధసమావిష్టుడై నిప్పులు గ్రక్కుచూ విజృంభించి యెదుట బడిన కపిపుంగవులను గదాఘాతములచే ఇచ్చవచ్చినట్లు మర్దించసాగెను. కొందరిని చేతులతో నలిపివేసెను. మరికొందరిని క్రిందవేసి కాళ్ళతో త్రొక్కెను. నోటితో కొందరిని చప్పరించి మ్రింగివేసెను. మోకాళ్ళతో మోచేతులతో పిడికిళ్లతో

మోదుతూ వందల వందల వానరవీరులను కుప్పలు కుప్పలుగా కూల్చెను. దండధరునివలె ఉద్దండుడై విజృంభించిన ఆ భీకరాకారుని ఎదుర్కొనజాలక వనచర భల్లూకదళములు వెన్నిచ్చి పరుగులెత్తెను. సుగ్రీవ అంగద నలనీల హనుమంతాది యోధాగ్రేసరులు చెదరిపోవుచున్న సేనను తిరిగి కూడగట్టుకొని ద్విగుణీకృతోత్సాహులై మరల దనుజ వీరుని తాకిరి. రావణానుజుడు మహోదగ్రుడై బిట్టార్చి గదను త్రిప్పుచూ కపిసేనపై బడెను. కాసారము జొచ్చిన గజ రాజు వలె నిశాచరవీరుడు వైరి వీథుల వీరవిహారముచేసి శాత్రవ భయంకరుడై తేజరిల్లెను.

దనుజు డిట్లు దుర్వారుడై పరాక్రమించి తన వారిని దళించుట గమనించి, మహావీరుడు మహోగ్రుడై బిట్టార్చి కుంభకర్ణుని శరీరముపైకి దూకెను. మర్కటవీరుడు పిడికిటితో వాని వక్షస్థలమును తీవ్రముగా కొట్టి క్రిందపడవేసెను. క్రిందపడిన కుంభకర్ణుడు జివ్వున పైకిలేచి కుపితుడై ఒక్క ప్రతిఘాతముచే మహావీరుని మూర్ఛాగతుడగునట్లు చేసెను. పిమ్మట వాడు ప్రళయ రుద్రునివలె ప్రకోపించి ప్లవంగ ప్రముఖులగు సుగ్రీవ అంగద నలనీలురపై కురికి ఒక్కొక్కరినే ప్రహరించి సమర భూమిపై సొమ్మసిలజేసెను. చండప్రచండుడై చమూపతులను చితుకగొట్టి, వైరివ్యూహమును చిందరవందరచేసి, మార్తాండుడై మంటలు గ్రక్కుచున్న కుంభకర్ణుని ధాటికి నిలువలేక కపిసేన కకావికలై దిక్కులుపట్టెను.

అంతట కుంభకర్ణుడు సంగరక్షోణిని సంజ్ఞాహీనుడై పడియున్న కపిరాజు సుగ్రీవుని చంకబెట్టుకొని లంకాభిముఖుడై చనెను. అట్లు బంధితుడై కొంపోబడుచున్న సుగ్రీవునికి, దారిలో మూర్ఛవీడెను. చటుక్కున ముష్కరుని ముక్కు చెవులు కొరికి, వాని చంకనుండి జారుకొని సుగ్రీవుడు పైకెగసెను. అట్లు పట్టు తప్పించుకొని పైకెగిరిన సుగ్రీవుని కాళ్ళు రెండు పట్టుకొని కుంభకర్ణుడు వానరవీరుని గిరగిర త్రిప్పి నేలకేసి కొట్టెను. సుగ్రీవుడు స్ఫూర్తిమంతుడై రివ్వున పైకెగిరి తన వారిని వచ్చి కలుసుకొనెను.

ప్లవంగవీరుడు పట్టు దప్పించుకొని తనను పరాభవించి పోయినందులకు కుంభకర్ణుడు కోపోద్రిక్తుడై రొప్పుచూ మరల యుద్ధభూమికి మరలెను.

అప్పటి వాని ఉగ్రహము వర్ణింప శక్యము గాదు -

"కుంభ్ కరన రనరంగ విరుద్ధా
సనముఖ చలా కాల జను క్రుద్ధా,
కోటికోటి కపి ధరి ధరి ఖాయీ
జను టీడీగిరి గుహాఁ సమాయీ,"

కుంభకర్ణుడు క్రోధదుర్నిరీక్ష్యుడై కాలుని వగిది కపి సైన్యముపై బడెను. కంటబడిన వానరులను ఒడిసిపట్టి నోటవైచుకొని నములసాగెను. కొండ గుహలోబడు మిడుతల దండువలె కోటానుకోట్ల వానరులు వాని వదనగహ్వ-రమున బడి కడుపులోనికి పోవుచుండిరి. ముక్కు చెవులు ఛేదింప బడుటచే రక్తసిక్తాంగుడై ఉగ్రరూపము దాల్చిన ఆ లోక భయంకరుని దార్కొను ధైర్య సాహసములు లేక భల్లూక వానరవములు భయాక్రాంతులై పరుగులెత్తిరి. ఇంతలో లంకనుండి మరికొంత రాక్షసిదండు వచ్చి రక్షోవీరునకు తోడ్పడెను.

వైరి బలము విజృంభించి స్వబలము సన్నగిల్లుట శ్రీరాముడు గమనింప గలిగెను. శీఘ్రమే శ్రీపతి సుగ్రీవాంగద హనుమంతులను చెదరిపోవుచున్న స్వ-బలమును సమీకరించుడని హెచ్చరించి, కోదండపాణియై కదనరంగమున కురికి స్వయముగ సురవైరి నెదుర్కొనెను. కోసలవీరుడు క్రోధోద్దీపితుడై శత్రు మూకలపై పుంఖానుపుంఖములుగా బాణజాలము గుప్పించెను. రామధనుర్ముక్త ఘోర నారాచములు పక్షములున్న సర్పములవలె బుసలు కొట్టుచూ వైరి వ్యూ-హముల దాకుచుండెను. ఆ శరపరంపరాహతికి శాత్రవ సైన్యము వెరగంది వెను-కకు తగ్గెను. శరధారలకు రాక్షసుల శరీరములు ఖండఖండములై తెగిపడెను. లక్షలక్షల రక్షోవీరులు ఎక్కడి వా రక్కడ క్షత నిహతులై భూమిపై దొర్లాడిరి. అప్రతిహతములగు రామబాణములు శత్రుసంహారముచేసి తిరిగి వచ్చి ప్రభువు అంబులపొది చేరుచుండెను. క్షణకాలములో రణక్షోణి శత్రునిశ్శేషమయ్యెను.

కుంభకర్ణుడంతట కుపితుడై కన్నుల నిప్పులు రాల్చుచూ ఒక మహాపర్వ తమును పెకలించి తెచ్చి మర్కటసమూహము పైకి విసరెను. రఘువీరుడు మార్గమందే దానిని బాణములచే చూర్ణమగునట్లు పగులగొట్టెను. తదుపరి

తీవ్ర శరపరంపరలు గుప్పించి నిశాచరుని ముంచి వేసెను. మేఘములలో మెరుపులు లీనమగునట్లు కాటుక కొండవంటి కుంభకర్ణుని శరీరములో రామ బాణములు దూరిపోవుచుండెను. అసురుని ఆపాదమస్తకము రక్తధారలు గట్టెను. శరధాటికి తాళలేక కుంభకర్ణుని శక్తి క్షీణించి విపద్గ్రస్తుడయ్యెనని యూహించి కపులు వానిని పట్టుకొనుటకు ప్రయత్నించిరి. అట్లు తనను సమీపించిన రామునిసైనికుల వాడు ఒక్క హుంకారముతో కాలరాచి వికటాట్టహాసము చేసెను. దుర్దమనీయుడగు దనుజుని దర్పమును జూచి దాశరథి రోషావేశుడై శతసాయకములు ప్రయోగించి వాని కాయమును ఛిన్నఛిన్నమగునట్లు చేసెను. వాడా నొప్పికి రొప్పుచూ ఒక కొండను యెత్తుకొని దానిని రామునిపై విసర బోయెను. రాఘవుడా క్షణమునందే రెండు బాణములతో వాని భుజదండములు తెగగొట్టెను. పక్షహీనమగు పర్వతమా యున్నట్లు ఆ భీకర రాక్షసుడు బాహుద్వయము ఖండింపబడినందుకు బొబ్బలిడుచూ క్రోధోన్మత్తుడై నోరు తెరచుకొని రాముని మ్రింగివేయుటకు ముందుకురికెను. అప్పటి వాని రౌద్రాకృతి గురించి దేవతలు దిగులొందిరి. కోదండపాణి చలించక నిశ్చలుడై పదులు పదులు బాణములు గుప్పించి వాని నోరు నింపివేసెను. వాడు అప్పటికినీ వెనుకంజ వేయక వికటాట్టహాసము చేయుచూ రామునిమీదికే దూకెను. భానుకుల ప్రదీప్తుడు అసురుని అఘాయిత్యమునకు అత్యంతోగ్రుడై ఖరతర సాయకములు ప్రయోగించి కుంభకర్ణుని శిరము తెగవేసెను. వాని తల యెగిరి లంకలోనున్న రావణుని యెదుటబడెను. వాని మొండెము మాత్రము తన పద ఘట్టనలతో భూమిని దద్దరిలజేయుచూ రఘుపతిమీదికే వచ్చుచుండెను. కాకుత్స్థ వీరుడు కుపితుడై నిముసములో ఆ మొండెమును రెండు ఖండములగునట్లు ఖండించి వైచెను. రెండు కొండలు నేల బడునట్లు వాని శరీర భాగములు భూమిపై వ్రాలెను. అసంఖ్యాకులగు వానర వీరులు ఆ మహాకాయము క్రిందపడి నలిగి నీల్గిరి. విగతజీవుడగు కుంభకర్ణుని తేజస్సు శ్రీరాముని చేరుకొనెను. ఆ దుష్టుని తుదముట్టించినందుకు దివినున్న దేవతలు హర్షితులై శ్రీరామునిపై పుష్పవర్షము కురిపించిరి. "రామచంద్రా! యథా శీఘ్రము దుష్టులను సంహరింపుము!" అని నారదుడు సంతోషముతో పైనుండి కేకవేసెను.

సమరాంగణమున కపి సేనమధ్య రక్తాంగుడై నిలబడియున్న శ్రీ కోదండ రాముని గోస్వామి తులసీదాసు ఇట్లు స్తుతించెను -

"సంగ్రామ భూమి బిరాజ రఘుపతి
అతుల బల కోసల ధనీ
శ్రమ బిందు ముఖ రాజీవలోచన
అరున తన సోనిత కనీ
భుజ జుగల ఫేరత శర శరాసన
భాలు కపి చహుం దిసి బనే,
కహ దాస తులసీ కహి న సక
ఛబి శేష జేహి ఆనన ఘనే."

"ఓ శర్వాణీ! అధమాధములగు అసురులకు సైతము వైకుంఠమును ప్రసాదించిన ఆ ప్రభువును సంస్మరించని వారి జన్మ మెందులకు!" అని ఆ సందర్భమున సదాశివుడు పలికెను.

## ఇంద్రజిత్తు రెండవ యుద్ధము

నాటి సాయంసమయమునకు ఉభయ సైన్యములు పోరు విరమించి స్వశిబిరములకు చేరుకొనిరి. ఇక్కడ వానర స్కంధావారమున ఉత్సాహ మతిశయించగా అక్కడ లంకలో దుఃఖ శోకములు వ్యాపించెను.

రావణుడు కుంభకర్ణుని ఖండితశిరము హృదయమున జేర్చి శోక వ్యాకులితుడై - "హా దేవాంతకా! వీరాధివీరా! సోదరా! విగతజీవుడవైతివా!" యని దీనాతిదీనుడై రోదించెను. కుంభకర్ణుని బలవీర పరాక్రమములు పేర్కొనుచూ అంతఃపుర స్త్రీలు గుండెలు బాదుకొని విలపించసాగిరి. రావణుడట్లు సబాంధవముగా శోకసాగరమున మునిగి దురపిల్లుచున్న సందర్భమున మేఘనాదు డచటికి వచ్చి తండ్రి నిట్లు ధైర్యోక్తుల ఊరడించెను -

"పితాజీ! నీ పుత్రుడగు ఈ మేఘనాదుడు ప్రాణములతో నుండగా మీ కీ దిగులెందుకు? నేను ఇష్టదైవమువలన అమోఘ శక్తిని, మాయా రథమును బడసిన వరప్రసాదిని. రేపే రణ రంగమున నా శక్తి స్థైర్యములు ప్రదర్శించి, శాత్రవుల పొగరణచి,నరవానరుల రక్తము ద్రాగి, నీకు సంతోషము కూర్తును."

మరుదినము సూర్యోదయానంతర మా సుర్వైరి సకలాయుధ సన్నద్ధుడై మాయారథ మారోహించి యుద్ధభూమికి చనెను.

"గిరిజా! మేఘనాదుడు దృశ్యాదృశ్య యుద్ధవిద్యానిపుణుడు. మాయావి, మహాస్త్ర సంపన్నుడు. వాడు పుట్టినపుడు మేఘమువలె గర్జించినందున మేఘనాదుడని పేరు వచ్చెను. యుద్ధములో ఇంద్రుని ఓడించి బంధించినందున వీడు ఇంద్రజిత్తను పేరుతో ప్రఖ్యాతి బడసెను. ఇరువదేండ్ల ప్రాయమందున్నపుడే వాడు ఘోర తపమాచరించి దేవివలన మాయారథమును బడసెను. ఆ రథ మారోహించినవానికి ఆహవమున అపజయము కలుగదు. అయితే, ద్వాదశ వర్షములు ఎవడు స్త్రీ సుఖము, నిద్రాహారములు లేక యుండునో వానితో యుద్ధము చేయవలదని దేవి హెచ్చరించియుండెను. మరొకప్పుడు వీడు ఇంద్రుని బంధించి లంకకు తెచ్చెను. ఆ సమయమున చతురాస్యుడు రావణికి "శక్తి"ని ప్రసాదించి దేవేంద్రుని విడిపించుకొని పోయెను. ఆ శక్తి ప్రయోగమునకు గురి అయినవాడు ఒకరాత్రి ఉపచార క్రియలు లేకుండిన యెడల మరణించ గలడు.

ఇంకొకప్పుడు రావణ తనయుడు విజిగీషతో నాగలోకముపై బడి పన్నాలుగు దినములు ఘోరయుద్ధము చేసి నాగరాజు వాసుకిని బంధించెను. తదుపరి నాగరాజు తన కూతురు సులోచనను ఇంద్రజిత్తు కిచ్చి బంధ విముక్తుడయ్యెను. ఇతని భార్య సులోచన మహాపతివ్రత." అని మేఘనాదుని పూర్వ వృత్తాంతమంతయూ శంకరుడు శాంకరికి విశదీకరించి చెప్పెను.

# మేఘనాదుడు మాయాసీతను తెగటార్చుట

ఇంద్రజిత్తు జిత్తులమారి. వాడు రాముని సేనతో పోరాడుచున్నపుడు ఒక మాయా సీతను సృష్టించెను. ఆ కల్పిత సీతను ఆంజనేయునికి చూపించి - "హనుమంతా! ఏ సీతా నిమిత్తమై మీ రీ యుద్ధము చేయుచుంటిరో ఆమెను పట్టి తెచ్చి ఇదిగో మీ యెదుటనే వధించుచున్నాను." అని పలికి ముష్కరుడా మాయా సీత కుత్తుక గోసి అందరు చూచుచుండ రథమునుండి క్రిందికి త్రోసెను. వానరులా భీకరదృశ్యమును గాంచి హత చేష్టులై నిలబడి పోయిరి. హనుమంతుడంత ఆగ్రహోదగ్రుడై "వానరులారా! చూచుచుంటి రేమి! వైరి దళములను వధించి ముక్కముక్కలు జేయు"దని హెచ్చరించి, వాయుసూనుడు వాలము త్రిప్పి సింహగర్జనచేసి విజృంభించెను. కపులా హెచ్చరికతో తరు పాషాణపర్వతములు చేబూని విజయమో లేక వీరస్వర్గమో యన్న భావముతో ప్రాణములకు తెగించి పిశితాశనులపై దూకిరి. క్రోధోన్మత్తులై ఆక్రోశించుచూ పిడుగులవలె మీదబడిన వానరభల్లూకముల తాకిడికి దానవ బలము ధృతిచెడి భయాక్రాంతమై పరుగు లంకించెను. తన సైన్యమట్లు త్రుటిలో తిరోగమనము చేసినందుకు వగచుచూ ఇంద్రజిత్తు వివశుడై వెనుకకు మరలి ఇంటి దారి పట్టెను.

తదనంతరము వానర యోధులను వెంటబెట్టుకొని వాయుసూనుడు జానకీపతి చెంతకు వచ్చి వ్యధిత హృదయుడై - "ప్రభూ! దనుజాధముడు వైదేహిని బంధించి యుద్ధభూమికి కొని తెచ్చెను. ముష్కరుడా మహాతల్లి కుత్తుకను మా యెదుట ఖండించెను -" అని చెప్పి గొల్లున యేడ్చెను.

ఈ దుర్వార్త చెవులబడగనే శ్రీరాముడు దిగ్భ్రాంతి జెంది - "అయ్యో లక్ష్మణా! సీతకు దిక్కులేని చావు సంఘటిల్లెనా! నే నీ దారుణమైన బాధ ఎట్లు సహింతును!" అని దురపిల్లుచూ మూర్ఛితుడై నేలబడెను.

మైథిలి మరణించెనని శోక సంతప్తుడై యున్న సాకేతపతి వద్దకు విభీషణుడు వచ్చి సత్యము స్పష్టము చేసెను.

"సర్వజ్ఞా! ఇంద్రజిత్తు మహామాయావి. మిమ్ము వంచించుటకై వాడు

మాయా సీతను కల్పించి కత్తి కెరజేసి యుండును. నా మాటలపై మీకు నమ్మకము లేకున్న మహావీరుని లంకకు పంపినయెడల నిముసములో విజము తెలుసుకోనగలరు.''

విభీషణుని సమ్మతిప్రకారము హనుమంతుడు ప్రచ్ఛన్న రూపముతో లంకకు పోయివచ్చి, - స్వామీ! జగదంబ క్షేమముగా నున్నది - అని తెలియ జేసెను. ఈ శుభవార్తకు రామాదులు సంతోషముజెంది నిశ్చింతులైరి.

## రామలక్ష్మణులు నాగపాశబద్ధులగుట

యుద్ధభూమినుండి గృహోన్ముఖుడై చనుచున్న రావణపుత్రుడు తాను కల్పించిన సీతావధ నాటకముయొక్క రహస్యము శత్రువులకు అవగతమయ్యెనని తెలుసుకొని ఖేదపడెను. ఆ క్షణమే వాడు క్రోధ వ్యగ్రాంతరంగుడై ధరణీతల-ముపై నరవానరులను నిశ్శేష మొనర్తును - అని శపథము చేసి రథము త్రిప్పించి రణభూమికి మరలెను.

వానరులు సర్వ సన్నాహముతో మోహరించి వాని నెదుర్కొనిరి. మేఘ నాదుడు మాయారథ మారోహించి అంతరిక్షమున కెగసి అంతర్హితుడై మెరు-పుయుద్ధము చేయసాగెను. మఘ కార్తిలో జడివాన పడునట్లు బాణవర్షము ధరా తలము కప్పివేసెను. పరిఘ శూల శక్తితోమర గదాద్యాయుధములు నలుదెసల నుండి వచ్చి పిడుగులు పడినట్లు ప్లవంగసేనపై బడుచుండెను. స్వల్ప సమయములోనే చూచుచుండగా లోయలు గుంటలు పర్వతములు గుహలు ధరా తలమంతయు దనుజుని బాణములతో కప్పబడి పోయెను.

వానరవీరులు పాషాణ తరు శైలాగ్రములతో పైకెగసి అక్కడ అదృశ్యుడై యున్న శత్రువును గానక మరలా భూమి మీదికి దిగి వచ్చుచుండిరి. బ్రహ్మాది వరబలోద్ధతుడు, మాయాయుద్ధవిశారదుడు, నైన వాని యుద్ధమర్మము భేదించజాలక వానర యోధులు క్రియాశూన్యులై యుండుట గమనించి రామ లక్ష్మణులు శరచాపములు చేబూని రణభూమికి వచ్చి నిలబడిరి. ఇంతలో ఇంద్రజిత్తు విశిత సాయకములు గుప్పించి నల నీల అంగద హనుమంతులను గాటముగా నాటవేసెను. విభీషణ సుగ్రీవులు శరవిద్ధాంగులై బలముడిగిరి.

రావణి ఇట్లు పరాక్రమించి ప్లవంగ సేనను క్షతవిక్షత మగునట్లు ప్రహరించిన పిమ్మట, ఉగ్రుడై కున్నల నిప్పులు గ్రక్కుచూ రామలక్ష్మణులను గురిచేసి నాగాస్త్రము ప్రయోగించెను. ఓగరుడజీ! యుద్ధమును గౌరవించుటకై సర్వశక్తిమంతుడగు శ్రీవిహనమూర్తి నాగపాశమునకు బద్ధుడై నేలకొరిగెను.

లోక భయంకరుడగు దేవాంతకుడట్లు పరాక్రమించి వైరి బలమును వీర్వీర్యమొనరించి, సింహనాదముచేసి - "ఓరీ నరవానరులారా! ఇప్పుడు మీ బల పరాక్రమము లేమయ్యెను? మీ శక్తి సామర్థ్యములు ప్రదర్శింపరేల?" - అని పలుకుచూ ప్రత్యక్షమయ్యెను. అప్పుడు ఎక్కడనో మూల నున్న జాంబవంతుడు అగ్రహోపేతుడై మండిపడి - "ఓరీ జిత్తులమారీ! ఇప్పుడుగదా నా చేతి కందితివి!" అని గర్జించి పాలికేక పెట్టి వానిపైకి ఉరికెను.

"ఓరీ వృద్ధవానరా! ముసలివాడవని భావించి నిన్ను వదలి పెట్టితినికానీ నాకు నీవొక లెక్కలోనివాడవా! ఇదిగో నీభాగము పుచ్చుకొనుము." అని సమాధానమిచ్చి రావణి జాంబవంతునిపై శూలము ప్రయోగించెను. వానర వీరుడా శూలమును మధ్యలోనే ఎగిరి పట్టుకొని దానినే మేఘనాదుని హృదయమునకు తగులునట్లు విసరికొట్టెను. దేవాంతకుడా శూలాహతికి గిరగిర తిరిగి సంజ్ఞాశూన్యుడై నేలపడెను. అట్లు క్రిందపడిన దానవుని కాళ్ళు రెండు పట్టుకొని జాంబవంతుడు లంకలో బడునట్లు వానిని విసరి కొట్టెను.

ఇక్కడ రామలక్ష్మణులు నాగపాశములచే ధరాగతులై యుండిరి. కపులు వారి చుట్టూ జేరి దిక్కుతోచక దుఃఖించసాగిరి. ఈ విపత్తునుండి ప్రభువులను కాపాడుకొనుటకు మార్గము గానక వానరులు తహతహపడిరి. ఇంతలో నారద ప్రేషితుడై గరుత్మంతుడు రణభూమిపై పడియున్న రామలక్ష్మణుల యొద్దకు శీఘ్రగామియై వచ్చెను. ఆ నాగాంతకుని వాడు పోకచే సర్పములు వాటంతటవే వీడబొచ్చెను. పక్షీంద్రుడు శేషించిన పన్నగ సమూహమును భక్షించి ప్రభువునకు ప్రదక్షిణాపూర్వకముగ నమస్కరించి వెళ్ళిపోయెను. నాగబంధములు వీడుటతోనే రామలక్ష్మణులు నిద్రనుండి మేల్కొన్న వారివలె యథాపూర్వ తేజోవిరాజితులై పైకి లేచి కూర్చొనిరి. రాజపుత్రులు బంధవిముక్తులైనందుకు శాఖాచరులు సంతోషముతో గంతులు వేసి జయధ్వానము చేసిరి.

# లక్ష్మణునిచే మేఘనాదుడు వధింపబడుట

అచ్చట లంకలోనికి విసరివేయబడిన రావణపుత్రుడు కొంత తడవుకు మూర్ఛనుండి తేరుకొని ఇట్లు విచారించెను. - "నేను శత్రు సంహారము చేతునని తండ్రియెదుట ప్రతిజ్ఞచేసి యుంటిని. నా ప్రతిన పూర్తిగాకనే నాయ-నకు ముఖమెట్లు చూపింపగలను!" అని చింతించి వాడు అక్కడనుండి నికుంభిలావనమునకు పోయి అచ్చట అజయయజ్ఞము చేయుటకు పూను కొనెను.

ఈ సంగతి విభీషణుడు చారులవలన తెలుసుకొనెను. రావణానుజు డంత రాముని చెంతకు వచ్చి - "రఘురాయా! దేవఘాతకుడగు ఇంద్రజిత్తు నికుంభిలా వనములో యజ్ఞము చేయ తలపెట్టినాడు. ఆ యజ్ఞము నిర్విఘ్న ముగా పూర్తియైన యెడల వానిని నిర్జించుట అసాధ్యమగును." అని విన్న వించెను.

సత్వరమే సాకేతపతి అంగద హనుమంతాది వీరులను రావించి వారితో "శూరయోధులారా! మీరు విలంబనముచేయక సౌమిత్రీ సమేతులై పోయి ఇంద్ర జిత్తు తలపెట్టిన హోమమును ధ్వంసముచేసి రావలసినది. లక్ష్మణా! నీవు ఆ దేవఘాతకుని ఎవ్విధముగానైనా తుదముట్టించి దేవతలకు సంతోషము కలిగిం-పుము." అని ఆజ్ఞాపించెను. లక్ష్మణుడంతట అన్నకు పాదాభివందనము చేసి "అగ్రజా! దేవానందకరముగా నేడా సురవైరికి పరలోకము ప్రసాదించినగాని మరలిరాను." అని ప్రతిజ్ఞాపూర్వకముగ పలికి, లక్ష్మణుడు ప్లవంగప్రముఖులను వెంటబెట్టుకొని లంక జొచ్చెను.

అప్పటికే మేఘనాదుడు నికుంభిలావనమందు నిష్ఠాగరిష్ఠుడై మహిష మాంస రుధిరములతో యజ్ఞము చేయుచుండెను. వానరులు విక్రమించి వాని యజ్ఞవేదికపై విరుచుకపడిరి. వారు హోమగుండమును తత్ద్రవ్యరాశిని చిందర వందర చేసి, రావణి చెవులు పట్టుకొని ఆసనమునుండి ఈవలకు బర బర ఈడ్చిరి. దానవుడంత తన దీక్షను వదలిపెట్టి ఆగ్రహోదగ్రుడై త్రిశూలము త్రిప్పుచూ వానరులపై విజృంభించెను. వాడు రోషదర్పాన్వితుడై కిలారవము

చేసి కపివీరులను ఒక్కొక్కరినే శూలములకు గురిచేసి సంజ్ఞా హీనులగునట్లు గావించెను.

కపి యోధులట్లు దానవ వీరునిచే ధర్షితులై ధరాగతులగుట గమనించి లక్ష్మణుడు ముందుకువచ్చి మృత్యుసన్నిభ శిలీముఖములను ముష్కరునిపై గురిపించెను. వజ్రపాతమువలె వచ్చి పడుచున్న సౌమిత్రి బాణవృష్టికి వెరగంది వాడు అంతరిక్షమున కెగసి అదృశ్యుడై అవధకుమారుని నొప్పించసాగెను. ఒకసారి కనపడి మరొకసారి కనపడక వివిధరీతుల వర్తించుచూ మెరుపుయుద్ధము చేయుచున్న మేఘనాదుని ఏమి చేయుటకు దిక్కుతోచక కపులు వివశులై చూచుచూ ఉండిరి. అంతకంతకు అసురుని ఆర్భాటము ఎక్కువయ్యెను. దశ దిశల నుండి వచ్చి పడుచున్న బాణ శూల పర్వతపాతమును గాంచి లక్ష్మణు డొకింత ఉక్కిరిబిక్కిరయ్యెను. తదనంతర మాతడు ఇక ఈదుష్టునితో క్రీడించిన లాభములేదని గ్రహించి వ్యసన రోష కషాయిత నేత్రుడై ఒక మహాస్త్రమును సంధించి, శ్రీపతిని మనమున స్మరించి, ఆకర్ణాంతము లాగి దేవ ఘాతకునిపైకి గురిచూచి వదలిపెట్టెను. ఆ యస్త్రప్రహతికి అసురవీరుడు ఆక్రందించి - ''హా! రాముడెక్కడ? లక్ష్మణుడెక్కడ? -'' అని పలికి ప్రాణములు వదలిపెట్టెను. ''ఇంద్రజిత్తూ! నినుగన్న తల్లి ధన్యురాలు. నీబల పరాక్రమములకు మా జోహార్లు'' అని ఆ సమయమున అంగదాదులు రావణాత్మజుని కీర్తించిరి. తదుపరి విగత జీవుడైన మేఘనాదుని కళేబరమును సునాయాసముగా తీసుకొని పోయి సమీరపుత్రుడు లంకా ద్వారమునొద్ద పెట్టి వచ్చెను. అవ్విధముగ ఇంద్రజిత్తును నిర్జించి విజయశ్రీతో వచ్చిన లక్ష్మణ అంగదహనుమంతాదులను అవధేశుడు ఆలింగనము చేసుకొని అభినందించెను.

## సులోచన

''ఓ అపర్ణా! పరబలోద్ధతుడు దేవఘాతకుడగు మేఘనాదుడు నిహతుడైనందుకు సుర నర మునులాది నానాలోక నివాసులు హర్షోత్సాహితులై అవధ కుమారులను అనేకవిధముల కీర్తించిరి. ఆపై జరిగిన కథను చెప్పుచున్నాను. ఆకర్ణించ వలసినది.'' అని కాకభుశుండి గరుత్మంతునికి చెప్పియుండిన రామ చరిత్ర యొక్క శేషాంశమును శూలి శైలకుమారి కిట్లు చెప్పదొడగెను.

మేఘనాదుడు శరవిద్ధుడై నేల కొరిగినపుడు వాని తల తెగిపోయి రామ చంద్రుని యెదుట బడెను. వాని బాహువొకటి యెగిరిపోయి లంకలో వాని గృహప్రాంగణమున పడెను. రావణి ధర్మపత్ని సులోచన ఆ ఖండిత హస్తము తన ప్రాణేశ్వరునిదై యుండుట గమనించి ఇట్లు విచారించెను - "అయ్యో నా నాథుడు యుద్ధములో నిహతుడయ్యెనా! నేను నమ్మలేకున్నాను. నా ప్రియుడు వీరాధివీరుడు, వరబల సంపన్నుడు, అజేయుడు. అతనిని వోడిం-చగల యోధుడీ లోకత్రయమున లేడే! ద్వాదశ వర్షములు నిద్రాహారములు, స్త్రీ సాంగత్యసుఖము లేనివీరవత్రునివలన మినహా, అన్యులచేత నాభర్తకు మృత్యువు సంఘటిల్లనేరదు. ఇది నా ప్రాణేశుని భుజదండమగునో కాదో! తెలియరాకున్నది." అని కొంత తడవు సులోచన వ్యథావ్యగ్రాంతరంగయై చింతించి తుదకు - నేను త్రికరణశుద్ధిగా నా నాథుని సేవించుచున్న దాననైన ఈఖండితహస్తమే నాకు నిజము తెలియజేయుగలదు - అని పలికెను. అంతట ఒక సఖియ సుద్దముక్క ఒకటితెచ్చి ఆ తెగిన చేతియొక్క వ్రేళ్ళ సందున ఉంచెను. సత్వరమే ఆ ఖండిత హస్తము సులోచనాది స్త్రీజనము చూచు చుండ గృహప్రాంగణమున ఇట్లు లిఖించెను-

"ఓ సులోచనా! రామలక్ష్మణులు అవతార పురుషులు. వారి మహిమా విశేషములు వర్ణింప ఆదిశేషునికి శక్యముగాదు. నా శిరము శ్రీరాముని చెంత నున్నది. నీకు నమ్మకము కలుగుటకై నా హస్తభాగము నీ యొద్దకు పంపబడి నది! ఇది నిజము."

తన విభుడు వీరస్వర్గ మలంకరించెనని సులోచనకు విజ మేర్పడెను. వాసుకితనయ అమిత దుఃఖాక్రాంతయై యెదగ్రుద్దుకొనుచూ రోదించెను. పతి-గతప్రాణ సులోచన వ్యసన వ్యగ్రాంతరంగయై విలపించెను. అట్లు శోకార్ణవమున మునిగియున్న ఇంద్రజిత్తు భార్యను వోదార్చుటకు సఖీజనము బహువిధముల ప్రయత్నించెను. సులోచన మహాసాధ్వి, పతివ్రతా శిరోమణి, జ్ఞాన సంపన్ను రాలు. కాబట్టి త్వరలోనే ఆమె దుఃఖమునుండి తేరుకొని భావి కర్తవ్యమును గురించి విచారించెను. తదుపరి ఆమె తన గృహమందున్న సర్వసంపదలను దానముచేసి పతిభుజదండమును వెంట తీసుకొని, బంగారుపల్లకీ నధిష్ఠించి మామ రావణుని ఇంటికిపోయెను.

"మామయ్యా! మీ కుమారుడు మేఘనాదుడు సంగ్రామమున లక్ష్మణుని చేతిలో వీరస్వర్గ మలంకరించెను. లంకేశా! మీరు జీవించి యుండగనే మీ కోడలికి వైధవ్యము లభించు దుస్థితి యేర్పడెను. నాకీ హస్తముద్వారా సకల విషయములు బోధపడెను. అసురనాథా! శ్రీరాముని యొద్ద ఉన్న నా నాథుని శిరము తెప్పించి నా కిప్పించ వలసినదిగా ప్రార్థిస్తున్నాను." అని ఆమె రావణునితో చెప్పుకొని కన్నీరు బెట్టుకొనెను.

"అమ్మా సులోచనా! కుంభకర్ణుడు, మేఘనాదుడు, అతికాయుడు, మహోదరుడు మున్నగు మేటి రణధీరులున్నారు గదాయను ధైర్యముతో నేనింతవరకు యుద్ధమునకు పోక ఉపేక్షించి యూరకుంటిని. అట్టి అసురాగ్రగణ్యులు నరవానరులచేత నిర్జింపబడిరని వినుటకే నాకు సిగ్గుగా నున్నది. అమ్మా పుత్రవధూ! నా బలపరాక్రమములు ప్రపంచమునకే తెలుసును. ఆ నర వానర కీటకములను నిమిషములో నిర్జించి నీ మనస్సుకు సంతోష మొనర్తును." అని లంకాధిపతి సులోచనను ప్రగల్భములతో ఊరడించుటకు ప్రయత్నించెను.

మదోన్మత్తుడై ఇంకనూ సత్యము గ్రహించనేరక ప్రగల్భము లాడుచున్న మామగారితో ప్రతివచనము లాడుట భావ్యముగాదని తలంచి సులోచన అక్కడి నుండి మండోదరి యొద్దకు పోయెను. మండోదరి కోడలికి ప్రాప్తించిన వైధవ్య స్థితిని చూడలేక పోయెను. ఆమె దుఃఖార్తయై యున్న కోడలిని అనేక విధముల ఊరడించి - "ఓ కులవధూ! మీ మామ బలగర్వితుడు. అసుర ప్రవృత్తిచే అహంకృతుడై యున్నందున సద్బోధన లతని చెవి కెక్కకున్నవి. ఆనాడు నారదుడు చెప్పిన మాటలు నేడు నిజము గానున్నవి. రావణరాజ్యము పతనమై రాక్షసకులము నశించుట నిక్కము. పుత్రీ! కర్మఫల మెవరికిని తప్పింపరానిది. వివేకవంతురాలవగు నీవు జరిగిన దానికి దుఃఖించకుము. నీవు శీఘ్రమే శ్రీరాముని యొద్దకుపోయి నీ ప్రాణేశ్వరుని శిరము తీసుకొనివచ్చి, పరలోకమందున్న నీ భర్తను కలుసుకొనుటకు ప్రయత్నించుము" అని బోధించెను.

పిమ్మట సులోచన అత్తపాదములకు ప్రణమిల్లి ఆమె ఆశీర్వాదములు

తీసుకొని, లంకకు వెలుపలనున్న రామచంద్రుని స్కంధావారమునకు పయనమై చనెను.

లంకలోనుండి వానరకటకమువైపు పల్లకీ ఒకటివచ్చుచుండుట కపులు చూచిరి. వారు మేఘనాదుని మరణానంతరము రావణుడు బుద్ధి తెచ్చుకొని సీతాదేవిని శ్రీరామునికి సమర్పించుటకై పంపుచున్నాడని - భావించి సంతోషించిరి. సులోచన పల్లకి దిగి సఖీజన పరివృతయై సీతానాథుని యొద్దకు పోయి అతని పాదపద్మములకు సాష్టాంగ ప్రణామముచేసెను. ఆ దేవదేవుని దివ్యసుందర విగ్రహము దర్శించుకొని ఆమె లోచనములు సులోచనములయ్యెను. ప్రక్కనున్న విభీషణుడు శ్రీరామునికి సులోచన వృత్తాంతము తెలియజేసెను.

దయానిధి దాశరథి ప్రసన్న చిత్తుడై ''సుగుణవతీ! సులోచనా! నీ సచ్చరిత్ర, సౌశీల్యములు తెలిసికొని నే నెంతయు సంతసించితిని. నేను నీ భర్తకు ప్రాణదానము చేసెదను.' మీ రిరువురు చిరకాలము లంకారాజ్య మేలుకొనుచూ సుఖముగా నుండుడు'' అని పలికెను.

రాముని పలుకు లాలించి వానరులు బిత్తరపోయి ఒకరినొకరు చూచుకొనిరి. మేఘనాదుడు పునర్జీవితుడైన వాడు పూర్వ వైరము విస్మరించునా! దేవతలను ధర్షించక పూరకుండునా? విభీషణునికి చేసిన బాస యేమగును! అను పలువిధ ప్రశ్న లప్పుడు వారి మనోవీథిలో ప్రత్యక్షమయ్యెను.

ఇంతలో సులోచన కేలుమోడ్చి సీతానాథుని కిట్లు విన్నవించెను- ''ఓ జగత్పతీ! మీ అపార కృపా కటాక్ష వీక్షణములు నాపై ప్రసరించినందులకు నా జీవనము ధన్య మయ్యెను. ప్రభూ! నా నాథుడు స్వభుజ బలపరాక్రమములచే పదునాల్గు భువనములపై తన విజయపతాకము ప్రతిష్ఠింప జేసుకున్న మేటి యోధుడు. ఆ రణధీరుడు సమర ప్రాంగణమున లక్ష్మణమూర్తి వంటి సత్పాత్రునికి తన ప్రాణధనము దానముచేసి ఖ్యాతిగడించెను. అట్లుదానమివ్వబడిన వస్తువును తిరిగి నేను బహుమతిగా పుచ్చుకొనుట భావ్యముగాబోదు. దేవా! ఈ సాంసారికజీవనమున కింతటితో స్వస్తి చెప్పి, యోగివరులు సమాధిద్వారా మీ సత్పథమును సాధించుకొనునట్లు నేను నా పతితో సహగమనముచేసి మీ సాన్నిధ్యము పొందుటకు అభిలషించుచున్నాను. జగన్నాథా! భవదీయ ప్రాప్తికి

ఇంతకంటే మంచి సమయము నాకు లభించుట దుర్లభము.''

ఆ సాధ్వి సాధువాక్కులకు సాకేతపతి సంతోషించి తథాస్తు పలికెను. సత్వ-రమే సుగ్రీవుడు స్వామి సంకేతము ననుసరించి ఇంద్రజిత్తు శిరము దెచ్చి నాగకన్య కప్పగించెను.

ప్రాణపతి ఖండిత శిరము చూచినపుడు సులోచన హృదయము క్షోభించి పోయెను. దుఃఖార్తియై దీన స్వరమున - ''హా నాథా! నా జీవనమూర్తీ!'' యని యెలుగెత్తి యేడ్చెను. చేలాంచలముచే నాథుని ముఖము తుడిచి హృదయ-మున కత్తుకొని పరిపరి విధముల విలపించెను. తదనంతర మాసాధ్వి రామ విభీషణులకు ప్రణమిల్లి ప్రాణేశుని శిరముతో బయలుదేరెను. విభీషణాదులు సులోచనను శిబిరమున కావలివరకు సాగనంపి తిరిగి వచ్చిరి.

అప్పటికే రావణాది రాక్షస ప్రముఖులు మండోదరి మొదలగు అంతఃపు రాంగనలు నదీసాగర సంగమస్థలికి వచ్చి ఆమె రాకకై నిరీక్షించుచుండిరి. సులో-చననుజూచి అచట చేరిన అసురమండలి శోక సంతప్తమాయెను. దశకంఠుడు దీనాతిదీనుడై కంట తడి బెట్టుకొనెను. పిమ్మట రక్షోవీరులు చందన గంధ సుగంధ ద్రవ్యములు సమకూర్చి, స్వర్గమునకు సోపానమో యన్నట్లు చితి పేర్చిరి.

తదుపరి వాసుకికన్య సులోచన అత్తమామలకు ప్రణమిల్లి, ఆప్తజనులకు ధైర్యవచనములు పలికి, మిత్రుల యొద్ద సెలవు పుచ్చుకొని, ప్రాణవల్లభుని శిరము ఒడిలో నుంచుకొని భగవంతుని స్మరించుచూ చితిపై కూర్చొనెను. క్షణములో అగ్నిజ్వాల లా పతివ్రత స్థూల దేహమును చేరుకొనెను.

## రావణుడు అహిరావణుని సహాయము కోరుట

ఇంద్రజిత్తు లోకవీరుడు. అతడు మరణించినందుకు లంకావాసులు దిగులుగొని దుఃఖించిరి. రావణుడు మణిని పోగొట్టుకొన్న సర్పము పగిది పుత్ర శోకార్తుడై పలు విధముల పరితపించెను. ''వత్సా! దేవతలను ధర్షించి-తివి, దిక్పాలురను ధిక్కరించితివి, జగజ్జెట్టివై లోకములను గడగడ లాడించి-తివి. నాయనా! అట్టి అమేయ బలసంపన్నుడవు నేడు విగత జీవుడవై నిర్వ్య-

గ్రమలంకరించితివా! ధీరా! నీ నిర్గమనముతో దనుజకులము ధైర్యహీన మయ్యెనే-'' అని విలపించెను. రావణుడు శోక వ్యాకులితుడై చేష్టోహతు డయ్యెను. ఇక అంతఃపురాంగనల ఆక్రందన చెప్పుటకు శక్యముగాదు. ఆ రాత్రంతయు లంకలోని ఆబాల గోపాలము శోకార్ణవమున మునిగి యుండెను.

వ్యసన వ్యగ్రాంతరంగుడగు దశకంఠునికి ఆరాత్రి కడుపుకు అన్నము, కంటికి నిద్ర దూరమయ్యెను. రాత్రి నాల్గు గడియల కాలము గతించిన మీద అసురేశునికి అహిరావణుడు జ్ఞప్తికి వచ్చెను. దశగ్రీవుడు తత్క్షణమే శివాలయ మునకుపోయి శుచియై శివుని ఆరాధించసాగెను.

''భవానీ! రావణుని కనేక కుమారులు కలిగిరి. వారిలో అహిరావణు డొకడు. వీడు తల్లి గర్భమునుండి ఇరువది సర్పములతో జన్మించెను. రావ-ణుడు వీని పుట్టుకకు భీతిల్లి శ్వాసనుడను రాక్షసునిద్వారా లంకకు నైరుతి భాగమున భూమిలో పాతి పెట్టించెను. ఆ శిశువు మన్ను తినుచూ భూమిని తొలుచుకొని పోయి ఒక నెలదినములకు సముద్రతీరము చేరెను.

రాహువుతల్లి సింహిక ఆ బిడ్డ నెత్తుకొనిపోయి తాను పెంచుకొనుచుం-డెను. ఒకానొక దినము శుక్రాచార్యుడు ఛాయాగ్రాహిణి సింహిక ఇంట పెరుగుచున్న యీ బాలుని చూచి ''సింహికా! వీడు దశగ్రీవుని తనయుడు. వీనికి అహిరావణుడని నామకరణము చేయుచున్నాను-'' అని చెప్పి ఆమెకు వాని జన్మ వృత్తాంతము తెలియజేసెను. తన పుట్టుక రహస్యము తెలియగనే అహిరావణుడు ఖిన్నుడై సముద్రమున దూకెను.

సాగరమున మునిగి అహిరావణుడు అక్కడ నుండి చిన్నగ వితల లోక మందున్న భోగవతీపురము చేరుకొనెను. వాసుకి బావమరిది దర్వీకుడను రాజు ఆ పట్టణమును పాలించుచుండెను. ఆ నగరమందొక చోట జరుగుచుండిన పురాణ కథా కాలక్షేపమునకు అహిరావణుడు పోయెను. అప్పుడచ్చట తపో మాహాత్మ్యమును గురించిన ప్రసంగము జరుగుచుండెను. అది శ్రద్ధగా ఆలకిం చిన అహిరావణునికి తపస్సు చేయు సంకల్పమాయెను. అక్కడినుండి వాడు కామదదేవి ఆశ్రమమునకు చని, అక్కడ నిష్ఠాగరిష్ఠుడై పద్నాలుగువేల సంవత్స రములు ఘోరమగు తపస్సాచరించెను. దేవి వాని దీక్షానిరతికి మెచ్చి ప్రత్యక్షమై

వరమడుగుమని కోరెను. అహిరావణుడు ఆనంద విహారుడై కరములు ముకు-
ళించి- "తల్లీ! నా తండ్రి నన్ను తిరస్కరించి నన్ను అవమానించెను. అతడు నా బలమును గుర్తించి నన్నొకమారు యాచించవలయును. వెండియు నా కెవరివలననూ మృత్యువు సంఘటిల్లకుండునట్లు వరము ప్రసాదింపుము." అని వేడెను.

"రావణా! త్రేతాయుగాంతమందు లంకేశుడు నిన్ను ప్రార్థించి నీ సహాయ మపేక్షించగలడు. పోతే రెండవకోరిక కూడా నీకు సిద్ధించగలదు. కానీ ఒక్క వనచరుడు మాత్రము నావరశక్తిని ధిక్కరించగల సమర్థుడు. వాడును వాని ప్రభువు మినహా మరెవ్వరూ నిన్ను సంహరించజాలరు. నీవు సకలైశ్వర్యసంప-న్నుడవై చిరకాలము సుఖింపుము." అని దీవించి దేవి అంతర్ధాన మయ్యెను.

పిమ్మట కొన్ని శతాబ్దములు గతించెను. అహిరావణుడు వరగర్వితుడు. బలోద్ధతుడై వాడు చిన్నగ హింసాకార్యములకు పూనుకొనెను. ఒకసారి వాడు నాగులరేడు దర్వీకునిపైబడి వానిని ఓడించెను. పరాజితుడైన దర్వీకుడు శేష నాగుని సంప్రదించి అతని సమ్మతి మేరకు తనకూతురు కుందనిని అహిరావ ణున కిచ్చి అతనితో చెలిమి చేసుకొనెను. ఆ పైన రావణాత్మజుడు భోగవతీ పురమును తన మామకు ఇచ్చివేసి తాను వనాంతరమందు కామదదేవి ఆలయ మునకు సమీపమున తొమ్మిదివేల యోజనముల విస్తీర్ణముగల ఒక మహా నగరమును నిర్మించుకొని అచ్చట స్వజన పరివారబంధు సమేతముగ సకలభో గములు అనుభవించుచుండెను.

"శైలజా! ఇదీ అహిరావణుని సంక్షిప్త చరిత్ర." అని చెప్పి శంకరుడు శంకరికి శేషించిన కథా భాగమిట్లు చెప్పదొడగెను.

ఆనాటి రాత్రి లంకలో శివాలయమందు అసురనాథుడు అహిరావణుని స్మరించుచూ కూర్చొని యుండెను. ఆ సంగతి గ్రహించిన అహిరావణుడు సత్వరమే తండ్రి యొద్దకువచ్చి నమస్కార పూర్వకముగా కుశల ప్రశ్నచేసి తనను పిలిపించిన కారణమేమని అడిగెను.

లంకేశుడు తనకు రామునికి జరుగుచున్న సంఘర్షణ వృత్తాంతమంతయు

తనయునికి సంక్షిప్తముగా తెలియజేసిన పిమ్మట గద్గద స్వరమున ఇట్లు ప్రసంగించెను.

"నాయనా అహిరావణా! ఇంకనూ నా క్షేమ మడిగెదవా! కులమంతయూ గతించె. కొండలవంటి ధీరవీరులైన కుంభకర్ణ మేఘనాద అకంపన అక్షయ కుమారులతోనే నా కుశల క్షేమములన్నియూ నన్నుగిల్లిపోయెను. పుత్రా! దిగ్గ-జములవంటి దానవ యోధు లొక్కొక్కరే ఆ సన్న్యాసుల చేతులలో హతుల-య్యిరే! ఈ పరాభవము నేనెట్లు భరించగలను. దీనికి ప్రతీకార మాలోచించు-టకై నిన్ను పిలిపించుటకు ప్రయత్నించితిని. నీవు నీ శక్తిసామర్థ్యమంతయూ ప్రయోగించి శత్రుసంహారముచేసి నాకు శాంతి సంఘటిల్ల చేయవలసిందని అర్థించుచున్నాను." అని పౌలస్త్యుడు ప్రార్థనా పూర్వకముగా పుత్రునితో మొర పెట్టుకొనెను.

రామునితో శత్రుత్వము రాక్షసజాతికి శుభకరముగాదని అహిరావణుడు ఆవేదనపడెను. ఈ అనర్థమును ఇప్పటికినీ అనురేశుడు అర్థము చేసుకొను స్థితిలో లేడు. కాబట్టి ఇక తా నా చరించవలసిన కార్యము తండ్రి అభిలాషను తీర్చుటొక్కటే మిగిలియున్నది. అని నిశ్చయించుకుని అహిరావణుడు తండ్రితో - "పితాజీ! మీ యాజ్ఞచొప్పున రామలక్ష్మణులను దేవికి బలి యిచ్చి మీ ఋణము తీర్చుకొందును. తద్ద్వారా మన జాతికి మంగళము, నాకు సత్కీర్తి సంఘటిల్లగలవు. అదియే చాలు. నేను శత్రువులను తీసుకొని పోవునపుడు నీవొక వెలుగును చూడగలవు" అని చెప్పి వాడు దశాననుని యొద్ద సెలవు తీసుకొని వానర స్కంధావారము వైపు పోయెను.

## అహిరావణుడు రామలక్ష్మణులను గొంపోవుట

ఆ రాత్రి అహిరావణుడు మాయాబలముచే ఆకసమంతటా కారుమేఘ ములు వ్యాపింపజేసెను. కాళరాత్రి కటికచీకటి, కన్నుబొడుచుకున్నా కానరాని గాంధాంధకారము. శాఖాచర వీరులు జాగరూకులై సేనాశిబిరములకు కావలా గాయుచుండిరి. స్కంధావార ప్రవేశద్వారముయొద్ద వాయుపుత్రుడు వీరాసనా-సీనుడై వేయి కండ్లతో నిశాచరుల జాడలు కనిపెట్టుచుండెను. ఆ విశేష కపి

యోధుల కనుగప్పి కటకములో ప్రవేశించుట కాలునకైనా సాధ్యముగాదు. కానీ అహిరావణుడు ఆరితేరిన జిత్తులమారి. వాడు ఆంజనేయుని కనుగప్పుటకై విభీషణుని రూపుదాల్చి సునాయాసముగా లోనికి వెళ్ళిపోయెను.

ఆ తంత్రజ్ఞు డట్లు లోన ప్రవేశించి రామలక్ష్మణులు శయనించియున్న శిబిరమును సమీపించెను. దానికి నలువైపుల సుగ్రీవ అంగద నల నీల జాంబవంతులాది సేనాపతుల గుడారములుండెను. నిశాటుడు నెమ్మదిగ శిబిరములోనికిపోయి, అందులో నిద్రించుచున్న శ్రీ దేవదేవుని దివ్యసుందర విగ్రహమును గాంచి భక్తితో ప్రణమిల్లెను. తదుపరి వాడు తనమంత్ర ప్రభావముచే వానరసేన నంతటినీ గాఢనుగా నిద్రావశవంగునట్లు చేసెను. నరాంతకు డంత యేమాత్రము విలంబనము చేయక నిద్రించుచున్నరాజకుమారు లిద్దరినీ తీసుకొని అంతరిక్షమున కెగసి అదృశ్యుడయ్యెను. ఆ సమయమున ఆకాశమందు ఒక కాంతిపుంజము ప్రకాశించెను. దానిని చూచి రావణుడు రామలక్ష్మణులు అహిరావణునిచే గొంపోబడుచున్నారని ఊహించుకొని ఆనందముతో వళ్ళు మరచెను.

శిబిరములో కోసల కుమారులు లేకుండుట చూచి కపులు రిచ్చగొనిరి. ఈ వార్త క్షణములో స్కంధావారమంతటా గగ్గోలు పుట్టించెను. ఆ కాళ రాత్రిలో వేలాది వానరవీరులు దివిటీలు పట్టుకొని శిబిరమంతయు గాలించి రామలక్ష్మణులను గానక హతాశులై దిగులొందిరి. "గరుత్మంతా! నీరులేని నది, చంద్రుడు లేని రాత్రి, జీవుడులేని దేహమువలె రామలక్ష్మణులు లేకున్నందుకు వానరుల ముఖములు వెలవెలబోయెను. స్కంధావారమంతయు నిముసములో శోకార్ణవమయ్యెను" అని కాకభుశుండి గరుడునితో పేర్కొనెను.

కపిరాజు సుగ్రీవుడు శోక వ్యాకులితుడై తన అనుచరులను వీక్షించి - "కపులారా! రామలక్ష్మణుల జాడ తెలియరాకున్నది. ఏదో మాయ జరిగినట్లున్నది. విధి కృతమెంత విపరీతమైనది! ఒక్క దశాననుడుతప్ప దనుజజాతి సర్వము హత శేషమైయున్న ఈ అనుకూల సమయములో ఎంత దారుణము సంఘటిల్లెను! మనము రావణుని సంహరించినను సీతకు శ్రీరాముని గురించి యేమిచెప్పగలము! హా విధీ!" అని వాపోయి సుగ్రీవుడు శోషవచ్చి మూర్ఛిల్లెను.

ఇంతలో విభీషణుడు మేల్కొని శిబిరమునుండి వెలుపలికి వచ్చెను. అతడు ఆంజనేయునిచూచి, జరిగిన సంగతంతయూ గ్రహించి వానరుల కిట్లు బోధించెను.

"ఓ వీరులారా! మీరిట్లు నిరుపాయులై దుఃఖించుట కిది సమయము గాదు. మంత్రతంత్ర ప్రవీణుడు మహాబలవంతుడగు అహిరావణుడను రావణుని పుత్రుడు ఒకడున్నాడు. బహుశా వాడే రావణ ప్రేషితుడై వచ్చి రాజ కుమారులను హరించి తీసుకొనిపోయి ఉండును. ఇంతటి మాయాశక్తి తదన్యులకు లేదు. అదియేగాక నా రూపు ధరించి మన కటకములో ప్రవేశించు సామర్థ్యము ఒక్క అహిరావణునికే గలదు. ఇప్పుడు యేమాత్రము విలంబన చేయక మనలో వీరుడొకడు పాతాళమున కేగి ప్రభువును రక్షించుకొనుటకు ప్రయత్నించవలసియున్నది."

అంతట సుగ్రీవజాంబవంతాది ప్రముఖులు మహావీరుని లక్షించి - "ఓ ఆంజనేయా! స్వామిని రక్షించి విపదంబుధి పాలైయున్న వానరజాతిని ఉద్ధరించుటకు సత్వరమే ఉద్యమించుము" అని ఏక కంఠమున పలికిరి.

పవనాత్మజుడు ప్రభుభక్తి పరాయణుడు. ఆపత్కాలమందు అతని వీర్య స్థైర్యంబులు విజృంభించి తేజో విలసితమగును. మేరు గంభీరధీరుడగు మారుతి వానరపతిసుగ్రీవునికి వినయుడై నమస్కరించి - "రాజా! దిగులొందక స్వస్థచిత్తుడవై కపి సేనను కాపాడుచుండుము. ఈ యేడేడు పదునాలుగు లోకములలో సాకేతవాసు లెక్కడున్నను వెదకి తీసుకొని రాగలను. ఇదే సెలవు తీసుకొనుచున్నాను" అని పలికి మహావీరుడు మరుక్షణమే రామాన్వేషణార్థమై బయలుదేరెను.

## హనుమంతుడు అహిరావణుని సంహరించి రామలక్ష్మణులను విడిపించుకొనుట

అట్లు దీక్షాబద్ధుడై వజ్ర సంకల్పముతో బయలుదేరిన వానరవీరుడు ఏక ధాటిన రామబాణమువలె పాతాళలోకము ప్రవేశించి అహిరావణుని పురి బహిర్ద్వారము సమీపించెను. అక్కడ మకరజాతి వీరుడొకడు నగరరక్షణ చేయు

చుండెను. నగరములోనికి పోవుచున్న మారుతి మార్గమును నిరోధించి వాడు ఇట్లు మనవి చేసుకొనెను- ''మహాత్మా! నేను మీ కుమారుడను. నా పేరు మకరధ్వజుడు. లంకాదహనానంతరము మీరు సముద్ర తీరమునకు వచ్చిన ప్పుడు, ఒక మత్స్యము మీ స్వేద బిందువులు పానము జేసినందున గర్భము ధరించి నన్ను కనెను. నాడు మొదలు నేనిక్కడ అహిరావణునికి భృత్యుడనై సేవ జేయుచున్నాను. నా యజమాను డీ దినము దేవికి రామలక్ష్మణులను బలి యిచ్చుటకై హోమము చేయుచున్నాడు. కాబట్టి మీరు లోనికి పోవుటకు ప్రవే-శము కల్పించి నేను స్వామికి ద్రోహము చేయజాలను'' అని చెప్పి వాడు ఆంజనేయుని మార్గమును అడ్డుకొనెను.

మారుతి మకరధ్వజుని పితృభక్తికి, స్వామి సేవకు లోన హర్షించెను. తదు-పరి మార్గాంతరము తోచనందున తండ్రి తనయునితో యుద్ధమునకు తలప-డెను. వారిరువురికి కొంత తడవు ద్వంద్వ యుద్ధమాయెను. పిమ్మట మహా వీరుడు మకరధ్వజుని బంధితునిగాజేసి లోనికి పోయెను.

అహిరావణుడు పూజా స్థలమందు సమాసీనుడై మాంసరుధిరాదులతో దేవికి హోమము చేయుచుండెను. సమీర నందనుడంత సూక్ష్మరూపుడై సుమమాలలో దాక్కొని పూజాగృహము చేరుకొనెను. రాక్షసుడు యథాసమ-యమునకు మారుతి దాగియున్న మాలను తీసుకొని దేవిని అలంకరించెను. పవనపుత్రుని పాదము సోకగనే దేవి నేలకు క్రుంగిపోయెను. దేవి స్థానములో హనుమంతుడు వికృతరూపుడై విగ్రహమువలె నిలుచుండెను – ఆహా! మహా కాళి ప్రసన్నురాలై మనకు ప్రత్యక్షమైనదని రాక్షసులు సంతుష్టాంతరంగులై శీఘ్రమే బలియిచ్చుటకై రామలక్ష్మణుల నచటికి కొని తెచ్చిరి. రాజకుమారు-లను బలిపీఠమున కెదురుగ నిలబెట్టి వారిని మంత్రపూతము జేసిరి. పిమ్మట అహిరావణుడు దేవికి నరబలి యివ్వమని పూజారులను ఆదేశించెను. రాక్షస పూజారులు తత్క్షణమే ఖడ్గములు పైకెత్తి రామలక్ష్మణులను – ''ఓ నరు లారా! చచ్చుటకు ముందు దేవుని స్మరించుకొనుడు-'' అని హెచ్చరించిరి.

ఇంతలో దేవీవిగ్రహ స్థానములో నిలచియున్న మారుతి – ''ఓరీ మూర్ఖు రులారా! దేవుని స్మరించవలసినది మీరు. మృత్యు వాసన్నమైనది మీకుగాని,

వారికికాదు - '' అని అలయము మారుమ్రోగునట్లు సింహగర్జనచేసి, అగ్ర-హోదగ్రుడై అసురగుంపుపై బడెను. మహావీరుడట్లు ముష్కరులపై లంఘించి వారి చేతనున్న చంద్రాయుధమొక దానిని లాక్కొని దానితో మొదట అహిరా-వణుని తల తెగటార్చెను. వాని శిరమెగిరిపోయి బలిపీఠముపై బడెను. హను-మంతుడంత గజ యూథములపై కేసరి బడునట్లు మిగిలిన రాక్షసులపై విరు-చుక పడెను. కొందరిని కాళ్ళతో రాచి, మరికొందరిని ముష్టి ప్రహారణము లతో మర్దించి, మిగిలినవారిని చేతులతో నలిపి, నిమిషములో నిశాచరులను నిశ్శేషము గావించెను.

ఇట్లు హనుమంతుడు రాక్షస రక్తముతో దేవికి దాహము తీర్చి. రామలక్ష్మ-ణులను తన వీపుపై యెక్కించుకొని, వాయువేగ మనోవేగమునవచ్చి వానర కటకములో వ్రాలెను.

ప్రభువులను పునః చూడగనే ప్లవంగసేనకు పోయిన ప్రాణములు తిరిగివచ్చి-నట్లయ్యెను. వారు హర్షోత్సాహితులై వాయుపుత్రుని వేనోళ్ళ ప్రస్తుతించి అభి-నందించిరి. యథాపూర్వము వనచరుల మధ్య ప్రసన్నవదనులై విరాజిల్లిన అనఘకుమారులకు అమరులు మంగళ హారతులెత్తి జోహార్లు పలికిరి. ఈ సుఖసమయమున నరవానర దేవతాది సకలలోకవాసులు ఆడి పాడి ఆనందోత్స-వములు జరుపుకొని సానందులైరి.

## రావణుడు నరాంతకుని సహాయ మర్థించుట

ఓ అపర్ణా! చతురుడు, జగద్వంచకుడు, మాయావి, మహాబలవంతు-డగు, అహిరావణుడు సైతం కోతుల చేతులలో హతుడయ్యెనను దారుణవార్త చెవుల బడగనే అసురేశునికి అశనిపాతము సోకినట్లయ్యెను. ధైర్యము కోల్పోయి దిగులుగొని దీనాతిదీనుడై విహరించుచున్న దానవరాజు రావణుని యొద్దకు సచివోత్తము డొకడువచ్చి ఇట్లు మార్గోపాయము సూచించెను- ''రాక్షసేశ్వరా! శత్రువులు దండెత్తి వచ్చి ఇంటిపైబడిరి. మనవైపు మహావీరులెందరో మడిసిరి. విజయమో వీరస్వర్గమో తేల్చుకోవలసిన సమయామాసన్నమైయున్న యీ సందిగ్ధ స్థితిలో మీరివ్విధముగ భయగ్రస్తులై పరితపించుచూ కూర్చున్న

అసురజాతి యేమి కావలెను! మీ బలముపారమైనది. మీ శక్తిసామర్థ్యముల చేవ ఇంకమూ శత్రువులు చూడలేదు. రాజా! అహిరావణుడు లేకున్న అంతకంటే ఘనుడు నరాంతకుడు లేడా? ఈ సమయమున మీ రతని సహాయమపేక్షించి శాత్రవ సంహారమునకు పూనుకొనవచ్చును కదా!''

సచివశ్రేష్ఠుని సూచన సమయానుకూలముగ నుండెను. దశగ్రీవు డీ యూహకు సంతసించినవాడై తత్క్షణమే విహ్వాబలపురముందున్న నరాంతకుని పిలుచుకొని వచ్చుటకై ధూమకేతుని బంపెను.

భవానీ! రావణునికి జన్మించిన అనేక కుమారులలో నరాంతకు డొకడు వీడు అభుక్తమూల నక్షత్రమున పుట్టియుండెను. అందుచే యీ శిశువు ఇంట నున్న యెడల తల్లిదండ్రులకు మృత్యువు తటస్థించునని శుక్రాచార్యుడు చెప్పి నందున, రావణుడు నరాంతకుని సముద్రములో పారవేయించెను. నరాంత-కుడు చావు తప్పించుకుని బయటపడి పరమేష్ఠిపరమేశ్వరులనుగూర్చి ఘోర తపమాచరించి వారివలన అనేకవరములు బడసెను. పిమ్మట నరాంతకుడు దేవాంతకుడై అంతరిక్షమున విహ్వాబలపురము నొక దానిని నిర్మించుకొని, అందు డెబ్బదిరెండుకోట్ల జాతుధానులకు నాథుడై భోగముల ననుభవించు చుండెను.

ఆ నరాంతకుడు ధూమకేతువుద్వారా సంగతి సందర్భములు తెలుసు కొనిన వెంటనే జాగుచేయక స్వబలము వెంటనిడుకొని పితృ సహాయా-ర్థమై లంకకు వచ్చెను. వాడు, వాని డెబ్బదిరెండుకోట్లసేన రామలక్ష్మణు లతో అనేక దినములు ఘోరయుద్ధము చేసెను. మాయా యుద్ధ విశార-దుడు, నరబలోన్నతుడు అగు నరాంతకుని సాధించుట రామాదులకు దుష్కరమయ్యెను తుదకు రఘురాముడు సుగ్రీవుని సుతుడగు దధి బలుని సహాయములో నరాంతకుని సంహరించి వాని బలమును నిశ్శే-షము గావించెను. - అని కాకభుశుండి గరుత్మంతునకు చెప్పియుండిన రామచరిత్ర యందలి అహిరావణ నరాంతక రాక్షసుల అపజయక్రమము భర్గుడు భవానికి విశదీకరించి చెప్పెను.

# రావణుని తొలి యుద్ధము

రావణుని బలమంతయు పుత్రసహితముగా క్షీణించినందుకు రాక్షస స్త్రీలు దుఃఖాక్రాంతులై రోదించిరి. దుర్మరణము చెందిన తమతమ భర్తలను పుత్రులను పౌత్రులను దలచుకుని విలపించుచున్న నిశాచరస్త్రీలకు దుఃఖోపశమనము గావించుటకై రావణుడు వారి కొకింత వేదాంతము బోధించెను.

"-తబ దసకంఠ అనేక విధి సముఝా
యీ సబ నర నారీ,
నస్వరూప జగత సబ దేఖహు
హృదయ విచారీ-"

ఓ కాంతలారా! ఈ అఖిల ప్రపంచము నశ్వరమైనది. ఏది శాశ్వతమైనది? పుట్టుట గిట్టుటకే కదా!" అని పలికి వైరాగ్యము వెలగబెట్టెను. ఇతరులకు ఉపదేశించుట సులభముకదా!

పిమ్మట దశగ్రీవుడు ముఖ్యులగు రాక్షసవీరులను రావించి - "ఓ నిశాచర వీరులారా! విజయమో, లేక వీరస్వర్గమో తేల్చుకొనవలసిన సమయ మాసన్నమైనది. నేను నా స్వభుజబలము నమ్ముకొనే వైరితో సమరము తలపెట్టితిని. నే నీ దినము సమరాంగణమునకుపోయి, శాత్రువునికి తగిన శాస్తిచేసి వచ్చెదను. రణధీరులగు రక్షోవీరులు నన్ననుసరించి, గుండెబలములేని భీరువులు మాత్రము ఇండ్లకు మరలి పోవలసినది" - అని హెచ్చరించి దశాస్యుడు యుద్ధమునకు సన్నద్ధుడాయెను.

అత్తరి అసురనాథున కెన్నియో అపశకునములు తోచెను రావణరాజు గర్వోద్ధతుడు. శుభాశుభములు లక్షింపక ముందుకు సాగెను.

దశాస్యుడు క్రోధాతిశయముచే కన్నుల నిప్పులు గ్రక్కుచూ దుర్నిరీక్ష్యుడై రథమెక్కి, రక్షపరివృతుడై రణరంగమునకు కదలెను. రథ గజాశ్వాది వాహనములతో, నానావిధ ధ్వజ పతాకాచ్ఛత్ర సముదాయములతో, భేరీపణవ శంఖారవములతో, పరశుపట్టిస శూలగదా ముద్గర ఖడ్గాద్యాయుధములతో సమాయత్తమైన

రాక్షస యూథములు సింహనాదములు చేయుచూ కాటుక కొండలు కదలి నట్లు రావణుననుసరించి నడచెను.

నిశాటుల పదఘట్టనలకు ధరణి దద్దరిల్లెను. ధూళి పటలము సూర్యుని గప్పివేసెను. దిగ్గజములు చలించెను. సముద్రములు ఘూర్ణిల్లెను. వాయువు స్తంభించెను. వీర వసంతుని సేనావాహిని బోలి మోహరించి ముందుకు బోవు చుండిన దానవ చతురంగిణి సేనా వైభవము వర్ణింప శక్యముగాకుండెను.

"ఓ జాతుధాన యోధులారా! మీరు మర్కటానీకము నెదుర్కొని వారిని మర్దింపుడు. నేను తాపసులను మార్కొని ధర్షించెదను -" అని ఉద్ఘోషించి రావణు డుగ్రుడై సేనాగ్రభాగమున నిలబడెను.

దానవుడు దృక్పథమైనంతనే వానరభల్లూకములు రణోత్సాహితులై తరుశిలా ఖండములు ఎగురవేయుచూవచ్చి దనుజాలను దార్కొనిరి. పోరు ముమ్మర- ముగా జరిగెను. రామ్‌కీ జయ్ - రావణకీ జయ్ - అను ఘోషలు మిన్నుము- ట్టెను. రామరావణార్థమై శాఖాచర - నిశాచరవీరులు ప్రాణపణముగా పోరాడిరి.

రణరంగమున రావణుడు రథమందు, రఘువీరుడు నేలపై నిలబడియుం- డుటకు విభీషణుడు ఒకించుక నొచ్చుకొని రామమూర్తితో "ప్రభూ! రథ ములేదు, కవచములేదు, తుదకు పాదరక్షలుకూడ లేక యీ దానవవీరు నెట్లు దార్కొనగలరు!" అని శంకాచిత్తుడై పలికెను.

రాము డా మాటలకు మందస్మితుడై విభీషణు నిట్లు ఆశ్వాసించెను.

"సఖా విభీషణా! జయ సాధనకు ధర్మరథ మధిష్ఠింపవలెను. సాధారణ స్యందన మారోహించిన ఫలితము శూన్యము. ఏ రథమునకు - శౌర్యధైర్య ములు చక్రములుగాను, సత్యశీలములు ధ్వజపతాకములుగాను, బల వివేక హితోపకారములు గుర్రములుగాను, దయాదాక్షిణ్యములు కళ్లెములుగాను, శంక- రుని భక్తి సారథిగాను, జ్ఞాన - వైరాగ్య -సంయమ - సంతోషములు అస్త్రశస్త్రములుగాను - అమరియుండునో అట్టి ధర్మరథంబెక్కిన రథికుడు అజేయుడుగా నుండును. వాని నెదరించు యోధుడీ ముజ్జగముల నుండ బోడని నమ్మును."

రావణానుజుడంత ప్రభువు ఈ మిషతో నాకు ధర్మప్రబోధము చేసెనని భావించి ప్రసన్నుడయ్యెను.

"ఓ గిరిజా! రామరావణు లట్లు రణాంగణమున యుద్ధోన్ముఖులై నిలబడి-నపుడు సురులు సిద్ధులు మునులు మున్నగువారు అంతరిక్షమున విమానము లపై నిలిచి వేడుక చూడసాగిరి. నేనుకూడా వారితోనుండి రామరావణుల యుద్ధక్రీడలను కన్నులారా గాంచగలిగితిని" అని శంకరుడు పలికెను.

పిమ్మట ప్లవంగ - పౌలస్త్యవీరులు ఒకరి నొకరిపై పరాక్రమించి హోరా హోరి పోరాడుకొనిరి. ఆ యుద్ధము చూచుటకు భయంకరముగా ఉండెను. కపులు కోపోద్రిక్తులై విజృంభించి నిశాటులను చితుక గొట్టసాగిరి. వారు కొందరి తలలు తెగటార్చిరి. కొందరిని గిరగిర త్రిప్పి నేలకేసి బాదిరి. కొందరి కడుపులు చీల్చిరి. కొందరి శరీరములు ఖండ ఖండములై తెగిపడు-నట్లు నరికిరి. వానరు లాగ్రహోదగ్రులై నరసింహమూర్తివలె విక్రమించి సమర భూమినిశాత్రవ సంహారమొనర్చి సింహనాదములతో దిక్కులు పిక్కటిల్లజేసిరి. తృణప్రాయులగు వానరులు దైవబల సంపన్నులై యుండుటచే వజ్రములవంటి వైరి వీరులను తుత్తునియలగునట్లు ఛేదించగలిగిరి.

తన సైన్యము బలముకోల్పోయి వెనుకంజ వేయుచుండుట గమనించి దశ గ్రీవుడు రోషకషాయితనేత్రుడై రొప్పుచూ ముందుకు చని పదిచేతులతో ధను స్సులు, పదిచేతులతో బాణములు పట్టుకొని శరవృష్టి కల్పించి వానరానీకము ముంచెత్తివేసెను. కపులు కుపితులై ప్రయోగించిన పర్వతములు వృక్షములు శిలాఖండములు రక్షోనాథుని వజ్రశరీరము దాకి చూర్ణమై పోవుచుండెను.

రావణుడు రణదుర్మదుడు. వాడు వైరి వ్యూహములపై వివిధగతుల వర్తించి శాత్రవ సంహారమునకు గడంగెను. రావణ ధనుర్ముక్త బాణపరంపరలచే యుద్ధభూమి కప్పబడిపోయెను. సురాంతకుని దుర్వార సాయకవృష్టికి రామదండు వెరగొంది - "అంగద! ఆంజనేయా! అవధేశా! ఎక్కడుం-టిరి?" అని అరచుచూ భీతావహమై పరుగులెత్తెను.

# లక్ష్మణుడు రావణు నెదుర్కొని మూర్ఛిల్లుట

లక్ష్మణు డత్తరి క్రోధతామ్రాక్షుడై ముందు కురికి రావణు నెదుర్కొనెను. సౌమిత్రి దృక్పథము కావటముతో దానవనాథుడు సింహగర్జన చేసి - "ఓరీ లక్ష్మణా! నీవు నా పుత్రఘాతకుడవు. నీకై ఇంతకాలము కాచుకొని యుంటిని. నిన్ను బలిగొని నా గుండెలమంట చల్లార్చుకొందును రమ్ము." అని రోష భీషణ స్వరముతో తర్జించి శతసహస్ర శిలీముఖములు సౌమిత్రిపై గుప్పించెను. కోసల కుమారుడు ప్రతి శరములు ప్రయోగించి వానిని ముక్కలు ముక్కలుగా ఖండించి నిరుపయోగ మొనర్చెను. రామానుజు డాపై తీవ్ర సాయకములు ప్రయోగించి రక్షోనాథుని రథము విరుగగొట్టి సారథిని చంపి, వానిని శరవిద్ధాంగునిజేసి మూర్ఛిల్లునట్లు చేసెను.

ముహూర్త మాత్రములో ముష్కరుడు మూర్ఛనుండి తేరుకొనెను. కన్నుల కోపానల జ్వాలలు ప్రజ్వలించెను. దానవు డత్యుగ్రుడై ఆగ్రహించి, బ్రహ్మదత్త మగు అమోఘశక్తిని అభిమంత్రించి వదలెను. అది వచ్చి లక్ష్మణుని హృదయమున దాకెను. రాజపుత్రుడా శక్తి ఘాతమున కాక్రందించి స్పృహదప్పి ధరణీతలమున కొరిగెను. శక్తిపీడితుడై నేలబడిన లక్ష్మణు నెత్తుకొనిపోవుటకు దశాననుడు ప్రయత్నించెను. బ్రహ్మాండధారియగు ప్రభు సోదరుని కదలించుటకా మూర్ఖుడు ముందుకు వంగినపుడు మహావీరు డేమూలనుండియోవచ్చి పిడుగువలె వానిమీద దూకెను. రావణుడు చటుక్కున పైకిలేచి ఒక్క పిడిగ్రుద్దుతో పవనాత్మజుని ప్రహరించెను. వానరవీరుడా వ్రేటుకు నిలద్రొక్కుకుని నిలిచి, ఒక్క తీవ్ర ప్రతిఘాతమున ముష్కరుని మర్దించెను. ఆ దెబ్బకు దనుజేశుడు కండ్లు మబ్బులు క్రమ్మి నేలబడబోయి తిరిగి నిలద్రొక్కుకుని లేచి నిలబడెను. ఆ పైన రావణుడు హనుమంతుని డీకొనుట వ్యర్థమని భావించి, అతని బల శౌర్యములను పొగడుట కుపక్రమించెను.

"రావణా! నా దెబ్బకు నీవు వీర్గి చావక మొండివై బ్రతికియుంటివి. ఇక నా బలవీర్యములు కాల్చనా! నీ పొగడ్తలు వినుటకు నాకే సిగ్గగుచున్నది-" అని పలికి హనుమంతుడు లక్ష్మణు నెత్తుకొని అచటినుండి వెళ్ళిపోయెను.

శక్తి తగులుటచే తెలివి గోల్పోయి నేలబడియున్న లక్ష్మణమూర్తిని జూచి రాముడు వేదనపడి - సోదరా! నీవు పలుమార్లు శక్తిచే పీడింపబడుట ఉచితముగాదు. లక్ష్మణా! నిజబలము స్మరించుకొని లేచినిలబడుము.'' అని ఉద్బోధించెను.

రాముని మాటలు సౌమిత్రి చెవుల సోకగనే అతడు పైకిలేచి కూర్చుండెను. ఆ కరాళశక్తి వ్యోమమార్గముబట్టి బ్రహ్మలోకము చేరుకొనెను.

లక్ష్మణుడు పునః తేజోవిలసితుడై పరాక్రమించి రణాంగణమందున్న రక్షో విభుని తీవ్రముగా ఎదుర్కొనెను. తన అపూర్వ శరకౌశలము ప్రదర్శించి అతడు శాత్రవుని రిచ్చగొనునట్లు చేసెను. త్రుటికాలములో తీక్ష్ణమగు బాణ పరంపరలు గుప్పించి రావణుని రథము విరగగొట్టి, హయములను హతమొనర్చి, ధేవారి దేహమును తీవ్రముగా గాట వేసెను. దుర్వార శరపరంపరలను నివారించలేక, రావణుడు శరవిద్ధాంగుడై నీరసించి నేలకొరిగెను. అత్తరి సారథి రావణుని రెండవ రథముపై నిడుకొని లంకలోనికి పోయెను.

## రావణుడు విజయార్థియై హోమము చేయ సంకల్పించుట

దశాస్యుడు మూర్ఛ తేరుకుని ఆనాటి అపజయమునకు ఖిన్నుడై విచారించెను. తదుపరి వాడు వైరి వధ నభిలషించి విజయార్థియై చైత్రశుద్ధ బహుళ దశమినాడు హోమముచేయుట కుపక్రమించెను.

వాని జన్నము నిర్విఘ్నమైనయెడల వానిని జయించుట దేవదేవునికే దుష్కరమగును. రావణుడు హోమము తలపెట్టిన సంగతి చారులవలన తెలుసుకొని విభీషణుడు తత్క్షణము దశరథ నందనునియొద్దకు పోయి - ''రక్షోనాథుడు మహాయజ్ఞము తలపెట్టినట్లు వింటిని. దాని నెట్లయినను ధ్వంసముచేయించుటకు ప్రయత్నించవలసి యున్నది. అది పూర్ణమైన అమరేశుడు అజేయుడగును-'' అని సూచించెను.

విభీషణుని సమయజ్ఞతకు సీతాపతి సంతసించి ''సత్వరమే యాగము ధ్వంసము చేసిరం''డని అనుచరుల నాదేశించెను.

భానుకుల భూషణుడగు రామభద్రుని ఆదేశ ప్రకారము అంగద హనుమ దాది మహాకపులు యాగ ధ్వంసార్థమై భల్లున తెల్లవారునప్పటికి లంకలో ప్రవేశించిరి. వారు కోట ప్రాకారము లధిగమించి సరాసరి రావణ మందిరాంత ర్భాగమున జొరబడి -అక్కడ యాగవ్రతుడై దీక్షలోనున్న దశాననుని కనుగొని - ''ఓరీ నిశాచరాధమా! సంగ్రామము నుండి పారివచ్చి ఇక్కడ సిగ్గులేక కన్నులు మూసుకొని కృతకపూజ యందుంటివా!'' అని గర్జించి వానిపై బడిరి.

నిశాటుడు కపుల బెదిరింపులు లక్షించక దీక్షారతుడై నిశ్చల సమాధి నుండెను. వానరులు క్రోధోన్మత్తులై అనేక ఆగడములకు పూనుకొనిరి. హోమాదికములు చిందరవందరచేసి, యజ్ఞవేదికను పగులగొట్టి, వాని ముక్కు చెవులు కొరికి కాళ్ళుబట్టి యీడ్చి, జుట్టులాగి, ముక్కు పుటములు మూసి నానారభస చేసిరి. అప్పటికినీ వాడు ధ్యానభ్రష్టుడుగాకుండుటకు నోచ్చుకొని వానరులు రావణుని స్త్రీలను ఈడ్చుకొనివచ్చి వానిమీద పడద్రోసిరి. ఆ శుద్ధాంత కాంతాజనము లబోదిబోయని కేకలుబెట్టి దశకంఠుని దేహముపై వ్రాలి రోదోంతరాళము ప్రతిధ్వనించునట్లు రోదనకు లంకించెను. రావణుడా రభసకు ధ్యానవిరతుడై కన్నులు విచ్చి, కుపితుడై నిప్పులుగ్రక్కుచూ కపిపుంగవులపై కురికెను. శాఖాచరులంత వాని చేతికి చిక్కక తప్పించుకొని, వాని వ్రత భంగమైనందుకు సంతోషముతో కేకలిడుచూ కాలికి బుద్ధిచెప్పి క్షణములో స్వస్థానములు చేరుకొనిరి.

## రావణుని రెండవ యుద్ధము

యజ్ఞము భంగమైనందుకు జాతుధానపతి పన్నగమువలె పెద్దగ విట్టూర్చి, పిమ్మట కోపించి రణభేరి మ్రోగింపజేసి, యుద్ధమునకు సన్నద్ధులై రండని తన వారి కాజ్ఞాపించెను. ఘోరాకారులు మహాబలురు అగు రాత్రించర యోధులు వివిధాయుధపాణులై చతురంగబల సమేతముగ కదలి కాలాంతకుల పగిది ఘన గర్జనలతో కదనభూమికి నడచిరి. అనల జ్వాలల కెదురు నడచు పతంగసమువాయ కరణి పౌలస్త్యుని బలము ముందుకు సాగెను. దర్పోద్ధతుడై రణరంగమునకు పోవుచున్నప్పుడు రావణుని కప్పుడెన్నియో దుర్నిమిత్తములు తోచెను.

మదాంధుడా దుశ్శకునములయెడల దృష్టి పెట్టక పోయెను.

ఆ సమయమున దేవతలు కొందరు దాశరథి సన్నిధికి వచ్చి - ''దేవా! దనుజేశుడు దుర్మార్గుడు. వాడు మమ్ము నానావిధముల హింసించెను. తమరు వినోదార్థమై వాడితో క్రీడించక సత్వరమే వానిని సంహరించి స్వర్లోకమునకు సంతోషము చేకూర్చవలసినది. శ్రీపతీ! వైదేహీవిలంబనము సహింపలేక విరహ వ్యాకులితయై కృశించుచున్నది-'' అని మొరపెట్టుకొని పోయిరి. అమరులు సీతాదేవి దుఃఖము మేళవించి స్వకష్టములను ప్రస్తావించిన పద్ధతికి దాశరథి తనలో తాను నవ్వుకొనెను.

అంతట రఘువీరుడు కోదండము నందుకొని నడుముకు అంబులపొది అమర్చి, పుష్పాలంకృత జటామకుటము సవరించుకొని సమరక్రియకు సమా-యత్తుడాయెను. శ్యామాంగుడు, జలజారుణనేత్రుడు, బాహుబలుడు, విశాల వక్షోవిభూషితుడగు నరరూప నారాయణమూర్తి ధనుర్బాణములు ధరించి రణ రంగమున నిలబడుట జూచి దివిజులు హర్షితులై అతనిపై కుసుమ వర్షము కురిపించి జయధ్వానము చేసిరి.

# రామ రావణ యుద్ధము

రఘువీరుడప్పుడు రుద్రుడై భూమ్యాకాశములు ప్రతిధ్వనించునట్లు ధను ష్టంకారము చేసెను. ఆ జ్యాఘోషకు ధరణి కంపించెను. దిగ్గజములు ఉలికి పడెను. శేషకచ్ఛపములు చలించెను. వారిధులు క్షోభించెను. కులపర్వతములు క్రుంగెను. బ్రహ్మాండ భాండమే బ్రద్దలయినంత ఘనధ్వని కలిగెను.

పరస్పర విజిగీషాపరులైన రామరావణ బలములకు క్షణములో లోకభయం-కరమగు సంగ్రామము సంఘటిల్లెను. ఆ యుద్ధమప్పుడు ప్రళయకాలమువలె భయంకరముగ రూపొందెను. ఒండొరుల నొరుసుకొని ఘర్షించిన సేనాఖండ ములు కారుమేఘములను దలపించెను. పరశు పట్టిస శూలాద్యాయుధములు విద్యుల్లతలవలె తళుక్కున మెరయుచుండెను. గజాశ్వఘోషలు మేఘగర్జనలను మరపింపజేసెను. పైకెత్తబడిన కపుల తోకలు వివిధ వర్ణములతో ఇంద్రధను-స్సును స్ఫురింపజేసెను. శరపరంపరలు వర్షబిందువులుగాను, ఎగురవేయబడిన

పర్వతములు పిడుగులుగాను, పాదఘాతములచే పైకెగిరిన ధూళి నీటి తుంపరలుగాను భాసించెను.

సంగరధీరుడు సాకేతపతి శరపరంపరలకు దానవుల దేహములందు రుధిర ధారలు కట్టెను. ఆ రక్తప్రవాహము ఉభయసేనల మధ్య ప్రహించి భీరువులకు భీతి పుట్టించెను. ఆ రుధిరప్రవాహమునకు విరిగిన రథచక్రములు సుడిగుండములై తనరెను. గజతురగాదుల కళేబరములు జలచరములై భాసించెను. ధనుస్సులు తరంగసముదాయముగను, డాలులు కచ్ఛపములుగాను, శూలఖడ్గాదులు సర్పావలిగాను, పుర్రెల నుండి కారుచున్న మెదడు జలఫేనముగాను, వికృతాకారుల శవములు తీరస్థ వృక్షరాజిగాను కనుపించసాగెను.

రామబాణాహతికి హతులైన అసురుల శరీరములు యుద్ధభూమిలో గుట్టలుగా యేర్పడెను. రక్తార్ద్రమైన రణాంగణమంతట భూతప్రేత పిశాచ గృధ్ర కాకశ్వానసృగాలములు మాంస రుధిర మేధస్సులు మెసవుచు విచ్చలవిడిగా సంచరించెను. ఆ రక్త ప్రవాహమున కొట్టుకపోవుచున్న పీనుగులపై కూర్చొని యున్న కాకులు గ్రద్దలు నదిలో నావపోటీలు జరుపుకొంటున్నవా అన్నట్లు తోచెను. ఆ నెత్తుటి యేటిగట్టున కూర్చుని ప్రవాహమున పోవుచున్న కళేబరములను పొడిచి వాటి ప్రేగులు లాగుచున్న గ్రద్దలు నదిలోగాలమువేసి చేపలు పట్టు వేటగాండ్రను జ్ఞప్తికి తెచ్చుచుండెను. రణభూమి పిశాచ బీభత్సమై యుండెను. ఆడ పిశాచములు అంతరిక్షమున నాట్యము చేసెను. యోగినులు కపాలములలో రక్తము నింపుకొని త్రేంపుతూ త్రావుచుండిరి. తలలులేని మొండెములు పైకిలేచి తైతక్కలాడుచూ దయ్యాలమధ్య సంచరించెను. యుద్ధదృశ్యము లిట్లు దృష్టి భయంకరముగా నుండెను.

రఘువీరుడు చండప్రచండుడై విజృంభించి ఆనాటి సంగ్రామములో ఎందరి రాక్షసులను తన దుర్వారశరాహతికి బలిపెట్టెనో వూహించరాని విషయము. శాత్రవపక్షమున పదివేల యేనుగులు- పదిలక్షల పదాతులు - లక్షా యేబదివేలు రథికులు- సంహరింపబడినపుడు రాముని కోదండమునకు కట్టిన ఘంటికలలో ఒకటి టంగుమని ఒకమారు మ్రోగును. ఆ కోదండ ఘంటికా సమూహ మానాడు ఏడహోరాత్రములు నిర్విరామముగా వినదించెను.

ఆనాటి రామరావణ సంగ్రామము అపూర్వము, అవర్ణనీయమై యుండెను. రావణుని మూలబలమంతయూ నిశ్శేషమైపోయెను.

ఆ ఘోర సంగ్రామమున కోసలవీరుడు నేలపై నిలబడి యుద్ధము చేయు చుండెను. అది చూచి సురేంద్రుడు మాతలితో - రథము తీసుకుని రాముని వద్దకు పొమ్మని - చెప్పెను. మాతలిచే కొనిరాబడిన ఇంద్రరథమును ఇనవంశభూషణుడు చిరునవ్వుతో అధిష్ఠించెను. సాకేతపతి సుర్యందన మారోహించి సంగరక్షేత్రము శోభింపజేసినందుకు వానరులు హర్షోత్సాహితులై వైరిసమూహములపై విరుచుకపడిరి.

ప్రత్యర్థు లంతకంతకు బలోద్ధతులగుచుండుటకు పౌలస్త్యుడు కినిసెను. అంతట వాడు వానరానీకముపై రాక్షసమాయ విస్తరింపజేసెను. దాని ప్రభావముచే వానర భల్లూకములకు ఒక్కసారిగా అనేక రావణులు, అనేక రాక్షసులు, అపారమైన వైరిబలమును కన్నులయెదుట గోచరించెను. తమవారి బిత్తరపాటుకు కాకుత్స్థమణి కొంత కలతజెంది మరుక్షణమే ఒక్క బాణ ప్రయోగముతో రాక్షసమాయను ఆటగట్టించెను. తదుపరి దాశరథి మేఘగంభీర స్వరముతో స్వపక్షీయుల నిట్లు ఉద్బోధించెను. ''ఓ వానరవీరులారా! నిరంతరము యుద్ధ రతులై యున్నందున ఇప్పటికే మీరు అలసియున్నారు. కాబట్టి ఇక మీరు కొంతతడవు సుంత విశ్రాంతి తీసుకొని, రామరావణయుద్ధము చూచుచుండ వలసినది.''

రాఘవు డట్లు తనవారిని యుద్ధమునుండి వెనుకకు మళ్ళించిన పిదప, భూసురోత్తములకు మనస్సులో ప్రణమిల్లి, రావణుని కెదురుగా రథము నడిపింపజేసెను. రణరంగమునందప్పుడు రామరావణులు పరస్పరాభిముఖులై నిల బడిరి. రాముడట్లు దృక్పథమైనంతనే రావణుడిట్లు తర్జించెను-

''ఓయీ! నీవు సన్న్యాసివై వేటకానివలె యేమరించి వాలిని చంపితివి. ఖరదూషణ కుంభకర్ణ మేఘనాదులను సంహరించితినను గర్వముతో ఉద్ధతుడవై న న్నెదుర్కొనవచ్చితివి. నన్ను గత వీరులతో పోల్చుకుని పొరబడుచుంటివేమో! కానీ నేను రావణుడను, రాక్షసేశ్వరుడను, అమర బ్రహ్మను. దిక్పాలురునైతం నా కారాగారమున ఖైదుచేయబడియున్నారన్న సంగతి విస్మరించకుము.

నా బలప్రతాపములు లోక విదితములు. రామా! నేడు నీవే యమసదనము-నకు ప్రయాణము గట్టించి, కలకాలముగా మనకున్న వైరమును తుదముట్టించదలచితిని. వెన్నిచ్చి పారిపోక ఈ రావణునితో పోరాడుము.''

కాలప్రేరితుడై ప్రలాపించిన లోక పీడితుని వైఖరికి రామభద్రు డించుక మందస్మితుడై వాని కిట్లు సమాధాన మిచ్చెను.

''రావణా! నీ ప్రభుతాప్రతాపములు ప్రపంచమునకు తెలియనివనికాదు. కాబట్టి ప్రగల్భములతో పనియేల! లోకములో వాక్శూరులు, కార్యశూరులని ముఖ్యముగ రెండురకముల మనుజులుందురు. వారిలో నీ వేతెగకు చెందిన వాడవైనది ఇప్పుడు మాటలతో ప్రదర్శించుకొనుచుంటివి.''

ఆ మాటలకు రావణు డాగ్రహించి ''ఓరీ! నీవు నాకు నిర్భయుడవై నీతులు బోధించుటకు పూనుకుంటివా!'' అని గర్జించి రామునిపై బాణములు గుప్పించెను. అవధేశుడు ఆగ్నేయాస్త్రముతో వాని బాణవృష్టిని నిముసములో వమ్ముజేసెను. దేవాంతకుడంత కుపితుడై శక్తితో రాఘవుని గురిచూచి కొట్టెను. సీతానాథుడొక సాయకముతో ఆ శక్తిని తిరిగి వానిపైకే మరలునట్లు చేసెను. దానవుడాపైన పండ్లుగీటి కోట్లాది శూలచక్రములను కోసలవీరునిపై గుప్పించెను. కాని అవన్నియూ మార్గములోనే ఖండింపబడి నిరుపయోగముగా చేయబడెను. దుష్టుని మనోరథములట్లు తన ప్రయోగములన్నియు ఫలించక వ్యర్థమగుటకు ముష్కరుడు మహోదగ్రుడై శతసాయకములొకపెట్టున సంధించి, వానితో రాముని సారథి నేలబడి మూర్ఛిల్లునట్లు కొట్టెను.

మాతలి క్షతగాత్రుడగుట గాంచి నృపాలుడు రోషముతో కన్నులెర్రజేసి శాత్రవ భయంకరముగ ధనుష్టంకారము గావించి, ఆ కర్ణాంతము నారి లాగి, శరసహస్రములు పుంఖాను పుంఖములుగా వదలి, వైరి నివహములపై బాణపాతము వర్షించెను. ఆ శరపాతమునకు దశకంఠుని రథము విరిగెను. సారథి తలతెగి క్రిందబడెను. అశ్వములు నేలకూలెను. పతాకాధ్వజములు ఖండతుండములై విరజిమ్మబడెను. విరథుడైన రావణుడు తటాలున మరొక రథము పైకెగిరి, దండతాడిత భుజంగము కరణి రోషోగ్రుడై బుసలుకొట్టి పది త్రిశూల

ములు ప్రయోగించి రాముని రథాశ్వములు నేల కొరగునట్లు చేసి బొబ్బార్చెను.

దేవ హయములు తిరిగి నిలద్రొక్కుకుని లేచెను. రాముడు సంగ్రామాభి-రాముడై పరాక్రమించి ఒక్కసారిగా నూరు బాణములు దశకంఠుని తలలకు గురిపెట్టి కొట్టెను. కమలవనములో తుమ్మెదలు ప్రవేశించు భంగి బాణములు రావణుని తలలోదూరి వాని శిరములను, భుజములను ఖండించెను. కానీ రెప్పపాటులో రావణునికి క్రొత్తగా తలలు, భుజదండములు మొలచివచ్చెను. నర-పాలుడు పునః పునః దానవుని తలలు త్రెగి క్రిందబడునట్లుకొట్టెను. కానీ యథా పూర్వము వానికి తలలు చేతులు మొలచుచుండెను. ఇట్లనేకమార్లు జరిగెను. పలుమార్లు రామ బాణావళిచే ఖండింపబడిన రాక్షసేశ్వరుని తలలు భుజములు బాణములకు గ్రుచ్చుకొని రాహు, కేతువులవలె పైకెగురుచుండెను. ఆ శిరో ఖండము లసంఖ్యాకములై ఆకసమున వర్తించుచూ - అంగదు డెక్కడ! ఆంజనేయు డెక్కడ దాగె! రాముడెడీ! లక్ష్మణుడేడీ!- అని వికృత స్వరమున పలు-కుచు వానరులను భయభ్రాంతులను జేయుచుండెను.

రామరావణులు మహారథికులు. వారి సంగ్రామము సర్వలోక భీతావహ-ముగా నుండెను. రావణుడంతకంతకు వీరస్థైర్యము లుప్పొంగ పరాక్రమించి పోరాడెను. ఆ సమయమున వాడొక కరాళశక్తిని సూటిగా ప్రత్యర్థిపై ప్రయోగించెను. ఆ ప్రాణాంతకశక్తి విభీషణుని మీదికి పోవుచుండుట గమనించి తటా-లున రావణానుజుని వెనుకకు నెట్టి స్వయముగా దాని ముందట నిలచెను. ఆ శక్తి హృదయమునకు దాకుటచే రామమూర్తి కొంతతడవు స్పృహదప్పి నేలబడెను.

## విభీషణుడు రావణు నెదుర్కొనుట

శ్రీరాఘవుడు శక్తి తగులుటచే మూర్ఛిల్లుటచూచి విభీషణుడు ఆగ్రహోదగ్రుడయ్యెను. అతడు అగ్రజుని కెదురు నడచి రూక్షస్వరముతో రావణునిట్లు ధిక్కరించెను.

''రావణా! శిరఃపుష్పములు సమర్పించి శివుని పూజించియుంటివి. మహే-శ్వరుని వరప్రభావమువలన కోటితలలు పుట్టుచుండునంతవరకే నీవు జీవింపగ-

లవు. జానకీనాథుని ధిక్కరించి జగము లేల దలచిన మూర్ఖమతీ! ఇప్పుడు నీ తలలపై మృత్యువు తాండవించుచున్నది.''

అని గర్జించి విభీషణుడు రావణుని గదతో మోదెను. వా డా(దెబ్బ)నుండి తేరుకుని తమ్మునిని తీవ్రముగా ఢీకొనెను. ఆ యన్నదమ్ము లిద్దరు రోషోద్దీపితులై బాహాబాహి మల్ల యుద్ధము చేయసాగిరి. విభీషణుడు పెద్దకా-లము ద్వంద్వ యుద్ధము చేయుచూ అలసిపోవుట గమనించి మహావీరుడ-ప్పుడు భూరి భూరుహ మొకదానినికొని తెచ్చి, దానితో దానవవీరుని ప్రహా-రించి వాని రథహయ సారథులను మర్దించెను. విభీషణుడా సమయమున అవధేశు నొద్దకు పోయెను.

దేవాంతకుడు ఆంజనేయునిపై బడెను. మారుతి వారికి చిక్కక ఆకాశ-మున కెగిరెను. మారుతి వాలముపట్టుకొని వాడు కూడా పైకెగసెను. విను-వీధిలో ఆ వీరులిద్దరు కొద్దికాలము కజ్జలగిరి సుమేరు పర్వతములవలె ఘోరముగా పోరాడిరి. మహావీరుడు ''బోలో రామ్'' అని కేకబెట్టి రావణు నొక పిడిగ్రుద్దు గుద్దెను. నిశాచరుడా ప్రహారమునకు నింగినుండి వచ్చి నేలబ డెను. పునః రావణ హనుమంతు లిద్దరు భూమిపైకి వచ్చి ముష్టి యుద్ధమునకు పూనుకొనిరి.

భల్లూకములు హనుమంతునికి సహాయము వచ్చెను. సురవైరి ద్విగుణీకృతో-త్సాహముతోవానర సేన నెదుర్కొని మాయాయుద్ధమునకు పూనుకొనెను. కటకములోని ప్రతి కపివీరునికి ఒక్కొక్క రావణుడు ప్రత్యక్షమయ్యెను. ఆహవ భూమియం దెల్లడల అసంఖ్యాకులగు రావణు లవతరించుట గాంచి దేవతలు దిగులొందిరి. వానర భల్లూకయోధులు భయాశ్చర్యకంపితులై ''ఓ రామ లక్ష్మణులారా! రక్షింపుడు! రక్షింపుడు!'' అని వెర్రికేకలు బెట్టి అర్తులైరి.

అత్తరి అవధభూపతి ఒక్క బాణప్రయోగముతో రావణుని కృత్రిమ రూపములన్నిటిని తెగటార్చి వానిమాయనుండి వానరులకు విముక్తి కలుగజే-సెను. తద్వారా ఆజిలో అసురేశుడు ఒక్క రూపుతోనే నిలబడియుండెను. స్వర్లోక వాసులా శుభ పరిణామమున కెంతయు సంతసించి శ్రీరామునిపై సుమనో వృష్టి కురిపించిరి.

రావణుడు దేవతల దుడుకుతనమునకు రోషోన్మత్తుడై పై కెగసి దేవతల మీద కురికెను. దివిజులు హాహాకారములు చేయుచూ భయాక్రాంతులై పలాయనమంత్రము పఠించిరి. అప్పు డంగదుడు వియత్తలమున రావణుని వెన్నంటి, వాని కాళ్ళు పట్టుకుని త్రిప్పి భూమిపై కొట్టెను.

నేలపై బడిన నిశాటుడు నిముసములో లేచి కోపావేశముతో కన్నుల అగ్ని జ్వాలలు గ్రక్క, పదిచేతుల పది ధనస్సులు పుచ్చుకొని శరపాతముచే శాఖాచరులను దారుణముగా ధర్షించెను. ప్లవంగవీరులు తమ పాషాణ శిలాఖం-డములతో ప్రాణములకు తెగించి రావణుని దాడి నెదుర్కొనిరి. కమలములపై తుమ్మెదలు విహరించునట్లు నలనీలు లిద్దరు వాని తలలచుట్టూ తిరుగుచూ అనేక విధముల హింసించ మొదలిడిరి. వీరి ఆగడములకు వా డాగ్రహించి నల నీలుర పాదములు ఒడిసి పట్టుకొని నేలకేసికొట్టి బిట్టార్చెను.

దశాననుడంత మరింత భీకరరూపముతో విజృంభించిన వాడై, శక్తిశూల ఖడ్గ గదాప్రహారములతో వానరానీకమునంతటినీ నిమిషములో నిర్జించి శాత్రవ భయంకరముగా సింహనాదము చేసెను. ఆ సమయమున ఋక్షరాజు జాంబ-వంతుడెటనుండియో వచ్చి బలముకొద్దీ పౌలస్త్యుని పాదములతో తన్నెను. ఆ తీవ్ర చరణాహతికి తలలు దిమ్మెక్కినట్లయి దానవనాథుడు నేలబడి స్పృహ గోల్పోయెను.

అప్పటికే దినాంతమై చీకట్లు క్రమ్ముటచే సారథి మూర్ఛాగతుడై పడియున్న రావణునితో రథము తోలుకొని లంకలోనికి పోయెను.

## త్రిజట సీత నాశ్వాసించుట

*"తేహీ నిసి సీతా పహి జాయీ,*
*త్రిజటా కహి సబ కథా సునాయీ"*

ఆ రాత్రి త్రిజట సీతకు రామరావణులకు జరుగుచున్న యుద్ధగతిని గురించి విశదీకరించి చెప్పెను. లోక కంటకుని తలలు యెన్నిమార్లు ఖండించినను తిరిగి మొలుచుచుండిన వార్త ఆమెకు దిగులు పుట్టించెను. అప్పుడు భూపుత్రి దీనస్వరముతో త్రిజట నిట్లు అర్థించెను.

"తల్లీ త్రిజటా! మరాంతకుని శిరము లెందుకట్లు మాటిమాటికీ మొలచు చున్నవి.ఆ ముష్కరుడు మరణించుటకు మార్గోపాయమెట్లు? త్రిజటా! ఏ యే దుర్విధి నా యెదుటికి మాయామృగమును తోలియుండెనో,ఏ దుర్దైవము నానోట లక్ష్మణమూర్తిని దుర్భాషలాడించెనో, యే వక్రరేఖ నన్ను దీర్ఘవియోగాగ్ని క్రాలునట్లు చేసెనో ఆ ప్రతికూల దైవమే రావణునికి తెగిన తలలను తిరిగి సృష్టించుచున్నది. ఓ త్రిజటా! భగవంతుడే నాకు ప్రతికూ-లుడై యున్నాడు."

జానకి దీనాలాపములకు దనుజకాంత హృదయము ద్రవించిపోయెను. ఆమె సానుభూతి పూర్వకముగా వైదేహి నిట్లు ఊరడించెను.

"అమ్మా! వైదేహీ దిగులొందక ధైర్యమవలంబించుము. రావణవధ నిశ్చయము. వానికి కాల మాసన్నమైనది.సురవైరిని వధించుటకు ఒక్క రామబా-ణము చాలునని నమ్ముము. కానీ రావణుని హృదయము ఛేదించుటకు రాము డెందులకో సంశయించుచున్నట్లు తోచుచున్నది. జానకీ! సర్వలోకములు సాకే-తవాసునిలో నున్నవి. ఆ సౌమ్యమూర్తి సదా నీ హృదయములో నివసించుచు-న్నాడు. నిన్ను రావణుడు తన యెదలో నిలుపుకొని యున్నాడు. ఇందుచే, లోకవిద్రావణుని హృదయము ఛేదించిన లోకములకు కీడుమూడునేమో యని స్వామి సందేహించుచుండవచ్చని నేనూహించుచున్నాను" అని పలికి త్రిజట తిరిగి సీత నిట్లా శ్వాసించెను-

"మైథిలీ! రామబాణమునకు రావణుడు నిల్వుట నిశ్చయము అందుకు కొంత వ్యవధి కావలసియుండును. ఎందులకన, రాఘవుడు రావణుని తలలు తెగగొట్టుచునేయుండును. ఇట్లు మాటిమాటికీ శిరచ్ఛేదనము జరు గుచుండుటచే నిశాచరనాథుడు చిత్తశాంతిలేక నిన్ను విస్మరించును. అప్పుడు రామధనుర్ముక్త శిలీముఖ జ్వాలలు రావణాసురుని దహించి వేయుగలవు."

అవి ధైర్యోక్తుల సీత నూరడించి త్రిజట నిజనివాసమున కేగెను. ఆ రాత్రి వైదేహివామాంగము లదరి శుభ నిమిత్తములు తోచెను.

# రావణ సంహారము

ఋక్షవీరుడైన జాంబవంతుని చరణఘాతమునకు అసురనాథుడు స్పృహ కోలుపోగా - సారథి వానిని స్వగృహము చేర్చియుండెను. అట్లు మూర్ఛా గతుడై పడియున్న రావణుడు అర్ధరాత్రికి కన్నులు తెరచి తనకు గలిగిన పరాభవమున కెంతయు వెచ్చనూర్చి సారథి నిట్లు తూలనాడెను- ''ఓరీ మూర్ఖా! రణరంగమునుండి నన్నెందుకు వేరు చేసితివి? అధమా! నీ చర్య యెంత నీచమైనదీ, గర్హితమైనదీ తెలుసుకొనలేకున్నావు.'' అనరేశు డట్లు ఆగ్రహావమానములకులోనై దుర్భాషలాడుచుండ భళ్ళున తెల్లవారెను. పౌలస్త్య వీరుడు పునః సకలాయుధ సంపత్తితో సమాయత్తుడై స్యందన మధిరోహించి సమరభూమికి ప్రస్థానము చేసెను.

రణోత్సాహి రావణబ్రహ్మ కాలాంతకుని పగిది కదలివచ్చుట గమనించిన రామచంద్రుడు - సుంత తడవు హర్షవిషాదములకు లోనయ్యెను. తదుపరి హరు తరుశైలశృంగములు చేపట్టి ఆర్భాటము చేయుచూ పురోగమించి నిశాచరనాథుని యెదుర్కొని దారుణముగా పోరాడిరి. వానర భల్లూకవీరులు వీరోన్మత్తులై విజృంభించి వైరిబలమును నిముసములో నిశ్శేషముగా నిర్జించి దశకంఠునిపై ముసురుకొని వానిని నానావిధముల నొప్పించసాగిరి.

బహుబాహు డా వానరబాధల కోర్వలేక అదృశ్యుడై మాయా యుద్ధమునకు పూనుకొనెను. తత్ప్రభావముచే నిమిషములో యుద్ధభూమి భూతప్రేత పిశాచగణములతో నిండిపోయెను. వికృతాకారులగు భూతగణములు వైరి భయంకరముగా వికటాట్టహాసములు చేయుచూ, కపాలములతో, రక్తము ద్రావుచూ కదనభూమిపై కుప్పిగంతులు వేయసాగిరి. చిటపట అగ్ని జ్వాలలు రగుల్కొనెను. పై నుండి ఇసుక వాన పడెను. ఆ పైన అనేకులగు ఆంజనేయులు ఆవిర్భవించి సాకేతపతిని చుట్టుముట్టి కేరింతలు గొట్టుచూ గంతులు వేయదొడ్గిరి. రాఘవుడా రాక్షసమాయకు ఆగ్రహోదగ్రుడై రొప్పించి ఒక్క శిలీముఖమును అభిమంత్రించి వదలెను. ఆ బాణ ప్రయోగముతో రాక్షసమాయ ఛిన్నాభిన్నమై రణాంగణము పూర్వ స్థితికి వచ్చెను.

అప్పుడు పరస్పరాభిముఖులై నిలబడియున్న రామరావణులతో సమర భూమి శోభించెను. అపూర్వము, అతి భీతావహమైన ఆ రామరావణుల ఘోరయుద్ధమును వర్ణించుటకు అనేకకోట్ల ఆదిశేషులకు కూడ అలవికాని పని. రామరావణ యుద్ధమునకు రామరావణ యుద్ధమేసాటి-

*"రామరావణయో ర్యుద్ధం*
*రామరావణయో రివ"*

రాముడు సంగ్రామాభిరాముడై దీప్తి జెంది, దిక్కటకము లదరునట్లు ధనుష్టంకారము చేసి శత శత నిశిత సాయకములు ప్రయోగించి శాత్రవుని బాహువులను శిరములను భేదించెను. రామధనుర్ముక్త సాయకానీక పాతమునకు రావణుని మస్తక - హస్తములు తెగి భూపతనమగుచుండెను. కానీ వానికి తలలు చేతులు తిరిగీ పుట్టుచుండెను. లోభికి ఉత్తరోత్తరలోభము ద్విగుణీకృత మగుచుండునట్లు పునః పునః పౌలస్త్యుని శిరోభాగములు- బాహుదండములు యథాపూర్వము వృద్ధిపొందుచుండెను. ప్రయోగించి, బహువిధముల ప్రయత్నించి, రాముడు, రావణుని శిరములు భేదించుటయందు సఫలీకృతుడు కాజాలకపోయెను.

రాముడంత సుంత విసుగుకొని, పార్శ్వభాగమందున్న విభీషణుని సాభిప్రాయ దృక్కుల జూచెను. అంతట రావణానుజుడు రఘుపతి వివశతను గ్రహించినవాడై-

*"నాభికుండ సుధా బస యాకే*
*నాథ జియత రావను బల తాకే"*

"నాథా! సురారి నాభిస్థలమందు అమృత భాండమున్నది. తత్ప్రభావముచే వాడు పునర్జీవితుడగుచున్నాడు. కనుక మొదట ఆ అమృత భాండమును శోషింపజేయుము" అని సీతాపతికి సూచించెను.

విభీషణుని సూచనకు రఘువీరుడు అమితప్రసన్నుడై తత్క్షణమే మహాస్త్రమును కోదండమునకు సంధించెను. రఘునాథ్వహుడట్లు శరసంధానము చేయునపుడు దానవాలికి దుర్నిమిత్తములు తోచెను. పిశాచజంతువులు కూత లిడెను.

అంతరిక్షమున తోకచుక్కలు కనబడెను. దిశాంచలముల మంటలు పుట్టెను. అకాలగ్రహణమేర్పడెను. మయతనయ మందోదరి హృదయము అజ్ఞాత భీతిచే కొట్టుకొనెను. రాజప్రాసాదములందున్న ప్రతిమలు కన్నీరుగార్చెను. భూమి కంపించి, గాలులు రేగి, పిడుగులు పడి. నెత్తుటివాన కురిసి, ప్రళయకాల భయోత్పాతములు కలిగెను.

రఘువీరు డంతట ప్రత్యాలీఢపదస్థుడై, ఆకర్ణాంతము నారి లాగి, గురి చూచి, ముష్కరునిపై ముప్పదియొక్క బాణములు వదిలిపెట్టెను. ఆ బాణ సమూహము కాలసర్పములవలె గమించి రావణుని దాకెను. దశకంఠుని నాభి కుండము - శిరము -బాహువులు భేదింపబడి నేలదొర్లెను. అప్పుడు బాహు శిరోరహితమగు రావణుని కళేబరము కంపించునట్లు అడుగులు వేయుచూ అవధేశుని కభిముఖముగా నడచెను. అట్లు తనపై బడుటకు ముందుకు వచ్చు-చున్న రావణ కళేబరమును కోదండ రాము డొక్క కోలతో రెండుగా ఖండించి ధరాతలముపై పడగొట్టెను. దశరథనందనుని బాణములు రావణాసురుని తల-లను చేతులను మందోదరియొద్దచేర్చి తిరిగిస్వామి తూణీరమును చేరుకొనెను. చైత్రశుద్ధ దశమినాడు దానవపతి తన శరీరము విసర్జించెను. ఆ సమయమున దశకంఠుని తేజస్సు దాశరథిలో లీనమయ్యెను. రావణ వధానంతరము సమరాం-గణమును శోభింపజేసిన కోదండరాముని దివ్య వైభవమును శ్రీ గోసాయి తులసీదా సిట్లు స్తుతించెను.

*"-సుర సుమన వర్షహి హర్ష-*
*సంకుల బాజ దుందుభి గహాగహి,*
*సంగ్రామ అంగన రామ అంగ*
*అనంగ బహు శోభాలహి,*
*శిర జటా ముకుట ప్రసూన బిచ-*
*బిచ అతిమనోహర రాజహి,*
*జను నీలగిరి పరతడిత పటల-*
*సమేత ఉడుగన భ్రాజహి,*

భుజదండ సర కోదండ ఫేరిత-
రుధిర కన తన అతిబనే,
జయ రామ మునీ తమాల పర
బైఠీ విపుల సుఖ ఆపనే.-"

వినువీధిలో తటిల్లతా నక్షత్రకాంతిలో విరాజిల్లు నీలగిరి శృంగాగ్రమువలె. రణాంగణమున రామమూర్తి పుష్పాలంకృతమైన శిరజటామకుటముతో శోభిల్లెను. శ్రమాధిక్యముచే ఏర్పడిన స్వేదకణములతో శ్యామలాంగములు శోభించుచుండ, సమరాంగణమున ధీరగంభీరుడై నిలబడియున్న కోదండపాణి శ్రీరాముని దివ్యసుందర విగ్రహముపై ఆ సమయమున పుష్పవృష్టి కురిసెను. దేవ దుందుభులు మ్రోగెను. మునులు, వానరులు, నరులు హర్షోత్సాహముతో దిశలు ప్రతి ధ్వనించునట్లు జయజయ ధ్వానములు చేసిరి. కోసలేంద్రుని కృపా కటాక్ష వీక్షణలచే సర్వలోకవాసులు నిరాపదతో నిర్భయులై సుఖించిరి.

## మండోదరి విభీషణాదులు అసురేశునికై విలపించుట

ప్రాణేశుని ఖండిత శిరములు గాంచి మండోదరి దుస్సహదుఃఖాక్రాంతయై నేలబడి దురపిల్లెను. రావణుని మరణవార్తకు శుద్ధాంత కాంతాజనమంతయు శోక వ్యాకులితమై క్షోభించెను. శోకార్తయగు రావణపత్ని మండోదరిని పరిచారికలు రావణుడు నేలకొరిగిన రణస్థలికి తీసుకునిపోయిరి.

అమేయ బలసంపన్నుడగు తన జీవితేశ్వరుడు విగత జీవుడై ధరణీతలమున దొర్లియుండుటగాంచి మండోదరి గుండెలు బాదుకొనుచు ఎలుగెత్తి యేడ్వసాగెను-

"హా ప్రాణేశ్వరా! అనన్యబల శౌర్యసంపన్నుడవగు నీకు ఎట్టి దురవస్థ సంఘటిల్లెను! హా నాథా! వీరాధివీరా! నీ బలదర్పంబులకు జడిసి భూదేవి గడగడలాడుచుండెను. సూర్యచంద్రాదులు తేజోవిహీనులై వెలవెల బోవు చుండిరి. వాయు వరుణ ఇంద్ర కుబేరాది దిక్పతులు నీ ధాటికు ఓర్వలేక

దిగంతములకు పరుగులెత్తుచుండిరి. నీ వీర్యశౌర్యము కాలునే ధిక్కరించి తేజరిల్లుచుండెను. కొండంతబంధు బాంధవబలము నీ అండదండల విలసియుండెను. జగములను గజగజ లాడించిన ఓ రణధీరా! రావణపతీ! నేడు నీకెట్టి దుర్మరణము సంప్రాప్తమాయెను! జగదేకవీరా! భూమిపై బడియున్న నీ దృఢ శరీరముపై గృధ్రకాకములు కూర్చొని యున్నవే! నీ దండి బాహుదండములను నక్కలు నోట గరచుకొని తిరుగుచున్నవే! అయ్యో! నేడు నీకై యేడ్చుటకు బంధు శేషముకూడ లేకపోయెనా! నాథా! కాలవశుడవై నా ప్రార్థన మన్నించక పోతివి. జగన్నాథుడు శ్రీపతితో వైర మపేక్షించి ఇట్టి దుర్దశకు ఒడిగట్టితివి. దుర్విధి ప్రేరణచే పరమేడా తప్పరుడవైనందున నేడు నీకిట్టి దురవస్థ సంఘటిల్లెనుగదా! ప్రాణేశ్వరా! జానకీవల్లభుడు దయామయుడు. నీ దోసములు లెక్కించక నీకు తన దివ్యధామము ప్రసాదించిన ఆ కరుణామూర్తి సాకేతపతికిదే చేయెత్తి మ్రొక్కులిడుచుంటిని..''

పతివ్రతా కాంతామణి తన భర్త మృతికై ఇట్లు నానావిధముల విలపించెను. మండోదరి పతిగతప్రాణ - సౌశీల్యవతి. ఆమె జ్ఞానద్రష్టయగుటచే దుఃఖార్తురాలైనను వివేకము కోల్పోకుండెను. సురులు,అసురులు మునులు, సిద్ధులు, బ్రహ్మమహేశ్వరులు రావణపత్నికి పరమాత్మ చింతనపట్లగల ప్రగాఢ విశ్వాసమున కచ్చెరువొంది ఆమె పునీత చరిత్రము పలువిధముల శ్లాఘించి పరితుష్టులైరి.

విభీషణుడు పూర్వవైరములు విస్మరించి, అగ్రజుడు అసువులు గోల్పోయినందుకు దుఃఖవివశుడై దురపిల్లెను. శోక విహ్వలురై విలపించుచున్న రాక్షస స్త్రీల గోడు చూచినప్పుడు విభీషణుని హృదయము వ్యథచెందెను. ఆ శోక సమయమున దయానిధి దాశరథి దుఃఖదీనుడై విలపించుచున్న విభీషణుని ఉచిత ప్రసంగోక్తుల ఓదార్చి ''సఖా విభీషణా! గతించిన దానికై దుఃఖించక సోదరునికి ఉత్తరక్రియలు సాంతముగ నిర్వర్తింపుము'' అని బోధించి పంపెను.

తదనంతరము రావణానుజుడు రామాజ్ఞను శిరసావహించి అగ్రజునికి అంత్యక్రియలు విధి విహితముగ ప్రగాఢ భక్తిశ్రద్ధలతో జరిపించెను. ఆ సందర్భమున స్త్రీలు, వృద్ధులు, బంధువులు, మిత్రులు, ఆప్తులు మున్నగు

రాక్షసులనేకులు తుదిసారిగ రావణునికి తిలాంజలు లర్పించి అంజలి ఘటించిరి. పిమ్మట రాక్షసులు రఘుపతి గుణగణములు కీర్తించుచూ విజనివాసములకు చేరుకొనిరి.

## విభీషణునికి లంకారాజ్య పట్టము గట్టుట

అసురేశుని పరలోక క్రియలు పూర్తిగావించి విభీషణాదులు రాముని సన్నిధికి వచ్చిరి. అప్పుడు రామమూర్తి లక్ష్మణమూర్తితో నిట్లనెను-

"సౌమిత్రీ! నీవు - సుగ్రీవుడు - అంగదుడు - నలుడు - నీలుడు - హనుమంతుడు మున్నగువారితో లంకకుపోయి, మనకు మిత్రుడు మహోపకారియగు విభీషణునికి లంకారాజ్యపట్టము గట్టి రావలసినది. నేను వనవాస వ్రతుడనై యున్నందున ఈ శుభకార్య నిమిత్తమై లంకలోనికి రాజాల కున్నాను-"

అని అవధేశుడు ఆనతియ్యగా రామానుజుడంత విలంబనము సేయక వానర ప్రముఖులతో విభీషణుని తోడ్కొని లంకానగరిలో ప్రవేశించెను. వారు రాజ్యాభిషేకమునకు కావలసిన సాధనసామాగ్రినంతయు సేకరింపజేసి, మంత్రి సామంత పురోహిత బంధుబాంధవుల సమక్షమున సర్వ లాంఛనములతో విభీషణుని లంకారాజ్య సింహాసనముపై అధిష్ఠింపజేసి, శాస్త్రోక్తముగా రాజ్యతిలకము పెట్టిరి. రావణ రాజ్యమునకు విభీషణుడు రాజయ్యెను.

ఈ యుత్సవానంతరము రఘుకుల భూషణుడు సమీర కుమారుని చేర బిలిచి - సీతకు తన యోగక్షేమములు తెలియజేసిరావలసినదని చెప్పి పంపెను. ఆంజనేయుడు లంకలో ప్రవేశించగనే అసురులు అనేక విధముల అతనికి స్వాగతసత్కారములుచేసి సీత యొద్దకు తీసుకొనిపోయిరి. రామదూత అల్లంతదూరమున నుండగనే జగదంబ అతనిని గుర్తించినదై - "వీరాగ్రణీ! సమరులు క్షేమమా! రామచంద్రమూర్తి కుశలమా!" అని కుశలప్రశ్న వేసెను.

వాయునందనుడు వినీత భక్తితో వైదేహికి నమస్కృతుడై - రామలక్ష్మణుల కుశలము, పంక్తికంఠుని వధ, విభీషణుని పట్టాభిషిక్తునిచేయుట మున్నగు వృత్తాంతమంతయు సవిస్తరముగ విన్నవించెను. ఈ శుభవార్త చెవులబడగానే

అమందానంద పరవశత్వముచెంది ఆనందాశ్రువులు రాల్చి - "కపి పుంగవా! ఈ శుభవార్త నా కెఱింగించినందులకు నిన్నేవిధముగ నేను సత్కరించగలను! వత్సా! ఆ సాకేతవాసుడు సోదరసమేతుడై సదా నిన్ననుగ్రహించుచుండుగాక! ఇదే నా యాశీర్వాదము. హనుమంతా! ఇక శీఘ్రమే నాకు ఆ కోమలశ్యాముని దర్శనభాగ్యము లభింపజేయుటకు తగుప్రయత్నములు చేయుము -" అని పలికి భూపుత్రి సుప్రసన్నయై సమీరపుత్రుని సాగనంపెను.

## సీతారామ సమాగమము

హనుమంతుని వలన వైదేహి క్షేమముగా నున్నదని విని సీతాపతి సంతోషించెను. అవల, విభీషణుడు, అంగదుడు, హనుమంతుడు ఈ ముఖ్యరు అవధేశుని ఆదేశానుసారము జానకిని తోడ్కొని వచ్చుటకై లంకకు వెళ్ళిరి.

అసురాంగనలు అవనిజకు అభ్యంగన స్నానాదులొనర్చి, అమూల్యభూషణ వసనాదులచే ఆమెను అలంకరించి బంగారు పల్లకిలో కూర్చుండబెట్టిరి. సకల రాజమర్యాదలతో సీతాదేవి అధిష్ఠించిన పల్యంకిక లంకనుండి నిర్గమించి రామ స్కంధావారము చేరుకొనెను. వైదేహిని దర్శించుకొనుటకై వానర భల్లూక సమూహములు త్రొక్కిసలాడెను. రాముడు వానరుల తొట్రుపాటు గమనించినవాడై విభీషణుని పిలిచి "-సీత పల్లకి దిగి నడచివచ్చినట్లయిన వానరు లామెను తల్లినివలె దర్శించుకొనగలరు-" అని పలికెను. అందుమీదట జానకి పల్లకి దిగి పాదచారిణియై ప్రభువున్నచోటకు చేరుకొనెను.

మునుపు అరణ్యవాసము చేయుచున్నపుడు రాముడు సీతను అగ్నిదేవుని కప్పగించి యుండెను. ఆమె ఛాయారూపముగు మాయసీతయే ఇంతవరకు లంకలో నుండినది. ఇప్పుడు దశరథాత్మజుడు మరల తన నిజ సీతను పొందగోరెను. తన్నిమిత్తమై రాఘవుడు సీతను అగ్నిప్రవేశముచేసి తన నిష్కళంకతను ప్రకటించుకొనుమని - లోకదృష్టికి సీతతో కఠోరముగ పలికెను. వానరరాక్షసులు శ్రీరాముని హృదయ కాఠిన్యమునకు మిగుల వ్యథ చెంది కలవరపడిరి.

సీతాదేవి పలిఆదేశమునకు ప్రతివచనము చెప్పక, మరదితో- "లక్ష్మణా! అప్పుడు అగ్నిహోత్రుని సాక్షిగా నేను శ్రీరామచంద్రుని వివాహమాడియుంటిని. మరలా ఇప్పుడు అగ్నిచే పునీతనై నా స్వామిని సమీపింతును. కనుక నీవు సత్వరమే అగ్నిగుండ మేర్పరచి నా ధర్మ ప్రవర్తనకు సహాయపడుము-" అని దృఢస్వరమున పలికెను. సౌమిత్రి శోకస్వాంతుడై సుంతకాలము మౌనము ధరించి, తదుపరి అగ్రజుని అభిమతము తెలుసుకొని, కాష్ఠములు పేర్చి అగ్నిరగిల్చెను.

అప్పుడు మైథిలి అగ్నిహోత్రునకు అంజలి ఘటించి - హుతాశనా! నేను త్రికరణశుద్ధిగా సదా శ్రీరామునే సేవించుచున్నాను. నీవు నాకు చందన గంధము-వలె చల్లదనము ప్రసాదింపుము - అని ప్రార్థించి ఆమె అగ్నిలో ప్రవేశించెను. ఆ ప్రచండాగ్ని జ్వాలలు మాయాసీతను క్షణములో దహించివేసెను. అప్పుడు అగ్నిదేవుడు ప్రత్యక్షమై క్షీరసాగరుడు లక్ష్మీదేవిని శ్రీ విష్ణువుకు సమర్పించుకొనినట్లు - నిజసీతను తీసుకొనివచ్చి హుతాశనుడు శ్రీరామునికి సమర్పించెను. జగదంబ జానకి శ్రీరాముని వామభాగమున శోభించెను. ఆ శుభసమాగమము పురస్కరించుకొని స్వర్లోకవాసులు సంతోషించిరి. దివ్యదుందుభులు మ్రోగెను. పుష్పవృష్టి జరిగెను. నరవానర రాక్షసమునీశ్వరులాదిగ హర్షితులై - జయ జయ ధ్వానములు చేసిరి.

"జానకీ సమేత ప్రభు
శోభా అమిత అపార
దేఖి భాలు కపి హర్షే
జయ రఘుపతి సుఖసార."

## స్వర్లోకవాసులు సాకేతనాథుని స్తుతించుట

యుద్ధానంతరము ఇంద్రసారథి మాతలి ఇనవంశ కుల దీపకునికి సాష్టాంగ మొనర్చి, సెలవు తీసుకొని రథముతో ఇంద్రపురి కేగెను.

లంకేశుడు లోకకంటకుడు. ఆ దేవఘాతకుని నిర్జించి దాశరథి జగత్త్రయ

మును రక్షించెను. ఆ శుభ సమయమున దివిజులు దశరథాత్మజుని వెంగట నిలిచి ముకుళితహస్తులై స్వామి నిట్లు స్తోత్రించిరి.

రావణ పాప మూల సురద్రోహీ,
సోఉ కృపాల తవధామ సిధావా;
హము దేవతా పరమ అధికారీ,
స్వారథ రత తవ భక్తి బిసారీ;
భవ ప్రవాహ సంతత హమ పరే,
అబ ప్రభు పాహి శరణు అనుసరే.

"ఓ సర్వజ్ఞా! శ్రీరామచంద్రమూర్తీ! రావణుడు కామక్రోధ లోభ మద మాత్సర్య పరాయణుడు అయినప్పటికీ ఆ దేవశత్రువు తమ దివ్యసాన్నిధ్యము చేరుకొనగలిగెను. కానీ, మేము దివ్యులమైయుండియు సదా స్వార్థ చింతనగల వారమై, ఉత్కృష్టము, ఉత్తమోత్తమమగు భక్తిమార్గమును విసర్జించి జనన మరణ దుఃఖభరితమగు ఈ భవసాగరమునబడి కొట్టుమిట్టాడుచున్నాము. ఓ దేవాదిదేవా! దాశరథీ! సమయ సందర్భములనుబట్టి మీరు కాలానుగుణముగ మత్స్య కూర్మ వరాహ నృసింహాది అవతారములెత్తి దుఃఖార్తులైయున్న మమ్ము అదుకొని కష్టముల నుండి గట్టెక్కించితిరి. ఓ బ్రహ్మ స్వరూపా! ఆ దేవతలు సదా మీ చరణాశ్రయులని విస్మరించక రక్షించవలసినది."

## కమలభవు డిట్లు కీర్తించెను

ఆపైన చతురాననుడు బద్ధహస్తుడై ముందుకు వచ్చి భక్తి పరవశుడై ప్రభువు నిట్లు స్తుతించెను.

"ఓ కోదండపాణీ! రఘువంశ విభూషణా! సుఖధామా! సచ్చిదానంద రూపా! సర్వ వ్యాపకా! సాకేతనాథా! కోటిమన్మథుల ధిక్కరించు సుందర స్వరూపా! మునులు, సిద్ధులు, కవులు సదా - సర్వదా నీ యశశ్చంద్రకీర్తిని గానము చేయుచుందురు. బలధీరా! భవరూపమనెడి మదగజమును మర్దించుటకు నీవు మృగరాజువు. పక్షీంద్రుడు పామును సాధించుభంగి నీవు విర్జరారి

నిశాచరనాథుని నిర్జించితివి. గుణభూషణుడగు విభీషణుని అసురరాజ్యమునకు అధిపతిగా చేసితివి. అమేయ భుజబల సంపన్నుడవై దుష్టులను శిక్షించి భూభారము నివారించితివి. ఓ రఘుకులరామా! నీవు గుణధాముడవు, జ్ఞానస్వరూపుడవు, జన్మరహితుడవు, గుణ కర్మాతీతుడవు, అఖండుడవు, అగోచరుడవు. ఓ వేదవేద్యా! నీ సుందర ముఖారవిందము నిరంతరము చూడగలిగిన నీ అనుచరు లెంత సుకృత జన్ములు! ఓ జగత్సాక్షీ! నీపాద పద్మములను పార్వతీ పరమేశ్వరులు సేవించుచుందురు. ఓ దయానిధీ! దాశరథీ! నీ కిదే నా భక్త్యంజలి. దేవా! నీ చరణ కమలములపై నాకు అనన్య ప్రేమ కలిగియుండునట్లు అనుగ్రహింప వేడుచున్నాను-'' కమలభవు డట్లు పులకితగాత్రుడై అనేక ప్రకారముల అయోధ్యాపతిని కీర్తించెను.

## దశరథుడు దాశరథిని దీవించి దివికేగుట

ఇవ్విధముగ దేవతలందరు దివినుండి దిగివచ్చి స్వామిని సన్నుతించు శుభ సమయమున దశరథమహారాజు కూడ దేవలోకమునుండి దిగివచ్చెను. మహారాజు తనబహిః ప్రాణమగు పుత్రుని గాంచి ప్రేమోత్కంఠచే పరవశుడై ఆనందబాష్పములు రాల్చి ఆత్మజుని మనసార ఆశీర్వదించెను. పురుషోత్తముడంత భక్తిప్రమత్తతతో పితృపాదములకు ప్రణమిల్లి, తదుపరి తండ్రికి జ్ఞానబోధ చేసెను. మహారాజు ముదమంది రామ బ్రహ్మకు నమస్కరించి వెంటనే పరమ పదమునకు పయనించెను.

''ఓ గిరికుమారీ! కుమారునిపైగల ప్రేమాతిశయముచే దశరథున కింత వరకు మోక్షప్రాప్తి కలుగకుండెను. సగుణోపాసకులు ద్వైతభావముతోన స్వారాధించుటంజేసి వారికి కైవల్యము సిద్ధించదు. అట్టి వారికి స్వామి తనభక్తిని ప్రసాదించుచుండును. అందుచే శ్రీరాముడు తండ్రికి బ్రహ్మజ్ఞాన ముపదేశించి తద్ద్వారా ముక్తిని బొందునట్లు చేసెను.

## సురేశుడు కోసలేశునకు కృతజ్ఞతలు దెల్పుకొనుట

ఆ మంగళ సమయమున శచీపతి సాకేతపతి ముందట నిల్చి దోసిలొగ్గి గద్గదకంఠుడై దశరథరాము నిట్లు ప్రార్థించెను-

"ఓ శోభానిధీ! భక్తాశ్రయా! శరకోదండపాణీ! రఘునాథా! నీకు జయము కలుగుగాక. ఓ ఖరదూషణరావణాది రాక్షసాంతకా! నేటికి మా బాధలు తొలగె. నీ అభయాశ్రయము చిక్కి సనాథుల మైతిమి.

ఓ సీతాపతీ! దీనబాంధవా! నిజము చెప్పుచున్నాను. నాతో సమానుడు లేడను స్వాభిమానముతో నేను గర్వించియుంటిని. స్వామీ! నీ చరణ సందర్శనముచే నాదురభిమానము తొలగిపోయెను. ఓ రమారమణా! వేదోక్తమగు నిర్గుణబ్రహ్మను ఇతరు లెందరు ఉపాసించినను నేను మాత్రము సగుణరూపుడగు శ్రీ కోసలరామునే సేవించుచుండెదను. ఓ రామా! సీతాలక్ష్మణ సమేతముగా నీవు సదా నా హృదిలో నివసింపుము. ఇదియే నా ప్రగాఢ వాంఛ. స్వామీ నా వేడికోలు మన్నించి నే నిప్పుడేమి చేయవలసి యుండునో ఆజ్ఞాపింప కోరుచున్నాను."

సురపతి వినీత భక్తికి శ్రీపతి మిక్కిలి సంతసించి ప్రసన్నభావమున - "అమరేశ్వరా! నా నిమిత్తమై తమ ప్రాణములు విడనాడిన ఈ వానర భల్లూక సమూహమును బ్రతికింపజేయుము -" అని సురనాయకుని కోరెను.

ఓ వినతాసుతా! అవధేశుని హృదయము అతి అగాధమైనది. ఆ మహామహుని భావగంభీరతను తెలుసుకొనుటకు మహామునులే సమర్థులు. సర్వశక్తి సంపన్నుడగు ఆ జగదీశ్వరుడు దేవేంద్రుని గౌరవించుటకై అట్లాదేశించెను- అని కాకభుశుండి గరుడునికి స్పష్టము చేసెను.

స్వామి సంకల్పానుసారము సహస్రాక్షుడు ఆ క్షణమందే అమృతము వర్షింపజేసి విగతజీవులై పడియున్న వానర భల్లూకములను పునర్జీవితులగునట్లు చేసెను. ఆ సమయమున హతులై పడియున్న అమర సమూహములపై కూడ అమృతధార వర్షించెను. కానీ, యుద్ధము చేయుచున్నప్పుడు రాక్షసుల మనస్సులు రామునిమీద లగ్నమై యుండినందున వారు కైవల్య పదము చేరుకొనిరి. అందుచే నక్తంచరుల శవములు వానరులవలె సజీవములు కాలేదు. వానరులు దేవాంశ సంభూతులైనందున వారి ప్రాణములు వారి పూర్వాంశములందు చేరెను. రావణుడు దుష్టుడైననూ రామబాణములు వానికి మునీశ్వరులకు లభ్యముకాని ముక్తిపదమును ప్రసాదించెను.

ఆ పైన స్వర్లోకవాసులు సీతానాథుని అనేకవిధముల సేవించి విమానారూఢులై నిజలోకములకు ప్రస్థానించిరి.

## పరమేశ్వరుని ప్రశస్తి

బ్రహ్మేంద్రాదులు ప్రభువును అభినందించి వెళ్ళిన పిమ్మట జ్ఞానఘనమన్న డగు సదాశివుడు అల్లన ముకుళితహస్తుడై శ్రీరాముని సమీపించి ఆనంద బాష్పపూరితుడై మేనుపులకరింప అవధేశు నిట్లు నుతించెను-

"ఓ శరచాపధారీ! రఘుకులసోమా! రావణాంతకా! నీవు నీ భక్తుల యందు నీ మమతా మమకార మేఘపటలమును ఉన్మూలించుటకు ప్రచండ పవనుడవు. ని న్నుపాసించు సాధకులకున్న శంకలు దహించుటకు నీవు హుతాశనుడవు. సగుణమూర్తివి, భ్రమాంధకారమును విచ్ఛిన్నము చేయు ఉదయభాస్కరుడవు. కామక్రోధాది మదగజములను మర్దించు మృగ రాజవు. ఈ భవసాగరమును మథించి తరించుటకు నీవు మందరగిరి వంటి వాడవు. వాంఛా వాసనారూపమగు వనజ శ్రేణి పాలిటి హిమపాతముపలె నొప్పు ఓ ప్రణతార్తిహరా! నా శిష్యకోటి నీకు శ్రమకలిగించినం దుకు నేను చేయెత్తి నమస్కరించుచున్నాను. నన్ను మన్నించవలసినది.

పరాత్పరా! నిజజనానందకరా! మేఘశ్యామా! రామా! నీవు సీతాలక్ష్మణ సమేతముగా సర్వదా నా హృదయపీఠ మలంకరించి నన్నను గ్రహింపుము. ఓ రామనృపాలా! అనతికాలములోనే అయోధ్యలో నయనానందకరముగా జరుగు నీ పట్టాభిషేక మహోత్సవసందర్భమున మరొక్కమారు అక్కడకు వేంచేసి పున ర్దర్శనము చేసుకొందును - "శంకరు డట్లనేకరీతుల కాకుత్స్థమణిని కీర్తించి కైలాసమున కేగెను.

## ప్రయాణ సన్నాహము

*"కరి బినతీ జబ శంభు సిధాయే,*

*తబ ప్రభు నికట విభీషణు ఆయే.*

నాయి చరన సిర కహా మృదుబానీ,
వినయ సునహు ప్రభు సారంగపానీ.''

ఇటులాతడట్లు విన్నవించిన పిమ్మట, నిశాచరపతి విభీషణుడు పరమ వినీత భావముతో ప్రభువుచెంగట నిలిచి, పాదపద్మములకు ప్రణామముచేసి మృదుమధురోక్తుల ఇట్లు విన్నవించుకొనెను-

''ఓ శార్ఙ్గకోదండధరా! రఘువీరా! రావణుని సబాంధవముగసంహరించి, దీనుడు దుర్బలుడగు ఈదాసుని సంరక్షించితివి. యశోధామా! నీ కీర్తిచంద్రికలు ముల్లోకముల వ్యాపించెను. ధర్మజ్ఞా! తమపాద స్పర్శచే ఈదాసుని గృహము పావనముజేసి, మదీయ సేవా పరిచర్యల సుంత విశ్రాంతి నొంది, నన్ను ధన్యుని చేయవలసిందిగా వేడుకొనుచున్నాను. దేవా! నాదేశకోశములాది సర్వసంపదలు స్వకీయమైనవిగా భావించి వానిని వానరులకు పంచి పెట్టవలసినది. ప్రభూ! నేను మిమ్మనుసరించి సాకేతపురికి వచ్చుటకై అనుమతి కోరుచున్నాను-''

అసురోత్తముని పరమ వినీత త్యాగశీలతకు ప్రభువు పరమానందభరితుడై ప్రేమతో ఇట్లు ప్రవచించెను- ''సోదరా! నీవు నిజమాడితివి. నీ యభిమత ప్రకారము ఈ రాజ్యసంపదలన్నియు నాకు చెందినవే. కానీ ప్రస్తుతము నా మనస్సు భరతాయత్తమై యున్నది. కైకపుత్రుని స్థితి మనస్సుకు వచ్చినప్పుడు నాకు నిముస మొక కల్పముగా గడుచుచున్నది. తాపస వేషమున సదా నన్ను స్మరించుచూ కృశగాత్రుడైయున్న భరతసోదరుని గాంచుటకై నా హృదయము కొటకొట లాడుచున్నది. విభీషణా! వ్యవధి గతించిన పిమ్మట భరతుడు బ్రతికియుండ చూడగల్గుట అసంభవము. కాబట్టి ప్రస్తుతము నేను యథా శీఘ్రము అయోధ్య చేరుకొను ఉపాయము అన్వేషింపుము. సఖా! రక్షోనాథా! నీవు నిరంతరము నా స్మరణ చేయుచూ ఒక కల్పాంతము రాజ్య మేలు కొనుము. తదుపరి నీవు నా సాన్నిధ్యము పొందగలవు.''

లంకాధిపు డా పలుకుల కమందానంద భరితుడై హుటా హుటి లంకకు పోయి, కుబేరుని పుష్పకవిమానము ధనకనక రత్న మణి దివ్యవస్త్రాద్యలంకార

వస్తుసంపదలో నింపుకొని దాశరథి చెంతకు తెచ్చెను. శ్రీరాముడా అమూల్యవస్తు రాశిని గాంచి ఒకింత మందహాసముచేసి - విభీషణా! ఈ వస్తుసంపదను విమానము నుండి వానరానీకముపై వర్షింపజేయుము - అని సెలవిచ్చెను. విభీషణు డా ప్రకారము పైనుండి వానర స్వర్ధాధారమెల్లెడల వెదజల్లించెను. వానర భల్లూకములు ఉత్సాహితులై యథేచ్ఛగా వానిని సంగ్రహించి సంతుష్టులైరి. వానరులు చీనిచీనాంబరములను నానావిధముల ధరించి గంతులువేసిరి. మణివజ్రములను వారు నోటితో కొరికి, ఫలములుగాదని తెలుసుకొని పారవేసిరి. వారి వానర చేష్టలను చూచి రామాదులు కడుపుబ్బ నవ్వుకొని ఆనందించిరి. అవధేశు డాపిమ్మట అసంఖ్య వానర భల్లూకములను యథాయోగ్యముగ నానా విధ కానుకలచే సత్కరించి వారి యెడల తన ప్రగాఢ ప్రేమానురాగము వ్యక్తము చేయుచూ - "ఓ వనచరోత్తములారా! నాకు మీరొనర్చిన సేవ అసామాన్య మైనది. మీ సహాయమువలన నేను రావణుని సంహరించి విభీషణుని లంకాధిపతి చేయగలిగితిని. మీ సత్కృతి, సహాయములు చిరస్మరణీయములు. ఇక మీరు మీ నిజ నివాసములు చేరుకొని నన్ను స్మరించుకొనుచు నిర్భయులై సంచరింపుడు -" అని ప్రవచించెను.

సీతారామలక్ష్మణులను వదలి వెళ్ళుటకు వారికి కాళ్ళాడకపోయెను. తదుకు వారు బాష్పలోచనములతో ప్రభువుకు ప్రదక్షిణపూర్వక నమస్కారము లొనర్చి, హర్షవిషాద మనస్కులై బహుప్రయత్నముతో గృహోన్ముఖులైరి. కానీ సుగ్రీవుడు, జాంబవంతుడు, అంగదుడు, నలుడు, నీలుడు, హనుమంతుడు మున్నగు ముఖ్యానుచరుల హృదయములు స్వామిని త్యజించుటకు సుతరాము ఒప్పుకొనలేదు. వారు ప్రేమవశులై చేయునదిలేక నిశ్చ నములుచు తలలవంచుకుని ఎక్కడి వారక్కడ నిలువబడి యుండిరి. దాశరథి వారి విశుద్ధప్రేమానురాగమునకు ముగ్ధుడై సాదర వచనముల "మిత్రులారా! మీరు నాతో విమాన మెక్కి అయోధ్యకు రావలసినది" అని కోరెను. తదుపరి సీతా రామ లక్ష్మణులు విభీషణ సుగ్రీవాది ప్రముఖులతో పుష్పక మారోహించిరి. విమానము త్రుటిలో వియత్తల మందుకొని ఉత్తరాభిముఖముగ పయనము సాగించెను.

# తిరుగు ప్రయాణము

మేరుగిరిపై మెరుపుతోనున్న మేఘమువలె సీతారాములు పుష్పకముపై శోభించిరి. స్వామి సీతాసమేతముగా ప్రత్యావర్తనముచేసిన ఆ శుభవేళ - అమరులు ఆకాశము నుండి వారిపై పుష్పములు చల్లిరి. చల్లని వాయువులు వీచెను. గంగా సముద్రోదకములు తేటపడెను. సర్వత్ర శుభ సూచనములు గన్పట్టెను. దిశాభాగములు - తేజస్సుతో దీప్తిజెందెను.

అట్లు వారు విమానముతో లంకాతీరము వదలి ఉత్తరదిశగా ప్రయాణించునపుడు సాకేతనాథుడు సీతకు - రాక్షసులతో యుద్ధముచేసిన రంగస్థలము, మేఘనాధుని లక్ష్మణుడు చంపినచోటు, లంకాతీరమందంతటా కుప్పతిప్పలుగా పడియున్న రాక్షసుల కళేబరములు, రావణ కుంభకర్ణులు నేలకొరిగిన ప్రదేశము, నిరంతర తరంగాభీలమై యొప్పుచున్న సముద్రము, సేతువు, రామలింగేశ్వరుని ప్రతిష్ఠించిన పుణ్యస్థలము, దండకారణ్యము, మునిజనవరములు - మున్నగు వాటిని చూపించెను. వారు దారిమధ్యలో అత్రి, అగస్త్యాది మహర్షుల ఆశ్రమవాసములందు విమానము దిగి, మునీశ్వరుల దీవన లందుకొని తిరిగి ప్రయాణము సాగించిరి.

పుణ్య సలిల గంగాయమునలను గాంచినపుడు వైదేహి పరమశ్రద్ధాభక్తితో వారికి నమస్కరించెను. పుష్పకము అచ్చోటనుండి త్వరగ తీర్థరాజ్ ప్రయాగ - త్రివేణి - సంగమస్థల మతిక్రమించి అయోధ్య సమీపించెను. అనతిదూరమున అయోధ్యానగరి సాక్షాత్కరించగనే రామాదులు ప్రహృష్టమానసులై పట్టణమునకు ప్రణమిల్లిరి. పుష్పకము సాకేతపురిని సందర్శించుకొని పునః త్రివేణీతీరమునకు వచ్చి అక్కడ భూమిపై దిగెను. వారక్కడ త్రివేణీసలిలములందు స్నానమాడి ఒకింత సేదదేరిరి. శ్రీరాముడప్పుడు ఆంజనేయుని చేరబిలచి - మారుతీ! నీవు ఒకింత ముందుగ అయోధ్య చేరుకుని భరతాదులకు మా క్షేమాగమనాదులు తెలియజేసి రావలసినది - అని చెప్పి భరతుని యొద్దకు పంపెను.

సీతారాములు పునః విమానారూఢులై భరద్వాజుని ఆశ్రమము చేరుకొనిరి. వారచట మునీశ్వరుని ఆతిథ్యముచే పరితృప్తులై వారి ఆశీర్వాదము లందుకొని అచ్చోటు వీడి భాగీరథీతీరమునకు పయనించిరి. భూపుత్రి గంగా

భవానికి పరమభక్తితో పూజలొనర్చి పుష్పాంజలి ఘటించెను. త్రిపథగ ప్రత్య-క్షమై వైదేహిని - సౌభాగ్యవతీభవ -యని ఆశీర్వదించెను.

సీతారాముల శుభాగమనవార్త తెలుసుకుని నిషాదపతి స్వజన సమేతముగా పరుగెత్తుకొని వచ్చి దేవదేవుని సందర్శించి తన్మయుడై అతని పాదపద్మములపై బడిపోయెను. రామమూర్తి నిషాదసఖుని రెండు చేతులతో లేవనెత్తి ప్రగాఢ ప్రేమతో హృదయమున చేర్చి, సాదరవచనముల అతని యోగక్షేమములు విచారించెను. గుహుడు స్వామి తనపై చూపెట్టిన ప్రేమ వాత్సల్యములకు పర-వశుడై భక్త్యంజలి ఘటించి "ఓ సాకేతపతీ! బ్రహ్మమహేశాదులు సేవించు మీ పవిత్రపాద పద్మములు సేవించుకొని మేము పబాంధవముగ పూర్ణకాములమై సర్వసుఖములు పొందగలిగితిమి. జగన్నాథా! మీకివే మా శత శత నమస్కార ములు" అని పలికెను. రామ చంద్రమూర్తి నిషాదపతి నిశ్చలభక్తికి ముగ్ధుడై ప్రీతితో గుహుని భరతసోదరునివలె: భావించి పలుమార్లు హృదయమునకు హత్తుకొని ఆనంద విహారుడయ్యెను.

ఎవరు ప్రేమతో సాకేతనాథుని సమర విజయగాథ శ్రద్ధాభక్తితో పఠించె-దరో, వినెదరో వారికి పరమేశ్వరుడు విజయము, వివేకము, నిత్యసంపదల నొసంగుచుండును.

*"సమర విజయ రఘువీరకే*
*చరిత జే సునహి సుజాన,*
*విజయ వివేక విభూతినిత*
*తి్న్హ హి దేహి భగవాన."*

ఇతి శ్రీమద్రామచరిత మానసే
సకల కలికలుష విధ్వంసనే
విమల విజ్ఞాన సంపాదనో నామ
షష్ఠః సోపానః సమాప్తః.

(లంకాకాండ సమాప్తము.)

# ఉత్తర కాండ

కేకీకంఠాభనీలం సురవర విలస
ద్విప్రపాదాబ్జ చిహ్నం
శోభాఢ్యం పీతవస్త్రం సరసిజనయనం
సర్వదా సుప్రసన్నమ్,
పాణౌ నారాచచాపం కపినికరయుతం
బంధునా సేవ్యమానం,
నౌమీడ్యం జానకీశం రఘువర మనిశం
పుష్పకారూఢ రామమ్.

పదునాలుగేండ్ల వనవాసము పూర్తి అగుటకు ఇంకొక్కదినమే మిగిలియున్నది. సాకేతపురవాసులు - రాజపరివారము - కౌసల్యాది దేవేరులు - రామాదుల పునరాగమన శుభముహూర్తమునకై వేయికండ్లతో వేచియున్నారు. నగర వాసులకు ఎల్లెడల శుభనిమిత్తములు తోచెను. ఇంతలో రామమూర్తి సీతాలక్ష్మణ సమేతముగా శుభాగమనము చేయుచున్నాడను వార్త వ్యాపించగనే ఆబాలగోపాలము అయోధ్య ఆనందాబ్ధిలో మునిగి తేలెను.

రామదర్శనోత్కంఠితుడై క్షణ మొక యుగముగా గడుపుచున్న భరతు డీవేళ ఇట్లు తర్కించసాగెను.

"వనవాసవ్రత పరిసమాప్తికి ఇంకొక దినమే శేషమున్నది. అగ్రజు డింకనూ రాకుండుటకు హేతువేమి? వ్యవధి మీరక మునుపే అన్నయ్య ఆగమనము అవశ్యమై యున్నది. నేను కుటిల స్వభావుడని భావించి నన్ను చూచుటకు ఉపేక్షించెనో? అందుకే కాబోలు సోదరుడు నన్ను వదలిపెట్టి సౌమిత్రిని వెంట తీసుకునిపోయినది. ఆహా! అగ్రజుని అనుగమించిన ఆ లక్ష్మణుడెంత

అదృష్టశాలి! ఊహుం, నా ఊహ సరికాదు. ప్రభువు కృపామూర్తి.

అతడు భక్తుల దోసములు సైరించు సదయ హృదయుడు. కౌసల్యా తన యుడు తప్పక వచ్చును. నన్నను గ్రహించును. అదిగో నాకు శుభములు తోచు చున్నవి.''

భరత డిట్లు డోలాయమానుడై విరహాంబుధిలో మునిగియున్న తరి, అత నిని రక్షించుటకు వచ్చిన నావవలె హనుమంతుడు భూసురుని రూపమున అక్కడికి చేరెను.

*బై తే దేఖి కుసాసన జటాముకుట కృసగాత,*

*రామ రామ రఘుపతి జపత స్రవత*

*నయన జలజాత.*

జటలుదాల్చి దుర్బల శరీరముతో బాష్పపూరిత లోచనుడై దర్భాసనముపై కూర్చుని రామనామస్మరణ చేయుచున్న కైక పుత్రునిగాంచి ఆంజనేయుడు హర్షితుడై అల్లంత దూరమునుండియే ఎలుగెత్తి - ''ఓ భరత నృపాలా! విర హార్తితో రేయింబగలు ఎవరిని స్మరించుచున్నావో, ఏ పుణ్యమూర్తిని దర్శించు-టకై ఉవ్విళ్ళూరుచున్నావో, ఆ రఘువంశోత్తముడగు రామచంద్రుడు నిశాచరు-లను నిర్జించి, దేవజాతికి శాంతి లభింపజేసి, సీతాలక్ష్మణ సమేతుడై సురక్షిత ముగ మరలి అయోధ్యకు వచ్చుచున్నాడు - '' అని పలికెను.

కపిపుంగవుని అమృతోక్తులు కైకసుతునికి కర్ణపేయముగా నుండెను. అత డంత ప్రహృష్టాంతరంగుడై - ''ఓ సౌమ్యా! ప్రియ వచనములతో శుభవార్త తెలియజేయుచున్న మీ రెవరు? ఎచ్చట నుండి వచ్చుచుంటిరి?'' అని పర మాదరముతో ప్రశ్నించెను.

ఆగంతుకుడు బ్రాహ్మణరూపు పరిత్యజించి, నిజరూపముతో భరతుని ఎదుట నిలబడెను. భరతు డంత రామసేవకుని గుర్తించి పులకితగాత్రుడై ఆనందాశ్రువులు స్రవించుచుండ అంజనీసుతుని ప్రగాఢ ప్రేమతో గాఢాలింగ-నము చేసి - ''కపిపుంగవా! నీ దర్శన స్పర్శనలచే నా కష్టములు గట్టెక్కి

బాధలు తీరెను. మారుతీ! ఈ శుభవార్తకు సాటిరాగల ప్రత్యుపకారము నీకు చేయకుంటిని. హనుమంతా! సీతాపతి యోగక్షేమములు సాంతముగ శ్రుతపరచి నన్నానందింపజేయ వేడుచున్నాను'' అని పచించెను.

ఆంజనేయుడు భరతుని గుణశీలములకు ముగ్ధుడై అతనికి సావధానముగ సీతారామలక్ష్మణులకు సంబంధించిన సకల సమాచారము విశదముచేసి - ''భరతా! నీవు ప్రభువుకు ప్రాణ సమానుడవు. స్వామి స్వముఖముతో సదా నీ గుణగణములు వర్ణించుచుండును. నీవు నిక్కముగా ధన్యుడవు.'' అని పలికి ఆంజనేయుడు సాష్టాంగపడి రామానుజుని పాదములకు నమస్కరించెను.

తదుపరి హనుమంతుడు భరతునియొద్ద సెలవు తీసుకొని నందిగ్రామము వదలి రామాదులున్నచోటికి వచ్చెను. రఘుపతి మారుతివలన భరతాదుల కుశల క్షేమములు తెలుసుకొని సంతుష్టుడై సీతాలక్ష్మణ సమేతముగా విమానమెక్కి బయలుదేరెను.

## రామభరతుల సమాగమము

భరతుడు సత్వరమే నందిగ్రామమునుండి నగరికి వచ్చి గురువులకు, తల్లులకు రాజపరివారమునకు పురజనులకు ఈ సంతోషవార్త తెలియజేసెను. సీతారామలక్ష్మణుల శుభాగమన సమాచారము తెలియగనే సాకేతపురి సంతోషముతో సంభ్రమించెను. స్వామి మంగళాగమనము పురస్కరించుకొని శీతల సుగంధ పవనములు ప్రసరించెను. సరయూనది నిర్మల జలపూరితమై భాసించెను. రామాగమనవేళ సాకేతపురి సకల శోభలచే రాణించెను.

సువాసినులు సర్వాలంకారశోభితలై స్వర్ణపాత్రలందు దధి - క్షీర - లాజా - పుష్పాది మంగళ ద్రవ్యములు తీసుకొని బయలుదేరిరి. భరత శత్రుఘ్నులు, వసిష్ఠ వామదేవాది గురువర్యులు, సుమంత్రాది మంత్రిముఖ్యులు, కౌసల్యాది దేవేరులు, రాజబంధువులు, భూసురశ్రేష్ఠులు, పరివార పరిజనము, పురంధ్రీమణులు మొదలగువారు మంగళవాద్యములతో సీతారాములకు స్వాగత మిచ్చుటకై ఎదురు వచ్చిరి. రథ గజ తురగ పదాతి దళములు, నానావిధ వాహనములు వివిధ వాద్యబృందములు వారి ననుసరించి నడచెను. ఆ స్వాగతోత్స-

నము నయనానందకరముగా నుండెను. అట్లు పురోగమించు పురవాసులు ఆకా-శములో ఎగురుచున్న పుష్పకవిమానముజూచి సంతోషము పట్టలేక శరత్కాలం చంద్రుని జూచు సాగరునివలె ఉప్పొంగిపోయిరి.

అల్లనల్లన పుష్పకము సాకేతపురిని సమీపించెను. బహుకాలానంతరము అయోధ్య అగుపడగా రామమూర్తి కన్నులు అశ్రుపూరితమయ్యెను. అవధేశు డప్పుడు సుగ్రీవాంగద - విభీషణాదులను జూచి కంపిత స్వరమున "మిత్రు లారా! ఆ కానవచ్చు సుందర నగరమే నా జన్మస్థలమైన అయోధ్య. ఈ నగ రము నా కత్యంత ప్రియమైనది. దీనికి ఉత్తరభాగమున పుణ్య స్రవంతి సరయువు ప్రవహించుచున్నది. ఈ నగరవాసులు నా యనురాగమును చూర గొన్నవారు-" అని అయోధ్యను గురించి ప్రేమతో ప్రసంగించెను. ఇంతలో పుష్పకము మెల్లన భూమిపై వ్రాలెను. సీతారామలక్ష్మణులు, వానర రాక్షస బృందము విమానమునుండి వెలుపలికి వచ్చిరి. తదుపరి పుష్పకము స్వామి ఆజ్ఞ పురస్కరించుకొని కుబేరుని యొద్దకు మరలిపోయెను.

విరహార్తులగు పురవాసులు ప్రభుదర్శనార్థమై ముందుకు త్రోసుకొనిరి. దశ-రథ నందనుడు శరచాపములు క్రిందబెట్టి మొదట వశిష్ఠ వామ దేవాది గురు వులకు పాదాభివందన మొనర్చి వారి ఆశీస్సులందుకొనెను. భరతుడు అశ్రువు లతో అగ్రజుని పాద ప్రక్షాళన చేసెను. రామమూర్తి తమ్ముని పైకి లేవనెత్తి హృదయమున కత్తుకొని కన్నీటితో మూర్ధాభిషేకము చేసెను. మూర్తీభవించిన శృంగార, ప్రేమలవలె ఆ సోదరద్వయము గాఢాలింగనబద్ధమై బాహ్య ప్రపంచ మునే మరచెను. నేత్రానందకరమైన ఆ యన్నదమ్ముల ప్రియసమాగమము అపూ-ర్వము, వర్ణనాతీతమైయుండెను.

తదుపరి దాశరథి చిన్నతమ్ముడు శత్రుఘ్నుని కౌగిట జేర్చి అపార సుఖ మనుభవించెను. లక్ష్మణ శత్రుఘ్నులు ప్రగాఢ ప్రేమతో ఒండొరుల కలుసు కొనిరి. పిమ్మట భరత శత్రుఘ్నులు భక్తిప్రేమలతో సీతాదేవి చరణములకు నమస్కరించిరి. రాముడు జగదభిరాముడుగదా! అతడు ప్రజలందరినీ యథాయోగ్యముగ పలుకరించి వారి యోగక్షేమములు విచారించెను. గోవులు దూడలకై పరుగెత్తునట్లు ముగ్గురు తల్లులు ముందుకువచ్చి రామలక్ష్మణులను

కౌగిటచేర్చి ప్రేమాశ్రువులు రాల్చిరి. కౌసల్యా తనయు డనేకమార్లు కైక తల్లిని ప్రేమతో పలుకరించి ఆమె బిడియము పోగొట్టెను. మైథిలి ముగ్గురత్తలకు పాదములంటి నమస్కరింప, వారామెను దీవించి అక్కున చేర్చుకొని ఆనందాశ్రువులు రాల్చిరి.

మాతృవర్గము కుమారులకు కోడలికి మంగళహారతు లిచ్చి దృష్టిదోషము సోకకుండుటకై దిగదుడిచి, కుల దేవతలకు మ్రొక్కు లిడిరి. జనని కౌసల్య "నా గారాబుబిడ్డ ఆ భయంకర రాక్షసుల నెట్లు పరిమార్చగలిగెను!" అని విస్తుపోయి రెప్పవాల్చక రాముని చూచుచుండెను.

## రాముడు తన మిత్రబృందమును వశిష్ఠాదులకు పరిచయము చేయుట

లంకాధీశుడు విభీషణుడు, వానరపతి సుగ్రీవుడు, అంగద, హనుమంత, నల, నీలురాది రామానుచరులు బ్రాహ్మణ రూపములతో నుండిరి. వారు భరతుని స్నేహ సద్భావము, నగరవాసుల ప్రియ ప్రవర్తన, రఘునందుని యెడల వారికున్న గాఢానురాగము చూచి సమ్మోహితులై పోయిరి. అవధేశుడప్పుడు విభీషణ సుగ్రీవ అంగద హనుమంత ప్రభృతులను గురు సమ్ముఖమునకు తీసి-కొనిపోయి వారిపట్ల తన ప్రగాఢ ఆత్మీయత వ్యక్తముచేసి వసిష్ఠునితో - "గురూజీ! వీరు నా కాప్తమిత్రులు. ఈ త్యాగశీలుర స్నేహము లభించుట వలననే నేను దశకంఠుని సంహరించి, విజయుడనై, సతీ సోదర సమేతముగా ఇంటికి రాగల్గితిని. నా నిమిత్తము తమ సర్వస్వము సమర్పించుకొన్న ఈ బంధువులు నాకు భరతునికంటే ప్రియపాత్రులు" అని స్నేహాసక్త స్వరముతో ప్రవచించెను. శాఖాచర నిశాచర ప్రవరులంతట కేలుమోడ్చి వశిష్ఠ గురువులకు నమస్కారములు చేసిరి. ఆ పైన వారు సద్భక్తితో ప్రభు మాత కౌసల్యాదేవికి సాష్టాంగపడిరి. ఆ తల్లి వారిని తన పుత్రులుగా భావించి పరమ వాత్సల్యముతో ఆశీర్వదించెను.

అనంతరము సీతా రామలక్ష్మణులు స్వజన బంధుజన పురజన పరివృతులై రాజమర్యాదలతో పురవీధు లతిక్రమించి రాజభవనమునకు గమనము చేసిరి.

ఆ మంగళకరవేళ పైనుండి సుమనోవృష్టి కురిసెను. దివ్య దుందుభులు మ్రోగెను. రాజపథములు సర్వాలంకారములతో రాణించెను. ధ్వజ కేతన పతాక ప్రభలతో సాకేతనగరి స్వామికి స్వాగతము చెప్పుటయందు సంభ్రమించిపో-యెను. మేడలపై నుండి పురంధ్రీమణులు సీతారాములపై సేసలు జల్లిరి. ప్రేక్షక జనసందోహముచే పురవీధులు కిటకిటలాడెను. పథములన్నియు పన్నీ-టితో పంకిలములయ్యెను. ఢంకా శంఖ శహనాయి నౌబత్తు నగారా మ్రోత లకు భూమ్యాకాశములు ప్రతిధ్వనించెను. తత్ర తత్ర పురాంగనలు కోసలకు-మారులకు కర్పూర హారతులిచ్చి, నొసట కుంకుమాక్షతలు బెట్టి, లాజలు చల్లి, పాటలుపాడి మంగళ స్వాగతము లిచ్చిరి. ఉత్సవోత్సాహసంభరితమైన సాకేత పథములను గమించి వారు తిన్నగ రాచనగరు చేరుకొనిరి. సీతారాముల పునరాగమనముతో రాజాంతఃపురవాసుల ముఖములు సంతోషముతో విస్ఫారిత మయ్యెను.

రామమూర్తి ప్రప్రథమమున కైక గృహమునకుపోయి సాదరోక్తుల ఆమె హృదయమునకు స్వాస్థ్యము కలుగజేసి, పిమ్మట నిజసదనము చేరుకొనెను. సీతారామ లక్ష్మణులిట్లు సకలామోదకరముగా స్వగృహము చేరుకొనిరి.

కులగురువు వశిష్ఠుడు బ్రాహ్మణులను పిలువనంపెను. తదుపరి భూసురో త్తములతో సంప్రదించి గురువు జగన్మంగళకరమగు శ్రీరామపట్టాభిషేకమహో త్సవమునకై ముహూర్తము నిర్ణయించి, తన్నిమిత్తమై సకలవిధ ప్రయత్నములు హుటాహుటి చేయవలసినదిగా సుమంత్రాదులను ఆదేశించెను.

త్రుటిలో రాజోద్యోగులు గురువు ఆజ్ఞను కార్యరూపమున బెట్టిరి. ఉత్సవ కార్యములన్నియు చకచక నిర్వర్తింపబడెను. వేలాది సేవకులు తత్కృషిలో నిమ-గ్నమైరి. మంగళద్రవ్యములు సేకరించుటకు సేవకులు నియమింపబడిరి. నగరమంతయు నానావిధముల శృంగారింపబడెను. చతురంగ బలశ్రేణి సవహాయత్తము గావింపబడెను. పదాతి దళములు సర్వ సన్నద్ధమై బారులు దీరెను సుమంత్రు డంత తిరిగివచ్చి సర్వ కార్యములు నిర్వర్తింపబడి నట్లు పిమ్మలకు నివేదించెను.

అవధేశు డంతట మిత్రులకు స్నానాదికము లొనరించవలసినదిగా సేవకులను పురమాయించెను. విభీషణ సుగ్రీవాంగద హనుమంత ప్రభృతులు స్నానము లొనర్చి సుందర వస్త్రాలంకరణ చేసిరి. శ్రీరాముడు స్వహస్తములతో భరతుని జటలువిప్పి ముగ్గురు తమ్ములకు మంగళ స్నానములు చేయించెను. పిమ్మట రఘూద్వహుండు వనవాసవ్రత సమాప్తికి చిహ్నముగా తన జటామకుటము విసర్జించి సుస్నాతుడయ్యెను. కౌసల్యా కైక సుమిత్రలు స్వయముగ వైదేహికి అభ్యంగన స్నానాదికములు గావించి అమూల్య భూషణాంబరాదులచే అలంకరింప జేసిరి. పిమ్మట మంగళాంగి మైథిలిని తోడ్కొనివచ్చి శ్రీరామునికి వామ పార్శ్వమున కూర్చుండబెట్టిరి. తేజోమూర్తులై ఆసనములపై శోభించుచున్న కొడుకు కోడళ్ళ నేత్రోత్సవముగ దర్శించుకొని తల్లులు బ్రహ్మానందముతో - మా జన్మలు నేటికికదా ఫలించె-నని పరవశత జెందిరి.

## శ్రీరామ పట్టాభిషేకము

శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవము తిలకించుటకై వేంచేసిన బ్రహ్మ మహేశాది దేవాధిపులతో, నానాదేశవాసులతో రాజహజారము క్రిక్కిరిసి యుండెను. సీతారాములు గురుజనులకు దోసిలొగ్గి నమస్కరించి రత్నఖచిత రాజ్యసింహాసనముపై సమాసీనులైరి. వేదవిదులు మంత్రోచ్చారణ చేయుచుండ, దేవతాగణములాది సకలలోకవాసులు ఆశీర్వాదాక్షతలు వేయ, జయధ్వనులు మారుమ్రోగ కులగురువు వశిష్ఠుడు రామచంద్రుని నొసట తిలకముంచెను. వైశాఖ బహుళ సప్తమినాడు దశరథరాముడు పట్టాభిషిక్తుడాయెను.

భరత, లక్ష్మణ, శత్రుఘ్నులు, విభీషణ, సుగ్రీవులు, అంగద హనుమంతులు మున్నగు ప్రముఖులు ఛత్రచామరములు ధనుర్బాణములు గదాఖడ్గములు ధరించి పట్టాభిరాముని కిరువైపుల బారులుదీరి బరాబరులు చెప్పిరి. ఆ శుభ వేళ దివ్యులు దుందుభులు మ్రోగించిరి. గంధర్వులు గానముచేసిరి. అప్సర కాంతలు ఆడిరి. మునులు, నరులు, కిన్నరులు, సిద్ధులు పరలోకవాసులు, సాకేతనాథునికి జోహార్లు పలికిరి.

రాముడు నయనాభిరాముడై సీతాసతితో ధర్మాసనమలంకరించి దీప్తి గాంచెను. రఘునాథుని రూపలావణ్యములు కోటి మన్మథుల ధిక్కరించి

తేజరిల్లెను. పట్టు పీతాంబరధారియై మకర కుండలకాంతి ఘమిక్కిలి శోభిల్ల, రత్నఖచిత మణిమయ కిరీటము ధగధగలాడ, అజానుబాహుడు కంబుగ్రీవుడు నీలమేఘశ్యామాంగుడు సరసిజాక్షుడగు శ్రీరాముడు జగన్మోహనాకారుడై ప్రకాశించెను. ఆ జగదభిరాముని నేత్రపర్వముగ దర్శించుకొని అమ్మహనీయుని దివ్యచరిత్ర గానముచేసి సకల లోకవాసులు ధన్యులై తరించిరి.

వినతాసుతా! ప్రభువు పట్టాభిరాముడై ప్రకాశించిన ఆ శుభవేళ ఋక్-యజుస్ - సామ -అథర్వణ వేదములు నాల్గు నరరూపములతో వచ్చి నారాయణుని దర్శించుకొని స్వామినిట్లు స్తుతించెను.

*"జయ విషమ మాయావశ సురాసుర*
*నాగ నర అగ జగ హరే,*
*భవ పంథ భ్రమతా మిత దివస*
*నిశి కాల కర్మ గుణానిభరే,*
*జో నాథ కరి కరుణా విలోకహు*
*త్రివిధ దుఖతే నిర్బహే,*
*భవ ఖేద ఛేదన దక్ష హమ కహుం*
*రక్ష రామ నమామహే."*

"ఓ శ్రీహరీ! సురాసురులు - నరులు, నాగులు మున్నగు చరాచర భూత ప్రపంచమంతయు నీ విషయ మాయాజాలమునకు లోబడి కాల కర్మ సంజనితమైన తాపత్రయంబుల సాక్షి, ప్రుగ్గుచున్నారు. స్వామీ! అట్టి వారి త్రివిధతాపములు మీ కృపాదృష్టి ప్రసరించినంతనే పటాపంచలగుచున్నవి. భవ ఖేద ఛేదన రామా! మమ్మనుగ్రహించి రక్షింపుము. ఇవే మా నమోవాక్కులు." వేద పురుషులివ్విధముగ కోసలేశుని కీర్తించి అదృశ్యులై బ్రహ్మ సదనమున కేగిరి.

ఓ గరుత్మంతా! అనంతరము పార్వతీపతి ప్రభువు ముంగిట కేగి ముకుళిత హస్తుడై ప్రగాఢభక్తితో నిట్లుకీర్తించెను.-

1. జయ రామ రమా రమనం సమనం
భవతాప భయాకుల పాహి జనం,
అవధేశ సురేశ రమేశ విభో
సరణాగత మాగత పాహి ప్రభో.

2. దస సీస బినాసన బీస భుజా
కృత దూరి మహా మహి భూరి రుజా,
రజనీ చర బృంద పతంగ రహే
సర పావక తేజ ప్రచండ దహే.

3. మహి మండల మండన చారుతరం
ధృత సాయక చాప నిషంగ బరం,
మద మోహ మహా మమతా రజనీ
తమ పుంజ దివా కర తేజ అనీ.

4. ముని మానస పంకజ భృంగ భజే
రఘు బీర మహారణ ధీర అజే,
తవ నామ జపామి నమామి హరీ
భవరోగ మహామద మాన అరీ.

5. గున శీల కృపా పరమాయతనం
ప్రణమామి నిరంతర శ్రీరమనం!
రఘునంద నికందయ ద్వంద ఘనం
మహిపాల బిలోకయ దీన జనం.''

ఓ రామా! రామా రమణా! భవతాపహరా! మేము నీ శరణార్థులై రక్షింప వేడుచున్నాము. ఓ రావణాంతకా! నీవు లోకసంరక్షణార్థమై నీ యమోఘ బాణాగ్నిశిఖలచే నిశాచరపతంగ సమూహమును సమూలముగ నిర్జింపజేసితివి. ఓ శరచాపధారీ! నీవు మహా మదమోహాంధకార పటలము పటాపంచలు చేయు

ప్రచండభానుడవు. భూలోక భూషణా! విషయాసక్తులై భవారణ్యములందు దారితప్పి భ్రమించుచున్న పామర జనమును రక్షింపుము.

ఓ భక్తవత్సలా! నీ పద సేవ నిష్పగించని మూర్ఖులు రోగవియోగ బాధలకులోనై శోకసాగరమునబడి నిత్యము - సతమతమగుచున్నారు. కానీ, భవత్కథాగానము చేయుచున్న సజ్జనాలి మాత్రము అటు స్వామికి ఇటు సాధు పురుషుల ప్రేమకు పాత్రులై నిత్యసుఖము లందుచున్నారు. అట్లు నీపద సేవా తత్పరులైన సుకృతాత్ములు సదా నీ నామామృతము పానముచేయుచు రాగలోభ మదమోహములు లేక శుద్ధాత్ములై సుఖ దుఃఖములను సమానముగా భావించి నిత్యానందమును అనుభవించుచున్నారు.

మునిజన హృదయకమలములందు సర్వదా విహరించుచుండు ఓ రఘువీరా! రణధీరా! నేను నిత్యము నీ నామము జపించుచు నీ గుణ సంకీర్తనచేసి నీ చరణ కమలములకు నమస్కరించుచున్నాను. ఓ పృథ్వీపతీ! శ్రీరంగా! ఈ దీనుని కరుణించి కృపామూర్తివై నీ అనపాయ భక్తి ప్రసాదించుమని ముమ్మాటికి వేడుకొనుచున్నాను.'' అట్లు సాంబశివుడు మిక్కిలి భక్తితో సాకేతనాథుని అనేక విధముల కొనియాడిన పిమ్మట సంతోషస్వాంతుడై స్వలోకమునకు ప్రస్థానము చేసెను.

అనంతరము దాశరథి వానరులయెడ తన ప్రగాఢానురాగము వ్యక్తముచేసి, వారికి యథాయోగ్యముగా నివాస సుఖములు కల్పింపజేసెను.

## శ్రీరాముడు వానర, విభీషణ, నిషాదులను సంభావించుట

''ఓ ఖగనాథా! పరమపావనమగు ఈ రామ పట్టాభిషేకమహోత్సవ కథను ఆసక్తితో ఆలకించినవారికి జ్ఞానవైరాగ్యములు సంప్రాప్తించుచున్నవి. ఎవరు ఫలాపేక్షతో ఈ పవిత్రచరిత్ర పఠించి పారాయణము చేయుదురో వారు సకలవిధ భౌతిక సంపదలతో సుఖించి తుదకు రామ సాయుజ్యము పొందగలరు. భవసాగరము తరింపజేయుగల ఈలోకోత్తర గాథ నీకు నా శక్త్యనుసారము వర్ణింపగలిగితిని. శ్రద్ధాళుడవై శేషించిన కథాభాగము కూడ ఆకర్ణింపవలసినది.'' అని

విశదీకరించి కాకభుశుండి గరుత్మంతునికి తిరిగి ఇట్లు చెప్ప నారంభించెను.

రఘుపతి రాజ్యాభిషిక్తుడయ్యెను. అనంతర మా నృపాలోత్తముడు భూరి భూరి దానములతో భూసురోత్తములను యాచకులను సంభావించెను. సుగ్రీవాది వానర బృందమును, విభీషణాది మిత్రవర్యులను సకల మర్యాదలతో సమాదరించెను. వనచర ప్రముఖులు స్వగృహములను సైతం విస్మరించి సకల విధ భోగము లనుభవించుచూ అయోధ్యలో ఆరునెలలు గడిపిరి.

ఒకానొక దినము అవధేశుడు నిశాచర, వనచర, భల్లూక నిషాద ప్రభృతులను రాజ హజారమునకు రావింపజేసి యథార్థరీతి వారిని సుఖాసీనులంజేసి స్నేహ సుహృద్భావము తొణికిసలాడ మృదు మధురోక్తుల వారి నిట్లు సంబోధించెను.-

"!మిత్రులారా! మీరు నా నిమిత్తమై బహువిధ ప్రయాసల శ్రమించి నాకు సహాయపడితిరి. మీ రొనర్చిన సేవాసహకారములను గురించి మీ ఎదుటే ప్రస్తుతించుటకు నేను జంకుచున్నాను. నా హితార్థమై మీ రొనరించని సేవ లేదు. కాబట్టి ఈ సామ్రాజ్యము - సోదరులు - పరివారము - సంపత్తి - జానకి వీరందరికంటే మీరు నాకు ఆప్తులు, అత్యంత ప్రియపాత్రులు. మిత్రులారా! నిజమాడుచున్నాను. నా దాసులపై నాకున్న ప్రేమ అనన్యమైనది- అవి మీరు విశ్వసింపుడు. హితులారా! ఇక మీరు మీ మీ స్వగృహములకు పోయి - నేను సర్వాంతర్యామిని సర్వ హితాభిలాషిని- అని మనసులందుంచుకొని సదా నన్ను స్మరించుకొనుచు సుఖముగా కాలము గడుపుచుండుడని మిమ్ము కోరుచున్నాను.''

ప్రభువు సుభాషితమునకు ప్లవంగ ప్రముఖులు ముగ్ధులై పరమానంద మొందిరి. సాకేతనాథుని స్నేహ ప్రసంగమునకు సమ్మోహితులై, సభాస్తారులు - తా మెవరు! ఎక్కడ నుండి వచ్చిరి? ఇప్పు డెచ్చట యున్నారు? అను సంగతి కూడా మరచి పులకిత శరీరులై ఆనందబాష్పములు రాల్చిరి. సాత్త్వికలోచనులై చేష్ట లుడిగి నోట మాటరాని స్థితిలో తన వైపు గుడ్లప్పగించి నిలబడియున్న కపిపుంగవాదులను అప్పుడు సీతాపతి సకలవిధ భూషణ వసనోపహారాదులచే అపూర్వరీతి సత్కరించెను. భరతుడు లక్ష్మణుడు సుగ్రీవ విభీషణులను వీరి

పీతాంబరముల ధరింపజేసి వివిధమణిభూషణములతో అలంకరించిరి. తరువాత రామానుజులు వలనీల జాంబవంతాది మిత్రబృందమును గురుగౌరవ భావముతో యథాయోగ్యముగా సంభావించిరి.

అప్పుడు యువరాజు అంగదుడు కన్నుల నీరు పెట్టుకొని - కేలు మోడ్చి - గద్గదస్వరమున "ఓ ఆర్తత్రాణ పరాయణా! అనాధేశా! ఆశ్రయదాతా! నాదొక విన్నప మాలకించవలసినది. ప్రభూ! నా తండ్రి వాలి మరణించు సందర్భమున నన్ను మీ హస్తములం దుంచి కన్నుమూసెను. ఇపుడు నాకు తల్లి, తండ్రి, సోదరుడు, సర్వస్వము మీరే. నేను ఇపుడు మిమ్ము వదలి ఎవటికి ఎట్లు పోగలను? దేవా! మీ చల్లని ఆశ్రయములోనుండి మీ పాదసేవచేసుకొనుచు కాలము గడుపవలెనని నా కోరిక. ఈ పావనపురి అయోధ్యయందే ఉండి పోవుటకు నన్ననుగ్రహించ వేడుకొనుచున్నాను" అని ప్రార్థించెను.

వానర యువరాజు ప్రగాఢ ప్రేమకు దాశరథి హృదయము చలించిపోయెను. భక్తవశుడగు కోసలేశుని కన్నులు నీటితో నిండెను. రఘుపతి తన ఉరోమాలతో వాలి తనయుని కంఠసీమ నలంకరింపజేసి గాఢముగ కౌగలించుకొని ప్రియోక్తుల అనేక విధముల బోధించి అతనిని ప్రయాణమునకు సమ్మతింపజేసెను. ఇట్లు వానరులు స్వామిచే బహువిధముల సత్కరింపబడి నిజనివాసములకు మరలి వెళ్లుటకు సన్నద్ధులైరి. తదుపరి భరతుడు లక్ష్మణుడు శత్రుఘ్నుడు కపిపుంగవుల వెంట కొంతదవ్వు చని సాదరపూర్వకముగ వారిని సాగనంపి వచ్చిరి.

అట్లు వానరులు సాకేతనాథుని సత్కారములొంది స్వస్థలములకు మరలిచను సందర్భమున ఆంజనేయుడు వానరపతి సుగ్రీవుని చరణములపై వ్రాలి - "ప్రభూ! మరి కొంతకాలము రామనగరులో నివసించి స్వామిని సేవించవలెనని నాకు కోరికగానున్నది. సీతానాథుని సన్నిధిలో నుండుటకు నన్ననుమతించ అర్థించుచున్నాను-" అని పలికెను. అందుకు సుగ్రీవుడు ఆనందముతో - "పవనపుత్రా! నీవు పుణ్యాత్ముడవు. నీవు దయామయుని భక్తితో సేవించి ధన్యుడవు కమ్ము-" అని దీవించి అంజనీ పుత్రుని అయోధ్యలో నుండుటకు అనుమతించి పంపెను.

ఋక్ష వానరులను యథార్థ సంభావన సత్కారములతో వీడ్కొలిపిన పిమ్మట కోసలేశుడు నిషాదపతిని అనేక వస్త్ర భూషణాదులచే బహుూ- నించి ప్రేమోత్కంఠతతో నిట్లు పలికెను-

''తుమ్హ మమసఖా భరత సమ భ్రాతా,
సదా రహేహు పుర ఆవత జాతా.''

''ఓ నిషాదరాజా! నీవు నాకు భరతునివంటి సోదరుడవు. ప్రియసఖుడవు అను సంగతి విస్మరించకుము. ఇక నీవు స్వస్థానము చేరుకొని ధర్మాచరణశీలివై సుఖింపుము. సఖా! ఇది నీ ఇల్లుగా భావించి అప్పుడప్పుడు అయోధ్యకు వచ్చి పోవుచుండుము.''

శ్రీవారి స్నేహ సుహృద్భావ వైఖరికి నిషాదనాథుని నేత్రద్వయమునుండి ఆనందాశ్రువులు జలజల స్రవించెను. ఆ సుకృతాత్ము డంతట ప్రభువుకు ప్రద- క్షిణ పూర్వకముగ నతులొసర్చి, స్వామి చరణచిహ్నములు హృదయమునం దిడుకొని, బహుప్రయత్నముమీద ప్రయాసపూర్వకముగ ఇంటికి మరలి చనెను.

## రామరాజ్యము

రామరాజా సింహాసన మధిష్ఠించి రాజదండము చేపట్టగనే లోకత్రయము భయశోక రహితమై సుఖించెను. గోస్వామి తులసీదాసు రామరాజ్యము నిట్లు దర్శించెను.

''బరనాశ్రమ నిజనిజ ధరమ నిరత
వేద పథలోగ
చలహిఁ సదా పావహిఁ సుఖహిఁ నహిఁ
భయ శోక నరోగ.

దైహిక దైవిక భౌతిక తాపా
రామరాజ నహి కాహుహి వ్యాపా

సబనర కరహిఁ పరస్పర ప్రీతీ
చలహిఁ స్వధర్మ నిరత శ్రుతినీతీ.

చారిహు చరన ధర్మజగ మాహీఁ
పూరి రహా సపనేహు అఘునాహీఁ
రామ భగతి రత సబ నరనారీ
సకల పరమ గతికే అధికారీ.

అల్ప మృత్యు నహి కవనిఉ పీరా
సబ సుందర సబ బిరుజ సరీరా
నహిఁ దరిద్ర కోఉ దుఖీ న దీనా
నహిఁ కోఉ అబుధ న లచ్ఛన హీన.''

రామరాజ్యమందలి సకలప్రజ వేదమార్గ మవలంబించెను. వర్ణాశ్రమ ధర్మములు పాటింపబడెను. రాగద్వేషములు లేకుండెను. భయశోకము లంతరించెను. దైహికము దైవికము భౌతికమైన తాపత్రయము నశించెను. సామాజికులు స్వధర్మనిరతులై పరస్పర ప్రేమభావముతో వ్యవహరించిరి. ధర్మము నాల్గు పాదములపై నిలబడెను. పురుషులందరు స్వప్నమందైనను పాపచింతనలేక రామభక్తి తత్పరులై మోక్షాధికారులగు చుండిరి. అకాల మరణము, జరాభారము అంతరించి ప్రజలు ఆరోగ్యవంతులై ఆనందముగ నుండిరి. దారిద్ర్యము దుఃఖము అజ్ఞానము తొలగి సర్వజనులు శుభలక్షణ లక్షితులై శోభించిరి.

రాముని కాలమున సకాలమునకు వర్షములు పడుచుండెను. నదీతటాకములు నిత్యము జలసమృద్ధమైయుండెను. పంటలతో, ఫలములతో పుష్పములతో పచ్చని వనాటికలతో సకలవిధ ఓషధులతో భూమి కుళకుళలాడెను. పక్షిజాతులు, మృగసముదాయము తమ సహజవైరభావము విస్మరించి ప్రేమతో వ్యవహరించెను. లోకానందకరమగు రామరాజ్యము సకలసుఖదాయకమై శోభించెను. త్రేతాయుగము కృతయుగమును మరపింప జేసెను.

గరుత్మంతా! చతురంభోధి పరీత భూమండలమున కంతటికీ రాముడు సామ్రాట్టు. అయిననూ ఆ మహామహుడు తనలోని ఒక్కొక్క రోమకూపములో అనేక బ్రహ్మాండములు కలిగియున్నాడు. అనంతశక్తివంతుడగు ఆ విరాట్ స్వరూపునికి ఈ సాకేత సామ్రాజ్యభార మేపాటిది? ఆ భగవంతుని రాజ్యవైభవము సవిస్తరముగ వర్ణింప ఎవరికి శక్యమగును!

## అవధేశుడు

అవధేశుడు ధర్మనిష్ఠతో అనేక అశ్వమేధయాగములు చేసి యశోవిలాసుడై ఇంద్రసుఖము ననుభవించెను. సీత సాధ్వీమతల్లి. ఆ మహారాణి అహర్నిశము స్వామికి స్వహస్తములతో సకలోపచారములు చేయుచుండెను. అత్తలయెడ పరమపూజ్యభావముతో మెలగెను. మైథిలి దేవరులయెడ మైత్రీ వైఖరి నవలంబించి సద్భావము నెరపెను. జానకి సకల గుణసంపన్న. ఆ జగదంబను లక్ష్మీ పార్వతీ సరస్వతులు సదా ధ్యానించుచుండిరి. భరతలక్ష్మణ శత్రుఘ్నులు భక్తి ప్రేమతో అన్నకు అన్ని విధముల తోడ్పడుచు సాధుభావముతో సేవలు చేయుచుండిరి.

కొంతకాలమునకు సీతాదేవి గర్భమున లవకుశులను ఇరువురు కుమారులుద్భవించిరి. వీరులు రణగుణశీలురగు ఆ ధీరులు అన్నివిధముల తండ్రిని బోలియుండిరి. ఆ సుకుమారుల గుణశీల స్వభావములను గురించి వేదములందు విపులముగ వర్ణింపబడినది. భరత లక్ష్మణ శత్రుఘ్నులకును ఒక్కొక్కరికి ఇద్దరు చొప్పున పుత్రులు పుట్టిరి.

## అవధపురి అదృష్టము

నరరూపధారి నారాయణమూర్తి. ఆ సచ్చిదానందస్వరూపుడు సర్వజన ప్రమోదముగ సకల సుఖదాయకముగ రాజ్యమేలెను. రామరాజ్యము రమణీయమైనది. ఆ నృపాలుడు ఉదయాత్పూర్వమే మేల్కాంచి, సరయూపుణ్యసలిలములందు స్నానసంధ్యలు నిర్వర్తించి, పూజాదికములు పూర్తిగావించుకొన్న పిమ్మట రాజ్యసభకు అరుదెంచి సింహాసన మలంకరించును. అచ్చట పండితులతో, మునులతో, జ్ఞానులతో సద్గోష్ఠి జరుపును. సోదరులు పరమాదర భావ

ముతో నిత్యము అన్న ననుసరించి మెలగుచుండిరి. భరత శత్రుఘ్నులు సాయం సమయములందు ఉద్యానవనములందు కూర్చొని హనుమంతుని యొద్ద రాముని వనవాసచరిత్ర, లంకాయుద్ధము మున్నగువిశేషములు శ్రద్ధాసక్తులతో వినుచూ సత్కాలక్షేపము చేయుచుండిరి. నారదసనకాది మహా మునీశ్వరులు నిత్యము అయోధ్యకు వచ్చుచూ పోవుచూ స్వామి దర్శనము చేసుకొని పరితృప్తులగుచుండిరి.

అయోధ్య సిరిసంపదలు ఆ యూరి నాగరకుల సుఖజీవనము వారి నిత్య సంతోష సరంభములు వర్ణింప వేయిపడగల శేషునికిని శక్యముగాదు. అంద చందాలు దిద్దుకొనిన ఆ నగర సౌందర్య మేమని వర్ణింపగలము! నానావిధ వర్ణ ములతో గచ్చు వేయబడిన శుద్ధ స్ఫటిక ప్రాంగణములతోనున్న గృహములు, బంగారు కలశములతో రత్నస్తంభములతో, ముత్యములు తాపిన గవాక్షము లతో, మణిదీపములతో నవరత్న ఖచిత ద్వారబంధములతో ఆకాశమును చుంబించుచున్న గోపురాగ్రములతో అలరారుచుండెను. అందచందాలలో అవధపురి అమరపురిని భ్రమింపజేయుచుండెను.

ఆ నగరమందలి ప్రతి గృహము ఒకచక్కని ఉద్యానవాటికతో శోభించు చుండెను. ఆ రమణీయోద్యానములు సుందరమైన జలాశయములతో నిత్య హరితలతా గృహములతో, వివిధ పుష్పసౌరభములతో, సుంటపములతో, క్రీడామందిరములతో, పక్షుల కలకలారావములతో నయనానందకరముగ కన్పట్టుచుండెను. సాక్షాత్ లక్ష్మీపతికి నివాసమగు ఆ నగరములోని వణిక్ప్రము ఖుల విపణివీధుల వంవద్వైభవము ఊహింపరానిది. అచ్చటి బేహారులు సచ్చ- రిత్రులు, సద్వ్యాపార పరాయణులై ధనైశ్వర్యములందు కుబేరుని ధిక్కరింప సమర్థులై యుండిరి.

ఆ పురమునకు ఉత్తరభాగమందు పుణ్యసలిల సరయూనది ప్రవహించు- చుండెను. ఆ స్రవంతి కిరువైపుల అనేక స్థలములందు స్నానఘట్టము లేర్పడి యుండెను. ఆ రేవుల కెదురుగ నదీతీరమునందు దేవాలయములు కట్టబడి యుండెను. ఆ దేవాలయములచెంత సాధువుల కుటీరములు పూలతోటలు అమరియుండెను. ఉదయ సాయం సమయములందు స్నాన సంధ్యాపూజాది-

కము లొనర్చు వారి రాకపోకలతో సరయూతీరము బహు సందడిగానుండి నేత్రోత్సవము చేయుచుండును.

నగరమందప్పట కోనేర్లు, బావులు, తటాకములు, కాసారములు, శీతల నిర్మలోదకముతో నిండియుండెను. హంసలు, శారికలు, శుకములు, పికములు తుమ్మెదలు మున్నగు విహంగావళి కలకూజితములతో పద్మకుముద పుష్పపరాగరంజితమైన ఆ జలాశయములు నయనానందకరమై భాసించుచుండెను.

నగరమందెల్లెడల యెల్లవేళల రామనామ సంకీర్తనము జరుగుచుండెను. గృహ ప్రాంగణములందు చావడులందు తిన్నెలమీద దేవాలయములందు పెద్దలు పిన్నలకు రామకథాప్రవచనము చేయుచుందురు. ఈ ప్రకారము అయోధ్యావాసులు సుఖ సంపదలతో సదాచార పరాయణులై రామసంకీర్తన చేయుచు సుఖజీవనము గడపుచుండిరి. రఘురాముని యశశ్చంద్రికలు సర్వత్రా వ్యాపించి లోకములకు శాంతి ప్రసాదించెను. ఓ ఖగేశ్వరా! ఇట్లు రవికులరాముని తేజఃపుంజముచే లోకాంధకారము పటాపంచలై వెలు గేర్పడెను. రాముని రాజ్యములో జారులు చోరులు జూదరులు నిలువనీడ గానక దుస్సహదుఃఖముచే దురపిల్లిరి. కాని జ్ఞానులు, ధర్మచింతన గలవారు, భక్తప్రవరులు, సాధువులు సన్మార్గులు రామ రాజ్యములో నిరాపదులై నిర్భయముగ సుఖజీవనము గడపుచుండిరి.''

## సనకాదులు సాకేతనాథుని సందర్శించుట

ఒకదినము రామభూపాలుడు తమ్ములతో ఆంజనేయునితో కలిసి ఒక ఉద్యానమును దర్శించుటకు వెళ్ళెను. వా రా వాటికలో విహరించు తరి అచ్చటికి సనకసనందన సనత్కుమార సనత్సుజాతులు దాశరథి దర్శనార్థమై వేంచేసిరి. ఆ నలుగురు దిగంబరులు, దివ్యజ్ఞాన సంపన్నులు. ఆ తపోధనులు చూచుటకు బాలకులవలె నుండిరి. సాకేతధాముడు ఆదరపూర్వకముగ సనకాదులకు స్వాగతము పలికి, అర్ఘ్యపాద్యాదులతో సత్కరించి వారిని ఉచితాసనములపై సుఖాసీనులజేసి సమాదరించెను. వేదములవంటి ఆ నల్వురు మహనీయులకు భరతుడు లక్ష్మణుడు శత్రుఘ్నుడు హనుమంతుడు భక్తితో ప్రణమిల్లి పాదపూజ చేసిరి.

అంతట రఘూద్వహుడు వినమ్రుడై వారి నవలోకించి - "ఓ ఋషి పుంగవులారా! పూర్వపుణ్య సుకృతములనగాని తమబోటి సాధువుల సాంగత్య ఫలము లభింపదని విజ్ఞులు చెప్పుచుందురు. నేడు మీ దివ్యస్వరూపములు దర్శించుకొన్నందున ఈ దీనుని జన్మ సార్థకమై తరించెను - " అని పలికెను.

రాముడు జగన్మోహనాకారుడు. మునులు ఆ మోహన మూర్తి మంగళ స్వరూపమును రెప్పవాల్చక తనివితీరా చూచిరి. వారు దాశరథి దివ్యసుందర విగ్రహము గాంచుచు ముగ్ధులై ఆనంద బాష్పములు స్రవించుచుండ ముకుళితహస్తులై తన్మయత్వమున స్వామి నిట్లు స్తోత్రించిరి- "-అద్వితీయుడవు, అనంతుడవు, అనామయుడవు, సర్వవ్యాపకుడవు, సకలగుణ సంపన్నుడవగు ఓ రామా! నీకు మేము జయము పలుకుచున్నాము. త్రికాల స్వరూపుడవు, కల్యాణమూర్తివైన ఓ దశరథనందనా! నీ యశోగాథలను వేదపురాణములు కీర్తించుచున్నవి. ఓ దయానిధీ! నీ సంస్మరణచే సకలపాపములు నశించును. నీ నామధ్వని విన్నంతమాత్రమున సకల కోరికలు సిద్ధించును. నిన్ను దర్శించుకొను పుణ్యాత్ములకు ముక్తి ప్రాప్తించుచున్నది. నీవు కామధేనువువలె దీనజనమును పోషించెదవు. కల్పవృక్షమువలె కోరికలు తీర్చెదవు. భవసాగర జలమును అగస్త్యునివలె శోషింపజేసి భక్తులను తరింపజేసెదవు. నీ భక్తాళికి నీవు పరమ సులభుడవు. వారి దుఃఖములు తొలగించి, వారి కామ్యములు సిద్ధింపజేసి, వారికి జ్ఞాన వైరాగ్య సంపత్తిని, ప్రసాదించు భక్తవత్సలుడవు. ఓ రాజాధిరాజా! ఓ లోకరక్షకా! ఓ దేవాది దేవా! నీవు సదయుడవై సదా మామానస పీఠ మలంకరింపుము. కారుణ్యమూర్తీ! మమ్ము కరుణించి మాకు నీయఖండభక్తిని ప్రసాదించి సంతృప్తుల జేయుము స్వామీ! మా ప్రార్థనలు మన్నింపుము. మా నమస్కారమును స్వీకరింపుము-"

ఇట్లనేక ప్రకారముల సనకాదులు రఘూద్వహుని స్తుతించి అపరిమితానందముతో స్వామివద్ద సెలవు తీసుకొని బ్రహ్మనివాసమునకు పోయిరి.

# రాముడు భరతునకు సత్పురుషుల స్వభావాదు లెఱింగించుట

సనకాది మహర్షులు చనిన పిమ్మట గుణభరితుడగు భరతునికి అగ్రజుని ముఖతః సాధుసత్పురుషుల లక్షణములు వినవలెనని అపేక్ష జనించెను. అవధేశుడు సోదరుని మనోగతాభిప్రాయము గుర్తించినవాడై అందుకెంతయు ఆనందించి ప్రేమతో భరతుని కిట్లు సాధులక్షణముల వివరించి చెప్పెను.

"ఓ భరతా! సత్పురుషులను గురించి వేదములందు పురాణములందు విశదముగా వివరింపబడినది. సుజనులను దుర్జనులను చందన వృక్షమునకు గొడ్డలికిని పోల్చుట సమంజసముగా నుండును. తనను ఖండింపవచ్చిన గొడ్డలిని శ్రీఖండము చందన సుగంధాదులతో సత్కరించును. తద్వారా శ్రీఖండము శివుని శిరోభాగ మలంకరించిరాజిల్లుచున్నది. గొడ్డలి మాత్రము అగ్నికి లోబడి కమ్మరివాని సమ్మెటదెబ్బలు తినుచున్నది.

అనుజా! ఇంకను సాధు సత్పురుషుల సద్గుణ సమూహమును సవిస్తరముగ వివరించుచున్నాను. ఆకర్ణింతువుగాక. సజ్జనులు సదాశీలగుణసంపన్నులై చరించుచుందురు. వారు విషయాసక్తులుకాక సన్మతితో ఇతరుల సుఖదుఃఖములే తమ సుఖదుఃఖములుగా భావించి తోడ్పడుదురు. వారి స్వభావము బహు కోమలమైనది. వారి హృదయము మిక్కిలి దయార్ద్రమైనది. సోదరా! సాధుపురుషులు నిర్మలాంతఃకరణతో సర్వదా నన్ను సేవించుచుందురు. స్వార్థరహితులై యొప్పు అమ్మహనీయులను సదా శాంతి శమదమాది సుగుణములు ఆశ్రయించి యుండును. మైత్రీభావము, సరళ ప్రవర్తన, శీతలహృదయము, బ్రాహ్మణభక్తి, నమ్రత, కటువచనములు పలుకకుండుట, ఇంద్రియ నిగ్రహము, సమత్వము, దూషణ భూషణములయెడ సమతాభావము, సత్పథమున సంచరించుట - ఇత్యాది గుణయుతులైన సత్పురుషులను - నేను ప్రాణాధికముగా ప్రేమింతును. వారు సుఖధాములని తెలుసుకొనుము.

ఇక దుర్జనలక్షణము లెట్లుండునో ఒకింత తెలుసుకొని యుండుట మంచిది. సోదరా! దుఃఖప్రదమగు దుర్జన సాంగత్య మెల్లెడల త్యజనీయమే. వారు

పరనిందా ప్రియులు, కామక్రోధ మదలోభ పరాయణులు. వారి బుద్ధి వక్రమైనది. వారి స్వభావము సదా నిష్కారణ వైరమును అపేక్షించుచుండును. వారు భుజించునది అసత్యమును,వారు త్రాగునది అసత్యమును, వారి జీవన వ్యాపారములన్నియూ అసత్యభూయిష్ఠములే. వారి మాటలు తేనెబూసిన కత్తులు. విష సర్పములను మ్రింగు నెమలి తియ్యగా కూయునటులనే వారి పలుకులు మాత్రము పైకి తియ్యతియ్యగా నుండును. ఆ దుష్టులు నిరంతరము పరధన దారాసక్తులైయుండు హింసాపరులు. వారి మనోభావములు వారి దినచర్యలు వారి నడవడికలన్నియు స్వార్థచింతతో కూడుకొని యుండును. వారు అహర్నిశము ఉదర చింతారతులై వర్తించుచుందురు. అన్యుల సుఖమును హర్షించ నొల్లని ఈర్ష్యాపరులు. తల్లి, తండ్రీ, గురు జనులను గౌరవించుట వారి మతమునకు విరుద్ధమైనవి. మోహవశులై మాత్సర్యభావముతో నిండియుందురు. సత్సంగము - సత్కథాశ్రవణములాంటి సద్వృత్తులు వారికి నచ్చవు. ఆ మందమతులను వివిధ దుర్గుణములు ఆశ్రయించి యుండును. సోదరా! ఇటువంటి దుర్జనావాసము కృతత్రేతా యుగములందు కానరాదు. ద్వాపరయుగమందు వీరి సంఖ్య అల్పమైయుండును. కలియుగమందు వీరి ప్రాబల్య మధికమై యుండును.

భరతా! పరపీడనకంటే మిన్నయగు పాపములేదు. పరోపకారమునకు సాటి రాగల సద్ధర్మము మరొకటిలేదని సకలవేదార్థసారమై యున్నట్లు విబుధవరేణ్యుల సమ్మతము. అలభ్యమైన మానవ జన్మమెత్తి యెవరు ఇతరులకు హాని తలంచెదరో వారు పరలోక సుఖములను పోగొట్టుకొనుచున్నారు. శుభాశుభ కర్మఫలమును ప్రసాదించువాడనుగా,, దుర్జనుల పాలిట కాలస్వరూపునిగా భావించి విజ్ఞులు నన్ను భజించుచున్నారు.''

ఇవ్విధముగ సుజన, దుర్జనుల స్వభావములు వారి గుణావగుణములు శ్రీవారి ముఖతః వినగలిగినందుకు భరత హనుమంతాదులు పరమానంద మనుభవించిరి. ఆపైన రామాదులు ఉపవనమువీడి రాజమందిరమునకు పోయిరి.

ఇట్లు సత్పురుషుల సందర్శనములతో సద్విద్యాగోష్ఠులతో దాశరథి దైనందిన చర్యలు లోకానందదాయకమై యుండెను. నారదమహర్షి నిత్యము

రామునిరాజధానికి వచ్చుచుండెను. అతడు స్వామి సందర్శనానంతరము తిరిగి బ్రహ్మలోకమును చేరుకొనును. అక్కడ బ్రహ్మేంద్రాది స్వర్లోక వాసులకు, సన-కాది ఋషీశ్వరులకు రాముని దివ్యచరిత్ర గానముచేసి వినిపించుచుండును. పర-మేష్ఠి - సనక సనందనాదులు - మహర్షులు - తదితర దేవలోకవాసులు ఇతో-ధిక జ్ఞానధనులు. అయినప్పటికినీ వారు తమ యోగములకు సమాధి నిష్ఠలకు స్వస్తిచెప్పి మిక్కిలి శ్రద్ధాభక్తులతో నారదులయొద్ద శ్రవణానందకరమైన రామక-థను వినుచూ తృప్తులగుచుండిరి.

# ప్రభువు పురజనులకు భక్తి ప్రాశస్త్యమును బోధించుట

ఒక దినము రామచంద్రమూర్తి గురువులను భూసురులను పురవాసులను రాజమందిర ప్రాంగణమున సమావేశపరచి వారికిట్లు భక్తి ప్రాశస్త్యము నుద్బో-ధించెను.

"ఓ నాగరికులారా! నేనిప్పుడు చేయబోవు సత్ప్రసంగమును మీరు సావ ధాన మనస్కులై ఆలకించి, అందు సద్విషయములని మీకు తోచిన వాటిని యథామతి అనుష్ఠింతురని ఆశించుచున్నాను.

"రాజ్యాధికారముతో లేదా స్వార్థబుద్ధితో నేనిప్పుడు ప్రసంగించుట లేదని నమ్మవలసినది. నా ఉపదేశమందున్న గుణదోషములను మీ స్వబుద్ధితో విచా-రించి తదనుగుణముగా ప్రవర్తించవలెనని కోరుచున్నాను. సోదరులారా! మానవ జన్మ సర్వోత్కృష్ట మైనదని శాస్త్రము లుద్ఘోషించుచున్నవి. ఈ శరీరము పూర్వజన్మ సుకృతమువలనగాని లభింపజాలనిది. సకలవిధ మోక్షములకు సాధకమైన నరజన్మ దేవతలకు సైతం దుర్లభమైనది. ఇట్టి మానవజీవితములు కేవలము విషయ భోగము లనుభవించుటయందే వ్యయము చేయుట వాంఛ నీయముగాదు.

"మూర్ఖులు మందమతులు నిరంతరభోగ లాలసులై పారమార్థిక చింత లేక, పిమ్మట పరితాపము బొందుచున్నారు. వారు తమ కోర్కెలు సిద్ధింప నపుడు చింతాతురులై విధివైపరీత్య మిట్లున్నదని వాపోయి దేవుని సైతం

దూషించుటకు ఒడిగట్టుచుందురు. ఈ శరీరముయొక్క ప్రయోజనము విషయ సుఖము లనుభవించుటగాదు. వాంఛలు క్షణికములైనవి. స్వర్లోక సౌఖ్యములు కూడా దుఃఖదాయకములైనవే. దుర్లభమగు మానవజన్మ ధరించి సుఖాతురుడై పరుగెత్తు పామరుడు అమృతమునకు బదులు విష మాశించుచున్న వాడగును.

జీవుడు నిరంతర వాంఛారతు డగుటంజేసి ముక్తి గానక ఎనుబదినాల్గు లక్షల జీవుల యోనులందు భ్రమించుచుండును. జీవుడు మాయాధీనుడై యున్నందున కాలకర్మస్వభావ జనితమగు విషయదోషములు అతనిని సదా వెన్నంటి యుండును. అట్టితరి, పరమేశ్వరుడు నిర్హేతుక జాయమాన కటాక్ష వీక్షణుడు, ఒక్కొడు క్షుద్రజీవికి అలభ్యమగు మానవశరీరమును ప్రసాదించుచున్నాడు. ఈ మానవదేహము భవసాగరము తరించుటకు నావ వంటిది. నా యనుగ్రహమను గాలివాటమున కది జలధిపై పయనించును. చుక్కానివంటి సద్గురువు లభించి నపుడు ఆ ఓడ ఒడిదుడుకులులేక సుఖముగ దరిజేరును. మోక్షసాధనకమగు ఇటువంటి మానవశరీరము లభించియు, భవసాగరమును తరించుటకు ప్రయత్నించనివాడు కృతఘ్నుడు, ఆత్మఘాతకు డగుచున్నాడు.

సోదరులారా! ఇహపర సుఖములు రెంటినీ ఆశించువారికి భక్తికంటే ఉత్తమమైన సుఖపథము లేదు. భక్తి సత్సాంగత్యముచే సిద్ధించును. భక్తిలేనివాడు నా ప్రేమ చూరగొనజాలడనుట తథ్యము. దుర్గమము, కఠినతరము, బహుబాధాకరమైన జ్ఞానమార్గముకంటే భక్తిమార్గము శ్రేయస్కరమైనదిగా విశ్వసించ వలసినది. కానీ, ఇందొక చిన్న రహస్యమున్నది. అది యేమన సదాశివుని సేవించని వాడుమాత్రము నాభక్తిని పొందజాలడను సంగతి యేనాటికిని విస్మరింపకుడు.

ఓ ప్రియజనులారా! భక్తిమార్గములో కష్టమేమున్నది. యోగము, యజ్ఞము, జపము, తపము, ఉపవాసము, ఇత్యాది కఠిన వ్రతములు భక్తికి అనావశ్యకములు. సరళ స్వభావము, నిర్మలాంతఃకరణము, యథా లాభసంతృప్తి ఇవియే భక్తి ప్రాప్తికి అపేక్షణీయమైనవి. వైరము- నిగ్రహము- భయము - శోకము - మోహము - మమత- అహంకా

రము లాది దుర్గుణ స్వభావములు లేక ఎవడు నన్నే నమ్ముకొని సదా నన్ను స్మరించుచుండునో ఆ భక్త ప్రవరునికి సర్వదా నేను వశుడనై యుందునని వక్కాణించుచున్నాను. ఆ భక్తవర్యుడు పరమానందకరముగ బ్రహ్మానందప్రాప్తి సిద్ధించి సుఖించును.''

అమృతోపమానమగు రామోపదేశము సాకేతవాసులను సమ్మోహితులను జేసెను. వారు వినమ్రులై సాకేతనాథుని చరణములకు శిరములు వంచి గద్గద స్వరముతో ఇట్లు పలికిరి.

''ఓ దాశరథీ దయానిధీ! మాకు తల్లీ, తండ్రీ, గురువు, దైవము, సర్వము మీరే. మీ యపార కృపాదృష్టి ప్రసరించుటంజేసి మేము సకలవిధ సౌఖ్యములతో సుఖ జీవనము గడుపుచున్నాము. హే కోసలేశా! మాకష్టములను నివారించి, మాకు చక్కని శిక్షణ గరపి మమ్ముద్ధరించిన మహాపురుషులు మీరు. ప్రభూ! మీరు, మీ సేవకులు లోకహితార్థమై చేయుచున్న నిస్స్వార్థసేవ అనన్యమైనది.''

ప్రజల పరమాదర ప్రసంగము విని ప్రభువు ప్రసన్నుడాయెను. తదనంతర మా పౌర సందోహము స్వామికి సద్భక్తి సాష్టాంగ మొనర్చి, అతని గుణగణము లను కీర్తించుకొనుచూ నిజగృహములకు నిష్క్రమించెను.

ఓ ఉమా! సాకేతపుర జనులెంత సుకృతజన్ములు! సచ్చిదానంద రూపమగు ఆ పరబ్రహ్మ స్వయముగ రామావతారమున వేంచేసి వారిని పాలించెను.

## వశిష్ఠుని ఆనందము

ఒక సందర్భమున కులగురువు వశిష్ఠుడు సుఖధాముడైన శ్రీరాముని సందర్శించుటకై వచ్చెను. రఘూద్వహుడు పరమాదరముతో మునివరేణ్యుని సన్మానించి సుఖాసీనునిగా జేసెను. అర్ఘ్యపాద్యములతో గురుపూజచేసి, రఘువీరుడా గురు చరణోదకమును తన శిరస్సుపై చల్లుకొని కుశలప్రశ్న చేసెను.

వశిష్ఠుడంత ప్రహృష్టాంతరంగుడై కేలు గీలించి రుద్ధ కంఠముతో స్వామి నిట్లు స్తుతింపసాగెను.

"ఓ కోసలేశ్వరా! కృపాసింధూ! శ్రీరామచంద్రా! దయాళుడవై నా మనవి ఒకటి పాలింపుమని నిన్ను ప్రార్థించుచున్నాను.

రామా! నిత్యము నీవు ప్రదర్శించు లీలామానుష చర్యలు నన్నెంతయో మోహింపజేయుచున్నవి. వేదాతీతమగు మీ మహిమ వర్ణింప నేనెంతటివాడను? దేవా! పౌరోహిత్యము బహు నైచ్యమైనదని శాస్త్రములు చెప్పుచున్నవి. తొలు దొల్త నే నీ పురోహితవృత్తి స్వీకరించుటకు విముఖుడుగా నుంటిని. ఆ సందర్భమందు ప్రజాపతి నాతో 'వశిష్ఠా! ఈ వృత్తి హేయమైనదని భావించి తిరస్కరింపకుము. దీనివలన ఉత్తరోత్తరా నీకు మేలు కలుగనున్నది. సాక్షాత్ పర బ్రహ్మ నరరూపధారియై రఘుకులమున అవతరింపనున్నాడు. కనుక నీ వీ కార్యమునకు సమ్మతించి భవిష్యత్తులో సుఖింపుము'- అని పలికి న న్నీ వృత్తి స్వీకరించుటకు ప్రోత్సహించెను. భగవాన్! దేనిని యజ్ఞ యాగ వ్రతోపవాసము లతో సాధించుట కష్టతరమైయున్నదో ఆ సత్ఫలము నా కీ మూలమున సుకరముగా లభింపనున్నదని భావించి రఘుకులవంశ పౌరోహిత్యమునకు ఇయ్యకొంటిని. స్వామీ! జపతపములు, పురాణ పఠన శ్రవణాదులు, తీర్థా టన, భూతదయాపరత, సంయమ నియమాదులు మున్నగు సాధనములకు సాధ్యము భక్తి ప్రాప్తిగదా! ఆ పరమభక్తి నీ చరణ కమలములను నిరంతరము ప్రేమించుటచే సుకరముగా సిద్ధించుచున్నది.

ఎవని మానసము నిరంతరము నీ పాదారవిందముల యెడ ప్రేమతో పరి పూర్ణమై యున్నదో ఆమహనీయుడే సర్వజ్ఞుడు, వాడే తత్త్వజ్ఞుడు, ఆతడే విజ్ఞుడు, ఆ పుణ్యచరితుడు పండిత ప్రవరుడు. దేవా! జన్మ జన్మాంతర పర్యంతరము నీ పాదాంబుజములయెడ పాయనిభక్తి, ప్రేమ నాలో కలిగియుండు నట్లు నన్ననుగ్రహింప వేడుకొనుచున్నాను."

ఇవ్విధముగ వశిష్ఠుడు శ్రీదేవుని స్తుతించి పరమానందభరితుడై నిజాశ్రమమునకు పోయెను.

# నారద గానము

వశిష్ఠుని గమనానంతరము అవధేశుడు అనుజులతో, అంజనీ తనయునితో గూడి అయోధ్యా నగరమునకు సమీపమందున్న ఒక ఆమ్రవనమును చూడ బోయెను. అక్కడ విడిసియున్న చతురంగబల సమూహములను పరామర్శించి దశరథనందుడు వారిని బహువిధ బహుమానాలతో సత్కరించి సంతృప్తులగు నట్లు చేసెను. అనంతర మా సుఖధాముడగు రాముడు చల్లని చూతవృక్షచ్ఛా యలో భరతుడు ఉత్తరీయము పరచగా దానిమీద సుఖాసీనుడై విశ్రమించెను. వాయుసూనుడు వింజామరలతో రఘుకులేశునికి సేవలు చేయుచుండెను.

అట్లు సాకేతపతి వనములో సుఖాసీనుడై యున్నప్పుడు దేవర్షి నారద మౌనీంద్రు డచ్చట కరుదెంచి, స్వీయ వీణను మీటి ప్రగాఢ భక్తిపారవశ్యముతో సీతాపతి నిట్లు కీర్తించసాగెను--

"మా మవలోకయ పంకజలోచన
కృపావిలోకన సోచ విమోచన,
నీల తామరస శ్యామ కామ అరి
హృదయ కంజ మకరంద మధుప హరి."

★ ★ ★ ★

"భుజ బల విపుల భార మహి ఖండిత
ఖర దూషణ విరాధ బధ పండిత,
రావణారి సుఖరూప భూప వర
జయ దశరథకుల కుముద సుధాకర.
సుజన పురాన విదిత నిగమాగమ
గావత సుర ముని సంత సమాగమ,
కారుణీక బ్యలీక మదఖండన
సబవిధి కుసల కోసలా మండన."

★ ★ ★ ★

"కలి మల మథన నామ మమతాహన
తులసీ దాస ప్రభు పాహి ప్రనత జన.."

నారదు డట్లు తన్మయుడై స్వామి ననేక ప్రకారముల స్తోత్రముచేసి, దాశరథి దివ్యరూపము హృదయమునం దిడుకొని, మరల మరల స్వామి గుణకీర్తన చేయుచు మహదానందముతో బ్రహ్మలోకమునకు గమనము చేసెను.

## -: శివుడు కాకభుశుండి యొద్ద రామకథ వినిన వైనము:-

"గిరిజా సునహు బిసద యహ కథా
మైఁ సబకహీ మోరి మతి జథా,
రామచరిత సతకోటి అపారా
శ్రుతి సారదా న బరనయి పారా."

'ఓ గిరికుమారీ! ఈ సుందరమైన - రామగాథ నా బుద్ధికి తోచినట్లు సవిస్తరముగ వర్ణించ గలిగితిని. శతకోటి ప్రవిస్తరమగు రఘునాథ చరితమును వర్ణింప వాణికి వేదములకు సైతం సాధ్యముగాదు. రాము డనంతుడు, అతని గుణము లనంతములు. ఆ స్వామి లీలావతార క్రియ లనంతమైనవి. జలశీకర ములను ధూళికణములను లెక్కించవచ్చును. కానీ, కౌసల్యాతనయుని గుణ సందోహము గుణించుట సాధ్యము. కాకభుశుండి గరుత్మంతునకు చెప్పియుం డిన రామచరిత్ర నా శక్త్యనుసారము నీకు వినిపించగలిగితిని" అని పరమేశ్వ రుడు పరమేశ్వరితో పలికెను.

పరమేశ్వరుడు ప్రసన్నభావముతో ప్రవచించిన శ్రీరాముని చరిత్ర పరమ భక్తితో ఆలకించి పార్వతి ఆనందముననుభవించెను. తదనంతరము కేలుగేలించి వినమ్రవాక్కుల పరమ శివునిట్లు ప్రశ్నించెను.

"ఓ త్రిపురారీ! మీ దయవలన భవభయహరము సీతాపతి శుభచరిత్ర ఆలకించినందున నా జన్మ ధన్యత గాంచెను. ఇప్పటికి నాకున్న సందేహము తొలగిపోయి, శ్రీరాముడు సాక్షాత్ సచ్చిదానందస్వరూపుడని గ్రహించగలిగితిని. దేవా! చంద్రునివంటి మీ ముఖమునుండి వెలువడిన రామకథామృత పానముచే నా మానసమునకు పరిపూర్ణతుష్టి లభించెను. పరమ విచిత్రమగు ఈ రామ కథను చెవులుండియూ చెవులార ఆలకించ నొల్లనివాడు మూర్ఖుడు, ఆత్మఘాతకుడగుచున్నాడు.

కాలకంఠా! అయిననూ నా మనసునందింకనూ ఒక చిన్న సందేహము శేషించియున్నది. నాథా! మీరు రామాయణమును కాకభుశుండి - గరుత్మంతుల సంవాదరూపమున గదా నా కెరిగించితిరి! అయితే, జ్ఞానవిజ్ఞాన వైరాగ్య తత్త్వసంపన్నుడగు కాకభుశుండికి యేకతమున కాకిరూపము ధరించవలసి వచ్చెను. ఆ క్షుద్ర విహంగమునకు మునిదుర్లభమగు రామభక్తి యెట్లు ప్రాప్తించెనో తెలుసుకొన కుతూహలమగుచున్నది.

పరమేశా! వేయిమందిలో ఒక ధర్మశీలు డుత్తముడు, అట్టి కోటిమంది ధర్మాత్ములలో ఒక విరాగి శ్రేష్ఠుడు, అట్టి కోటిమంది విరాగులలో ఒక జ్ఞాన సంపన్ను డధికుడు, అటువంటి కోటిమంది జ్ఞానులలో జీవన్ముక్తి సాధించుకొన్నవాడు ఘనుడు. ఆ జీవన్ముక్తునికంటే కూడ రామభక్తి సంతరించుకొన్న పుణ్యాత్ము డగ్రగణ్యుడుగా పరిగణించబడుతున్నాడు. రామభక్తి అట్లు సర్వోత్కృష్టమైనది. అట్టి - పరమభక్తి తత్త్వము ఈ కాకమున కెట్లు సిద్ధించెనో? విశదీకరించి నా సంశయము నివారింప వేడుకొనుచున్న దానను. అదియునూ గాక సకలగుణావతంసుడగు వైనతేయుడు ఎందరో మహాత్ములుండగా వారిని వదలి ఈ వాయసమునాశ్రయించి కథాశ్రవణ మెందుకు చేసెను? ఆ కాకభుశుండి గరుత్మంతుల రామకథా ప్రసంగము మీ రెట్లు వినగల్గుట తటస్థించెను? సవిస్తరముగ వివరింప ప్రార్థన."

పార్వతి తన ప్రశ్నావళిద్వారా వ్యక్తీకరించిన కథాశ్రవణ కుతూహలత కెంతయు మదనాంతకుడు సంతసించినవాడై, సతి నవలోకించి-

"ప్రియా! నీ ప్రసంగము సముచితముగా నున్నది. నీ వడిగినట్లే ఒక

ప్పుడు గరుత్మంతుడుసైతం కాకభుశుండిని ప్రశ్నించియుండెను. అది నేను వినుటెట్లు సంభవించెనో ఆ వైనము విందువుగాక. భయశోకములను ఉన్మూలించి భవసాగరము తరింపజేయు పావనగాథ యథాభక్తి అక్షర్ణింతువుగాకొ' అని పలికి వృషకేతను డిట్లు చెప్పనారంభించెను.

''అపర్ణా! మునుపు నీ వొకప్పుడు దక్షప్రజాపతికి పుత్రికవై అవతరించి యుంటివి. అప్పుడు నీ పేరు సతి. నీ తండ్రి దక్షుడు యజ్ఞము తలపెట్టుట, ఆ సందర్భమున ని న్నతడు అకారణముగా అవమానించుట, ఆపై నీవు క్రోధవివశవై ప్రాణత్యాగము చేయుట, అనంతరము నా యనుచరులు దక్షుని యజ్ఞము ధ్వంసము చేయుట మున్నగు సంఘటనలు ఇప్పటికినీ నీకు జ్ఞాపక ముండవచ్చును. ప్రియా! నీ మరణానంతరము నా హృదయము శోక వ్యాకులిత మయ్యెను. దుస్సహ వియోగదుఃఖముచే కలతచెందిన నా మనస్సుకు శాంతి లేకపోయెను. దుఃఖోపశమనార్థమై నే నపుడు కైలాసము వదలి దేశాటనకు పూనుకొని పర్వతారణ్యముల శోభ సరిత్సాగరముల సౌందర్యము తిలకించుచూ సంచరించుచుంటిని. ఆయాత్రా సందర్భమున నేను యాదృచ్ఛికముగ కాకభుశుండి మహాత్ముని సందర్శించుట సంభవించెను.

ఉమా! సుమేరుగిరి కుత్తరభాగమున ఒక నీలాద్రి కలదు. ఆ కొండ నాల్గు బంగారు శిఖరాగ్రములతో చూడముచ్చటగా నుండును. ఆ శిఖరోపరితలములందు వరుసగా మర్రి, రావి, జువ్వి, మామిడిచెట్లున్నవి. అక్కడి కనతి దూరమున శీతల జలసమృద్ధమైన సరోవరము ఒకటున్నది. సుందరమైన సోపాన పంక్తిచే శీతలోదకముతో నానా విహంగ కల కూజితముతో ఆ కమలాకరము మనోజ్ఞమైయుండును. గిరిజా! ఆ శిఖరస్థవృక్షాగ్రమందే ఒకవాయసము వాసము చేయుచున్నది. ఆ పక్షికి కల్పాంతమందు సైతం నాశములేదు. ఆ ఖగోత్తముని పేరే కాకభుశుండి. అప్పుడా కాకభుశుండిని నేను కలుసుకొనుట తటస్థించెను.

శైలేంద్రజా! నేను కాకభుశుండిని దర్శించుట యెట్లు సంఘటిల్లెనో నీ కా వృత్తాంతము సంక్షిప్తముగ వివరించితిని. ఇక ఖగరాజు గరుత్మంతుడు కాక భుశుండియొద్ద రామకథ వినుటకుగల కారణము కూడ చెప్పుచున్నాను సావ-

ధానముగా ఆకర్ణింతువుగాక- '' అని శశిధరుడు శాంకరి కిట్లు మిగత కథ చెప్పదొడంగెను.

# గరుత్మంత కాకభుశుండుల సమాగమము

''దాక్షాయణీ! లంకాయుద్ధమందు శ్రీరాముడు మేఘనాదుని నాగపాశములకు కట్టువడెను. అప్పుడు నారదప్రేషితుడైన ఖగేంద్రుడు రామలక్ష్మణులను నాగబంధముల నుండి విడిపించెను. కాని సకలలోకనాథుడగు సాకేతపతి పాశబద్ధుడుగావడము చూచి అప్పుడు ఉరగారి మనస్సు కించిత్తు విచారాధీనమయ్యెను ''సర్వవ్యాపకుడు, మాయాతీతుడగు ఆ పరబ్రహ్మ రామరూపధారియై అవనిపై అవతరించెను గదా! ఆ జగదీశుడు ఒక క్షుద్ర దానవుడు ప్రయోగించిన పాశజాలమునకు పట్టుపడుట చోద్యముగా నున్నది-'' అని అంతరంగమున వైనతేయుడు విచికిత్సకు లోనయ్యెను. పార్వతీ! నీ వలెనే పక్షిరాజుకూడ ప్రభువు మహిమాశక్తిని శంకించి డోలాయమానమానసుడయ్యెను. పిమ్మట గరుత్మంతుడు నారదుని వద్దకుపోయి తన సందేహ మా మౌని ముందర ఉంచెను. అందుకు సురముని సుంతమందస్మితుడై ఖగరాజ నవలోకించి - ''గరుడజీ! అవధేశుని మహిమ ఊహాతీతమైనది! మహామహా జ్ఞానధనులే ఒకొకప్పుడు మాయకు లోబడి భ్రమించి ప్రవర్తింతురు. ఆ రాముని మాయ దురూహ్యమైనది. అది నన్ను సైతం అనేకమార్లు ఆడించి వదలినది. ప్రస్తుతము నీవు కూడ దాని ప్రభావమునకు వశీభూతుడవై శంకగొంటివి. నీ యజ్ఞానము మాటలతో బోవునదికాదు. కాబట్టి నీవు బ్రహ్మ యొద్దకు పొమ్ము. అతడే నీకు తగు సమాధాన మివ్వగల సమర్థుడు'' అని బోధించి నారదుడు వినతాసుతుని చతురాస్యుని యొద్దకు పంపెను.

విరించి వైనతేయుని వైఖరి గ్రహించినవాడై ఇంచుక గంభీరస్వరమున ఇట్లు ప్రవచించెను- ''ఖగేంద్రా! లోకాతీతమగు శ్రీపతి మాయా ప్రభావమును వర్ణించుటకు నేనెంతవాడను! విజ్ఞులు విద్వద్జ్ఞులుసైతం ఆ మాయకు వశవర్తులై వర్తించుచుండెదరు. ఆ పరాత్పరుని ప్రభావము సంపూర్ణముగా గ్రహించగలవాడు శంకరుడొక్కడే. అతడొక్కడే నీ ప్రశ్నకు సముచితరీతి సమాధాన మివ్వగల సమర్థుడు.'' అని పలికి ఖగనాథునికి కైలాసమార్గము చూపించెను.

ఉమా! నేను కుబేరుని జూచుటకై అలకాపురికి పోవుచుంటిని. గరుత్మంతుడు మార్గములో వచ్చి నా పాదములపై బడి తనకు గలిగిన సందేహము నివారింపవలసినదని అతివినయుడై అర్థించెను. నే నతనిజిజ్ఞాస కెంతయుహర్షించి సాదర పూర్వకముగ ఇట్లు సమాధనమిచ్చితిని-

"నాగాంతకా! నీ సందేహము నా కవగత మయ్యెను. కానీ, నాకిప్పుడు తీరికలేదు. అదియుమాగాక బహుకాల సత్సాంగత్యమువలనగాని నీకు కలిగిన సంశయము నివారింపబడదు. పరమాత్ముని లీలా రహస్యములు గూఢమైనవి. ఆ దేవదేవుని దివ్యచరిత్ర బుధ్ధుల బోధనలవలనగానీ సొంతముగా గ్రహింప బడజాలదు. ఇందుకు పురాణశ్రవణ మెంతయు అపేక్షణీయమైనది. సాధు సాంగత్యము వినా హరికథాశ్రవణము లభించదు. హరికథలు విననిదే అజ్ఞానము నశించదు. అజ్ఞానము వీడనిదే రామునిచరణ ద్వయముపై స్థిరభక్తి సిద్ధించుట దుర్లభము.

విహంగాధిపా! ఉత్తర దిశయందున్న నీలగిరియొద్ద సుశీలుడు సుచరిత్రుడగు పుణ్యవంతుడొక డున్నాడు. అతని పేరు కాకభుశుండి. ఆ పుణ్యవ్రతుడు నిరంతరము రామాయణము గానము చేయుచుండును. నీవా రామభక్తుని యొద్దకు పోయి భగవంతుని గుణకథలు ఆకర్ణించుము. తద్వారా మోహజనితమగు సంశయములు నివారింపబడును." అని బోధించి, నేను ఖగపతిని కాకభుశుండి యొద్దకు బంపితిని.

ఉమా! దాశరథి పరమదయార్ద్ర హృదయుడు. ఆ మహాత్ముని కృపాదృష్టి మర్మము నా కవగతము. ఈ ఖగేంద్రుడే కారణమునానొకింత దురభిమానుడై యుండవచ్చును. ఆ దురభిమానము పోగొట్టుటకై భగవంతు డతనిని సంశయగ్రస్తుడగునట్లు ప్రేరేపించి యుండవచ్చును. హరిభక్తుడు, వాసుదేవునికి వాహనము, ప్రజ్ఞాసంపన్నుడగు పక్షీంద్రుడే మాయకు లోబడి వర్తించినప్పుడు ఇక సామాన్యుల సంగతి చెప్పనేల! ఆ భగవంతుని మాయ ప్రబలమైనది.

గరుత్మంతుడు కాకభుశుండి నివసించుచుండు నీలాద్రిని సమీపించెను. ఆ పవిత్ర పర్వతమును దర్శించగనే వినతాసుతునిపై ఆవరించియున్న మాయాం-

ధకార పటలము తొలగి, అతని మనస్సు ప్రకాశవంతమై భాసించెను. ఖగనాథుడంతట సమీపమందున్న సరోవరమందు సుస్నాతుడై వాయసోత్తము డుండు వటవృక్షమువైపు నడచెను. అప్పుడక్కడ కథాప్రవచనము జరుగుచుండెను. హంసాది పక్షిసముదాయ మా చెట్టుక్రింద సభదీరి యుండెను. ఖగరాజును చూడగనే పక్షి సమాజము పైకిలేచి పరమాదరముతో ఆహ్వానము పలికి అతనిని ఉచితాసనాసీనుంజేసి కుశల ప్రశ్నలు వేసెను. అనంతరము కాకభుశుండి గరుత్మంతు నవలోకించి వినమ్రుడై ''రాజా! మీ శుభాగమనముచే మా నెలవులు పవిత్రములయ్యె. మీ దర్శన భాగ్యము ప్రసాదించి మమ్ము కృతార్థుల జేసితిరి. మా వలన సమకూరవలసిన కార్యమేదియో సెలవీయవలసినది'' అని విన్నవించుకొనెను.

వారి ఆదర సత్కారములకు పక్షీంద్రుడు పరమ హర్షితుడై - ''ఓ ఖగోత్తమా! నీవు భాగవతోత్తముడవు. నీ పుణ్యచరిత్ర ఆ పరమేశ్వరుని ముఖతః విను భాగ్యము నాకు కలిగెను. ఎప్పుడు ఈ ఆశ్రమములో ప్రవేశించి మీ దర్శనము చేసికొంటినో అప్పుడే నా యాశయము సిద్ధించి నా కోర్కెలు ఫలించెను. సౌమ్యా! సుఖదాయకము పరమపవిత్రముగు ఆ సాకేతరాముని శుభచరిత్ర కృపామతివై వినిపించి నావీనులకు విందొనర్ప వలసినదిగా ప్రార్థించుచున్నాను'' అని వినతాసుతుడు వక్కాణించెను.

★ ★ ★ ★

గరుత్మంతుని ఆశయము పరమ పవిత్రమైనది. అతని ప్రసంగము ప్రేమ రసపూరితము. అతని సత్సంకల్పమునకు కాకభుశుండి పరమానంద మొందెను. తదనంతర మాతడు మనోజ్ఞమైన రామకథను గరుడునికి చెప్పనారంభించెను.

భవానీ! రామకథ ప్రారంభించుటకు ముందు కాకభుశుండి రామచరిత మానస సరోవరమును సుందరముగ అభివర్ణించెను. పిమ్మట నారదుని మోహము, రావణుని జన్మ కారణము, శ్రీరాముని జననము, బాలరాముని దివ్యలీలలు విశదముగ వివరించెను. ఆ పైన అయోధ్యకు కౌశికుని ఆగమనము, రామలక్ష్మణులు తాటకిని వధించుట, మిథిలా నగరము చేరుట, ధనుర్భంగము, సీతారామాదుల వివాహ ఘట్టములను వరుసగా వివరించెను.

అనంతరము అయోధ్యలో పట్టాభిషేక ప్రసంగము, దశరథుని వరప్రసక్తి, సాకేతవాసుల శోక విహ్వలత, రామాదుల వనగమనము, నిషాదునిభక్తి, గంగా యమునలు దాటుట, చిత్రకూట నివాసము, సుమంత్రుని పునరాగమనము, రాజు ప్రాణత్యాగము, భరతుని హృదయావేదన, భరతాదులు చిత్రకూటమునకు ప్రయాణించుట, చిత్రకూట సమాజము, పాదుకా ప్రదానము, అయోధ్యకు భరతాదుల పునరాగమనము మున్నగు సంఘటనలను సాంగోపాంగముగా వర్ణించి చెప్పెను.

తదుపరి జయంతుని దుర్బుద్ధి, అవధేశుడు అత్రిమునిని సందర్శించుట, విరాధవధ, శరభంగ, సుతీక్ష్ణ అగస్త్యాదిమున్యాశ్రమములను వర్ణించుట, జటాయువుతో మైత్రి, పంచవటీ పర్ణకుటీరవాసము, శూర్పణఖ ముక్కు చెవులను గోయుట, ఖరదూషణాది రాక్షససంహారము, మాయలేడి, సీతాపహరణము, కబంధుని వధ, శబరి ఆతిథ్యము, సాగరతీరమునకు వచ్చుట, నారదాగమనము- ఆది దండకారణ్య సంఘటనలు క్రమముగా స్పష్టము చేసెను.

ఆపైన సుగ్రీవునితో చెలిమి, వాలివధ, ఋతువర్ణన, సీతాన్వేషణ, మారుతి సముద్రోల్లంఘనము, మహావీరుడు విభీషణుని జూచుట, సీతా సందర్శనము, లంకాదహనము, పవనాత్మజుని ప్రత్యావర్తనము, జానకి క్షేమ సమాచారములు దాశరథి కెరిగించుట, విభీషణ శరణాగతి, సాగర గర్వ భంగము మొదలగు వృత్తాంతములను సుందరముగా అభివర్ణించెను.

అనంతరము సేతుబంధనము, రామలింగేశుని ప్రతిష్ఠ, సముద్రము దాటుట, అంగదుని దూత్యము, యుద్ధప్రారంభము, రాక్షసుల సంహారము, రావణవధ, మండోదరి విలాపము, విభీషణుని రాజతిలకము, పుష్పకారూఢులై అయోధ్యకు బయలుదేరుట, రామభరతుల పునస్సమాగమము, శ్రీరామ పట్టాభిషేకము, రామరాజ్య వైభవము, ఆది సంఘటనలు పొంతముగ కాకభుశుండి గరుత్మంతునికి వినిపించెను.

## కాకభుశుండి ప్రబోధము

పక్షీంద్రుడు రఘుప్రవరుని చరిత్రయంతయు పరమభక్తిశ్రద్ధలతో ఆకర్ణించి పరమానందోల్లాస మానసుడై కాకభుశుండితో నిట్లు ప్రసంగించెను-

ఖగోత్తమా! పావనమగు రామకథ విను భాగ్యము ప్రసాదింపజేసిన మీ యనుగ్రహమునకు నేను కృతజ్ఞుడను మహాత్మా! మునుపొకసారి రణాంగణమున నాగపాశబద్ధుడై పడియుండిన శ్రీపతిని దర్శించుట సంభవించెను. నా కప్పుడు చిదానందమూర్తియగు శ్రీరామమూర్తి పాశాధీనుడు కావడమేమిటి? అను శంక కలిగియుండెను. ఇప్పుడు మీ ముఖతః ఆ లోకోత్తర రామచరిత్ర సంపూర్ణ ముగ విన్న అనంతరము నాకుండిన సందేహము తొలగి చిత్తము శాంతించెను. సంప్రతి నాకు సీతానాథునిపై స్థిరభక్తి ప్రాప్తించెను.

విబుధోత్తమా! నే నా నాడు రామావతార రహస్యము తెలుసుకొనజాలక శంకాధీనుడనైతిని. దానివలన ఒకలాభము కూడ కలిగెను. ఎండలో నడచిన వానికే నీడ సుఖము తెలియును. ఆ సంశయమే నన్ను మీబోటి సత్పురుషుల నాశ్రయించుటకు ప్రోత్సహించెను. తద్ద్వారా రమణీయమగు రామకథ సంపూర్ణముగ వినగల్గు భాగ్యము సంప్రాప్తమయ్యెను, భగవదనుగ్రహము కలుగనిదే సత్పురుష సాంగత్యఫలము సిద్ధించనేరదని శాస్త్రము లుద్ఘోషించుచున్నవి. ఆ రాముని దయ నన్నీ విధముగ ప్రేరేపించి యుండవచ్చును. వాయసశ్రేష్ఠా! మీ దర్శన భాగ్యముచే నా జన్మ తరించెను.''

గరుడుని వినయోక్తులకు కాకభుశుండి పరమానందభరితుడై ఇట్లు ప్రసంగించెను. ''ఓ ఖగనాథా! నిశ్చయముగ నీవా సీతాపతి కృపకు పాత్రునివి. సంశయములు, - భ్రమలు- మోహాదులు - రామభక్తుని సమీపించగలవా! మీరీ మిషతో నా యొద్దకు చనుదెంచి నన్ను కరుణించితిరి. అట్లు గాదేని, మిమ్ము మోహవశునిగాజేసి తద్ద్వారా జానకీనాథుడు నాకు గొప్పదనము కలుగునట్లు సంకల్పించి యుండును. మీరన్నట్లు ఒకవేళ రామమహిమను గురించి మీరు శంకాధీనులైనమా చింతించపనిలేదు. బ్రహ్మ మహేశ నారద సనకాదులెంతటి ఆత్మజ్ఞానవరులు! వారిలో ఎవరు మాయకు వశ్యులుకాలేదు? ఖగరాజా! ఈ జగత్తులో కామునిచే ఆడింపబడనివాడు, తృష్ణాపీడితుడు కాని వాడు, క్రోధమునకు వశ్యుడు కానివాడు ఎవడున్నాడు? జ్ఞానులు తాపసులు కవులు కోవిదులు శూరులు వీరులు- వీరిలో ఎవరు లోభాతురులు కానివారు? కాంతా కనకములకు ఈర్ష్యాద్వేషములకు లోబడని పురుషు డెవ్వడు? మాయాకు

టుంబము బలవత్తరమైనది, బహు విస్తృతమైనది. బ్రహ్మ మహేశాదులే ఆ మాయకు వశులై వర్తించుచున్నపుడు సాధారణుల సంగతి చెప్పనేల.

వైనతేయా! ఈ మాయయనటి రామప్రభువుకు భృత్యానుభృత్యవు. ఆ భగ వంతుని భ్రూవిలాసము ననుసరించి ఈ మాయ ఆడుచూ ఇతర ప్రాణి కోటిని ఆడించుచుండును. కాని, ఆ దయాధాముని కృపాదృష్టికి నోచుకొన్న జీవుడీ మాయనుండి ముక్తుడగుచున్నాడు.

*"సోయి సచ్చిదానంద ఘన రామా*
*అజ బిగ్యాన రూప గునధామా,*
*బ్యాపక బ్యాప్య అఖండ అనంతా*
*అఖిల అమోఘ శక్తి భగవంతా."*

ఆ రాముడే సచ్చిదానంద స్వరూపుడు, జన్మ రహితుడు, విజ్ఞానమూర్తి, సకల గుణధాముడు, సర్వ వ్యాపకుడు, అఖండుడు, అనంతుడు, అమేయశక్తి సంపన్నుడు, ఆ దేవుడు అవాఙ్మనస గోచరుడు, అజితుడు, అవినాశి. మిత్రమా! అట్టి దేవదేవుని మాయ సమీపించగలదా! ఏనాటికైనా చీకటి సూర్యుని సమీపించ గలుగునా!

విజ్ఞుడా! ఆ భగవానుడే భక్త హితార్థమై భూలోకమున మానవ రూపమెత్తి ప్రాకృతునివలె తన లీలను ప్రకటించెను. నాటకములో నటుడు అనేక వేష ములు ధరించును. ఆయా వేషధారణ కనుగుణముగ అతను అభినయించు చుండును. కాని నటుడు నటుడే. అతని నటన నటనమే. అవ్విధముగ భగ వంతుని అవతారలీలను అర్థము చేసుకొనవలెను. అట్లు దేవుని లీలా రహస్య ములు గ్రహించలేని మందబుద్ధులు అజ్ఞానముచే సంశయాస్పదులగుచున్నారు. కామెర్లరోగికి చంద్రుడు పసుపువర్ణములో కన్పడును. సముద్రయానముచేయు వానికి భూతలము పరిభ్రమించుచున్నట్లు తోచును. అటులనే మూర్ఖులు భగ వంతునియెడ పొరబడుచున్నారు. శ్రీరాముడు శోకవ్యాకులితుడై విలపించు చున్నాడనీ, విరహార్తుడై పామరునివలె ప్రలాపించుచున్నాడనీ భావించుకొని భ్రమ పడుచున్నారు. భక్తప్రవరులు మాత్రము ఇట్టి భ్రమకు లోనుగాక శ్రీరాముని

సాక్షాత్ భగవత్ స్వరూపునిగా భావించి భజించుచున్నారు-

"నిర్గున రూప సులభ అతి,

సగున జానహిఁ కోయీ."

గరుడా! నిర్గుణబ్రహ్మము తెలుసుకొనుట కడు సులభము, కానీ, సగుణ బ్రహ్మము గుర్తించుట బహు దుస్తరము. అందుకు, నిర్గుణబ్రహ్మ ఏకరసప్రధానమైనదికాగా సగుణబ్రహ్మ బహు రూపాత్మకమై యుండుటయే కారణము.

విహంగాధిపా! నీవు రామచంద్రుని భక్తుడవు. ఆ స్వామి కృపకు పాత్రుడవై యున్నందున నీకొక రహస్యము చెప్పదలంచితిని. సావధాన మనస్కుడవై ఆకర్ణింపుము. దాశరథి తనదాసులయందు దురభిమానముండుట చూచి సహించజాలడు. ఇది అతని స్వభావము. ఆ భక్తవత్సలుడు తత్క్షణమే భక్తుల దురభిమానము తొలగించుటకు ప్రయత్నించును. బాలుడు వ్రణముచే బాధ పడుచుండును. తల్లి బిడ్డబాధ తొలగించుటకు మనస్సు గట్టి చేసుకొని శస్త్రముతో వ్రణము ఛేదించి చికిత్స చేయును. అటులనే భగవానుడు తన భక్తులలో పొడగట్టిన అహంకారమును పోగొట్టుటకు ప్రయత్నించుచుండును.

## భక్తుని మూర్ఖత్వము, భగవంతుని దయ

"వైనతేయా! భక్తుడెంతటి మూర్ఖుడైనను భగవంతుడు అతనియెడల యెంత దయామయుడై వర్తించునో నీకు వివరింప దలచితిని. అందుకు ఉదాహరణముగా నా అనుభవమునకు సంబంధించిన ఒక సంఘటన పేర్కొనుచున్నాను - ఆకర్ణింతువుగాక.

పరమాత్ముడపుడపుడూ అవతారరూపధారియై తన భక్తులకొరకు అనేక లీలలను ప్రకటించుచుండును. నేను ఎపుడు అయోధ్యకు పోయినను బాలరాముని క్రీడాకలాపములు, వినోదచర్యలు తిలకించి ఆనందించుచుండును. ద్విజోత్తమా! ఆ బాలరాముడే నాకు ఇష్టదైవము. ఒక్కొక్కప్పుడు అయిదారేండ్ల పర్యంతము అక్కడనే ఉండి ఆ బాలభగవానుని నామకరణము, జన్మోత్సవాదులు నేత్రోత్సవకరముగా దర్శించి ఆనందించుచుందును. గరుత్మంతా!

భక్త సుఖదాయకమగు భగవంతుని లీలాప్రసంగ మొకటి ఈ సందర్భమున నీకు వినిపించవదలచితిని.'' అని పలికి కాకభుశుండి భక్తి పారవశ్యముతో తన్మయుడై ఇట్లు ప్రసంగించెను.

''గరుడా! నేనప్పుడొక చిన్న కాకిరూపమున అయోధ్యలో నుండి దశరథనందనుని దివ్యలీలలు నిత్యము దర్శించుకొని అపార ఆనంద మనుభవించుచుంటిని. ఒకమారు రామదేవుడు సౌధ ప్రాంగణమందు దోగాడు చుండెను. స్వామి కొరికి పారవేసిన పదార్థములను నేను యెత్తుకొనిపోయి పరమప్రీతితో భక్షించుచుంటిని. అది రత్నఖచితమగు రాజమందిరాంగణము. దానిపై కోసల కుమారుడు క్రీడించుచుండెను. బాలరాముని మంగళరూప సౌందర్యము కోటి మన్మథులను ధిక్కరించుచుండెను. మరకత వర్ణ శ్యామలాంగుడు, జలజారుణ సదృశకోమలచరణద్వయుడు, అరుణారుణ హస్తశోభితుడు వివిధవస్త్ర భూషణాలంకారములుగల రఘునందనుడు సింహ కిశోరమువలె ప్రాంగణమున దోగాడు చుండెను. నేనా మనోజ్ఞమూర్తిని రెప్పవాల్పక చూచు చుంటిని. ఆ బాలమూర్తి కదలినపుడు చిరుగజ్జలు ఘల్లుఘల్లుమని చిత్తమును హరించుచుండెను. నేనొకప్పుడు ఎగురుచు ఆ మోహనమూర్తిని సమీపింతును, ఆ కుమారుడు నన్ను పట్టుకొనుటకు చిట్టిచేతులు ముందుకు చాపును. అప్పుడు నేను ఎగిరి దూరముగా పోవుదును. అప్పుడా బాలమూర్తి నాదిక్కు చేయిచాపి 'ఓ కాకి! ఇదిగో రొట్టె' అని నన్ను పిలుచును. నేను దగ్గరకు పోగానే కిలకిలనవ్వి పరుగెత్తసాగును. ఒకమారు నేనా బాలదేవుని పాదములు స్పృశించవలెనని దగ్గరకు పోతిని. ఆ స్వామి నన్ను వెనుదిరిగి చూచుచూ దూరముగా పోయెను. గరుడజీ! ఇట్లు ప్రాకృతునివలె ముద్దుగా క్రీడించుచూ నన్నాకర్షించిన ఆ బాలుడు సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపుడగు భగవంతుడేనా! అను శంక నాకా దృశ్యము గాంచిన పిమ్మట కలిగెను. నా మనస్సీవిధముగ భ్రమించిన మరుక్షణమందే ప్రభు ప్రేరితమగు మాయవచ్చి నన్నావహించెను. కానీ ఆ మాయ నా కెక్కువ హాని కలిగించలేదు. నేను మాయకు వశుడౌటగాంచి ఆ చిన్ని దేవుడు మందహాసము చేసెను.

అనంతరము అవధనందనుడు నన్ను పట్టుకొనుటకై తన చిట్టి చేతులను ముందుకు చాచెను. నేను కొంత దవ్వు పై కెగిరి వెనుదిరిగి చూచితిని. బాల

రామునిచేయి నాకు చేరువలో కనబడెను. నేను మరింత పైకి శూన్యములోని కెగిరి తిరిగి చూచితిని. చిత్రము! రామునిచేయి నాకు రెండంగుళముల సమీపములో నుండెను. ఆ పైన నేను క్రమముగా పైకెగురుచూ రోదసి, బ్రహ్మ లోకము, సప్తావరణము దాటిపోయి వెనుదిరిగి చూచితినిగదా! అప్పటికినీ రామునిచేయి నాకు రెండంగుళముల దూరములో నుండెను. ఆ యద్భుత సంఘటనకు నేను విస్మితుడనై భయముతో నా రెండు కళ్ళు మూసుకొంటిని. ఖగేశ్వరా! కన్నులు తెరచి చూచునప్పటికి నేను పునః యథాప్రకారము అయోధ్యలో నుంటిని. అప్పుడు రఘుకిశోరుడు నన్నుజూచి చిన్నగ నవ్వెను. ఆ నవ్వుకు నేనతని నోటిలో దూరి గర్భములోనికి వెళ్ళిపోతిని.

గరుత్మంతా! అక్కడ రాముని హృదయ కుహరములో జూచిన దృశ్యము లతి విచిత్రముగా నుండెను. అనేక బ్రహ్మాండములు, చిత్రవిచిత్రలోకములు, కోట్లకొలది బ్రహ్మలు, మహేశ్వరులు, నక్షత్రమండలములు, సూర్యులు, చంద్రులు, లోకపాలురు, నదీనదములు, సాగరములు పర్వతములు నానాలోకవాసులు, చరాచర ప్రపంచమంతయు దృగ్గోచరమయ్యెను. పూర్వమెన్నడు చూడని విననివూహించనేరని అనేక చిత్రములను గాంచితిని. నేనా విధముగా ఒక్కొక్క బ్రహ్మాండములో శతవత్సరముల చొప్పున అనేక బ్రహ్మాండములలో నివసించుచూ తిరుగుచుంటిని.

ఒక్కొక్క లోకమునకు ఒక్కొక్క బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు దిక్పాలురు ఉండిరి. అవ్విధముగా నానాలోకములందు నానావిధములతో దేవతలు, దనుజులు, మనుజులు, కిన్నరులు, గంధర్వులు, జంతువులు, పక్షులు, నదీపర్వత సాగరములు మొదలగునవి ఉండెను. ఒక బ్రహ్మాండమునకు మరియొక బ్రహ్మాండమునకు పోలికయేలేదు. భిన్నభిన్నమైన అయోధ్యానగరములను, సరయూనదులను, కౌసల్యలను, భరతలక్ష్మణ శత్రుఘ్నులను చూచితిని. కానీ రాముడు మాత్రము అన్ని బ్రహ్మాండములందు ఒకే రాముడుగా గోచరమయ్యెను. అందుకు భిన్నమైన వేరొండు రూపులో రాముడు కనబడలేదు. ఎక్కడ జూచినను ఒకే రాముడు కంటపడెను. ఇవ్విధముగా నూరు కల్పముల పర్యంతము నేనా లోకములందు సంచరించితిని. ఈ విచిత్రలోక దర్శనమే నాకు మతి చలించెను. నా మనస్సు పరిపరివిధముల పరుగెత్తసాగెను.

యోచనాగ్రస్తుడనై చిత్తశాంతి పోగొట్టుకొంటిని. వ్యసన వ్యాకులితుడనై యుంటిని. నా మనోబాధను గుర్తించినవాడై రఘునందనుడు మెల్లిగ మందహాసము చేసెను. ఆ నవ్వుతో నేను రాముని గర్భమునుండి తిరిగి వెలుపలికి వచ్చి పడితిని.

ద్విజోత్తమా! అది అంతయు రెండు ఘడియలలో జరిగిపోయెను. దశరథనందనుడు మాత్రము యథాపూర్వము క్రీడించుచూ బాలవినోదము ప్రదర్శించుచుండెను. రాముని ఉదరగోళములో దర్శించిన విశ్వకటాహములు నాకు కన్నులకు కట్టినట్లుండెను. నేనంతట ఆశ్చర్యభ్రమకులోనై స్వాస్థ్యము గోలుపోయి "ఓ ఆర్తజనత్రాతా! త్రాహి! త్రాహి!" అని అరిచి సొమ్మసిల్లి నేలబడితిని.

అప్పుడా దేవదేవునికి నా దీన స్థితిపై జాలి గలిగెను. అతడు నాపై ప్రయోగించియుండిన మాయను ఉపసంహరించుకొని ప్రేమతో తన అభయ హస్తము నా మస్తకముపై నుంచెను. ఆ స్పర్శతో నా చిత్తమునకు శాంతి కలిగి ప్రసన్నత ప్రాప్తించెను. లోచనములు బాష్పపూరితమయ్యెను. హృదయము పులకరించెను. తన్మయుడనై స్వామి ననేక ప్రకారములు స్తుతించసాగితిని. రమారమణుడంత ప్రగాఢ ప్రేమతో నన్నవలోకించి మృదుమధురోక్తుల-

"భుశుండీ! నీపై నాకు సంపూర్ణ కటాక్షము కలిగెను. నీకేమి వరము కావలెనో కోరుకొనుము. అణిమాద్యష్టసిద్ధులు, నిధులు, సుఖదాయకమైన మోక్షము, జ్ఞానము, విజ్ఞానము, వివేకము, మునిదుర్లభమగు మోక్షము - వీనిలో నీకేది అభిలషణీయమో సంశయించక కోరుకొనుము." అని ప్రవచించెను.

## భక్తియొక్క ప్రాముఖ్యము

అవధేశుని అపార వాత్సల్య ప్రేమకు నేను ఆనంద విహారుడనై కేలుగీలించి వినమ్రవచనముల నిట్లు నివేదించుకొంటిని-

"ఓ భక్తకల్పద్రుమా! మీరు నాపై కరుణించి సుఖదాయకములగు సకలవిధ సంపద్వైభవములు ప్రసాదించెదనని పలికితిరి. కానీ మీభక్తి మాత్రము ప్రసా

దించెదనని ప్రసంగించకపోవడము వింతగా నున్నది. ఉప్పులేని కూరవలె భక్తి రహితమైన యీ మోక్ష సుఖములవలన ప్రయోజనమేమున్నది? దేవా! సర్వజ్ఞులు సర్వాంతర్యాములగు మీకు విదితముగాని దేమున్నది! ప్రభూ! ఎల్లవేళ యోగులు, మునులు, అనవరతము ఆరాటపడుచుందురో, దేని వేదములు సైతం నిరంతరము ప్రశంసించుచుండునో, అట్టి సర్వోత్కృష్టమైన భక్తిని మాత్రము ప్రసాదించుమని ప్రార్థించుకొనుచున్నాను. తదన్యమైన సుఖసంపదలతో నాకు పనిలేదు.''

కౌసల్యా తనయు డంతట అల్లన నవ్వి – నీయభీష్ట మీడేరుగాక! – యని దీవించి, పిమ్మట సుఖవచనంబుల నన్నిట్లు ప్రబోధించెను. ''వాయసో-త్తమా! సకల సుఖప్రదమగు అపూర్వ వరమును అభిలషించితివి. జపతప యోగాదులచే తమ శరీరములను దహింపజేసుకొనినను మునిజనులు దేనిని పొందజాలకుందురో అట్టి భక్తిని ప్రసాదించమని కోరిన నీ బుద్ధి కుశలత ప్రశంసనీయమైనది. కాకభుశుండీ! నేటినుండి భక్తిజ్ఞాన వైరాగ్య విధానములకు సంబంధించిన సర్వ రహస్యములు నీకు అవగతమగును. నా యనుగ్రహప్రాప్తిచే నీవిక యెటువంటి సాధన చేయనవసరములేదు. మాయామోహములు నిన్ని-కమీదట స్పర్శించ జాలవు. నేటి నుండి నీవు నన్ను ఆది – మధ్య – అంత ములులేని పరబ్రహ్మముగా భావింతువుగాక!

ప్రాజ్ఞుడా! నా కత్యంత ప్రియదాయకమైన భక్తివరమును నీకు ప్రసాదించితివి. ఇది మొదలు నీవు సర్వధర్మములు పరిత్యజించి నన్నే భక్తితో భజించు చుండుము. ఈ సృష్టిలో నేను సర్వాధికముగ నా భక్తులను ప్రేమించు చుండెదనని విశ్వసింపుము. భక్తిరహితుడైన ఆ పరమేష్ఠికంటే భక్తిరతుడైన పంచముడు నాకు ప్రాణసమానుడు. భుశుండీ! నీవు త్రికరణశుద్ధిగా నా స్వరూపమును ఆరాధించుచుండుము. నీవు దీర్ఘాయుష్మంతుడవై చిరకాల ముందువుగాక.''

''విహగవాహనా! భగవంతుడు ప్రగాఢప్రేమానురాగములతో నన్నాశీర్వదించి అనుగ్రహించెను. ఆ మోహనమూర్తి మంగళరూపమును, ఆ జగన్నాథుని వాక్సుధారసమాధుర్యమును ఇప్పటికీ నేను మరువలేకున్నాను. అనంతరము నేను

బహుకాలము సాకేతపురిలో స్వామిసాన్నిధ్యమందుండి పిమ్మట, నిజాశ్రమము నకు మరలి వచ్చితిని.

ఖగేంద్రా! నాటి నుండి నేను మాయామోహములకు అతీతుడనుగా నుంటిని. భగవత్కృప వినా అతని ప్రభావము తెలుసుకొనుట దుర్లభము. అతని ప్రభావము అవగతము కాకున్నయెడల స్వామిపై విశ్వాసము జనించదు. విశ్వాసము కలిగినప్పుడే ప్రేమయేర్పడును. భక్తికి ప్రేమ ఆధారము. ఒక్క భక్తి వలననే శ్రీరాముని హృదయము శీఘ్రముగా ద్రవించును. గరుడజీ! కాబట్టి నీవు నిరాధారమైన శంకలకు, వితండవాదములకు స్వస్తిచెప్పి సుఖప్రదాతయగు ఆ సీతాపతిని సేవించి ధన్యుడవగుము.

ఆ శ్రీపతి నామరూపగుణ మహిమలు వర్ణింప శేషునకు - సరస్వతికి - శివునకు సైతం సాధ్యముకాదు. గరుడా! నీవు గగనపథములో విహరించు చుందువుగదా! ఆకాశమెంత అనంతమైనదో చెప్పగలవా! అటులనే శ్రీరాముని మహిమా ప్రభావములు వూహించుట కసాధ్యములు. ఆ కోసలేశుడు కోటి మన్మథులకు సమానమైన రూపసౌందర్యములు కలవాడు, కోటి దుర్గలతో సమానముగా శత్రువులను నాశనముచేయగల శక్తిసంపన్నుడు. నూరుకోట్ల ఆకా శములంత విశాలవ్యాపకుడు. నూరుకోట్ల సూర్యకాంతికి తుల్యమగు తేజఃపుం- జముగలవాడు. నూరుకోట్ల చంద్రులబోలు బహుచల్లని ప్రభువు. నూరుకోట్ల యములవలె దుస్తరుడు, దుర్గముడు, అంతరహితుడు. నూరుకోట్ల ధూమ కేతువులబోలిన దుర్ధర్షుడు. అతని హృదయము నూరుకోట్ల పాతాళము లంతటి అగాధమైనది. నూరుకోట్ల పుణ్యక్షేత్రములను బోలిన పరమ పవిత్రుడు, కోటి హిమవన్నగ సమాన ధీరుడు - నిశ్చలుడు, నూరుకోట్ల కామధేనువులవలె కోరిక లీడేర్చువాడు. నూరుకోట్ల సరస్వతులకు సమమైన వాక్చాతుర్యము గలవాడు. నూరుకోట్ల బ్రహ్మలవలె సృష్టించగలడు. నూరు కోట్ల విష్ణువులవలె పాలించగలడు. నూరుకోట్ల రుద్రులవలె సంహరించగల సమర్థుడు. అతడు అవధిలేనివాడు, నిరుపమానుడు, జగదీశుడు. ఆ దయా ధాముని మునీశ్వరులు తమ బుద్ధికి తోచినంత వర్ణించిరి. నేను మహాత్ముల యొద్ద వినగలిగినంతవరకు నీకు వర్ణించగలిగితిని. గరుత్మంతా! కరుణా సముద్రుడగు ఆ కాకుత్స్థకులదీపకుని నిరహంకార బుద్ధితో సేవించి

ధన్యజీవుడగుము.'' అని కాకభుశుండి పక్షీంద్రునికి బోధించెను.

వినతాసుతుడు శ్రీరాముని తత్త్వరహస్యము సంపూర్ణముగా ఆలకించి అపార ఆనందానుభూతి నొందెను. రామకథాశ్రవణమువలన కలిగిన ఆనందాధిక్యముచే అతని కన్నులు చెమ్మగిల్లెను. రుద్ధకంఠుడై భుశుండిని పలువిధముల ప్రస్తుతించి, పిమ్మట ఇట్లుపలికెను.

''ఓ పూజ్యుడా! సంశయ వ్యాకులితమై యుండిన నాబుద్ధికిపుడు సాంత్వనము లభించి సంతోషము సంప్రాప్తించెను. మీ కృపవలన రఘువరుని అవతార రహస్యములు నా కవగతమయ్యెను. ధర్మజా! గురుసాహాయ్యములేనిదే బ్రహ్మమహేశాదులంతటి వారైనను భవసాగర తరుణోపాయము గానలేరనుట విదితమేకదా! ఆ రఘూద్వహుడే నీ రూపమున నాకు గురుబోధమే నా సంశయములు నివారించెను.

మహాత్మా! ఇంకొక విషయము మీ వలన తెలుసుకొనవలెనని నామనస్సు వాంఛించుచున్నది. మీరు సర్వజ్ఞులు, ధర్మాభిరతులు, సీతాపతి పద సేవారతులై యుండియు ఈ కాకి శరీరము ధరించుటకు కారణమేమి? మీకీ పవిత్ర రామచరిత మానసమెట్లు సంప్రాప్తమయ్యెను? ప్రళయాంతమున కూడా మీకు నాశములేదని పరమశివుడు పలికియుండెను. అదెట్లు సంభవమగును. అజ్ఞాన వశమున శంకాతురుడనై అడుగుచుంటిని. ఈ దాసుని దోసము సైరించి యథాపూర్వము దయామతివై సమాధానమీయ అర్థించుచున్నాను'' అని పక్షీంద్రుడు ప్రార్థించెను.

అందులకు భుశుండి పరమ ప్రసన్నవైఖరి ప్రదర్శించి ప్రియోక్తుల ఇట్లు ప్రసంగించెను.

''ద్విజరాజా! సందర్భోచితమైన ప్రశ్న వేసినందుకు నిన్ను అభినందించుచున్నాను. ప్రశ్నగత విషయము నా పూర్వజన్మకు సంబంధించి యున్నది. దానిని నీకు సవిస్తరముగా తెలియజేయుచున్నాను. యథామతి ఆకర్ణింతువు గాక!

# భుశుండి పూర్వగాథ

''ఓ పన్నగారీ! ఈ కాకిశరీరముద్వారా రామభక్తి సాధింపబడెను. అందు చేత ఈ తనువుపై నాకు మక్కువ. ఏ వస్తువు మన హితువునకు సాధక మవు చున్నదో అది యెంత హీనమైనదయినప్పటికీ దానిని మనము ప్రేమించుట సహజము. పట్టుపురుగు క్షుద్రప్రాణి. అయిననూ పట్టునిచ్చుచున్నందున దానిని ప్రేమతో పోషింతుము. నేనీ కాకి శరీరము ధరించినపుడే నాలో రామభక్తి ప్రభవించెను. భక్తిసాధకమగు శరీరమే సుందరము, శుభప్రదమైనది. కాబట్టి నేను యీ కాకిదేహము విసర్జింపలేకున్నాను.

గరుడా! పూర్వము నేను అనేక జన్మలు ధరించితిని. అనేక యోనులందు ఉద్భవించితిని. అనేక జపతప యోగదానములాది సత్కార్మ లొనర్చితిని. కానీ ఇప్పటి సుఖము - సార్థకత యే జన్మలోనూ నాకు లభించియుండలేదు- అని నిశ్చయముగా చెప్పగలను.''

# కలియుగ ప్రభావము

''ఓ విహంగేశా! నా పూర్వజన్మకు సంబంధించిన ఒక సంఘటన పేర్కొనదలచితిని. శ్రద్ధాళువై ఆకర్ణించుము-

పూర్వము ఒకానొక కల్పమందు కలియుగ మేర్పడెను. ఆ కాలమున ప్రజలు అధర్మమార్గమున నీతిబాహ్యులై ప్రవర్తించిరి. అప్పుడు నేను అయోధ్యానగరిలో శూద్రకులమున బుట్టియుంటిని. శూద్రవంశజుడగు నేను నిరంతరము శివునిభక్తితో సేవించుచూ ఇతర దేవతలను ఇష్టమువచ్చినట్లు దూషించుచుంటిని. రామనగరులో పుట్టిన ప్రతిజీవికి యేనాటికైనా రామభక్తి సిద్ధించును. అను సత్యము నాకప్పుడు బోధపడక గర్వితమతినై ప్రవర్తించితిని. కలియుగప్రభావము నేనట్లు మూర్ఖించుటకు కారణమయ్యెను. మిత్రమా! ఆ కలియుగమెంత దుష్టమైనదో దాని స్వభావము నీ కొకింత తెలియజేసెదను. వినవలసినది.''

కలిదోషములు సర్వధర్మములను శోషింపజేయును. సద్గ్రంథములు మూల బడును. సామాజికులు దాంభికులు కల్పించిన క్రొత్త పుంతలు ద్రొక్కి

చరింతురు. వర్ణాశ్రమధర్మము అంతరించును. బ్రాహ్మణులు వేదములను అమ్ముకొని రాజులు ప్రజలను పీడించి బ్రతుకుచుందురు. దాంభికుడు, మిథ్యావాది, బిగ్గరగా మాట్లాడువాడు మహాపండితుడుగా పరిగణించబడి పూజించబడును. దురాచారులు, వేదమార్గమును త్యజించినవారు, పొడవుగా జటలుధరించి గోర్లుపెంచినవారు మాత్రం జ్ఞానులుగా, విరాగులుగా గుర్తింప బడి గౌరవింపబడుదురు. పురుషులు స్త్రీలోలురై మగువల కనుసన్నలలో చరింతురు.

శూద్రులు యజ్ఞోపవీతములు ధరించి బ్రాహ్మణులకు బోధలు చేయుచూ దానములు గ్రహించగలరు. స్త్రీ పురుషులు కామక్రోధలోభాది దుర్గుణములచే పతితులగుదురు. ముత్తైదువలు మంగళ భూషణములు విడ నాడుదురు. విధవలు శృంగారవతులై చరింతురు. కలికాలమున బోధకులగు గురువులకు నోర్లుండవు. వినదగిన శిష్యకోటికి చెవులుండవు. "-వేదము చదు-వువాడే విప్రుడు, ఇదిగో! మేము వేదాధ్యయనం చేయుచున్నాము. మీకంటే మేము తక్కువవారముకాము-" అని తర్కించి శూద్రులు బ్రాహ్మణులను ఎదిరించుదురు. ప్రజలు జ్ఞానశూన్యులయినను బ్రహ్మజ్ఞానమును గురించి మాత్రము మహోపన్యాసములు చేయుదురు. స్త్రీలంపటులు, ధూర్తులగు వేషధారులు 'అహంబ్రహ్మాస్మి'యని పలుకుచూ అద్వైత బోధలు చేయుటకు సమాయత్తమగుదురు. నిమ్నజాతులకు చెందినవారు తమభార్యలు గతించిన పుడు, లేక ధనము పోగొట్టుకున్నప్పుడు శిరోముండనము చేయించుకొని కాషా యాంబరములు ధరించి సన్న్యాసు లగుచుందురు. ద్విజులు నిరక్షరకుక్షులై నీచస్త్రీ సంభోగ పరాయణులై దురాచారములతో పతితులగుచుండెదరు. హీన జాతులకు చెందినవారు జపతపములుచేయుచూ ఉన్నతాసనముల నధిష్ఠించి పురాణ పఠనములాది సత్కార్యము లొనరింతురు.

ఓ గరుడా! కలియుగమందు వర్ణసంకర మధికమై సామాజికులు పాపకర్మ లతో ఆది వ్యాధులతో దుఃఖజీవనము గడిపెదరు. సన్న్యాసులు దివ్యభవనము లలో నివసించుచూ ధనోపార్జనచేయ ప్రయత్నించుదురు. పురుషులు భార్యలకు లోబడి తల్లిదండ్రులను నిరాదరించెదరు. సకాల వర్షములుండవు. విత్తనములు మొలకెత్తుట అరుదుగా నుండును. స్త్రీ జీవనము దుఃఖభరితమై పోవును.

మానవులు అల్పాయుష్కులై కలహప్రియులుగా నుండెదరు. ఇట్లు కలికాలము సకల దుఃఖములకు ఆకరమై యుండును.

ద్విజరాజా! ఆ యుగమందు ఒక్క సుగుణము మాత్రము సర్వత్రా గోచరించును. భగవన్నామస్మరణ చేయుభక్తునికి అనాయాసముగా ముక్తి లభించగలదు. కలికాలమందు యోగ యజ్ఞ జపతపాదులు కష్టసాధ్యములు. కాబట్టి రామస్మరణ మాత్రచే జనులు మోక్షాధికారులు కాగలరు.

భక్తుడా! కృతయుగమందు ధ్యానముచేతను, త్రేతాయుగమునందు యాగ యజ్ఞములచేతను, ద్వాపరమున భగవంతుని పాదపూజవలనను, కలియుగమందు దేవుని గుణకీర్తన చేయుటవలనను మానవజాతికి ముక్తిలభించగలదు.

*"కృతే యద్ధ్యాయతో విష్ణుం*
*త్రేతాయాం యజతో మఖైః,*
*ద్వాపరే పరిచర్యాయాం*
*కలౌ తత్ హరికీర్తనాత్."*

(భాగవతము)

అదియునుగాక యుగ స్వభావముకూడ మారుచుండును. సత్యయుగము శుద్ధ సత్వగుణ ప్రధానమైనది. త్రేతాయుగము సత్వరజోగుణ ప్రధానమైనదిగా నుండును. కాగా, సత్వరజోగుణ తామసముల మిశ్రమము ద్వాపరము. కానీ కలియుగము మాత్రము తామస ప్రధానమై యుండును. అయితే హరిభక్తుడు మాత్రం ఈ యుగప్రభావములకు అతీతుడుగా నుండును. యుగధర్మములు అతనిని చలింపజేయజాలవు.

నాగాంతకా! దుర్భరమగు అట్టి కలికాలమందు ఒకప్పుడు అయోధ్యలో ఘోర క్షామ మేర్పడెను. అందుచే నేను సాకేతనగరము వదలిపెట్టి ఉజ్జయిని చేరుకొంటిని. క్రమంగా ఆ నగరములో కొంత ధనమార్జించుకొని సదా శివారాధన చేసుకొనుచూ కాలము గడుపుచుంటిని.

# శివ శాపము

ఆ పట్టణములో శివభక్తుడగు బ్రాహ్మణోత్తము డొకడుండెను. పరమ తత్త్వజ్ఞుడగు ఆ భూసుర ప్రవరుడు శైవుడైనను విష్ణువును దూషించక నీతి మార్గమున ప్రవర్తించుచుండెను. నేను చిన్నగా ఆ శంభుదాసునియొద్ద చేరి అతనిని సేవించ సాగితిని. ఆ విప్రోత్తముడు నన్ను తనపుత్రునివలె భావించి నాకు అత్యంత ప్రీతితో నీతిబోధనచేసి పరమ పవిత్రమగు శివమంత్రము నుపదేశించెను. కానీ నేను మాత్రము నా పూర్వవైఖరి వదలిపెట్టక దంభముతో సర్వ విధముల హరిని దూషించుచూ హరిభక్తులను ద్వేషించుచూ తిరుగుచుంటిని.

ఒకదినము గురువు నన్ను ఆదరముతో చేరబిలిచి - ''వత్సా! శివభక్తి తాత్పర్యము శ్రీరామునియెడ ప్రేమ జనించుటయే. పరమేష్ఠి - పరమేశ్వరులే నిత్యము శ్రీపతిని ధ్యానించుచుండెదరు. మరి నీవా శ్రీరాముని ద్వేషించి ఏమి సుఖము మూటగట్టుకొన దలంచితివి?-'' అని మృదువుగా మందలించి హితబోధ చేసెను.

గరుత్మంతా! గురువు ఆ విధముగా హరుని హరిసేవకునిగా వర్ణించుట జూచి అప్పుడు కోపముతో నా వళ్ళు మండిపోయెను. కానీ నేనుమాత్రము నా అంతర్యమును బహిర్గతముచేయక లోలోన గురువును ద్వేషించుచూ పాలుబోసి పెంచిన విషసర్పమువలె ద్రోహబుద్ధితో మెలంగుచుంటిని. గురువు యథా పూర్వము ప్రేమాదర భావముతో నాకు అపుడపుడు నీతిబోధ చేయు చుండెను.

ఒకదినముశివాలయమందు కూర్చునినేను హరనామము జపించుచుంటిని. ఆ సమయమున గురువు ఆ గుడిలోనికి వచ్చెను. నేను వారి రాక గుర్తించియు నమస్కారము చేయక గర్వముతో కూర్చొనియుంటిని. గురువు నా ప్రవర్తనకు ఇసుమంతయు కినుక వహించక నా యెడల వాత్సల్య ప్రేమను ప్రదర్శించెను. కానీ అప్పటి నాయీ గురుద్రోహమును ఆ పరమశివుడు సహించలేకపోయెను. అప్పుడా మందిరమునుండి అదృశ్యవాణి నన్నిట్లు హెచ్చరించెను-

''ఓరీ స్వాభిమానీ! హతభాగ్యుడా! నీ గురువు జితక్రోధి, శిష్యవత్స

లుడు, దయార్ద్ర హృదయుడు. అందుచేత అమర్యాదకరమైన నీ ప్రవర్తన ఆయన సహించెను. కానీ నేను మాత్రము నిన్ను క్షమించజాలను. అట్లయిన మున్ముందు వేదమార్గము భ్రష్టమై పోగలదు. కాబట్టి నిన్ను శపించుచున్నాను. గురుద్రోహి పదివేల జన్మలవరకు నీచ యోనులందు జన్మించుచు దుఃఖజీవనము గడుపవలసి యుండును. నీవు గురువును నిర్లక్ష్యముచేసి అజగరమువలె అహంకరించి కూర్చొనియుంటివి. అందుచేత నీవు సర్పమై నీచగతిని పొందుదువుగాక.''

గరుడా! ఆ ఘోరశాపము విన్నంతనే నేను భయార్తుడనై గడగడ కంపించి పోతిని. నాకు తటస్థించిన విపత్కర స్థితికి గురువు హృదయము చలించి పోయెను. అప్పుడమ్మహనీయుడు చేతులు పైకెత్తి ఊర్ధ్వముఖుడై కడు దీన స్వరమున పరమశివుని ఇట్లు ప్రార్థించెను. ఆ భక్తాగ్రేసరుని యప్పటి ప్రార్థన రుద్రాష్టకమని లోకములో ప్రసిద్ధినొందెను.

1. నమామీశ మీశాన నిర్వాణ రూపం
విభుం వ్యాపకం బ్రహ్మ వేద స్వరూపమ్,
అజం నిర్గుణం నిర్వికల్పం నిరీహం
చిదాకాశ మాకాశవాసం భజేఽహమ్.

2. నిరాకార మోంకార మూలం తురీయం
గిరా జ్ఞానగోఽతీత మీశం గిరీశమ్,
కరాలం మహాకాల కాలం కృపాలం
గుణాగార సంసార పారం నతోఽహమ్.

3. తుషారాద్రి సంకాశ గౌరం గభీరం
మనోభూతకోటి ప్రభాశ్రీ శరీరమ్,
స్ఫురన్మౌళి కల్లోలినీ చారుగంగా
లసత్ఫాల బాలేందు కంఠే భుజంగా.

4. చలత్కుండలం భ్రూసునేత్రం విశాలం
ప్రసన్నాననం నీలకంఠం దయాళమ్,
మృగాధీశ చర్మాంబరం ముండమాలం
ప్రియం శంకరం సర్వనాథం భజామి.

5. ప్రచండం ప్రకృష్టం ప్రగల్భం పరేశం
అఖండం అజం భానుకోటి ప్రకాశమ్,
త్రయఃశూల నిర్మూలనం శూలపాణిం
భజేఽహం భవానీపతిం భావ గమ్యమ్.

6. కలాతీత కల్యాణ కల్పాంతకారీ
సదా సజ్జనానంద దాతా పురారీ,
చిదానంద సందోహ మోహాపహారీ
ప్రసీద ప్రసీద ప్రభో మన్మథారీ.

7. న యావద్ ఉమానాథ పాదారవిందం
భజంతీహలోకే పరే వా నరాణామ్
నతావత్సుఖం శాంతి, సంతాపనాశం
ప్రసీద ప్రభో సర్వభూతాధివాసమ్.

8. నజానామి యోగం జపంనైవ పూజాం
నతోఽహం సదా సర్వదా శంభు తుభ్యమ్
జరా జన్మ దుఃఖౌఘ తాతప్యమానం
ప్రభో పాహి ఆపన్న మామీశ శంభో.

అని బ్రాహ్మణోత్తముడు పరమభక్తితో ప్రార్థింపగ పరమశివుడు ప్రసన్నుడయ్యెను. అనంతరము ఆ మందిరాంతర్భాగమునుండి - ఓ భూసురోత్తమా! నీకేమి వరము కావలయునో కోరుకొనుము -అని అదృశ్యవాణి ప్రతిధ్వనించెను. గురువంతట శిరమున కేలుగీలించి "ఓ దీనరక్షకుడవగు పరమేశ్వరా! సకలజీవులు నీ మాయకు వశ్యులై పథము దప్పి భ్రమించుచుందురు. నా శిష్యుడు మూర్ఖుడు. అతనిపై నీ కృపాదృష్టి ప్రసరింపజేసి, త్వరలో వాడు శాపమునుండి విముక్తుడగునట్లు అనుగ్రహింపమని కోరుచున్నాను-" అని మొరపెట్టుకొనెను.

గురువు పరోపకార బుద్ధికి పరమేశ్వరుడు సంతసించి "తథాస్తు" పలికి ఇట్లు ప్రవచించెను. "విప్రోత్తమా! నీ శిష్యుడు గురుద్రోహము తలపెట్టి ఘోరపాపమునకు ఒడిగట్టెను. అయినను నీ సాధుస్వభావమునకు సంప్రీతుడనైయున్నందున వానిని క్షమించుచున్నాను. కాబట్టి ఇతడు పూర్వజ్ఞానము కలిగియుండి జననమరణ దుఃఖములకు అతీతుడై యుండుగాక! ఓరీ శూద్రుడా! నీవు శ్రీరాముడు జన్మించిన పావననగరములో పుట్టియుంటివి. అదియునుగాక భక్తితో నన్ను సేవించుచుంటివి కాబట్టి నీవు ఆ శ్రీరాముని యెడ అపార భక్తికలిగి నిరంతరము సుఖింతువుగాక! ఇక మీదట నీవు బ్రాహ్మణులను నిరాదరించక, స్వేచ్ఛాగామివై సంచరింపుము. నీకు దుర్లభమైనది లోకములో ఏదియునులేదు" అని శివవాణి న న్ననుగ్రహించెను.

శంకరుని ప్రసన్నవాణి విన్నమీదట నా గురువు పరమానందభరితుడై నన్ను అనేక విధముల ఆశీర్వదించి నిజాశ్రమమునకు వెడలిపోయెను.

## లోమశమహర్షి శాపము

పక్షీంద్రా! ఆపైన కొంతకాలమునకు నేను వింధ్యాచల ప్రాంతమున సర్పమునై పుట్టితిని. పిమ్మట క్రమముగా నేను అనేక యోనులందు వివిధరూపము లెత్తితిని! కానీ యేజన్మయందుకూడా నేను నా పూర్వజ్ఞానమును పోగొట్టుకొనక పరమభక్తితో రామప్రభువును సదా సేవించుచుంటిని.

బహుకాల పర్యంతమిట్లు అనేక జన్మ మరణములు పొందినపిమ్మట, కాలాంతరమున ఒక బ్రాహ్మణవంశమున మానవుడనై జన్మించితిని. నేను బాల్య దశలో ఆటపాటలందు కూడ శ్రీరాముని విస్మరించకుంటిని. నా తండ్రి నాకు విద్యాబుద్ధులు చెప్పించి నన్ను పండితునిగా చేయవలెనని ఎంతో ప్రయత్నించి తుదకు నిరాశజెందెను. కామధేనువునువదలి గాడిదను ఆశ్రయించుటకు ఎవరు ఇచ్చగింతురు! నేను ఏమాత్రము లౌకిక విద్యలను ఆపేక్షించక సర్వదా చిత్తము రామాయత్తముచేసి భక్తివ్రతుడనై ఉంటిని.

కొంతకాలమునకు తల్లిదండ్రులు గతించిరి. అనంతరము నేను వనములకుపోయి, అక్కడ మునియాశ్రమములందు ద్రిమ్మరుచూ మహర్షుల యొద్ద కోసలరాముని గుణకథలను వినుచు కాలము గడుపుచుంటిని.

క్రమక్రమముగా నాలోని కోర్కెలు నశించెను. నానావాసనలు నన్ను వదలి పెట్టెను. నేను నిరంతరము రామనామస్మరణ వ్రతుండనై ఉంటిని. అప్పుడు నాలో ఒక బలీయమైన కోరిక మాత్రము ఉండెను- అది శ్రీరాముని కన్నులారా చూడవలెనను వాంఛ. ఆ యిచ్ఛ నాలో ఉత్తరోత్తరా అధికము కాజొచ్చెను. దాశరథి దర్శనార్థమై మనస్సు వికలము కాజొచ్చెను. నేనంతట మునీశ్వరుల యొద్దకు పరుగులెత్తి ఆ శ్రీపతి ఎక్కడున్నాడో చెప్పుమని వారిని ప్రాధేయపడితిని. నా ప్రశ్నకు వారు 'భగవంతుడు సర్వాంతర్యామి, సకల ప్రాణి కోటియందు నివసించుచుండును.' అని నాకు నిర్గుణబ్రహ్మను గురించి బోధించుట కుపక్రమించిరి. బహు కాలమునుండి సగుణబ్రహ్మను ప్రేమించిన నా మనస్సుకు వారి నిర్గుణబోధలు రుచించలేకపోయెను.

నేనట్లు నిరంతరము సీతానాథుని దివ్యనామము జపించుకొనుచు లోక సంచారము చేయుచుండుతరి ఒకప్పుడు లోమశమహర్షిని దర్శించుట తటస్థించెను. ఆ మునీశ్వరుడప్పుడు మేరుగిరి శిఖరముందున్న ఒక వటవృక్షము క్రింద కూర్చొని ఉండెను. నేనా మునీశ్వరుని సమీపించి, అతని చరణములకు సాష్టాంగ మొనర్చి, బద్ధహస్తుడనై - "ఓ మునివర్యా! నన్ను కటాక్షించి, నాకు సగుణ బ్రహ్మోపాసన విధానము గురించి వివరించవలసిందిగా వేడుకొనుచున్నాను" అని ప్రార్థించితిని.

ఆ తపోధనుడంత పరమానందముతో నన్ను తనచెంత కూర్చుండ బెట్టు-కొని, మొదట శ్రీరాముని గుణగాథలు కొన్ని వివరించిచెప్పి, అనంతరము నిర్గుణతత్త్వమును బోధించసాగెను. కానీ లోమశుని నిర్గుణోపదేశము నాకు నచ్చకపోయెను. ఆపైన నేను వినయవిధేయుడనై "ఓ మహాత్మా! చేప నీటిని వీడలేనట్లు సగుణ తత్త్వమును వదలుకొనుటకు నామనస్సు అంగీకరించుట లేదు. మహర్షీ! ఒక్కమారు ఆ దేవదేవుని దివ్యసౌందర్యము దర్శించుకొనుటకై నా నేత్రద్వయము బహుదినములనుండి పరితపించుచున్నది. ఈ కన్నులతో ఒకసారి ఆ దాశరథిని చూచుకొనవలయునని మనస్సు ఉవ్విళ్ళూరుచున్నది. అట్టి భాగ్యము కలుగుటకు మార్గమేదైనా ఉన్న, తెలియజేయవలసిందిగా వేడు కొనుచున్నాను. పిమ్మట నేను నిశ్చింతతో మీరు బోధించు నిర్గుణోపదేశమును వినగలవాడను" అని పలికితిని.

అందుమీదట మహర్షి అత్యంత గంభీరముద్రవహించి, సాకారపూజను ఖండించి నిరాకార దేవుని గురించి బోధించసాగెను.

అందుపైన నేనుకూడ ప్రతివాదమునకు పూనుకొని మహర్షి ఉపదేశమును పూర్వపక్షము చేయసాగితిని. నిర్గుణోపాసనకంటే సగుణోపాసన శ్రేష్ఠమైనది అను నా వాదము విన్నంతనే లోమశునికి కోపము వచ్చినట్లగుపడెను. ఎక్కువగా రాచినట్లైన చందనమందుసైతం అగ్ని పుట్టును. మునీశ్వరుని కుపిత వైఖరిని గాంచి నే నిట్లాలోచించ సాగితిని-

"నా ప్రతివచనములకు మహర్షి ఆగ్రహించుచున్నాడు. ద్వైతబుద్ధిలేనిదే క్రోధమెట్లు జనించును. అజ్ఞానము వల్లనే కదా ద్వైతబుద్ధి యేర్పడుట. మాయాధీనుడు, పరిచ్ఛిన్నుడగు జడజీవుడు ఈశ్వరస్థితిని చేరుకొనగలడా! బ్రహ్మజ్ఞాన సంపన్నుడగు యీ లోమశునికి కోపమెందుకు వచ్చును! ఇతని లోని జీవుడు పరబ్రహ్మతో సమానుడెట్లగును! చింతామణి లభించినవాడు దరిద్రుడుగా నుండుట అసంభవము. బ్రహ్మతత్త్వము సిద్ధించిన వారికి లౌకిక స్వభావముండునా! జీవు డెన్నటికీ దేవుడు కాజాలడు..."

అని మనసులో తర్కించుకొని నేనపుడు మునివాదమును ప్రతిఘటించి తిని. నా వైఖరికి ఋషి క్రుద్ధుడై నన్ను చురచుర చూచి "ఓరీ మూర్ఖుడా!

నేను నీకు బ్రహ్మతత్త్వమును ఉపదేశించగా నీవు దానిని విశ్వసించక శుంఠవై స్వపక్షమును సమర్థించుకొనుటకు పూనుకొంటివి. కాబట్టి నీవు చండాలమైన కాకిజన్మ మెత్తి చరింతువుగాక'' అని లోమశుడు శపించెను.

''గరుడా! నేను ఏమాత్రము చలించక నిర్భయముతో మునిశాపమును స్వీకరించి కాకి నైపోతిని.తదుపరి మునివర్యుని పాదములకు మ్రొక్కులిడి రామ నామము స్మరించుకొనుచూ లోమశుని యొద్దనుండి నిర్గమించితిని.''

''- ఉమా! కామ క్రోధాదులు నిర్జించి అనుక్షణము అవధేశుని ఆరాధించుచుండు పుణ్యవ్రతునికి లోకమంతయు రామమయముగా కన్పట్టు చుండును. అట్టి పురుషుడు అన్యులతో కలహించుటకు ఎట్టి స్థితిలోనూ ఇచ్ఛగించడు-'' అని శివుడు ఆ సందర్భమున భవానితో పలికియుండెను.

## వరదానము

అట్లు తాను వాయసస్వరూపము ధరించుటకు గల కారణము తెలియజేసిన పిమ్మట, భుశుండి మరల గురుత్మంతుని పేర్కొని ఇట్లు ప్రసంగించెను.

''ఓ ఖగరాజా! నేను వాయసముగా శపింపబడుటకు ప్రధాన హేతువు ఆ రఘూత్తముని సంకల్పమేగాని లోమశమహర్షి మాత్రము కాదు. దైవ సంకల్పముచే ప్రేరితుడై ముని న న్నావిధముగా పరీక్షించియుండెను. నేను త్రికరణ శుద్ధిగా శ్రీరాముని భక్తుడనని గ్రహించిన తదుపరి మహర్షి ప్రసన్నుడై, న న్ననేక విధముల అభినందించి, నాకు ప్రేమతో రామమంత్రోపదేశము చేసెను. వెండియు మునిపుంగవుడు ముదముతో మోహనమూర్తియగు బాలరాముని సుందరరూపమును ధ్యానించు విధానము కూడా నాకు తెలియజేసెను. బాల రాముడు నా ఇష్టదేవుడని మునుపొకసారి నీకు చెప్పియుంటిని. తదాది లోమశఋషి బహుకాలము నన్ను తన యొద్ద ఉంచుకొని రామచరిత మానసము సంపూర్ణముగ నాకు వినిపించెను.''

ఒకనాడు ఆ తాపసవర్యుడు నన్ను తనచెంతకు చేరబిలిచి - ''ఓ వాయసోత్తమా! నేనింతకు పూర్వము శంకరుని వలన తెలుసుకొని యుండిన రామ చరితమానస పుణ్యకథను నీకు సాంతముగా బోధించగలిగితిని. ఒక్క

విషయము మాత్రము మనసు నందుంచుకొనుము. భక్తిలేని వారికి మాత్రము ఎప్పటికిని ఈ రామకథను బోధించవలదు'' అని ఉద్బోధించి, మునీశ్వరుడు స్వహస్తములతో నా మస్తకమును స్పృశించి న న్నిట్లాశీర్వదించెను-

''ఓ భుశుండీ! నీవు ధీరవ్రతుండవు. నీకు వరదానము చేయుచున్నాను. శ్రీరాముని యెడ స్థిరభక్తి నీకు సిద్ధించుగాక! నీవు కోరిన రూపము పొందు చుండెదవుగాక! నీ యిష్టప్రకారము మృత్యువు నిన్ను వరించుగాక! నీవు నివసించియుండు ఆశ్రమమునకు యోజన పరిధిలోపల మాయా వ్యామోహ ములు చేరకుండుగాక! కాల -కర్మ - గుణ- దోష -జనితములగు సుఖదుః- ఖములకు అతీతుడవుగా నుండెదవుగాక! ఆ శ్రీరాముని కృపాకటాక్షమువలన ఈ ప్రపంచంలో నీకు దుర్లభమైన దేదియు నుండకపోవుగాక!''

అని లోమశుడు అపూర్వమైన వరములు నాకు ప్రసాదించెను. ఆ సమయ మున పైనుండి - ''ఓ మునివర్యా! కాకభుశుండి నిక్కముగా నాకు పరమ భక్తుడు. నీ వచనములు ఆతనియెడ నిశ్చయముగ ఫలించుగాక -'' అని అశరీవాణి పలికెను.

''గరుత్మంతా! ఆవిధముగా లోమశుడు అపూర్వమగు వరసంపత్తి నా కనుగ్రహించెను. కొంతకాలమైన పిమ్మట నేను మహర్షి అనుమతిబడసి ఈ యాశ్రమమునకు వచ్చి చేరుకొంటిని. సుమారు ఇరువది కల్పముల నుండి నే నీయాశ్రమములో నివసించుచున్నాను. నేనిచ్చట నిత్యము నిరంతరము ఆ సీతా నాథుని గుణకీర్తన జేయుచుందును. హంసాది విహంగ సమాజము సమావేశమై నిరంతరము నా రామసంకీర్తన శ్రద్ధాభక్తితో ఆలకించుచుండును.

అప్పుడప్పుడు - రామావతార సమయములందు మాత్రము - నేను అయోధ్యకు పోవుచుందును. అక్కడ శ్రీ సాకేతనాథుని బాల్యరూపమును దర్శించుకొని, తిరిగి ఇచ్చటికి వచ్చి సుఖవాసము చేయుచుందును.

ఖగోత్తమా! ఇదీ రామకథ రహస్య వృత్తాంతము. నాకు కాకిశరీర మెట్లు సంప్రాప్తమయ్యెనో ఆ వైనము కూడ తెలియజేసితిని. ఈ కాయముతో నేను రామభక్తిని సాధించితిని. ఈ శరీరముతో నేను స్వామి దివ్య స్వరూపమును దర్శించుకొనగలిగితిని. ఈ వాయసరూపముతో నున్నపుడే నాకు సకల తత్త్వ

రహస్యములు బోధపడియుండెను. అప్పుడే నాకు సగుణోపాసనపై ప్రగాఢ విశ్వాసమేర్పడెను. మునులకు దుర్లభమగు అనేక వరములను పొందగలిగితిని. కాబట్టి విజ్ఞుడా! నేనీ వాయసరూపమును విసర్జింపలేకున్నాను. దీనిపై నా కత్యంత ప్రేమ గలదు.

గరుడా! సకలవిధ మోక్షదాయకమగు భక్తిమార్గమును వదలిపెట్టి, జ్ఞాన మార్గమునబడి శ్రమించువారు పరమమూర్ఖులు. అట్టివారు తమ దొడ్డిలోనున్న కామధేనువును వదులుకొని జిల్లేడుచెట్టుపాలకై పరుగులెత్తే మందమతులు. పడవ లేకనే పారావారమును తరించుట దుర్లభము. అటులనే లోకములో భక్తి వినా భవసాగరము దాట ప్రయత్నించుటయు కేవలము మూర్ఖత్వము.''

# భుశుండి భక్తిప్రాశస్త్యమును గురించి బోధించుట

కాకభుశుండి ప్రవచించిన ఆత్మకథ సాంతముగ విని పక్షీంద్రుడు పరమ ప్రసన్నుడాయెను. తదనంతర మాతడు వినమ్రభావముతో ఇట్లుపలికెను.

''ఓ భాగవతోత్తమా! భుశుండీ! రామాయణ కథా ప్రవచనము, మీ పూర్వచరిత్ర ప్రసంగము, శ్రవణానందకరముగ వినగల భాగ్యము సిద్ధించి-నందుకు నా జీవనము ధన్యమొందెను. నా మనస్సుకు శాంతి లభించెను. ఓ పుణ్యమూర్తీ! ఇదే విధముగ నన్ను కరుణించి ఈ దీనునికి గల మరియొక సందేహమును కూడ నివారింప వేడుకొనుచున్నాను. స్వామీ! జ్ఞానమార్గము కష్టసాధ్యమైనది. అయినను దానికి సాటిరాగల మార్గ మింకొకటి లేదని వేద పురాణములందు వర్ణింపబడినది. లోమశమహర్షిసైతం దానినే సమర్థించి యుండినట్లు సెలవిచ్చితిరి. కాని మీరు మాత్రము భక్తికంటే ఉత్తమ సాధన మరొకటిలేదని ఘంటాపథముగ చెప్పుచుంటిరి. కాబట్టి ఈ భక్తి - జ్ఞానములకుగల భేదము వివరించి, ఏది యెందులకు శ్రేష్ఠమైనదో వివరించ గోరుచున్నాను'' అని విన్నవించెను.

గరుత్మంతుని ప్రసంగవైఖరి కెంతయును సంతసించి, భుశుండి అత్యాదర భావముతో అతని కిట్లు ఉపదేశించెను-

"భగతిహిం జ్ఞానహిం-
నహి కఛు భేదా,
ఉభయ హరహిం భవ
సంభవ ఖేదా."

"ఓ వైనతేయా! భక్తికిని జ్ఞానమునకును మధ్య పెద్దగా భేదమేదియూ లేదు. రెండును భవ సంబంధమైన దుఃఖములను నివారింప గలిగినవే. లోమ శుని అభిప్రాయానుసారము విచారించిననూ ఈ రెండిటికిని పెద్ద వ్యత్యా సము కానరాదు. ప్రసంగవశాత్తు ఈ సందర్భములో నీకు కొన్ని సూక్ష్మ విష యాలను విశదీకరించుచున్నాను. సావధానుడవై విన వలసినది" అని నుడివి భుశుండి ముందుకిట్లు చెప్పసాగెను.

"మిత్రుడా గరుత్మంతా! జ్ఞానము- వైరాగ్యము -యోగము -విజ్ఞానము ఈ నాల్గును పురుషులతో సమానము. పురుషులు బలప్రతాపము కలవారు. మాయ మాత్రము స్త్రీ రూపముతో నుండును. జ్ఞాన సంపన్నులగు మునీంద్రుల మనస్సులు మృగనయనలగు కాంతల చంద్రవదనములు కంటపడ గనే విచలితము లగుచుండును. మాయ, భక్తి ఈ రెండును స్త్రీ వర్గమునకు చెందినవే. మాయ నాట్యకత్తెవంటిది. కానీ భక్తి - భగవంతునికి అత్యంత ప్రియమైన దగుటచే మాయ దాని దరిదాపులకుకూడ రాక భయముచే దూర ముగా తొలగిపోవును. కాబట్టి భక్తి మాయకు లొంగదు.

ఎవని హృదయము రామభక్తితో నిండుకొని యుండునో వానినిజూచి మాయ భయముతో దూరముగా తొలగిపోవును. రామభక్తునిపై మాయా ప్రభావము పనిచేయజాలదు. అందుచే మునీశ్వరులుసైతం భక్తిని సుకరము - సుఖదాయక మైనదిగా భావించి వరించుచున్నారు. అదియునుగాక ఒక స్త్రీ ఇంకొక స్త్రీని వరించుట కిచ్చగించనేరదు. ఆ కారణముచే భక్తి పరిసరములకే మాయ రానొల్లదు. కాబట్టి భక్తులు మాయాపీడితులు కాజాలరు.

# జ్ఞానమార్గము బహు దుస్తరమైనది

''పక్షీంద్రా! భక్తిమార్గమెట్లు సుఖకరమైనదో విశదీకరించితిని. ఇక జ్ఞాన మార్గ మవలంబించుటవలన కలిగెడి కష్టసుఖములను కూడ వివరించుచున్నాను. ఆకర్ణింతువుగాక!

భక్తిపథమునకంటే జ్ఞానమార్గమున పయనించుట కష్టముతో కూడినది. జీవుడు ఈశ్వరాంశ సంభూతుడు. అందుచే ఆతడు నాశరహితుడు, పాపరహితుడు, సుఖశీలుడైయున్నాడు. కానీ, ఈ జీవుడు సదా మాయాధీనుడై దాని బంధములలో చిక్కుకొనుచుండును. మాయాంధకారములో బడి పోవుటంజేసి వివేకము కోల్పోయి ముక్తిమార్గమును కనుగొనజాలక కొట్టుమిట్టాడుచుండును. అది ఎట్లన - కోతి చిన్నమూతిగల ఒక గాజుసీసాలోనికి మొదట తనచేయి దూర్చును. ఆ సీసాలోనున్న పదార్థమును పిడికిట నింపుకొని పిమ్మట తన హస్తమును వెలుపలికి తీసుకొనుటకు అది ప్రయత్నించును. కానీ పిడికిలితోనున్న చేయి వెలుపలికి యెట్లు రాగలదు! సూక్ష్మజ్ఞానములేని కోతి తన పిడికిలి విప్పదు, చేయి వెలుపలికిరాదు. దీనినే స్వయంకృత బంధన మందురు. అటులనే జీవుడుకూడ వివేకము గోల్పోయి మాయ వలలోబడిబంధవిముక్తుడు కాలేక గింజుకొనుచుండును. ఆ బంధనము అంతకంతకు బిగియుచునే ఉండును. భగవంతుడు దయామయుడు. ఆ దేవదేవుని కృపాకటాక్షము కలిగినపుడే జీవుడు మాయాసంబంధమైన సంసారబంధనము లనుండి ముక్తుడగుచున్నాడు. గరుడా! అట్లు గాఢతమస్సులోబడి సతమతమగుచున్న జీవుడు జ్ఞానమార్గమున పయనించి ప్రకాశవంతుడై ముక్తి నొందగలడు. ఇందుకు జ్ఞానజ్యోతిని వెలిగించవలయును. ఆ వెలుగును ఎట్లు సాధించవలెనో చెప్పుచున్నాను - శ్రద్ధతో వినుదువుగాక!

వినతాసుతా! శ్రద్ధయే ఒక ఆవు. ఆ గోవు భగవత్కృపవలనగాని లభింపబడదు. ఆ యావు సంయమనియమనిష్ఠాదులనెడి పచ్చిక మేయును. దానిని నివృత్తియనెడి త్రాటితో బంధించి నిర్మలాంతఃకరణమను గొల్లవాడు విశ్వాసమనెడు పాత్రలోనికి పరమ ధర్మమనెడు పాలను పితుకును. తదుపరి నిష్కామాగ్నిచే ఆ పాలు బాగుగా కాచబడును. ఆ పాలు సంతోషమను గాలి వలన

చల్లార్చబడినపిమ్మట దానిలో ధృతియనెడి తోడుపెట్టబడును. అనంతరము చింతనమను కవ్వముతో మథించగా దానిలో వైరాగ్యమను నవనీతము ఉద్భవించును. ఆ నవనీతమును శుభాశుభ కర్మలనెడు ఇంధనములతో కరగబెట్టగా అప్పుడు జ్ఞానఘృతము యేర్పడును. ఆ ఘృతమును చిత్తమను ప్రమిదలో బోసి, సత్త్వరజస్తమోగుణములనెడి వత్తులుంచి వెలిగించబడును. అట్లు వెలిగించబడిన దీప జ్వాలలందుబడి కామక్రోధ మదమోహాదిశలభ సముదాయము భస్మమై పోవును. గరుడా! ఆ జ్ఞాన దీపము నుండి వెలువడు సోఽహం అనబడు జ్వాలల వలన అవిద్యాసంబంధమైన భ్రమాంధకారము పటాపంచలై ప్రకాశ మేర్పడును: అప్పుడు బుద్ధి ఆ వెలుతురులో కూర్చుని మాయాగ్రంథులను విడదీసుకొని ముక్తిబొందుటకు ప్రయత్నించును.

గరుడా! అప్పటికిని మాయ బుద్ధిని భ్రమింపచేయుటకు మరెన్నియో ప్రయత్నములు చేయును. అది సమయము కనిపెట్టి తన చెరుగుతో జ్ఞాన జ్యోతిని ఆర్పివేయుటకు పొంచియుండును. మాయ బుద్ధి సిద్ధులను ప్రేరేపించును. వారు స్వర్గాది సుఖభోగములు చూపెట్టి బుద్ధిని పెడదారి బట్టించుటకు పూనుకొనెదరు. బుద్ధి జాగ్రత్తగానుండి మాయ ఆటలకు లొంగక తప్పించుకొని తిరుగవలసియుండును.

అంతటితో విఘ్నములు తొలగి మార్గము నిరాటంకముకాజాలదు. ఇంద్రియములకు అధిష్ఠాతలైన దేవతలు విజృంభించెదరు. వారు రోమరోమ మందు తిష్ఠవేసి యున్నారు. విషయవాసనల గాలి తగిలినంతనే వారు ద్వారములు తెరచి ఆ విషయవాయువును లోనికి ఆహ్వానింతురు. ఆ వాయుతరంగములు లోన ప్రవేశించగనే జ్ఞానజ్యోతి ఆరిపోగలదు. విషయ వాసనల గాలికి బుద్ధి విచలితమగుట సంభవించును. ఇంద్రియములకు అధిష్ఠాతలగు దేవతలకు జ్ఞానముయొక్క వెలుగు నచ్చదు. వారు సదా భోగాసక్తులైన వాంఛాపరాయణులు. గరుడా! అట్లు విషయ వాసనలకు సంబంధించిన వాయువుచే ఆర్పివేయబడు జ్ఞానదీపికను పునః ఎవరు వెలిగించగలరు? మరలా జీవుడు యథాపూర్వము సంసారసాగరమున బడి జనన మరణాదులందు మునిగి తేలుచుండును.

పక్షీంద్రా! జ్ఞాన ప్రధానమైన మార్గము బోధించుట కష్టము. గ్రహించుట కష్టము. సాధించుట కష్టము. ఒకవేళ అది ఘుణాక్షర న్యాయంగా తాత్కాలికముగా సిద్ధించినను ఉత్తరోత్తర అనేక ఆటంకములు యేర్పడుతూనే యుండును. జ్ఞానతత్త్వము అసిధారావ్రతము. ఏ మాత్రము అనవధానముగా నున్నను పతనము తథ్యము. ఒకవేళ ఆ పథమున ప్రగతి సాధించిన, అట్టివానికి మాత్రము ముక్తి లభించుట ముమ్మాటికి నిజము.''

# భక్తి సర్వోత్కృష్టమైనది

''గరుత్మంతా! మోక్షప్రాప్తి కడు దుర్లభమైనది. అయిననూ అది రామ భక్తునికి దానంతటదే సిద్ధించుచున్నది. అందుచే సూక్ష్మజ్ఞులగు సాధకులు ముక్తికంటే భక్తినే యెక్కువగా అపేక్షించుచుందురు. ఎవ్విధముగా మనము భుజించు ఆహారపదార్థములను జఠరాగ్ని జీర్ణము చేయుచున్నదో అవ్విధముగా మన దుఃఖ పాపములను భక్తి నిర్జించుచున్నది. కాబట్టి ఇటువంటి సులభసాధ్య మగు భక్తిమార్గము ఎవరికి సుఖదాయకముగా నుండకపోవును? ఓ గరుడా! కనుక నీ వా రఘూత్తముని చరణ కమలములను సేవకసేవ్య భావముతో సదా సేవించి సార్థకజన్ముడ వగుమని నేను దీవించుచున్నాను.''

''సౌమ్యా! రామభక్తియొక్క ప్రాభవమును గురించి మరికొంత వివరించు చున్నాను. ఆకర్ణింతువుగాక!'' అని పలికి కాకభుశుండి మరలా ఇట్లు ప్రసంగించెను.

''రామభక్తి చింతామణివంటిది. ఆ దివ్యమణి ఎవని హృదయాంతరాళ మందు ప్రకాశించుచుండునో వానిని అవిద్యాసంబంధమైన మోహాంధకారము సమీపించనేరదు. ఆ రామభక్తునికి విషము అమృతముగాను, శత్రువులు మిత్రులుగాను మారుచుందురు. ఆధివ్యాధులు, దుఃఖక్లేశములనుండీ సదా అతడు ముక్తుడగును. రామునికంటే రామభక్తుని నేను మరింత ప్రేమతో చూచెదను, వారి సంపర్క స్నేహము వలననే రామభక్తి మనకు లభ్యమగుచు-న్నది. ఎటుల సముద్రము నీరు మేఘములద్వారా ప్రాప్తించుచుండునో అటు లనే భక్తులద్వారా రామభక్తి ప్రజలకు ప్రసార మగుచుండును. ఆ శ్రీపతి

చందనవృక్షమువంటి వాడనుకొనిన యెడల రామభక్తి కలిగిన సాధువులు గాలు-లవంటివారు. గాలి లేని యెడల చందనగంధము ఇతరులకు ప్రాప్తించుట దుస్తరమగును. సజ్జన - సాధు సాంగత్యము వలన రామభక్తి సులభముగా లభించుటకు అవకాశ మేర్పడును. గరుత్మంతా! సకలవిధ సాధనముల కంటే భక్తి సాధనము సుఖప్రదము, సర్వోత్తమమైన మార్గము - అని విశ్వసింపుము.''

ఇట్లనేక రీతుల భక్తిప్రాశస్త్యమును గురించి కాకభుశుండి గరుత్మంతునికి ప్రబోధించెను. పిమ్మట పక్షీంద్రుడు పరమవినీతభావముతో -శరీర ధర్మమును, సాధువుల, అసాధువుల గుణ స్వభావములను గురించి, అజ్ఞానరోగము వలన కలిగెడి దుష్పరిణామములను గురించి బోధించ వలసినదని అభ్యర్థించెను. భుశుండి పరమాదరభావముతో అతని ప్రశ్నలకు సముచిత రీతిని సోదాహరణముగా వివరించిన అనంతరము ఇట్లు పలికెను:

''వైనతేయా! సర్వ మోక్షములకు మూలము, సకల సుఖములకు సాధకము అగు రామభక్తికి సాటిరాగల దివ్యతత్త్వము మరొకటి లేదు. అట్టి పరమభక్తిని సాధించుకొన్న ప్రాణికి ఈలోకములో దుర్లభమైనదేదియు ఉండబోదు. భక్తి శూన్యమైనవానికి సుఖప్రాప్తి పూజ్యము. తాబేలు వీపుమీద వెంట్రుకలు మొలచినను, వంధ్యా పుత్రుడు ఒకనిని హత్యచేసినను, గగనమున కుసుమము ఉదయించినను ఎండమావులందు నీరు లభించినను, చీకటి సూర్యరశ్మిని జయించినను, జలము తరచి నవనీతము తీయబడినను, సైకతమునుండి తైలము గ్రహింపబడినను, మంచులో అగ్ని పుట్టినను - సంభవము కావచ్చును, కానీ రామునికి విముఖుడైన వానికి మాత్రము సుఖమోక్షములు సిద్ధించుట అసంభవమని విశ్వసింపుము. నే జెప్పినది సర్వమత సిద్ధాంతము, సకల శాస్త్రముల సారాంశమని గ్రహించవలయును.''

ఆ దాశరథి దయాదృష్టి ప్రసరించిన యెడల మశకము బ్రహ్మ కాగలదు. అది లేనియెడల బ్రహ్మ మశకమునకంటే హీనస్థితిని పొందగలడు. గరుడా! నీవు నిశ్చింతుడవై ఆ రఘుపతిని సేవించి సుఖింపుము.

"వినిశ్చితం వదామి తే
న అన్యథా వచాంసి మే,
హరిం సదా భజంతి యే
అతి దుస్తరం తరంతి తే."

"పూజ్యుడా! నా మాటలు అసత్యములు గానేరవు. నేను యథార్థము పలుకుచున్నాను. ఎవరు శ్రీహరిని భక్తితో భజింతురో వారే దుస్తరమగు ఈ సంసార సాగరమును తరించగలరు."

అని పలికి కాకభుశుండి సుంత మౌనము వహించి పునః పక్షీంద్రు నవలోకించి ఇట్లు ప్రసంగించెను- "గరుడజీ! శుకులు, సనకాదులు మహేశ్వరులాది మహనీయులు నిత్యము సంస్మరించుచుండు నిరుపమానమగు రామచరిత్ర నా బుద్ధికి తోచిన మేరకు ఇంతవరకు నీకు వివరించి చెప్పగలిగితిని. గరుడా! నీవు విజ్ఞాన స్వరూపుడవు. మునుపు నీవు నాతో ముచ్చటించిన ప్రకారము అజ్ఞాన మోహాదులు నిన్ను సమీపించజాలవు. అజ్ఞానవశమువే గాక - నాపై నీకున్న ప్రేమాదర భావమువలన రామకథ బోధించుమని నన్ను కోరియుంటివేగాని, అన్యభావముతో కాదు. నీబోటి సత్పురుషుని సాంగత్యపుణ్యము లభ్యమగుటకు ఇదొక కారణము మాత్రమే. గరుడా! నేను ఒక నీచ కుల సంజాతుడను, అపవిత్రుడను, అన్నివిధముల హీనమైన వాడను. దయామయుడగు రాముడు పుణ్యశీలుడవగు నిన్ను నా దగ్గరకు పంపి, తద్ద్వారా నాకు లోకప్రసిద్ధి కలుగజేసెను. గరుత్మంతా! నేను ధన్యుడను. నా జీవితము ధన్యమయ్యెను. ఆహా! ఆ దశరథనందనుని దివ్యచరిత్ర మెంత పావనమైంది! అపారమైనది! వేదాతీతమైనది! ఆ స్వామి హృదయము దయార్ద్రమైనది. ఆ ప్రభువు మనస్సు అతికోమలమైనది. వైనతేయా! ఆ రామదేవుడు శాశ్వతుడు. అతని నామము భవరోగములకు పరమౌషధము. పక్షీంద్రా! ఆ కృపామూర్తి! ఆ రామ ప్రభువు! ఆ సీతానాథుడు! నిన్నూ - నన్నూ సదా సర్వదా కటాక్షించుచుండుగాక!" అని ప్రసంగించి కాకభుశుండి రామసంకీర్తనము చేయుచూ తన్మయుడై పోయెను.

మహాభక్తుడు కాకభుశుండి ప్రవచించిన పరమపవిత్రమగు రామకథను సాంత

ముగ అలకించి గరుత్మంతుడు అపార ఆనందసాగరమున వోలలాడెను. అతడు ప్రహృష్టాంతరంగుడై అంజలిఘటించి అతివినీతభావముతో భుశుండిని ఇట్లు ప్రస్తుతించెను.

''పరమ తత్త్వజ్ఞుడవగు ఓ భాగవతోత్తమా! భుశుండీ! భక్తిరస పూరితమగు శ్రీరామచరిత మానసామృతమును గ్రోలి నేటికి నాజన్మ తరించెను. మాయా జనితములగు నా దుఃఖశోకములు అంతరించి, మనస్సు నిర్మలమై, హృద యము శాంతించెను. మీ ప్రబోధానంతరం నా సంశయములన్నియు నిర్మూలింపబడెను. ఆ సీతానాథుని శ్రీ చరణములపై నాకు విశుద్ధభక్తి ఏర్ప డెను. ఓ భక్తాగ్రేసరా! మీరొనర్చిన మహోపకారమునకు నేనేమి ప్రత్యుపకారము చేయగలవాడను! ఓ పుణ్యాత్మా! మీ కృపాపరతకు ఇదియే నా భక్త్యంజలి. అనుగ్రహించ ప్రార్థన'' అని గరుత్మంతుడు భుశుండి పాదములకు పలుమార్లు ప్రణమిల్లి మరల ఇట్లు ప్రసంగించెను.

''ఓ పుణ్యశ్లోకుడా! ఆ రఘుప్రవరుని సంపూర్ణ కటాక్షము సిద్ధింపజేసు కొన్న మహాభాగులు మీరు. స్వామీ! పుణ్యపురుషులు. భూమి, భూధర ములు, నదులు, వృక్షములు కేవలము పరోపకారార్థము సృజింపబడినవి. దేవా! మీ సందర్శన భాగ్యమువలన, మీ సాంగత్య ఫలమువలన నా సందేహములు హరింపబడి నా జన్మతరించెను. నేను ధన్యుడనైతిని. సాధూ! నన్ను సదా మీ చరణదాసునిగా భావించి దీవించుడు.''

అట్లు గరుత్మంతుడు అనేకవిధముల భుశుండిని ప్రస్తుతించి పునఃపెక్కువిధముల ఆ దివ్యజీవుని పాదములకు సాష్టాంగపడి, అతని శుభాశీస్సులు గ్రహించెను. పిమ్మట అతడు భుశుండి ఆశ్రమము వీడ్కొని జగన్నాథుడగు శ్రీనివాసుని సంస్తుతించుకొనుచు వైకుంఠమునకు గమనము చేసెను.

## శివబోధ

''ఓ పార్వతీ! భుశుండి ప్రవచించినట్లుసాధుసమాగమముసర్వోత్కృష్టమై- నది. అట్టి యదృష్టము భగవత్కృపవలనగాని లభించదు. భుశుండి గరుత్మం- తుల సమాగమము శుభదాయకము, లోకకల్యాణకరమై భాసించెను. గిరిజా!

భుశుండి ప్రోక్తమగు ఈ పావనగాథను నీకు సంపూర్ణముగా వినిపించగలిగితిని. పరమ పవిత్రమగు ఈ రామచరిత్ర శ్రద్ధాభక్తులతో ఆలకించినవారికి సంసార బంధములనుండి విముక్తి ప్రాప్తించి, భక్తకల్పద్రుముడగు రామభగవానుని చరణ కమలములపై ప్రగాఢ ప్రేమ జనించును. ధర్మము -దానము - జపము - తపము వ్రతము -యాగము - దానము - ఇత్యాది నానావిధ సాధనములకు హరిభక్తి సంప్రాప్తమగుటయే లక్ష్యసిద్ధి. ఈ రామచరితమానసము పారాయణ జేయు పురుషునికి మునులకుసైతం దుర్లభమగు ఆ హరిభక్తి సునాయాసముగా లభించుచున్నది.

ఎవని చిత్తము సదా ఈశ్వరాయత్తమై ఉండునో వాడే సర్వజ్ఞుడు. వాడే పండితుడు. వాడే ధర్మపరాయణుడు. వాడే మహాకవి. వాడే వేదజ్ఞుడుగా భావింపుము. అట్టి మహాభాగుడు అవతరించిన వంశమే ఉత్తమమైన వంశము.

భవానీ! ప్రప్రథమముననే నీ రామకథను గోప్యముగా ఉంచియుంటిని. కానీ, నీ నిశ్చలభక్తికి, నీప్రేమాసక్తికి ముగ్ధుడనైన పిమ్మట నీ కీ పవిత్ర చరిత్ర పూర్ణముగా తెలియజేసితిని. హఠశీలురకు, శ్రద్ధలేనివారికి, కామాతురులకు, బ్రాహ్మణ ద్వేషులకు భూమీశులకు, ఈ శుభచరిత్ర వినిపించగూడదని మనసునందుంచుకొనుము. సత్సాంగత్యము నభిలషించు సజ్జనులు, గురుసేవా తత్పరులు, నీతి ప్రవర్తకులు, భక్తిని సదా అనుష్ఠించు భక్తులు ఈ సచ్చరిత్ర వినుటకు యోగ్యులై యున్నారు.

భవానీ! కలియుగ పాపములను హరించు రాముని దివ్యచరిత్ర భవరోగము లను నివారించుటకు సంజీవి ఔషధము. రామచరిత మానసమందలి సప్త కాండలు భక్తిమార్గమునకు సప్త సోపానములు. దైవకృపకు పాత్రులైన పుణ్యా త్ములీ మార్గమును పఠించువారు - ఆకర్ణించువారు - అనుమోదించువారు - భవసాగరమును గోష్పాదమువలె అవలీలగా తరించగలరు.'' అని శివుడు పలికెను.

శుభకరము శుభదాయకమునగు శ్రీరామచరిత్రమును సాంతముగ నాలకించి - జగజ్జనని పార్వతి - ''హే పరమేశ్వరా! ఇప్పటికి నా మనశ్శోకము నివారింపబడి, నా సందేహము లంతరించెను. తమ అనుగ్రహమువలన అవతార

పురుషుడగు ఆ సీతానాథునిపై నాకు నిశ్చలము, అవంతమైన భక్తి, భక్తిభావములు ఏర్పడెను. నేను కృతకృత్యురాలనైతిని'' అని పలికెను.

ఓ భరద్వాజా! పార్వతీ పరమేశ్వరులయొక్క ఈ రామకథా ప్రసంగము శుభదాయకము. మంగళప్రదమైనది. దీనిని శ్రద్ధతో వినుటవలన మానవులకు భయ దోష విషాదములు నివారింపబడి పరమానందము ప్రాప్తించును. జనరంజనకరమగు ఈ రామగాథ భక్తులకు మిక్కిలి మోదకరమైనది.'' అని యాజ్ఞవల్క్య మహర్షి భరద్వాజునికి చెప్పి ప్రసంగము ముగించెను.

## పరిసమాప్తము

''యోగ యాగ జప తప వ్రతాదులు నిర్వహించుటకు సాధ్యముకాని యీ కలికాలములో రామనామమునే ధ్యానించిన మానవాళికి సులభముగా ముక్తి లభించగలదు. పతితపావనుడగు సీతాపతిని నిర్మలాంతఃకరణతో సేవించి తరించని వాడెవడున్నాడు? ఓ పతితపావనా! దశరథరామా! నీకు నేను చేయెత్తి నమస్కరించుచున్నాను.'' గోస్వామి తులసీదాసు రఘు ప్రవరుని పాదాబ్జములకు ప్రణమిల్లి ఇట్లు ప్రవచించెను.

''ఈ రఘు వంశభూషణుని శుభగాథ ఇతరులకు చెప్పినవారు, శ్రద్ధతో విన్నవారు, భక్తితో గానము చేసినవారు ఈ కలిదోషములనుండి ముక్తులై ఆ రఘూత్తముని దివ్యసన్నిధానము చేరుకొని సుఖించగలరు.''

''శ్రీ జానకీరమణుడు దివ్యసుందరుడు, కృపాసాగరమూర్తి, సర్వజ్ఞుడు, దీనజనోద్ధారకుడు, మోక్షదాత, భక్తప్రియుడు, నిర్హేతుకజాయమాన కటాక్షము గల దయాస్వరూపుడు. అట్టి రామమూర్తి కృపాదృష్టి ప్రసరించుటచే నాబోటి వాడు సకల శాస్త్రములు తెలుసుకొనగలిగెను.''

''ఓ రఘూత్తమా! నేను దీనాతిదీనుడను. నీవు దీన జనోద్ధారకుడవు. భగవాన్! నన్నీ భవబంధములనుండి ఉద్ధరించి ముక్తిని ప్రసాదింపుము. కామాతురునికి కాంతపైనను, లోభికి కనకముపైనను తీరని మోహముండు విధముగ, ఓ రామచంద్రా! నీ పాదాబ్జములపై నాకు నిరంతరము భక్తి ప్రేమ ముండుగాక!-'' అని కావ్యాంతమున అవధేశుని కవి అర్థించెను.

దుర్గ్రాహ్యమగు ఏ రామాయణమును పూర్వము పరమశివుడు రచించి యుండెనో, ఏ రామాయణమును భక్తితో పఠించుటవలన శ్రీరాముని చరణ కమలములయెడ స్థిరభక్తి సిద్ధించుచున్నదో ఆ రామచరితమానసము గోస్వామీ తులసీదాసు తన అంతఃశుద్ధికై - హిందీ భాషలో రచించెను.

''పుణ్యం పాపహరం సదా శివకరం
విజ్ఞాన భక్తిప్రదం
మాయామోహ మలాపహం సువిమలం
ప్రేమాంబుపూరం శుభమ్,
శ్రీమద్రామచరిత్రమానస మిదం
భక్త్యావగాహన్తి యే,
తే సంసార పతంగ ఘోర కిరణై
ర్దహ్యంతి నో మానవాః.''

ఇతి శ్రీమద్రామచరితమానసే
సకల కలి కలుష విధ్వంసనే
అవిరల హరిభక్తి సంపాదనో నామ
సప్తమః సోపానః సమాప్తః.

(ఉత్తరకాండ సమాప్తము.)

# లవకుశకాండ

## (పరిశిష్టము)

అట్లు పుణ్యుడు- పునీతుడు - పరమభక్తుడగు శ్రీకాకభుశుండి జగన్మంగళకరమగు జానకీనాథుని దివ్యచరిత్ర సాంతముగ గరుత్మంతునికి వినిపించెను.

"శ్రీ భుశుండికే ముని వచన
దేఖ రామ పద ప్రీతి
హుయి ప్రసన్న బోలే గరుడ
వాణి పరమపునీత."

పరమ ప్రసన్నుడైన వినతాసుతుడు అప్పుడు వినయవినమితాంగుడై పరిశుద్ధవాక్కుల వాయసోత్తము నిట్లు ప్రార్థించెను-

"ఓ పుణ్యశ్లోకుడా! సకలవిధ శాస్త్ర తత్త్వార్థ మెరిగిన ఓ భాగవతోత్తమా! మీ శ్రీముఖమునుండి వెలువడిన సాకేతవాసుని సచ్చరిత్ర శాంతముగ ఆలకించినందున నాసందేహము లన్నియు అంతరించెను. నేను పూర్ణకాముడ నైతిని. నా జీవము ధన్యమయ్యెను. భవదనుగ్రహముచే నా చిత్తమిప్పుడు రాగ రోగ రహితమై రామభక్తిచే రంజిల్లెను. నా మానసమును మలినరహితమై భాగీరథీ పుణ్యోదకమువలె పునీతమాయెను.

ఓ సాధూత్తమా! సకలదేశముల సరితా - స్రవంతులు వచ్చి కలసినను సాగరమునకు సంతృప్తి కలుగదు. అటులనే నా మనస్సున కింకనూ సాకేత వాసుని సత్కథ మరీ మరీ వినవలెనను ఉత్సాహము అంతకంతకు అతిశయించుచున్నది. కనుక నా మనవి మన్నించి - ఆపై జరిగిన కథ, అనగా వైదేహి వాల్మీకి ఆశ్రమమునకు వేంచేసిన విధము, అవధేశుడు అశ్వమేధయాగము చేసిన తీరు, లవకుశకుమారుల లావణ్యతేజములు, తదనంతరము స్వామి సాకేత వాసులతో సదేహుడై వైకుంఠధామమునకు విజయముచేసిన శుభవృత్తాంతము

విశ్రుతుపరచి నన్ననుగ్రహింప వేడుచున్నాను.'' అని పచించెను.

మధురము - మనోహరము - భక్తిసమ్మిళితమైన పక్షీంద్రుని ప్రార్థనకు కాకభుశుండి గాత్రముప్రేమానుభూతితో పులకరించెను. నిమేషమాత్ర మతడు నిమీలితలోచనుడై ఇంచుక మౌనము వహించి, పిమ్మట పరమ ప్రసన్నభావముతో ఇట్లు ప్రసంగించెను.

''వైనతేయా! రామకథా శ్రవణ కుతూహలముతో నీవు పలికిన పలుకులు నిక్కముగా శ్లాఘింపదగినవి. భక్తాగ్రణీ! నీవు అడిగినట్లు ఆపై జరిగిన సీతా రాముల సుందరగాథ సవిస్తరముగ తెలియజేయుచున్నాను. యథామతి ఆలకిం చవలసినది.

ఖగేంద్రా! అజుడు, అవినాశి, అకళంకుడు, అద్వితీయుడు అగు ఆ పర బ్రహ్మ అట్లు అయోధ్యలో రామరూపముతో తొమ్మిదినూర్లేండ్లు; తక్కు-వగా తొమ్మిదివేల సంవత్సరములు రాజ్యము చేసెను. భువనమోహనముగ భూమండలము పాలించుచూ మానవ చర్యలు ప్రకటించుచుండు తరి, బ్రహ్మ దేవుడు స్వామికి నారదునిద్వారా అవతార సమాప్తికి సమయ మాసన్నమైనదని సూచింప జేసెను. గరుడా! ఈ విషయము అతిరహస్యముగా ఇతరులకు తెలియకుండునట్లు దాచబడెను.

## కోసలేశుని కాశీగమనము

ఇంతలో సూర్యభగవానుడు మకరరాశిలో ప్రవేశించు శుభకాలము సమీపించెను. ఆ సందర్భమున స్వామి సోదర సచివ సమేతముగా గురువులను దర్శించి ''మహాత్మా! సూర్యుడు మకరరాశికి రాబోవుచున్నాడు. ఈ పర్వకాలము కాశీ క్షేత్రములో గడపి రావలెనని సంకల్పించితిని. క్షేత్రయాత్రకు ఆశీర్వదించి అను-మతింప వలసినది.'' అని. గురువును అర్థించెను.

అందుకు మునివరుడు హర్షించి - 'నాయనా రామచంద్రా! సత్పురుషు లకు క్షేత్ర దర్శనము సదా వాంఛనీయమైనది. నీవు నిజబృందముతో వెళ్ళి కాశీశ్వరుని సేవించి రా దలచడము మరీ సంతోషకరము. రామా! ప్రసిద్ధమగు కాశీ పుణ్యతీర్థము సేవించి, మంగళకరముగ మరలిరమ్ము-' అని దీవించి

వశిష్ఠుడు కోసలేశుని కాశీయాత్రను ఆశీర్వదించెను.

అవ్విధముగా గురువు అనుమతించిన అవతికాలమునకే రామనృపాలుడు రాజపరివారముతో యాత్ర చేయుటకు సన్నద్ధుడై ముహూర్తము నిర్ణయించెను. రథ గజ తురగ భట చతుర్విధ సేనాంగములు, రాజ సేవకులు, మంత్రులు, పురోహితులు, దేవేరులు, రాజాంతఃపుర స్త్రీలు, పరిజన బంధు జనము యథార్హ రాజలాంఛనములతో త న్ననుసరింప, రఘుకులమణి రామప్రభువు ఒక శుభముహూర్తమున తీర్థాటనమై ప్రస్థానము చేసెను.

దారిలో వారు అనేక చారిత్రక స్థలములు దర్శించుకొనుచూ, పుణ్యనదు లందు గ్రుంకులిడుచూ, తీర్థములను సేవించుచూ కాశీనగరము సమీపించిరి. ప్రప్రథమమున రామాదులు పురమునకు ప్రణమిల్లి – జాహ్నవికి జయము పలికి -నగరములో ప్రవేశించిరి. అక్కడ అయోధ్యాధీశుడు అనుజామాత్య స్వజన సమేతముగా భక్తివ్రతుడై శివధామమందలి గంగాతీరమున కతిపయదినములు క్షేత్రావాసము చేసెను.

సీతానాథుడు సాక్షాత్ ధర్మస్వరూపుడు. అతడు పరమ పావని, పాపనాశని అగు గంగలో నిత్యము స్నానాదులు చేయుచూ, అఖిలేశ్వరుడగు కాశీవిశ్వేశ్వ-రుని సేవించుచూ, భక్తసమాజములందు పాల్గొనుచూ, యతులను, తాపసు లను, సన్న్యాసులను, వటులను, పరివ్రాజకులను దర్శించుకొనుచూ, పురాణ పఠనము చేయుచూ, బ్రాహ్మణులకు సంతర్పణలు చేయుచూ, యాచక కోటికి దానములు చేయుచూ బహుదినములు వారణాసిలో వసించెను. అటు పిమ్మట దాశరథి కాశీని వదలి నిజబృందముతో పునః అయోధ్యకు వచ్చి ఆనందించెను.

"వైనతేయా! అట్లు కాశీయాత్ర ముగించుకొని అయోధ్యకు విజయము చేసిన భానుకుల భూషణుడు -ప్రజానురంజకముగ, ధర్మసమ్మతముగ, లోక కల్యాణకరముగ రాజ్యము చేయుచుండెను. ఆ రామరాజ్యములో సకల ప్రాణి కోటి జరామరణ శత్రుభయములులేక నిశ్చింతగా సుఖజీవనము చేసెను. ప్రజలు నిత్యము వేదాధ్యయన పరాయణులై ధర్మసమ్మతముగ సామాజిక వర్త నులై శుభకార్యములు నిర్వర్తించుచుండిరి. పత్నీపతులు శుభచరిత్రులు

శ్రీమంతులు శీలసంపన్నులగు రామరాజ్యములోని స్త్రీ పురుషులను చూచి సురలోకవాసులు సిగ్గుపడుచుండిరి. సకాల వర్షములతో సమృద్ధిగ పంటలుపండి భూతలము నిత్యము సస్యశోభితమై యుండెను. నాగరికులు సజ్జనమైత్రి, రాజ భక్తి, దైవభక్తితో ప్రకాశించి ఆధివ్యాధులులేక తేజోసంపన్నులై రాణించిరి. పశు పక్ష్యాదులు తమ సహజ వైరభావమును విడనాడి ప్రేమతో సుఖజీవనము సాగించెను.

గరుడా! కోసలేశుని గుణగణములను, వారి ప్రజల శీల సంపత్సుఖములను వర్ణింప ఎవరికి సాధ్యము! కాటుకకొండ పొడితో సాగరమును సిరాగా మార్చి, కల్పతరువును లేఖినిగా చేసి, ఆదిశేషుడు - వాణి- బ్రహ్మ - మహేశ్వరులు ఈ భూపత్రముపై సప్తద్వీప పర్యంతము లిఖించినను రామరాజ్యముయొక్క వైభవ ప్రాభవములు వర్ణింపజాలరు.'' అని భుశుండి పలికెను.

## శంబూకుని వధ

గరుత్మంతా! రఘుకులమణి రామనృపాలుడు తన ప్రజల నెట్లు న్యాయముగా పాలించెనో అందుకు ఉదాహరణముగ కొన్ని సంఘటనలు వివరించెద. ఆకర్ణించవలసినది.

''రాజత రామ సభా సహభాయీ
తహఁ ఆయే ఇహ ద్విజబిల ఖాయీ
పరుష వచన ముఖ కహత పుకారా
హంస బంస బూడ్యో సంసారా''

ఒక దినము అయోధ్యాధీశుడు అనుజులతో, అమాత్యులతో, ఆత్మీయులతో, అధికారబృందముతో రాజ్యసభ నలంకరించియుండెను. అప్పు డొక వృద్ధబ్రాహ్మణుడు చచ్చిన తనబిడ్డ శవమును తీసుకొని సభాసమ్ముఖము నకు వచ్చి, దుస్సహ శోక వ్యాకులితుడై రోదించుచూ కాకుత్స్థ కులదీపకుని కటుకవచనము లాడెను. అతడు తన కుమారుని శవము క్రిందబెట్టి, సభాస- దులు వినుచుండ నెత్తిబాదుకొనుచూ ఇట్లు మొరపెట్టెను-

"అయ్యో బిడ్డా! నీకీ బాల్యముననే మృత్యువు ప్రాప్తించెనా! మా కడుపు పంటను మా నోముల ఫలమును అకాలమృత్యువు నోటబెట్టుకొనెను. ఇదెక్కడి ఘోరము! రఘువు, దిలీపుడు, సగర మహారాజులు పాలించిన ఈ పుణ్యభూమిలో ఇట్టి వైపరీత్యమున కేమిహేతువు? వర్ణాశ్రమ ధర్మములకు రక్ష లేని ప్రభువు పాలనలో ప్రజలు అపమృత్యువు వాతబడి ఆధివ్యాధులతో పీడింపబడుదురని పెద్దలు చెప్పుచుందురు. అట్లయిన ఇది రఘుకులజుల రాజ్యము కాదా! ఇక్ష్వాకులు అంతరించిరా! లేకుండిన ఒక భూసుర బాలకుడు మరణించుట, తండ్రి తనయునికి ఉత్తరక్రియలు చేయవలసి వచ్చుట అపూర్వము! వైపరీత్యము!" అని ఆ విప్రుడు పుత్ర శోకార్తుడై ఆక్రందించెను.

ఆ భూసురుని దీనస్థితికి పథికులు కలతచెందిరి. అవధేశుని ఆత్మ క్షోభించెను. ఇంతలో సర్వులకు వినబడునట్లు పైనుండి అశరీరవాణి ఇట్లు పలికెను.

"ఓ రామప్రభూ! ఒక శూద్రుడు బొందితో సుర లోకము చేరదలచి వింధ్యాటవిలో తీవ్రముగా తపస్సు చేయుచున్నాడు. ఈ బ్రాహ్మణ బాలకుడు మరణించుటకు ఆ శూద్రుని తపస్సే కారణము. వానిని వధించినచో ఈ చిన్నవాడు జీవించగలడు."

అశరీరవాణి పలుకు లాలించిన పిమ్మట గురు పురోహితులతో చర్చించి, వారి ప్రకారము ఆ తాపసుని సంహరించుటకు రాముడు నిశ్చయించెను.

శీఘ్రమే రఘువీరుడు ఆయుధపాణియై రథ మారోహించి ధర్మ రక్షణార్థము బయలుదేరెను. నదులు, అడవులు, గిరి ప్రాంతములు అతిక్రమించి అనతికాలముననే వింధ్యాద్రి చేరుకొనెను. అక్కడ నిరాహారముచే కృశించి, జటలు దాల్చి, తేజోవిలసితుడై ఒక గుహలో ఉగ్రముగా తపస్సు చేయుచున్న శంబూకశూద్రుని చూచెను. తత్క్షణమే దాశరథి ధర్మరక్షణార్థమై వాని తల తెగగొట్టెను. కాని, పరమభక్తుడగు ఆ తాపసికి భక్త చందనుడగు రామచంద్రుడు పరమపదము ప్రసాదించి ప్రసన్నుడాయెను. అక్కడ - శూద్రుడు నిహతుడయిన మరుక్షణమే ఇక్కడ ద్విజబాలునికి పోయిన ప్రాణములు తిరిగివచ్చి అతడు సజీవుడయ్యెను.

అనంతరము రఘుపతి నదీనదములు, వనవిశేషములు, మున్యాశ్రమములు దర్శించుకొనుచూ కతిపయ దినములకు అయోధ్య చేరుకొనెను.

## శునకము చెప్పిన తీర్పు

''వైనతేయా! సాకేతపతి పాలన కాలమందు జరిగిన మరొక సంఘటన గురించి చెప్పుచున్నాను. ఆకర్ణింతువుగాక!

ఒకప్పుడు దశరథాత్మజుడు ధర్మసింహాసన మలంకరించి సభ దీరియుండెను. అప్పుడు కుక్క తలమీద తగిలిన దెబ్బకు రక్తము కార్చుకొనుచూ సభాస్థలికి వచ్చెను. ఆ జంతువు హృదయము ద్రవించునట్లు ఘోరున యేడ్చి దీనస్వర మున పృథ్వీపతి నవలోకించి-

''మహారాజా! నేడు ఒక బ్రాహ్మణ భిక్షుకుడు దురాగ్రహముతో నిష్కా- రణముగా నా తల పగులగొట్టెను. ఇప్పటికినీ నెత్తురు కారుచున్నది. ధర్మప్రభు వులు న్యాయము విచారించకోరుచున్నాను-'' అని మొరపెట్టుకొనెను.

రామనృపాలుడు తత్క్షణమే రాజభటులను నియోగించి, ఆ బ్రాహ్మణభి- క్షుకుని సభాస్థలికి తెప్పించి - ''విప్రుడా! నిరపరాధి అగు కుక్కను యెందుకు కొట్టితివి?'' అని పృచ్ఛచేసెను.

అంతట ఆ భిక్షుకుడు - ''మహారాజా! ఈ శునకమును నేను కొట్టినది యథార్థమే. అందుకు పెద్దకారణముకూడ లేదు.నేను ఆకలితో అలసియుం- టిని. ఇది నా దారికి అడ్డువచ్చెను. నేను దుడ్డుకర్రతో తలపై బాదితిని'' అని సమాధాన మిచ్చెను.

ఆ పైన ధరణీశుడు సభాసదుల నవలోకించి -ఈ విప్రుని ఏ విధముగా దండింపవలసి యుండును- అని వారితో ఆలోచింపసాగెను. అప్పుడు శ్వానము ముందుకు వచ్చి - ''ప్రభూ! ఈ బ్రాహ్మణుని ఒక దేవాలయము నకో లేక ఒక మఠమునకో అధికారిని చేసిన చాలు. అదియే వీనికి తగిన శిక్ష-'' అని సూచించెను.

రఘూత్తముడు వెంటనే భూషణాంబరాదులచే భూసురుని సత్కరించి,

వానిని ఒక భద్రగజముపై కూర్చుండబెట్టి, ఒక పెద్ద మఠమునకు అధిపతిగా జేసి మర్యాదతో సాగనంపెను.

ప్రజలూ, సభాసదులూ ఈ విచిత్ర న్యాయమునకు అచ్చెరువంది - ''దేవరా! ఈ కుక్కను కొట్టిన కుటిలస్వభావుడగు బికారికి మఠాధిపత్య మిచ్చి మర్యాదచేసి పంపితిరి!''

రఘుపతి వారి ప్రశ్నలకు రవంత మందహాసము చేసి - ''ప్రజలారా! మీ సందేహములకు సారమేయమే సరియగు సమాధాన మియ్యగలదు.'' అని పలికి కుక్కను ప్రశ్నార్థకముగ పరికించెను.

స్వామి సంజ్ఞ గ్రహించిన శ్వానము ప్రభువును సంబోధించి ఇట్లనెను- ''ఓ సార్వభౌమా! నేను పూర్వజన్మలో ఒక బ్రాహ్మణుడను. నే నా కాలమున కాశిలో ఒక దేవాలయమునకు పూజారిగా నుండి దేవునిసొత్తు స్వేచ్ఛగా హరించి అనుభవించితిని. అందుకు ఫలితముగా ఇప్పుడు హీనమగు కుక్క జన్మమెత్తి ఆ పాపఫలము అనుభవించుచున్నాను.'' అని పలికి, ప్రభువుకు వందనమిడి, కంట తడిబెట్టుకొని కుక్క పరితపించుచూ అక్కడినుండి వెళ్లిపోయెను.

## పౌరుల నిందలు

రామభూపాలుడు ఒకనాటి పగలంతయు ప్రజల విన్నపములు ఆలకించి, రాచకార్యములు నిర్వహించి, మంత్రులతో మంతనములుచేసి, విద్వాంసులతో గోష్ఠి సలిపి, పురాణేతిహాసములపై పండితులతో కొంతతడవు చర్చించి సాయం సమయమగునప్పటికి సభ చాలించెను. పిమ్మట సాయం సంధ్యాద్యనుష్ఠానములు ముగించుకొని చారులను పిలువనంపెను.

రాజులను చార చక్షువులందురు. పౌరుల కష్టసుఖములు, వారి సంచార స్వభావములు పరోక్షముగా చారులవలన తెలుసుకొనుచుండుట రాజధర్మము. ఆ దినము సాయంకాలము ఏకాంతమందున్న రామనృపాలునియొద్దకు గుప్త చరులు ఒక్కొక్కరే వచ్చి - రాజ్యములో తాము చూచినది, విన్నది, గ్రహించినదీ - నివేదించి పోవుచుండిరి. ఆ సమయమున భద్రుడను చారుడు ఒకడు

ప్రభువు సమ్ముఖమునకు వచ్చెను. వాడు దీనభావముతో చేతులు కట్టుకొని దుఃఖస్వరముతో కోసలేశ్వరుని కిట్లు నివేదింపకొనెను-

''ప్రభూ! ఈ దినము నేను ఒక చాకలి గూడెమునకు పోతిని. అక్కడ ఒక చాకలివాడు తన భార్యతో కలహించెను. వాడు కోపముతో భార్యను ఇంటినుండి బయటకు గెంటి- ''ఇదిగో! ఇకమీదట నిన్ను నా గడప త్రొక్కనీయను. నేను శ్రీరాముడను కాదు, లంకలోనున్న సీతనుతెచ్చుకొని ఇంటిలో కాపురము చేయుటకు! ఇంతటితో నీకూ నాకు ఋణము తీరిపోయినది...'' అని ప్రభువులను పేర్కొని వాడు భార్యను నానా దుర్భాషలాడుట చూచితిని. స్వామీ! అప్రియమైన ఈ అపవాదువార్త నా సేవకధర్మము ననుసరించి తమకు నివేదించక తప్పనదికాదు. దొరలు నన్ను మన్నింతురుగాక' అని తెలియజేసి చారుడు చింతింపుచూ అక్కడనుండి నిష్క్రమించెను.

దూత పలుకులు సీతాపతి చెవులకు శూలములవలె తగిలెను. అవధేశుడు హత ప్రభుడై నిముసకాలము నిశ్చేష్టుడైయుండి, పిమ్మట గంభీరవదనముతో మౌనముదాల్చి, అచ్చోటువీడి, వికలభావముతో శయనమందిరమునకు పోయెను.

రాజుకు రాత్రి నిద్ర దూరమయ్యెను. జాగరణతో రాత్రంతయూ గడిపెను. ఆ నిశీథవేళ రాముడు ఏకాంతమున ఇట్లు చింతించెను- ''నేను వచ్చి చాలాకాలమయ్యెను. ఒక్క యుగము రాజ్యముచేసి ప్రజలను పాలించితిని. ఇక నా నిర్గమనానికి వేయి వత్సరములుమాత్రము మిగిలియున్నవి. ఇక ధర్మపత్నిని త్యజించి వేదమార్గమును రక్షించెదను. ఆత్మశాంతికై యాగము చేసెదను.'' అని నిశ్చయించుకొని అవధేశుడు అప్పుడునుండి సీత దగ్గరకు వెళ్ళి - ''సీతా! ఇక నీవు నీ నిజధామమునకు వెళ్ళిపొమ్ము, ఇది సమయము.'' అని చెప్పెను. ఆ శుభాంగి ఆత్మేశుని అంతరోద్దేశ్యము వెంటనే గుర్తించెను. మరుక్షణమే మహీపుత్రి అంజలి బద్ధయై - ప్రాణేశుని పాదపద్మములకు ప్రణమిల్లెను. అనంతరము జానకినుండి ఒక దివ్యతేజస్సు పైకి లేచిపోయెను. అక్కడ సీత ఛాయారూపము మాత్రమే పిమ్మట నిలిచియుండెను. ఈ రహస్యము రాఘవునికి తప్ప ఇతరులకు తెలియదు.

ఆ పైన మహారాజు పూర్వవైఖరితో సంభాషణము చేసి, మైథిలివైపు చూచి - "రాణీ! ప్రస్తుతము నీవు గర్భవతివి. ఇంతవరకు నీవు నన్నేమియు అడుగ లేదు. నీ కోరిక ఏదియో తెలుపుము. ఆనందముతో అంగీకరింతుము" అని అడిగెను.

ప్రాణేశుని ప్రియభాషణకు భూపుత్రి సంతుష్టయై, నాథుని శ్రీగంటజూచి, మునిసిగ్గుదోప, స్మితవదనయై- ఆర్యా! సుందర గంగాతీర భూములను, ప్రశాంతమైన తాపసుల ఆశ్రమములను, సుచరిత్రులగు మునిపత్నులను దర్శించి వారితో కొంతకాలము గడిపి రావలెనని కోరికగా నున్నది." అని జనకజ పలికెను.

ఆమె అభీప్సితమునకు అవధేశుడు హర్షించి - "వైదేహీ! నీవు కోరిన ప్రకారము రేపు ఉదయమే భాగీరథీ పుణ్యతీరములకు నిన్ను గొంపోవుటకు ఏర్పాట్లు, చేయించెదను. ప్రయాణమునకు సిద్ధముగా ఉండుము." అని చెప్పి దాశరథి తన ఆలోచనా గృహమునకు పోయెను.

## అవధేశుని ఆదేశము

అన్నయ్య ఆలోచనామందిరములో ఉన్నాడని తెలుసుకొని భరత - లక్ష్మ ణులు దిగులుపడి ఆ చోటుకు వచ్చిరి. రాము డచ్చట యోచనాగ్రస్తుడై మౌనముద్ర వహించియుండెను. ముఖమువాడి, శరీరము నిస్తేజముతో కంపించుచుండెను. అట్లు దీనత్వముతో విచారవదనుడై గంభీర భావముతో కూర్చొనియున్న అగ్రజునిచూచి సోదరులు మువ్వురు శంకాతురులై దిగులుప- డిరి; రామభూపాలుని మనో వైకల్యమునకు కారణ మేమైయుండునో యూహిం చకనే తమ్ములు కలత చెందిరి.

రఘూద్వహుండు దీర్ఘముగా నిట్టూర్చి, దైన్యదృష్టితో తమ్ములను చూచి "ఓ సోదరులారా! మీరు జానకిని తోడ్కొనిపోయి సాంద్రారణ్యములలో వదలిపెట్టి రావలసినది."- అని ముక్తసరిగా దృఢస్వరముతో పలికెను.

అనూహ్యము, శ్రవణ విదారకము - అయిన ఈ దుర్వార్త విని భరతాది సోదరులు సంభ్రమాశ్చర్యమగ్నులైరి. రాముని పలుకులు వారి చెవులకు ములు-

కులవలె నుండెను. విచారాగ్ని విద్యుత్తువలె వారి హృదయపటలముపై వ్యాపిం చెను. దిగ్భ్రమతో వారి మనశ్శరీరములు క్షణకాలము నిర్వ్యాపారత నొందెను. అన్నయ్య తమతో నిజమాడెనా! పరిహాసమునకు పలికెనా! అని యోచించి నోట మాటరానిస్థితిలో సోదరులు చిత్తరువులవలె నిలబడిపోయిరి. శత్రుఘ్నుడు ఆ స్థితినుండి రవంత తేరుకొని, చేతులు కట్టుకొని, సాశ్రులోచనముల అగ్రజుని అవలోకించి ఇట్లు ప్రసంగించెను.

''పూజ్యుడా! జానకి జగజ్జనని. ముల్లోకములకూ మాతృస్వరూపిణి. ఆ తల్లి చేసిన దోషమేమి? జరిగిన అపరాధమేమి! మనసా వాచా కర్మణా మీ పద సేవ చేయుచున్న సాధ్వీమణి వదినెగారిని ఎందుకు పరిత్యజించుచున్నారు? ఇందలి నిగూఢ భావమేమో మాకు బోధపడకున్నది.''

ప్రార్థనాపూర్వకముగా పలికిన రఘుసోదరుని ప్రియవచనములకు రాఘవుని హృదయము రవంత శాంతించెను. దుస్సహశోకానుభూతిచే అప్పుడా కమల లోచనుని కన్నుల నీరు గ్రమ్మెను. (పంకజనయన నీరభరి ఆయె.) పిమ్మట దాశరథి రుద్ధకంఠుడై ఆర్ద్రవచనముల తమ్ములతో నిట్లనెను.

''సహృదయులైన సోదరులారా!! భగవదిచ్ఛ బలీయమైనది. నేను పరిహాసమున కట్లు ప్రసంగించలేదు. నిజముగానే వైదేహిని వనములకు పంపదలచితిని. మీరు రేపు ప్రాతఃకాలమే సీతను అడవులకు తీసుకొని పోవలసినది. తమ్ములూ! మీరు నా అభిమతమును ఆదరింపని యెడల నా బొందిలో ప్రాణము లుండుట అసంభవమగును. మీకు మంగళమగుగాక!''

దుఃఖముతో, దృఢముతో తుదిసారిగా వెలిబుచ్చిన రామాభిప్రాయమునకు భరతుడు భయాతురుడై ఇట్లు భాషించెను:

''కులదీపకుడవైన ఓ కోసలేంద్రా! రఘువంశపు లోకఖ్యాతి, దశరథ మహారాజు ధర్మాభిరతి, కౌసల్యాదేవి సచ్చరిత్ర జగద్విదితమైనవి. అట్టి సద్వంశములో జన్మించిన జగత్స్వామివి నీవు. లోకములు నిన్ను ఎరుగును, నీవు లోకములను ఎరుగుచున్నావు. నీకు తెలియని రహస్య మేమున్నది? సర్వజ్ఞా! జానకి జగన్మాత. తుదకు ఒక్కమాట ఆలోచింపుము! ఆ పరమ శోభానతి నిన్ను వదలి జీవించగలదా! వర్షములేని వరిపైరు వర్ధిల్లునా! నీటికి దూరమైన

చేపకు జీవము నిలుచునా! సీతామతల్లి మైనీడ సోకినంతమాత్రముచే స్త్రీలు పరమ పునీతలగుచున్నారు. ఆ పతివ్రత పతిని బాసి ప్రాణములతో నుండగలదా! సామ్యా! శ్రీరామా! నా అల్పబుద్ధికి తోచినది పలికితిని. ప్రసన్నుడవై ఒకమారు పునఃపర్యావలోకన చేసి చూడుము.''

''భరతా! నీ పలుకులు యథార్థమైనవే, నేను కాదనను. కానీ ధరణీశులు ధర్మసమ్మతముగ, నీతియుక్తముగ రాజ్యపాలన చేయవలెను. పౌరుల అభిమతము, వారి అభిరుచులు గుర్తించి జనరంజకముగా నడచుకొనుట రాజధర్మము. తమ్ములారా! చారులవలన తెలిసిన సమాచారము మీకు చెప్పుచున్నాను. యథామతి వినవలసినది. మన ప్రవర్తన గురించి జను లేమనుకొనుచున్నారో తెలియునా! నేను రావణుడు తీసుకొనిపోయిన సీతను తెచ్చుకొని నీతిబాహ్యముగా గార్హస్త్యము నెరపుచున్నానట! నా ఆదర్శము మున్ముందుకు స్త్రీలు దుశ్చరిత్రులగుటకు తావిచ్చునట.''

''సోదరులారా! ఇది పామరులు ఆరోపించిన అపవాదుగా భావించి ఉపేక్షించుట తగదు. నిష్కళంకమైన రఘువంశమున కిది దారుణమైన కళంకము. అనఘచరిత్రు లనేకులు ఉద్భవించిన అకళంక వంశమిది. స్వాయంభువు, రఘువు, సగరుడు, భగీరథుడు, దశరథుడు మున్నగు మహనీయులతో దీప్తిగాంచిన ఇక్ష్వాకుల వంశమిది. సత్యవ్రతులు- ధర్మాత్ములు - మాట దప్పని మానధనులు రాఘవులు. అట్టివారికి వారసులమైన మనము మచ్చతో సుఖించుటకంటే మరణించుట మేలుగదా!''

అని ఉద్బోధించుచున్న అవధేశుని - ప్రసంగమునకు మధ్యలో అడ్డుపడి భరతుడు ఉద్రేకముతో ఇట్లు పలికెను- ''అన్నయ్యా! ఇది ఘోరము! వదినెకు వక్రత ఆరోపించడమా? ఇది సహించరానిది. ఇప్పటికి ఎన్నిమార్లు ఎందరిచే ఆమె శీలము పరీక్షింపబడలేదు! హరిహర బ్రహ్మాదులే ఆ పుణ్యచరితకు ప్రణమిల్లుచున్నారు. అగ్గిలోపడి నిగ్గుదేరిన పూతచరిత పృథ్వీతనయ. ఆ పతివ్రతకు పాతిత్యము అంటగట్టు జాము అధములు కోటి కల్పాంతములవరకు రౌరవ నరక మనుభవించగలరు.''

అట్లు భరతుడు పలువిధముల ప్రసంగించి- బోధించి -ప్రార్థించెను. అంతట రఘువీరుడు రవంత విసుగుకొని రోషోద్దీపితుడై లక్ష్మణుని సంబోధించి-

''సౌమిత్రీ! నీవైనను నా మాట మన్నింపుము. వృథా మార్థింపుటకు ప్రయత్నింపవలదు. లోకము నా చర్యను మంచిగా భావించినను, చెడుగా గ్రహించినను నాకు చింతలేదు. నీవు రేపు ఉదయమే సీ వదినను గంగాతీర భూములకు గొనిపోయి అచ్చట నిర్జనారణ్యములలో ఆమెను వదలిపెట్టి రమ్ము. ఇది నా ఆదేశము. ఉపేక్షించిన నీవు జీవితాంతము పరితపింపవలసి వచ్చును.'' అని ఆదేశించి అయోధ్యా నాథుడు వారి సమాధానమునకు ఎదురుచూడక అచ్చోటువీడి వెళ్ళెను.

కౌసల్యాసుతుని కృతనిశ్చయమునకు తమ్ములు నిరుత్తరులైరి. అవధేశుని ఆజ్ఞ అవశ్యము అనుసరణీయమైనది. లక్ష్మణుడు యెదురు చెప్పలేకపోయెను. వారు విధి నిర్ణయములకు తలవంచి దురపిల్లుచూ నిజావాసములకు నిష్క్రమింపిరి. లక్ష్మణుడు కలతతో, కలవరింతతో ఆ కాళరాత్రి యెట్లో గడపెను.

## సౌమిత్రి వైదేహిని వనములలో వదలి వచ్చుట

మరుదినము సూర్యోదయాత్పూర్వమే లక్ష్మణుడు స్నాన సంధ్యలు ముగించుకొని ప్రయాణమునకు సిద్ధమాయెను. రథము సిద్ధముచేసి రాజాజ్ఞ సీతారాణికి తెలియజేసెను. నిండుచూలాలైన ఆ ఇల్లాలు ఆనందముతో మణులు, భూషణములు, వస్త్రములు మునిపత్నులకు కానుకలుగా తీసుకొని సంబరముతో వచ్చి స్యందన మధిష్ఠించెను. అప్పుడు సౌమిత్రి స్వామిని స్మరించుకొని, సీతాదేవికి సాష్టాంగ మొనర్చి, బయలుదేరుమని సారథికి సంజ్ఞ చేసెను. రథము రాజధాని వదలి విపినప్రదేశములవైపుగా ప్రయాణించెను.

అవనిజ అమాయిక. ఆ మగువ నిజముగా మున్యాశ్రమములు చూడబో-వుచున్నానని మురిసిపోయెను. జనపదములు, నదులు, కొండలు, కోనలు దాటుకొనుచూ రథాశ్వములు శీఘ్రగమనముతో ముందుకు పరుగిడుచుండెను. సౌమిత్రి ధిగులుతో, దుఃఖముతో, మౌనముతో రథముపై కూర్చొని

ఉండెను. దురంత సంతాపకరమైన ఈ దారుణకర్మకు తానే ఉపకరణము కావలసివచ్చెనుగదా యని చింతించుకొని రామానుజు డా సమయములో దగ్ధమానసుడై తపించిపోవుచుండెను. ఆవేదనతో అతని నాలుక తడియారి, నోట మాటరాక, గుండెలు దడదడ కొట్టుకొనుచుండెను. మలిన ముఖ ముతో మవునముద్రాంకితుడై దిగులుతో కూర్చొని ఉన్న మరదిని మాట్లాడించుటకు మైథిలి సాహసించలేక పోయెను. అతని గంభీర ముఖవైఖరి ఆమెకు ఏదో అజ్ఞాత భయమును సూచింపజేసెను.

ఇంతలో స్యందనము ఘనారణ్యములో ప్రవేశించెను. జలజలా ప్రవహించుచున్న జాహ్నవి దృష్టికి గోచరించెను. అది ఘోరారణ్యము. అక్కడ తాపసులుకానీ, వారి ఆశ్రమ వాసములుగానీ కానరావయ్యె. క్రూర మృగాభీలమై ఉన్న ఆ కీకారణ్యములో రథము నిలచెను. అంతట ధరణిజ - దీనాస్యుడై దిగులుగొనియున్న దేవరను ఒకమారు, ఆ గహనకాంతారమును ఒక మారు పరికించి చూచి భయవ్యాకులిత ఆయెను. అవనిజ ఆశంకితయై ఆత్మ బంధువును లక్షించి - "లక్ష్మణా! నన్ను ఇక్కడ కెందుకు తెచ్చితివి? ఇది కారడవి, ముని సంచారము లేదు. నిర్మానుష్యమై భయంకరక్రూర జంతువులు విచ్చలవిడిగా సంచరించుచున్నవి. నాన్నా! ఇక్కడ నన్నేమి చేయదలంచితివి? నీ విషాద వైఖరికి కారణమేమి? నిజము చెప్పుము." అని ప్రభుసోదరుని పృచ్ఛించెను.

దీనాతిదీనుడైయున్న లక్ష్మణుడు భూపుత్రి ప్రశ్నకు మరింత క్షోభపడెను. ఓ దేవతలారా! నాకీ పరిస్థితి యెందుకు కల్పించితిరి? అని దుఃఖించెను. ఆ తల్లికి యేమి చెప్పుటకు అతనినోట మాటరాలేక పోయెను. దుస్సహమాగ బాధకు అతని కన్నులు చీకట్లుక్రమ్మి, తల తిరిగి, కంఠము రుద్ధమై, దేహము కంపించి, అచేతనస్థితిలో లక్ష్మణమూర్తి రథమునుండి దొర్లుకొని క్రిందపడ బోయి, కొంచెము నిలద్రొక్కుకొని - అబ్బా! దాహము వేయుచున్నది - అని పలికెను.

"భగవాన్! ఏదో ఘోరము జరిగిపోయినది. ధీమంతుడు, బలవంతుడు అయిన నా మరది చెప్పరాని బాధతో మరణవేదన పొందుచున్నాడేమి?" అని

ఊహించి భూపుత్రి భీతావహయై ఘోరున విలపించెను.

ఆ విషమస్థితిలో ఎక్కడినుండియో "ఓ లక్ష్మణా! సీత సౌభాగ్యవతి, ఆమె క్షేమముగా నుండగలదు. నీవు కలత చెందక ధైర్యముతో ఆమెను వదలిపెట్టి వెనుకకు మరలుము-" అని అశరీరవాణి ఒకటి ధ్వనించెను.

అదృశ్యవాణి మాటలు మైథిలి చెవులబడెను. అందలి గూఢార్థము మెరుపు మెరిసినట్లు ఆమెకు అవగతమాయెను. మరుక్షణమే ఆ మహాతల్లి శోకార్తయై ఆక్రందించి నేలబడి మూర్ఛిల్లెను.

లక్ష్మణుడు ఆకాశవాణి ఆదేశము వినెను. అచేతన స్థితిలో నేలపడియున్న అన్న భార్యను చూచెను. బాష్పాంజలి ఘటించి భూపుత్రికి ప్రదక్షిణముచేసి ఆమె పాదములకు నమస్కరించెను. పిమ్మట గుండె రాయిచేసుకొని, ఆ నిర్జ-నారణ్యములో ఆమెను ఏకాకినిగా వదలిపెట్టి, రథముయెక్కి, అయోధ్యకు తిరిగిపోయెను.

## సీత వాల్మీకి ఆశ్రమము చేరుకొనుట

కొన్ని ఘడియలు గడచునప్పటికి సీతకు తెలివి వచ్చెను. ఆమె నిట్టూర్చి పరిసరములను పరికించి చూచెను. అక్కడ సౌమిత్రి లేడు. సారథిలేడు. రథములేదు, అశ్వములులేవు. భీకరారణ్యములో ఆమె ఒంటరిగా వదలిపెట్ట బడియుండెను. దిక్కులేని తన దీనస్థితికి ఆమె మింటికీ మంటికీ యేకధారగా రోదించసాగెను. ఆ నిస్సహాయురాలి ఆక్రందనకు కాననభూమి కన్నీరు గార్చెను.- "దాశరథి నన్ను త్యజించెను! మరది నాకు ప్రవాసము ప్రసాదించి పోయెను! దుర్విధిపాకము. కలకాలము కష్టపరంపరలు నన్ను వెంటాడుచున్నవి. దురంత దుఃఖములకు నిరంతరము అలవాటు పడిన ఈ దేహి దేహమును వదలిపెట్టజాలకున్నది." ఇవ్విధముగా భూపుత్రి గతాగత కష్టగాథలు స్మరించు కొని పలువిధముల విలపించెను. వైదేహి విలాపాక్రందనలచే వివినస్థలి కరుణా కలితమైపోయెను.

సరిగా ఆ సమయమునకు వనములో సంచరించుచున్న వాల్మీకి మహర్షి చెవులకు ఆమె ఆర్తస్వరము వినబడెను. తత్క్షణమే ఆ తాపసపుంగవుడు పృథ్వీ

పుత్రి ఉన్న దెసకు వరుగెత్తెను. అతడు శోకార్తయై విలపించుచున్న సీతను సమీపించి - "బిడ్డా! ఎవరు నీవు? ఈ యడవిలో ఒంటరిగా దీనురాలివై యేడ్చుటకు కారణమేమి?" అని సాధు భాషణముల ప్రశ్నించెను.

"ఓ తాపసోత్తమా! నేను మిథిలా పురాధీశుడగు జనకరాజు పుత్రికను. పురుషోత్తముడగు రఘుకులరాముని భార్యను. పేరు సీత. ప్రాణేశ్వరుడెందుకో నన్ను పరిత్యజించినట్లు తోచుచున్నది. నా మరది లక్ష్మణమూర్తి న న్నీ కాననసీమలలో వదలిపెట్టి యిప్పటికో వెళ్ళిపోయెను. సర్వదా నా శుభముకోరు సౌమిత్రి నాతో కారణము చెప్పుటకు నోరాడక శోకార్తుడై ముఖము త్రిప్పుకొనెను. మహాత్మా! నిరాశ్రయనై విధి వైపరీత్యమునకు వగచుచుంటిని" అని పలికి సీత సాశ్రులోచనయై నిట్టూర్చెను.

అంతట మహర్షి - "కల్యాణీ! జ్ఞాన సంపన్నుడగు నీ తండ్రి జనకుడు నాకు ప్రియ శిష్యుడు. అయోధ్యాధీశులు నాకు పరమ ఆప్తులు. నేను నీకు ఆత్మీయుడను. నీవు నాకు బిడ్డతో సమానము. నా ఆశ్రమము నీకు అన్ని విధముల స్వగృహముతో సమానము. మునిపత్నులు, తాపసకన్యలు కంటికి రెప్పవలె నిన్ను చూచుకొందురు. బిడ్డా! శోకించక నాతో కుటీరమునకు రమ్ము. నీకు శుభము కలుగుగాక" అని సాంత్వనము పలికి సీత నాశ్వాసించెను. పిమ్మట మునీశ్వరుడు పరమాదర భావముతో వైదేహిని వెంటబెట్టుకొని స్వాశ్రమము చేరుకొనెను.

పుణ్యభూమి మునిగ్రామములో అడుగుపెట్టగనే సీతకు మంత దుఃఖోపశమన మయ్యెను. అచ్చటి ప్రశాంత వాతావరణము ఆమె ఆత్మకు శాంతి నిచ్చెను. గంగలో స్నానముచేసి, విగతశ్రమయై స్వామిని సంస్మరించి, సాత్వికాహారముతో పరితృప్తిచెంది సీత విశ్రమించెను. త్రికాలజ్ఞుడు వాల్మీకి మహర్షి సాకేతపురి సమాచారమంతయు యోగదృష్టిచే సమగ్రముగ తెలుసుకొనెను. "జానకీ! అపవాదు బాపుకొనుటకై అవధేశుడు నిన్ను వదులుకొనెను" అని చెప్పి మునిరాజు మైథిలిని వూరడించెను.

ఆ పైన జనకాత్మజ శుచివ్రతయై ఆశ్రమవాసము చేయుచూ, నిత్యము ఋషీశ్వరుల చెంత పురాణేతిహాస కథలు వినుచూ, మునిపత్నుల స్నేహ

వాత్సల్య చ్ఛాయల సంచరించుచూ వన విహంగ జంతుకోటితో వినోదించుచూ, మధుర ఫలోదకములతో తృప్తినొంది, వన వైభవమును నేత్ర పర్వముగా తిలకించుచూ, ఆశ్రమవాసము చేయుచుండెను. కాలాంతరమున జానకి ఇద్దరు పుత్రులను ప్రసవించెను. వాల్మీకి వారికి కుశలవులని నామకరణ ముచేసి విద్య గరపెను.

## కౌసల్యాది రాణులు విగత శరీరులగుట

అప్పుడక్కడ - తెలివిదప్పి భూమిపై పడియున్న భూకాంతను గహన కాంతారములో యేకాంతముగా వదలి, లక్ష్మణుడు రథమెక్కి గృహోన్ముఖు డాయెను. అప్పటి రాజకుమారుని మనోవ్యథ వర్ణనాతీతమైనది. శోకవిహ్వలు డగు సౌమిత్రికి దారిపొడుగునా సారథి నానావిధముల దుఃఖోపశమన వాక్య ములు చెప్పి వూరడించుటకు ప్రయత్నించెను. అట్లు దుఃఖభారముతో ప్రయా ణించి సుమిత్రపుత్రుడు సాకేతపురి సమీపించెను. పిమ్మట అతడు రథము దిగి, సారథిని వీడ్కొలిపి, అవనతవదనుడై సాక్షాత్తు శోకమూర్తివలె రాచనగరములో ప్రవేశించెను.

సౌమిత్రి చిన్నగ కక్ష్యాంతరములు గడచి అంతిపురము చేరుకొనెను. అక్కడ కన్నతల్లులకు, ప్రియసోదరులకు ''సీతామాతను అడవులలో విడచిపెట్టి నిర్దయుడనై తిరిగి వచ్చితిని'' అని ముక్తసరిగా మూడు మాటలలో చెప్పి, అచ్చోటు వీడి, ఏకాంతమునకు పోయి ఆక్రందించెను.

ఈ దారుణ సమాచారము తెలియగనే సమస్త సాకేతనగరి శోకసాగరమున బడెను. రాణివాసము గగ్గోలు చెందెను. పరిజన బంధుజనము వ్యసన వ్యాకు- లితమాయెను. రాజాంతఃపురము వైదేహి వియోగముతో శూన్యమై శ్రీహీనమై వెలవెలపోయెను. కౌసల్యా సుమిత్ర కైకేయి ఇంట తమ కూర్మికోడలు కాన ములపాలు చేయబడినదని తెలుసుకొని శోకాహతలై గుండెలు బాదుకొని రోదించిరి. హృదయవిదారకముగ దుఃఖాక్రాంతలై విలపించుచున్న దేవేరులను శాంతింపజేయుట రాజపరివారమునకు దుష్కరమాయెను. ఆ దృశ్యము వర్ణింప నలవికానిది.

అప్పుడు రామమూర్తి తమ్ములను వెంటబెట్టుకొని తల్లులను ఓదార్చుటకై రాణివాసమునకు వచ్చెను. మణిని పోగొట్టుకొన్న సర్పముకరణి మమతామయు లగు తల్లులు వైదేహికై నెత్తిబాదుకొని యేడ్చుచుండిరి ప్రేమమూర్తులు దుఃఖ వివశులగు ఆ తల్లులను మాటలతో నోదార్చుట దుష్కరమని భావించి దాశ రథి వారి దైన్యస్థితికి సుంత జాలిగొనెను. పిమ్మట జగదభిరాముడగు శ్రీరాముడు మందస్మితుడై తల్లులకు తన దివ్యజ్ఞానము ప్రసాదించెను. ఇంతవ-రకు వారిని ఆవహించియుండిన మాయ తెరవలె తొలగిపోయెను. మోహాంధ కారము పటాపంచలయ్యెను. దివ్యకాంతితో వారి జ్ఞాననేత్రములు ప్రకాశించెను.

అంతట ఆ ముప్పురు తల్లులు చిదానంద సంపన్నులై చేతులు మోడ్చి సుతుని రూపముతో తమ యెదుట ఉన్న శ్రీపతి నిట్లు స్తుతించిరి:

''అవతారమూర్తివైన ఓ జగత్స్వామీ! ఇంతవరకూ మేము మాయాధీను లమై నిన్ను మా కొడుకుగా, మైథిలిని మా కోడలిగా భ్రమించి పామరదృ-ష్టితో ప్రవర్తించితిమి. నీకృపాదృష్టివలన నేటికి మాకు జ్ఞానప్రాప్తి కలిగెను. మా అజ్ఞానాంధకారము నశించి సత్యము బోధపడెను. జ్ఞాన స్వరూపుడవగు ఓ లోకేశ్వరా! మునులు దేని ప్రాప్తికై నిరంతరము అన్వేషించుచున్నారో ఆ పరమ భక్తి తత్త్వమును మాకు ప్రసాదించుము.''

ఇట్లు ఆ ముప్పురుతల్లులు దేవదేవుని దివ్యమహిమను కీర్తించి, ఆ పరమాత్ముని భక్తి ప్రసాదము పొంది యోగాగ్నిచే తమ శరీరములు దహింప జేసుకొని దివ్యలోకము చేరుకొనిరి.

రామాదులు తల్లుల శరీరావశేషములకు భక్తిశ్రద్ధలతో అగ్నిసంస్కారముచేసి ఉత్తరక్రియలు నెరవేర్చిరి. పిమ్మట కౌసల్యాసుతుడు మణులు, బంగారు, వెండి వస్త్రములు, భూములు, గజాశ్వములు మున్నగు భూరిభూరి దానాదు లతో బ్రాహ్మణ సమాజమును యాచకబృందమును సంతృప్తులను చేసెను. ఆ సమయమున స్వామికి - శంబూకుని వధించుట వలన, సీతావియోగము వలన, తల్లులు స్వర్గస్థులైనందున కలిగిన అశాంతికై- అశ్వమేధము చేయవలెనని సంకల్పము కలిగెను.

# అవధేశుని అశ్వమేధయజ్ఞ ప్రయత్నము

"ఏక బార గురుగ్రహ అవధేశా
గయే అనుజ సంగ సచివ ఖగేశా."

ఓ ఖగపతీ! ఒక శుభసమయమున అవధేశుడు అనుజామాత్యసమేతుడై గురుగ్రామమునకు పోయెను. రామాదులు వశిష్ఠుని పాదపద్మములకు ప్రణమిల్లి, వారి శుభాశీస్సులు గ్రహించి ప్రసన్నులయిరి. అనంతరము సచ్చిదానందుడగు రామచంద్రుడు చేతులు జోడించి నమ్రవాక్కుల గురువుల కిట్లు విన్నవించుకొనెను.

"గురువర్యా! తమ శుభాశీస్సుల ప్రభావమువలన సాకేతరాజ్యము, సమస్త ప్రజ సకుశలము. తమ కృపాబలముచే ఇప్పటివరకూ ఎన్నియో జపయాగ యజ్ఞములు శుభాంతముగా నిర్వర్తించి ప్రపంచములో కీర్తి నార్జించితిని. స్వామీ! నాకింకొక కోరికగలదు. అది యేమన, సకలవిధసంతాపములను హరించి, శుభములు, సుఖములు ప్రసాదించు అశ్వమేధ హయమును చేయు సంకల్పించితిని. అవధవాసులు సైతము ఆ యజ్ఞమును చూచి సంతోషించవలెనని కుతూహలపడుచున్నారు. అందుకు తమరు అనుమతించి, ఆ యజ్ఞము నాచే నిర్విఘ్నముగ పూర్ణమగునట్లు ఆశీర్వదించ కోరుచున్నాను."

సీతాపతి శుభ ప్రసంగమునకు మునివరుడు ప్రసన్నుడై ఇట్లు ప్రవచించెను-

"రామనృపా! మంగళకరముగు నీ సంకల్పము సర్వజనానందకరమైనదిసకలార్థ సాధకముగు హయమేధము శుభాంతముగా సాధించి సత్కీర్తి నొందుము" అని ఆశీర్వదించెను. పిమ్మట వశిష్ఠుడు భరతుని లక్షించి - "భరతా! నేటి నుండియే క్రతు కార్యములు ప్రారంభించుము. అందుకు కావలసిన సంభారాదులు సిద్ధము చేయించుము. శుభలేఖలు పంపించుము-" అని ఆదేశించి గురువు వారిని వీడ్కొలిపెను.

అవధేశుడు అశ్వమేధము చేయుచున్నాడను వార్త సర్వత్ర వ్యాపించెను. ఆ శుభ సమాచారము విని అంతిపురజనులు ఆనందించిరి. సాకేత ప్రజ సంతో-

షముతో సంభ్రమించెను. దేవగణము దుందుభులు మ్రోగించి, గంధర్వాప్సరసలు నృత్య గానములుచేసి, హర్షము ప్రకటించిరి.

భరత, లక్ష్మణ, శత్రుఘ్నుల ఆదేశము అందుకొని సచివులు, సేవకులు, రాజోద్యోగులు, సాకేతవాసులు క్రతుకార్యములలో నిమగ్నులయిరి. పందిరులు వేసి, మండపములు గట్టి, చలివేందరులు బెట్టి, ధ్వజములెత్తి, తోరణములు గట్టి, పథముల బాగుచేసి, గృహము లలంకరించి అయోధ్యను అందచందముగా తీర్చిరి. సేవకాబృందము సాధనసామగ్రి సేకరించుటలో నిమగ్నమాయెను. రథములు, గుర్రములు, ఏనుగులు, భటవర్గము మొదలగు సేనాంగములు సమాయత్తము గావించబడెను. అనేకమంది శిల్పులు రాత్రింబవళ్లు శ్రమించి ముఖమండపము సుందరముగ నిర్మించిరి.

గురువుతో సంప్రదించి వారి సూచనప్రకారము ఇంద్ర యమ వరుణ కుబేరాది దిక్పాలురను, నానా దేశాధీశులగు రాజన్యులను, కపికులోత్తములను, దానవశ్రేష్ఠులను, తీర్థవాసులగు మునీశ్వరులను, భూలోక సురలోకవాసులైన పండిత ప్రవరులను, బ్రాహ్మణసమాజమును, బంధువర్గమును, హయమేధోత్సవమునకు ఆహ్వానించు శుభలేఖలతో దూతలు పంపబడిరి. జనకభూపాలుని మిత్ర 'పుత్ర కళత్రబంధు' సచివ స్వజనసమేతముగా విజయము చేయవలసినదని ప్రార్థించుచూ వశిష్ఠుడు మిథిలాపురికి ప్రత్యేకముగా దూతను పంపెను.

ఇవ్విధముగా హవన నిర్వహణకై సకలప్రయత్నములు జరిపిన పిమ్మట రఘువంశమణి రామచంద్రుడు గురుగ్రామమునుండి గురువుతో కలసి రాజధానికి వచ్చెను. అధ్వరక్రియలతో అలరారుచున్న అయోధ్యవైభవము చూచి రామాదులు సంతృప్తిచెందిరి.

ఇంతలో ఆహ్వానితులు అయోధ్యకు రాసాగిరి. నల నీల ద్వివిద మైంద సుగ్రీవాది. కపికులము కిష్కింధనుండి తరలి వచ్చెను. విభీషణాది రాక్షస మిత్రులు లంక నుండి చేరుకొనిరి. ఇంద్ర, చంద్ర, బ్రహ్మాది దేవతాగణములు విమానములెక్కి వచ్చిరి. వ్యాస, నారద, భృగు, పరాశర, అగస్త్య, అంగిరసాది మునిబృందములు గుంపులుగుంపులుగా సాకేతనగరి చేరుకొనెను. సనకాది సిద్ధులు విశ్వామిత్రాది సప్తర్షులు భూసుర బృందములు. కదలి వచ్చెను. జనక

భూపాలుడు రాణివాసముతో రాజపరివారముతో రథ గజ తురంగ పదాతు లతో బంధుమిత్ర పౌరబృందముతో సకల రాజలాంఛనములతో శతానంద సమే తుడై సంబరముతో సాకేతనగరి చేరుకొనెను. నానాలోకముల నుండి వచ్చిన అతిథులతో అయోధ్య క్రిక్కిరిసియుండెను.

రామ, భరత, లక్ష్మణ, శత్రుఘ్న సోదరులు సచివులు సాకేతప్రముఖులు అతిథులను సకలమర్యాదలతో ఆహ్వానించి, వారికి తగు నివాసములు చూపెట్టి, ఆతిథ్యమిచ్చి, సత్కరించుచుండిరి. ఆతిథేయులైన అయోధ్యా వాసుల ఆదరసత్కారములు, వారి మర్యాద మన్ననలు చూచి ఆహూతులు ఆనందముతో పరవశించిరి. అప్పటి అయోధ్య ఆనందోత్సాహము వర్ణింప నలవిగానిది.

ఓ గరుడా! అట్లు హయమేధ కార్యములన్నియు సాంగముగా సమకూడినపిమ్మట ఒక శుభముహూర్తమున యాగము వేదోక్తప్రకారము ప్రారం భింపబడెను. రామప్రభువు నియమ నిష్ఠావ్రతుడై గురువుకు సాష్టాంగదండ ప్రణామము చేసి, వారి ఆశీస్సులు గ్రహించి, పదివేలమంది మునులతో గురు వుతో అధ్వరశాలకు వేంచేసెను.

మఖప్రారంభమునకు మునుపు - మునిబృంద పరివేష్టితుడైయున్న సీతా పతిని సంబోధించి వసిష్ఠుడిట్లనెను. "రామచంద్రా! నీవు గృహస్థుడవు కాబట్టి ప్రస్తుతము సపత్నీకుడవై యాగము చేయవలసియున్నది. ధర్మపత్నీసమేతముగా చేయని క్రతుకర్మలకు ఫలము సిద్ధింపదని శాస్త్రములు చెప్పుచున్నవి. ఇది లోకవిదితమైన సత్యము. కనుక ఇపుడు వైదేహి నీ వామభాగమున ఉండవలసి యున్నది."

అని మునివరులికిన ధర్మప్రవచనము విని దాశరథి రవంతసేపు డోలాయ- మానమానసుడయ్యెను. పిమ్మట రఘూత్తముడు మునివర్యుని అవలోకించి వినయోక్తుల ఇట్లనెను-

"గురువర్యా! నేను వినతుడను. నేను వైదేహిని వదలిపెట్టితిని. లోక మర్యాదకై నే నట్లుచేయుట ధర్మసమ్మతమై యున్నది. కనుక యాగము

యథావిధి సాంతము గావించుటకు ధర్మజ్ఞులైన మీరే తగుమార్గము నిర్దేశింప వేడుచేన్నాను.''

అని పలుకగా వశిష్ఠుడప్పుడు ఈ విషయమై నారద సనకాది మునీంద్రు లతో సమాలోచించెను. అందుపై వారు సీతకు బదులు సీతవంటి బంగారు ప్రతిమను రాజుకు వామభాగమున ఉంచిన చాలునని నిర్ణయించుకొనిరి. పిమ్మట ఒక సువర్ణప్రతిమ చేయించబడెను. మణిరత్నాభరణములతో సుందర ముగా చెక్కబడిన ఆ స్వర్ణప్రతిమ సాక్షాత్తు సీతవలె శోభించెను. అపూర్వ కళా వైదగ్ధ్యముతో వెలసిన ఆ ప్రతిమను చూచి జనులు సీతాదేవినే చూచుచుంటి మని భ్రమించి పోయిరి. మంత్రపూత గావించబడిన మైథిలి ప్రతిరూపము యజ్ఞమండపమునకు గొనితెచ్చి శాస్త్రోక్తముగా పీఠ మలంకరింపజేసిరి.

''మకర మానరుతు సిసిర సుహోయీ
మఖ మండప బైఠే రఘు రాయీ,
జటిత కనక సుందర మృగ ఛాలా
తిహి ఆసన అసీన కృపాలా.''

శిశిరకాల - మకరమాస - శుభదిన - శుభలగ్నవేళ రఘూద్వహుడు యజ్ఞవేదికయొద్ద బంగారు జింకచర్మముపై శుభాసీనుడయ్యెను. అప్పుడు సుంద గులు, శుచివంతులు, వేదాంగవిదులు అగు రెండువేలమంది బ్రాహ్మణులు మంత్రోచ్చారణ చేయసాగిరి. గురువు ఆదేశముపొంది సౌమిత్రి అప్పుడు యజ్ఞాశ్వమును తెచ్చుటకు హయశాలకు పోయెను. అశ్వశాలనుండి లక్ష్మణ స్వామి అరువదివేలమంది రణమల్లులు, పదివేలమంది యుద్ధవీరులు వెంట పడవ, పట్టుపగ్గములు పట్టుకొని భటులు నడచుచుండ, మేళతాళములతో యజ్ఞాశ్వమును నడపించుకొనుచూ మఖశాలకు వచ్చెను. తెల్లనిమేను, నల్లని చెవులు, నెమలిపింఛముతో సర్వలక్షణలక్షితమైన ఆ సైంధవము ధీర గంభీర గమనముతో చూపరుల దృష్టి నాకర్షించెను. మణిభూషణ పీతాంబరాదులతో అలంకృతమైన అది సూర్యుని రథాశ్వమువలె భగద్ధగాయమానమై దీపించెను.

విశ్వామిత్ర వశిష్ఠాదులు చెప్పినట్లు క్రతుకర్త కాకుత్స్థమణి అగు కోసలాధీశుడు యజ్ఞపశువుకు అభిషేకపూజాదికములుచేసి దాని లలాటభాగమున ప్రతిజ్ఞాప్రతమును కట్టెను. ''అరిభీకరుడు, బలపరాక్రమమందు ఇంద్రాధికుడు, ఇనకుల రాజతిలకుడు - అగు అయోధ్యాధీశుని యజ్ఞాశ్వమిది! బలాధికులు దీనిని బంధించి మమ్మెదుర్కొనవచ్చును. తదన్యులు మైత్రీపూర్వకముగా మాతో సహకరించవచ్చును'' అని దాని మీద వ్రాయబడియుండెను. దిగ్విజయార్థమై ఆ పట్టము గట్టినపుడు శంఖభేరీ పటహధ్వనులు దిక్కుల పిక్కటిలచేసెను.

## లవణాసురుని వధించుట

దాశరథి దిగ్విజయార్థము హవనాశ్వము పంపుచున్నాడని తెలుసుకొని భార్గవుదాది మునిబృందము రామచంద్రుని యొద్దకు వచ్చి - ''ఓ రాక్షసాంతకా! లవణాసురుడను ఒక రాక్షసుడు కలడు. వాడు వరగర్వోద్ధతుడై లోకపీడన చేయుచున్నాడు. వానిని నిర్జించి సురలను, భూసురులను రక్షించవలసినది-'' అని వేడుకొనిరి.

మహీధవుడు మునుల మొరలు విని జాలిగొనెను. రాఘవుడప్పుడు రావణానుజుని రప్పించి లవణాసురుని వృత్తాంతము వినిపించమని కోరెను. అంతట దైత్యకులభూషణుడగు విభీషణుడు శ్రీరామునికి లవణుని పూర్వోత్తరము లిట్లు విన్నవించెను-

''రాఘవా! నా సవతితల్లికి ఒక కూతురుండెను. ఆమె పేరు కుంభీనస. మా అన్న దశాననుడు ఆమెను మధుడను రాక్షసరాజుకిచ్చి పెండ్లిచేసెను. ఆ మధు కుంభీనసలకు పుట్టినవాడే ఈ లవణాసురుడు. ఈ దుర్మార్గుడు శివదత్తమగు త్రిశూల ప్రభావముచే అజేయుడై సుర వర మునులను బాధించుచున్నాడు. దేవా! త్రిఫాల శూలము వానిచేతులో నున్నంత వరకు వానిని నిర్జించుట దుష్కరము.''

ఈ ప్రకారము లంకాధిపుడు మధుపుత్రుని పుట్టుపూర్వోత్తరములు వాని తావు బలములు రణరహస్యములు విపులముగా తెలియజేసెను. తదుపరి దాశ

రఘుపతి తన కనిష్ఠసోదరుని పిలిచి - "శత్రుహంతకుడవగు ఓ శత్రుఘ్నా! నీ విప్పుడే సైన్యముతో వెళ్ళి, లవణాసురుని వధించి మధుర భూసురులకు సంతోషము కలుగజేయుము-" అని ఆదేశించెను. అప్పుడు రఘుపతి తన దివ్యాస్త్రమొకటి తమ్మునికిచ్చి, దాని ప్రయోగ ఉపసంహారాది మంత్రరహస్యములు తెలియజేసి, విజయుడవై రమ్మని దీవించి పంపెను.

శత్రుఘ్నుడు తనపుత్రులను వెంటబెట్టుకొని, వీర భటాళితో వివిధాస్త్రములతో చతురంగ సేనావాహినితో విజయసూచకముగా మూడువేల యుద్ధ నగారాలు మ్రోయించజేసి శాత్రవసంహారమునకై యక్షాశ్వముతో ప్రస్థానము చేసెను.

పండ్రెండు రాత్రులు ప్రయాణించి వారు యమునాతీరము చేరుకొనిరి. యమునకు శ్రద్ధాంజలి ఘటించి, మహాదేవుని పూజించి, అచ్చటనుండి పురోగమించి శత్రుఘ్న సైన్యము శాత్రవనగరమగు మధురాపురిని భయంకరముగా ముట్టడించెను.

నగర భేరికారావము చెవులబడగనే లవణాసురుడు ఆగ్రహోదగ్రుడై, ప్రళయ భయంకరముగా ప్రతిరణధ్వని గావించి, కాటుకకొండలవంటి కాకలు దీరిన అరువదివేలమంది వీరభటులతో కదలివచ్చి శత్రుసైన్యమును దార్కొనెను. ఇరుపక్షములకు హోరాహోరి ఘోర సంగ్రామము సంఘటించెను. లవణుని కొడుకులు మాతంగుడు, అఖండకేతుడు గుండెలుదీసిన బంట్లు. వారు బలోద్ధతులై బిట్టార్చి శత్రుఘ్నుని పుత్రులగు సుబాహు, యూపకేతులను దాకిరి. అప్పుడా నరాంతక రాక్షసాంతకులకు జరిగిన ఘోరాహవము లోకభీకరముగా నుండెను. అవక్రపరాక్రమోపేతులగు శత్రుఘ్నపుత్రులు రోషోద్రిక్తులై విజృంభించి, కేతు మాతంగులను తెగటార్చి, వారి శరీరములను ఖండఖండములుగా ఖండించి శాత్రవ భయంకరముగా సింహనాదము చేసిరి.

కొడుకులు క్రూరముగా మడిసినందుకు దైత్యుడు కుపితుడై బలికేక పెట్టి, వివిధ మారణాయుధములు ధరించి, శత్రుఘ్నుని కటకముపై పిడుగు వలె పడెను. సైనికయోధులు సమానముగా పరాక్రమించి అసురుల అక్రమ

ణము అరికట్టిరి. దనుజాలంత ప్రత్యక్షముగా పోరాడుట చాలించి అంతరిక్షము నుండి మాయా యుద్ధము చేయుటకు పూనుకొనిరి. శత్రుసూదనుడు క్రోధోద్విగ్నుడై దివ్యాస్త్రమొకటి సంధించి సమంత్రముగా దానిని నిశాటుల మాయానటనపై ప్రయోగించెను. ఆ యస్త్రరాజమునుండి లక్షోపలక్షల బాణములు ఉద్భవించి, అవి శాఖోపశాఖలుగా విస్తరించి, తరణి కిరణ సమూహము తిమిరమును శోషింపజేయునట్లు రాక్షసమాయను ఛిన్నాభిన్నము చేసెను. నక్తంచరబలమును విట్లు నిర్జించి రామసోదరుడు ప్రచండ గదాఘాతముతో లవణాసురుని ధరాగతుడై మూర్ఛిల్లునట్లు చేసెను.

లవణాసురుని తమ్ముడు కైటభుడు మూడువేలమంది జాతుధానయోధులతో యెత్తి వచ్చి సాకేతసేనపై విరుచుక పడెను. కైటభుడు కాలునివలె విక్రమించి శూలముతో యూపకేతుని క్రిందబడునట్లు చేసి రణగర్జన చేసెను. శూలాహతుడై పడిన సోదరునిగాంచి - వైరి దుర్వార గర్వనిర్వాపణ కుశలుడగు సుబాహుడు పరాక్రమించి, మూడువేల బాణములతో ముష్కరసమూహమును తుత్తునియలగునట్లు ఖండించి, ఒక్క నిశితాస్త్రముతో కైటభుని హృదయమున గాఢముగా కొట్టెను. మూర్ఛనుండి లేచిన లవణుడు కైటభుని రథముపై బెట్టుకొని గృహోన్ముఖుడాయెను.

కైటభు డారాత్రి మూర్ఛనుండి లేచి యుద్ధము విరమించి సంధిచేసుకొనుట శ్రేయస్కరమని అన్నకు బోధించెను. యుద్ధోన్మాది లవణుడు సోదరుని హితవు గర్జించి వైరిబలమును నిముసములో భక్షించెదనని పీరములు పలికెను. మరుదినము లవణుడు సోదరునితో, సుతులతో, దనుజ బలములతో, శస్త్రాస్త్రములతో స్యందన మధిష్ఠించి రోషావేశుడై రణక్షోణికి వచ్చెను.

ఇటునైవు యూపకేతు సుబాహులు సమరసన్నద్ధులై రాక్షసుల నెదుర్కొనిరి. గరుడా! రాఘవబలమునకు రాక్షసదళమునకు దివారాత్రములు సంకుల సమరము జరిగెను. హోరాహోరి బాహాబాహి భయంకర యుద్ధమాయెను. దేవతలు, కిన్నరులు, గరుడులు, నరులు భయాశ్చర్యములతో ఆ తుముల సంగ్రామమును వీక్షించుచుండిరి. క్షత విహతుల రుధిరధారలతో ఖండిత

సైనికకాయములతో ఆర్తుల ఆక్రందనలతో రణాంగణము బీభత్సముగా నుండెను.

రక్షోవీరుడు రోషవ్యగ్రుడై - కాలాంతకునివలె బిట్టార్చి, శివుని స్మరించి, త్రిశూలముతో శత్రుఘ్నుని వక్షము గురిచూచి కొట్టెను. ఆ శూలాహతికి లక్ష్మణానుజుడు గిరగిర తిరిగి నేలకొరిగెను. దేవఘాతకు డంత కత్తి పైకెత్తి శత్రుఘ్న శరీరమును ముక్కలుముక్కలుగా నరుకుటకై ముందుకు దూకెను. ఇంతలో సుబాహుడు ఆ దుష్టుని దుండగము పసిగట్టి - రోషోగ్రుడై పండ్లు పటపటగీటి ఒక్కదూకుతో వానిరథముపై బడి, వాని హయ రథములను నుగ్గుచేసి విరథుడగున ట్లొనర్చెను.

శత్రుఘ్ను డింతలో తేరుకొని, పైకిలేచి రోష కషాయనేత్రుడై, రఘువీరు డిచ్చియుండిన రెండు మహాస్త్రములు సంధించి, ప్రభువును స్మరించి, మంత్రించి మధుసూనునిపై ప్రయోగించెను. ఆ శరద్వయము శిఖాజ్వాలలతో పయనించి లవణాసురుని దాకి వానిశరీరమును ముక్కలుముక్కలుగా తెగగొట్టి హతమార్చెను. దైత్యనాథుడు ధర్షితుడై ధరాతలమున కొరగుట కైటభుడు చూచెను. వాడు రోషోగ్రుడై ఒక మహావృక్షమును పెకలించుకొని శత్రుఘ్నునిపై కురికెను. సుబాహుడు వాని గమనమున కడ్డు వచ్చి, నూరుబాణములు ఏకముహూర్తమున వదలి, వృక్షమును, కైటభుని బాహువులను, పిమ్మట వాని మహాకాయమును క్రమముగా ఖండించి నేల బడగొట్టెను. ఇవ్విధముగా శత్రుఘ్నుడు లోకకంటకులగు లవణ కైటభులను నిర్జించి శంఖధ్వానము చేసెను.

దేవతాగణము దుందుభులు మ్రోగించి శత్రుఘ్నాదులపై సుమనోవర్షము కురిపించిరి. ఇంద్ర బృహస్పతులాది స్వర్లోకవాసులు క్రిందికి దిగివచ్చి శత్రుఘ్నుని, అతని పుత్రులను అనేకరీతుల స్తుతించిరి. దేవబృంద మచటనుండి సాకేతపురికి పోయి రామాదులకు లవణాసురుని చావుసంగతి తెలియజేసి సకలలోకవాసులకు సంతోషము కలుగజేసిరి.

శత్రుఘ్ను డక్కడ లవణుని రాజ్యము రెండుగాచేసి, మధురా పట్టణమునకు సుబాహుని, విశ్వగిరికి యూపకేతుని రాజుగా చేసెను. రామానుజుడు కతిపయదినము లచట ఉండి, కుమారులను నీతిపరులై ధర్మసమేతముగా

రాజ్యము చేయుచుండుడని ఆశీర్వదించి, దిగ్విజయార్థమై యజ్ఞాశ్వము వెంట బయలుదేరెను. విజయసూచకముగా శంఖారావముచేసి, యమునకు భక్తితో శ్రద్ధాంజలి ఘటించి సాకేతసైన్యము సంరంభోత్సాహముతో దక్షిణదిశకు ప్రస్థానము కావించెను.

# కుశలవులు గుఱ్ఱమును పట్టుకొనుట

సవనాశ్వము నిరాటంకముగా నానాదేశములు త్రిమ్మరుచూ వాల్మీకిమహర్షి నివసించు వనప్రాంతము చేరుకొనెను. అప్పుడా వనభూములందు సంచరించు చుండిన లవకుశులు ఆ గుఱ్ఱమును చూచుట తటస్థించెను.

లవకుశులు సీతాదేవి కుమారులు. మునిపల్లెలో పుట్టి మహర్షివద్ద శస్త్రమునకు, శాస్త్రమునకు సంబంధించిన సకలవిద్యలు అభ్యసించిన ప్రవర్ధమానులు వారు. రవికుల సంజాతులగు ఆ రాకుమారులు సూర్యునివలె తేజస్వంతులై బలపరాక్రమములతో శోభించుచుండిరి. అప్పుడప్పటికి వచ్చిన అందమగు సవనాశ్వముపై ఆ కిశోరుల దృష్టి పడెను. లవకుశులు దాని లలాటమునున్న లేఖాపత్రము కుతూహలముతో చదువుకొనిరి. ఆ పైన బాలకులు ఉత్సాహముతో గుఱ్ఱము పట్టుకొని, దానిని ఒక చెట్టుకు కట్టి యేమి జరుగునో చూతమని విల్లంబులు తీసుకొని నిలబడిరి.

అరువది వేలమంది అయోధ్యభటులు అశ్వము ననుసరించి వెంటవచ్చు చుండిరి. ఇద్దరు బాలురు యజ్ఞాశ్వమును చెట్టుకు కట్టి, విల్లంబులతో నిలబడియుండుటచూచి ఆశ్చర్యపడిరి. వారా పిల్లలను చూచి కినుక వహించక ముచ్చటపడి ప్రేమతో "బాలకులారా! మీవంటి తేజోవంతులను కనిన తల్లి దండ్రులెవరో ధన్యులు. ఈ గుఱ్ఱము నెందుకు పట్టుకొంటిరి? ఇది యజ్ఞాశ్వము. మీబోటి పిల్లలు దానిజోలికి పో తగదు. గుఱ్ఱమును వదలిపెట్టి ఇంటికిపోయి ఆడుకొనుడు-" అని పలికిరి.

సాధుపూర్వకమైన సైనికుల సంభాషణ సరలిగాంచి తాపసబాలురు వినోదించిరి. వారంతట రక్షకభటాళిని లక్షించి - "భటులారా! మీరు సైనికులు, వీరులు, పైగా క్షత్రియులు. అదిగాక యుద్ధావేశముతో అశ్వమువెంట

వచ్చితిరి. మీవంటి సమరవీరులు ఇట్లు భిక్షాటనకు దిగుట సిగ్గుచేటుకదా! ఈ భూమండలము నిర్వీర్యమైనదని భావించి గుఱ్ఱమునకు పట్టముగట్టి దేశము మీదికి వదలి వచ్చినట్లున్నది. బాగున్నది మీ ఆలోచన!'' అని పలికి పరిహసించిరి.

కుమారుల మాటలు భటులకు కోపము తెప్పించెను. వీరెంత! వీరి బల మెంత! వీరు భయపెట్టడమెంత! అని భావించి సైనికులు తిరస్కారభావముతో గుఱ్ఱమును విడిపించుకొనిపోవుటకై ముందుకువచ్చిరి. వీరుల వైఖరికి లవుడు చిన్నగ నవ్వుకొని, చురుకైన బాణములు కొన్ని వింట సంధించి, గురిపెట్టి వారిపైకి వదలెను. ఆ శరాహతికి సైనికులు అనేకులు క్షతులై హతులై మూర్ఛితులైరి. చావుతప్పి కన్ను లొట్టబోయిన మరికొంతమంది పరుగు పరుగున శత్రుఘ్నుని యొద్దకుపోయి – ''రాజా! ఏమి చెప్పుదుము! ఇద్దరు మునిబాలురు మన సైంధవమును బంధించి, సైనికులను క్షతవిక్షతు లగునట్లు కొట్టి, రణోత్సాహముతో రంగమున నిలిచియున్నారు–'' అని చెప్పి మొరపెట్టుకొనిరి.

రామానుజుడు వారి మాటలకు ఆశ్చర్యాగ్రహములు ప్రకటించి హుటా హుటి బయలుదేరెను. అద్భుత శరచాపధరులై నిలుచున్న కిశోరద్వయమును గాంచి మధురోక్తుల ఇట్లు ప్రసంగించెను–

''కుమారులారా! తాపసబాలకులైన మీరు క్షాత్రము ప్రదర్శించుట కేల ప్రయత్నించుచుంటిరి? కోపతాపములతో మీకు నిమిత్తమేమి? చూచుటకు సుందరముగా బాలమరాళములవలె కనబడుచున్నారు. బిడ్డలారా! సమాశ్వము నకు అడ్డుపడక ఆశ్రమములకు మరలిపొండు. పూజింపదగిన ఋషిబాలకు-లతో పోరుసలుపుట మాకు సమ్మతముగాదు.''

అందుకు శరచాపధారులయిన సీతాసుతులు ధీరగంభీరులై దశరథసుతుని కిట్లు సమాధాన మిచ్చిరి–

''శూరుడా! నీ పేరేమి? ఊరెక్కడ? సైన్యము వెంటబెట్టుకొని ఇట్లు దేశములపై సంచారమెందుకు చేయుచుంటివి? వీరునివలె ఈ వనములో దాని నెందుకు త్రిప్పుచున్నావు? దాని లలాటమున గట్టిన ఆ ఫలకమున కర్థమేమి?

మీరు వచ్చిన పనికీ, చెప్పెడుమాటలకు పొంతన లేకున్నది! మీకు బలపౌరుష ములు లేకున్నయెడల ఆ ప్రతిజ్ఞాపత్రము గుర్రమున కెందుకు గట్టితిరి? అయ్యో! వృథా ప్రసంగమెందుకు? మొదట ఆ గుర్రమునకు కట్టిన పట్టము తీసివేయుడు; లేదా యుద్ధములో మమ్ము ఓడించి గుర్రమును విడిపించు కొనుడు.''

శత్రుఘ్నుడు వారి ప్రసంగమున కించుక మందస్మితుడై సైనికులను చూచి - ''వీరులారా! శస్త్ర సన్నద్ధులుకండి-'' అని తనవారిని హెచ్చరించెను. అందుమీదట మునిబాలుడు - ''ఓహో! ఈ వీరుడు గొప్ప శూరుడుగా కనబడుచున్నాడు. హెచ్చరికలతో మమ్ము భయపెట్ట జూచుచున్నాడు. చప్పట్లకు సింగపుకొదములు బెదరి చెదరిపోవునా!'' అని తలపోసి, లవకుశులు కోదండము లెక్కుపెట్టి, మహర్షిని మనస్సులో స్మరించుకొని శతశత నిశిత సాయక పరంపరలను శత్రుఘ్నసేనపై వర్షింపజేసిరి. ఆ బాణ పరంపరలకు త్రుటిలో కటకమంతయు కలగుండు జెందెను. పక్షులవలె వేలాదిభటులు నేల కూలిరి. రెప్పపాటులో శత్రుఘ్నుడు హయరథములను కోల్పోయి, క్షత గాత్రుడై నేలకొరిగిపోగా మిగిలినవారు కొందరు భయభ్రాంతులై అయోధ్య మార్గముబట్టి పరుగులెత్తిరి.

## లక్ష్మణ భరతాదులు కుశలవులచే పరాభూతులగుట

సాకేతపతి శ్రీరాముడు సైనికులవలన సమాచార మంతయు తెలుసుకొని ఆనందాశ్చర్య విచారమగ్నుడాయెను. బాలురు కల్పించిన యజ్ఞావరోధమునకు కించిత్ వ్యసనవ్యగ్రుడై తమ్ముని బిలిచి - ''లక్ష్మణా! సత్వరమే సమరసన్నద్ధు-డవై బయలుదేరుము. శాత్రవులు బాలకులని వినుటకు వింతగా నున్నది. తాపసులను దండించుటగానీ, వధించుటగానీ ధర్మముకాదు. ఎవ్విధముగనైనా వారిని ప్రాణములతో బంధించి, యజ్ఞాశ్వమును విడిపించుకొని రమ్ము'' అని ఆదేశించెను.

సౌమిత్రి స్యందన మారోహించి, సమరాయత్తుడై సేనాసమేతముగా సంగ-రభూమి చేరుకొనెను. రామానుజు డక్కడ రణాంగణములో నిలబడియున్న వీరకిశోరులను వీక్షించి ఇట్లు పలికెను-

"కుమారులారా! మీ శౌర్యోత్సాహములు ప్రశంసనీయములు. అయినా బాలురకు పౌరుషభావ మెందుకు? మేము దినకర కులజాలము. దివిజాలను, ద్విజాలను పోషించువారము, వారితో పోరుటకు మేము ఇచ్ఛగించము. మీరు దృష్టిపథము నుండి తొలగిపోవలసినది. మీరు కనబడుచుండ నా శరీరము క్రోధముతో కంపించిపోవుచున్నది."

ఆ వీరపుత్రులు విల్లంబులు క్రిందబెట్టుటకు విముఖులై "అయ్యా! అక్కడ మీ సోదరుడు సూర్యకుల క్షత్రియుడు సుప్తావస్థలో ఉన్నాడు. అతని గతి ఇంచుక గమనించితిరా!" అని వ్యంగ్యోక్తి బాణములతో వారు సౌమిత్రి హృదయము గ్రుచ్చినట్లు మాట్లాడిరి.

రామానుజుడా మాటలకు రోషస్వాంతుడై "కుర్రలారా! ఇదిగో ఇక మీ కెవరు సహాయపడెదరో వారిని ఇప్పుడే పిలువవంపుకొనుడు." అని వచించి లక్ష్మణుడు శరసంధానము చేసెను. మరుక్షణము కుశుడు క్రోధోన్మత్తుడై ముందుకురికి, తేరు కద్దువడి లక్ష్మణుని దార్కొనెను. అప్పుడు సుమిత్ర తనయునికి సీతాసుతులకు లోక భయంకరమగు సంగ్రామము సంఘటిల్లెను.

లవకుశుల శరలాఘవము వారి బాణప్రయోగము అపూర్వము. మింటికీ మంటికీ విస్తరిల్లిన వారి సాయకావలిచే - సూర్యబింబమే కప్పబడిపోయెను. అప్రతిహతములగు వారిఅంబుల ధాటికి రామానుజుడు రోషోగ్రుడై రొప్పుచూ ఒక గద తీసుకొని,గిరగిర త్రిప్పి - దానిని కుశుని వక్షమునకు గురిచూసి కొట్టెను. ఆ గదాఘాతమునకు అతడు క్రిందబడి తెలివి గోల్పోయెను. సోదరుని వక్షము క్షతమగుటజూచి లవుడు అవుడుగరచి, ఒక్క ఉదుటున కుప్పలించి సౌమిత్రిపై దూకెను. ఆ ఇరువురికి బాహాబాహి ముష్టాముష్టి మల్లయుద్ధమాయెను. పిడుగులవలె బడుచున్న లవుని పిడిగ్రుద్దులు సహించి, లక్ష్మణుడు ఆ బాలుని బలమును ప్రశంసించుకొనెను. లక్ష్మణుడా పిమ్మట రోషవివశుడై రెట్టించిన కోపముతో లవుడు సొమ్మసిల్లి నేలబడునట్లు ఒక్క బాణముతో కొట్టెను. ఇంతలో కుశుడు పైకిలేచి, వీరావేశముతో ముందుకు వచ్చి మహర్షి ప్రదత్తమగు మోహనాస్త్రము వింట సంధించెను. ముమ్మూరు మూర్తులైనా ముల్లోకవాసులు ఆ మహాస్త్రమునకు కట్టుబడవలసినదే. గురువును

స్మరించి కుశుడా దివ్యాస్త్రమును సౌమిత్రిపై ప్రయోగించెను. ఆ బాణాహతికి రామానుజుడు ధరాగతుడై స్పృహ కోల్పోయెను.

దశరథసూనుడు ధరాశాయి అగుటచూచి సైన్యము కకావికలై ధృతిచెడి దిశలకు పరుగులెత్తెను. భటులు కొద్దిమంది అయోధ్యకు పరుగుతీసిరి.

వార్తాహరులవలన శ్రీరాముడు సమరగతి, సౌమిత్రి పరాజయము, బాలుర బలపరాక్రమములు మున్నగు సమాచారమంతయు తెలుసుకొని చింతాక్రాంతుడయ్యెను. "అన్నయ్యా! వైదేహిని వనములపాలు చేసినందుకు మనకీ అశుభము సంఘటించెను." అని పలికి భరతుడు వగచెను.

తదుపరి కౌసల్యాసుతుడు సత్వరమే కార్యోన్ముఖుడై కపివీరులను విభీషణాది రాక్షసయోధులను భరతునికి తోడిచ్చి, మునిపుత్రులను బంధించి సవనాశ్వమును విడిపించికొనిరమ్మని ఆజ్ఞాపించెను. భరతాది సాకేతబలము సమరభూమి సమీపించి, అక్కడ పరాజితులై పడియున్న తమ వీరుల దుర్దశగాంచి క్షోభించిపోయెను.

భరతుడు - సుగ్రీవుడు - విభీషణుడు - జాంబవంతుడు - హనుమంతుడు - అంగదుడు - మొదలగు యోధులు లవకుశ బాలకులకు అనేక ప్రకారముల బోధించి వారిని యుద్ధ విముఖులనుగా జేయుటకు ప్రయత్నించిరి. కుశలవులు వారి శాంతిబోధనలు లక్షించక పూర్వమువలె రణోత్సాహము ప్రకటించిరి. గత్యంతరము లేనందున - నరవానర రాక్షసయోధులు మూక ఉమ్మడిగా మునిబాలురతో తల పడుటకు సిద్ధమైరి. రెప్పపాటులో రణాంగణము రణగొణ ధ్వనితో ప్రతిధ్వనించెను.

రాక్షస వానరవీరులు ఒకప్పుడు ఒక్కొక్కరుగా, మరొకప్పుడు కలసికట్టుగా తమ యుద్ధనైపుణ్యమును ప్రదర్శించి కిశోరులతో ఘర్షించిరి. గదలతో ప్రహరించి, వృక్షములు గుప్పించి, కొండలు దొర్లించి, భూమిపై నిలబడి, ఆకాశమున కెగసి, వివిధరీతుల, విభిన్నగతుల, ప్రాణ పణముగా పోరాడిరి. బాలభానువిభంగి ఆ వీర సోదరులు ప్రకోపించి ఖరతర బాణప్రయోగములతో కపివీరుల ఆటకట్టించిరి. లవకుశుల రణకౌశలము వారి శౌర్యధైర్యములు వర్ణింపనలవికాదు. వారి శరధాటికి ఖండితములైన రథకేతనములతో, గజాశ్వముల

కళేబరములతో రణాంగణము భయాంగణమై భాసించెను. కుశలవులు క్రోధ దుర్నిరీక్ష్యులై ప్రకోపించి, వానరమూకను వేయివిధముల నొప్పించి,సైన్యమును చిందరవందరచేసి, భరతుని శరఘాతముతో ప్రహరించి, భూమిపైబడునట్లు చేసిరి. దాశరథి దండు క్షతహతమై, దిమ్మతిరిగి, దిక్కుతోచక తిరోగమించి పారిపోయెను.

## తండ్రీ తనయుల సమాగమము

అట్లు బాలురకు పరాఙ్ముఖులై పారిపోయివచ్చిన పదాతులు రఘుప్రవరుని సంధించి - "ప్రభూ! సోదరులు సేనాసమేతముగా సమరాంగణమున సొమ్మ సిల్లిరి." అని మూడుముక్కలతో ముక్తసరిగా చెప్పి ముఖములు దించుకొనిరి. అపజయవార్తకు అవధేశుని మనస్సు క్షోభించెను. నిమేషకాల మతడు నిశ్చేత-నుడై నిలబడిపోయెను. మరుక్షణమే తెప్పరిల్లుకొని మఖమంటపము వదలి, సీతాపతి సేనాసమేతముగా సత్వర ప్రయాణముసాగించి సమరక్షోణి సమీపించెను.

యుద్ధరంగము బీభత్సమై హృదయ విదారకముగా కన్పట్టెను. ఖండితములై కుప్పతిప్పలుగా పడియున్న రథాశ్వ ధ్వజకోటిని, హతమైయున్న సేనానికాయమును, క్షతులై మూల్గుచున్న భటవర్గమును, తెలివి కోల్పోయి నెత్తుటబడియున్న లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల దీనస్థితినిగాంచి అవధేశుని హృదయము క్షోభించి వికలశకల మాయెను. దాశరథి అంతట దీనస్వరముతో "ఓ సుగ్రీవా! ఓ విభీషణా! ఓ హనుమా! ఓ జాంబవంతా! ఓ శత్రుఘ్నా!" అని పేరు పేరున ప్రియజనములను పిలిచెను. అమృతతుల్యమగు ప్రభువు కంఠ ధ్వని చెవుల సోకగానే భూమిపై పడియుండిన స్వామి సోదరులు, సఖులు, సైనికులు నిద్రనుండి మేల్కొనినట్లు పైకిలేచి పరుగుపరుగున వచ్చి ప్రభువుకు ప్రణమిల్లిరి. పిమ్మట సీతాపతి సోదర సేనాపరివృతుడై అక్కడ నుండి కుశ లవులు ఉన్నచోటికి వచ్చెను.

తేజస్వంతులూ ధృతిమంతులగు కుమారులను చూడగనే స్వామి స్వాంతము సంతోషాశ్చర్యములలో మునిగితేలెను. పిమ్మట రఘూద్వహుడు ప్రియోక్తుల పుత్రులతో ఇట్లు ప్రసంగించెను.

"కుమారులారా! మీపేరెయ్యది? ఊ రెయ్యది? మీ జననీజనకు లెవ్వరు? మీ పరాక్రమము ప్రశంసనీయమైనది. మీ సంగతి సందర్భములు, కులగోత్రములు తెలియకనే మీతో యుద్ధమెట్లు చేయగలను?"

లవకుశల ముఖమండలము రోసరోషములతో ప్రకాశించెను. కోమల కాఠిన్యస్వరముతో వారిట్లు సమాధానమిచ్చిరి - "రాజా! మా తల్లిపేరు జానకి; తండ్రియెవరో తెలియదు. మహర్షి మమ్ము పెంచి పెద్దచేసెను. మా పేర్లు లవకుశులు. కోసలేశా! ఒక్కమాట అడుగుచుంటిమి.

ఇంతకూ మీ రిక్కడకు వేంచేసినది కయ్యమునకా? లేక కథ లడుగు టకా? ఊరుపేరుల ఊసెందుకు! సమరాంగణములో నిలబడి సంభాషణ లకు దిగుట శూరుల లక్షణముకాదని తెలియదా! కాలయాపన యెందుకు! శక్తి ప్రదర్శించి బలాబలములు తేల్చుకొనుడు" అని పలికి ఆ ధీరస్వాంతులు ధనుర్బాణములు సవరించుకొని సమర సన్నద్ధులైరి.

రామమూర్తి వారి మాటలు విని, ఇంచుక యోచించి, శిరఃకంపనము చేసి, వీరు పధార్థులుకారని నిశ్చయించుకొనెను. పిమ్మట మందస్మితుడై లవ కుశులను వీక్షించి - "బాలకులారా! మీ బలపరాక్రమము లేపాటివో మా వీరులు పరీక్షించెదరు -" అని పలికి రఘువీరుడు తనవారివి సాభిప్రాయ ముగా ఒకమారు చూచి, సత్వరమే అచ్చోటువదలి ప్రక్కకు పోయెను.

అవధేశుని అభిప్రాయము ఆదేశముగా భావించి వనచర నిశాచర సాకేత వీరులు యుద్ధభూమి దద్దరిల్లునట్లు కిలారించి చెట్లు గుట్టలు పెకలించుకొని పెడబొబ్బలిడుచూ కుశలవులపై దూకిరి. వారు ప్రయోగించిన గదలను శూల ములను వృక్షములను పర్వతములను బాలవీరులు పుంఖానుపుంఖములుగా బాణములు గుప్పించి, వారి ఉధృతమును త్రుటిలో తగ్గించి వానర భల్లూక రాక్షసుల ఆక్రమణను అడ్డుకొనిరి. వేలాది మహాయోధులు ఒకవైపు - వరవీర కిశోరద్వయము మరొకవైపు! ఉభయులకు తుములయుద్ధము జరిగెను. తాపస బాలుర తీవ్ర కోపము వైరిసమూహమును తల్లడిల్లజేసెను.

లవు డప్పుడు రోషభీషణుడై రొప్పి, నిశిత సాయక మొకదానిని ప్రయోగించి సుగ్రీవుడు యోజనదూరము ఎగిరిపోవునట్లు కొట్టెను. కుశుడు

కుప్పించి భల్లూకనాథునిపై దూకి అతనితో ముమ్మరముగా మల్లయుద్ధము చేసి, తుద కా వృద్ధవీరుని క్రిందబడవైచి కాలుచేతులు కట్టివైచెను. పిమ్మట కుమారు లిరువురు వాయునందనుని చుట్టుకొని, కొంతతడవు అతనితో పెనగులాడి కడకు మహావీరునికూడా బంధించి వేసిరి. అట్లు బంధించిన వానర భల్లూకవీరులను గుర్రము ఉన్నచోటికి తీసుకొనిపోయిరి. లవుని వారి యొద్దవుంచి కుశుడు రాముని వెదకుచూ రంగమునకు పోయెను. కానీ అక్కడ రథముపై రాఘవుడు మూర్ఛిల్లియుండుట చూచి కుశుడు సిగ్గుతో వెనుదిరిగి వచ్చెను.

అనంతరము సీతాసుతులు - సమరస్థలిపై మూర్ఛితులై పడియున్న వీరుల నుండి ఖడ్గములను కిరీటములను మణిరత్నములను వస్త్రములను రాజముద్రికలను సంగ్రహించుకొని, హనుమజ్జాంబవంతులను వెంటబెట్టుకొని ఆశ్రమమునకుపోయి తల్లిని దర్శించిరి. ఆ బిడ్డలు భక్తితో భూమిజ పాదపద్మములకు ప్రణమిల్లి "అమ్మా! నీకై మేము అమూల్యమైన కానుకలు తెచ్చితిమి -" అని చెప్పి తాము తెచ్చిన మణిరత్నాభరణాదులు మైథిలిముందు పెట్టి, జరిగిన సంగతంతయూ సవిస్తరముగా తల్లికి నివేదించిరి. సీత రాజచిహ్నితములైన రఘువీరుల కరముద్రికా, ఖడ్గకేతనములను పరీక్షించి, హనుమజ్జాంబవంతులను గుర్తించి "అయ్యో! ఎంతపని జరిగెను!" అని ఆర్తస్వరమున కేకపెట్టి శోకవ్యాకులితయై నేలబడెను. పిమ్మట ఆమె భోరున యేడ్చుచూ దీనదృష్టుల బిడ్డలనుగాంచి "బిడ్డలారా! ఎంత అకృత్యమునకు ఒడిగట్టితిరి? ఈ వస్త్రాభరణాదులు పాకేటువులవే! వీరు మనకు పరమాత్మీయ బంధువులైన కపిశ్రేష్ఠులే! హనుమజ్జాంబవంతులారా! నన్ను చూచి నాబిడ్డల దుష్కృత్యములను మన్నింపుడు! నా జీవితేశుడు తనయుల చేతులలో తనువు చాలించెనా? హతవిధీ! ఎంత ఘోరము సంఘటించెను! బాల్యచాపల్య మెంతటి పరిణామమునకు దారితీసెను! కుశలవులారా! మీ విజయము మన కులమునకు కళంకము, నాకు వైధవ్యము, మీకు దిక్కులేనితనము ఘటిల్లజేసెను. పుత్రా! ఇక ఆలస్యమెందుకు? కుంకుమ చందన కర్పూరాది ద్రవ్యములు సేకరింపుము. సత్వరమే చితిపేర్చుటకు ప్రయత్నింపుము. నేను నాథునితో చితిలోపడి సహగమనము చేసెదను."

ఇట్లు దుఃఖాక్రాంతయై దురపిల్లుచున్నప్పుడు వాల్మీకి మహర్షి అచటకు వచ్చెను. ఆ త్రికాలజ్ఞుడు సకలసంగతులు యోగదృష్టితో తెలుసుకొనెను. అనంతరమా మునిపుంగవుడు హనుమంతునికి జాంబవంతునికి నమస్కరించి సత్కరించి సుఖాసీనులజేసి, పిమ్మట సీతాదేవిని సంబోధించి - ''అమ్మా! అవధేశుడు అవతారమూర్తి,అతనిలీలలు వాచానగోచరములు. ఆ శుభంకరునికై నీవు చింతించవలదు'' అని భూపుత్రిని ఊరడించెను. తదనంతరము తాపస వరుడు కుశలవులను వెంటనిడుకొని రాఘవుడు పడియున్న రణస్థలికి పోయెను.

కుశలవుల అపూర్వ బలశౌర్యములను ప్రకటించుచున్న రణభూమిని చూచినప్పుడు వాల్మీకి హర్షాశ్చర్యములకు లోనయ్యెను. ఆపైన వాల్మీకి రఘు-పతి పడియున్న రథము దగ్గరకువచ్చి - ''ఓ కోసలేశా! కుమారులు వచ్చి యున్నారు; వారు నిన్ను దర్శించుకొని పాదాభివందనము చేయుటకై ఆత్ర-ముతో నున్నారు. రామా! లేచి చూడుము!'' అని గొంతెత్తి పిలిచెను. లీలా మానుషుడగు సీతానాథుడు తాపసి పిలువగానే నిద్రపోయినవానివలె దిగ్గున పైకి లేచి ముకుళితహస్తుడై మందహాసముతో రథముదిగి క్రిందికి వచ్చెను. వాల్మీకి శ్రీరాముడు ఒకరినొకరు గాఢాలింగనము చేసికొనిరి. ఆ యపూర్వ సమ్మేళన సందర్భమున రఘురాజ మునిరాజుల నయనములు అశ్రుపూరితము లయ్యెను.

అప్పుడు మహర్షి రఘుపతికి - సౌమిత్రి సీతను వనములో వదిలిపెట్టి పోయినది, లవకుశుల జననము మొదలగు వృత్తాంతము లెల్ల శ్రుతపరచి, - ''రామా! ఆ దినకరుని సాక్షిగా ఈ చిరంజీవులు నీ తనయులు. వీరిని ఆశీ ర్వదించి అనుగ్రహింపుము'' అని అభ్యర్థించెను. దాశరథి హర్షపులకితగాత్రుడై వీరపుత్రులను చేరదీసి, గాఢాలింగనము చేసుకొని, వారి మూర్ధము మూర్కొని, వాత్సల్యానందమున మునిగితేలెను. ఆ శుభసమయమున దేవతలు దివినుండి అమృతమును వర్షింపజేసిరి. ఆ సుధావృష్టికి ఆహవభూమిపై హతులై, మూర్ఛితులై పడియున్న భరత, లక్ష్మణ, శత్రుఘ్నులాది సకలవీరులు సజీవులై పైకిలేచిరి.

# భూదేవి సీతను తీసుకొనిపోవుట

అవధేశుడప్పుడు లక్ష్మణుని పిలిచి "తమ్ముడా! సీత మరొకమారు ప్రమాణకముగ శపథము చేయవలసి యుండును. అందు కామె అంగీకరించునేమో తెలుసుకొని తోడ్కొనిరమ్ము" అని చెప్పి పంపెను.

సౌమిత్రి ఆశ్రమములోనున్న అవనిజయొద్దకు పోయి ఆ తల్లిపాదములకు ప్రణమిల్లి, కుశల మడిగి, అన్నగారి ఆదేశము తెలియజేసి, ఆమెను తోడ్కొని రాఘవాదులున్న చోటుకు వచ్చెను. జనకజ అప్పుడు సర్వుల సమక్షములో చేతులుజోడించి దృఢస్వరముతో - "ఓ జనులారా! మునులారా! దేవతలారా! త్రికరణశుద్ధిగా చెప్పుచున్నాను; శ్రీరాముడే నా భర్త. ఇక్ష్వాకునితప్ప ఇతర పురుషులను కలలోకూడా భావించి యెరుగను." అని శపథము గావించెను.

ఆ వెంటనే భూపుత్రి ఆత్మక్షోభతో అవనతవదనయై గద్గదకంఠముతో "అమ్మా భూదేవీ! ఇక నీవు నన్ను నీలోనికి తీసుకొనిపొమ్ము -" అని ప్రార్థించెను. త్రుటిలో అక్కడ ఫెళ ఫెళమను ధ్వనితో భూమి చీలెను. అందులోనుండి ఒక సింహాసనము పైకి లేచెను. ఆ స్వర్ణ సింహాసనము మణి రత్నమయమై పాముపడగలపై అమరియుండెను. భూపుత్రి బద్ధ శ్రద్ధాంజలియై ఆ స్వర్ణాసనముపై కూర్చుండెను. అందరూ చూచుచుండ ఆ సింహాసనము సీతాదేవితో పాతాళమునకు పోయెను.

మైథిలి మహనీయచరిత్ర నాటితో ముగిసి, ముల్లోకముల వ్యాపించెను. అశేష జనసమూహము ఆ దృశ్యము గాంచి అశ్రువులు రాల్చెను. సీతాపతి శ్రీరాముడు వికల మనస్కుడై - "సీత పరమసాధ్వి, ఆమె నా స్వాంత మెరిగి తదనుసారముగ నడుచుకొనెను" అని చింతించి సాస్రులోచనుడయ్యెను.

# యజ్ఞసమాప్తి

జానకీవియోగ వ్యాకులితుడైన దశరథాత్మజుని, వాల్మీకి విభీషణాదులు ఊరడింపజేసిరి. అనంతరము సాకేతపతి సుతులను తోడ్కొని సకల సోదర సేనాసమేతముగా సాకేతపురికి వచ్చి సకలలోకానుల సమక్షమున శాస్త్రసమ్మ-

తముగా అశ్వమేధయజ్ఞము లోకకల్యాణకరముగా పూర్తిచేసెను. తదనంతరము వసిష్ఠ విశ్వామిత్ర శతానందాది మునీశ్వరులను పూజించి, జనక విభీషణ సుగ్రీ-వాది రాజన్యులను సత్కరించి, గోభూ హిరణ్యాది దానాదులతో బ్రాహ్మణ సమాజమును సమాదరించి, యాచకకోటిని వస్త్రాన్నములతో సంతోషపరచి సత్కీర్తి నొందెను. యజ్ఞమునకు వచ్చిన అతిథిలోకమును సాకేతపతి ఆదర పూర్వకముగ వీడ్కొలిపెను.

అనంతరము రఘూద్వహుడు నిత్యమూ పురాణేతిహాసములు వినుచూ, పుణ్యాత్ములను దర్శించుకొనుచూ, సజ్జనులతో ధర్మాధర్మచర్చ చేయుచూ, ప్రజానురంజకముగా మరికొన్ని యేండ్లు రాజ్యపాలన చేసెను.

## చతురాస్యుని సందేశము

ఒక దినము బ్రహ్మదేవుడు నారదుని యమలోకమునకు పంపెను. సుర ముని శమనుని యొద్దకు పోయి - "ధర్మరాజా! శ్రీపతి భూలోకమునకు పోయి బహుకాలమయ్యెను. వారు తిరిగి వైకుంఠము చేరుకొనుటకు సమయ మాసన్నమాయెను. నీవు స్వయముగా వెళ్లి శ్రీరామునికీ సంగతి తెలియజేసి రావలసినదిగా నలువ నీతో చెప్పుమని నన్ను పంపెను" అని చెప్పెను.

యముడు బ్రహ్మ సందేశమును తీసుకుని తత్‌క్షణమే అయోధ్యకు (మునివేషముతో) పయనమయ్యెను. లక్ష్మణుడు ఆ మునీశ్వరుని ఆదర ముతో ఆహ్వానించి అవధేశుని యొద్దకు తీసుకునిపోయెను. దశరథనందనుడు తాపసుని తగురీతి సమాదరించి, "మునీశ్వరా! తమరాకకు కారణమే"మని ప్రశ్నించెను. ఆ మునివేషధారి అందుకు "రామచంద్రా! నేను మీతో ఏకాంత మున మాట్లాడదలచి వచ్చితిని. మన సంభాషణ మూడవవాని చెవిన పడ కూడదు. అట్లు వినినవాడు బ్రహ్మ మహేశుడైనను నేను వానిని మరణించు నట్లు శపింతును." అని వాక్రుచ్చెను. అందుపైన రఘూద్వహుడు సోదరుని పిలిచి "లక్ష్మణా! నీవే స్వయముగా ద్వారమువద్ద నిలబడి, వాదర్శనార్థమై ఎవ-రినీ లోనికి రానీయకుము. నా యనుమతి లేక వచ్చినయెడల నీవే విన్ను సంహరించవలసి వచ్చును" అని ఆదేశించి పంపెను.

లక్ష్మణుడు విస్మయించగనే కపటముని కాకుత్స్థునితో "- ఓ సర్వజ్ఞా! నేను పరమేష్ఠిపంపగా ప్రచ్ఛన్న రూపులో వచ్చిన కాలుడను. స్వామీ! మీరు భూలోకమునకు వేంచేసిన కార్యము ముగిసెను. ఇక అవతారము చాలించి శీఘ్రమే స్వధామము చేరుకొనవలెనని పద్మజుడు మీకు నివేదించుమని కోరగా వచ్చితిని" అని వచించెను. పిమ్మట వారేదో సంభాషించుచుండిరి.

విధి వైపరీత్యము! ఇంతలో దుర్వాసమహర్షి రామదర్శనార్థమై ద్వారము కడకు వచ్చెను. సౌమిత్రి నతశిరస్కుడై - పరమాదర భావముతో మునిని ముహూర్తకాలము ఆగవలసినదని అర్థించెను. దుర్వాసుడు అవరోధమును సహించనేరక "లక్ష్మణా! నీవు నన్నెరగవా! నేనీ క్షణమందే లోనికిపోయి రాముని చూడవలయును. నన్ను అడ్డుపెట్టిన యెడల నిన్ను, నీ వంశమును, నీ రాజ్యమును, నీ నగరమును నిముసములో భస్మమగునట్లు శపింతును" అని క్రుద్ధుడై పలికెను.

లక్ష్మణుడా మాటలకు భయ వ్యాకులుడై - అయ్యో! వంశక్షయము కంటే, నే నొక్కడే నశించుట మేలుగదా! యని భావించి - సాహసించి లోనికి దూరెను. పిమ్మట అతడు దుర్వాసుని ఆగమనవార్త అన్నకు తెలియజేసి, అతని అనుమతిపై మునిని లోనికి గొనివచ్చెను.

## లక్ష్మణుడు వైకుంఠము చేరుకొనుట

అయోధ్యాధీశుడు అత్యాదరముతో దుర్వాసుని ఆహ్వానించి -"ఋషి సత్తమా! నేను చేయదగు సేవ ఏదియో సెలవీయ వేడుచుంటిని -" అని నమ్రుడై ప్రసంగించెను. "రామచంద్రా! అనేక దినములనుండీ అన్నపానములు లేవు. నేటితో నా ఉపవాసవ్రతము ముగియనున్నది. నిన్ను దర్శించి ఆహారము స్వీకరించుటకై వచ్చితిని. నాకు భోజనము పెట్టించుము." అని దుర్వాసుడు సమాధానమిచ్చెను. ప్రభువు పంచభక్ష్య పరమాన్నాదులతో యతీశ్వరుని క్షుద్బాధ తొలగింపజేసి, సాదరముగ వీడ్కొలిపెను.

దుర్వాసుడట్లు నిష్క్రమించగనే - రఘుకులమణి రామచంద్రుడు ఇతః పూర్వము తాను చేసిన శపథము, సౌమిత్రి వలన జరిగిన పొరబాటు మనమునకు

తెమ్చుకొని, చింతాకులితుడై దుఃఖించసాగెను. దుఃఖమెట్టిదో ఎరుగని దాశరథి దుఃఖించుచున్నాడని తెలిసి, భరత శత్రుఘ్నులు భయాతురులై పరుగెత్తుకొని వచ్చిరి. రాముడు విషణ్ణవదనముతో భరతుని చూచి "సోదరా! సత్వరమే గురువునుతోడ్కొనిరమ్ము-" అని పలికి నిట్టూర్చెను.

భరతుడు హుటాహుటి గురుగ్రామమునకు పోయివసిష్ఠుని రథముపై తీసు-కొని రాఘవుని చెంతకువచ్చెను. కౌసల్యా నందనుడంత కులగురువుకు జరిగిన విషయము - పరేతనాథుని ఆగమనము - తన ప్రతిన - లక్ష్మణుని ప్రవర్తన - సంగతంతయూ సాకల్యముగా వివరించి, విచారమగ్నుడై వ్యథ చెందెను.

వసిష్ఠుడు సూక్ష్మజ్ఞుడు. కార్యాకార్యములు చక్కగ తెలిసిన కాలజ్ఞుడు. కాబట్టి - ఇక సౌమిత్రి అవతారము చాలించుట తథ్యమని - భావించెను. పిమ్మట అతడు రామునితో "రామా! విసర్జించుట వధించుటతో సమాన మని పెద్దలు చెప్పుదురు. కనుక నీ విప్పుడు లక్ష్మణుని త్యజించినయెడల నీ శపథము నెరవేరినట్లగును. మరొక మార్గములేదు." అని తన సమ్మతి తెలియ జేసెను.

రాను భరతాదులు శోకోద్విగ్న మానసులైరి. సౌమిత్రి కన్నులు చెమ్మ గిల్లెను. "స్వామీ సంపర్కము వదలుకొని సుఖించడమా! అగ్రజుని వీడుట కంటె అసువులు వదలుటే శ్రేయస్కరము." అని లక్ష్మణుడు నిశ్చయించుకొ-నెను. పిమ్మట సౌమిత్రి అంజలిఘటించి ప్రదక్షిణపూర్వకముగా ప్రభువునకు ప్రణమిల్లి గురు, భరతాదులకు నతశిరస్కుడై నమస్కరించి, అచ్చోటువీడి సూటిగా సరయూనది వైపు వెళ్ళెను.

"కటి ప్రమాణ జల మధ్యమేఁ క్షీణేవు ధ్యాన అఖండ,

యోగయుక్తు కరి రామకహి ఫోడ్యో నిజ బ్రహ్మాండ."

సౌమిత్రి సరయూనదిలో నడుములోతు నీటిలో నిలబడి, ఆచమించి, అఖండ ధ్యానముతో యోగస్థితిని పొంది, - రా- మ - యని ఉచ్చరించి, కపాలమును భేదించుకుని, వైకుంఠ గమనము చేసెను. స్వామికి చతుర్థాంశమైన ఆదిశేషుడు లక్ష్మణావతారము చాలించి వైకుంఠము చేరుకొనెను.

# రామాదుల వైకుంఠగమనము

సహజన్ముడు, సహచరుడు, సత్పురుషుడు అగు సౌమిత్రి నిర్గమనముతో సోదరులు శోకసంతప్తులైరి. రాముడు దుస్సహ దుఃఖపీడితుడై నిట్టూర్చి "భరతా! సౌమిత్రి నన్ను వదలెను. నిర్దయుడై నన్ను వదలి దివికేగెను. ఆ ప్రియబాంధవుని బాసి నేను ఒకక్షణ ముండజాలను.నేను నా సౌమిత్రిని మూడ బోవుచున్నాను. సోదరా! ఇక ఈ రాజ్యభారము నీపై మోపుచుంటిని" అని విలపించెను.

భరతు డీమాటకు శోకాహతుడై మూర్ఛిల్లి తెప్పరిల్లుకొని పైకిలేచి, కేలు మోడ్చి, కంపితకంఠముతో - "అన్నయ్యా! నిన్ను విడిచి మేముమాత్రము జీవించగలమా? మీ మార్గమే మాకు శరణ్యము." అని కన్నుల నీరుబెట్టు కొనెను. శత్రుఘ్నుడు అప్పటికి దేహమే మరచి నోట మాటరానిస్థితిలో నుండెను. దాశరథి తమ్ముల దీనస్థితి గమనించి - "సోదరా! అట్లయిన కుమారులను శీఘ్రమే పిలువనంపుము." అని నిశ్వసించెను.

తదుపరి శ్రీరాముడు భరతుని పుత్రులగు మైనాముని (తక్షుని) తక్షశిలకు, పుష్కలుని పుష్కరనగరమునకు అధిపతులనుగా జేసెను. లక్ష్మణుని కుమారు లగు చిత్రకేతు చిత్రాంగదులను దక్షిణరాజ్యమునకు పట్టముగట్టెను. దక్షిణకో-సల (అయోధ్య)కు కుశుని, ఉత్తర కోసల (లవపురము)కు లవుని.. రాజుగా నియమించెను. శత్రుఘ్న తనయులగు సుబాహునికి మధురాపురిని, యూపకేతునికి విదిశ(విశ్వపురి)ను సమర్పించెను.

ఇట్లు కోసల రాజ్యమును, కోశమును, చతురంగ బలములను- పుత్రు లకు సమానముగా విభజించియిచ్చి, నీతిమంతులై ధర్మమార్గముదప్పక ప్రేమతో ప్రజాపాలన చేయుచుండుడని వారికి బోధించి దీవించెను. ఆ పైన రామప్రభువు బ్రాహ్మణ సమాజమును, యాచకబృందమును రప్పించి వారికి గో- భూ - మణి - రత్న - సువర్ణ -వస్త్రాదు లిచ్చి తుదిసారిగా సత్కరించెను. అంతట వారు అంజలిఘటించి "ఓ అవధేశ్వరా! ఆజన్మాంతము మాకు మీ సేవాభాగ్యము ప్రసాదించితిరి.' ఈ దినము మమ్ము అనాథలనుచేసి వదలిపెట్టుట ధర్మమా? ప్రభూ మాకీ భోగద్రవ్యములతో నిమిత్తమేమి?

మేముకూడ మిమ్మనుసరించి వచ్చుటకు అనుమతించ వలసినది'' అని వేడు కొనిరి. స్వామి వారి అభీష్టమునకు సమ్మతించెను.

రామ భూపాలుడు మహాప్రస్థానము వేయుచున్నాడని తెలిసి, విభీషణ సుగ్రీవాది కపులు, రాక్షసులు దర్శనార్థమై స్వామిచెంతకు వచ్చిరి. సాకేతనాథుడు హితులను యథోచితరీతి సత్కరించి, - విభీషణుని కల్పాంతమువరకు రాజ్యము చేసి అనంతరము తన సన్నిధానము చేరుకొనుమని - ఆశీర్వదించెను. 'జాంబవంతా! ద్వాపరయుగమువరకు నీవు సుఖించుము. అప్పుడు వచ్చి నేను పునః నిన్ను కలసికొందును' అని దీవించెను. సుగ్రీవుడు అంగదునికి రాజ్యమిచ్చి, తాను స్వామిని అనుగమించుటకు అనుజ్ఞాతుడయ్యెను. జానకీ వల్లభుడు వాయుసూనుని చేరదీసి, గాఢాలింగనము చేసుకొని ''-హనుమా! ఆచంద్రాతారార్కము నీవు చిరంజీవివై వర్ధిల్లుము. నన్ను భజించు భక్తుల బాధలు నివారించుచుండుము. నేను సర్వదా నీ హృదయమందే వసించు చుందును'' అని పలించి తన అభయహస్తము ఆతని మస్తకముపై నుంచి ఆశీర్వదించెను.

ఇవ్విధముగా సకల జనులనుండీ సెలవు తీసుకుని సోదర సచివ సామంత సేవక సాకేతజన పరివృతుడై, సబాంధవముగా స్వామి సరయూతీరము వైపుగా నడచెను.

కుడివైపున భరతుడు, ఎడమభాగమున శత్రుఘ్నుడు, పరిజన పురజన బంధువర్గము వెనుకవైపు స్వామిని అనుసరించి నడచిరి. దిక్పతులు, దేవతలు, వేదములు, చంధస్సులు, మంత్రములు తమ తమ స్వస్వరూపములతో స్వామి వెంట నడచెను. తాపసులు శ్రీవారికి ముందు నడచిరి.

ఆ సమయమున యముడు బ్రహ్మయొద్దకు వచ్చి సాకేతనాథుడు మహాప్రస్థానమునకై సరయూతీరమునకు వచ్చెనని చెప్పెను. అంతట బ్రహ్మ, మహేశుడు, ఇంద్రుడు నారదసనకాది మునీంద్రులు మున్నగు స్వర్లోకవాసులు విమానారూఢులై ఆకాశమున నిలబడిరి. పుష్పవర్షము కురిసెను. వేదమంత్రములు పఠింపబడెను. ప్రథమమున సాకేతవాసులు సరయూజలము స్పృశించి, విష్ణు సారూప్యముతో విమానములధిష్ఠించి వైకుంఠమునకు పోయిరి. పిమ్మట

గుణభరతుడగు భరతుడు వేదమంత్రోచ్చారణ చేయుచూ స్వామిలో లీనమయ్యెను. శత్రుఘ్నుడు సరయువులోదిగి పద్మరూపములో భాసించి ప్రభువులో చేరుకొనెను. సుగ్రీవుడు సూర్యునిలో లీనమాయెను. వానరులు తమతమ దేహాంశములతో దివి కేగిరి.

అంతట జగత్స్వామి శ్రీరామచంద్రమూర్తి సత్యలోక భూలోకవాసులు చూచుచుండ సరయూ జలములో ప్రవేశించి, చేయెత్తి పైకిచూచి, "ఓ బ్రహ్మాది స్వర్లోకవాసులారా! నేటి నుండి ఒక మాసమువరకు ఈ నదీతీరమున నివసించి, ఈ సరయువులో స్నానము చేసినవారిని, ఈ పుణ్యభూమిలో నివసించినవారినీ, ఇక్కడ ప్రాణములను వదలిపెట్టిన వారినీ విమానములో నా లోకమునకు పంపుచుండుడు -" అని ప్రవచించెను. పిమ్మట ప్రభువు మేఘములోని మెరుపువలె రెప్పపాటులో అంతర్ధానమయ్యెను. "రామ! జయరామ! జయ జగదీశా!! అను జయ జయధ్వానములు భూవ్యాకాశములు [illegible]తి ధ్వనించెను.

ఇవ్విధముగా కాకభుశుండి గరుత్మంతునికి చెప్పిన రామచరిత్ర, పర[illegible] శివుడు పార్వతికి ప్రవచించినట్లు, యాజ్ఞవల్క్యమహర్షి భరద్వాజుని[illegible] వినిపించెను.

*"సకల సుమంగళదాయక*
*రఘునాయక గుణగాన,*
*సాదర సునహీంతే తరహీం*
*భవసింధు వినా జలయాన."*

[illegible]శకాండ సమాప్తము.)

శ్రీ గోసాయి [illegible]తులసి[illegible]త రామచరి[illegible] మానస్ సంపూర్ణము.

T.T.D. Religious Publications Series

Price Rs. 40.00

**Published by Sri Ajaya Kallam, I.A.S., Executive Officer, T.T.Devasthanams and Printed at Padma Enterprises, Chennai, On behalf of T.T.D**